ఆర్షవిద్యా తరంగిణి

# వేదాంత జీవన విధానం - 01

Inspired by the teachings of

**SWAMI PARAMARTHANANDAJI**

# VEDANTA JEEVANA VIDHANAM - 01



సమగ్ర హిందుత్వ దర్శనం

**తెలుగు సేత - మద్దూరి / కస్తూరి రాజ్యశ్రీ**

First Edition - Guru Purnima, 2019 July - 1000 copies
Second Edition - 2022 February - 1000 copies

For Copies
K V Raghava Rao
C - 804 Aparna Cyberzon
Nallagandla, Hyderabad 500019
Mobile: 9849092368
Email: raghavkasturi@gmail.com
for softcopy www.telugubhakti.com

Title - VEDANTA JEEVANA VIDHANAM -01

Sanskrit Support – Sri Desu Chaitanya Krishna
DTP - Smt. Syamala Devi Sripathi

Price Rs. 300

# బ్రహ్మయజ్ఞం

ఆర్షవిద్యను అకుంఠిత దీక్షతో వందలాది శిష్యులకు బోధించి **మాతా ఆకునూరి రమామణిగారు,** తమ జీవితాన్ని చరితార్థం చేసుకున్నారు. వీరు జీవన్ముక్తులు. అమ్మగారి పేరు చెపితేనే ఆమె శిష్యులు ఎంతగానో భక్తిశ్రద్ధలు చూపుతారు. వీరి కృషి అనన్య సామాన్యం.

ఏక్సెప్ట్ అండ్ అకామడేట్ సూత్రాన్ని శిష్యులలో అణువణువునా రంగరించి పోశారు. **శ్రీమతి రమామణి అమ్మగారు** అందించిన అద్వైత జ్ఞాననిష్ఠలో సదా రమిస్తూంటారు ఆమె శిష్యులు. ఈ ఆత్మవిద్య అధ్యయనం నిరంతరం గంగా ప్రవాహంలా కొనసాగాలని మరీ మరీ కోరారు.

**శ్రీమతి రమామణి అమ్మగారు** భగవద్గీతను అనేక సార్లు బోధించి, అందులోని శ్లోకాలు అర్థాలతో సహా, అందరికీ కంఠతా వచ్చేలా తీర్చి దిద్దారు. అంతేకాక శిష్యుల సహాయంతో భగవద్గీతను రెండు భాగాలుగా ప్రచురించారు. ప్రతి ఏకాదశిన గీతా పారాయణం చేయాలని చెప్పి, పారాయణ క్రమం నేర్పి శిష్యులను స్వాధ్యాయం చేసే దిశలో మలిచారు.

**శ్రీమతి రమామణి అమ్మగారి** కుటుంబీకులు, బంధువులు **వేదాంత జీవనవిధానము-01**అనే పుస్తకప్రచురణ అనే ఈ బ్రహ్మయజ్ఞానికి సహాయాన్ని అందించి తోడ్పడ్డారు.

**01**. **శ్రీమతి కోకా నళిని గారు**
**02. శ్రీ నాయని రవి కిషోర్ గారు**
**03. శ్రీమతి తాయి ఇందిర గారు**
**04. శ్రీమతి నాయని కుసుమ గారు**
**05. శ్రీమతి మాదిరెడ్డి నిర్మల గారు**
**06. శ్రీమతి మొగిలిశెట్టి రేణుక గారు**
**07. శ్రీమతి నాయని రంగమణి గారు**
**08. శ్రీమతి నాయని తాయారు గారు**
**09. శ్రీ నాయని రాఘవరావు గారు**
**10. శ్రీమతి పిల్లారిశెట్టి రత్నమాల గారు**
**11. శ్రీమతి ఆకునూరి రూప గారు**
**12. శ్రీమతి పోకల మంజుల గారు**
**13. శ్రీమతి తాయి స్వర్ణలత గారు**
**14. శ్రీమతి మాదిరెడ్డి సక్కుబాయి గారు**
**15. శ్రీ నాయని ప్రదీప్ కుమార్ గారు**

వీరంతా సదా బ్రహ్మనిష్ఠలో నిలవాలని, వీరి పిల్లలకూ, మనవళ్ళకూ, మనవరాళ్ళకూ ఆయురారోగ్య ఐశ్వర్యాలను, ఆధ్యాత్మిక చింతనను, వైదికజీవనాన్ని మరింత సమృద్ధిగా ఇవ్వమని ఆ భగవంతుణ్ణి వేడుకుంటున్నాము.

**- రాఘవరావు, రాజ్యశ్రీ**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | దేవుడనే వాడున్నాడా? | 1 |
| 2. | భగవద్దృష్టి | 8 |
| 3. | ప్రార్థన ఎలా చేయాలి? | 13 |
| 4. | ప్రార్థన మన విధిని మార్చగలదా? | 18 |
| 5. | ప్రార్థనకున్న విశిష్ట శక్తి | 21 |
| 6. | శరణాగతి అంటే ఏమిటి? | 33 |
| 7. | శివరాత్రి మాహాత్మ్యమ్ | 40 |
| 8. | శివమహిమ | 45 |
| 9. | శివపంచాక్షరి, మృత్యుంజయ మంత్రాలు | 51 |
| 10. | రుద్రసారం లఘువుగా | 56 |
| 11. | గాయత్రీ మంత్రం | 65 |
| 12. | యమనియమాలు | 70 |
| 13. | ఆధ్యాత్మికతకు మతం అవసరమా? | 78 |
| 14. | మతపరమైన జీవనలక్ష్యం | 85 |
| 15. | సంసారస్వరూపం | 91 |
| 16. | సన్న్యాసమంటే ఏమిటి? | 98 |
| 17. | వేదాలసారం | 105 |
| 18. | వేదప్రామాణ్యత | 113 |
| 19. | శాస్త్రం వైజ్ఞానికపరమైనదా? | 118 |
| 20. | సత్సంగం | 124 |
| 21. | గురువుయొక్క విశిష్టత | 130 |
| 22. | ఆత్మజ్ఞానం ఎందుకు పొందాలి? | 135 |
| 23. | ఆత్మజ్ఞానం బుద్ధిలో కలుగుతుందా? | 142 |
| 24. | అద్వైతం, ద్వైతం, విశిష్టాద్వైతం | 148 |
| 25. | సచ్చిదానంద ఆత్మ | 155 |
| 26. | సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ | 161 |
| 27. | మహావాక్యవిచారణ | 168 |

| | | |
|---|---|---|
| 28. | జీవ–ఈశ్వర ఐక్యవిచారణ –1 | 176 |
| 29. | జీవ–ఈశ్వర ఐక్యవిచారణ –2 | 180 |
| 30. | జ్ఞానం– అనుభవం | 185 |
| 31. | జ్ఞానం– ప్రవర్తన | 196 |
| 32. | ఆత్మజ్ఞానం– భావోద్రేకాలు | 202 |
| 33. | జ్ఞానికి ప్రారబ్ధకర్మ ఉంటుందా? | 207 |
| 34. | భగవంతునికీ జ్ఞానికీ ఉన్న అనుసంధానం | 212 |
| 35. | కోరిక అసలు చెడ్డదా? | 220 |
| 36. | ఆందోళనే అన్నింటికీ అంతరాయం | 226 |
| 37. | భయాన్ని ఎదుర్కోవటమెలా? | 231 |
| 38. | దుఃఖాన్ని అధిగమించటమెలా? | 236 |
| 39. | ఆనందాన్ని ఏది ఇస్తుంది? | 243 |
| 40. | దోషపరిహారాష్టకం | 248 |
| 41. | అర్థవంతమైన జీవనానికి మూడు బంగరుసూత్రాలు | 254 |
| 42. | తితీక్షకు ఆరు బంగరుసూత్రాలు | 259 |
| 43. | ఆరోగ్యకరమైన అలవాట్లకు ఏడు బంగరుసూత్రాలు | 270 |
| 44. | ప్రతిరంగంలో రాణించటమెలా? | 281 |
| 45. | విజయరహస్యం | 287 |
| 46. | గీతామాహాత్మ్యమ్ | 297 |



# ముందుమాట

**పూజ్యశ్రీ పరిపూర్ణానందస్వాములవారు**
శ్రీవ్యాసాశ్రమ వ్యాసపీఠాధిపతులు,
శ్రీ వ్యాసాశ్రమం, ఏర్పేడు, చిత్తూరు జిల్లా.

ధర్మార్థకామమోక్షములని నాలుగు పురుషార్థములు గలవు. పురుషునిచే కోరబడుట వలన వీటికి పురుషార్థములని పేరు. ఈ నాలుగు పురుషార్థములలో మోక్షమే పరమపురుషార్థము. మోక్షమును పొందినవాడు మరల తిరిగిరాడని **"న స పునరావర్తతే"** అనే శ్రుతి చెప్పుటచే మోక్షము నిత్యము. మిగిలిన ధర్మార్థకామములు మూడును అనిత్యములు. **"తద్యథేహ కర్మచితో లోకః క్షీయతే," "ఏవమేవాముత్ర పుణ్యచితోలోకః క్షీయతే,"** అని శ్రుతి. ఈ లోకములో ధర్మాధర్మరూపకర్మములచే ఏర్పడిన లోకము ఎట్లు నశించునో అదే విధముగా స్వర్గాదిలోకము నశించును అనుటచేత అవి అనిత్యములు. కావున పరమ పురుషార్థమైన మోక్షముకొరకు యెల్లరు ప్రయత్నించవలెను. ఈ పరమపురుషార్థము **"వేదాంత జీవన విధానం"** వల్లనే సాధ్యమవుతుంది.

వేదాంతమనగా? ఉపనిషత్ ప్రమాణము. ఉపనిషత్తులలో చెప్పబడిన నైతిక విలువలను ఆధారంగా చేసుకొని మన జీవనగమ్యం కొనసాగించాలి. మన జీవన విధానం వేదాంతానికి దగ్గర సంబంధం అయి ఉండాలి. అలా కాని పక్షంలో ఎన్నో అశాంతులు, మనోవ్యథలు పొందక తప్పదు. మన జీవితం నిత్యకళ్యాణ పచ్చతోరణాలచే కళకళలాడాలంటే వేదమాత ప్రసాదించిన అమూల్య సందేశాలను తప్పక అనుసరించాలి. మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిథిదేవో భవ ఇత్యాది ప్రాథమిక నైతిక విలువలను పాటించినప్పుడు మన జీవనం సుఖమయం, శాంతిమయం అవుతుంది.

జననమరణ ప్రవాహరూప సంసారకార్యాలచే మోహితుడైన మానవుడు తన జీవనవిధానాన్ని ఎలా కొనసాగించాలో తెలియక సతమతమవుతూ **"జీవితం"** అనే మూడక్షరాల వాస్తవతత్వాన్ని తెలుసుకోలేక కేవలం **"జీతం"** కొరకు కాలాన్ని గడుపుతున్నాడు. జీవితంకొరకు కాక, జీతంకొరకు కష్టపడడంవల్ల అతడు అనేక కష్టాలను పొందుతున్నాడు. వీటి నివారణ **"వేదాంత జీవన విధానం"**వల్లనే సాధ్యమవుతుంది.

మన దైనందిన జీవితం దైవప్రార్థనతో మొదలవ్వాలి. **గాడ్ ఫస్ట్ వరల్డ్ నెక్స్ట్.** మొదటగా దైవాన్ని స్మరించి తక్కిన కార్యాలు చేయడంవల్ల ఎటువంటి అశాంతులను పొందము. మనం సదాచారపరులమై అన్యులకు వాటిని ఉపదేశించడంవలన వారు మారడానికి అవకాశం ఉంది. అందువల్ల ప్రతి ఒక్కరు స్వీయ ఆచరణకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. **స్వీయ ఆచరణ సగం ఉపన్యాసంతో సమానం.** అందుకే మహర్షి సద్గురు శ్రీ మలయాళ స్వాముల వారు **అనుష్ఠించక చెప్పే వాక్కులు ఎదుటివారిని ప్రభావితం చేయవన్నారు.**

మనిషిని పునీతం చేసేవి మూడు– **యజ్ఞము, దానము, తపస్సు.** కనుక తాను సంపాదించే దానిలో పదిశాతం దానం చేయాలని శాస్త్రవచనం. చేతులారా పదిమందికి పెట్టి సంతృప్తి పడేవాడే నిజమైన ధన్యజీవి. అలాగే యజ్ఞ, తపస్సులను కూడా తప్పక అనుష్ఠించాలి.

అరిషడ్వర్గాలలో ప్రధానమైనవి కామము, క్రోధము. **"ఇష్టం ధర్మేణ యోజయేత్"** అని శాస్త్రవచనం. మన ఇష్టం ధర్మంతో ఏకీభవించాలి. ఇలా ఉన్న కామమే మంచి పరిణామాలనే ఇస్తుంది. అలా కాని పక్షంలో వినాశనానికి దారి తీస్తుంది. ఇక రెండవది క్రోధము. క్రోధావేశుడైన మానవుడు విచక్షణను కోల్పోతాడు. అందుకే **"కోపము–పాపము"** అంటారు. ఈ క్రోధాన్ని జయించడానికి శ్రీ మలయాళ యతీంద్రులు మూడు నియమాలను సూచించారు.

1. కోపముపై కోపము చేయుట.

2. కోపము వచ్చినప్పుడు నిగ్రహింపశక్తి లేనిచో పది నిముషములు మౌనము దాల్చి ఏదేని ఒక దివ్యమంత్రమును పఠించుట.

3. కోపము వచ్చినప్పుడు మనోనిగ్రహమును కలుగచేసుకొనుటకు శక్తి లేకపోయినచో ఆ స్థలమును వదలిపోవుట.

**"వేదాంత జీవన విధానం"** అనే శీర్షికతో వెలువడిన ఈ పుస్తకం సాధకులకు ఉపకరిస్తుంది. స్వామి పరమార్థానంద దగ్గర మద్దూరి/కస్తూరి రాజ్యశ్రీ గారు వేదాంత విద్యనభ్యసించి అందరికీ ఆ విద్యను పంచాలనే ఆశయం గల వీరు చరితార్థులు.

# శాస్త్రమే ఆయన ఊపిరి

**మద్దూరి రాజ్యశ్రీ**

**గురోరంఘ్రి పద్మే మనశ్చేన్న లగ్నం**
**తతః కిం తతః కిం తతః కిం తతః కిమ్‌।**

చెన్నై నగరవాసులది ఎంతటి మహద్భాగ్యమో! అక్కడ **పరమార్థానంద స్వామీజీ** ప్రసంగంతో సూర్యుడు ఉదయిస్తాడు, ఆయన ప్రసంగం వింటూ సూర్యుడు అస్తమిస్తాడు! నగరం నలుమూలలా భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, ప్రకరణగ్రంథాలూ నిర్విరామంగా, నిరంతరంగా,నిస్వార్థంగా చెబుతూనే ఉన్నారు. అలా ముప్ఫయి సంవత్సరాలకు పైగా, కొన్ని వేల ప్రసంగాలు ఇస్తూనే ఉన్నారు. భగవద్గీత అయితే ఒక గంగాప్రవాహంలా ఏదో ఒకచోట చెబుతూనే ఉంటారు.

స్వామీజీ బోధలు విని స్ఫూర్తి చెందిన మావారు రాఘవరావు గారూ, నేనూ అక్షరాలా ఆయన బోధల ఆధారంగా, ఆయన దీవెనలతో మూడు సత్సంగాలలో బోధ చేసేవారము. ఇప్పుడు ఆన్‌లైన్‌లో చెబుతున్నాము. ఈ నేపథ్యంలో ఉపనిషత్తులను పుస్తకరూపంలో తెలుగులో ప్రచురిస్తున్నాము. అలా ప్రచురించిన ప్రతిసారీ చెన్నై వెళ్ళి ఆయన దీవెనలు పొంది వస్తాము. అలా పొందిన ఒక శుభసందర్భంలో, 'నేను ప్రత్యేకంగా, ఏదైనా రాయాలని కోరుకుంటున్నారా?' అని అడిగాను. ఆయన వెంటనే స్వయంగా నా చేతిలో నాలుగు చిన్న పుస్తకాలు పెట్టారు.

**వేదాంతిక్ స్నాక్స్** పేరిట స్వామీజీ అదనంగా ప్రత్యేక సందర్భాలలో ఇచ్చిన ప్రసంగాలు అవి.ముఖ్యంగా శివరాత్రికి, న్యూఇయర్‌కి, గురుపూర్ణిమకీ ఇచ్చిన ప్రసంగాలు అవి. జనబాహుళ్యానికి, అంటే బొత్తిగా అద్వైతవేదాంతం గురించి ఓనమాలు తెలియని పామరులకి, వేదాంతంలో పండిపోయిన పండితులకీ, అందరికీ సమానంగా ఉపయోగపడే ప్రసంగాలవి. దాని తర్వాత ఆయన ప్రసంగాలు మరికొన్ని సేకరించాము. అవి 110 ఉన్నాయి. అన్నీ ఒకదాన్ని మించి ఒకటి ఉన్నాయి. వాటిల్లోంచి ఇందులో పొందుపరిచిన 46 ఏరటం కష్టతరమైంది.

పరమార్థానంద స్వామీజీ అనేక సందర్భాలలో ఇచ్చిన ఆ ప్రసంగాలు వింటుంటే నాకు కలిగిన భావపరంపరలు వర్ణనాతీతం. ఆనందం, ఆశ్చర్యం, గగుర్పాటు, ఆరాధనాభావన, విస్మయం– ఇలా రకరకాలుగా అనిపించింది– ఏమని వర్ణించను?

110 ప్రసంగాలు ఇచ్చారు కదా! ఏ ఒక్కటీ మళ్ళీ తిరిగి చెప్పలేదు. అలా చెప్పింది చెప్పకుండా చెప్పాలంటే ఎంత ఏకాగ్రత, ఎంత జ్ఞాపకశక్తి, ఎంత జ్ఞానం, ఎంత శ్రద్ధ, ఎంత శ్రమ ఉండాలో మీరే ఆలోచించండి! కొన్ని చోట్ల కొన్ని అంశాలు మళ్ళీ మళ్ళీ చెప్పాల్సి వస్తుంది. ఉదాహరణకు పంచమహాయజ్ఞాల గురించి మూడు, నాలుగు ప్రసంగాల్లో వస్తుంది. కాని, మీరు నమ్మరు, ప్రతిసారీ ఒక కొత్త అంశం చెప్పారే కాని మళ్ళీ మళ్ళీ అదే చెప్పలేదు. ఇది ఒక ప్రత్యేకత.

ఇంకొక ప్రత్యేకత – **శాస్త్రమే ఆయన ఊపిరి.** శాస్త్రం, ముఖ్యంగా భగవద్గీతలోని శ్లోకం ప్రసక్తి లేకుండా ఆయన ఏ ప్రసంగమూ చేయలేదు. భయాన్ని ఎదుర్కోవటమెలా? శాస్త్రంలోంచి చెప్పారు; ప్రార్థన ఎలా చేయాలి? శాస్త్రంలోంచి చెప్పారు; ఆత్మజ్ఞానం ఎందుకు పొందాలి? శాస్త్రంలోంచి చెప్పారు. అలా శాస్త్రం లేకుండా ఆయన లేరు. **జీవితపరమార్థం పరమార్థానందస్వామి శాస్త్రంలోంచి రంగరించి పోశారు.** అదీ ఆయన గొప్పతనం. ఆయనే ఒకసారి చెప్పారు గురువు తలమీద మీట నొక్కితే శాస్త్రం వస్తుందని. అది పరమార్థానంద స్వామి విషయంలో అక్షరసత్యం. ఆయన ప్రమేయం లేకుండానే శాస్త్రం దూసుకు వచ్చేస్తుంది. అందువల్లనే మేము మాకేదైనా సందేశమివ్వండి అంటే **"ఫాలో ది శాస్త్ర"** అన్నారు. అలా ఎందుకన్నారో ఇది చదివితే మీకూ తెలుస్తుంది. మన జీవన విధానంలో వేదాంతాన్ని (శాస్త్రాన్ని) చొప్పించారాయన. అంతేకాదు భగవద్గీతలోంచి కొన్ని ముఖ్యమైన శ్లోకాలు ఏరి, మనకొక మార్గదర్శిగా నిలపాలని నాకు ఎప్పటినుంచో కోరికగా ఉండేది. ఆ కోరికని అప్రయత్నంగానే తీర్చారు స్వామీజీ.

మరో ప్రత్యేకత – **శాస్త్రమే ఆయన ఊపిరి, మరి గురువు ఆయన మనస్సు.** దయానంద సరస్వతి స్వామీజీ ఈ తరానికి అద్వైతవేదాంతంలో ఆదిగురువు. పూజ్య స్వామీజీ అంటే ఈ స్వామీజీకి ఎనలేని గౌరవాభిమానాలు. ఆయన ప్రశంస లేకుండా, ఆయన ప్రస్తావన లేకుండా ఈ స్వామీజీ ప్రసంగమే ఉండదు.

**వేదాంత జీవనవిధానాన్ని** గీతామాలికద్వారా ఆంగ్లంలో బోధించిన స్వామీజీకి , తెలుగులో **సమగ్ర హిందూత్వ దర్శనంగా** పొందుపరచి, గురుపూర్ణిమ రోజు (16-07-2019) మా దంపతులం వినమ్రంగా సమర్పించుకుంటున్నాము.

**లభేద్వాంఛితార్థం పదం బ్రహ్మ సంజ్ఞమ్।**
**గురోరుక్తవాక్యే మనో యస్య లగ్నమ్॥**

# సమగ్ర హిందుత్వ దర్శనం

మద్దూరి రాజ్యశ్రీ

**జ్ఞానయోగానికి రానిదే కర్మయోగం అసంపూర్ణం**
**కర్మయోగం లేనిదే జ్ఞానయోగం అసంభవం**

కాని బాధాకరమైన విషయమేమిటంటే, చాలామంది కర్మయోగం దగ్గరే ఆగిపోతారు. ఇంకా మాట్లాడితే కర్మయోగానికి కూడా రారు. సకామ కర్మ దగ్గరే ఆగిపోతారు. వారు జ్ఞానయోగానికి వచ్చే ప్రసక్తే లేదు. గీతలో కృష్ణపరమాత్మ అలాంటి వారిని బెదరగొట్టవద్దు అంటారు.

**న బుద్ధిభేదం జనయేత్ అజ్ఞానాం కర్మసంగినామ్। గీత 3-26**

ఒకపక్క వారికి వైరాగ్యాన్ని నేర్పించవద్దు అంటూనే అదే అధ్యాయంలో కర్మయోగం అంటే ఏమిటో, మన జీవన విధానం ఎలా ఉండాలో నిర్దేశించాడు. ఆధ్యాత్మికంగా మనం ఎలా ఎదగాలి? ముందు కర్మను కర్మయోగంగా మలచుకుని, కర్మయోగంవల్ల చిత్తశుద్ధి పొంది, చిత్తశుద్ధివల్ల జ్ఞానయోగ్యతను పొంది, జ్ఞానయోగ్యతవల్ల గురువును ఆశ్రయించి, గురువుద్వారా శాస్త్రాన్ని అధ్యయనం చేసి, శాస్త్రంవల్ల ఆత్మజ్ఞానం పొందాలి. ఆత్మజ్ఞానం పొందితే మోక్షం కలుగుతుంది. ఇదీ మన జీవన విధానం. దానికి వేదాంతం (శాస్త్రం) తోడ్పడుతుంది. శాస్త్రం **మోక్షం మీ జన్మహక్కు, దాన్ని కోరండి** అంటుంది.

శాస్త్రం గొప్పతనం ఏమిటంటే మనం ఏ స్థాయిలో ఉంటే ఆ స్థాయికి దిగివచ్చి చెబుతుంది. ఆ తర్వాత ఆ స్థాయిలోనే ఆగిపోకు, పైకి ఎదుగు అంటూ ఒక్కొక్క మెట్టూ ఎక్కించి పైకి తీసుకువెళుతుంది. మన పయనం కర్మనుంచి ఉపాసనకు, ఉపాసననుంచి జ్ఞానానికీ సాగాలి.

మన జీవనవిధానం శాస్త్రపరంగా ఎలా సాగాలో వివరిస్తూ పరమార్థానంద స్వామీజీ **వేదాంతిక్ స్నాక్స్** పేరిట అనేక సందర్భాలలో అనేక అంశాలమీద ప్రసంగించారు. ముఖ్యంగా మూడు సందర్భాలు - శివరాత్రి, గురుపూర్ణిమ, న్యూ ఇయర్. ఇవి కాక వేరే సందర్భాలలో కూడా చెప్పారు. వాటన్నిటినీ ఒక మాలగా ఏర్చి కూర్చటం జరిగింది. స్వామీజీ ఇచ్చిన పుస్తకాలు, సీడీలు కలిపి 110 అయ్యాయి. వాటిలోంచి 46 ఏరటం కష్టతరం అయింది.

ఈ వేదాంత జీవన విధానంలో మన జీవనయానం ఎలా సాగాలో, ఎటునుంచి ఎటు పయనించాలో, ఒక్కొక్కమెట్టుగా ఎలా ఎదుగుతూ రావాలో ఆ దశలు చూపించటానికి ప్రయత్నం చేశాము. శాస్త్రం మనను అట్టడుగు స్థాయి నుంచి అత్యున్నత స్థాయికి తీసుకువెళుతుందని చూశాము కదా! దేవుడనే వాడున్నాడా అనేది అట్టడుగు స్థాయి అయితే జీవ ఈశ్వర ఐక్యవాక్యవిచారణ చేయటం దానికి పరాకాష్ఠ. దేవుడు ఉన్నాడో లేడోననే సందిగ్ధావస్థనుంచి జీవుడు, ఈశ్వరుడు ఒకటే అనే నిశ్చయజ్ఞానంవైపుకు సాగుతుంది మన ప్రయాణం. ఆ దోవలో ఎదురయ్యే అనేక సందేహాలను, సందిగ్ధాలను, అనుమానాలను, శంకలను తీర్చుకుంటూ సాఫీగా గమ్యంవైపుకు తీసుకువెళుతుంది.

దేవుడు ఉంటే ఎలా ఉంటాడు, ఆయన మహిమ ఏమిటి, ఆయన ప్రార్థన ఎలా చేయాలి, ప్రార్థన చేస్తే మన తలరాత మారుతుందా– ఇవి భక్తిపరంగా కొన్ని సందేహాలు.

కర్మయోగం అంటే ఏమిటి? కర్మయోగం దగ్గరే ఎందుకు ఆగిపోకూడదు, జ్ఞానం ఎందుకు పొందాలి – ఇవి కర్మపరంగా కొన్ని సందేహాలు.

జ్ఞానం అంటే ఏమిటి, దానికి ప్రమాణం ఏమిటి, జ్ఞానం ఎందుకు పొందాలి, అదీ గురువుద్వారానే ఎందుకు పొందాలి, అద్వైతం అంటే ఏమిటి, అసలు నేను ఈశ్వరుడు ఒకటెలా అవుతాము – ఇవి జ్ఞానపరంగా కొన్ని సందేహాలు.

ఈ సందేహాలు తీర్చుకుంటూ వెళ్ళి జీవ–ఈశ్వర ఐక్యం నిస్సందేహంగా రెండు విచారణలద్వారా బోధిస్తుంది. అక్కడితో ఆగదు మన పయనం. జ్ఞానం పొందితే లాభం ఏమిటి? జ్ఞాని అనుభవం, ప్రవర్తన ఎలా ఉంటుంది అనే విషయాలు– అంటే జ్ఞానఫలం వివరంగా వస్తుంది.

మహావాక్యమంత్రం అంటే జీవుడెవరు, ఈశ్వరుడెవరు, వారి ఐక్యం ఎలా సాధ్యం? ఇది తెలుసుకుంటే కలిగే ఫలం ఏమిటి– ఇవన్నీ ఒక్కమంత్రంలో వస్తాయి.

ఇదే వరుసలో మన సందేహాలు తీర్చుకుంటూ, మన పయనం సుగమంగా సాగి, జ్ఞానఫలం పొందేలాగా ప్రసంగాలను ఏర్చి కూర్చటం జరిగింది.

అమ్మో! ఆత్మజ్ఞానమా! అది మా తలమీంచి వెళ్ళిపోతుంది, ఒకవేళ అర్థమయినా సన్యాసుల్లో కలిసిపోతామేమో అని భయపడేవారికి అది ఎంత తేలికో, ఎంత ఆనందానిస్తుందో విడమర్చి చెబుతుంది. అసలు అదే స్వామీజీ ప్రత్యేకత. ఎంత క్లిష్టమైన అంశాన్నైనా చిన్నచిన్న పాయింట్లుగా విడదీసి, మన మనసులో

హత్తుకు పోయేలా చెబుతారు. ఉదాహరణకు **తితిక్షకు ఆరు బంగరు సూత్రాలు.** జ్ఞానఫలం తర్వాత వచ్చిన ప్రసంగాల్లో జ్ఞానాన్ని మన జీవితంలో రంగరించుకుని, జీవితాన్ని ఎంత అద్భుతంగా మలచుకోవచ్చో, జీవితాన్ని మరింత సుగమంగా, ఎలా చేసుకోవచ్చో చూస్తాము.

అద్భుతమైన మరో అంశం– **ఇవన్నీ భగవద్గీతలోంచి ఏర్చికూర్చారు** మన స్వామి పరమార్థానందగారు గీతామాలికద్వారా. జ్ఞానం కావాలా, గీతాబోధకు రండి, విజయం కావాలా గీతాబోధకు రండి, సంసారం అధిగమించాలా గీతాబోధకు రండి. అందువల్ల గీతామాహాత్మ్యం చివర్లో పొందుపరచటం జరిగింది. ఇవన్నీ గీతలో దొరుకుతాయి.

అంతేకాకుండా స్వామీజీ వాక్కునుంచి జాలు వారిన కొన్ని ఆణిముత్యాలను **స్వామీజీ సూక్తిముక్తావళిగా** అక్కడక్కడ పొందుపరిచాము. ఆ ఆణిముత్యాలను బాగా జీర్ణించుకున్నా, వేదాంతసారం జీర్ణించుకున్నట్టే. ఈ వేదాంత జీవనవిధానాన్ని ఒక నవలలా చదివి పడేయకుండా, రోజుకొక ప్రసంగం చొప్పున చదివితే, మన హిందూమతం, సిద్ధాంతం గురించి సమగ్రదర్శనం కలుగుతుందని హామీ ఇస్తున్నాము. అంతేకాదు, దీన్ని చదివాక, కొత్తవారెవరికైనా, జ్ఞానయోగానికి రావాలని ఇచ్ఛ కలిగితే మా ఈ చిరుప్రయత్నం ఫలించినట్టే!

మేమాశించినట్టే, స్వామీజీ కృపవల్ల ఈ వేదాంత జీవన విధానం ఎంతో జనాదరణ పొంది, మళ్ళీ ద్వితీయ ముద్రణకు నోచుకుంది. ఇది చదివిన ఎందరో అనేక సందేహాలు తీరుతున్నాయనీ, హిందూమతం గురించిన సరియైన అవగాహన ఏర్పడుతున్నదనీ మాతో వారి స్పందనను పంచుకున్నారు.

భగవద్గీత మూడవ షట్కం, బృహదారణ్యకోపనిషత్తులను స్వామీజీ చెన్నైలో ఇటీవల ఆవిష్కరణ చేసినప్పుడు, వేదాంతిక్ స్నాక్స్ 134 ప్రసంగాలున్నాయనీ, వాటన్నిటినీ అనువదిస్తే జనబాహుళ్యానికి ఉపయోగకరంగా ఉంటుందనీ స్వామీజీ అన్నారు. వాటిలోని అంశాలను తెలుగు పత్రికలకు చిన్న వ్యాసాలుగా ఇచ్చినా, యూట్యూబ్‌లో చిన్న ప్రసంగాలుగా చేసినా కూడా బాగుంటుందని స్వామీజీ సూచించారు.

వేదాంత జీవన విధానం పేరిట 46 వ్యాసాలు ప్రచురించామనీ, అది స్వామీజీ కృపవల్ల రెండవ ముద్రణకు నోచుకుందనీ, త్వరలోనే తక్కిన ప్రసంగాలు కూడా రెండవ భాగంగా ప్రచురిస్తామనీ చెప్పి వచ్చాము.

# జీవిత పరమార్థాన్ని బోధించే పరమార్థానంద స్వామి

ఏమండీ బాగున్నారా? అని ఒక పెద్దమనిషిని, మరొక మిత్రుడు కుశలప్రశ్న అడిగాడు. లేదండీ! ఈ మధ్య నా ఆరోగ్యం బాగుండటం లేదు. మతిమరుపు ఎక్కువైంది. చేతులు వణుకుతున్నాయి. డయాలసిస్ వారానికి ఒకసారి చేయించుకుంటున్నాను. కీళ్ళనొప్పులు, మలబద్దకం, ఈ ప్రపంచంలో ఉన్న జబ్బులు అన్నీ ఒక్కసారిగా నా వొంటిమీదకి వచ్చేశాయి అని ఎంతో వేదనతో ఆయన బదులిచ్చాడు.

మిత్రుడు చిరునవ్వు నవ్వి మీకు నేను ఒక మాత్ర ఇస్తాను. వేసుకుని చూడండి. మీకు స్వస్థత చేకూరుతుంది అన్నాడు. ఏమిటా మాత్ర? స్వామి పరమార్థానంద బోధించిన తత్త్వబోధ.

ఆయన వెంటనే ఆ మందుబిళ్ళ వేసుకున్నాడు. అంతే - ఒక గంట గడిచింది- ఆయన పూర్తి ఆరోగ్యవంతుడు అయ్యాడు. 65 ఏండ్ల వృద్ధుడు 25 ఏండ్ల వాడిలాగా శారీరక మరియు మానసిక ఆరోగ్యంతో **కోహినూరు వజ్రం**లాగా మెరిసిపోతున్నాడు. తత్త్వబోధను పఠించి, ఆకళింపు చేసుకున్నాడు అని అర్థము.

ఇదెలా సాధ్యము? సాధ్యమే- స్వామీ పరమార్థానందవారి బోధలకున్న శక్తి అది. ఆయన బోధలు విన్నవారు అమాంతంగా మారిపోతారు. అజ్ఞానులు- జ్ఞానులు అయిపోతారు. రోగులు యోగులైపోతారు.

మనిషికి మాత్రమే ఉన్న ఒకే ఒక ఆయుధము బుద్ధి. దానిని ఉపయోగించుకోలేకపోతే నీవు పశువుతో సమానము అని స్వామి పరమార్థానంద ఒక శ్లోకముద్వారా చెబుతారు.

**ఆహారనిద్రాభయమైథునం చ।**
**సామాన్యమేతత్ పశుభిర్నరాణామ్।**
**బుద్ధిర్హి తేషామ్ అధికో విశేషః।**
**బుద్ధ్యా విహీనః పశుభిః సమానః॥**

**ఉద్ధరేత్ ఆత్మనా, ఆత్మానమ్ -** ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి. గురువుకోసం, శాస్త్రంకోసం, సదాశివ బ్రహ్మేంద్రస్వామి- కుటుంబాన్ని, కొత్తగా వివాహం చేసుకున్న నవవధువుని వదిలేశాడు. సమర్థరామదాసు - (ఛత్రపతి

శివాజీ గురువు)పెళ్ళిపీటలమీద నుండి పరుగుతీశాడు. శంకరాచార్య మొసలి నెపంతో తల్లిని ఒప్పించి, గోవింద భగవత్‌పాదుల్ని ఆశ్రయించారు. మరి మనమందరము– స్వామి పరమార్థానందవైపుకి వెళ్ళి ఆయన బోధలు విని బ్రహ్మజ్ఞానంతో వెలిగిపోవాలి. సంసారాలు వదలనవసరం లేదు. సూక్ష్మబుద్ధితో, స్వామీజీ చెప్పిన వేదాంతము, శ్రద్ధగా వింటే చాలు– మానవుడు మాధవుడుగా మారిపోతాడు. **ఆచరతి – ఆచారయతి –** తను ఆచరించి మనచేత ఆచరింపచేస్తారు స్వామీజీ. ఆయన స్వయంగా జీవన్ముక్తులు అయ్యారు. మనల్ని జీవన్ముక్తులుగా చేస్తారు.

ఆయన దగ్గర ఉన్న మంత్రం ఏమిటి? **"ఫాలో ది శాస్త్ర"**

ఇదే స్వామీజీ మనకు ఇచ్చే మంత్రము. ద్వాదశ అక్షర మహామంత్రము. **ఓం నమో భగవతే వాసుదేవాయ** అనే శ్రీకృష్ణమంత్రంతో సరిసమానము.

**ఆత్మ సత్యము – అనాత్మ మిథ్య – జీవాత్మ పరమాత్మ ఏకం** – ఇది వేదాంతసారము. ఇది వినటానికి మీకు 60 సెకండ్లు చాలు. కాని ఈ తత్త్వమును జీర్ణించుకోవటానికి, ఆచరించి, ఆత్మజ్ఞానులు అవటానికి 60 సంవత్సరముల కాలము కూడా సరిపోకపోవచ్చు.

వేదాంతం ఒక నమ్మకం కాదు, వేదాంతం ఒక జ్ఞానం.

ప్రాథమిక లక్ష్యాలను సాధించిన తర్వాత మోక్షము అనే అంతిమ లక్ష్యమును సాధించకుండా మన దేహాన్ని త్యజిస్తే ఏమి ఉపయోగము?

**స్వామి చిన్మయానంద– స్వామి దయానందను మనకు అందించారు**

**స్వామి దయానంద– స్వామి పరమార్థానందను మనకు అందించారు**

నిజానికి – స్వామి పరమార్థానంద బోధలు మనకు అందించినవారు ఎవరో చెప్పనా? శ్రీమతి మద్దూరి రాజ్యశ్రీ మరియు శ్రీ రాఘవరావు దంపతులు. ఆంగ్లములో ఉన్న స్వామీజీ బోధల్ని, సరళమైన తెలుగు భాషలో మనకు అందరికీ తేలికగా అర్థమయ్యే రీతిలో అందిస్తున్నారు.

స్వామి పరమార్థానంద మనకు చెప్పిన వేదాంతము ఏమిటి? ప్రస్థానత్రయము అనగా శ్రీమద్భగవద్గీత, బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్తులు. ఇవికాక భజగోవిందము, అద్వైతమకరందమువంటి ప్రకరణగ్రంథాలు– ఇంకా ఎన్నో ఎన్నెన్నో నూతన సంవత్సరము సందర్భంగా, శివరాత్రి సందర్భంగా ఉపన్యాసాలు. వేదాంతంలో ఆయన స్పృశింపని అంశము అంటూ లేదు అనడంలో అతిశయోక్తి లేదు. అనేక వేల ఉపన్యాసాలు ఇచ్చారు. వేదాంతాన్ని ఇంత అందంగా ఏర్చి

కూర్చి పండితులు – పామరులు సమంగా, ఆస్వాదించే విధంగా ఉపన్యసించడం– స్వామి పరమార్థానందవారికి ఆ దేవుడిచ్చిన వరం.

ఆత్మబంధువులారా! **వేదాంత జీవన విధానం** అనే ఈ చిన్న గ్రంథము– మన జీవితాన్ని మార్చివేస్తుంది. మనలో ఉన్న జ్ఞాననేత్రము తెరుచుకుంటుంది. మన అందరికీ జ్ఞానప్రాప్తి కలుగుతుంది.

యమనియమాలు నిజజీవితంలో ఎలా ఆచరించాలి? ప్రార్థన ఎలా చేయాలి? మనకు అసలైన ఆనందము ఎలా వస్తుంది? పుట్టిన దగ్గరనుండి చనిపోయేవరకు భయంతోనే జీవిస్తున్నాము. తల్లి గర్భంనుండి స్మశానంవరకు బతుకంతా భయమే. మరి ఆ భయాన్ని మనము ఎలా పోగొట్టుకోవాలి? సత్సంగము అంటే ఏమిటి? దానివలన మనము పొందే ప్రయోజనములు ఏమిటి? **వేదాంత జీవన విధానం** అనే ఈ గ్రంథములో ఇలాంటి అంశాలు ఎన్నో ఉన్నాయి.

మానవ సమాజవికాసానికి మరియు వ్యక్తిగా మన ఆధ్యాత్మిక ఎదుగుదలకు– ఈ పుస్తకము ఎంతగానో ఉపయోగపడుతుంది. మనం అందరమూ 99.9 శాతం – కపటవర్తనతోనే జీవిస్తున్నాము. అంటే పైకి ఒక రకంగా లోపల మరొక రకంగా ఉంటాము. డ్యూయల్ బిహేవియర్ అంటారు. పైకి, మంచివాడిలాగా నటిస్తాము. కాని మన దైనందిన జీవితము అంతా, కృత్రిమంగా కల్మషాలతో నిండి ఉంటుంది. ఇటువంటి మనల్ని ఈ పుస్తకంలోని అంశాలు హఠాత్తుగా మార్చేస్తాయి.

భార్యమాటతో తులసీదాసు – సంత్ తులసీదాసుగా మారిపోయాడు. వదిన మాటతో వేమన యోగి అయిపోయాడు.

అలాగే ఈ పుస్తకంలో ఏ ఒక్క అంశము మనము చదివినా మనలోని, దుష్ప్రవర్తన, చెడ్డ ఆలోచనలు ఒక్కసారిగా మాడి మసి అయిపోతాయి. కొత్తగా అసలైన, కల్తీలేని ఆధ్యాత్మికజీవితం మనము అలవర్చుకుంటాము. శంకరాచార్య, మూఢమతి అని మందలించి, మనల్ని నిద్రలేపారు భజగోవిందంలో. స్వామి వివేకానంద–Arise, Awake and Stop Not till the goal is reached, అని చెప్పి, మనలోని తమోగుణాన్ని నాశనం చేసి జ్ఞానాన్ని నింపారు.

అలాగే స్వామి పరమార్థానంద మనకు అందించిన అపరిమితమైన జ్ఞానాన్నుంచి కొన్ని చిన్న కొటేషన్సు రూపంలో అందించారు. అందులో కొన్ని – పోర్టు రిడక్షన్, ఎఫ్ ఐ ఆర్ మొదలైనవి ఈ పుస్తకం చివరలో ఇచ్చారు.

వేదాంతాన్ని ఒక బూందీ లడ్డూలాగ, తియ్యగా మన నోటికి అందిస్తారు– స్వామి పరమార్థానంద.

మరొక్కమాట–

ఇంతవరకూ మా మిత్రులు మద్దూరి రాజ్యశ్రీ మరియు కస్తూరి రాఘవరావు ఆర్షవిద్యా తరంగిణి పేరిట ప్రచురించిన గ్రంథములు –

**1.అద్వైత వేదాంత పరిచయము 2. కఠోపనిషత్తు 3. ముండకోపనిషత్తు 4. తేలికగా తైత్తిరీయం 5. ప్రశ్నోపనిషత్తు 6. ఈశావాస్యోపనిషత్తు 7. దృగ్దృశ్య వివేకము 8.ఐతరేయోపనిషత్తు 9. ఛాందోగ్యోపనిషత్తు 10. కేనోపనిషత్తు 11. వేదాంత జీవనవిధానము 12. కైవల్యోపనిషత్తు 13. భజగోవిందం 14. బృహదారణ్యకోపనిషత్తు 15. శ్రీమద్భగవద్గీత మొదటి షట్కము 16. శ్రీమద్భగవద్గీత రెండవ షట్కము 17. శ్రీమద్భగవద్గీత మూడవ షట్కము**

దివ్యాత్మస్వరూపులైన మా రాజీ –రాఘవ దంపతులు, ఇంకా ఎన్నో, ఎన్నెన్నో, మరెన్నో శంకరవాఙ్మయ గ్రంథాల్ని, తెలుగులో వెలుగులోకి తీసుకురావాలని మనసారా కోరుకుంటూ, వారికి బ్రహ్మనిష్ఠ, అద్వైతసిద్ధి కలగాలని ఆ శ్రీకృష్ణుణ్ణి మనసారా ప్రార్థిస్తున్నాను.

ఆత్మబంధువులారా! ఈ **వేదాంత జీవన విధానం** అనే పుస్తకం చదివి– స్వామీజీ చెప్పిన అంశాలు మన నిజజీవితంలో పాటించి, ధర్మబద్ధంగా, పవిత్రంగా, నిష్కపటంగా, నిబద్ధతతో, మన దైనందిన జీవితాన్ని సాగిద్దాము. ఇదే మన ప్రతిజ్ఞ, భీష్మప్రతిజ్ఞ. శ్రీకృష్ణుడు మన జీవితాల్ని ఒక మలుపు తిప్పుగాక.

లోకాస్సమస్తా సుఖినో భవంతు.

**మూల్పూరి విష్ణు ప్రసాద్**
ఎఫ్ 903, మై హోమ్ భూజా,
గచ్చిబౌలి, హైదరాబాద్ – 500 032
**మొబైల్ – 98660 02269**

# 1. దేవుడనే వాడున్నాడా?

ఈశ్వరపూజ హిందువైన ప్రతి వ్యక్తీ రోజూ చేయాలి. శివరాత్రి పర్వదినాలలో ఇంకా విశేషంగా ఈశ్వర పూజలు చేస్తారు. అలా పూజ చేయటం మనకు చాలా సహజమైన అలవాటు.

ఇంతగా రోజూ పూజ చేస్తున్నా, ఎప్పుడో అప్పుడు ఒక ప్రాథమిక సందేహం రాకపోదు. బుద్ధికి పదును పెట్టే వ్యక్తి ఏదో ఒక రోజు ఈ ప్రశ్న లేవదీస్తాడు. **నేను ఇంత క్రమం తప్పకుండా, శ్రద్ధగా దేవునికి పూజ చేస్తున్నాను నిజమే కాని అసలు దేవుడనేవాడున్నాడా?**

**దేవుడనే వాడున్నాడా?** ఈ ప్రశ్న తల ఎత్తేసరికి మనం నలిగిపోతాము. దేవుని ఉనికిని ప్రశ్నించటానికి మానవ మాత్రులం మనమెంత, ఆయనమీద శ్రద్ధ పెట్టుకోవాలి కాని, అని ఒక ప్రక్క మనస్సు నోరు నొక్కటానికి ప్రయత్నిస్తుంది. మరోపక్క అతి తెలివి చూపించే బుద్ధి సవాలు విసురుతుంటుంది. ముఖ్యంగా అంత పూజలు చేస్తున్నా దేవుడు పలకటం లేదు ఎందుకు అనే సందేహం కలిగినప్పుడు, ఆయన ఉనికినే శంకిస్తాము.

ఒకవేళ మనం బుద్ధిగా, ఎటువంటి సందేహాలూ లేకుండా, మన పాటున మనం పూజ చేసుకుంటూ పోతున్నా కూడా నాస్తికులు, తటస్థవాదులు, హేతువాదులు మనను రెచ్చగొడుతుంటారు. **దేవుడున్నాడా? నువ్వు దేవుడున్నాడని నిరూపించగలవా?** దీనికి మన జవాబు ఏమిటి? దేవుడున్నాడా అంటే అలాంటి ప్రశ్నలు వేయకూడదు. దేవుడిమీద శ్రద్ధ పెట్టుకోవాలి అంతే అని వారికి చెప్పాలా, **నిజంగా ఏదైనా నిదర్శనం ఉందా?** వైజ్ఞానిక పరంగా కాని, మతపరంగా కాని, తార్కికంగా కాని, **దేవుని ఉనికికి నిదర్శనం ఏదైనా ఉందా?** ఏమని జవాబు చెప్పాలి? గుడ్డినమ్మకంతో, ఎదురు ప్రశ్నించకుండా ముందుకు సాగాలా,లేదా ఏదైనా జవాబు దొరుకుతుందా?

ఈ సమస్య ఒక్క మన హిందూ మతానికే లేదు, అన్ని మతాలకూ ఉంది. ఒక్కొక్కరూ ఒక్కొక్క పద్ధతిలో చెప్పారు కాని దానివల్ల విషయం మరింత జటిలమయిందే తప్ప స్పష్టంగా లేదు.

ఇదే ప్రశ్నకు మన వైదిక సాంప్రదాయం ఎలా జవాబు చెబుతుంది? గురుపరంపరగా విద్య నేర్చుకున్న గురువును దేవుడనే వాడున్నాడా అని మీరు

ప్రశ్నించితే, ఆయనేం జవాబు చెబుతాడు? గురువు వెంటనే జవాబు చెప్పడు. ముందు శిష్యుణ్ణి తిరిగి ప్రశ్నిస్తాడు. **నీ ఉద్దేశ్యంలో అసలు దేవుడంటే ఎవరు?** ఎందుకంటే దేవుడు అంటే ఒక్కొక్కరికి ఒక్కొక్క సిద్ధాంతం ఉంది. ఆధ్యాత్మిక సాధకుడు ఒక అర్థాన్ని చెపితే, సాంప్రదాయ గురువు ఇంకో అర్థం చెబుతాడు. అందువల్ల గురువు అతను దేవుని గురించి ఏమనుకుంటున్నాడో తెలుసుకుంటాడు ముందు. లేకపోతే ఇద్దరి మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ ఏర్పడి, అర్థం చేసుకునే బదులు, అపార్థం చేసుకునే అవకాశం ఉంది.

అందువల్ల దేవుడున్నాడా అంటే వెంటనే జవాబు చెప్పకండి. ముందు నీ ఉద్దేశ్యంలో దేవుడంటే ఎవరు అని అడగండి.

**లక్షణ ప్రమాణాభ్యాం వస్తుసిద్ధిః**

అందువల్ల ముందు దాని గురించిన నిర్వచనం ఇవ్వందే నిదర్శనం ఇవ్వకూడదు. ఇది స్వామీజీకి ఒకసారి వేరే విషయంలో స్వానుభవం అయింది. ఒక శిష్యుణ్ణి పళ్ళబుట్టలోంచి ఒక ఆరెంజ్ తెమ్మని చెప్పారట. ఎవరికో ఆ పండు ఇద్దామనుకున్నారు ఆయన. ఆ శిష్యుడు లోపలికి వెళ్ళి వచ్చి, 'అక్కడ ఆరెంజ్ లేదు కాని తక్కిన పండ్లు బోలెడు ఉన్నాయి, వేరే ఏదైనా పండు తేనా,' అని అడిగాడు.

కాని స్వామీజీ, 'నేనే స్వయంగా ఆ బుట్టలో ఆరెంజ్ పెట్టాను. సరిగ్గా చూడు. నాకు వేరే పండు వద్దు. అదే కావాలి, ' అన్నారు. కాని శిష్యుడు లోపలికి వెళ్ళివచ్చి మళ్ళీ అదే మాట అన్నాడు.

ఇంక అప్పుడు స్వామీజీయే లేచి వెళ్ళారుట లోపలికి. ఆయన చెప్పినట్టే, ఆ పళ్ళ బుట్ట పైనే నిగనిగలాడుతూ కనిపించిందట ఆరెంజ్. ఆ పరమానంద శిష్యుణ్ణి, 'ఇదేమిటి, ఇక్కడే ఉంది కదా!' అంటే అతను, 'స్వామీజీ అది ఆరెంజ్ కాదు,' అన్నాడుట. ఈసారి రెట్టింపు ఆశ్చర్యం వేసింది స్వామీజీకి.

నాగపూర్ ఆరెంజ్ పండు పెద్దగా, మేలిమి పసుపుతో మెరిసిపోతుంటే అది ఆరెంజ్ కాదంటాడేమిటి అనుకుని, 'సరే, అయితే ఇదేం పండు?' అన్నారు. 'స్వామీజీ, దాన్ని కమలాపండు అంటారు,' అన్నాడు. కొంతమంది ఆరెంజ్‌ని కమలాపండు అంటారని గుర్తుకొచ్చింది స్వామీజీకి. మరయితే ఆరెంజ్‌ని అతని భాషలో ఏమంటారని అనుమానం వచ్చింది స్వామీజీకి. అదే ప్రశ్న అడిగితే, అతను చెప్పిన వర్ణన ప్రకారం అతను బత్తాయిపండును ఆరెంజ్ అంటున్నాడు.

**ఇప్పుడు చెప్పండి ఆరెంజ్ ఉందా లేదా?** ఆ శిష్యునిపరంగా చూస్తే అక్కడ ఆరెంజ్ లేదు, బత్తాయి ఉంది. స్వామీజీపరంగా చూస్తే ఆరెంజ్ ఉంది కాని, అతను చెప్పే బత్తాయి లేదు. అయోమయంగా ఉందా? ఇదే అయోమయం కనిపిస్తోంది దేవుని విషయంలో కూడా. ఆరెంజ్ విషయంలో అక్కడ కావాల్సింది నిదర్శనం కాదు. స్వామీజీకీ, శిష్యునికీ కూడా ప్రత్యక్షప్రమాణం ఉంది. ఇద్దరూ కంటితో చూస్తున్నారు. కాని ఇద్దరూ ఏకాభిప్రాయానికి రాలేదు. సమస్య ఎక్కడ ఉంది? నిదర్శనం విషయంలో కాదు, నిర్వచనం విషయంలో ఉంది. అందువల్ల ముందు ఇద్దరి నిర్వచనం ఒకటేనా కాదా తేల్చుకున్నాక, నిదర్శనం విషయం ఆలోచించాలి.

**దేవుని నిర్వచనం-** వేదాలలో దేవుణ్ణి ఎలా నిర్వచిస్తారు? చైతన్యస్వరూపంగా నిర్వచిస్తారు.

**చైతన్య స్వరూపాయ, జ్ఞాన స్వరూపాయ, ప్రజ్ఞాన స్వరూపాయ, విజ్ఞాన స్వరూపాయ, చిద్రూపాయ నమః**

చైతన్యం అంటే ఏమిటి?

**యేన రూపం రసం గన్ధం శబ్దాన్ స్పర్శాగ్ంశ్చ మైథునాన్।**
**ఏతేనైవ విజానాతి కిమత్ర పరిశిష్యతే। ఏతద్వైతత్ ॥ కఠ 2-1-3**

రూపం, రుచి, వాసన, శబ్దం, స్పర్శ, మైథునం మొదలైన వాటిని దేనితో మనిషి గ్రహిస్తున్నాడో, అదే చైతన్యం. దీన్ని ఆ దేవుని లక్షణం అంటారు.

**దేవుని నిదర్శనం-** లక్షణం ఏమిటో నిర్వచించాక, ఇలాంటి లక్షణం ఉన్న దేవుడు ఉన్నాడా లేదా అనేది తర్వాత ప్రశ్న! దేవుడంటే చైతన్యం అని చూశాము. ఇప్పుడు చైతన్యం ఉందా లేదా అని ఎవరన్నా అడిగితే, మీ జవాబు ఏమిటి? నీ చుట్టుప్రక్కల ఏమవుతున్నదో నీకు తెలుస్తోందా లేదా అని మీరు ఎదురు ప్రశ్నించాలి. అతనిలో చేతనతత్త్వం ఉండబట్టే, అతను అడగగలుగుతున్నాడు. అతను చైతన్యమూర్తి. అందువల్ల చైతన్యం ఉందా అని అడగనవసరం లేదు.

**జిహ్వా మేఽస్తి న వేత్త్యుక్తిర్లజ్జాయై కేవలం యథా పంచదశీ 3-20**

నాకు నాలుక ఉందా లేదా అని ఒక వ్యక్తి ప్రశ్నించినట్టు ఉంటుంది. అటువంటి ప్రశ్న అర్థం లేని ప్రశ్న. అలాగే చైతన్యం ఉందా లేదా అనే ప్రశ్న కూడా అర్థం లేని ప్రశ్న.

చైతన్యం దేవుడయినప్పుడు, దేవుడున్నాడా లేదా అనే ప్రశ్నకు ఆస్కారమే లేదు. అందువల్ల ఎవరైనా దేవుడున్నాడని నిదర్శనం చూపమంటే, అతనికి నిదర్శనం చూపకండి. నిదర్శనం చూపటమేమీ కష్టం కాదు కూడా! అతన్ని దేవుని నిర్వచనం చెప్పమనండి. నిజానికి మీరు నిర్వచనం చెప్పాక అతనే నిదర్శనం అడగడు. అయినా, అడిగాడు అంటే, అది అతని వెర్రితనాన్ని వేలెత్తి చూపుతుంది.

దేవుడి ఉనికికి నిదర్శనం అవసరం లేదు. దేవుడి లక్షణాన్ని సరిగ్గా నిర్వచించాక కూడా ఒకవేళ అతను మళ్ళీ ప్రశ్న అడిగితే, అతను నిర్వచనాన్ని సరిగ్గా వినలేదు అనుకోవాలి. నాస్తికుడు కూడా నిదర్శనం అడగలేడు. ఎందుకంటే అతను కూడా చైతన్యస్వరూపుడే కదా! అలా నాస్తికుడు, తటస్థవాది, హేతువాది ఎవరూ కూడా దేవుని ఉనికిని శంకించలేరు. ఇన్నాళ్ళు శంకించారు అంటే వారికి ఎవరూ దేవుని నిర్వచనం సరిగ్గా ఇవ్వలేదు. అందువల్ల అటువంటి వారితో ముందు దేవుని లక్షణం గురించి మాట్లాడండి. ఏమిటా లక్షణం? **దేవుడు చైతన్యం.**

రెండవ అంశం ఏమిటి? దేవుని ఉనికికి నిదర్శనం ఏమిటి? దానికి మన జవాబు ఏమిటి? ఆ చైతన్యంవల్లనే నీకు ప్రతి అనుభవమూ జరుగుతున్నది. ప్రతి ఒక్క అనుభవం కూడా దేవుని ఉనికిని చాటి చెబుతున్నది.

**ఉత్క్రామంతం స్థితం వాఽపి భుంజానం వా గుణాన్వితమ్।**
**విమూఢా నానుపశ్యంతి పశ్యంతి జ్ఞానచక్షుషః॥ గీత 15-10**

జీవితంలో జరిగే ప్రతి ఒక్క అనుభవం కూడా ఈ చైతన్యంవల్లనే సాధ్యం. కాని విమూఢులు ఆ విషయం తెలుసుకోలేరు. వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనం చేసిన జ్ఞాని మాత్రమే దేవుని నిర్వచనాన్ని సరిగ్గా అర్థం చేసుకోగలడు. నేను ప్రతిక్షణం దేవుని సన్నిధిలోనే ఉన్నాను. ఇంతవరకూ దేవుని లక్షణం చూశాము, ప్రమాణం చూశాము.

**దేవుని స్వరూపం-** ఇప్పుడు దేవుని స్వరూపం ఏమిటి? దేవుడు చైతన్యం అన్నాము,దానికి ప్రమాణం మీ అనుభవమే అన్నాము. అయితే దేవుని స్వరూపం ఏమిటి? విజ్ఞాన శాస్త్రం దాన్ని సరిగ్గా నిర్వచించలేకపోతున్నది. దేవుడు వస్తువు కాదు, శక్తి కాదు. అంటే ఇంగ్లీషులో వాడే మాటర్, ఎనర్జీలు కాదు. మరి అయితే దేవుడు ఏమిటి?

**యస్మాత్ క్షరమతీతోఽహమ్ అక్షరాదపి చోత్తమః।**
**అతోఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః॥ గీత 15-18**

నేను జడవస్తువును కాను, జీవాత్మను కాను. నేను పురుషోత్తముణ్ణి.

ఈ అనంత చైతన్యం, అతీతమైన చైతన్యమే పురుషోత్తముడు, దేవుడు. వస్తువులకు దేశ, కాలపరిమితులు ఉంటాయి. చైతన్యానికి ఎటువంటి పరిచ్ఛేదం లేదు. అందువల్ల శాస్త్రం **అనంత చైతన్యం** పదాన్ని వాడుతుంది. ఈ అసంగ అనంత చైతన్యమే అందరిలో ఉంది.

**ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి।**
**భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా॥ గీత 18-61**

కంటికి కనబడే ఫ్యాను, కంటికి కనబడని, స్వతంత్రమైన విద్యుచ్ఛక్తివల్ల పనిచేస్తున్నది. అలాగే కంటికి కనబడే ఈ శరీరం, కనబడని సూక్ష్మశరీరంలోని అన్ని అంగాలు, మనస్సుతో సహా, కంటికి కనబడని చైతన్యంవల్ల పనిచేస్తున్నాయి.

ఉదాహరణను ఎంత మేరకు తీసుకోవాలో అంత మేరకే తీసుకోవాలి. చైతన్యాన్ని విద్యుచ్ఛక్తి అనటం లేదు. విద్యుచ్ఛక్తి కనబడనట్టుగా ఈ చైతన్యం కూడా కనబడదు కాని, మన ప్రతి కదలికకూ కారణమవుతున్నది. ఈ అనంత అసంగచైతన్యమే దేవుడు. ఈయన ఉనికిని ఎవరూ శంకించలేరు.

అనంత, అసంగ, చైతన్యరూప ఈశ్వరుణ్ణి అర్థం చేసుకోవటమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలి. దీన్ని ఈశ్వరదర్శనం లేదా ఈశ్వరప్రాప్తి అంటారు శాస్త్రంలో.

**గౌణ ఈశ్వరుడు–** దేవుడు అనంత అసంగచైతన్యరూప ఈశ్వరుడు అన్నాం కదా! ఈ పదాలను సహస్రనామాల్లో చూస్తాము. చిద్రూపిణి, చైతన్యరూపిణి అంటారు లేదా సాక్షిరూప, క్షేత్రజ్ఞ రూప అంటారు. దేవుడు ఇలా అనంత, అసంగ చైతన్యరూపం అయితే మరి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను ఎలా అర్థం చేసుకోవాలి?

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను త్రిమూర్తులంటారు. బ్రహ్మ బ్రహ్మలోకంలో, విష్ణువు వైకుంఠంలో, శివుడు కైలాసంలో ఉన్నాడంటారు. బ్రహ్మను నాలుగు శిరస్సులతో ఉన్నట్టు, సరస్వతీదేవి ఆయన నాలుకమీద ఉన్నట్టు నేర్చుకుంటాము. అలాగే విష్ణుమూర్తి వైకుంఠంలో శేషతల్పంపై నిదురిస్తుంటే లక్ష్మీదేవి ఆయన పాదాలను సుతారంగా ఒత్తుతున్నట్టు భావించుకుంటాము.

శివుణ్ణి అర్థనారీశ్వరునిగా అభివర్ణిస్తాము. వీరే కాక అలా ఎందరో దేవుళ్ళని కీర్తిస్తాము. వారి మాటేమిటి? ఈ దేవుళ్ళు ఉన్నారా, లేదా?

ఇక్కడ ఒక విషయం గమనించాలి మనం. శాస్త్రం పరమాత్మని వర్ణిస్తే, అది ప్రాథమికంగా నిర్గుణబ్రహ్మను వర్ణిస్తుంది. నిర్గుణబ్రహ్మను చైతన్యతత్త్వంగా

వర్ణిస్తుంది. పురాణాల్లో వర్ణించే ఈ దేవుళ్ళందరూ, మనం పూజ చేయటంకోసం ఏర్పరచుకున్న సాకార, సగుణ ఈశ్వరుడు. వీరిని **గౌణ ఈశ్వరుడు** అంటారు.

ఈ ఈశ్వరుణ్ణి గౌణ ఈశ్వరుడు అని ఎందుకంటారంటే ఇది మన పూజకోసం ఏర్పడిన ఒక సగుణరూపం. ఈ రూపానికి పుట్టిన తేదీ, ఒక లోకం, కొన్ని గుణాలు ఆపాదిస్తాము. సగుణ ఈశ్వరుణ్ణి ప్రార్థించి చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత పెంచుకోవాలి. చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత పెంపొందించుకున్నాక, ముఖ్య ఈశ్వరుని స్థాయికి రావాలి.

నిరాకార బ్రహ్మను కొలవలేము కాబట్టి, ఒక ఆలయం, ఒక ఆకారం, ఒక పూజ, ఒక అభిషేకం, షోడశోపచారాలు, ఉపాసనలు, ధ్యానాలు ఇవ్వబడ్డాయి. పూజ చేయాలంటే ఆకారం కావాలి. ధ్యానం చేయాలంటే ఈశ్వరగుణాలు తెలియాలి. మనుష్యుల రుచులు అనంతం కాబట్టి, వాటికి తగ్గట్టుగా అనేక దేవుళ్ళను ఇచ్చారు మన పురాణాల్లో. ఈ దేవుళ్ళమీద అనేక పురాణగాథలు కూడా ఉంటాయి.

భాగవతం చదివితే, అనేకమైన కథలు ఉన్నాయి. ఈ కథలన్నీ పూజలు చేయటానికి తోడ్పడుతాయి. ఇలా సగుణ ఈశ్వరుడు లేకపోతే శివరాత్రి, శ్రీరామనవమిలాంటి పండుగలు ఎలా ఉంటాయి? మన ఆలయాల వెనుక బోలెడు కథలు ఉంటాయి. ఇటువంటి మతపరమైన వాతావరణం సృష్టించటంకోసం అనేక గాథలు వెలిసాయి, అనేక స్థలపురాణాలు ఉన్నాయి.

స్వామీజీ ఒకసారి నాగపూర్ దగ్గర ఉన్న రామ్‌టెక్ అనే ఊరికి వెళ్ళారు. అక్కడ రాముడి ఆలయం ఒక కొండమీద ఉంది. స్వామీజీ, ఊర్లోకి అడుగుపెడుతూనే వారు ఆ ఆలయం గురించి ఒక కథ చెప్పసాగారు. రాముడు వనవాసం చేసినప్పుడు, ఈ ప్రాంతం దండకారణ్యం పొలిమేరల్లో ఉందిట.

అక్కడ రాముణ్ణి ఎందరో ఋషులు పలకరించి, ఒక అస్థిపంజరాల గుట్టను చూపించారుట. ఆ అస్థిపంజరాలు ఎవరివి అని శ్రీరాముడు అడిగితే, ఋషులు అవి తక్కిన ఋషులవనీ, వారందరినీ దండకారణ్యంలో ఉన్న అనేక రాక్షసులు సంహరించారనీ చెప్పారుట. అవి ఆ ఋషుల ఎముకలు, అస్థిపంజరాలు అని చెప్పారుట. వెంటనే రాముడు తను వనవాసంలో ఉండగా ఆ అసురులందరినీ సంహరిస్తానని ప్రతిజ్ఞ చేశాడుట.

రాముడు ప్రతిజ్ఞ చేయటంవల్ల ఆ ప్రాంతానికి రామ్‌టెక్ అనే పేరు వచ్చిందట. హిందీలో టెక్ అంటే ప్రతిజ్ఞ. అలా భారతదేశంలో ఎక్కడికి వెళ్ళినా

అనేక స్థలపురాణాలు వింటాము. రాముడు, కృష్ణుడు, పాండవులు తిరిగిన అనేక ప్రాంతాలను చూస్తాము.

గౌణ ఈశ్వరుడు ఉన్నాడా లేదా అని ప్రశ్నించకూడదు. ఈ గౌణ ఈశ్వరుణ్ణి మన సాధనకోసం ఇచ్చాయి పురాణాలు. పూజ, జపం, ధ్యానం చేయటానికీ, మతపరమైన సంస్కృతిని నెలకొల్పటానికీ ఈ సగుణ ఈశ్వరుడు తోడ్పడుతాడు. మనకు అనేక కీర్తనలు కూడా ఈ సాకార రూపాన్ని వర్ణించటానికి వచ్చినవే. అనేక నాట్యాలు ఈ దేవతామూర్తులను వర్ణిస్తాయి. అనేక సినిమాలు పౌరాణిక గాథలను ఆధారంగా చేసుకుని వచ్చాయి. మనకు వాల్ట్ డిస్నీ, హారీపాటర్లు అవసరం లేదు. మనకే బోలెడు రాక్షస సంహారగాథలు ఉన్నాయి, బోలెడు శక్తియుక్తులతో, మాయా మంత్రాలతో కూడిన గాథలు ఉన్నాయి.

నృత్యగీతాలే కాదు, కళలు, చిత్రలేఖనం, శిల్పకళలు అన్నీ వాటినుంచి వచ్చినవే! అందువల్ల గౌణ ఈశ్వరుడు ఉన్నాడా లేదా అని అడగకండి. గౌణ ఈశ్వరుణ్ణి పూజ చేయటానికి, మనస్సును సంస్కరించుకుని తద్వారా ముఖ్య ఈశ్వరుణ్ణి అర్థం చేసుకోవటానికి వినియోగించుకోండి. గౌణ ఈశ్వరుడు ప్రత్యక్షమవ్వాలని కోరుకోకూడదు. ఆయన దర్శనం కావాలని కోరుకుంటే, మీకు నిజంగా దర్శనమయ్యాడో, లేక అది మీ భ్రమో అర్థం కాదు.

అందువల్ల దేవుడు ఉన్నాడా లేదా అనే ప్రశ్నను మన గౌణ ఈశ్వరుడి విషయంలో తీసుకోము. ముఖ్య ఈశ్వరుని గురించి తీసుకుంటాము. ఆ నిర్గుణ బ్రహ్మ అనంత అసంగ చైతన్యం అని చూశాము. రాముడు, కృష్ణుడు, ఈశ్వరుడు ఉన్నాడా లేదా లాంటి ప్రశ్నలు వేయకండి. ఆ కథలను కథలుగా ఆస్వాదించండి, కాని తర్వాత ముఖ్య ఈశ్వరునికి రండి. అప్పుడు సమస్య ఉండదు.

కాని వచ్చిన చిక్కేమిటంటే అందరూ గౌణ ఈశ్వరుడు ఉన్నాడా లేదా అని అడుగుతున్నారు. అలా అడిగితే మీకు సమాధానం ఎన్నడూ దొరకదు. పూజ చేయండి, ధ్యానం చేయండి, నిరాకార బ్రహ్మను తెలుసుకోండి. మోక్షం పొందండి.

ఈశ్వరుడు, ఈశ్వరజ్ఞానం, ఈశ్వరప్రాప్తి గురించిన వైదికపద్ధతి ఇది.

# 2. భగవద్దృష్టి

మన సాంప్రదాయంలో, ఈశ్వరారాధన లేదా ఈశ్వరపూజను నిత్యకర్మగా భావిస్తారు. నిత్యకర్మ అంటే చేసి తీరాల్సిన కర్మ. శాస్త్రం నిర్దేశించిన పంచమహాయజ్ఞాల్లో దైవయజ్ఞం ఒకటి. ఈ దైవయజ్ఞం భగవంతునితో మనకు ఉన్న సంబంధాన్ని పటిష్ఠపరుస్తుంది.

జీవితంలో ముందుకు సాగుతున్నకొద్దీ, మనకు ఎంతోమందితో అనుబంధం ఏర్పడుతూ వస్తుంది. మన కుటుంబసభ్యులతో, బంధుమిత్రులతో,తోటి ఉద్యోగులతో, ప్రతి ఒక్క సంబంధమూ అవసరం, ముఖ్యం కాని మన శాస్త్రం ఒక్క సంబంధాన్ని ప్రాథమిక, ప్రధాన సంబంధంగా కీర్తిస్తుంది. అది భగవంతునితో అనుసంధానం చెందటం. ఎందుకు?

ఈశ్వరునితో మన అనుబంధం నిరంతరం కొనసాగే, శాశ్వత సంబంధం. అది జన్మ జన్మల అనుబంధం. ఈశ్వరుడు సృష్టికర్త. మనం సృష్టి చేయబడ్డ జీవులం. అందువల్ల మన మధ్య కారణ-కార్య సంబంధం ఉంది. తక్కిన సంబంధాలన్నీ తాత్కాలికమే. మనుష్యులుగా మనం శాశ్వతం కానప్పుడు, తోటి మనుష్యులతో మనకు ఏర్పడే సంబంధం ఎలా శాశ్వతమవుతుంది?

ఒక నదిలో తేలుతున్నప్పుడు, కొన్ని దుంగలు ఒకచోట చేరినట్టుగానో, ఒక రైలు ప్రయాణంలో కొందరితో పరిచయం అయి, కాసేపు కలిసి ప్రయాణం చేసినట్టుగానో, మనం తోటివారితో కలవటం కూడా తాత్కాలికంగానే ఉంటుంది. తాత్కాలిక సంబంధం సహజంగానే తాత్కాలికమైన లాభాన్నే ఇస్తుంది. శాశ్వతమైన ప్రయోజనం కావాలంటే ఆ సంబంధం కూడా శాశ్వతమై ఉండాలి. అందువల్ల మన శాస్త్రాలు దేవునితో మన అనుబంధాన్ని పెంచి పోషించుకోమంటున్నాయి.

మన తాత్కాలిక సంబంధాలను నిలబెట్టుకోవటంకోసం, మనం ఏదో ఒక పనిచేస్తూనే ఉంటాము. కుటుంబసభ్యులకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతాము. స్నేహితుల ఇళ్ళకు వెళతాము, పెళ్ళిళ్ళలో పాలుపంచుకుంటాము. ఈ అనుబంధాలను దృఢపరచుకోవటంకోసం చాలా సమయాన్ని, శ్రమను ఖర్చుపెడతాము. అలాంటప్పుడు, భగవంతునితో ఉన్న అనుబంధాన్ని పెంచి పోషించుకోవటానికి, దృఢపరచుకోవటానికీ ప్రతిరోజూ కాస్త సమయాన్నైనా వెచ్చించవద్దా? అది ఈశ్వరపూజవల్ల సాధ్యమవుతుంది.

ఇక్కడ ఒక సమస్య ఎదురవుతుంది మనకు. సర్వవ్యాపకమైన, నిర్గుణచైతన్యాన్ని ఎలా పూజించగలము? దేవుడు నిరాకారుడు కదా! మన అవస్థను ముందే ఊహించినట్టుగా, శాస్త్రం మనను ఆదుకోవటానికి ముందుకు వస్తున్నది. మనం పూజ చేయటానికి అనువుగా, దేవునికి ఒక ఆకారాన్నిచ్చాయి. 'నిరాకార బ్రహ్మను అర్థం చేసుకోలేని వారిమీద అభిమానం కొద్దీ సాకారబ్రహ్మను, అంటే విశిష్టగుణ సంపన్నుడైన పరమాత్మను ఇవ్వటం జరిగింది,' అంటున్నాయి శాస్త్రాలు. అలా రూపంలేని దేవునికి రూపమివ్వటం జరిగింది. అది మన వైదిక మతం యొక్క గొప్పతనం.

మానవ మేధస్సు నానాత్వం కోరుకుంటుంది కాబట్టి, లోకోభిన్న రుచి కాబట్టి, శాస్త్రం మనకు అనేక భిన్నరూపాలను ఇచ్చింది. శివుడు, విష్ణువు, దేవి, రాముడు, కృష్ణుడు, అర్ధనారీశ్వరుడు, గణేశుడు, నరసింహుడు, హనుమంతుడు, మనిషి ఆకారం, స్త్రీ పురుషులు కలిసిన ఆకారం, జంతువు-మనిషి కలిసిన ఆకారం, జంతు ఆకారం- ఇలా ఎన్నో ఎన్నెన్నో! ఈ దేవుళ్ళు పూజలకే కాక, ఉపాసనలకు కూడా అనువుగా ఉంటారు.

ఈశ్వరపూజ, ఈశ్వర ఉపాసనలవల్ల ఇంకేదైనా ప్రయోజనం ఉందా? నిజానికి ఈ పూజలు ఆధ్యాత్మిక మార్గంలో మొదటి అడుగును సూచిస్తాయి. క్రమం తప్పకుండా నిత్యమూ ఈశ్వరపూజ, ఉపాసన చేస్తే, చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత ఏర్పడుతాయి. ఇవి ఏర్పడ్డాక, రెండవ అడుగు వేదాంతవిచారణ. అంటే శాస్త్రాన్ని ఒక క్రమపద్ధతిలో అధ్యయనం చేయాలి. ఉపనిషత్తులను నేర్చుకోలేకపోతే, కనీసం భగవద్గీతను అధ్యయనం చేయాలి.

**పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్॥ గీత**

ఉపనిషత్తులన్నింటినీ ఆవులు అనుకుంటే, వాటినుంచి పితికిన పాలు గీతామృతం. భజగోవిందంలో ప్రతి ఒక్క గృహస్థు భగవద్గీతను పారాయణం చేయాలని వస్తుంది.

**భగవద్గీతా కిఞ్చిదధీతా - భజగోవిందం**

**ఏతద్యోనీని భూతాని సర్వాణీత్యుపధారయ।**

**అహం కృత్స్నస్య జగతః ప్రభవః ప్రళయస్తథా॥ గీత - 7-6**

ఓ అర్జునా! సమస్త ప్రాణులు ఈ రెండు విధాలైన ప్రకృతులు- పరాప్రకృతి, అపరాప్రకృతి- నానుంచే ఉత్పన్నమవుతున్నాయి. ఈ జగత్తుయొక్క సృష్టి, ప్రళయం

రెండూ నానుంచే జరుగుతున్నాయి. అంటే ఈ సంపూర్ణజగత్తుకు నేనే మూలకారణం. భగవంతుడు జగత్కారణం. ఆయనే పంచభూతాలుగా, పాంచభౌతిక వస్తువులుగా అయ్యాడు.

ఆ విధంగా ఈశ్వరుడే పరాప్రకృతిగా, అపరాప్రకృతిగా ఈ ప్రపంచంలో ఉన్నాడు. మనం చూస్తున్న, అనుభవిస్తున్న ఈ ప్రపంచం ఈశ్వరుని వ్యక్తరూపం తప్ప మరేం కాదు.

**రసో౽హమప్సు కౌంతేయ ప్రభా౽స్మి శశిసూర్యయోః।**
**ప్రణవః సర్వవేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు॥**
**పుణ్యో గంధః పృథివ్యాం చ తేజశ్చాస్మి విభావసౌ।**
**జీవనం సర్వభూతేషు తపశ్చాస్మి తపస్విషు॥ – గీత 7-8,9**

ఓ అర్జునా! జలములో రసాన్ని నేనే. సూర్యచంద్రులలో కాంతిని నేనే. వేదాలలోని ఓంకారం, ఆకాశంలోని శబ్దం, పురుషులలోని పౌరుషాన్ని నేనే. పృథ్విలోని పవిత్రమైన పరిమళాన్ని, అగ్నిలోని తేజస్సును, సమస్తప్రాణులలో జీవశక్తిని, తాపసులలో తపస్సును నేనే.

జగత్ దృష్టి అంటే ఈశ్వరదృష్టి. ఆకాశాన్ని చూస్తే దర్శనమిచ్చేది ఆకాశం కాదు ఈశ్వరుడు. చల్లగాలి మనను హాయిగా తాకుతుంటే, ఆనందించేది గాలి స్పర్శను కాదు, ఈశ్వరదర్శనాన్ని; అగ్నిని చూస్తే అది వంటింట్లోనైనా సరే, అది కూడా ఈశ్వర దర్శనమే. మనం చేసే ప్రతి పనీ ఈశ్వరునితో చేసినట్టే. నీళ్ళు త్రాగితే ఈశ్వరుడు, పూలుకోస్తే ఈశ్వరుడు, గాలి పీలిస్తే ఈశ్వర అనుగ్రహం. అలా ఈశ్వరుని దర్శనం సదా ఉంటుంది.

శాస్త్రం చదవటంవల్ల మన భావనలో మార్పు వస్తుంది. తద్వారా ఈశ్వరదర్శనం ఒకసారికాదు, ఎల్లప్పుడూ అవుతూనే ఉంటుంది. మనం చేసే ప్రతి పనిలోనూ, మనం పొందే ప్రతి అనుభవంలోనూ కలగలిపి ఉంటుంది. అందువల్ల వైదికవిద్యార్థికి, ఈశ్వరదర్శనం క్షణమాత్రం మెరసి మాయమయ్యేది కాదు, క్షణ క్షణం అనుభూతికివచ్చేది. ఈ దర్శనాన్నే భగవద్గీతలో **విశ్వరూప ఈశ్వరదర్శనం** అంటారు.

శాస్త్రం చెబుతుంది, 'ఓ పృథివీ మాతా, సముద్రములు వస్త్రాలుగానూ, కొండలు వక్షస్థలంగానూ ఉన్న నీకు నా నమస్సులు. నీమీద నేను కాలిడినందుకు నన్ను క్షమించు.'

**జగత్తును సరిగ్గా అర్థంచేసుకుంటే ఈశ్వరుడు**
**ఈశ్వరుణ్ణి సరిగ్గా అర్థం చేసుకోకపోతే జగత్తు**

జగత్తును ఈశ్వరుడిగా అర్థం చేసుకున్నాక, మనం అనుభవించే ప్రతి ఒక్క అనుభవం కూడా– అది ఆనందమవనీ, దుఃఖమవనీ– ఈశ్వరప్రసాదంగా స్వీకరిస్తాము. దాని ఫలితంగా, మన జీవితంలో అనూహ్యమైన మార్పు వస్తుంది. మనకు దేనిమీదా రాగద్వేషాలు ఉండవు. ఆధ్యాత్మిక ఉన్నతి వేగంగా కలుగుతుంది. ఉన్నతి కలిగినకొద్దీ, కామక్రోధాలు తొలగిపోయి జాలి, దయవంటి సానుకూల భావనలు కలుగుతాయి.

భగవద్గీత పదకొండవ అధ్యాయంలో భగవంతునికి వేలాది తలలు, కాళ్ళు, చేతులూ ఉన్నట్టుగా వర్ణన వస్తుంది. నిజంగా భగవంతునికి అలా అనేక కాళ్ళూ, చేతులూ ఉన్నాయని కాదు దాని అర్థం. దాని అర్థం, జీవరాశులందరి కాళ్ళు, చేతులూ భగవానునికే చెందుతాయి. ఈ భగవద్దృష్టికోసం పాటుపడాలి మనమంతా.

రుద్రంలో అన్నీ శివుడే అంటుంది. చెట్టును శివుడిగా చూడు, ఆకును శివుడిగా చూడు, పువ్వును శివుడిగా చూడు,వేరుని శివుడిగా చూడు అంటుంది. నిజానికి రుద్రమంతా విశ్వరూపదర్శనం. నేను ఏది చూసినా భగవంతుడే, చూసే నేను కూడా భగవంతుడే. అందువల్ల మన శాస్త్రం నిర్దేశించిన ఆధ్యాత్మిక మార్గం ఇలా ఉంది– **ఈశ్వరపూజ, ఈశ్వర ఉపాసన, చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత, వేదాంత విచారణ, ఈశ్వరదర్శనం, ఈశ్వరఐక్యం.**

మనకు ఆధ్యాత్మిక మార్గంలో ముందుకుపోకుండా అడ్డుకునే ఒక పెద్ద ఆటంకం, ఈశ్వరపూజ గురించి మనకున్న అపోహ. ఈశ్వరపూజ క్రమం తప్పకుండా, ప్రతిరోజూ శ్రద్ధగా, భక్తిగా చేస్తే ఈశ్వరుడు మనకు ప్రత్యక్షమవుతాడు అనే అపోహ ఉంది. ఈశ్వరుని వర్ణన ప్రకారం నీలకంఠుడు, జటాఝూటధారి మన ముందు ప్రత్యక్షమవకపోతాడా అని ఎదురుచూస్తాము. అలా ఏ దేవుణ్ణి పూజించే భక్తులు, ఆ దేవుడు ప్రత్యక్షం కావాలని కోరుకుంటారు. కాని ఇది ఒక అపోహ మాత్రమే.

ఈశ్వరదర్శనం అంటే ఈశ్వరుడు ఒక వ్యక్తిగా మన ముందుకు రావటం కాదు అంటుంది శాస్త్రం. మన ఇష్టదైవం మన ముందు ప్రత్యక్షమవటం అనేది

శాస్త్రం ఒక పెద్ద విశేషంగా పరిగణించదు. ఏదైతే పరిమితమైనదో, ఏదైతే అశాశ్వతమో, అది ఒక అధ్యాత్మిక సాధకునికి అంతిమలక్ష్యం కాకూడదు.

**యద్వాచాఽనభ్యుదితం యేన వాగభ్యుద్యతే।**
**తదేవ బ్రహ్మ త్వం విద్ధి, నేదం యదిదముపాసతే॥ - కేన 1-4**

వాక్కు వివరించలేనిది, కాని వాక్కుకు ఆ శక్తి ఆత్మవల్లనే వస్తుంది. నువ్వు పూజించే దేవుడు (నిర్గుణ) బ్రహ్మ కాదు; పూజించేనువ్వు (చైతన్యపరంగా నిర్గుణ) బ్రహ్మవు. మనకంటూ ఒక దేవుడు ఉండాలి. అది ఎంతవరకూ? ఈశ్వరపూజ చేయటానికి. కాని ఈశ్వరపూజ చేసేది ఎందుకు? దేవుని సాక్షాత్కారం పొందటానికి కాదు, చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత పొందటానికి.

అందువల్ల, మనం ఈశ్వరపూజ చేసేటప్పుడు దేవుడు ఒక వ్యక్తి కాదు, మొత్తం విశ్వం అని గుర్తుంచుకుంటేచాలు.

విష్ణుసహస్రనామంలో - విష్ణుమూర్తి పాదాలు భూమి, నాభి ఆకాశం, ప్రాణం గాలి, కళ్ళు సూర్యచంద్రులు; చెవులు దిక్కులు; తల స్వర్గం, నోరు అగ్ని, ఆయనలోనే విశ్వంలో ఉన్న దేవుళ్ళు, మనుష్యులు, పక్షులు, ఆవులు, పాములు, గంధర్వులు, అసురులు ఆశ్చర్యంగా నృత్యం చేస్తుంటారు. అలాగే రుద్రం ధ్యానశ్లోకం చూస్తే- గిన్నెలా వంగిన ఆకాశం శివలింగం. భూమి శివలింగానికి ఆధారం. మేఘాలు పైన కట్టిన నీటి కుండ, నక్షత్రాలు పూలమాలలు. గ్రహాలు విడిపువ్వులు, చంద్రుడు, అగ్ని, సూర్యుడు ఆయన నేత్రాలు. సప్తసముద్రాలు ఆయన ఉదరం. మేరుపర్వతం ఆయన మంచం, ఏడు పాతాళలోకాలు ఆయన పాదాలు. ఆరు అంగాలు గల వేదాలు ఆయన నోరు. మొహం పది దిక్కులవైపు తిరిగి ఉంది. ఇటువంటి మంగళకరమైన శివలింగానికి నేను నమస్కారం చేస్తున్నాను.

మనం శివరాత్రి రోజు చేసే ఈశ్వరపూజ జగమంతా ఈశ్వరుడు వ్యాపించి ఉన్నాడని మనకు గుర్తు చేయుగాక! **ఈశావాస్యమిదగ్ం సర్వమ్**

## స్వామీజీ సూక్తిముక్తావళి

కళ్ళు తమను తామే చూసుకోలేనప్పుడు, కళ్ళు తమ వెనుక ఉండి తమను చూసే సాక్షిని ఎలా చూడగలవు?

# 3. ప్రార్థన ఎలా చేయాలి?

మన దేశంలో నూతన సంవత్సరం అన్ని జాతుల వారికీ ఒకేరోజు రాదు. తెలుగువారికి ఒక రోజు వస్తే, తమిళులకు ఇంకో రోజు వస్తుంది. దీన్నిబట్టి ఒక విషయం గ్రహించాలి మనం. కొత్త సంవత్సరం ఆద్యంతిక సత్యం కాదు, ఆపేక్షిక సత్యం. అందువల్ల కొత్త సంవత్సరం ఎవరిది అన్నది కాదు ప్రశ్న! నూతన సంవత్సర వేడుకలలో ఏం చేస్తున్నామన్నది ముఖ్యం! ఈ రోజు మనని మనం ఒకసారి ఆత్మపరీక్ష చేసుకోవాలి.

**జంతూనాం నరజన్మ దుర్లభమ్**

మనం మనిషిగా పుట్టామంటేనే దానికి ఎంతో పుణ్యం చేసుకున్నామని అర్థం. ఇంత పుణ్యంవల్ల వచ్చిన ఈ అవకాశాన్ని ధారపోసుకోకూడదు. ఉన్నతంగా ఎదగటానికి ప్రయత్నం చేయాలి. లేకపోతే జీవితం యాంత్రికంగా సాగిపోతుంది. మనం ఎదుగుతున్నామా లేదా అని బేరీజు వేసుకోవాలి. ఎంత ఎదుగుతున్నాము, దానికి ఎంత ప్రయత్నం చేస్తున్నాము అన్నది పక్కన పెట్టాలి. ఎందుకంటే ఎదుగుదల అందరికీ, అన్నింటికీ సమానంగా ఉండదు. వెదురుమొక్క వేగంగా ఎదిగితే, మరికొన్ని మొక్కలు చాలా నెమ్మదిగా ఎదగవచ్చు. ఎవరు ఎంత త్వరగా ఎదగాలో ముందే నిర్ణయించబడి ఉంటుంది. అందుకని మనం ఎదుటివారితో పోల్చుకోకూడదు. వారు మనకన్నా త్వరగా ఎదుగుతున్నారని వారిమీద ఈర్ష్య పడకూడదు. అలాగే మనను మనం కించపరచుకుని బాధపడకూడదు.

మనందరికీ దైవకృప మెండుగా ఉంది. కొంతమంది భారమంతా దేవుని మీదే వేస్తారు. 'అంతా ఆయన కృప,' అంటారు. అందువల్ల వారు దేనికీ బాధ్యత వహించరు. అంటే బాధ్యతగా ఏదీ చేయరు. ఇంకోరకం వారు ఉంటారు. 'నేనేది తలచుకుంటే అది సాధిస్తాను,' అంటారు, గర్వంతో కన్నులు మూసుకుపోయిన వారు. అటువంటి వారు కొందరు ఎంతో ఉన్నత స్థాయినుంచి అథోగతి పాలవటం కూడా చూస్తూనే ఉంటాము.

అందువల్ల పూర్తిగా ఈశ్వరునిమీదా వదలకూడదు. పూర్తిగా మన గొప్ప అనుకోకూడదు. మనవంతు ప్రయత్నం మనం చేసి, తక్కిన భారం భగవానుని మీద వేయాలి. అంటే భగవంతుణ్ణి ప్రార్థించాలి. ఆలయాలు దర్శించాలి.

పరమాత్మను ప్రార్థించేటప్పుడు కొన్ని నియమాలను పాటించాలి. ఏది పడితే అది కోరకూడదు. ఏది సాధ్యమో దాన్నే కోరాలి. భగవంతుడు సర్వశక్తివంతుడు కదా, ఆయనకు సాధ్యం కానిది ఏముంది అనకూడదు. పురాణగాథల్లో రాక్షసులు పరమాత్మ గురించి తీవ్రమైన తపస్సు చేసేవారని చదివాము. ఎవరి గాథ చూసినా సారాంశం ఒకటే. ఈశ్వరుడు ప్రత్యక్షమై, 'భక్తా, నీకేమి కావాలో కోరుకో,' అని వరమివ్వటానికి సిద్ధపడినప్పుడు, ఏ రాక్షసుడైనా అడిగింది ఒకటే, 'నాకు మరణం లేకుండా చేయి.' దానికి ఈశ్వరుని జవాబు, 'అది కాక, మరేదైనా కోరుకో.'

ఈశ్వరుడు మనం కోరిన కోరికలు తీర్చలేకపోతే, సర్వశక్తివంతుడు ఎలా అవుతాడు? ఈ ప్రశ్న అడిగేముందు, సర్వశక్తివంతుడు అంటే అర్థం ఏమిటో తెలుసుకోవాలి మనం. **సర్వశక్తివంతుడు** అంటే సాధ్యమైన ప్రతిదాన్ని తీర్చగలిగినవాడు అని అర్థం. మనమేం చేస్తున్నాం? అసాధ్యమైన కోరికలు కోరి, వాటిని పొందలేకపోయేసరికి, ప్రార్థనమీద నమ్మకం పోగొట్టుకుంటున్నాము. ఇంకా మాట్లాడితే, ఒక్కో సందర్భంలో దేవుని ఉనికినే సందేహించే పరిస్థితికి చేరుకుంటున్నాము.

అందువల్ల, మనం ప్రార్థన చేసేటప్పుడు, ఏం కోరుకోవాలో తెలుసుకోవాలి ముందు. అప్పుడు, ఆశాభంగం కలిగే ఆస్కారం ఉండదు.అసాధ్యమైన విషయాలను కోరుకోకూడదు. ఏమిటా అసాధ్యమైన విషయాలు?

**1. నన్ను బాధ్యతలనుంచి, కర్మలనుంచి తప్పించు–** మనం జీవించి ఉన్నంతకాలం శరీరం చురుకుగా ఉండాలి, మనస్సు అంతకన్నా చురుకుగా, పదునుగా ఉండాలి. శరీరం, మనస్సుల ధర్మం చురుకుగా ఉండటం. అలాంటప్పుడు, 'ఓ దేవా, నన్ను బాధ్యతలనుంచి, కర్మలనుంచి తప్పించు,' అని కోరటం అసాధ్యమైన కోరిక కిందకే వస్తుంది. పిల్లలను కన్నామంటేనే, వారికి సంబంధించిన బాధ్యతలను చేపట్టి తీరాలి. అంటే మనవళ్ళ సేవ కూడా చేసి తీరాలి. అవి తప్పించుకోలేము. ఒకవేళ తప్పించుకోవాలని ఏ ఆశ్రమంకో పారిపోతే, అక్కడ ఆశ్రమ బాధ్యతలు ఎదురవుతాయి. అదీ వద్దనుకుని ఆశ్రమంనుండి పారిపోయి, దేశదిమ్మరిగా తిరిగితే, మొత్తం దేశం బాధ్యత మనమీద పడుతుంది. అందుకని బాధ్యతలు తీరుతాయి, విశ్రాంతి తీసుకుందామని అనుకోకూడదు. దాని గురించి ప్రార్థన చేయకూడదు. బ్రతికి ఉన్నంతకాలం ఉత్సాహంగా ఉండాలి. కర్మలను తప్పించుకోలేము. అందువల్ల బాధ్యతలనుంచి తప్పించు అని ప్రార్థించే బదులు, బాధ్యతలు కలుగచేసే

విసుగునుంచి నన్ను తప్పించమని కోరుకోవాలి. 'ఓ దేవా, నేను చేసిన పనులన్నీ సంతోషంగా నిర్వర్తించేటట్టు చేయి. నేను చేసే పనులన్నింటిలోనూ నేను స్ఫూర్తిని పొందేలాగా చేయి. నేను చేసే పనులన్నింటినీ ఆనందించేలా చేయి.'

**2. నేను ఎప్పుడూ విజయం సాధించేలా చేయి–** భవిష్యత్తు అనేది ఎన్నడూ మన చేతిలో లేదు. అది మన భవిష్యత్తు కావచ్చు. మన పిల్లలది కావచ్చు. మనం పని చేసే సంస్థది కావచ్చు. ఆఖరికి ప్రపంచానిది కావచ్చు. అందువల్ల 'ఓ దేవా, నేను ఎప్పుడూ విజయం సాధించేలా చేయి. నేను ఎప్పుడూ ఐశ్వర్యంలో తులతూగేలా చేయి. నా పిల్లలు ఎప్పుడూ చదువులో ఉన్నతంగా ఉండేలా చేయి,' అనే ప్రార్థనలు చేస్తున్నామంటే, వాటి అర్థం మనం భవిష్యత్తుమీద అధికారాన్ని పరోక్షంగా కోరుకుంటున్నామన్నమాట. ఎప్పుడైతే భవిష్యత్తుమీద అధికారాన్ని సూచించే ప్రార్థన చేయటానికి ప్రయత్నిస్తామో, అప్పుడే దారుణంగా ఓడిపోతాము.

అందువల్ల భవిష్యత్తును అదుపులో పెట్టుకోవాలని చూడకుండా, భవిష్యత్తుకు తోడ్పడవచ్చు. భవిష్యత్తుమీద అధికారం చెలాయించటం కాదు, భవిష్యత్తుకు తోడ్పడాలి. మనం విజయం సాధించటంలో, ఐశ్వర్యం పొందటంలో, పిల్లలు చదువులో ఉన్నతంగా ఉండటంలో మనవంతు కృషి చేయవచ్చు. అందువల్ల భవిష్యత్తును నిర్దేశించే ప్రార్థన జోలికి పోవద్దు మనం. మనం భవిష్యత్తు ఉజ్జ్వలంగా సాగటానికి మనవంతు సహాయం చేసేటప్పుడు దాన్ని ఉత్సాహంగా, ఉల్లాసంగా చేద్దాము.

శ్రీకృష్ణభగవానుడు తలచుకుంటే మహాభారతయుద్ధాన్ని ఆపి ఉండగలిగేవాడు. కాని ఆ యుద్ధంలో ధర్మం గెలిచేలా తన వంతు సహాయం చేశాడు. అవతార పురుషులే భవిష్యత్తును నియంత్రించటానికి ప్రయత్నించనప్పుడు, మనబోటి మామూలు మనుష్యులం ఎంత? అందువల్ల మన ప్రార్థన ఇలా ఉండాలి, 'ఓ దేవా, నా శాయశక్తులా నేను ప్రయత్నిస్తాను. నేను చేసే పనిని నేను ఆనందించేటట్టు చేయి. ఆ పనిని నేను ఉల్లాసంగా, ఉత్సాహంగా చేసేటట్టు చేయి.'

**3. నేను ఎదుటివారిని మార్చేలా చేయి–** ఇతరులను మార్చటం మన చేతిలో లేదు అనే విషయం మనం గ్రహించాలి. అవతారపురుషులే ఆ ప్రయత్నం చేయలేదు. దుర్యోధనుణ్ణి మార్చటానికి కృష్ణుడు ప్రయత్నించలేదు. రావణాసురుణ్ణి మార్చటానికి రాముడు ప్రయత్నించలేదు. అందువల్ల మానవమాత్రులమైన మనం కూడా

ఇతరులను మార్చటానికి ప్రయత్నించకూడదు. ఇతరులను మార్చటానికి ప్రయత్నిస్తే, మనమే దారుణంగా ఓడిపోతాము. మన జీవితం మనకు భారంగా అవుతుంది. ఎందువల్ల?

మనం ఎంతసేపూ ఎదుటివారిని మన దృక్కోణంలోంచే చూస్తాము.

అది సరియైన నిర్ణయమెలా అవుతుంది? ఎదుటివారు సరిగా లేరు, వారు మారాలి అని మనం కోరుకున్నట్టే, వారు కూడా మనం మారాలనుకుంటారు. వారి దృష్టిలో మనం సరిగా లేము. ఫలితం? అపోహలు, అపార్థాలు. ఎవరైనా సలహా అడగందే ఇచ్చినా, సహాయం కోరందే చేసినా, దాన్ని ఎవరూ స్వీకరించరు. మనం సలహా ఇచ్చినట్టే, వారూ మనకూ ఇద్దామనుకుంటారు. దాన్ని మనం ఎలా స్వీకరిస్తాము?

అందువల్ల 'ఓ దేవా, నేను ఎదుటివారిని మార్చేలా చేయి,' అనే ప్రార్థన తప్పు. 'ఓ దేవా, ఎదుటివారి ఎదుగుదలకు నేను తోడ్పడేలా చేయి. వారి ఉన్నతిని నేను ప్రేరేపించేలా చేయి,' అని ప్రార్థించాలి.

ఎదుటివారిని మనం రెండురకాలుగా ప్రభావితం చేయగలము. సరిగ్గా చూడండి. మార్చటం కాదు, ప్రభావితం చేయగలము. ఎలా? ప్రత్యక్షంగా మన మాటలద్వారా, పరోక్షంగా మన జీవన విధానంద్వారా. ఈ ప్రయత్నంలో మనం సఫలీకృతం కావచ్చు, కాకపోవచ్చు. ఎందుకంటే చాలామంది వినటానికి ఇష్టపడరు.మనం మాట్లాడుతుండగానే, తమను సమర్థించుకోవటానికి జవాబు సిద్ధం చేసుకుంటూ ఉండవచ్చు కూడా! మన విషయంలో కూడా అలాగే జరగవచ్చు కూడా!

మనం పరోక్షంగా ప్రభావితం చేయగలిగేది మన నడవడికద్వారా. మన ప్రవర్తన ప్రభావితం చేయవచ్చు, చేయకపోవచ్చు కూడా. అందువల్ల మన ప్రార్థన ఇలా ఉండాలి, 'ఓ దేవా, ఎదుటి వారిని ఉన్నదున్నట్టుగా స్వీకరించగలిగేటట్టు చేయి– మంచి వైపుకు మారుతున్నవారిని, చెడువైపుకు తలవొగ్గుతున్నవారిని, అసలు మారని వారిని కూడా నేను స్వీకరించేటట్టు చేయి.'

**4. ఈ వ్యవస్థ మార్పు–** ఇప్పుడు ఉన్న వ్యవస్థనుంచి మనం పూర్తి సంతృప్తిని కాని, భద్రతను కాని పొందలేము. అలా పొందాలనుకోవటం పగటి కలే అవుతుంది. ఒకవేళ ఆదర్శవంతమైన వ్యవస్థ ఉన్నా కూడా, అది మనకు నచ్చదు. ఆ మాటకొస్తే, పరమాత్మ కూడా ఇప్పటి మన వ్యవస్థను చూసి ఫిర్యాదు చేయవచ్చు. నిజం

చెప్పాలంటే, అందరికన్నా ఎక్కువగా అసంతృప్తి చెందాల్సింది పరమాత్మే. ఎందుకు? ఆయన ప్రపంచాన్ని సృష్టించాడు. జీవరాసులన్నింటినీ సృష్టించాడు, మనకు పాటించటానికి **ధర్మసూత్రాలు** ఇచ్చాడు. అవి పాటిస్తామనే ఆశతోనే కదా ఇచ్చాడు! మనమేం చేస్తున్నాము? ఆ ధర్మసూత్రాల్లో ఒక్కటి కూడా పాటించటం లేదు. అందువల్ల మన ప్రార్థన ఇలా ఉండాలి. 'ఓ దేవా, ఉన్న వ్యవస్థ ఎలా అన్నా ఉండనీ, నేను నాలోనే భద్రత పొందే లాగా చేయి.'

**నాలుగు పదాల్లో చెప్పాలంటే;**

'ఓ దేవా, నేను ఉల్లాసంగా, ఉత్సాహంగా పనులు చేసేలా చేయి. నేను ఏం చేసినా ఆనందించేటట్టు చూడు.

నేను భవిష్యత్తుకు తోడ్పడేలా చేయి; నేను భవిష్యత్తుమీద అధికారం చెలాయించకుండా చూడు.

నేను నా నడవడికద్వారా, నా మాటలద్వారా ఎదుటివారిని ప్రభావితం చేసేలా చేయి. నేను ఎదుటివారిని మార్చటానికి ప్రయత్నించకుండా ఉండేలా చూడు.

నేను నాలోనే ఆనందాన్ని, భద్రతను పొందేలా చేయి; వ్యవస్థ ఎట్లా ఉన్నా కూడా పట్టించుకోకుండా ఉండేలా చూడు.'

ఇటువంటి ప్రార్థన మనం చేస్తే, పరమాత్మ నిస్సందేహంగా మనకు సహకరిస్తాడు. ఈ విధంగా ప్రార్థన చేస్తూ, మన శాయశక్తులా ఎదుగుదాము, తోడ్పడుదాము.

## స్వామీజీ సూక్తిముక్తావళి

సూక్ష్మమైన పనులు చేయటానికి సూక్ష్మతరమైన పరికరాలు కావాలి. ఒక మహావృక్షాన్ని పడగొట్టటానికి పెద్ద గొడ్డలి వాడతాము. అదే కంటిలో శుక్లాలు తీయటానికి లేజర్ కిరణాలు వాడతాము. అలాగే, ఆత్మ గురించిన సూక్ష్మతరమైన అంశాలను తెలుసుకోవడానికి బుద్ధి చాలా పదునుగా, సూదంటురాయిలా ఉండాలి.

# 4. ప్రార్థన మన విధిని మార్చగలదా?

'నా తలరాత అలా రాసి ఉంది, నేనేం చేయగలను?' ఈ మాట తరచు వింటుంటాము. చాలా మంది తమ విధిని తప్పించుకోలేమని ఒక పక్క బాధ పడుతూనే, దాన్నుంచి బయటపడే మార్గమేదైనా ఉందా అని అన్వేషిస్తారు.

**ప్రార్థన మన విధిని మార్చగలదా?**

ఇది పెద్ద అంతుపట్టని ప్రశ్న. కొంతమంది మార్చగలదు అంటారు, కొంతమంది మార్చలేదు అంటారు. తమాషా ఏమిటంటే, ఇరుపక్షాలవారూ శాస్త్రంనుంచే సమాధానం చెబుతారు!

నీ తలరాతను మార్చలేవని చెప్పేవారు, ప్రసిద్ధి చెందిన సంస్కృత శ్లోకాన్ని ఉటంకిస్తారు. బ్రహ్మరుద్రాదులు దిగివచ్చినా, నీ నుదుట రాసి ఉన్న రాతను మార్చలేరు అనేది ఆ శ్లోకంయొక్క సారాంశం! మనం కష్టపడాలని రాసి ఉంటే, కష్టపడక తప్పదు! ఒక పక్క విధిరాతను తప్పించలేమంటూనే, వీరు ప్రార్థనశక్తిని ఒప్పుకుంటారు. 'తలరాతను తప్పించుకోలేనప్పుడు, ప్రార్థించి ఏమిటి లాభం?' అని అడిగితే, మనం తప్పించుకోలేని, క్లిష్టపరిస్థితులను ఎదుర్కొనే గుండె ధైర్యాన్ని ప్రార్థన ఇస్తుందంటారు వారు.

రెండోరకం వారు ప్రార్థన తలరాతను మార్చివేస్తుందంటారు. అది నిరూపించటానికి వారు పురాణగాథలను ఎన్నింటినో చెబుతారు. మృత్యువునే జయించిన కథలు ఉన్నాయి వాటిలో. మార్కండేయుని కథ ఒకటి. మార్కండేయుని జీవితకాలం 16 సంవత్సరాలు మాత్రమే. కాని అతను శివుడిని గట్టిగా పట్టుకోవటం వల్ల, శివుడు ప్రత్యక్షమయి, యమధర్మరాజు మృత్యుకోరలనుంచి అతన్ని తప్పించాడు. మార్కండేయుడు పూర్ణాయుష్షను పొంది, వృద్ధాప్యాన్ని కూడా అనుభవించాడు. అతను పరమేశ్వరుని కీర్తిస్తూ చంద్రశేఖరాష్టకం అనే ప్రార్థనను రచించాడు. 'యమధర్మరాజు ఏంచేయగలడు? పరమేశ్వరుడు విధిని కూడా శాసించగలడు. అందుకు నేనే నిదర్శనం,' అన్నాడు అందులో. సత్యవంతుడు, సావిత్రిల కథ ఇంకో ఉదాహరణ.

ఇప్పుడు రెండు వాదాల్లో ఏది సత్యం? **ప్రార్థన విధిని మార్చగలదా, లేదా?** దీనికి జవాబు ప్రత్యేకంగా ఉంటుంది. **మార్చగలదు, మార్చలేదు.** రెండు

వాదనలూ సరిపోతాయి. అదెలా సాధ్యం? ఒక వాదన సత్యమైతే, ఇంకో వాదన వీగిపోవాలి కదా అనిపిస్తుంది మనకు. ఈ సమస్య ఎందుకు వస్తుందంటే, మనం 'విధి' అనే పదాన్ని అనేక అర్థాలతో వాడతాము. విధిని కర్మఫలంగా నిర్వచించవచ్చు. కర్మఫలం అంటే గతంలో మనం చేసిన కర్మలకు తగ్గట్టుగా మనకు వచ్చిన ఫలితం. విధి అంటే మనం ఊహించినట్టుగా మనం ఈ భూమ్మీదకు వచ్చినప్పుడు బ్రహ్మ తనకు తోచినట్టుగా మన నుదుటిమీద రాసిన రాతలు కాదు! అదే నిజమైతే భగవానుడు పక్షపాత బుద్ధిని చూపినట్టవుతుంది.

విధిని రెండు తెగలుగా విభజించవచ్చు. దుర్బలవిధి, ప్రబలవిధి. దుర్బలవిధి అంటే శక్తి తక్కువగా ఉన్న కర్మఫలం; ప్రబలవిధి అంటే బలంగా ఉన్న కర్మఫలం. ఇప్పుడు 'ప్రార్థన విధిని మార్చగలదా?' అనే ప్రశ్న లేపినప్పుడు, ముందు ఆ విధి ఎలాంటిదో బేరీజు వేయాలి.అది దుర్బల విధా, ప్రబల విధా? దుర్బలవిధి అంటేనే శక్తి తక్కువగా ఉన్నది అని చూశాం కదా! అలాంటప్పుడు దాని శక్తిని ఇంకా తగ్గించటమో, లేదా పూర్తిగా నాశనం చేయటమో చేయవచ్చు ప్రార్థనద్వారా. ప్రబల విధిని మాత్రం ప్రార్థనవల్ల కూడా తప్పించుకోలేము. కాకపోతే, ప్రార్థన మనకు ప్రబల విధిని ఎదుర్కొనేందుకు కావాల్సిన గుండె ధైర్యాన్ని ఇవ్వగలదు! ఆ విధంగా ప్రార్థనకు రెండు విధాల శక్తి ఉంది. మన విధి తగ్గుతూ వస్తున్న కొద్దీ మనం మరింత శుద్ధంగా అవుతూ వస్తాము.

మనం చేసే కర్మలు సమానం కావు కాబట్టి కర్మఫలాలు కూడా అందరికీ సమానంగా ఉండవు. ఉదాహరణకు రుద్రం పారాయణం చేయటమే తీసుకోండి. రుద్రాన్ని ఒకసారి పారాయణం చేయవచ్చు. 11సార్లు పారాయణం చేయవచ్చు; 121 సార్లు పారాయణం చేయవచ్చు. చేసే పద్ధతి, చేసే సంఖ్య మారుతుంది. అంటే ఒక కర్మ చేయటంలో నాణ్యతలో తేడా ఉంటుంది. సంఖ్యలో తేడా ఉంటుంది. కర్మకు తగ్గట్టుగా వచ్చే కర్మఫలం కూడా తదనుగుణంగానే ఉంటుంది. ఈ సూత్రం మనం చేసే అన్ని కర్మలకూ– లౌకిక, ఆధ్యాత్మిక – వర్తిస్తుంది.

పైన చెప్పినట్టుగా ప్రార్థన దుర్బలవిధిని తగ్గించటమో, నాశనం చేయటమో చేస్తుంది. ప్రబలవిధిని భరించే శక్తి సామర్థ్యాలను ఇస్తుంది. ప్రార్థన ఏదైనా కావచ్చు. శతరుద్రీయం (రుద్రం) పారాయణ అన్నిటికన్న శ్రేష్ఠం, ఫలవంతం. కైవల్య ఉపనిషత్తులో ఈ ప్రార్థన గొప్పతనం గురించి వస్తుంది. 'శతరుద్రీయం పారాయణ చేసిన వ్యక్తి, చేయని కర్మలవల్ల కలిగే ప్రత్యవాయ పాపాలనుంచి తప్పించుకుంటాడు.'

అందువల్ల ఆత్మస్వరూపుడైన శివుణ్ణి ప్రార్థిస్తే మంచిది. ఆ విధంగా రుద్రపారాయణం ఒక శక్తివంతమైన **ప్రాయశ్చిత్త కర్మ.**

కొందరికి రుద్రపారాయణం సరిగ్గా చేయాలి, తప్పుగా పారాయణం చేస్తే ఫలితం రాకపోగా, పాపం కూడా రావచ్చు అనే భయం ఉంటుంది. కాని సరిగ్గా రాలేదని నిరాశ చెందనవసరం లేదు. అటువంటి వారికి వేదం ఒక చక్కని రాచబాటను చూపిస్తుంది. రుద్రం మధ్యలో వచ్చే ఒక మంత్రం **నమశ్శివాయ. ఓం నమశ్శివాయ** ఒక్కటి జపిస్తేనే, మొత్తం రుద్రం చదివినంత ఫలమని శాస్త్రాలే ఘోషిస్తున్నాయి.

రుద్రం పారాయణం చేస్తే అది ముందు మనకు ఆపేక్షిక శాంతిని కలుగచేసి, తద్వారా ఆత్యంతిక శాంతిని అంటే మోక్షాన్ని కలుగచేస్తుంది. కైవల్య ఉపనిషత్తు ఈ రుద్రాన్ని నిరంతరం లేదా కనీసం రోజుకొకసారైనా పారాయణం చేయాలి అంటుంది. అటువంటి రుద్రాన్ని మహాశివరాత్రిలాంటి మంగళకరమైన రోజున పారాయణం చేస్తే దాని ఫలితం ఇంకా అద్భుతంగా, ఇంకా శక్తివంతంగా ఉంటుంది. అందువల్ల ఈ మంగళకరమైన శివరాత్రి రోజున, రుద్రపారాయణం రాత్రంతా చేద్దాము లేదా చేయగలిగినంతసేపు చేద్దాము.

# స్వామీజీ సూక్తిముక్తావళి

ఒక వ్యక్తిలో ముగ్గురు జీవులు ఉన్నాయి.

1. పారమార్థిక జీవుడు– ఒక వ్యక్తిలో ఉండే బింబచైతన్యం
2. వ్యావహారిక జీవుడు– చిదాభాస 1
3. ప్రాతిభాసిక జీవుడు– చిదాభాస 2

జాగ్రద్ పురుషుని మనస్సునుంచి ఏర్పడిన చిదాభాసను ప్రాతిభాసిక జీవుడు అంటారు. ఆ వ్యక్తి నిద్ర లేవగానే, స్వప్నపురుషుడు లయమయిపోతాడు. అలాగే వ్యావహారిక జీవుడు, ఈ జాగ్రద్ ప్రపంచం కూడా కలే అని తెలుసుకుని, తన పారమార్థిక స్థాయికి ఎదగాలి.

# 5. ప్రార్థనకున్న విశిష్ట శక్తి

ఈ నూతన సంవత్సరంలో మీరందరూ ఆయురారోగ్య ఐశ్వర్యాలతో తులతూగాలనీ, సమృద్ధిగా ధనం కలిగి ఉండాలనీ కోరుతున్నాను.

నిన్న వాట్సప్‌లో ఒక జోక్ వచ్చింది; మన ప్రధానమంత్రి ఎవరినీ రూపాయలు పెట్టుకోవద్దన్నారు. ఆయన నిబంధనలను ప్రజలు పాటించారో లేదో కాని, అన్ని ఎటిఎమ్ మిషన్లు పాటించాయి.

దాని మాటెలా ఉన్నా, ముందుగా చిన్మయానంద స్వామీజీ చెప్పే కథ ఒకటి చూద్దాము. ఒక విశేషమైన ఊరు ఉందిట. దాన్ని ఎందుకు విశేషమైన ఊరు అన్నారంటే, అక్కడ ఒక వింత ఆచారం ఉందిట. ఆ ఊర్లో ఎవరైనా ఆ ఊరికి రాజు కావచ్చు. అతనికి సమర్థవంతమైన మంత్రులు, ఆఫీసర్లు సమృద్ధిగా ఉంటారు. వారి అండదండలతో, ఎవరు రాజైనా కూడా అతను రాజ్యపాలన చాకచక్యంగా చేయగలడు. అంతేకాదు, రాజుకుండే హోదా, అధికారం, లాభం అన్నీ నిశ్చింతగా అనుభవించవచ్చు. అది కూడా ఒక రోజు కాదు, రెండు రోజులు కాదు, ఐదు సంవత్సరాలు.

కాని దానిలో ఒక తిరకాసు ఉంది. ఐదు సంవత్సరాలు అష్టైశ్వర్యాలు అనుభవించాక, ఐదవ సంవత్సరం చివరిరోజు, చివరి క్షణంలో అతన్ని చిట్టడవిలోకి బహిష్కరించేస్తారు. ఆ అడవి ఎంత కీకారణ్యంలా ఉంటుందంటే, ముందుకు పోలేడు, వెనక్కి తిరిగి రాలేడు. అదికాక, మధ్యలో ఒక విశాలమైన, లోతైన నది ఉంది. దానిలో అన్ని రకాల మొసళ్ళు, తిమింగలాలు స్థిరనివాసం ఏర్పరచుకుని ఉన్నాయి. అంటే ఆ అడవిలో క్రూర జంతువుల పాలబడో, ఈ మొసళ్ళబారిన పడో అతను ఏదో ఒక శుభముహూర్తాన మరణించాల్సిందే! వేరే దారి లేదు.

ఇదీ పరిస్థితి. రాజు అవాలా, వద్దా అనే నిర్ణయం ప్రజలకు వదిలివేశారు. ఐదేళ్ళు రాజభోగాలు అనుభవించవచ్చు. దాని తర్వాత దారుణమైన మరణాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. రాజ్యమా, దిక్కులేని చావా? ఏది కావాలి? బతికుంటే బలుసాకైనా తినొచ్చు అంటారు పెద్దలు. అందువల్ల తర్వాత పరిస్థితికి హడలిపోయిన వారే ఎక్కువమంది. చాలా మంది రాజభోగాల జోలికిపోలేదు .

కాని ఎదురుగుండా అయస్కాంతంలా ఆకర్షిస్తున్న రాజ్యం, పదవి, రాజభోగాలు కొంతమందిని ఆకర్షించాయి. తర్వాత సంగతి దేముడెరుగు,

ఇప్పుడయితే అనుభవించవచ్చు కదా అని హుషారుగా ముందుకు వచ్చారు కొంతమంది. ఐదు సంవత్సరాలు రాజభోగాలతో తులతూగారు. ముందుంది ముసళ్ళ పండుగ అన్న విషయం దాదాపు మర్చిపోయారు! కాని కాలం ఎవరికోసం ఆగదు. ఐదు సంవత్సరాలు గిర్రున తిరిగాయి. వారు అడవిలోకి వెళ్ళాల్సిన నెలలు, రోజులు, క్షణాలు దూసుకువచ్చేస్తున్నాయి. వాటిని ఆపే శక్తి ఎవరికీ లేదు.

మంత్రుల కాళ్ళావేళ్ళాపడ్డారు. ఇంకొక్కరోజు మమ్మల్ని ఆపలేరా అన్నారు. చిట్టడవిలోకే వెళ్ళాలని ఏముంది? రాజ్యంలో ఏదో ఒక మూల, మీకెవరికీ అడ్డురాకుండా పడి ఉంటాము అన్నారు. మంత్రులను బ్రతిమాలారు, బెదిరించారు. ఏం చేసినా ఫలితం శూన్యం. నిబంధన నిబంధనే! చివరిరోజు, మంత్రులు నిర్దాక్షిణ్యంగా అడవికి పంపేశారు. సారంగి వచ్చి వారిని తన పడవలో ఎక్కించుకుని తీసుకువెళ్ళిపోయేవాడు, రాజుల అభ్యర్థనలను పెడచెవిన పెడుతూ! ఇలా కొన్ని సంవత్సరాలు, కొందరు రాజులకు జరిగింది.

చివర్లో వచ్చాడు ఒక తెలివైన రాజు. రాజ్యాన్ని ఎంతో సమర్థవంతంగా ఏలాడు. రాజుగా అష్టైశ్వర్యాలలో తులతూగాడు. ప్రతి క్షణం ఆనందించాడు. పనులు చేశాడు. కాని ఇతనిలో ప్రత్యేకతను గమనించారు అందరూ. ఐదవ సంవత్సరంలో కాలం కరిగిపోతున్నా, అతనిలోని ఆనందం కాని, ధైర్యం కాని చెక్కు చెదరలేదు. అడవికి వెళ్ళాల్సిన భయమే ఏ కోశానా కనపడటం లేదు. ఎవరినీ బ్రతిమాలటం లేదు. ఏమిటితని నిశ్చింత. ఏమిటితని ధైర్యం? ఎవరికీ అంతు చిక్కలేదు.

చివరికి రాజ్యం వీడక తప్పని రోజు రానే వచ్చింది. ఆ రోజు, తక్కిన రాజులందరూ మంత్రులను శతవిధాలా వేడుకున్నారు, బెదిరించారని చూశాము కదా, ఇతను మాత్రం చెక్కుచెదరలేదు. సన్మానసభ ఏర్పాటు చేసినట్టు మంత్రులందరికీ చిరునవ్వుతో వీడ్కోలు చెప్పాడు. వారందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. సారంగి వచ్చాడు అతన్ని లాక్కుపోవటానికి. ఈ రాజు కులాసాగా నవ్వి, 'ఎందుకు లాగుతున్నావు నన్ను? నేను వస్తున్నాను కదా! నన్ను ముట్టుకోకు!' అన్నాడు. ఈసారి ఆశ్చర్యపోవటం సారంగివంతు అయింది.

పడవ ఎక్కినా కూడా హుషారుగా ఉన్న రాజును చూసి కుతూహలం ఆపుకోలేక, ఆ సారంగి అడిగేశాడు. 'ఓ రాజా! మీ ఆనందానికి కారణమేమిటి?' రాజు అప్పుడు తన రహస్యం బట్టబయలు చేశాడు. 'నేను రాజు అయిన మొదటి

రోజే, ఐదు సంవత్సరాల తర్వాత నన్ను అడవిలోకి బహిష్కరిస్తారని నాకు తెలుసు. కాని  రాజుగా నాకు అధికారం, శక్తి సామర్థ్యాలు ఉన్నాయి కదా! అందువల్ల మొదటి రోజునుంచీ ఒక పక్క ఇక్కడ రాజ్యమేలుతూ, భోగభాగ్యాలు అనుభవిస్తూనే ఈ అధికారం ఉపయోగించి అడవిలో నాకంటూ ఇంకో సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుంటూ వచ్చాను. భవంతులు నిర్మింపజేశాను. ఆ రాజ్యంలో ఉండటానికి మొగ్గు చూపించిన మనుష్యులను ముందే తరలించాను. మంత్రులను ఏర్పరచుకున్నాను. అధికారులను నియమించాను. ఈ కొత్త రాజ్యాన్ని రేపటినుంచీ కొత్తరాజు పరిపాలిస్తాడు. ఎవరో తెలుసా? నేనే. ఇంత కష్టపడి కొత్త సామ్రాజ్యాన్ని నిర్మించింది ఎవరికో ధారపోయటానికి కాదు కదా! అందువల్ల దాని సామ్రాట్‌ని నేనే. అందువల్ల నేను ఇప్పుడు అడుగుపెట్టేది అడవిలోకి కాదు, నా స్వయంప్రతిభతో అంగరంగ వైభవంగా నిర్మించిన సరికొత్త సామ్రాజ్యానికి. మనం దిగేసరికి నా మంత్రులు నాకు మేళతాళాలతో స్వాగతం చెబుతారు. రేపు నాకు పట్టాభిషేకం జరుగుతుంది.'

ఇప్పుడు చెప్పండి, ప్రజ్ఞాపాటవాలు అంటే ఏమిటి? **వర్తమానంలో అనుభవిస్తూనే భవిష్యత్తును తీర్చిదిద్దుకోవటం.** ఈ కథను చిన్మయానంద స్వామి ఇంకా చిలవలూ, పలవలూ చేర్చి చక్కగా చెబుతారు. ఇప్పుడు అసలు విషయానికి వస్తే, ఈ కథ మనకు అక్షరాలా సరిపోతుంది. మనందరికీ కూడా అలాంటి రాజ్యం ఒకటి ఇవ్వబడింది. దాని పేరేమిటో తెలుసా? **యవ్వనసామ్రాజ్యం.** యవ్వనసామ్రాజ్యం అంటే ఏమిటి? మనకున్న యవ్వనకాలం. మన జీవితంలో అత్యంత మధురమైన, శక్తివంతమైన రోజులవి. అక్కడ రాజు ఐదు సంవత్సరాలే రాజ్యం ఏలతాడు. కాని ఇక్కడ మనం యవ్వనసామ్రాజ్యంలో ఇంకా ఎక్కువ సంవత్సరాలు రాజ్యం ఏలుతాము. మన అదృష్టాన్నిబట్టి 20 నుంచి 30 సంవత్సరాల పైనే అనుభవిస్తాము. ఆనందంలో ఓలలాడుతాము. ఆరోగ్యంతో చిందులు తొక్కుతాము, శక్తికి లోటుండదు. ధన, జన, గర్వాలకు లోటు ఉండదు. అది అనంతం, అపారం అనుకుంటాము. అక్కడే పప్పులో కాలేస్తాము.

యవ్వనసామ్రాజ్యం అనుభవించాక, నిర్దాక్షిణ్యంగా మనం కూడా అడవిలోకి త్రోసివేయబడుతాము. ఏమిటా అడవి? **వార్ధక్యవనం.** వార్ధక్యవనం అంటే వృద్ధాప్యకాలం. యవ్వనమనే సామ్రాజ్యం పోగొట్టుకుంటాము, దాన్ని వెన్నంటి ఉన్న ధన, జన, గర్వాలు మటుమాయమయిపోతాయి. అధికారం చెలాయించలేము.

ఐశ్వర్యం లేదు, పదవి లేదు, అనారోగ్యమనే క్రూరమృగాల బారిన పడతాము. అడవిలో వెలుతురుండనట్టే, మన జీవితంలో కూడా వెలుగు రేఖలు పోయి, **చీకటి పొరలు దట్టంగా అలముకుంటాయి.**

ఇదీ మన పరిస్థితి. మనందరికీ కూడా యవ్వనసామ్రాజ్యం ఉంది, దాన్ని వెన్నంటే వార్ధక్యవనం ఉంది. వీటిని ఎలా అనుభవించాలి? అది మన చేతిలో ఉంది. ముందు వచ్చిన అనేక రాజుల్లాగా యవ్వనంలో ఆడి,పాడి, అనుభవించేసి, వార్ధక్యంలో అష్టకష్టాలు పడదామా? లేదు, చివర వచ్చిన రాజులాగా, యవ్వన తొలి మెరుపుల్లోనే మేలుకుని, వార్ధక్యపు రోజులకు బంగరుబాట వేసుకుందామా? మనకు కావాల్సినంత ప్రజ్ఞాపాటవాలు ఉన్నాయి! రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా అంటారు! మనం యవ్వనంలో ఉండగానే, ఒక పక్క దాన్ని అనుభవిస్తూనే, ఇంకో పక్క వార్ధక్యానికి ఇంకో సామ్రాజ్యాన్ని తీర్చిదిద్దుకోవచ్చు. దాని గురించి భయపడిపోయి, వార్ధక్యం మనమీద పడకుండానే, మనమే కోరి తెచ్చుకోకుండా, దాన్ని ఆమడ దూరంలో పెట్టవచ్చు. అప్పుడు జీవితం చీకూ చింతా లేకుండా ఉండటానికి కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవచ్చు. **తెలివైన వారు ఆ తెలివైన రాజులాగా ప్రవర్తిస్తారు.**

వార్ధక్యానికి ఏర్పాట్లు చేసుకోవాలి. బాగానే ఉంది! కాని ఏం ఏర్పాట్లు చేసుకోవాలి? కథలో రాజైతే ఇంకో రాజసౌధాన్ని నిర్మించాడు. మనమేం సౌధాన్ని నిర్మించాలి? **ఎప్పుడు నిర్మించాలి?** రాజు మొదటిరోజే ప్రారంభించాడని చూశారు గుర్తుందా? అంటే ఆ రాజుకి ఐదు సంవత్సరాలు పట్టింది కొత్త సామ్రాజ్యాన్ని నిర్మించటానికి. అందువల్ల, మనమెప్పుడు మొదలుపెట్టాలి? **మనం యవ్వన సామ్రాజ్యంలో రాజ్యమేలుతున్నప్పుడు.** మనకు అధికారం, హోదా ఉన్నప్పుడు. 'మీ వృద్ధాప్యం విజయవంతం కావాలంటే యవ్వనంలోనే మొదలుపెట్టండి' అన్నారెవరో.

**యావత్స్వస్థమిదం శరీరమరుజం యావజ్జరా దూరతో।**
**యావచ్చేంద్రియశక్తిరప్రతిహతా యావత్క్షయో నాయుషః।**
**ఆత్మశ్రేయసి తావదేవ విదుషా కార్యః ప్రయత్నో మహాన్।**
**సందీప్తే భవనే తు కూపఖననం ప్రత్యుద్యమః కీదృశః॥**

**- భర్తృహరి వైరాగ్య శతకమ్ -75**

ఈ శరీరం ఆరోగ్యంగా ఉన్నంతవరకూ, ఇంద్రియాలు శక్తివంతంగా ఉన్నంతవరకు. ఒంట్లో జవసత్వాలు తగ్గనంతవరకూ, తెలివైన వ్యక్తి అత్యున్నతమైన లక్ష్యాన్ని చేరుకోవటానికి ప్రయత్నంచేస్తూనే ఉండాలి.

ఇంటికి నిప్పంటుకున్నాక, బావి త్రవ్వి లాభమేమిటి? ఎంత నిజం! ఈ రోజుల్లో ఇల్లు కడుతున్నప్పుడే, నిప్పంటుకుంటే ఆర్పటానికి పకడ్బందీగా ఏర్పాటు చేస్తున్నారు. అందువల్ల **ఏర్పాట్లు యవ్వనంలోనే మొదలుపెట్టాలి.** ఇది మొదటి మెట్టు. ఏం ఏర్పాట్లు చేయాలి? మన శాస్త్రాలన్నీ ఘోషిస్తున్నాయి. ఆ ఏర్పాట్లేమిటో, భగవద్గీతలోనే కృష్ణపరమాత్మ చెబుతాడు.

**జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ।**
**తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి॥** గీత 2-27

కృష్ణపరమాత్మ ఒక తిరుగులేని పదం వేశాడు. **అపరిహార్యః అర్థః** అంటే నిస్సహాయ స్థితి. మనుష్యులందరూ, అంటే ప్రతి ఒక్కరూ, ఎప్పుడో అప్పుడు వారు తప్పించుకోలేని, పరిష్కారం లేని స్థితిని ఎదుర్కోక తప్పదు. అలా తప్పించుకోలేని, పరిష్కారం లేని స్థితినే నిస్సహాయ స్థితి అంటారు.

జాగ్రత్తగా వినండి! అన్ని పరిస్థితులూ నిస్సహాయ స్థితిని కలుగచేయవు. భగవంతుడు చాలా దయామయుడు. మనకు ఎన్నో శక్తులనిచ్చాడు; ఎన్నో వనరులనిచ్చాడు; మనకు పురుషబుద్ధి కూడా ఇచ్చాడు. ఇబ్బంది కలిగించే పరిస్థితులు రాకుండా తప్పించుకునే తెలివితేటలు ఇచ్చాడు. ఒకవేళ చిరాకు పుట్టించే పరిస్థితులు ఏర్పడినా, వాటినుంచి బయటపడే మార్గాలు కూడా ఇచ్చాడు. అందువల్ల అన్నీ **అపరిహార్యం** అనము.

ఈ నిస్సహాయ స్థితి ఎప్పుడైనా రావచ్చు. యవ్వనంలో కూడా రావచ్చు. కాకపోతే అప్పుడు అది తక్కువగా ఉండవచ్చు. వయసు పెరిగి, వృద్ధాప్యం మీదపడేకొద్దీ, అటువంటి నిస్సహాయ పరిస్థితులు ఎక్కువ అవచ్చు. లేచి, కూర్చోవటమే చాలా కష్టం అవచ్చు! మనం అసలు పట్టించుకోని, లెక్కచేయని మామూలు విషయాలు దాదాపు అసాధ్యం అవచ్చు! అందువల్ల **తర్వాత ఎప్పుడో మనం నిస్సహాయ స్థితిని ఎదుర్కోవాలంటే, ఇప్పుడు మనం మన మనస్సును దృఢపరచుకోవాలి.** ఇది మొదటి దశ.

మన మనస్సులో ప్రశాంతత, ఆహ్లాదం, ఆత్మస్థైర్యం నెలకొని ఉండాలి ఎల్లవేళలా. అంటే మన మనస్సు ఎన్నడూ నిరాశానిస్పృహలకు లోను కాకూడదు! ఎన్నడూ కలత చెందకూడదు.

**పరిస్థితిని మనం మార్చలేము.** ఎందుకు? పరిస్థితి మనం కోరుకున్నది కాదు. దాన్ని మార్చటం మన చేతిలో లేదు. మరి ఏది మన చేతిలో ఉంది? మన మనస్సు. ఈ పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కోవాలంటే, మన మనస్సుని తీర్చిదిద్దగలము. మన మనస్సుకు ప్రశాంతత, ఆహ్లాదం, ఆత్మస్థైర్యం అనే మూడు శక్తులను ఇవ్వగలము. ఇది ఎవరు చెబుతున్నారు? శాస్త్రం చెబుతున్నది. మన మనస్సు రీఛార్జీ చేయబడే బ్యాటరీ లాంటిదట. అందువల్ల మనం మన మనస్సును భర్తీ చేసి, పరిస్థితిని ఎదుర్కోగలము. పరిస్థితులు ఎదుర్కొంటున్న కొద్దీ, శక్తి తగ్గుతూ వస్తుంది. అప్పుడేం చేయాలి? సెల్‌ఫోన్‌లో బ్యాటరీ శక్తి తగ్గుతూ వస్తే ఏం చేస్తాము? వెంటనే దాన్ని రీఛార్జీ చేస్తాము; రైల్లో ఉన్నా, కార్లో ఉన్నా కూడా దాన్ని రీఛార్జీ చేయటం మర్చిపోము. బద్ధకించము. ఎందుకు? అది మన ప్రాణంతో సమానమైంది. అంత శ్రద్ధగానూ మన మనస్సును ఎప్పటికప్పుడూ రీఛార్జీ చేస్తూ ఉండాలి. ఎవరెడీ బ్యాటరీలా చేయాలి దాన్ని. **పరిస్థితిని మార్చలేనప్పుడు, మనస్సును ఛార్జి చేయాలి.** ఇది రెండవ దశ.

**మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణసుఖదుఃఖదాః।**
**ఆగమాపాయినోఽనిత్యాః తాంస్తితిక్షస్వ భారత ॥ - గీత 2-14**

తితిక్ష అంటే నీ మనస్సును దృఢపరచుకో అంటున్నాడు. అప్పుడు నిస్సహాయస్థితిలో శోకించవు.

**తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి॥ - గీత 2-27**

ఈ పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కో, బాధపడకు. ఇది రెండవ దశ.

మనస్సును దృఢపరచుకోవటమెలా? సెల్‌నంటే కరెంటుకు పెడతాము. మనస్సునేం చేయాలి? మనస్సును దృఢపరచుకోమని చెప్పిన కృష్ణపరమాత్మే అది ఎలా చేయాలో చెబుతాడు. **సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు, జగత్కారణం అయిన భగవంతుడే శక్తి ప్రదాత.** ఆ భగవానునితో అనుసంధానం చెందకపోతే ఈ మూడు శక్తులు- **ప్రశాంతత, ఆహ్లాదం, ఆత్మస్థైర్యం** పొందలేము.

భగవంతుణ్ణి అనేక పదాలతో స్తుతిస్తాయి శాస్త్రాలు. కాని వాటిలో రెండు పదాలు శక్తివంతమైనవి. ఆ పదాలతో మన మనస్సును శక్తివంతం చేసుకోవచ్చు. ఏమిటవి? **అనంతః, భగవాన్. అనంతః** అంటే అనంతమైనవాడు, పరిమితి లేనివాడు. భగవాన్ అంటే ఏమిటి?

**భగః అస్య అస్తి ఇతి భగవాన్**

**అనంతంగా ఆరు వనరులు ఉన్నవాడు.** 'భగః' అంటే ఆరు శక్తులు, 'వాన్' అంటే ఉన్నవాడు. అనంతభగవాన్ అంటే **అనంతమైన శక్తులు ఉన్న అనంతమైన దేవుడు.**

**ఐశ్వరస్య సమగ్రస్య వీర్యస్య యశసః శ్రియః।**
**జ్ఞానవైరాగ్యయోశ్చైవ షణ్ణామ్ భగ ఇతీరణా॥**

**విష్ణుపురాణం 6-5-47**

ఐశ్వర్యం అంటే స్థైర్యం. పరిస్థితిమీద అధికారం. ఎటువంటి స్థితిలోనూ చెక్కుచెదరకపోవటం. వీర్యం అంటే ధైర్యం. నేను చేయగలను, ఎటువంటి నిస్సహాయస్థితికైనా నేను సిద్ధం అని చెప్పగలిగే ధైర్యం. నేను కూడా అలా ఎటువంటి పరిస్థితికైనా సిద్ధం అని చెప్పగలగాలంటే, అటువంటి అనంతమైన వీర్యంనుంచి శక్తి తెచ్చుకోవాలి. అనంతమైన వీర్యం ఎక్కడ ఉంది? భగవానునిలో ఉంది. ఈ రెండు పదాలు- ఐశ్వర్యం, వీర్యం- ముఖ్యం మనకు. ఎటువంటి పరిస్థితి అనుభవించినా దానికి లొంగిపోకపోవటం ఐశ్వర్యం. ఎటువంటి పరిస్థితి వచ్చినా నేను ఎదుర్కోగలను అనుకోగలగటం ధైర్యం. నా వృద్ధాప్యాన్ని నేను భయం, ఒత్తిడి లేకుండా ఎదుర్కోగలను అనుకోగలగటం.

తక్కిన నాలుగూ ఏమిటి? యశస్సు అంటే కీర్తి; శ్రియః అంటే సంపద; జ్ఞానం అంటే విద్య; వైరాగ్యం అంటే బంధకత్వంనుంచి బయటపడటం. భగవాన్‌కు ఈ ఆరు శక్తులూ ఉన్నాయి. మనం అందులో రెండు శక్తులనుంచి శక్తి తెచ్చుకుంటున్నాము. అవి ఐశ్వర్యం, వీర్యం.

భగవాన్ శక్తిప్రదాత. భగవంతునితో మనస్సుద్వారా అనుసంధానం చెందటాన్ని **భక్తి** అంటారు. కృష్ణపరమాత్మ భక్తి లేదా ప్రార్థనతో శక్తి పుంజుకోమని చెబుతున్నాడు. ప్రార్థన ముగిశాక, 'ఇప్పుడు ఎటువంటి స్థితినైనా నేను ఎదుర్కోగలను; నాకా సామర్థ్యం ఉంది,' అనుకోవాలి. **అలా ప్రార్థనద్వారా మన మనస్సును ఎవర్రెడీ బ్యాటరీలాగా ఛార్జీ చేసుకోవాలి.** ఇది మూడవ దశ. ఆ ప్రార్థన వాచిక, కాయిక, మానసిక ప్రార్థనల్లో ఏదైనా అవచ్చు.

**యజ్ఞానాం జపయజ్ఞోఽస్మి** - గీత **10-25**

కాని కృష్ణ పరమాత్మ జపం అన్నిటికన్నా గొప్పది అంటున్నాడు.

ఏ మంత్రం గొప్ప జపం? **ఓం నమో భగవతే అనంతాయ**

ఇందులో రెండు పదాలు ఉన్నాయి. భగవాన్, అనంతః. భగవాన్ అంటే

అంతులేని ఐశ్వర్యం, వీర్యం ఉన్నవాడు; అనంతః అంటే అనంతమైన శక్తి ఉన్న అనంతమైన ఆధారం. అందువల్ల **ఈ మంత్రం జపిస్తే, అనంతమైన శక్తివంతుని నుంచి మనకు అనంతమైన శక్తి వస్తుంది.** ఇది నాలుగవ దశ.

ఈ మంత్రం జపించేటప్పుడు సంకల్పం చెప్పుకోవటం ముఖ్యం. ఏమిటా సంకల్పం? ' నా మనస్సు నిస్సహాయ పరిస్థితులను ఎదుర్కొనేలా చేయి.' అందువల్ల ఈ సంకల్పం బాహ్యంగా ఏమైనా మార్పులు చేయమని కాదు. అంటే ఏదైనా కొత్త వస్తువును పొందటానికో, ఉన్న వస్తువును ఒదుల్చుకోవటానికో చేసే ప్రార్థన కాదు. **ఇది కాదు** మన ఉద్దేశ్యం. మన ఉద్దేశ్యం మన మనస్సుకు **శక్తినివ్వటం. నిస్సహాయ స్థితిని ఎదుర్కొనే శక్తినివ్వటానికి.** అందువల్ల సంక్పలం మన మనస్సును రీఛార్జ్ చేయటానికి.

ఆ నిస్సహాయ స్థితి ఎటువంటిదైనా కావచ్చు. ట్రాఫిక్‌జామ్‌లో ఇరుక్కుపోయే చిన్న పరిస్థితి కావచ్చు. మనకు చిరాకు పుట్టవచ్చు. అప్పుడు నెమ్మదిగా 'ఓం నమో భగవతే అనంతాయ, ఓం నమో భగవతే అనంతాయ,' అనుకోవాలి. 'నేను ప్రశాంతంగా ఉండాలి. అరిచి లాభం లేదు. ముందు కారు అతను కారు తప్పుగా పార్క్ చేసి, ఏ కాఫీ తాగటానికో వెళ్ళి ఉంటాడు. నేను ఈ పరిస్థితిని మార్చలేను. నాకు ప్రశాంతతనియ్యి,' అనుకోవటమే మనము చేయగలము.

అలా నిస్సహాయ పరిస్థితి ఒక చిన్న ట్రాఫిక్ జామ్‌నుంచి ఒక పెద్ద అనారోగ్యం కావచ్చు. మంచంమీద నిస్సహాయంగా పడుకోవాల్సి రావచ్చు. **ముందు ముందు ఏమవుతుందో మనకు తెలియదు. జరుగబోయేది ఎవరూ ముందే ఊహించలేరు.** నిస్సహాయ స్థితులు పేరుకుపోవచ్చు. మనం మనస్సును ప్రశాంతంగా, ఆహ్లాదంగా, ఆత్మస్థైర్యంతో ఉంచుకోవాలంటే ఒక్కటే మార్గం. ఓం నమో భగవతే అనంతాయ జపించుకుంటూ, ఆ జపంనుంచి శక్తి పుంజుకోవటం.

జపం ముందూ, జపం ముగిశాక కూడా, సంకల్పం చెప్పుకోవాలి. ఇదంతా భగవంతునిమీద **శ్రద్ధతో చేయాలి.** 108 సార్లు, 1008 సార్లు, ఎన్నిసార్లు జపం చేసినా శ్రద్ధ ముఖ్యం. అప్పుడే మనస్సు శక్తి పుంజుకుంటుంది.సంకల్పశక్తి వస్తుంది. **'ఈశ్వరుని సంకల్పశక్తినుంచి నేను సంకల్పశక్తిని** అరువు తెచ్చుకుంటున్నాను. ఇప్పుడు నేను సిద్ధం,' అని మనస్సుకు సూచనలిచ్చుకుందాము. 'ఇప్పుడు నేను కూడా శక్తివంతుణ్ణి. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కోగలను.'

మనకు ఎంత శక్తి వస్తుందనేది మనకు భగవంతునిమీద ఉన్న శ్రద్ధ, భక్తిమీద ఆధారపడి ఉంటుంది. ఎంత శ్రద్ధ ఉంటే అంత శక్తి వస్తుంది.

**మంత్రే తీర్థే ద్విజే దేవే; దైవజ్ఞే భేషజే గురౌ।**
**యాదృశీ భావనా యస్య, సిద్ధిర్భవతి తాదృశీ॥ -సమయోచిత పద్యమాలిక**

మంత్రాలు, తీర్థయాత్రలు, బ్రహ్మజ్ఞానులు, దేవుళ్ళు, దైవజ్ఞులు, వైద్యులు, గురువులు- వీరివల్ల మనకు కలిగే ఉపకారం. వీరిమీద మనకున్న శ్రద్ధమీద ఆధారపడి ఉంటుంది.

మనం వేసుకునే మందు కూడా, ఆ వైద్యునిమీద మనకున్న శ్రద్ధమీద ఆధారపడి ఉంటుంది. ఆ వైద్యుడు ఎందుకూ పనికిరాని వాడు అని మనం ముందే అనుకుంటే ఆయన మందు మనకు పనిచేయదు. ఒక డాక్టరునుంచి ఇంకో డాక్టరు దగ్గరకి పరుగులు తీస్తూ ఉంటాము. అలా కాకుండా, ఏదో ఒక వైద్యునిమీద శ్రద్ధ ఉండాలి. పరిశోధనలలో తేలినదేమిటంటే, వైద్యునిమీద శ్రద్ధ ఉంటే, ఆయన నిజంగా మందు ఇవ్వకుండా, మందులాంటిది ఇచ్చినా కూడా ఆ వ్యాధి నయమవుతుందని. దీనికి కారణం శ్రద్ధ. అంటే శ్రద్ధ లేకపోతే మంచి మందు ఇచ్చినా అది పనిచేయదు. మనస్సుకు శ్రద్ధ చూపే ఒక విశిష్టమైన గుణం ఉంది.

**అశ్రద్ధధానాః పురుషా ధర్మస్యాస్య పరంతప।**
**అప్రాప్య మాం నివర్తంతే మృత్యుసంసారవర్త్మని॥ గీత 9-3**

శ్రద్ధ పెంచుకోవాలి భగవానునిమీద. ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ధైర్యంగా, చెక్కుచెదరకుండా ఎదుర్కోగలము. ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన, ధైర్యమున్న, స్థైర్యమున్న మనస్సును పెంపొందించుకోగలము. **ఈ శ్రద్ధను యవ్వనసామ్రాజ్యంలో పెంపొందించుకుంటే వృద్ధాప్యవనంలో నిశ్చింతగా సంచరించగలము**. ఇది ఐదవ దశ. ఈ శ్రద్ధను జపం లేదా భక్తి అంటారు.

కాని ఇక్కడితో ఆగిపోకూడదు. మనస్సును దృఢపరచుకోవటానికి ఈశ్వరశ్రద్ధతో మొదలుపెట్టాలి నిజమే. కాని దాని తర్వాత ఈశ్వరజ్ఞానానికి రావాలి. ఎందుకంటే కేవలం ఈశ్వరశ్రద్ధ మాత్రమే ఉంటే, అది ఏ క్షణమైనా వీగిపోవచ్చు. ముఖ్యంగా నేటి కాలమాన పరిస్థితుల్లో, ప్రతిదానికీ నిదర్శనం కావాలి. 'దేవుడున్నాడని నిదర్శనం ఏమిటి?' అంటారు వారు.

శ్రద్ధ గొప్పదే. అన్ని మతాలూ శ్రద్ధ గురించి నొక్కివక్కాణిస్తాయి. కాని మన మతం మాత్రమే, 'ఈశ్వరశ్రద్ధతో ఆపవద్దు. ఈశ్వరజ్ఞానానికి రండి,' అంటుంది.

వేదపూర్వభాగం ఈశ్వరశ్రద్ధను పెంచితే, వేద అంతభాగం ఈశ్వరజ్ఞానాన్ని బోధిస్తుంది. ఈ జ్ఞానానికి ప్రతి ఒక్కరూ ఎప్పుడో అప్పుడు రాక తప్పదు. **ఈశ్వర జ్ఞానం పొందాలి.** ఇది ఆరవ దశ.

ఈశ్వర జ్ఞానం ఏమిటి? అది ఒక మహామంత్రం. అది ఏం చెబుతుందో చూద్దాము. దేవుని ఉనికికి నిదర్శనం ఏమిటి అనే ప్రశ్నకి వేదాంతంలో జవాబు దొరుకుతుంది. అది కూడా ప్రత్యక్షంగా చెప్పదు. ఒక ఈక్వేషన్ద్వారా చెబుతుంది. దీన్ని మహావాక్యం అంటారు. ఏమిటా మహా వాక్యం.

ఇన్నాళ్ళు నువ్వు భక్తితో సేవిస్తున్న ఆ భగవానుడు, భక్తుడవైన నువ్వు ఒకటే అంటుంది.

**భగవానుడు= భక్తుడు**

దీన్ని అనేక మార్గాల్లో చూపిస్తుంది. అందులో ఒకటి సోహం.

సోహం = సః అహం. సః అంటే భగవానుడు; అహం అంటే నేను.

**భగవాన్ ఏవ భక్తః భక్తః ఏవ భగవాన్**

నిజానికి ఈ మంత్రాన్ని పూజ ముందు, ప్రతిరోజూ జపిస్తారు.

**దేహో దేవాలయః ప్రోక్తః జీవో దేవః సనాతనః।**
**త్యజేదజ్ఞాననిర్మాల్యమ్ సోఽహమ్ భావేన పూజయేత్॥**

అలా భగవానుడు= భక్తుడు. జీర్ణించుకోలేని, కష్టమైన మహావాక్యం.

**స య ఏషోఽణిమైతదాత్మ్య మిదగ్ం సర్వం తత్సత్యగ్ం**
**స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో - ఛాందోగ్యం 6-8-7**

వేదాంత శ్రవణ, మనన నిదిధ్యాసనలు చేస్తే ఈ మహావాక్యం అర్థమవుతుంది. పూర్వం దీనికోసం సన్న్యాసం స్వీకరించేవారు.

ఈ మహావాక్యాన్ని అర్థం చేసుకుంటే, ఒకేసారి మూడు అంతుపట్టని ప్రశ్నలకు సమాధానాలు దొరకుతాయి.

1. దేవుని గురించిన అపోహలు తొలగిపోతాయి.
2. భక్తుని గురించిన అపోహలు తొలగిపోతాయి.
3. దేవుని ఉనికికి నిదర్శనం గురించిన అపోహలు తొలగిపోతాయి.

అదెలా?

ఎప్పుడైతే భగవంతుడు = భక్తుడు అంటామో; భక్తుని ఉనికి గురించిన నిదర్శనమే భగవంతుని ఉనికి గురించిన నిదర్శనం కూడా అవుతుంది. భక్తుడున్నాడా

లేదా? ఆ భక్తుడెవరు? నేనే! నేను ఉన్నాను కదా! నా ఉనికే భగవంతుని ఉనికికి కూడా నిదర్శనం.

**నేను ఉన్నాను అని చెప్పటానికి నిదర్శనం ఏమిటి?**

తర్కంలో తలపండిన వ్యక్తి కూడా ఈ ప్రశ్న అడగడు. ఒక వేళ అడిగితే, అతనికి మెదడు ఉందా లేదా అని మనం శంకించాల్సి ఉంటుంది.

దయానంద సరస్వతి స్వామీజీ సరదాగా ఈ సంభాషణ చెబుతారు.

ఒక వ్యక్తిని, 'నువ్వు ఉన్నావా?' అని అడిగారు.

'ఏమో స్వామీ! నా భార్యని అడిగి చెబుతాను.'

'నేను, నిన్ను దానం చేయమనటం లేదు, నువ్వు ఉన్నావా అని అడుగుతున్నానంతే, దానికేమిటో ఆవిడని అడిగి చెబుతానంటున్నావు. నిజంగా అడిగేవు సుమా! ఒకవేళ అడిగితే, 'నా భర్త ఉన్నా లేనట్టే, ఎందుకంటే ఆయన ఎందుకూ పనికిరానివాడు,' అనవచ్చు.' అలా అయితే అందువల్ల నేను ఉన్నానా లేదా అనే సందేహం లేదు. **నేను ఉండటం ఎంత ఖచ్చితమో దేవుడు ఉండటం కూడా అంత ఖచ్చితమే!** అందువల్ల దేవుడు ఉన్నాడని చెప్పటానికి ఋజువులు వెతకటం వెర్రితనం. వేదాంతం అధ్యయనం చేస్తే దేవుని ఉనికికి ఋజువులు దొరకవు; దేవుని ఉనికికి ఋజువులు వెతకటం వెర్రితనం అని అర్థం చేసుకుంటారు. ఇది ఎవరు చెబుతున్నారు? శాస్త్రమే చెబుతున్నది.

**అసన్నేవ స భవతి అసద్ బ్రహ్మేతి వేదచేత్**
**అస్తి బ్రహ్మేతి చేద్వేద సంతమేనం తతో విదురితి॥ -తైత్తిరీయమ్**

ఎవరైతే దేవుడు లేడంటున్నారో, అతను తననే లేడంటున్నాడు! అలా ఈశ్వరశ్రద్ధనుంచి ఈశ్వరజ్ఞానానికి రావాలి. ఈశ్వరజ్ఞానానికి వస్తే నేర్చుకునేదేమిటి? మన మనస్సుకు శక్తినిచ్చే శక్తిప్రదాత ఎక్కడో లేదు. మనమే ఆ శక్తి ప్రదాత! మనకే అనంతమైన శక్తి ఉంది. అందువల్ల పొద్దున్న ప్రార్థనలో మన అనంతమైన శక్తిని ఆవాహన చేయాలి. **ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనే వనరులన్నీ మనలోనే ఉన్నాయి.** ఇది ఏడవ దశ.

మనమే అఖండమైన శక్తి అని గ్రహించే వరకూ, భగవానునిమీద శ్రద్ధ పెట్టుకోవాలి. అంటే మనం చేయాల్సిందేమిటి? దేవునిమీద శ్రద్ధతో దేవుని నుంచైనా, దేవుని గురించిన జ్ఞానంతో మననుంచైనా మనం శక్తిని పొంది, మన మనస్సును శక్తివంతం చేసుకోవాలి. అలా ప్రతిరోజూ ఉదయం ఈశ్వరశ్రద్ధద్వారా గానీ,

ఈశ్వరజ్ఞానంద్వారా కానీ, అంటే బాహ్యంగా కానీ, అంతర్గతంగా కానీ మన మనస్సనే బ్యాటరీని రీఛార్జీ చేసుకోవాలి. ఎక్కడనుంచి రీఛార్జీ చేస్తామనేది ముఖ్యం కాదు; శక్తి తెచ్చుకోవటం ముఖ్యం. మన రోజుని ఈ సంకల్పంతో శుభారంభం చేయాలి, **'నాకు సామర్థ్యం ఉంది; నా చేతిలో లేని ఎటువంటి పరిస్థితి ఎదురైనా, దాన్ని ఎదుర్కోవటానికి నేను సిద్ధంగా ఉన్నాను. ఎట్టి పరిస్థితిలోనూ నా ప్రశాంతత, ఆహ్లాదం, ఆత్మస్థైర్యం చెక్కుచెదరదు.'** ఇది ఎనిమిదవ దశ.

ఈ నూతన సంవత్సరాన్ని, భగవంతునితో అనుసంధానం చేసుకుని శుభారంభం చేసుకుందాము. 'నేను నూతన సంవత్సరానికి సిద్ధంగా ఉన్నాను. ఎటువంటి పరిస్థితి ఎదురైనా నేను మొక్కవోని ధైర్యంతో ఎదుర్కొంటాను.ఆ తెలివైన రాజులా నా భవిష్యత్తుని తీర్చిదిద్దుకుంటాను. యవ్వనసామ్రాజ్యంలోనూ నేను రాజ్యమేలుతాను. వృద్ధాప్యవనంలోనూ నా రాజ్యాన్ని పటిష్ఠం చేసుకుంటాను.'

మనను మనం ఇలా తీర్చిదిద్దుకోవటమే మనిషిగా మన లక్ష్యం!

## స్వామీజీ సూక్తిముక్తావళి

కర్మకాండలో మూడు దశలు ఉన్నాయి.

**నేర్చుకో, ఆచరించు, సాధించు (ధర్మార్థకామాలను).**

కాని జ్ఞానకాండలో రెండు దశలే ఉన్నాయి.

**నేర్చుకో, సాధించు(మోక్షాన్ని).**

మధ్యలో ఉన్న ఆచరించు భాగం జ్ఞానకాండలో లేదు.

ఒకదీపం వెలిగిస్తే, మీరేమీ పనిచేయనవసరం లేకుండానే, దానంతట అదే చీకటి తొలగిపోతుంది.

# 6. శరణాగతి అంటే ఏమిటి?

'భగవంతుణ్ణి మీరు శరణు కోరితే, భగవంతుడు మిమ్మల్ని రక్షిస్తాడు.' ఇది ఇంచుమించు ప్రతిమతంలోనూ చాలా ప్రసిద్ధి చెందిన, శక్తివంతమైన సందేశం. ఆ విధంగా భగవంతుణ్ణి మన రక్షకునిగా భావించి ఆయనకు దాసోహం అంటే ఆయన మనను మన సమస్యలనుంచి గట్టెక్కిస్తాడు అనే భావన కలుగచేస్తారు.

ఇలా భగవంతుణ్ణి శరణుకోరటం, మన హిందూమతంలో కూడా ఉంది. ఈ విధంగా మన బాధ్యతను పూర్తిగా భగవంతునిమీద వేయటాన్ని **శరణాగతి** అంటారు. **సర్వస్య శరణాగతి** సందేశం ఇప్పుడు చాలా ప్రబలంగా ఉంది అంతటా. ఈ పద్ధతిని **ప్రసిద్ధ శరణాగతి** అందాము.

దురదృష్టవశాత్తూ ఈ ప్రసిద్ధ శరణాగతి మన శాస్త్రాల్లో వివరించిన శరణాగతికి చాలా దూరంగా వచ్చేసింది. దీన్ని **సాంప్రదాయ పద్ధతి** అందాము. మన శాస్త్రాల్లో వివరించిన శరణాగతి అంటే ఏమిటో తెలియాలంటే ముందు ప్రసిద్ధ పద్ధతికి, సాంప్రదాయ పద్ధతికీ మధ్య ఉన్న తేడాలేమిటో తెలుసుకోవాలి.

ఈ రెండింటి మధ్య నాలుగు ముఖ్యమైన వ్యత్యాసాలు ఉన్నాయి.

**1. ఫ్రీవిల్–** అన్నిటికన్నా ముఖ్యమైన సిద్ధాంతం– ఈ ప్రసిద్ధ పద్ధతి వారు చెప్పేది, మీ ఫ్రీవిల్‌ను భగవంతునికి అర్పించేయండి. ఫ్రీవిల్ అంటే పురుషార్థబుద్ధి. కొంతమంది అసలు ఫ్రీవిల్ ఉందనే ఒప్పుకోరు. అది వేరే విషయం. కాని ఈ పద్ధతి వారు ఫ్రీవిల్ ఉందని అంగీకరిస్తారు. వారు మన ఫ్రీవిల్‌ను భగవానుని విల్‌కి సమర్పించమంటారు. **'హిజ్ విల్ బి డన్,'** అంటారు.

కాని దీన్ని ఒప్పుకోదు సాంప్రదాయ పద్ధతి. ఎందుకు? వేరే ఏ జీవరాశికీ లేని, ఒక ప్రత్యేక అంశం, మనిషికి మాత్రమే ఉంది. అదే ఫ్రీవిల్ లేదా పురుషార్థబుద్ధి.

**కర్తుం, అకర్తుం, అన్యథాకర్తుమ్**

చేస్తాను, చేయను, వేరే విధంగా చేస్తాను.

ఇదీ ఫ్రీవిల్‌యొక్క నిర్వచనం. ఉదాహరణకు శివరాత్రికి ఉపవాసం ఉండే విషయాన్నే తీసుకుందాం. ఉపవాసం ఉంటాను, ఉపవాసం ఉండను, రోజూకన్నా ఎక్కువ తింటాను. మనిషికీ, జంతువుకీ మధ్య ముఖ్యమైన తేడా ఈ ఫ్రీవిల్లే. మనిషిగా మనకు ప్రాథమికంగా నాలుగు పురుషార్థాలు ఉన్నాయి.

పురుషార్థాలు అంటే లక్ష్యాలు. అవి ధర్మార్థకామాలు మనకు ప్రియమైనవి. మోక్షం మనకు శ్రేయస్కరమైనది.

ప్రేయోమార్గం, శ్రేయోమార్గం రెండూ మనిషి ముందు నిలుచుంటాయట. మాలో ఎవరిని ఎన్నుకుంటావో నీ ఇష్టం అని. ఇక్కడే ఫ్రీవిల్ సరిగ్గా పని చేయాలి. మనకు ప్రియమైనది ఎన్నుకోవాలా, మనకు శ్రేయస్కరమైనది ఎన్నుకోవాలా? ప్రియమైనది ఆనందాన్నివ్వచ్చు కాని మోక్షాన్నివ్వదు. అంటే శాశ్వత ఫలాన్నివ్వదు. తెలివైన వ్యక్తి శాశ్వతఫలాన్ని కోరతాడు. మన ఫ్రీవిల్‌ను ఉపయోగించటంవల్లనే మోక్షాన్ని పొందగలము. అందువల్ల ఫ్రీవిల్‌ను దేవుని చరణాలమీద వదిలేయమని సాంప్రదాయ పద్ధతి చెప్పదు.

ఒక్కముక్కలో చెప్పాలంటే, నువ్వు స్వంతంగా ఏమీ ఆలోచించకు అంటుంది ప్రసిద్ధ పద్ధతి. నువ్వు మంచిచెడులు బేరీజు వేసి శ్రేయోమార్గాన్ని ఎన్నుకో అంటుంది సాంప్రదాయ పద్ధతి.

**2. బాధ్యతలు–** ఫ్రీవిల్ భగవానునికి వదలమంటున్నారు కాబట్టి, వారు మీ బాధ్యతలన్నీ భగవంతుడిమీద వేసేయమంటారు. ఇంక అక్కడినుంచి మనకేం కావాలో, వాటినెలా ఇవ్వాలో ఆయనే చూసుకుంటాడు. మన సమస్యలేమిటో ఆయనకే బాగా తెలుసు. అందువల్ల మనకు ఆయనే రక్షణ కవచంలా ఉంటాడు. ఇది ప్రసిద్ధ పద్ధతియొక్క ఇంకో ప్రసిద్ధికెక్కిన సిద్ధాంతం.

అది సాంప్రదాయ పద్ధతిలో చూస్తే మనిషిగా మనకు ప్రత్యేకంగా ఫ్రీవిల్ ఉంది కాబట్టి, దాన్ని సద్వినియోగం చేసుకుని, మనకు కావాల్సినదేమిటో మనమే ఎన్నుకోవాలి అంటుంది. **నీ కర్మకు నీవే బాధ్యుడవు.** అందువల్ల మన బాధ్యతను దేవుడిమీద వేసి తప్పించుకోకూడదు.

వినటానికి బాగానే ఉంది కాని మనను మనం ఎలా ఉద్ధరించుకోగలము? దానికి మన బుద్ధిని ఉపయోగించాలి. మనిషిని బుద్ధిజీవి అంటారు.

**విజ్ఞానసారథిర్యస్తు మనః ప్రగ్రహవాన్నరః।**

**సోఽధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః పరమం పదమ్ – కఠ 1-3-9**

బుద్ధిని ఉపయోగించి, సరియైన మార్గాన్ని ఎన్నుకున్న వ్యక్తి అత్యంత ఉన్నతమైన లక్ష్యాన్ని పొందుతాడు అంటుంది కఠోపనిషత్తు. మనం చేయాల్సిన పనిని భగవానుడు చేయడు. పిల్లలు పరుగుపందెంలో పాల్గొంటున్నప్పుడు, తల్లిదండ్రులు ఏం చేస్తారు? అరుపులు, కేకలతో వారిని ఉత్సాహపరుస్తారు కాని,

వారి బదులు వీరు పరుగెత్తరుగా? అదే సూత్రం జీవితమనే పరుగుపందానికి కూడా వర్తిస్తుంది. మన పరుగు మనమే తీయాలి. భగవంతుడు కూడా మనను ఉత్సాహపరుస్తాడు. కాని, తను మన బదులు పరుగుతీయడు. అందువల్ల మన బాధ్యతను భగవంతుడిమీదకి నెట్టివేయటాన్ని సాంప్రదాయ పద్ధతి ఒప్పుకోదు.

ఒక్కముక్కలో చెప్పాలంటే, నీ బరువు బాధ్యతలను భగవంతుడిమీద వేయమని ప్రసిద్ధ పద్ధతి చెబితే, నిన్ను నువ్వే ఉద్ధరించుకోవాలంటుంది సాంప్రదాయ పద్ధతి.

**3. భగవంతునిమీద శ్రద్ధ–** మీ ఫ్రీవిల్‌ని భగవంతునికి వదిలి, మీ భారాన్ని భగవంతుడిమీద వేశాక, ఇంక నిశ్చింతగా ఉండండి. అంటే భగవంతుని శక్తిమీద నమ్మకం పెట్టుకోండి. ఆయనకు అసాధ్యమైనదంటూ ఏమీ లేదు. భగవంతుడు సర్వశక్తివంతుడు, సర్వజ్ఞుడు కాబట్టి ఆయనకు మిమ్మల్ని తరింపచేయటం వెన్నతో పెట్టిన విద్య అంటారు ప్రసిద్ధ పద్ధతి వారు.

కాని మన సందేహం మనను వీడదు. మనకున్న సమస్యలేమైనా ఒకటా, రెండా? కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, వృత్తిపరమైన ఒత్తిడులు– అలా చెప్పుకుంటూ పోతే ఎన్నో! అన్నీ ఆయన తీర్చగలడా? ఒకవేళ తీర్చగలిగితే, ఎలా తీరుస్తాడు? దానికి ప్రసిద్ధ పద్ధతి అనేక భక్తుల కథలు చెప్పుకొస్తుంది. ఎలా భక్తులు అనేక సమస్యలతో బాధపడ్డారో, ఎలా వారందరినీ భగవంతుడు తన శక్తితో తరింపచేసాడో చెబుతుంది. ఈ కథలన్నింటినీ క్రోడీకరించి చూస్తే, అన్నిటి సారాంశం ఒకటే– అవి భగవంతుని లీలలను సూచిస్తాయి. భక్తులందరూ వారి కష్టనష్టాలనుంచి భగవానుని లీలలద్వారా రక్షింపబడ్డారు.

అందువల్ల మీ ఫ్రీవిల్‌ను, మీ బాధ్యతను మీరు భగవంతునిమీద వేసి మీరు హాయిగా ఉండండి! మీ జీవితంలో కూడా లీలలు జరుగుతాయి అంటారు వీరు. అంటే ప్రసిద్ధ పద్ధతి భగవానునిమీద నమ్మకం పెట్టుకో అంటే భగవానుని లీలలమీద శ్రద్ధ పెట్టుకోమని అర్థం.

సాంప్రదాయ పద్ధతి కూడా భగవంతుడు తన భక్తులను రక్షిస్తాడనే చెబుతుంది. కాని ఎలా? తన బోధనలద్వారా! మన అన్ని రకాల సమస్యలకూ పరిష్కారాన్ని భగవానుడే ఎప్పుడో చూపించాడు. ఎలా? మన **శాస్త్రంలో.** శాస్త్రం అంటే అర్థం మనను రక్షించేది అని. శరణాగతి పదంలోని శరణం మాట అర్థం కూడా రక్షకుడు అని.అందువల్ల శరణాగతి అంటే **శాస్త్రాగతి.**

ఈ బోధన లీలల గురించి చెప్పదు. మరి అయితే, శాస్త్రంయొక్క ముఖ్య బోధ ఏమిటి? జీవితాన్ని ఎలా ఎదుర్కోవాలో చెబుతుంది శాస్త్రం. మనకు కలిగే అనేక ప్రశ్నలకు, సందేహాలకు జవాబునిస్తుంది. నేనెవరు? ఈ జగత్తు ఏమిటి? ఈ ప్రపంచం నాకేవిధంగా సమస్యలను సృష్టిస్తున్నది? నేనెలా ఈ సమస్యలకు పరిష్కారం వెతుక్కోగలను? ఇలాంటి అనేక ప్రశ్నలకు జవాబులు దొరుకుతాయి. ఆ విధంగా సాంప్రదాయ పద్ధతి భగవానునిమీద నమ్మకం పెట్టుకో అంటే భగవానుని బోధమీద శ్రద్ధ పెట్టుకోమని అర్థం.

ఒక్కముక్కలో చెప్పాలంటే భగవంతుని లీలలమీద శ్రద్ధ పెట్టుకోమని ప్రసిద్ధ పద్ధతి చెపితే, భగవంతుని బోధమీద శ్రద్ధ పెట్టుకోమంటుంది సాంప్రదాయ పద్ధతి.

**4. బుద్ధి–** మొత్తం మీ భారమంతా భగవంతునిమీద వేయండి; ఆయనే చూసుకుంటాడు అంటుంది కదా ప్రసిద్ధ పద్ధతి. ఎలా మన సమస్యలు తీరుస్తాడు అంటే ఆయన లీలలద్వారా అంది. అంటే, మన జీవితంలో ఒక పెను తుఫాను వస్తే, ఒక అద్భుతమైన లీల జరగాలి. కాని కథల్లో చదివిన అద్భుతాలు, లీలలు మనకు ఇలలో జరగవని తెలిసి డీలా పడతాము. దాని ఫలితం?

శరణాగతి కోరితే దేవుడు మనను పట్టించుకోడు అని బాధపడతాము. నా సమస్యలను చూడటం లేదు, నా ప్రార్థనలను వినటం లేదు అని కలత చెందుతాము. ఒక్కోసారి భగవంతునిమీద మనకున్న భక్తి, ఆయన లీలలమీద మనకున్న నమ్మకం, శరణాగతిమీద ఉన్న శ్రద్ధ– అన్నీ వీగిపోతాయి. ఇటువంటి శరణాగతిలో ఎప్పుడో ఒకప్పుడు మన శ్రద్ధను నమ్మలేని పరిస్థితి ఏర్పడుతుంది. దేవుడున్నాడా అనే వారు కూడా ఉంటారు.

కాని మనను నోరు విప్పనివ్వదు ప్రసిద్ధ పద్ధతి. దేవుడున్నాడా అని ప్రశ్నించకూడదు అంటుంది. నమ్మకం వదులుకోవద్దు. దేవుడి మహిమను శంకించటం మహాపాపం అంటుంది. ఇక్కడే పెద్ద చిక్కులో పడతాము. మన బుద్ధి ఏమో సందేహాలు, ప్రశ్నలు, ఆలోచనలు, విశ్లేషణలు చేస్తూ ఉంటుంది. కాని ప్రసిద్ధ పద్ధతి, మీ బుద్ధిని జోకొట్టండి, దాన్ని నోరు తెరవనివ్వకండి అంటుంది.

దీనికి సాంప్రదాయ పద్ధతి జవాబు ఏమిటి? అది అంతకు ముందు ఏమంది? మీ సమస్యలకు పరిష్కారం శాస్త్రం చేసే బోధలో ఉందంది. ఆ బోధను అర్థం చేసుకోవాలంటే బుద్ధి ఉండటమే కాదు; చాలా పదునుగా కూడా ఉండాలి.

**దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా।**
**సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః॥ - కఠ 1-3-12**

ఆత్మజ్ఞానం పొందాలంటే సూక్ష్మబుద్ధి ఉండాలంటుంది కఠోపనిషత్తు. అది కూడా ఎలా ఉండాలి? క్షురకుని కత్తి ఉన్నంత పదునుగా ఉండాలి. ఈ సాంప్రదాయ పద్ధతిలో శరణాగతి అంటే శాస్త్రాన్ని శరణుజొొచ్చి, అందులోంచి మనను మనం రక్షించుకునే మార్గాలను వెతుక్కోవాలని చూశాము. ఇందులో భగవానుని పాత్ర ఏమిటి? ఆయన బోధ, ఆయన ఇచ్చిన శాస్త్రమే ఆయన పాత్ర. అందువల్ల బుద్ధి నోరు నొక్కమనదు సాంప్రదాయ పద్ధతి.

ఒక్కముక్కలో చెప్పాలంటే, బుద్ధిని అణగద్రొక్కమని ప్రసిద్ధ పద్ధతి చెపితే, బుద్ధిని పదునుగా పెట్టుకుని శాస్త్రాన్ని అర్థం చేసుకోమంటుంది సాంప్రదాయ పద్ధతి.

ఈ రెండు పద్ధతుల మధ్యనున్న నాలుగు పెద్ద భేదాలు ఇవి-

| **ప్రసిద్ధ పద్ధతి** | **సాంప్రదాయ పద్ధతి** |
| --- | --- |
| 1. ఫ్రీవిల్‌ను వదిలేసుకోండి | 1. ఫ్రీవిల్‌ను ఉపయోగించండి |
| 2. దేవునిమీద భారం వేయండి | 2. మీ బాధ్యతను మీరు స్వీకరించండి |
| 3. దేవుని లీలలమీద శ్రద్ధ పెట్టుకోండి | 3. దేవుని బోధలమీద శ్రద్ధ పెట్టుకోండి |
| 4. బుద్ధిని అణగద్రొక్కండి | 4. బుద్ధిని పదును చేసుకోండి |

దీన్నిబట్టి సాంప్రదాయ పద్ధతికి రావాలని అర్థమయింది.

దేవుని లీలలమీద శ్రద్ధ పెట్టుకోకూడదు. దేవుని బోధమీద శ్రద్ధ పెట్టుకోవాలన్నారు బాగానే ఉంది. కాని శాస్త్రం ఏ విధంగా మనకు తోడ్పడుతుంది? శాస్త్రం మనకు **నాలుగు రక్షణ కవచాలను** ఇస్తున్నది.

**1. ధర్మం-** శాస్త్రం ఇచ్చిన మొట్టమొదటి రక్షణకవచం ధర్మం.

**ధర్మో రక్షతి రక్షితః**

ధర్మాన్ని పాటిస్తే, ధర్మం నిన్ను రక్షిస్తుంది. ధర్మం అంటే ఆరోగ్యకరమైన జీవితాన్ని పాటించటం. అంటే ప్రకృతి విధించిన ధర్మాలను శారీరకంగా, నైతికంగా పాటించటం. ప్రకృతి ధర్మాలను కాలదన్ని సంతోషంగా ఉండాలని ఆశించకూడదు. మనం ఎదుర్కొనే అతి చిన్న సమస్యనుంచి, పెను తుఫానులాంటి అతి పెద్ద సమస్యవరకూ అన్నింటికీ ఒకటే మూలకారణం అంటుంది శాస్త్రం. మనం ధర్మాన్ని

పాటించకపోవటమే ఆ కారణం. అది నిన్న మొన్న అవచ్చు, గతంలో ఎప్పుడో చేసి ఉండవచ్చు.

అందువల్ల మన సమస్యలకు మనమే కారణం. మనమే బాధ్యులం. ధర్మాన్ని ఉల్లంఘించటం మన సమస్యకు కారణమైతే, ధర్మాన్ని తిరిగి పాటించటమే సమస్యకు పరిష్కారం. అటువంటి ధార్మిక జీవనాన్ని పాటించాలని కృష్ణపరమాత్మ 3,16,17 అధ్యాయాల్లో నొక్కి వక్కాణించాడు. వేళకు భోజనం చేయటం, అది కూడా సరియైన ఆహారం తీసుకోవటం, వ్యాయామం చేయటంలాంటివి చేస్తే శారీరక ఆరోగ్యాన్ని రక్షిస్తే, ధార్మిక జీవన విధానం, మనను మన సమస్యలనుంచి రక్షిస్తుంది.

**2. ప్రాయశ్చిత్త కర్మలు-** ఒక్కోసారి ధార్మిక జీవనం గడిపినా, అన్ని సమస్యలూ తీరవు. కొంతమంది ఎంత శ్రద్ధగా ఆరోగ్యసూత్రాలు పాటించినా అనారోగ్యం పాలవుతారు. అటువంటప్పుడు శాస్త్రం ప్రత్యేకప్రార్థనలను సూచిస్తుంది. దాన్ని ప్రాయశ్చిత్తకర్మలు అంటారు. అంటే అవి పరిహారాన్ని సూచిస్తాయి. మన నిత్యపూజల్లోనే ఎన్నో ప్రాయశ్చిత్తకర్మలు ఉన్నాయి. అందులో సంధ్యావందనం ఒకటి. రుద్రం చదవటం అన్నిటికన్నా ఎంతో శక్తివంతమైన ప్రాయశ్చిత్త ప్రార్థన.

**3. యోగకౌశలం-**ధర్మం పాటించినా, ప్రాయశ్చిత్తప్రార్థనలు చేసినా కొన్ని సమస్యలు తీరవు. శాస్త్రంలోనే అటువంటి అవస్థలు పడ్డవారి కథలు ఎన్నో ఉన్నాయి. ధర్మరాజు, నలుడు, హరిశ్చంద్రుడు- వీరు ధార్మికజీవనానికి ప్రతీకలు. వీరు ప్రాయశ్చిత్త ప్రార్థనలు కూడా చేశారు. కాని అంతులేని కష్టాలకు లోనయ్యారు. ఇటువంటి పరిష్కారం లేని సమస్యలను ఎదుర్కోవటానికి ఒకటే పద్ధతి ఉంది- అది ఈ కష్టాలను కూడా పాఠం నేర్పే అనుభవాలుగా మలచుకోవాలి. దీన్ని **యోగకౌశలం** అంటారు.

విషంనుంచి మందు తయారుచేయటం లాంటిది ఇది. విజ్ఞానశాస్త్రం ఎంత అభివృద్ధి చెందిందో చూడండి! ప్రాణాన్ని తీసే విషాన్ని ప్రాణం పోసే మందుగా మార్చింది. విషాన్ని మందుగా మార్చగలిగితే, బాధను తపస్సుగా మలచుకోవచ్చు.

**ఏతద్వై పరమం తపో యద్వ్యాహితస్తప్యతే పరమగ్ం హైవ।**
**లోకం జయతి య ఏవం వేద॥ - బృహదారణ్యకం 5-11-1**

నయం చేయలేని అనారోగ్యంతో బాధపడాల్సి వస్తే దాన్ని ఒక విధమైన తపస్సుగా మలచుకోవాలి. ఇది చెప్పినంత తేలిక కాదు ఆచరించటం. దీనికి చాలా శిక్షణ, అంతులేని ప్రయత్నం కావాలి. మన దృక్పథాన్ని మార్చుకోవటానికి

తీవ్రమైన కృషి చేయాలి. బాహ్యముఖంతో చూడటం మానేసి, అంతర్ముఖులమవ్వాలి. మానసిక స్థాయిలో, అంతర్గతంగా కృషి చేయాలి. శోకింపదగని వాటి గురించి శోకింపకూడదు.

**4. ఆత్మజ్ఞానం–** ఆత్మజ్ఞానం అన్నింటిలోకి అత్యంత గొప్ప రక్షణకవచం. ఆత్మజ్ఞానం ఒక సమస్యకు పరిష్కారం చూపితే, అది శాశ్వత పరిష్కారం అవుతుంది. ఆ సమస్య వెనుకకు తిరిగి చూడకుండా పారిపోతుంది.

**యద్ జ్ఞాత్వా న పునర్మోహమ్ ఏవం యాస్యసి పాండవ। – గీత 4-35**

ఓ అర్జునా! ఈ తత్త్వజ్ఞానము పొందితే నువ్వు మళ్ళీ ఇటువంటి వ్యామోహంలో చిక్కుకోవు.

తక్కిన మూడు కవచాలూ సాపేక్షిక పరిష్కారాన్నిస్తాయి.

జ్ఞానం ఆత్యంతిక పరిష్కారాన్నిస్తుంది. జ్ఞానం శాస్త్రంనుంచి వస్తుంది.

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ।**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః॥ – గీత 18-66**

సర్వధర్మాలను నాకు సమర్పించు. సర్వశక్తిమంతుడను, సర్వాధారుడను, పరమేశ్వరుడను అయిన నన్నే శరణుజొచ్చు. అన్ని పాపాలనుంచి నిన్ను నేను విముక్తుణ్ణి చేస్తాను. నువ్వు శోకింపకు.

ఇది భగవద్గీతలో కృష్ణపరమాత్మ చెప్పిన ఆఖరి మాట. శరణాగతి సూత్రాన్ని ఒక్కముక్కలో చెప్పాడు పరమాత్మ. భగవద్గీత భాష్యంలో శంకరులవారు నీ ఫ్రీవిల్‌ను సమర్పించు; నీ బాధ్యతలను దేవుడిమీద వేయి, భగవానుని లీలలు జరుగుతాయని ఎదురుచూడు అని చెప్పలేదు. శంకరులవారు, జ్ఞానం పొందాలి అని చాలా స్పష్టంగా చెప్పారు.

సాంప్రదాయ పద్ధతి శాస్త్రాన్ని సాక్షాత్తూ ఆ భగవానుడే ఇచ్చాడంటుంది. భగవంతుడు శాస్త్రంద్వారా మనతో మాట్లాడాడు. ఇవాళ కూడా, మనం శాస్త్రాన్ని గురువుద్వారా అధ్యయనం చేయవచ్చు. శాస్త్ర అధ్యయనంద్వారా మనను మనం రక్షించుకోవచ్చు. అందువల్ల శరణాగతి అంటే శాస్త్రాన్ని శరణువేడు, గురువును శరణు వేడు అని అర్థం.

ఈ శివరాత్రి శుభసందర్భంలో ఆ పరమశివుని దక్షిణామూర్తిగా కొలుద్దాము. ఆయన శాస్త్రంద్వారా మనకు రక్షణ కల్పించాడు. అందువల్ల శాస్త్రాన్ని అధ్యయనం చేద్దాము. శాస్త్రం చేసిన బోధను పాటిద్దాము. అదే అసలైన శరణాగతి.

# 7. శివరాత్రి మాహాత్మ్యమ్

మనిషిగా మనకుండాల్సిన ప్రాథమిక లక్ష్యం ఆధ్యాత్మిక ఎదుగుదల అని మన శాస్త్రాలు పదే పదే చెబుతాయి. దీన్ని మోక్షం అనీ, ఈశ్వరప్రాప్తి అనీ అంటారు. మనం సాధించే తక్కిన లక్ష్యాలు రెండవ శ్రేణికి చెందినవి. జంతువులు కూడా ఆహారాన్ని సంపాదిస్తాయి. వాటి పిల్లలకు ఆహారం సంపాదించే విషయంలో శిక్షణ కూడా ఇస్తాయి. అందువల్ల ఆహారం సంపాదించటం, ఇల్లు కట్టుకోవటం, కుటుంబాన్ని నడిపించటం, అంతులేని ఐశ్వర్యాన్ని పొందటం– ఇవి మాత్రమే చాలదు, మనిషిగా ఉన్నతిని సాధించాలంటే, ఈ లక్ష్యాలను పొందకూడదని కాదు దీని అర్థం, కాని ఇవి మాత్రమే కాదు, ప్రాథమిక లక్ష్యం వేరే ఉందని గ్రహించాలి.

ఆధ్యాత్మిక సాధన మన లక్ష్యాల్లో అన్నిటికన్నా పైన ఉండాలి! కాని మనకు ఈ విషయం తెలియదు కాబట్టి, మనకు శాస్త్రం చెప్పవలసి వస్తున్నది. శాస్త్రం చెప్పి ఊరుకోకుండా, పదే పదే చెప్పాల్సి ఉంటుంది. ఎందుకంటే మనకు ఆధ్యాత్మిక సాధన చేయాలని తెలిసినా కూడా, దానికి సమయం వెచ్చించే తీరిక లేక దాన్ని వెనక్కి తోసేస్తూ ఉంటాము.

**బాలస్తావత్క్రీడాసక్తః తరుణస్తావత్తరుణీసక్తః।**
**వృద్ధస్తావచ్చిన్తాసక్తః పరమే బ్రహ్మణి కోఽపి న సక్తః॥ –భజగోవిందం**

బాల్యంలో క్రీడలమీద ఆసక్తి, తరుణ వయస్సులో స్త్రీమీద ఆసక్తి, వృద్ధాప్యంలో చింతలతో మునిగిపోతే, బ్రహ్మ గురించి ఆలోచించే తీరిక ఎవరికి ఉంది? మరీ చిన్నప్పుడు, ఆధ్యాత్మిక చింతన ఇప్పుడేనా, తరువాత చేయవచ్చులే అనుకుంటాము. కాని వృద్ధాప్యంలోకి అడుగుపెట్టేసరికి ప్రాపంచిక చింతలతో కూరుకుపోతాము. అంతేకాక ఇంద్రియాలు కూడా బలహీనమైపోతాయి. అలా జీవితాంతం ఏదో ఒక హడావిడిలో మునిగితేలుతూ మన అంతిమగమ్యాన్ని మర్చిపోతుంటాము. ఈ కారణంవల్లనే మన శాస్త్రం ఇన్ని పండుగలనూ, వ్రతాలనూ ఏర్పరచింది. దీనిద్వారా మనను నిరంతరం హెచ్చరిస్తూనే ఉంటుంది. 'నీ అంతిమ లక్ష్యం ఆధ్యాత్మికతనే సుమా,' అంటూ.

పండుగలు రెండు రకాలు– ఒకటి, కేవలం ఆనందానికే కేటాయించబడినది. ఉదాహరణకు దీపావళి. ఆ పండుగకు కొత్తబట్టలు, ఆభరణాలు కొనుక్కుంటాము. బంధుమిత్రులను కలుస్తాము; టపాకాయలు కాలుస్తాము. రెండవరకం పండుగలు వ్రతాలలాంటివి. అవి ఆనందంకోసం కాదు, ఆధ్యాత్మిక

లక్ష్యం గుర్తు చేయటంకోసం ఏర్పడినవి. శివరాత్రి అందులో ఒకటి. ఇది ఆనందం కోసం కాదు, ఒకసారి మన పరుగుపందెం ఆపి, 'నేనేం చేస్తున్నాను?' అని మనను మనం అంతర్వీక్షణం చేసుకోవటంకోసం.

వర్ణాశ్రమధర్మాలను తీసుకుంటే, ఒక వ్యక్తి గృహస్థ ఆశ్రమధర్మంనుంచి వానప్రస్థానికి, దాన్నుంచి సన్యాసానికీ మారతాడు. అలా ఆశ్రమం మారినకొద్దీ ప్రాపంచిక విషయాల వెంట పరుగులు తగ్గుతూ వచ్చి, ఆధ్యాత్మిక చింతన పెరుగుతూ రావాలి. మనం వెచ్చించే సమయాన్ని కూడా క్రమంగా ప్రాపంచిక సుఖాలమీద తక్కువ చేస్తూ, ఆధ్యాత్మిక విషయాలమీద పెంచుతూ రావాలి. చివరికి సన్యాసాశ్రమానికి చేరుకునే సరికి నూటికి నూరుశాతం సమయం ఆధ్యాత్మికతకే వినియోగింపబడాలి. అందువల్ల మనను మనం తరచు ఈ ప్రశ్న వేసుకుంటూ ఉండాలి, 'నేను నా సమయాన్ని వెచ్చించటంలో అంతకుముందుకన్నా మెరుగ్గా గడుపుతున్నానా లేదా?'

వ్రతాలు రెండు రకాల సాధనల గురించి గట్టిగా చెబుతాయి. ఉపవాసం, సత్కథా శ్రవణం. ఉపవాసం అంటే ఆహారం తినకుండా ఉండటం. **ఆహారమే కాదు, ఏ రకమైన ఆనందం కూడా ఈ రోజు అనుభవించకూడదు.** ఉపవాసం ఒక విధమైన ప్రాయశ్చిత్తకర్మ కూడా. అందువల్ల అది శరీరాన్నే కాదు, మనస్సును కూడా శుద్ధిపరుస్తుంది. సత్కథా శ్రవణం అంటే శాస్త్రం వినటం. ఈ రెండు సాధనలూ ప్రతి ఏకాదశి రోజూ చేయాలి. ఒకవేళ మన ఆరోగ్యం సహకరించకపోతే, శుద్ధ ఉపవాసం ఉండే బదులు, తేలికగా ఆహారం భుజించవచ్చు. ఇది కూడా మనకు కష్టమైతే, ఏడాదికి ఒక రోజు ఉపవాసం ఉండవచ్చు. అది వైకుంఠ ఏకాదశి రోజు కాని, శివరాత్రి రోజు కాని.

శాస్త్రం వినటంవల్ల మన ఆధ్యాత్మిక లక్ష్యం గుర్తుకొస్తుంది.

**మా కురు ధనజనయౌవనగర్వం, హరతి నిమేషాత్కాలస్సర్వమ్।**
**మాయామయమిదమఖిలం హిత్వా బ్రహ్మపదం త్వం ప్రవిశ విదిత్వా॥**
**– భజగోవిందం**

ధనం, జనం, యవ్వనం ఉందని గర్వించకు. అన్నింటినీ కాలం క్షణంలో హరించివేస్తుంది. ఒకవేళ వాటిని హరించకపోయినా నిన్ను హరిస్తుంది. ఈ జగమంతా మాయామయం అని తెలుసుకుని, బ్రహ్మపదంలోకి ప్రవేశించు.

పరమశివుణ్ణి మోక్షంకోసం ప్రార్థించండి, సద్గురు సహాయం తీసుకోండి. అప్పుడు ప్రాపంచిక సుఖాలమీద ఆధారపడకుండా అసలైన ఆనందాన్ని పొందుతారు.

**అఙ్గం గలితం పలితం ముణ్డం దశనవిహీనం జాతం తుణ్డమ్।**
**వృద్ధో యాతి గృహీత్వా దణ్డం తదపి న ముఞ్చత్యాశాపిణ్డమ్॥**
**– భజగోవిందం**

శరీరం కృశించిపోతున్నది; తలమీద వెంట్రుకలు రాలిపోతున్నాయి; నోరు అంతా బోసిపోతున్నది; వృద్ధుడు కర్ర ఊతగా పట్టుకుని రావాలి; అయినా ఆశ చావదు.

శంకరులవారు, రోజురోజుకీ వయస్సు పైన పడుతున్నది.ఆలస్యం చేయవద్దు, ఇవాళే మొదలుపెట్టండి అంటున్నారు.

శివరాత్రి ఒక మహాపర్వదినం. అది మనకు మన ఆధ్యాత్మిక సాధనను గుర్తుచేస్తుంది. ఈ రోజు రుద్రపారాయణం 11 సార్లు లేదా 121 సార్లు చేస్తారు. రుద్రపారాయణం చేస్తే అది మన పాపాలను హరించి వేస్తుంది. పాపాలను తొలగించుకుని, శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి. ఆధ్యాత్మిక మార్గంలో ఇది చాలా ముఖ్యమైన సాధన. దీనికోసం రోజూ ఒక అరగంటో, గంటో కేటాయించుకోవాలి. నేటి కాలమాన పరిస్థితుల్లో శాస్త్రాన్ని అధ్యయనం చేయటం చాలా తేలిక. క్యాసెట్లు, పుస్తకాలు దొరుకుతాయి. అనేక టీవీ ఛానెల్స్ ఉపన్యాసాలను, ప్రసంగాలను చూపిస్తాయి. యూట్యూబ్‌లో ఏది కావాలన్నా దొరుకుతుంది. ఉపనిషత్తు అర్థం చేసుకోవటం కష్టమనుకుంటే, తేలిగ్గా అర్థమయ్యే రామాయణ,భాగవతాలు చదవవచ్చు. శాస్త్రాన్ని అధ్యయనం చేస్తే ఆత్మజ్ఞానం కలుగుతుంది.

ఈ శివరాత్రి రోజున రుద్రంలో ఉన్న ధ్యానశ్లోకాల అర్థాన్నిచూద్దాము. అన్ని ధ్యానశ్లోకాల్లోనూ కొన్ని ప్రత్యేకతలు ఉంటాయి. భగవంతుణ్ణి మూడు భిన్నరూపాల్లో చూపిస్తాయి. ఇది పరోక్షంగా వైదిక బోధను విశదపరుస్తుంది. మొదట భగవంతుణ్ణి ఒక వ్యక్తిగా వర్ణిస్తాయి. ఎందుకంటే ఆధ్యాత్మిక సాధన తొలిరోజుల్లో నిరాకార బ్రహ్మను ఊహించుకోవటం కష్టం. అందువల్ల భగవంతుడికి ఒక రూపం ఇవ్వటం జరిగింది. శివుడు, పార్వతి, గణేశుడు, విష్ణువు, లక్ష్మీదేవి, సరస్వతి– ఇలా ఏదో ఒక రూపంలో కొలుస్తాము. ఇలా ఒకరూపంలో ఉన్న పరమాత్మను **ఏకరూప ఈశ్వరుడు** అంటారు.

రెండవ రూపం, దేవుడు ఒక్కరూపంలోనే లేడు అనేక రూపాల్లో ఉన్నాడు అని చెప్పటం. ఇందులో అందరు దేవుళ్ళు (శివుడు, విష్ణువు, హనుమంతుడు అలా ఎందరో) రావటమే కాక మనుష్యులు, పశుపక్ష్యాదులు,ఆఖరికి జడవస్తువులు కూడా వస్తాయి. దీన్ని విశ్వరూప ఈశ్వరుడు లేదా **అనేకరూప ఈశ్వరుడు** అంటారు. ఇది పరోక్షంగా మనం విశాలదృక్పథం ఏర్పరచుకోవాలని చెబుతుంది. ఫక్తు శివభక్తుడు, విష్ణు ఆలయానికి వెళ్ళడు; ఫక్తు వైష్ణవుడు శివాలయానికి వెళ్ళడు, విభూతి పెట్టుకోడు. ఈ భావనలో అలా కాకుండా సర్వత్ర ఈశ్వరదర్శనం చేయాలి. హిందూ దేవుళ్ళనే కాదు, తక్కిన మతాలకుచెందిన దేవుళ్ళను కూడా భక్తితో చూడాలి.

మూడవ రూపం, దేవుడు నిరాకారుడు. దేవుడు పారమార్థిక సత్యం, సర్వవ్యాపకుడు. ఆ దేవుణ్ణి **అరూప ఈశ్వరుడు** అంటారు. స్వచ్ఛమైన స్ఫటికంలా స్వచ్ఛతకు, శుద్ధానికి ప్రతీక దేవుడు.

ధ్యానశ్లోకాలు ఈశ్వరునికి మూడు కన్నులు ఉన్నట్టుగా వర్ణిస్తాయి. రెండు కన్నులు మామూలు కన్నులు. మూడవకన్ను జ్ఞాననేత్రం! శివునికి ఐదు తలలు ఉన్నాయి. అవి సృష్టి, స్థితి, లయ, నిగ్రహ, అనుగ్రహాలకు సూచనలు. గంగాదేవి ఆయన జటాఝూటాలనుంచి ప్రవహిస్తుంది. నెలవంక తలలో ఒక పక్క మెరుస్తుండగా, మెడలో ఆభరణంగా పాము అలంకరించుకుని ఉంటుంది. విషం శివుని కంఠంలో ఉండటంవల్ల నీలకంఠుడు అయ్యాడు. పులిచర్మం ఆయన వస్త్రాలంకరణ. తన చేతుల్లో కమండలం, జపమాల, స్థూలం ఉంటాయి. అందరికీ ఆశ్రయమిస్తాడు.

శివుణ్ణి అటు భోగస్వామిగానూ, ఇటు యోగస్వామిగానూ కీర్తిస్తారు. ఆభరణాలన్నీ ధరిస్తే భోగస్వామి, అన్నీ త్యజించి ధ్యానముద్రలో ఉంటే యోగస్వామి. అలాగే పార్వతితో ఉంటే గృహస్థు, ఒంటరిగా ఉంటే సన్న్యాసి. అలా రెండు ఆశ్రమ ధర్మాలకూ ప్రతీక. ఇవి వరుసగా ప్రవృత్తిమార్గాన్నీ, నివృత్తిమార్గాన్నీ సూచిస్తాయి. శివుణ్ణి ఏ రూపంలోనన్నా కొలవవచ్చు. శివుడు అమృతంలో ఓలలాడుతాడు. ఇది అమృతత్వానికి ప్రతీక. ఆయన కొలువై ఉన్న సింహాసనం చుట్టూ దిగ్దేవతలు ఆరాధిస్తూ ఉంటారు. శివుణ్ణి దేవతలూ, అసురులూ ఇద్దరూ కొలుస్తారు. ఎందుకంటే ఆయన కోరిన వరాలను ప్రసాదిస్తాడు. ఇది శివుని వర్ణన – **ఏకరూపంలో. విశ్వరూపంలో** చూస్తే శివుడు కైలాసంలో కొలువై ఉన్న

ఒక మూర్తి కాదు. ఆయన కైలాసంలో కూడా ఉన్నాడు, భూలోకంలో కూడా ఉన్నాడు.

ధ్యానశ్లోకాల్లో నిరాకార ఈశ్వరుడి వర్ణన అక్షరం (క్షరము లేని), నిత్యం (శాశ్వతమైన), శుద్ధం(నిర్మలమైన), అవ్యయం (మార్పులేని) బ్రహ్మగా వస్తుంది. ఈ పదాలు శివునియొక్క నిర్గుణబ్రహ్మ స్వరూపాన్ని వర్ణిస్తాయి. శివుడు గుణాతీతుడు. వేదాంతపరిభాషలో గుణాలు అంటే దోషాలు.

అందువల్ల శివరాత్రి రోజు, మన ఇష్టాయిష్టాలనుబట్టి శివుణ్ణి ఏకరూప ఈశ్వరునిగానో, విశ్వరూప ఈశ్వరునిగానో, నిర్గుణ బ్రహ్మగానో కొలవవచ్చు. ఎలా కొలిచినా, కొలవటం మానకూడదు. ఇది నిరంతరం కొనసాగాలి.

# స్వామీజీ సూక్తిముక్తావళి

**బ్రహ్మసత్యం, జగన్మిథ్యా** బోధ నుంచి నేర్చుకోవాల్సిన ఆచరణీయ పాఠం– భగవంతునిమీద ఆధారపడు, ప్రపంచంమీద ఆధారపడకు. ప్రపంచం అందంగా, ఆకర్షణీయంగా ఉండవచ్చుకాని శాశ్వతం కాదు. అందువల్ల ప్రపంచంలో దేనితోనూ ఎన్నడూ బంధం పెంచుకోవద్దు.

శివుణ్ణి అటు భోగస్వామిగానూ, ఇటు యోగస్వామిగానూ కీర్తిస్తారు. ఆభరణాలన్నీ ధరిస్తే భోగస్వామి, అన్నీ త్యజించి ధ్యానముద్రలో ఉంటే యోగస్వామి. అలాగే పార్వతితో ఉంటే గృహస్థు, ఒంటరిగా ఉంటే సన్న్యాసి. అలా రెండు ఆశ్రమ ధర్మాలకూ ప్రతీక. ఇవి వరుసగా ప్రవృత్తిమార్గాన్నీ, నివృత్తిమార్గాన్నీ సూచిస్తాయి. శివుణ్ణి ఏ రూపంలోనన్నా కొలవవచ్చు.

# 8. శివమహిమ

శివరాత్రి మంగళకరమైన రోజు ఎందుకంటే ఆ రోజు మంగళాలకు మంగళాకారుడైన శివుణ్ణి పూజిస్తాము. ఆధ్యాత్మిక జీవనం గడిపేవారికే కాదు, లౌకిక జీవనంలో మునిగి తేలుతున్న వారికి కూడా ప్రత్యేకమైన రోజే ఇది! లౌకిక జీవనం గడిపేవారికి వారి జీవనవిధానాన్ని మార్చుకోమని గుర్తు చేసే రోజు. మన శాస్త్రాలు నాలుగు పురుషార్థాలను సూచించాయనీ అవి ధర్మార్థకామమోక్షాలనీ అందరికీ తెలిసిందే. మన పరుగు అర్థకామాల వెంట నిరంతరంగా సాగుతోంది. శివరాత్రి లాంటి మంగళకరమైన రోజులు మన పరుగు ఒకసారి ఆపి, అర్థకామాలు కాదు, ధర్మమోక్షాలు ముఖ్యం, వాటి గురించి ఆలోచించు అని మనకు గుర్తు చేస్తాయి.

ఒక్కసారి వృద్ధాప్యంమీద పడుతున్న మన వయస్సును లెక్కలోకి తీసుకుంటే, ఇంకా ఎన్నాళ్ళు బ్రతుకుతామో తెలియదు. మళ్ళీ మనిషిగానే పుడతామో లేదో తెలియదు. **మనిషిగా పుట్టినందుకు, ఆధ్యాత్మికంగా ఎదిగితేనే దానికి సార్థకత.** కాని మనం లౌకిక జీవితంలో ఎంతగా తలమునకలయిపోయామంటే, మనను ఏదో ఒకటి పట్టి కుదపాలి. ఇలా శివరాత్రిలాంటి పర్వదినాలు అలా పట్టి కుదపగలవు మనను. మనం ఒకవేళ ఇంకా ఆధ్యాత్మికతవైపు మొగ్గుచూపకపోతే, ఈ సందర్భాన్ని వినియోగించుకుని శుభారంభం చేయవచ్చు. మనం ఆధ్యాత్మిక మార్గంలోకి అడుగుపెట్టి ఉంటే, జ్ఞానవైరాగ్యాలను ప్రసాదించమని కోరుకోవచ్చు.

ధర్మ, అర్థకామాలను ప్రవృత్తిమార్గాలనీ, మోక్షాన్ని నివృత్తిమార్గమనీ అంటారు. ధర్మ, అర్థకామాలు ప్రేయోమార్గాలయితే, మోక్షం శ్రేయోమార్గం; అంటే మొదటివి మనకు ప్రియమైనవి; ఆఖరిది మనకు శ్రేయస్కరమైనది. శివరాత్రి రోజు మనం శివుణ్ణి దక్షిణామూర్తిగా కొలుస్తాము. దక్షిణామూర్తి ఆత్మజ్ఞాన ప్రదాత. దక్షిణామూర్తిని కొలిస్తే ఆయన మనను ప్రేయోమార్గంనుంచి, శ్రేయోమార్గంవైపు నడిపిస్తాడు.

శివరాత్రి రోజు దేశమంతటా పూజలు నిర్విరామంగా కొనసాగుతాయి. శ్రీరుద్రం, వేదాల్లో ఉన్న అత్యంత మంగళకరమైన మంత్రం పఠిస్తారు. అందులో ఒక మంత్రం చాలా ప్రసిద్ధి చెందింది. ఎందుకంటే దాన్ని విడిగా కూడా అధ్యయనం చేస్తారు. అది –

**నమస్తే అస్తు భగవన్విశ్వేశ్వరాయ మహాదేవాయ త్ర్యంబకాయ త్రిపురాంతకాయ త్రికాగ్నికాలాయ కాలాగ్నిరుద్రాయ నీలకంఠాయ మృత్యుంజయాయ సర్వేశ్వరాయ సదాశివాయ శ్రీమన్మహాదేవాయ నమః**

ఈ అద్భుతమైన మంత్రంలో శివునికి అనేక నామాలు ఉన్నాయి. ఒక్కొక్క నామం శివునియొక్క ఒక్కొక్క మహిమనూ కీర్తిస్తుంది. ఈ మంత్రం అర్థం తెలుసుకుంటే, దాన్ని పఠించేటప్పుడు గుడ్డిగా చదువుకుంటూ పోకుండా, దాని అర్థాన్ని మనసులో నిలుపుకుని, శివుని మహిమను గుర్తు చేసుకోగలుగుతాము. **నమస్తే అస్తు భగవన్–** భగవాన్ పేరుతో శివుణ్ణి కొలుస్తున్నాము. నమస్తే అస్తు భగవన్ అంటే ఓ దేవా! నీకు నా నమస్కారములు.

**విశ్వేశ్వరః –** విశ్వం అంటే జగత్తు; ఈశ్వర అంటే పాలకుడు. విశ్వేశ్వరుడు అంటే జగత్తును పాలించేవాడు. అంటే జగత్తును నియంత్రించేవాడు. నాలుగురోడ్ల కూడలిని అదుపులో పెట్టటానికే ట్రాఫిక్ లైట్లు, ఒక పోలీస్ కావాలంటే జగత్తును నియంత్రించటానికి ఎన్ని వేల సూత్రాలు ఉండాలో ఆలోచించండి. భగవంతుడు ఏర్పరచిన ఈ ప్రకృతిసూత్రాలవల్లనే ఋతువులు సక్రమంగా నడుస్తున్నాయి. వానలు సమయానికి పడుతున్నాయి; వాతావరణం కాలానికి తగ్గట్టుగా మారుతున్నది. మన రాజ్యాంగం నిర్వర్తించటానికి ఎలాగైతే అధికారి కావాలో అలా ఈ జగత్తును సక్రమంగా నిర్వర్తించటానికి, మన నైతిక కర్మలను, కర్మఫలాలను చూడటానికి ఒక నియంత కావాలి.

ఇక్కడ ఒక ట్రాఫిక్ రూలుని అతిక్రమించినా, ఏదో విధంగా తప్పించుకో గలమేమో కాని, ప్రకృతి సూత్రాలనుంచి తప్పించుకోలేము. నైతిక సూత్రాలను పాటిస్తే పుణ్యం వస్తుంది; అతిక్రమిస్తే పాపం వస్తుంది. ఈ సూత్రాలను నియంత్రించేది విశ్వేశ్వరుడు. శివుణ్ణి విశ్వేశ్వరునిగా అంటే కర్మఫలదాతగా కొలిస్తే, ఏదొచ్చినా మన కర్మఫలంగా స్వీకరించటం నేర్చుకుని, అప్పుడే ఆయనను నిందించటం మానుతాము. దేవునికి పక్షపాతబుద్ధి లేదని గ్రహించి, ఆయనను శరణు వేడతాము. శరణాగతి అంటే శారీరకంగా శరణు వేడటం కాదు. దేవుణ్ణి నిందించకుండా మనకొచ్చిన కర్మఫలాన్ని సంతోషంగా స్వీకరించటం.

విశ్వేశ్వరాయ అంటే విశ్వేశ్వరునికి నా నమస్కారములు అని అర్థం. ప్రతి నామం అలాగే వస్తుంది. త్ర్యంబకాయ అంటే త్ర్యంబకునికి నా నమస్కారములు.

**మహాదేవః –** మహాదేవ పదానికి అనేక అర్థాలున్నాయి. ఒక అర్థం జ్యోతి. ఈ జగత్తులో అనేక జ్యోతులున్నాయి. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, అగ్ని, మెరుపు. ఈ జ్యోతులకే జ్యోతి భగవానుడు. **జ్యోతిషాం జ్యోతిః.** ఈ జ్యోతివల్లనే తక్కిన జ్యోతులు ప్రకాశిస్తాయి. కన్ను ఒక జ్యోతి. కాని కన్ను వెనుక మనస్సు లేకపోతే, కన్ను చూడలేదు. అందువల్ల మనస్సు ఇంకో జ్యోతి. మనస్సుని సాక్షిగా చూసేది దాని వెనుకనున్న సాక్షిచైతన్యం. ఈ సాక్షిచైతన్యమే మహాదేవ.

**త్ర్యంబకః –** త్రయ అంటే మూడు, అంబక అంటే కన్ను. శివుడు ముక్కంటి. రెండు కళ్ళు వ్యావహారిక ప్రపంచాన్ని చూస్తాయి. మూడవ కన్నును జ్ఞాననేత్రం అంటారు. అది సృష్టి వెనుకనున్న సత్యాన్ని అంటే ఆత్మతత్వాన్ని తెలుసుకోవటానికి తోడ్పడుతుంది. ఛాందోగ్యోపనిషత్తులో ఈ విషయం ఒక అద్భుతమైన ఉదాహరణద్వారా నిరూపించబడుతుంది. గురువు శిష్యుణ్ణి ఉప్పు కణికెను నీటిలో వేయమంటారు. అది కరిగిపోయాక, శిష్యుణ్ణి నీటిలోంచి ఉప్పు తీయమంటాడు. అది కంటికి కనపడదు. చేతితో తడిమి చూస్తాడు. స్పర్శకు అందదు. అంటే రెండు ప్రమాణాలకు అందలేదు. అయితే మూడు చోట్లనుంచి తాగి చూడమంటాడు. అంతా ఉప్పగా ఉంది. అంటే రుచికి  అందింది. కన్ను చూడలేని దాన్ని రుచి తెలుసుకుంది. అందువల్ల ఒక ప్రమాణానికి అందనంత మాత్రాన లేదనకూడదు.

అలాగే, ఐదు ప్రమాణాలు బాహ్యప్రపంచాన్ని చూడగలవు కాని, ఆ జగత్తు అంతా వ్యాపించి ఉన్న పరమాత్మను తెలుసుకోలేవు. ఆత్మజ్ఞానం పొందటానికి వేరే ప్రమాణం కావాలి. దాన్ని శబ్దప్రమాణం అంటారు. ఈ జ్ఞాన నేత్రాన్ని మూడవ కంటితో సూచిస్తారు. నిజంగా మూడవ కన్ను ఉన్నట్టు కాదు. రెండు కళ్ళు అపరావిద్య లేదా లౌకికవిద్యను సూచిస్తే, మూడవకన్ను పరావిద్య లేదా ఆత్మవిద్యను సూచిస్తుంది. శివునికి రెండు విద్యలూ తెలుసు– శివుడు సర్వజ్ఞ (అపరావిద్య తెలుసు) సర్వవిత్ (పరావిద్య తెలుసు). శివుణ్ణి ధ్యానించటంవల్ల మనకు కూడా జ్ఞాననేత్రం వస్తుంది. అంటే మనం కూడా పరావిద్యను పొందుతాము.

**త్రిపురాంతకః–** పురాణగాథల్లో ఒక గాథలో, ముగ్గురు రాక్షసులు కేవలం వారి కోసం మూడు రాజ్యాలను సృష్టించుకున్నారు. పుర అంటే రాజ్యం, త్రి అంటే ముగ్గురు. అందువల్ల వారిని త్రిపురాసురులు అంటారు. ఈ రాజ్యాలు బంగారం, వెండి, ఇనుములతో తయారుచేయబడ్డాయి. ఆ రాజ్యాలు ఎగరగలవు. ఈ త్రిపురాసురులు బ్రహ్మనుంచి ఒక వరం పొందారు. ఏమని? మూడు పురాలు ఒక్కచోటికి వచ్చినప్పుడు మాత్రమే వారిని ఎవరైనా హతమార్చగలరు. అంటే

వారిని చంపాలంటే, మూడు రాజ్యాల్లోంచి ఒక్కసారే దూసుకువెళ్ళేటట్టుగా బాణాన్ని సంధించాలి. అది అంత తేలిక వ్యవహారం కాదు. అందువల్ల వారు పేట్రేగిపోయారు. అరాచకాలు చేయసాగారు. అది భరించలేని దేవతలు శివుణ్ణి శరణుజొొచ్చితే, శివుడు ఒక్క బాణంతో మూడు రాజ్యాలను ధ్వంసం చేసి, ముగ్గురు రాక్షసులను హతమార్చాడు. అందువల్ల శివునికి త్రిపురాంతక, త్రిపురాలను అంతం చేసినవాడా, అనే బిరుదు వచ్చింది.

ఈ కథ వెనుక, ఆధ్యాత్మిక అర్థం వేరే ఉంది. మూడు రాజ్యాలు మనకున్న మూడు పురాలను సూచిస్తాయి. అవి– స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణశరీరం. పరమేశ్వరుడు ఈ మూడు శరీరాలను నాశనం చేస్తాడు అంటే మిథ్యా జగత్తును నాశనం చేసి, సత్యం బ్రహ్మను తెలియజేస్తాడు.

**త్రికాగ్నికాలః–** త్రిక అంటే మూడింటి సముదాయం. అగ్ని అంటే అగ్ని, కాల అంటే ఇక్కడ జ్ఞానం. త్రికాగ్ని అంటే సాంప్రదాయం ప్రకారం ఒక గృహస్థు జీవితాంతం పూజ చేయాల్సిన మూడు అగ్నులని అర్థం. వాటిని గార్హపత్యాగ్ని, దక్షిణాగ్ని, ఆహవనీయాగ్ని అంటారు. గార్హపత్యాగ్నిని పెళ్ళిలో వెలిగిస్తారు. దాన్ని అతను గృహస్థుగా జీవితాంతం నిత్యాగ్నిగా ఉంచాలి. నిజానికి అతని మరణం అప్పుడు ఈ గార్హపత్యాగ్నినుంచే, అతని కట్టెను దహనం చేస్తారు. ఆహవనీయాగ్నిని, దక్షిణాగ్నిని కొన్ని యజ్ఞాలలో వెలిగిస్తారు. వాటిని గార్హపత్యాగ్నినుంచి తీసుకుని, ఆ యజ్ఞం అయిపోయాక, మళ్ళీ దాంట్లో కలుపుతారు.

ఈ మూడు అగ్నులు వేదపూర్వభాగంలోని కర్మకాండను అంటే క్రతువులను సూచిస్తాయి. వేదాలు అనేక యజ్ఞ యాగాదులను సూచించినా, అక్కడితో ఆగలేదు! ఆధ్యాత్మికంగా ఎదగాలంటే, ఈ యజ్ఞాలకు అతీతంగా ఎదగాలి. ఆ ఎదగటం ఆత్మజ్ఞానం పొందితేనే సాధ్యం! ఒక సన్న్యాసిని **నిరగ్ని** అంటారు. అంటే అతను అగ్నితో పూజలు చేయడు. అతను కర్మలకు అతీతంగా ఎదుగుతాడు. శివుడు జ్ఞానాన్ని ప్రసాదించటంద్వారా సర్వకర్మలనూ నాశనం చేస్తాడు కాబట్టి, పరమేశ్వరుణ్ణి త్రికాగ్నికాల అంటారు.

**కాలాగ్నిరుద్రః–** ప్రళయకాలంలో పృథివి జలంలో లయమయితే, జలం అగ్నిలో లయమవుతుంది. కాలాగ్ని అంటే ప్రళయకాలాగ్ని. ఇక్కడ పరమేశ్వరుణ్ణి ప్రళయకాలాగ్నిగా కీర్తిస్తున్నారు. పరమేశ్వరుడు మరణం అప్పుడు మనుష్యులను ఏడిపిస్తాడు కాబట్టి రుద్రుడు అంటారు. **రోదయతి ఇతి రుద్రః**

**నీలకంఠః–** శివుడు నీలకంఠుడెలా అయ్యాడో, అందరికీ తెలిసిందే!పాల సముద్రాన్ని దేవాసురులు చిలికినప్పుడు ఎన్నో అద్భుతమైనవి బయటపడ్డాయి. వాటికోసం దేవాసురులు పోటీలుపడ్డారు కాని, విషం వచ్చినప్పుడు ఇద్దరూ భయపడ్డారు. అప్పుడు శివుని సహాయంకోసం ప్రార్థిస్తే, శివుడు ఆ విషాన్ని స్వీకరించి తన కంఠంలో దాచుకున్నాడు. అందువల్ల గరళకంఠుడని అంటారు. విషం త్రాగటంవల్ల కంఠం నీలంగా మారటంవల్ల నీలకంఠుడని కూడా అంటారు. ఆ విధంగా శివుడు, మనకు తెలిసినట్టుగా లయకారకుడు మాత్రమే కాదు, స్థితికారకుడు కూడా! తను విషం తీసుకుని, జగత్తును సంరక్షించాడు.

ఈ కథకు కూడా ఆధ్యాత్మిక విలువ లేకపోలేదు. సముద్రమథనం మన అంతర్మథనాన్ని సూచిస్తుంది. 'నేనెవరు?' ప్రశ్నకు జవాబు తెలుసుకోవాలంటే, మనం అంతర్ముఖులమవ్వాలి. మనం అంతర్ముఖులమయి, మథనపడితే, మనలో ఉన్న అశుద్ధం బోలెడు బయటపడుతుంది, ముఖ్యంగా ఆధ్యాత్మిక మార్గంలో కొత్తగా అడుగుపెట్టినప్పుడు. ఈ అశుద్ధం అనేక సమస్యలకు దారి తీయవచ్చు. వీటిని కషాయం అంటారు. అవి కోపం, నిస్పృహ, పశ్చాత్తాపం అనే రూపాలు దాల్చవచ్చు. ఇవి ఎందుకు వచ్చాయో మనకు కారణం తెలియదు. కారణం తెలియని వాటికి పరిష్కారమూ ఉండదు. కారణం లేకుండా బెంగలు వస్తే, వాటికి ఒకటే ఒక మార్గం ఉంది. అది పరమేశ్వరునికి ప్రార్థన చేయటమే! 'ఓ దేవా, నా బెంగలనే ఈ విషాన్ని నువ్వు త్రాగు!' మనకు విషమైనది పరమేశ్వరునికి ఆభరణం.

**మృత్యుంజయః–** మార్కండేయుని కథ కూడా సుప్రసిద్ధమే. మృత్యుదేవత అయిన యమధర్మరాజు మార్కండేయుని సంహరించటానికి వచ్చాడు. మార్కండేయుడు, పరమేశ్వరుని శరణుజొచ్చి, రక్షింపబడ్డాడు. మృత్యుదేవతను జయించాడు కాబట్టి మృత్యుంజయుడు అయ్యాడు ఈశ్వరుడు. మరణం అంటే భౌతిక కాయ మరణం. కాని మనం మృత్యుంజయులం కావాలని ప్రార్థన చేస్తున్నామంటే, మరణాన్ని జయించటంకోసం కాదు. మన ప్రార్థన ఎలా ఉండాలంటే, 'ఓ దేవా! నేను, నా స్థూలశరీరంనుంచి విడివడి, నా ఆత్మతో మమేకం చెందేలా చేయి. ఆ విధంగా నన్ను మృత్యుంజయుణ్ణి చేయి!' పరమేశ్వరుడు మనకు ఆత్మజ్ఞానం కలుగచేయటంద్వారా మృత్యుభయాన్ని తొలగిస్తాడు.

**సర్వేశ్వరః–** సర్వం అంటే సమస్తం; ఈశ్వరుడు అంటే ప్రభువు. సర్వేశ్వరుడు అంటే సమస్తానికి ప్రభువు. మనం మామూలుగా బ్రహ్మ సృష్టి కారకుడు. విష్ణుమూర్తి స్థితి కారకుడు; శివుడు లయకారకుడు అనుకుంటాము. కాని ఈశ్వరుడు సృష్టి,

స్థితి, లయ కారకుడు. అన్నీ ఆయనే. కాలాగ్నిరుద్ర పదంలో లయకారకుడిగా, నీలకంఠ పదంలో స్థితికారకుడిగా చూశాము. ఇప్పుడు సర్వేశ్వరుడు పదంద్వారా ఆయనను సృష్టికారకుడుగా కూడా చూస్తాము.

**సదాశివః–** సదా అంటే ఎల్లప్పుడూ. శివ పదానికి రెండు అర్థాలు ఉన్నాయి. నాశనం చేయటం; ఆధారంగా ఉండటం. **స్యతి అమంగళం ఇతి శివః –** అమంగళకరమైన వాటిని నాశనం చేస్తారు. ఇది ఒక అర్థం. **శీరతే మంగళం అస్మిన్ ఇతి శివః** మంగళకరమైన వాటికి నిలయం. పరమేశ్వరుడు సదా మంగళాలను ఇస్తాడు.

**శ్రీమన్మహాదేవః–** శ్రీమన్మహాదేవ అన్నా, మహాదేవ అన్నా ఒకటే. మహాదేవ అంటే జ్యోతిషాం జ్యోతిః అని ఇంతకుముందు చూశాము.

**నమః –** నమః అంటే నమస్కారం. విశ్వేశ్వరుడు, మహాదేవుడు, నీలకంఠుడు మొదలైన విశిష్టగుణాలున్న శివునికి నా నమస్కారములు.

అటువంటి విశిష్టగుణ సంపన్నుడైన పరమేశ్వరుని మనం శరణు వేడాలి. ప్రతిరోజూ, ప్రత్యేకించి మరీ మహాశివరాత్రి రోజు. ఈ మంగళకరమైన రోజున, ఆ పరమేశ్వరుని లౌకిక సంపదలకోసం, ఆత్మజ్ఞానంకోసం ప్రార్థిస్తాము!

# స్వామీజీ సూక్తిముక్తావళి

తిరగలిలో వేసిన పప్పుబద్దల్లో కొన్ని నలగకుండా తప్పించుకుంటాయి. ఎందుకంటే అవి కదలకుండా ఉన్న మధ్య రాటను శరణుజొచ్చాయి కాబట్టి. అలాగే మీరు కూడా జీవితంలో నలిగిపోవాల్సిన సందర్భాలను తప్పించుకోవచ్చు. ఎలాగంటే, కేంద్రమైన ఈశ్వరుణ్ణి శరణుజొచ్చుటంద్వారా.

ఎవరికి బ్రహ్మ తెలియదో వారికి బ్రహ్మ తెలుసు.

బ్రహ్మ ఆబ్జెక్టుగా తెలుసుకుంటే వారికి బ్రహ్మ అర్థం కానట్టు.

బ్రహ్మ ఆబ్జెక్టుగా తెలియదు అంటే వారికి బ్రహ్మ అర్థం అయినట్టు.

# 9. శివపంచాక్షరి, మృత్యుంజయ మంత్రాలు

శివరాత్రి ఒక మహాపర్వదినం. శివరాత్రి ప్రాముఖ్యతను వర్ణిస్తూ మన పురాణాల్లో అనేక కథలున్నాయి. అందులో ఒక కథలో, విష్ణుమూర్తి, బ్రహ్మదేవుడు పరమేశ్వరుని సరిహద్దులు కొలుద్దామనుకున్నారు. విష్ణుమూర్తి శివుని పాదాలు చూడటానికి బయలుదేరితే, బ్రహ్మ శివుని శిరస్సును చూడటానికి ఊర్ధ్వముఖంగా ప్రయాణించాడు.

విష్ణుమూర్తి వరాహరూపం తీసుకున్నాడు. ఎందుకంటే శివుని పాదాలు భూమిలోపల ఉన్నాయి. వరాహానికి భూమి లోపలకి వెళ్ళే శక్తి ఉంది. అయినా విష్ణుమూర్తి శివుని పాదాలను చూడలేకపోయాడు. తన ఓటమిని సవినయంగా ఒప్పుకున్నాడు. పరమేశ్వరుడు విష్ణుమూర్తి ముందు ప్రత్యక్షమై, 'నువ్వు నా పాదాలను చూడలేకపోయినా, ఒక మంచి పని చేశావు, నిజం చెప్పావు,' అని మెచ్చుకున్నాడు. అంతేకాక విష్ణుమూర్తిమీద అభిమానం కొద్దీ, ఆయనను జగత్తుకు స్థితికర్తగా నియమించాడు. అందువల్ల ఈశ్వరుని కృపవల్ల విష్ణుమూర్తి స్థితికర్త అయ్యాడు.

బ్రహ్మ హంసరూపం దాల్చాడు. ఆయన కూడా విష్ణుమూర్తిలాగా తన ప్రయత్నంలో విఫలమయ్యాడు. కాని ఒక పొరపాటు చేశాడు. అబద్ధం చెప్పాడు. అందువల్ల శివుడు బ్రహ్మదేవుణ్ణి ఎవరూ కొలవరని శపించాడు.

ఈ కథనుంచి రెండు పాఠాలు నేర్చుకుంటాము. పరమాత్మ అనంతరూపుడు. మనం ఆయనను కొలవటానికి వీలుగా ఒక రూపాన్నిచ్చాము అంతే. ఇంకో పాఠం సత్యం వద. సత్యమే పలకాలి. అసత్యం చెప్పకూడదు!

శివరాత్రి పర్వదినాన పూజ, ఉపవాసం, జాగరణ చేస్తారు. ఈ సందర్భంలో రుద్రపూజ ముఖ్యంగా చేస్తారు. మన సాంప్రదాయం ప్రకారం శ్రీ రుద్రం ప్రతిరోజూ పఠించాలి. రుద్రం గృహస్థుకే కాదు, అటు సన్న్యాసికి కూడా ముఖ్యమే. సన్న్యాసి వేదపారాయణం చేయకూడదు (ఉపనిషత్తులను అధ్యయనం చేయవచ్చు) కాని రుద్రం మాత్రం రోజంతా, కనీసం రోజులో ఒక్కసారైనా పారాయణం చేయాలి! దీన్నిబట్టే రుద్రం ఎంత ముఖ్యమైనదో అర్థమవుతుంది.

రుద్రం రుద్, ర అనే రెండు ధాతువులనుంచి ఏర్పడింది. రుద్ అంటే దుఃఖం లేదా పాపం. రుద్ అంటే దుఃఖం లేదా పాపాల కారణం కూడా. దుఃఖానికి

లేదా పాపానికి మూల కారణం ఏమిటి? అజ్ఞానం! ర అంటే పోగొట్టేది. అందువల్ల రుద్రం అంటే దుఃఖాన్ని పోగొట్టేది, పాపాన్ని పోగొట్టేది, అజ్ఞానాన్ని పోగొట్టేది. పరమశివునికి రుద్రం పేరు ఎందుకు వచ్చిందంటే ఆయన దుఃఖాన్ని, పాపాన్ని తొలగించి, వాటికి కారణమైన అజ్ఞానాన్ని కూడా తొలగిస్తాడు కాబట్టి! శ్రీరుద్రం ఈశ్వరుణ్ణి స్తుతిస్తుంది.

శాస్త్రాల్లో – నాలుగు వేదాలు, ఆరు వేదాంగాలు, పురాణాలు, ధర్మశాస్త్రాలు, మీమాంస, న్యాయశాస్త్రం– వేదాలు అన్నిటికన్నా గొప్పవి. వేదాల్లో, శ్రీరుద్రం ఉన్న 11 అనువాకాలు ఇంకా మంగళకరమైనవి. శ్రీరుద్రం కృష్ణయజుర్వేదంలో వస్తుంది. ఈ వేదంలో ఏడు అధ్యాయాలు ఉన్నాయి. వాటిలో మధ్యలో వస్తుంది శ్రీరుద్రం. అందువల్ల **కృష్ణయజుర్వేదాన్ని ఒక దండ అనుకుంటే, అందులో శ్రీరుద్రం మధ్యలో ఉండే పతకం లాంటిది!**

శ్రీరుద్రంలో రెండు ముఖ్యమైన, ప్రసిద్ధి చెందిన మంత్రాలు ఉన్నాయి. అవి శివపంచాక్షరీ మంత్రం, మృత్యుంజయ మంత్రం.

**శివపంచాక్షరీ మంత్రం– నమశ్శివాయ**

నమశ్శివాయ అంటే పరమశివునికి నమస్కారాలు. శివ అనే పేరు చాలా మంగళకరమైనది. నమశ్శివాయ మంత్రం అర్థం– 'అన్ని అమంగళాలను పోగొట్టే మూర్తికి, మంగళమూర్తికి నా నమస్కారాలు.' పంచాక్షరి మంత్రం జపిస్తే అనేక ప్రయోజనాలు కలుగుతాయి!

ఈ పంచాక్షరి మంత్రాన్నే శరణాగతి మంత్రం అని కూడా అంటారు. శరణాగతి అంటే దేవుని ఆజ్ఞకు కట్టుబడి ఉండటం. అంటే మనం దేవుడు నియమించిన సూత్రాలకు కట్టుబడి ఉండాలి. అవి ధర్మసూత్రాలు, కర్మసూత్రాలు. నమశ్శివాయ మనం జపిస్తున్నామంటే, నేను కర్మసూత్రానికి బద్ధుడనై ఉంటాను అని చెప్పినట్టు అర్థం. అంటే నా జీవితంలో ఏం జరిగినా, అది కర్మ సూత్రాల వల్లనే జరిగింది. అందువల్ల నాకు వచ్చిన కర్మఫలాన్ని నేను కాదనకూడదు. నా జీవితంలో ఏం జరిగినా దాన్ని ఈశ్వరప్రసాదంగా స్వీకరిస్తాను అని అర్థం.

శివుని గుడిలో ఇచ్చే విభూతిని చిన్నచూపు చూడకూడదు; విష్ణుమూర్తి ఆలయంలో ఇచ్చే పొంగలును రెట్టించిన ఉత్సాహంతో తీసుకోకూడదు. రెండింటినీ సమభావంతో తీసుకోవాలి. రెండూ ఈశ్వరప్రసాదమే! విభూతిమీద ద్వేషం పెంచుకోకూడదు! పొంగలుమీద రాగం పెంచుకోకూడదు. ఏదొచ్చినా మనస్ఫూర్తిగా స్వాగతించాలి.

అనుభవాలను స్వాగతించటం ఒక పని. అనుభవాలకు సర్దుకుపోవటం ఇంకో విషయం. ముఖ్యంగా మన కుటుంబసభ్యులతో సర్దుకుపోవాలి. వారిని ఉన్నది ఉన్నట్టుగా స్వీకరించాలి. ఒకవేళ మన పిల్లవాడి బుద్ధి మందంగా ఉంటే, దాన్ని ఈశ్వర ప్రసాదంగా స్వీకరించాలి. వచ్చినదాన్ని కర్మఫలంగా స్వీకరించటమే శరణాగతి! శరణాగతి ఫలం శాంతి!

**మృత్యుంజయ మంత్రం**

**త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్।**

**ఉర్వారుకమివ బంధనాత్ మృత్యోర్ముక్షీయ మాఽమృతాత్।।**

మృత్యుంజయ మంత్రం చాలా శక్తివంతమైన, ఒక సమగ్రమైన మంత్రం. దాన్ని పఠిస్తే, మనకు ఒక్క మంత్రంతో నాలుగు పురుషార్థాలు లభిస్తాయి. నాలుగు పురుషార్థాలు అంటే ధర్మార్థకామమోక్షాలు. ఒక్కరాయితో నాలుగు మామిడి కాయలను కొట్టినట్టుగా, ఒక్క మంత్రంతో నాలుగు పురుషార్థాలను పొందుతాము. ఈ మంత్రంలో మూడు పదాలతో పరమశివుని చాలా అందంగా వర్ణిస్తారు.

**పుష్టివర్ధనమ్ –** పుష్టి అంటే ప్రాపంచిక సుఖాలు. మన జీవితంలోని తొలిదినాల్లో, అన్నీ ప్రాపంచిక సుఖాలు కోరుకుంటాము. అంటే అర్థ, కామాలను కోరుకుంటాము. ముందుగా ప్రాథమిక అవసరాలైన తిండి, బట్ట, గూడు కావాలి. ఈ మూడు సమృద్ధిగా సమకూరాక, కొన్ని సుఖాల గురించి ప్రాకులాడుతాము. ఆ సుఖాలు ఏవైనా కావచ్చు– ఎసి, టివి, కారు వగైరా! అర్థ అంటే డబ్బు సమకూరాక, కామ అంటే కోరికల వెంట పరుగులు తీస్తాము. అర్థకామాలను కలిసి పుష్టి అంటారు. అందువల్ల మీకు అర్థకామాలు కావాలంటే, నా దగ్గరకు రండి అంటున్నది రుద్రం.

కాని పుష్టి ఒకటి మాత్రం ఉంటే సరిపోదు. దానికన్నా సూక్ష్మమైనది ఇంకోటి ఉంది. అది కాక ప్రాపంచిక లాభాలు అన్నీ విమానాలు, రైళ్ళలాంటివి. వాటికి రాకపోకలు ఉంటాయి. మనుష్యులు, డబ్బు ఈ జన్మవరకే తోడుంటాయి. మనం స్వర్గం చేరాక (అనుకుందాము), ఒకవేళ మన కుటుంబ సభ్యులకు ఉత్తరం రాస్తే, 'మీరు లేకుండా ఉండటానికి అలవాటు పడిపోయాము,దయచేసి అక్కడే ఉండండి,' అని ఉత్తరం రావచ్చు! అందువల్ల మనం మరణించాక, మనకు తోడు వచ్చేది ఏమిటి? పుణ్యకర్మ మాత్రమే!

**సుగంధిం–** అర్థకామాల తర్వాత వచ్చే పురుషార్థం ధర్మం. సగంధి అంటే సువాసన. పరమేశ్వరుడు సుగంధి, సువాసనలు వెదజల్లేవాడు. ఇక్కడ సుగంధి అంటే

అగరుబత్తులలాంటి సుగంధాలనుంచి వచ్చే సువాసనలు కావు – ఒక వ్యక్తియొక్క అసలు సువాసన అతని ప్రవర్తన. సుగంధద్రవ్యాలనుంచి వచ్చే సువాసన కొంతమేరకే వ్యాపిస్తే, మంచి ప్రవర్తనవల్ల వచ్చే సువాసన అంతటా వ్యాపిస్తుంది. వేదమే దీనికి ఉదాహరణనిస్తుంది. ఒక చెట్టు వికసిస్తే, దాని పరిమళాలు అంతటా వ్యాపిస్తాయి!

పరమేశ్వరుడు ధర్మానికి ప్రతీక. అందువల్ల శివుణ్ణి ప్రార్థిస్తే, మనం ధర్మాన్ని పొందుతాము! మనం కూడా ధార్మిక పనులు చేయాలనీ, సమాజానికి నిస్వార్థసేవ చేయాలనీ స్ఫూర్తి పొందుతాము.

**త్ర్యంబకమ్–** త్రయంబకం అంటే మూడు కన్నులు ఉన్నవాడు! శివునికి మూడు కన్నులు ఉన్నాయని అందరికీ తెలిసిన విషయమే! ఈ ముక్కంటిమీద అనేక కథలు కూడా ప్రచారంలో ఉన్నాయి. పరమేశ్వరుని విశ్వరూపాన్ని ఊహించుకున్నప్పుడు ఆయన మూడు కళ్ళు సూర్యుడు, చంద్రుడు, అగ్ని అంటారు. ఈ మూడే ఎందుకు ఎన్నుకున్నారంటే, అవి జగత్తును ప్రకాశింపచేస్తాయి కాబట్టి. పగలు సూర్యుడు ప్రకాశింపచేస్తే, రాత్రి చంద్రుడు వెలుగులను విరజిమ్ముతాడు. ఈ రెండూ లేనప్పుడు అంటే అమావాస్య రాత్రి, అగ్నిని వాడేవారు పూర్వం కాంతికోసం.

ఇంకొక కథ ప్రకారం, రెండుకళ్ళు ప్రాపంచిక నేత్రాలు. వాటితో ఈ వ్యావహారిక జగత్తును చూస్తాము. మూడవ కన్ను ఆత్మజ్ఞానాన్ని సూచిస్తుంది. దానిద్వారా మనం పారమార్థిక సత్యాన్ని 'చూడ'గలుగుతాము. పురాణాల్లో ప్రసిద్ధికెక్కిన కథల్లో ఒకటి శివుడు మన్మథుడిని తన మూడవనేత్రంతో దహించటం. మన్మథుణ్ణి కామదేవుడు అంటే కోరికల దేవుడు అని కూడా అంటారు. ఈ కథవల్ల తెలుసుకోవాల్సిన విషయం మనం కూడా మన జ్ఞాననేత్రంద్వారా మన కోరికలను భస్మం చేయాలి. జ్ఞానమొక్కటే కోరికలను దగ్ధం చేయగలదు! మన్మథుడు మన మనస్సును కోరికలతో చిలికి, దాన్ని అసహనంగా ఉండేలా చేస్తాడు. మనం శివుణ్ణి పూజిస్తే, ఆయన తన మూడవ నేత్రంతో మనను దీవిస్తాడు. అంటే మనం ఆధ్యాత్మికంగా ఎదుగుతాము.

మూడవ కథ దేవాసురుల మధ్య జరిగే వాగ్యుద్ధాలలో ఒకటి. ముగ్గురు అసురులు మూడు పట్టణాలను కట్టుకున్నారు. వాటిని రాక్షసుల శిల్పి అయిన మయుడు కట్టాడు. వాటిని వరుసగా బంగారం, వెండి, ఇనుములతో కట్టారు. ఈ అసురులు చాలా శక్తివంతులై దేవతలను పీడించసాగారు. దేవతలు పరమేశ్వరుణ్ణి శరణుజొచ్చారు. ఆయనను వేడుకున్నా, ఆయన ఒక్కడూ

ఈ రాక్షసులను హతమార్చలేడని భావించి వారు కూడా ఒక చేయి వేద్దామనుకున్నారు.

వారు వారి శక్తినంతా ఉపయోగించి ఒకరథాన్ని తయారుచేశారు. పృథివీ రథం అయింది. సూర్యచంద్రులు రథచక్రాలు అయ్యారు. హిమాలయాలు విల్లు, వాసుకి సర్పం వింటినారి, విష్ణుమూర్తి బాణం అయ్యారు. బ్రహ్మదేవుడు రథసారథి అయ్యాడు. సముద్రమంతా అంబులపొది అయ్యింది. నాలుగు వేదాలు రథానికి అశ్వాలు అయ్యాయి. యుద్ధభేరి మ్రోగించారు. శివుడు కేవలం తన మూడవకన్ను తెరిచాడు అంతే, ఏం జరుగుతున్నదో తెలిసేలోపు మొత్తం పని ముగిసిపోయింది!

మూడు పట్టణాలు శరీరత్రయాన్ని సూచిస్తాయి– స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణశరీరం; మూడు ప్రపంచాలను సూచిస్తాయి– స్థూలప్రపంచం, సూక్ష్మప్రపంచం, కారణప్రపంచం; గుణత్రయాలను సూచిస్తాయి– సత్వగుణం, రజోగుణం, తమోగుణం; అవస్థాత్రయాలను సూచిస్తాయి– జాగ్రదావస్థ, స్వప్నావస్థ, సుషుప్తి అవస్థ. అందువల్ల మనం త్రిగుణాతీతులమవాలంటే పరమేశ్వరుని ప్రార్థించాలి.

శివుడు మోక్షపురుషార్థాన్ని ఇస్తాడు. చాలామంది మోక్షానికి రారు. మోక్షం అంటే భయపడతారు, ఎందుకంటే అది స్వేచ్ఛనిస్తుంది కాబట్టి. మన కుటుంబసభ్యులమీద మనకు వ్యామోహం ఎంతగా ఉంటుందంటే, ఆ బంధాన్ని గట్టిగా పట్టుకుని ఉండాలనుకుంటాము. అందువల్ల మనను మిగలముగ్గిన దోసకాయలా చేయమని ఆ పరమేశ్వరుని ప్రార్థించాలి. దోసకాయ ఎందుకంటే దీనికీ, తక్కినవాటికీ మధ్య గొప్ప తేడా ఉంది. తక్కిన పండ్లు బాగా ముగ్గిపోతే, అవి చెట్టునుండి విడివడి, నేలమీదకి రాలుతాయి. ఈ దోసకాయ అలా కాదు. అది నేలమీదే తీగకు పెరుగుతుంది. అదిబాగా మగ్గాక, అది రాలకుండా, దాని బరువుకు తీగే దానినుంచి విడివడుతుంది. తీగె మన కుటుంబం, మన తక్కిన బంధాలు; పండు మనం. మనం ఆధ్యాత్మికంగా ఎదుగుతూ వస్తే, ప్రాపంచిక బంధాలు వాటంతట అవే రాలిపోతాయి. 'అవి ఎప్పుడు రాలిపోతాయి?' అని అడగనవసరం లేదు. ఆ విధంగా మృత్యుంజయ మంత్రం ధర్మార్థకామమోక్షాలయిన నాలుగు పురుషార్థాలనూ ఇస్తుంది!

'నేను మూడు కన్నుల, సుగంధ స్థితి కర్త అయిన శివుని పూజిస్తాను. తీగెనుంచి విడివడిన దోసకాయ లాగా, నేను కూడా అశాశ్వతంనుంచి విడివడు గాక, నేను శాశ్వతత్వానికి దూరమవకుండు గాక.'

## 10. రుద్రసారం లఘువుగా

ఇవాళ శివరాత్రి. శివరాత్రి అంటే శివునిరాత్రి అని కాదు, శివుని పూజకు అంకితం చేసే రాత్రి. సాధారణంగా శివరాత్రి రోజు, శివపూజలు చేస్తారు, అది కూడా రుద్రాభిషేకం చేస్తారు. ఎందుకంటే శివుణ్ణి అభిషేకప్రియుడంటారు. విష్ణుమూర్తి అలంకారప్రియుడు, శివుడు అభిషేకప్రియుడు అని అంటారు. ఈ రుద్రం అనేకరకాలుగా పారాయణం చేస్తారు.

ఉదాహరణకు రుద్రం 11 సార్లు చదువుతారు. ప్రతిసారీ చమకంలో ఒక అనువాకం చదువుతారు. చమకంలో 11 అనువాకాలు ఉంటాయి. అందువల్ల ఒక రుద్రం+ చమకం మొదటి అనువాకం మొదటిసారి చదివితే, రెండోసారి ఒక రుద్రం+ చమకం రెండవ అనువాకం చదువుతారు. అలా పదకొండవసారికి పదకొండవసారి రుద్రం+చమకం పదకొండవ అనువాకం చదువుతారు. కొంతమంది 121 సార్లు చదువుతారు.

అది కూడా ఎలాగైనా చేయవచ్చు. అంటే ఒకరే 121 సార్లు పారాయణం చేయవచ్చు. 11 మంది 11సార్లు పారాయణం చేయవచ్చు. 121 మంది ఒకసారే చేయవచ్చు. కాని సంఖ్య 121 అవాలి. మళ్ళీ చమకం 11 సార్లు పారాయణం చేస్తారు. అంటే 121 సార్లు రుద్రం, 11 సార్లు చమకం.

అలా ఈ సంఖ్యను ఎంతకన్నా పెంచుకుంటూ పోవచ్చు. వాటిని మహారుద్రం అని, అతి రుద్రం అనీ అంటారు. ఎవరి వీలునిబట్టి వారు ఆ పూజలు చేస్తారు.

ప్రతి శివరాత్రికి రుద్రపారాయణం చేస్తారు కాబట్టి దాని అర్థం, లఘువుగా అన్నా తెలుసుకుంటే బాగుంటుంది. ఈ రుద్రం చాలా పవిత్రమైన మంత్రం లేదా ప్రార్థన. కృష్ణయజుర్వేదంలోనే కాదు, వేదాల్లోనే అత్యంత పవిత్రమైన మంత్రం అంటారు దీన్ని.

అన్నిరకాల శాస్త్రాల్లోకి వేదం ప్రధాన శాస్త్రం. వేదంలో రుద్రం ఇంకా మంగళకరమైనది. రుద్రంలో కూడా పంచాక్షరి మంత్రం ఇంకా మహిమాన్వితమైనది. **నమశ్శివాయ**

**నమశ్శివాయ** అనే ఈ పంచాక్షరి మంత్రంలో మధ్యలో వచ్చే **శివపదం** శ్రేష్ఠతమం. శివపదం రుద్రంలో వస్తుంది కాబట్టి శివుడు అంటే అత్యంత మంగళాకారుడు కాబట్టి, ఈ రుద్రం చాలా పవిత్రమైనది.

రుద్రపారాయణం చేసే ముందు న్యాసమంత్రాలు ఉంటాయి. న్యాస అంటే భగవంతుణ్ణి మన శరీరంమీద ఆవాహన చేయటం. ఎందుకంటే, భగవంతుణ్ణి పూజించేటప్పుడు, మనం కూడా భగవంతుని అంత స్వచ్ఛంగా ఉండాలి. ఇందులో కూడా రెండు రకాలు ఉన్నాయి. మహాన్యాసం, లఘున్యాసం. మహాన్యాసం చాలా పెద్దది. అది గంటసేపు పడుతుంది. లఘున్యాసం చిన్నది. అందులో అనేకదేవతలను మన శరీరంలో అనేక భాగాలమీద ఆవాహన చేస్తాము. శరీరభాగాలమీదే కాక, మన పరిసరాల్లోకి కూడా ఆవాహన చేస్తాము.

**అగ్నిర్మేవాచి శ్రితః వాగ్ఘృదయే। హృదయం మయి।**
**అహమమృతే అమృతం బ్రహ్మణి॥**

ఇది కూడా ఒక విధమైన ఆవాహన. ఇలా దేవతలందరినీ పిలిచాక, నేను కూడా ఒక చిన్న శివుడినే. ఇలా శుద్ధి చేసుకున్నాక, నేను రుద్రపారాయణం చేస్తూ, అభిషేకం చేయాలి. రుద్రంలోకి వెళ్ళేముందు, రుద్రానికి ఉన్న అనేక అర్థాలను చూద్దాము.

**1. శ్రీ రుద్రం –** ఇది చాలా అందమైన అర్థం – రుత్ అంటే దుఃఖం – ద్ర అంటే పారద్రోలేవాడు. దుఃఖహేతువులైన అనారోగ్యం, మరణం, బాధలాంటి వాటిని పారద్రోలేవాడు. శివుడు అన్నిరకాల దుఃఖాలను, వాటి కారణాలను పారద్రోలుతాడు కాబట్టి శివుణ్ణి రుద్రుడు అన్నారు. దుఃఖాలు తొలిగేసరికి మనకు మంగళం, ఆనందం కలుగుతుంది. ఈ ప్రార్థనలో రుద్రుణ్ణి ప్రార్థించటంవల్ల, దీన్ని శ్రీరుద్రం అన్నారు.

**2. శతరుద్రీయం –** కైవల్యోపనిషత్తులో శతరుద్రీయం అన్నారు. శత అంటే వంద. రుద్రీయ అంటే గుణాలు, రుద్రునియొక్క వంద గుణాలు.

**3. రుద్రోపనిషత్తు**

**4. రుద్రసూక్తం**

రుద్రసూక్తం, రుద్రోపనిషత్తు, శతరుద్రీయం, శ్రీరుద్రం, నమకం– అన్నీ ఈ ప్రార్థనకున్న అనేక పేర్లు.

ప్రార్థన మొదలుపెట్టేముందు, ధ్యానశ్లోకాలు ఉంటాయి. దేవునికృప కోరుతాము వాటిలో. ఈ ధ్యానశ్లోకాలు చాలా అద్భుతంగా ఉంటాయి. ఎందుకంటే, శివునియొక్క రెండు అంశాల వర్ణన వస్తుంది వీటిలో.

1. శివుణ్ణి ఒక ఆకారంలో ధ్యానిస్తాము.

**శుద్ధస్ఫటికసంకాశం త్రినేత్రం పంచవక్త్రమ్।**

**గంగాధరం దశభుజం సర్వాభరణభూషితమ్॥**

ఇందులో శివుణ్ణి ఒకరూపంలో ఆరాధిస్తాము. మూడు కన్నులు ఉన్నవాడు, గంగను ధరించిన వాడు, జటాధారి, ఆభరణాలు ధరించినవాడు. **ఉమాదేహార్ధ ధారిణమ్–** అంతేకాదు పార్వతీదేవి కూడా ఉంది. ఇదంతా ఒకస్థాయిలో ఉన్న భక్తులకు.

2. శివుని విశ్వరూపం కొలుస్తాము.

**సర్వవ్యాపినమీశానమ్ రుద్రం వై విశ్వరూపిణమ్–** రుద్రుడు ఒక చోట మాత్రమే కూర్చుని లేడు, ఆయన సర్వాత్మకుడు. విశ్వరూపంలో ఉన్నాడు. ఈ విశ్వరూపాన్ని తక్కిన శ్లోకాలు అద్భుతంగా వర్ణిస్తాయి.

**ఆపాతాళ నభఃస్థలాంత భువన బ్రహ్మాండమావిస్ఫురత్।**

**జ్యోతిః స్ఫాటికలింగ మౌళివిలసత్ పూర్ణేందు వాంతామృతైః॥**

ఈ విశ్వం మొత్తం శివలింగాకారంలో ఉంది. విశ్వం అంతా శివలింగం అయితే, మరి అభిషేకం ఎవరు చేస్తారు? పూర్ణేందు వాంతామృతైః – ఒక అద్భుతమైన భావన.

మనశాస్త్రం ప్రకారం, చంద్ర కిరణాల్లో నీటి చుక్కలు ఉంటాయిట. చంద్ర కిరణాలు చల్లగా ఉంటాయి కాబట్టి, నీరుంటుందని భావన. పూర్ణ ఇందు వాంత అమృతమ్ – చంద్రునినుంచి అమృతజలం, ఆయన చల్లని కిరణాలద్వారా అంతటా పడుతున్నది. ఆ చల్లని నీరు, అంతటా ఉన్న శివలింగానికి అభిషేకం చేస్తున్నది. ఎటువంటి అభిషేకం? మహా అభిషేకం చేస్తున్నది. ఆ మహా అభిషేకం మనం చేయలేము కాబట్టి, మనం చేసే శివలింగాన్నే విశ్వలింగంగా భావించి, అభిషేకం చేయాలి. ఈ చిన్న శివలింగంమీద విశ్వరూపలింగాన్ని ఆవాహన చేయాలి.

**బ్రహ్మాండ వ్యాప్తదేహా భసిత హిమరుచా భాసమానా భుజంగైః**

**బ్రహ్మాండ వ్యాప్తదేహ** –పరమేశ్వరుని శరీరం బ్రహ్మాండమంతా వ్యాపిస్తుంది.

ఇంకో ప్రార్థనలో దాని సారాంశం ఇలా వస్తుంది.

మొత్తం ఆకాశం శివలింగం, నక్షత్రాలు పుష్పమాలలు, సూర్యచంద్రులు నేత్రాలు, సముద్రాలు కుక్షి, పాతాళలోకాలు పాదాలు, వేదాలు రుద్రదేవుని నోరు.

దీన్నిబట్టి మనకొక విషయం స్పష్టంగా అర్థమవుతున్నది. విష్ణుమూర్తి, పరమేశ్వరుల మధ్య భేదాలు మనం వారిని సాకారంగా చూసినప్పు డే ఉన్నాయి. విష్ణువును ఒక రూపంలో కొలిస్తే ఆయన వర్ణం, ఆకారం, ఆభరణాలు అన్నీ భిన్నంగా ఉంటాయి. అందువల్ల వారి మధ్య భేదాలు మనం ఏకరూప దేవునిగా కొలిచినప్పుడే ఉంటాయి.

విష్ణువును, శివుణ్ణి విశ్వరూపంలో కొలవటానికి మన మనస్సును విశాలపరిస్తే, శివవిష్ణువులు ఒకరే అని తెలుస్తుంది. అందుకే రుద్రం చివర్లో- **నమో రుద్రాయ, విష్ణవే మృత్యుర్మే పాహి** అని వస్తుంది.

అలాగే విష్ణుసహస్రనామంలో- **సర్వః శర్వః శివః స్థాణుః** అని వస్తుంది. వీటినిబట్టి విష్ణువు, శివుడు ఒకరే అని తెలుస్తుంది. ఇది విరాట్ స్వరూపం.

ఇప్పుడు రుద్రం సారం చూద్దాము. రుద్రంలో 11 అనువాకాలు ఉన్నాయి. అనువాకం అంటే అధ్యాయం, ఖండం, భాగం- ఏదైనా అనవచ్చు. వీటిలో మొదటి అనువాకం, చివరి రెండు అనువాకాలు (10,11) దేవుని కృప కోరుతూ స్తుతించేవి. దేనికోసం ఈశ్వరకృప కోరుతున్నాము? అవి తర్వాత చూద్దాము. ముందు మధ్యభాగం చూద్దాము.

రెండవ అనువాకంనుంచి తొమ్మిదవ అనువాకందాకా శివుని మహిమ చూస్తాం. అందువల్ల దాన్ని **శివమహిమ్న స్తోత్రం,** శివస్తుతి, ఈశ్వర స్తుతి అంటారు. శివుని మహిమను అనేక కోణాల్లోంచి చూడవచ్చు. కాని రుద్రంలో మూడు మహిమలు చాలా అందంగా వర్ణించబడ్డాయి.

**1. సర్వేశ్వరత్వం-** ఈశ్వరుడు అందరికీ దేవుడు. దేవుళ్ళకు కూడా దేవుడు. **సర్వేషాం పతిః సర్వేషామ్ ఈశ్వరః** – వేదాంతపరిభాషలో చెప్పాలంటే, ఈశ్వరుని నిమిత్త కారణత్వం స్తుతించబడింది. ఈశ్వరుడు విశ్వానికి సృష్టి, స్థితి కారకుడు.

**2. సర్వాత్మకత్వం-** ఈశ్వరుడే అంతటా; అన్నిటిలోనూ ఉన్నాడు. ముందు ఈశ్వరుడు అందరికీ దేవుడు అన్నాము. అంటే మనుష్యులు వేరు, దేవుడు వేరు. కాని ఇక్కడికొచ్చేసరికి,దేవుడు ప్రపంచానికి భిన్నంగా నిల్చుని, రక్షించటం లేదు. ఆయనే ప్రపంచరూపంలో ఉన్నాడు. గీత 11వ అధ్యాయంలో చూసిన విశ్వరూపదర్శనంలో, పురుషసూక్తంలో చూసిన భావనలో ఉన్న భావనే ఇక్కడ కూడా చూస్తాము. సర్వం శివమయం జగత్.

**3.సర్వాంతర్యామిత్వం–** శివుడు అన్నింటియొక్క సారం, నిర్గుణతత్త్వం,సర్వ అధిష్ఠానం.

ఈ మూడు అంశాలు రుద్రంలో ఎలా వచ్చాయో చూడటానికి అక్కడక్కడా దీనికి సంబంధించిన మంత్రాలను చూద్దాము.

**1. సర్వేశ్వరత్వం–** ఈ భావన **రెండవ అనువాకంలో** చూస్తాము.

**నమో హిరణ్యబాహవే సేనాన్యే దిశాం చ పతయే నమః –** అన్ని దిక్కులకూ ఆయన పతి.

**పశూనాం పతయే నమః –** అన్ని పశువులకూ పతి. పశువుల్లో మనుష్యులు కూడా వస్తారు. పశువులకు పతి కాబట్టి ఆయన్ను పశుపతి అంటారు.

**పథీనాం పతయే నమః –** పథి అంటే అనేక మార్గాలు. శాస్త్రం నిర్దేశించిన అనేక మార్గాలకు పతి. అవి కర్మ, ఉపాసన, జ్ఞానం. ఆగమ మార్గాలకు కూడా పతి.

**అన్నానాం పతయే నమః –** అన్నానికి పతి;

**పుష్టానాం పతయే నమః –** పోషణకు పతి;

**క్షేత్రాణాం పతయే నమః–** భూమికి పతి; జగతాం పతయే నమః– పద్నాలుగు లోకాలకు పతి.

**వనానాం పతయే నమః వృక్షాణాం పతయే నమః కక్షాణాం పతయే నమః ఓషధీనాం పతయే నమః పత్తీనాం పతయే నమః**

అరణ్యాలకు, వృక్షాలకు, అన్నింటికీ ఆయన పతి. తర్వాత ఆయన మంచి వాటికే కాదు, చెడు వాటికి కూడా పతి అంటుంది. ఎందుకంటే ఆయన దేవుడు అంటే అన్నింటికీ దేవుడు.

అందువల్ల **మూడవ అనువాకంలో** అనేక రకాల దొంగలు, యుద్ధం చేసేవారు, సైనికులు అందరి పట్టికా చదివి, అందరికీ శివుడు పతి అంటుంది.

**స్తేనానం పతయే నమః, తస్కరాణాం పతయే నమః, స్తాయూనాం పతయే నమః, అరణ్యానాం పతయే నమః, ప్రకృన్తానాం పతయే నమః, కులున్చానాం పతయే నమః,**

**2. సర్వాత్మకత్త్వం –** నాలుగవ అనువాకంలో వస్తుంది.

**నమో గణేభ్యో గణపతిభ్యశ్చ వో నమో నమో విరూపేభ్యో విశ్వరూపేభ్యశ్చ వో నమో నమో మహద్భ్యః క్షులకేభ్యశ్చ వో నమః।**

**గణేభ్యో అంటే గణాలు, అంటే అన్నిరకాల మనుష్యులు. గణపతిభ్యః-** ఆ గణాల నాయకుడు కూడా శివుడే. మహద్భ్యః అంటే పెద్ద వారు; క్షుల్లకేభ్యః అంటే చిన్నవారు.

**రథిభ్యో‌ఽ రథేభ్యశ్చ వో నమః-** రథాలు, వాహనాలు నడిపేవారు.

**తక్షభ్యః**-వడ్రంగి; **కులాలః-** కుమ్మరి- వీరు కూడా శివుడే. అలా విల్లంబులు చేసేవారు, పడవలు చేసేవారు- అందరూ శివుడే.

**శ్వభ్యః శ్వపతిభ్యశ్చ వో నమః-** కుక్క, కుక్క యజమాని కూడా శివుడే.

**ఐదవ అనువాకంలో** వర్ణన ఇలా సాగుతుంది.

**బృహతే చ వర్షీయసే చ నమో వృద్ధాయ చ సంవృధ్వనే చ నమో అగ్రియాయచ-**

**ఆరవ అనువాకంలో**

**నమో జ్యేష్ఠాయ చ కనిష్ఠాయ చ నమః పూర్వజాయ చాపరజాయ చ -**

పెద్దవారు, చిన్నవారు, నిల్చున్నవారు కూర్చున్నవారు, పడుకున్నవారు అందరూ శివుడే. శివుడే అన్నీ. అందువల్ల సర్వాత్మభావన.

**3. సర్వాంతర్యామి - ఏడవ అనువాకంలో-**

**నమో దుందుభ్యాయ చాహనన్యాయ చ -** దుందుభి అంటే డప్పు.

అది కూడా శివుడే. దానిమీద శబ్దం చేయటానికి వాడే కర్ర కూడా శివుడే.

**నమః స్రుత్యాయ చ పథ్యాయ చ -** మార్గంలో కూడా శివుడు ఉన్నాడు. బావిలో, నీటిలోపల, నదుల్లో. తడినేలలో, పొడినేలలో, గడ్డిలో, మైదానంలో, దుమ్ములో, రాయిలో అన్నింటిలో అధిష్ఠానంగా ఉన్నాడు.

**నమో వర్ష్యాయ చ నమో మేఘ్యాయ చ** - వర్షంలో, మేఘంలో ఉన్నాడు.

**తొమ్మిదవ అనువాకంలో**

**నమ ఇరిణ్యాయ చ ప్రపథ్యాయ చ నమః కిగ్ం శిలాయ చ క్షయణాయ చ నమః ... నమో లోప్యాయ చోలప్యాయ చ నమ ఊర్వ్యాయ చ**

ఉర్వి అంటే పృథివి. పృథివిలో కూడా శివుడు ఉన్నాడు. పర్ణాయ అంటే ఆకులు. వాటిల్లో కూడా శివుడు ఉన్నాడు.

వీటన్నింటిలో శివుడు ఏ రూపంలో ఉన్నాడు? సచ్చిదానంద స్వరూపంలో. **సర్వేషు సగుణేషు మధ్యే నిర్గుణ అధిష్ఠాన రూపేణ శాంతం శివమ్ అద్వైతం చతుర్థం మన్యన్తే స ఆత్మా.** ఇది సర్వాంతర్యామిత్వం. ఇక్కడితో స్తుతి ముగిసింది.

ఇప్పుడు మొదటి భాగానికి వెళదాము. **మొదటి అనువాకంలో**, పది, పదకొండవ అనువాకాల్లో ఈశ్వరకృప కోరుతున్నాడని చూశాము. ఇది చాలా తమాషాగా ఉంటుంది. ఈ ప్రార్థన చిన్న పిల్లవాడి ప్రార్థనలా ఉంటుంది. భక్తుడు రుద్రుని ముందు నిల్చుని ఉన్నాడు. రుద్రునికి అనేక అంశాలు ఉన్నాయి. అందులో ఒకటి ఘోరరూపం. భయం వేసే అంశం. అదికాక ఆయన ఒక ఆయుధం పట్టుకుని ఉన్నాడు. శివునికి విల్లంబులు ఉన్నాయి. దాన్ని పినాకం అంటారు. తర్వాత ఒక అంబుల పొది ఉంది. అందులోంచి సూది మొన కనిపిస్తూ బాణం కనిపిస్తున్నది. శివుడు కోపానికి ప్రతీక. (మన్యుః). భక్తుడు ఈ రూపం చూసేసరికి బాగా భయపడిపోతాడు.

**నమస్తే రుద్ర మన్యవ –** ముందు నీ కోపానికి నాదొక నమస్కారం అంటాడు. తర్వాత ఒక్కొక్క అంశాన్ని వర్ణించుకుంటూ వస్తాడు. నీ విల్లు చూస్తే భయంగా ఉంది; నీ బాణం చూస్తే భయంగా ఉంది; నీ ఘోరరూపం చూస్తే భయంగా ఉంది. అందువల్ల నాకోసం నీ రూపాన్ని మార్చుకో.

**యా తే రుద్ర శివా తనూరఘోరా౽పాపకాశినీ–** అఘోర రూపం అంటే శివరూపం చూపించు. నాకు ఏ విధంగానూ నువ్వు హాని చేయకు. నిన్ను బ్రతిమాలుతున్నాను. శివుడు సరే అన్నట్టుగా ఊహించుకోవాలి. అయినా భక్తుడు తృప్తిచెందలేదు. ఓ శివా, ఎక్కుపెట్టి ఉన్న నీ విల్లు చూస్తుంటే, నువ్వు ఏ క్షణంలోనైనా దాన్ని వాడవచ్చు అనిపిస్తున్నది. అందువల్ల దాన్ని తీసేసెయి.

**ప్రముఞ్చ ధన్వనస్త్వముభయోరార్త్నియోర్జ్యామ్–** శివుడు దానికి అంగీకరించినట్టు ఊహించుకోవాలి. మళ్ళీ సూదిమొనతో బయటకు కనబడుతున్న బాణం చూశాను. నాకు భయం వేస్తున్నది అంటాడు.

**యాశ్చ తే హస్త ఇషవః పరా తా భగవో వప–** ఆ బాణాన్ని తలక్రిందులుగా పెట్టు.

**విజ్యం ధనుః కపర్దినో విశల్యో బాణవాగ్ం ఉత–** దాన్ని, తలక్రిందులుగా పెట్టినా, అది ఎంత పదునుగా ఉందంటే, నువ్వు మళ్ళీ తీసి వాడతావేమోనని నాకు భయంగా ఉంది. అందువల్ల నువ్వు ఏం చేస్తావంటే ఆ బాణాన్ని తీసి, అంచుని రాసేసి, దాన్ని బండగా చేసి పెట్టుకో. విశల్యః అంటే సూదిమొన.

కాని భక్తునికే తన కోరిక సబబుగా అనిపించలేదు. 'ఒకవేళ నాకోసం దేవుడు ఆ బాణాన్ని తీసేసినా, నాకు బయటనుంచి వచ్చే అనేక అపాయాలనుంచి శివుడు నన్ను కాపాడాలి కదా! ' అనుకుంటాడు.

ఒకవేళ దేవుడు తక్కిన అన్ని అపాయాలనుంచి కాపాడాలంటే, ఆయనకు ఆయుధం ఉండాలి కదా! అందువల్ల ఓ దేవా, నా కోరికలన్నీ వెనక్కు తీసేసు కుంటాను. నువ్వు విల్లును సిద్ధంగా ఉంచుకో. అది ఎక్కుపెట్టి ఉండనీ, బాణం కూడా ఉండనీ, అది కూడా సూదిమొనలా ఉండనీ! కాని నేను నిన్ను కోరేదేమిటంటే, దాన్ని నామీద వాడకు. తక్కిన శత్రువులందరినీ హతమార్చు.

**అవతత్య ధనుస్త్వగ్ం సహస్రాక్ష శతేషుధే। నిశీర్య శల్యానాం ముఖా శివో నః సుమనా భవ ॥ విజ్యం ధనుః కపర్దినో విశల్యో బాణవాగ్ం ఉత। అనేశన్నస్యేషవ ఆభురస్య నిషంగథిః॥ యా తే హేతిర్మీఢుష్టమ హస్తే బభూవ తే ధనుః తయాஉస్మాన్ విశ్వతస్త్వమయక్ష్మయా పరిబ్భుజ। నమస్తే అస్త్వాయుధాయానాతతాయ ధృష్ణవే । ఉభాభ్యాముతతే నమో బాహుభ్యాం తవ ధన్వనే॥**

నేను నమస్కారం చేస్తున్నాను. నీ చేతులకు, నీ బాణాలకు నా నమస్కారాలు. నామీద వాటిని దయచేసి వాడకు. కాని దానికొక ముఖ్యమైన ఉపయోగం ఉంది. నాకొక పెద్ద పట్టిక ఉంది.

ఇటువంటి ప్రార్థనే చివర్లో కూడా ఉంది అంటే **పదవ అనువాకంలో–**

**మానస్తోకే తనయే మా న ఆయుషి మా నో గోషు మా నో అశ్వేషు రీరిషః। వీరాన్మా నో రుద్ర భామితో వధీర్ హవిష్మన్తో నమసా విధేమ తే।**

ఓ దేవా! నీ విల్లంబులతో మమ్మల్ని రక్షించాలి. కుటుంబంలోని వారందరినీ కాపాడాలి. ముఖ్యంగా మా పనివారిని కాపాడాలి. అంతేకాదు, గర్భిణీ స్త్రీలు ఉంటే వారిని కూడా కాపాడాలి. గర్భిణీ స్త్రీని, ఆమె గర్భంలో ఉన్న శిశువును, భర్తను అందరినీ కాపాడు. జంతువులను కాపాడు.

**పదకొండవ అనువాకంలో**

**నమో రుద్రేభ్యో యే పృథివ్యాం యేஉంతరిక్షే యే దివి యేషామన్నం వాతో వర్షమిషవస్తేభ్యో దశ ప్రాచీర్దశ... దధామి॥**

అంతులేని రూపాల్లో ఉన్న రుద్రుణ్ణి నేను ప్రార్థిస్తున్నాను. అన్ని దిశల్లోనూ ఉన్న వందలాది రూపాలకు నా నమస్కారాలు. నేనేం కోరాను? నా శత్రువులందరినీ హతమార్చమన్నాను. నేను ద్వేషించే వారిని, నన్ను ద్వేషించే వారిని హతమార్చాలి. ఇది చూడటానికి భయంకరమైన కోరికలా ఉన్నా నా శత్రువులందరినీ హతమార్చాలి.

నా నిజమైన శత్రువులు బయట లేరు. లోపలే ఉన్నారు. అవి రాగం, ద్వేషం, కామం, క్రోధం, మదం, మాత్సర్యం. ఓ దేవా, వాటన్నింటినీ నాశనం చేయి. నాకు సాధనచతుష్టయసంపత్తిని ఇయ్యి. నాకు చిత్తశుద్ధి ఏర్పడ్డాక–

**త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్। ఉర్వారుకమివ బంధనాత్ మృత్యోర్ముక్షీయ మాఽ మృతాత్॥**

చిత్తశుద్ధి ఏర్పడ్డాక, నేను మోక్షంకోసం ప్రయత్నించవచ్చు. ఎలా మోక్షం పొందాలి? ఉర్వారుకంలాగా. దోసకాయ తీగకు ఉంటుంది. దాని బరువువల్ల అది నేలమీద ఉంటుంది. తీగ దానిమీద బలంగా అనుబంధం పెంచుకుంటుంది. కాని పండు పరిపక్వం చెందాక, తక్కిన పండ్లలాగా అది కింద పడదు. దీని విషయంలో పండు పరిపక్వం చెందాక, తీగె పక్కకి వెళ్ళిపోతుంది.

అదే విధంగా ఓ దేవా నేను కూడా ఊర్వారుకంలాంటి వాణ్ణి. నేను ఇంకా పరిపక్వత చెందకపోవటంవల్ల ఇంకా తీగెతో బలంగా అనుబంధం పెంచుకున్నాను. తండ్రిగా, అన్నగా అలా ఎన్నో విధాలుగా. అందువల్ల ఓ దేవా నేను పరిపక్వత చెందాక, నేను వారిని వదలకుండా, వారే నన్ను వదిలేలా చేయి.

అందువల్ల ఓ దేవా! నేను ఈ బంధాలనుంచి సహజంగా విముక్తి పొందే పరిస్థితిని నువ్వే తీసుకురా. అప్పుడు నేను మోక్షం పొందుతాను. మోక్షంకోసం చేసే ఈ ఆఖరి ప్రార్థనతో రుద్రం ముగుస్తుంది.

ఇది చాలా పవిత్రమైన మంత్రం కాబట్టి సన్న్యాసి కూడా పారాయణం చేయాలంటారు. ఈ రుద్రం నాలుగు ఆశ్రమాలకు చెందినవారూ పారాయణం చేయాలి. ఒక గృహస్థు రోజూ ఐదు ప్రార్థనలు చేయాలి. గీత, విష్ణుసహస్రనామం, రుద్రం, పురుషసూక్తం, తను ఏ వేదానికి చెందితే దానిలో కొంతభాగం, లేదా తైత్తిరీయోపనిషత్తులో మూడు వల్లీలు ఉంటాయి, వాటిలో రోజుకి ఒక వల్లీ చదవాలి. అలాగే గీత రోజుకి ఒక అధ్యాయం చదవాలి.

## స్వామీజీ సూక్తిముక్తావళి

ఈ ముగ్గురూ సుషుప్తి ఆనందాన్ని అనుభవిస్తారు

**ఒక పాపాయి** – ఆందోళన పడటం అంటే ఏమిటో తెలియదు.

**ఒక మహారాజు** – ఆందోళన పడటానికి అతనికి మంత్రులు ఉన్నారు.

**ఒక జ్ఞాని** – ఆందోళన పడకుండా ఎలా ఉండవచ్చో అతనికి తెలుసు.

# 11. గాయత్రీ మంత్రం

గాయత్రీ జపవిధి -

ఎ) గాయత్రీ మంత్రం జపించటంలో ఐదు చోట్ల ఆపాలి.

**ఓం - భూర్ భువః స్వః - తత్సవితుర్వరేణ్యం।**

**భర్గో దేవస్య ధీమహి - ధియో యో నః ప్రచోదయాత్ ॥**

చివర్లో ధియో యో న పదంలో ధియో యో న అని చదవాలి. ధీ అనకూడదు.

బి) నిచృత్ గాయత్రీ ఛందస్సులో 23 అక్షరాలు ఉంటాయి, 24 కాదు.

తత్సవితుర్వరేణ్యం అనాలి తత్సవితుర్వరేణియం అనకూడదు.

ఈ పద్ధతిలో ప్రాణాయామం, అర్ఘ్యం, దానం, జపం చేసే సందర్భాలలో పలుకుతారు. 24 అక్షరాలుగా హోమం చేసేటప్పుడు పలుకుతారు.

సి) జపం మూడురకాలుగా ఉంటుంది. ఉచ్ఛజపం, మందజపం, మానస జపం.

**ఉచ్ఛజపం-** గట్టిగా, అందరికీ వినపడేలా జపించటం.

**మందజపం-** దీన్ని ఉపాంసు జపం అంటారు. పెదాలు, నాలుక కదులుతాయి. జపించేవానికే వినిపిస్తుంది కాని తక్కినవారికి వినిపించదు. గుసగుసలాడుతున్నట్టు ఉంటుంది.

**మానస జపం-** పెదాలు, నాలుక కూడా కదలవు. పూర్తిగా, అచ్చంగా మనస్సులో చేసుకునే జపం. వీటిలో ఏది గొప్పది?

మానసజపం అన్నింటికన్నా గొప్పది. గట్టిగా జపిస్తే ఒక కొలత పుణ్యం వస్తుంది అనుకుంటే, మధ్యమ జపానికి పదిరెట్లు పుణ్యం వస్తే, మానస జపానికి వందరెట్లు పుణ్యం వస్తుంది. ఇది గాయత్రీజపానికే కాదు, ఏ జపానికైనా వర్తిస్తుంది. మానస జపం చాలా కష్టం. ఎందుకంటే ఏమీ ఆలోచించకుండా చేయాలి. వాచికజపంలో నోరు జపం చేస్తూ పోతుంది; మనస్సు ఆందోళన చెందుతూ వస్తుంది. జపం చేస్తున్నా ఎవరు వచ్చారు, ఎందుకు వచ్చారు, వారికేం కావాలి ఇలాంటి ఆరాటాలన్నీ వస్తూనే ఉంటాయి. మానసజపంలో ఇలా మనస్సు పరిపరివిధాల పోకుండా చూడాలి. అందువల్ల ఇది కష్టం. ఇది కష్టం కాబట్టి, పుణ్యం కూడా ఎక్కువే.

కాని మానసజపానికి తేలిగ్గా రాలేకపోతే మొదటి దశనుంచి క్రమంగా రావచ్చు. ఏ జపం చేసేటప్పుడైనా ఆ జపం చేసేముందు ఆ దేవతామూర్తిని

మనస్సులో ఊహించుకోవాలి. అది కూడా ధ్యానం చేసేటప్పుడు మాత్రమే. జపం చేసేటప్పుడు ఊహించుకుంటే, జపం యాంత్రికంగా సాగుతుంది; లేదా ఊహ కష్టమవుతుంది. అందువల్ల జపం చేసేటప్పుడు మంత్రంమీద శ్రద్ధ పెట్టాలి.

జపం రెండురకాలుగా ఉంటుంది– శబ్దప్రధానం, అర్థప్రధానం.

**శబ్దప్రధానం–** శబ్దప్రధాన జపంలో అర్థం గురించి పట్టించుకోము; శబ్దానికే ప్రాముఖ్యతనిస్తాము. శబ్దం కూడా పవిత్రమైనదే. అది కూడా ఫలాన్నిస్తుంది. జపం చేసేటప్పుడు శబ్దప్రధానంగా చేయాలి. దాని అర్థం జపం చేసే ముందో, తర్వాతో ఆలోచించాలి కాని జపం చేసేటప్పుడు కాదు.

**అర్థప్రధానం –** ఇందులో అర్థానికి ప్రాముఖ్యతనిస్తాము కాని, శబ్దానికి కాదు. గాయత్రీ మంత్రాన్ని, నిత్యకర్మగా చేసేటప్పుడు, దాన్ని శబ్ద ప్రధానంగానే చేస్తారు.

**గాయత్రీమంత్ర అర్థం–** ఇప్పుడు గాయత్రీ మంత్ర అర్థం చూద్దాము. దానికి ముందు రెండుభాగాలు కూడా కలుపుకుందాము. **ఓం భూర్ భువః స్వః –** ఇవి గాయత్రీ మంత్రం కాదు.

**ఓం–** ఓంకారాన్ని ప్రణవం అంటారు. శాస్త్రం ఈ ఓంకారాన్ని అనేకచోట్ల స్తుతిస్తుంది.

ఎ) ఓంకారం అర్థంతో సంబంధం లేకుండా, అది ఒక శుద్ధి చేసే మంత్రం. బ్రహ్మదేవుడు సృష్టి చేసేముందు ఓం, అథ పదాలను మొట్టమొదట ఉచ్చరించాడు. అందువల్ల ఇవి మంగళకరమైన పదాలు.

బి) ఓంకారం దేవునికి అత్యంత ఉత్తమమైన పేరు.

ఓం తత్ తదితి నిర్దేశః

ఓం+తత్+తద్– భగవానుని మూడు పేర్లు. అందువల్ల ఓంకారాన్ని ప్రణవం అని అంటారు. ఏ పదంవల్ల బ్రహ్మను తెలుసుకుంటామో, అది ప్రణవం.

సి) ఓంకారం గొప్పదనానికి రెండుకారణాలు ఉన్నాయి – ఒకటి ఓంకారం ఏకాక్షరం; భగవంతుడు కూడా ఒక్కడే. రెండవ గొప్పదనం – ఓంకారం రక్షిస్తుంది, భగవంతుడు కూడా రక్షిస్తాడు.

**వ్యాహృతి –**అర్థంతో సంబంధం లేకుండా శబ్దమే మంగళకరమైనది.

ఎ) భూః భువః స్వః – ఈ మూడు మంత్రాలనూ బ్రహ్మ ముందు ఉచ్చరించాడు.

బి) పాపాలను తొలగిస్తాయి. అందువల్ల యజ్ఞాలుచేసేముందు వీటిని ఉచ్చరిస్తారు.

వ్యాహృతి అర్థం– భూః భువః సువః

వీటిని వ్యాహృతులంటారని చూశాము. ఇవి మూడు లోకాలను సూచిస్తాయి. మూడు లోకాలు భగవంతుని వ్యక్తరూపాలు. అందువల్ల వీటి సాధారణ అర్థం తీసుకుంటే– నేను మూడులోకాల రూపంలో వ్యక్తమవుతున్న భగవంతుణ్ణి (ఓంని) ధ్యానిస్తున్నాను.

**వేదాంతపరంగా అర్థం–** ఓంకారం నిర్గుణ తురీయానికి చిహ్నం. భూః భువః సువః లు సగుణ విశ్వ, తైజస,ప్రాజ్ఞలకు చిహ్నాలు. ఈ నాలుగూ కలిసి చతుష్పాద బ్రహ్మను సూచిస్తాయి.

సగుణ విశ్వ– విరాట్; తైజస– హిరణ్యగర్భ, ప్రాజ్ఞ– ఈశ్వరునిలా వ్యక్తమవుతున్న నిర్గుణ బ్రహ్మను నేను ధ్యానిస్తున్నాను.

**గాయత్రీమంత్రం అర్థం–** ఇది కూడా రెండు రకాలుగా చూద్దాము. అందరికీ అర్థమయ్యే సామాన్య అర్థం ముందు చూద్దాము. తర్వాత వేదాంతపరంగా చూద్దాము.

**సామాన్య అర్థం–**

**తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి। ధియో యో నః ప్రచోదయాత్॥**

ఇది మంత్రం. దీని సామాన్య అర్థం సూర్యభగవానుని ధ్యానించటం.

**యః నః ధియః ప్రచోదయాత్।**

**సవితుః దేవస్య తత్ వరేణ్యం భర్గః ధీమహి॥**

**ధీమహి –** మేము ధ్యానం చేస్తున్నాము. దేనిని?

**వరేణ్యం భర్గః–** శ్రేష్ఠమైన కాంతిని, ఎవరిది?

**దేవస్య సవితుః–** సూర్యభగవానుని కాంతిని. అంటే సూర్యదేవుని తేజస్సును మేము ధ్యానిస్తున్నాము. ఏ విధంగా అది పవిత్రమైనది? మా బుద్ధికి అది ప్రేరణ ఇస్తుంది. మొత్తం కలిపి చదివితే ఇలా అర్థం వస్తుంది.

మా బుద్ధికి ప్రేరణనిచ్చే ఆ సూర్యభగవానుని పవిత్రమైన కాంతిమీద మేము ధ్యానం చేస్తున్నాము.

గీతలో సూర్యకాంతి, శక్తి నేనే అంటాడు భగవంతుడు. అందువల్ల సూర్యకాంతిని భగవానుని ప్రత్యక్షరూపంగా భావించాలి. ఆ శక్తి ఎంత గొప్పది? ఆ శక్తి భూమి అంతటా వ్యాపించి, అన్ని జీవరాశులకు ప్రాణశక్తిని ఇస్తుంది. ఇక్కడ విద్యార్థికి బుద్ధి కావాలి. గృహస్థుకు ఆరోగ్యం, డబ్బు కావాలి. బ్రహ్మచారికి, సన్న్యాసికి బుద్ధి కావాలి. గాయత్రి మంత్రం ముఖ్యంగా బ్రహ్మచారికోసం

చెప్పబడింది. బ్రహ్మచారి అంటే వేదాధ్యయనం చేసే శిష్యుడు. అందువల్ల అతనికి మేధ, ప్రజ్ఞ కావాలి. ఇది సామాన్య అర్థం.

**విశేష అర్థం**

వేదాంత పరంగా అర్థం చూద్దాము ఇప్పుడు.

**ధీమహి –** మేము ధ్యానం చేస్తున్నాము. ఇక్కడ నిదిధ్యాసనం చేస్తున్నాము అని అర్థం. దేనిమీద ధ్యానం చేస్తున్నాము?

**తత్ భర్గః వరేణ్యమ్ –** సచ్చిదానంద స్వరూపంమీద.

**సవితుః దేవస్య – తత్ పదార్థః ఈశ్వరః** భగవంతుని సచ్చిదానంద స్వరూపంమీద ధ్యానం చేస్తున్నాము.

ఈ అర్థం ఎలా వచ్చింది? ఒక్కొక్క పదం చూస్తూ వద్దాము.

సవితుః అంటే వాచ్యార్థం సృష్టికర్త. సవిత్ అంటే ఉపాదాన కారణం.

దేవస్య అంటే చేతనస్వరూపం. ఇది దేవుని నిమిత్తకారణాన్ని సూచిస్తుంది. భగవంతుడు = ఉపాదానకారణం+ నిమిత్తకారణం.

ఈశ్వరుడు ఎలా ఉన్నాడు?

**తత్ భర్గః వరేణ్యమ్ –** తత్– అంటే సత్ స్వరూపం. తత్సవితుఃలో తత్‌ని తీసి భర్గః వరేణ్యంతో కలుపుకోవాలి. ఈ మూడు పదాల్లో తత్ అంటే సత్ స్వరూపం అని చూశాము. భర్గః అంటే కాంతి. చీకటిని తొలగించేది. అందువల్ల భర్గః అంటే చైతన్యస్వరూపం. చైతన్యం అంటే కాంతి అనీ, చీకటిని తొలగించేదీ అని అర్థం. అందువల్ల భర్గః అంటే చైతన్యం. వరేణ్యం – వరణీయం– వరణయోగ్యం. అందరూ ఎక్కువగా కోరుకునేది ఏది? ధనమా, ఆస్తులా, అనుబంధాలా? ఏది కోరుకున్నా దాని వెనుక కారణం ఆనందం, పూర్ణత్వం. అందువల్ల వరేణ్యం అంటే ఆనందం.

తత్ భర్గః వరేణ్యమ్ – మూడు పదాలూ సత్,చిత్, ఆనందం బ్రహ్మలోని మూడు పదాలకు సంకేతాలు. ఎవరివి?

సవితుః దేవస్య– ఉపాదాన, నిమిత్తకారణం బ్రహ్మవి.

ధీమహి– అభేద దృష్టితో ధ్యానం చేస్తున్నాము.

**యః–** ఏ చైతన్యమైతే, సర్వవ్యాపకంగా ఉందో, ఏదైతే సచ్చిదానంద స్వరూపమో, ఏదైతే సృష్టికి ఉపాదాన, నిమిత్తకారణమో, ఏదైతే సాక్షిరూపంలో నా బుద్ధి వెనుక ఉందో, ఏదైతే సృష్టించాక జీవిలో అనుప్రవేశం చేసిందో, ఆ చైతన్యం.

ఇక్కడ వ్యాకరణపరంగా కూడా ఒక అందం కనపడుతుంది. ముందు తత్ పదం వచ్చి, ఇప్పుడు యః పదం వచ్చింది. తత్ పదం నపుంసక లింగం. అది బ్రహ్మను సూచిస్తుంది. యః పదం పుంలింగం– అది ఆత్మను సూచిస్తుంది. **ధియో యో నః ప్రచోదయాత్** – ఏ బ్రహ్మ జగత్కారణంగా ఉందో అదే బ్రహ్మ ఆత్మగా బుద్ధిని ప్రకాశింపచేస్తోంది.

ఈ వివరణద్వారా–

| | | |
|---|---|---|
| తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య | – | బ్రహ్మచైతన్యం |
| ధియో యో నః ప్రచోదయాత్ | – | ఆత్మచైతన్యం |
| ధీమహి | – | అభేదధ్యానం |

మేము ఆత్మచైతన్యంమీద ధ్యానం చేస్తున్నాము. అది వేరే ఏదో కాదు. అది బ్రహ్మ చైతన్యమే. ప్రజ్ఞానం బ్రహ్మ.

ఆ విధంగా గాయత్రి మంత్రాన్ని రెండురకాలుగా ధ్యానం చేయవచ్చు.

వేదాంతానికి రాకముందు – ఉపాసనగా చేయవచ్చు. వేదాంతానికి వచ్చి, జ్ఞానం పొందాక– నిదిధ్యాసనంగా చేయవచ్చు. **అహం బ్రహ్మ అస్మి** ధ్యానం.

# స్వామీజీ సూక్తిముక్తావళి

సాధారణంగా, జ్ఞానం ఒక వస్తువును గురించి చెప్పగలదు; కాని వస్తువును నాశనం చేయలేదు. కార్పెట్ గురించిన జ్ఞానం కార్పెట్‌ను నాశనం చేయదు. కాని ఒక విశిష్ట జ్ఞానం ఉంది. మన అజ్ఞానం గురించిన జ్ఞానానికి, మన అజ్ఞానాన్ని పారద్రోలే సామర్థ్యం ఉంది.

గురువు బోధను మించిన సత్యం ఏదీ లేదు. గురువు బోధను వినటంకన్నా మించిన తపస్సు లేదా సాధన లేదు. గురువు చెప్పిన సత్యంకన్నా పరమసత్యం ఏదీ లేదు. అటువంటి గురువుకు నా ప్రణామములు.

# 12. యమనియమాలు

ప్రసంగాలు విని, పుస్తకాలు చదివి లేదా సత్సంగాలలో పాల్గొని ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొందుతారు కొందరు సాధకులు. కొంతకాలం గడిచేసరికి, చాలామంది సాధకులలో ఒక భావన ఏర్పడుతుంది. చాలా ఎక్కువే చదివాము, బాగానే శాస్త్రం వంటబట్టింది కాని ఆచరణలో పెట్టలేకపోతున్నామన్న చింత పట్టుకుంటుంది. వారికి పుస్తకజ్ఞానం ఉంది కాని, అనుష్ఠానం లేదన్నమాట. అనుష్ఠానం అంటే నేర్చుకున్నదాన్ని ఆచరణలో పెట్టటం. ఇటువంటి సమస్యను అనుభవిస్తున్న సాధకులు ఈ ప్రణాళికను చేపట్టవచ్చు. ఆ మాటకొస్తే ఎవరైనా చేపట్టవచ్చు. ఇది పాటిస్తే శాస్త్రం నేర్పించిన అంశాలను తేలిగ్గా అమలు పరచగలుగుతారు.

ఈ కార్యక్రమం ఒక సంవత్సరకాలం పడుతుంది. దీన్ని మళ్ళీ వచ్చే సంవత్సరం కూడా కొనసాగించవచ్చు. ఈ ప్రణాళికను ఉన్నదున్నట్టుగా అమలులో పెట్టవచ్చు లేదా మీ అవసరాలకు, మీ వీలుకు తగ్గట్టుగా మార్చుకోవచ్చు. ఇందులో 12 అంశాలు ఉన్నాయి కాబట్టి, ఒక్కొక్క అంశాన్ని ఒక్కొక్క నెలరోజులు సాధన చేయాలి కాబట్టి, నూతన సంవత్సర శుభారంభం రోజున మీరు దీనికి శ్రీకారం చుట్టవచ్చు. ఒక్కముక్కలో చెప్పాలంటే మన హిందూ ధర్మం చెప్పే **టెన్ కమాండ్‌మెంట్స్** అనవచ్చు దీన్ని. ఐదు నిషేధాలు, ఐదు విధులు ఉంటాయి. వాటిని యమ, నియమాలు అంటారు. హిందూ ధర్మం చెప్పే విధినిషేధాలన్నమాట.

ఈ టెన్ కమాండ్‌మెంట్స్ రెండు భాగాలుగా ఉంటుంది. ముందు నిషేధాలు, యమలు; తర్వాత విధులు, నియమాలు గురించిన వివరణ వస్తుంది. అనటానికి విధినిషేధాలన్నా, శాస్త్రం నిషేధానికి అంటే యమలకు పెద్ద పీట వేసింది. అందుకని ముందు యమల గురించి చెప్పాక, నియమాల గురించి చెప్పింది. వాటి నిర్వచనం, వాటిని పాటించే విధానం చూద్దాము.

**యమలు –** ఐదు యమలు వరుసగా అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం.

**1. అహింస–** అహింస అంటే హింస చేయకపోవటం లేదా హాని కలుగచేయక పోవటం. అహింస అనేక స్థాయిల్లో ఉంటుంది. హింసలో ఎక్కువగా ప్రకటిత మయ్యేది శారీరక హింస. శారీరక హింస అంటే మనుష్యులను కొట్టటమే కాదు, వస్తువులను మనుష్యులమీద విసిరేయటం, లేదా నేలకేసి కొట్టటం కూడా వస్తుంది.

ఈ కార్యక్రమం చేపట్టగానే, ముందస్తుగా ఈ శారీరక హింసను మానాలి. ఒకవేళ మనం ఆ స్థాయిలో హింస చేయనట్టయితే, వాచిక హింసమీద దృష్టి పెట్టవచ్చు. వాచిక హింస అంటే ఎవరిమీదనైనా అరవటం, దూషించటం, అశ్లీలమైన భాష వాడటం.

**2 సత్యం–** ఇది ప్రాథమికంగా వాచిక తపస్సు. మనకున్న పరిజ్ఞానం, మన ఆలోచనలు, మన మాటల మధ్య అనుసంధానం ఉండాలి. మనం పలికే మాటలు మనకున్న జ్ఞానాన్ని కాని, మన ఉద్దేశ్యాలను కాని దాయకూడదు. ఒక్కముక్కలో చెప్పాలంటే మనసావాచా ఒక్క త్రాటిమీద నడవాలి. నిజానికి సత్యం అనేది సానుకూల భావన. దానిని ఒక యమముగా శాస్త్రం వర్ణించిందంటే దాన్ని మనం సరిగ్గా అర్థం చేసుకోవాలి. సత్యం పలుకకూడదు, అనకూడదు. అసత్యం పలుకకూడదు అని అర్థం చేసుకోవాలి. అంటే అబద్ధాలు ఆడకూడదు, నిజాలు కానివి చెప్పకూడదు.

**3. అస్తేయం–** అస్తేయం అర్థం అక్షరాలా తీసుకుంటే దొంగతనం చేయకపోవటం. మనం దొంగలం కాము కదా, ఈ విలువ చెప్పటం అవసరమా అనిపించవచ్చు మనకు. కాని స్తేయం అంటే అక్షరాలా ఎవరి ఇంటికో కన్నం వేసి డబ్బు దొంగిలించటం మాత్రమే కాదు. అన్యాయంగా ఏదైనా వ్యవహారం జరిపి, కొంత సొమ్ము పోగేసుకున్నా కూడా అది స్తేయం కిందకే వస్తుంది. అంతేకాదు, ఎవరికైనా ఒక పనికి ఇస్తానని ఒప్పుకున్న సొమ్ము పూర్తిగా ఇవ్వకపోవటం కూడా స్తేయం కిందకే వస్తుంది. ఎందుకంటే ధర్మబద్ధంగా అతనికి చెందాల్సిన సొమ్మును మనం మన దగ్గర పెట్టుకున్నాము కాబట్టి.

**4. బ్రహ్మచర్యం–** పరస్త్రీవ్యామోహం ఉండకూడదు. స్త్రీకి పరాయి వ్యక్తిమీద, పురుషునికి పరాయిస్త్రీమీద చెడు ఆలోచనలు కాని, వ్యామోహం కాని ఉండకూడదు. ఒకరినొకరు గౌరవంగా చూడాలి. సత్యంలాగే, బ్రహ్మచర్యం కూడా సానుకూల భావనే, అయినా యమలలో చోటు చేసుకుంది కాబట్టి దీన్ని కూడా అలాగే సరిగ్గా అన్వయించుకోవాలి. బ్రహ్మచర్యం పాటించాలంటే పరస్త్రీవ్యామోహం ఉండకూడదు.

**5. అపరిగ్రహం–** పరిగ్రహం అంటే ఆస్తిపాస్తులు ఉండటం. అపరిగ్రహాన్ని అక్షరాలా తీసుకుంటే ఆస్తిపాస్తులు ఉండకూడదు అని వస్తుంది. కాని దాన్ని సాధారణ జీవితం గడపటంగా తీసుకోవాలి. అపరిగ్రహంలో రెండు అంశాలు ఉన్నాయి.

తక్కువ ఆస్తి ఉండటం, ఉన్న కాస్త ఆస్తిమీద సరియైన దృక్పథం కలిగి ఉండటం. బడాయిలకు పోకుండా, ఆర్భాటాలు చేయకుండా, డాబు, దర్పం చూపకుండా ఉండటం. ఎంతమేరకు అవసరమో అంతమేరకు ఒక గిరి గీసుకుని, అంతే ఉంచుకోవటం. సామాన్య జీవనవిధానమే ఉన్నతస్థాయికి తీసుకుపోతుంది.

ఉన్నకాస్త ఆస్తిమీద సరియైన దృక్పథం ఉండటం ఇంకా ముఖ్యం. తక్కువ ఆస్తి కలిగి ఉండటంకన్నా ఉన్న ఆస్తిమీద వ్యామోహం పెంచుకోకుండా ఉండగలగాలి. నాది, నాది అనుకునేది నాది కాదు. అది భగవంతుని ప్రసాదం. ఆయన మన అభివృద్ధికోసం తాత్కాలికంగా మనకు ఇచ్చాడు. ఏ క్షణంలోనైనా దీన్ని తిరిగి తీసుకునే హక్కు, చెప్పో చెప్పకుండానో, ఆయనకు సర్వవేళలా ఉంది, అని నిరంతరం మనం తలచుకుంటూనే ఉండాలి.

**నియమాలు–** ఐదు నియమాలు – శౌచం, సంతోషం, తపస్సు, స్వాధ్యాయం, ఈశ్వరప్రణిధానం.

**6. శౌచం–** శౌచం అంటే శుభ్రత. ముందుగా శారీరక శుభ్రతమీద దృష్టిపెడితే, క్రమేణా అంతర్గత శౌచంమీద కూడా శ్రద్ధ చూపవచ్చు. శౌచం అంటే మనను, మన పరిసరాలను శుభ్రంగా ఉంచటం అనుకోవచ్చు. అంటే మన శరీరం, మన బట్టలు, మన వస్తువులు, మన ఇల్లు అన్నీ శుభ్రంగా ఉండాలి. శౌచం అంటే కేవలం శుభ్రతే కాదు, ఒక నిబద్ధత కూడా. మన ఇల్లు చాలా శుభ్రంగా ఉండవచ్చు కాని, నిబద్ధత లేకపోతే, ప్రతి చిన్నదానికీ ఇల్లంతా వెతకడంలో ఇల్లంతా చిందరవందర అవుతుంది. **'ప్రతిదానికీ ఒక స్థానం, ప్రతిదీ దాని స్థానంలో,'** సూత్రాన్ని పాటించాలి.

**7. సంతోషం–** సంతోషం అంటే తృప్తి. సంతోషం రెండు స్థాయిల్లో పెంపొందించుకోవాలి. ఎందుకంటే జీవితంలో మన లక్ష్యం రెండు విధాలుగా ఉంటుంది కాబట్టి. అది డబ్బు సంపాదించుకోవటం, దానితో ఆస్తి పెంచుకోవటం. చాలా డబ్బు సంపాదించాలనీ, ఎన్నో వస్తువులు కొని దాచుకోవాలనీ కోరికగా ఉంటుంది. మొదటి దశ తృప్తి ఆస్తిని పెంచుకోవటంలో కలుగుతుంది. మనకు కావాల్సిన ఆస్తిపాస్తులను సమకూర్చుకున్నాక, వాటితో తృప్తి చెందాలి. ఇంకా, ఇంకా వస్తువులు కావాలన్న తపన తగ్గాలి. సంపాదన కొనసాగుతూనే ఉన్నా ఖర్చుపెట్టటం తగ్గాలి. అలా ఎక్కువ సంపాదించి, తక్కువ ఖర్చు పెట్టటంవల్ల సమాజానికి, దేశానికి ఐశ్వర్యం ఏర్పరచినవారమవుతాము. అటువంటి వ్యక్తిని **కర్మయోగి** అంటారు.

రెండో స్థాయి తృప్తి కోరిక లేకపోవటంనుంచి వస్తుంది. ఇంకా, ఇంకా సంపాదించాలన్న తపన పోతుంది. అలాంటి వ్యక్తిని **జ్ఞానయోగి** అంటారు. సంపాదించే విషయంలో, స్వంతం చేసుకోవాలనే విషయంలో తృప్తి చెందటాన్ని **సంతోషం** అంటారు. దీన్ని సానుకూల దృక్పథంతో ఒక **నియమం**గా పాటించాలి. ఉన్నదానితో తృప్తి చెందాలి, లేనిదానికోసం అఱ్రులు చాచకూడదు. మనస్సు దేనినైనా యాచిస్తుంటే, మనకు సమృద్ధిగా ఉంది, ఇంకేదీ కోరకు అని మనస్సుకు నచ్చచెప్పాలి. దీన్నే **సమృద్ధి సూత్రం** అంటారు.

తృప్తి ఉన్న వ్యక్తి తనకున్నదాన్ని సంతోషంగా ఇతరులకు ఇస్తాడు. సంతోషం లేకపోతే, దానగుణం రాదు. దానగుణం రావాలంటే సంతోషం ఉండాలి.

**8. తపస్సు–** తపస్సును అక్షరాలా తీసుకుంటే తపస్సు చేయటం. కాని అహింస, సంతోషాలలాగా తపస్సుకు కూడా అనేక అర్థాలు ఉన్నాయి. తపస్సును కనిపించే రూపంలో తీసుకుంటే, కాయిక కర్మ అనవచ్చు. మతపరంగానే కాదు, ఆధ్యాత్మిక పరంగానే కాదు, ఆరోగ్యపరంగా చూసినా కూడా కాయిక కర్మ చాలా ముఖ్యమైన అంశం. మన పూర్వీకుల జీవనశైలిలోనే వారికి కావాల్సినంత కాయిక కర్మ చోటు చేసుకునేది. ఇప్పుడు జీవనవిధానం మారింది కాబట్టి, ఏదైనా వ్యాయామం చేయాలి. అన్నింటిలోకి అత్యుత్తమ వ్యాయామం సూర్యనమస్కారం చేయటం.

వ్యాయామం చేయమనగానే, అబ్బో మాకు బొత్తిగా తీరికలేదు అనేస్తారు చాలామంది. కాని వారు ఒక విషయం గమనించటం లేదు. వారి ఆరోగ్యం నిలబెట్టుకోవటంకోసం ఇవాళ కొన్ని నిముషాలను కేటాయించుకోలేకపోతే, కొన్నాళ్ళ తరువాత వారు (పోగొట్టుకున్న) ఆరోగ్యాన్ని తిరిగి తెచ్చుకోవటానికి కొన్ని నెలలు ఖర్చుపెట్టాల్సి రావచ్చు.

**9. స్వాధ్యాయం–** స్వాధ్యాయం అంటే మన శాస్త్రాన్ని అధ్యయనం చేయటం. అది చాలా ముఖ్యమైన నియమం. ఒకప్పుడు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా స్వాధ్యాయం చేసేవారు. దాన్ని **బ్రహ్మయజ్ఞం**గా భావించి ప్రతిరోజూ చేసేవారు. ఇప్పుడు ఆధ్యాత్మిక చింతనకు ఎవరూ ప్రాముఖ్యతనివ్వటం లేదు. ఆ అధ్యయనం ఏదో వేద పండితులే చేయాలని లేదా సన్యాసులే చేయాలనే అపోహతో ఉన్నారు. అది పొరపాటు. అధమపక్షం భగవద్గీతలోంచి రోజుకు కొన్ని శ్లోకాలు అధ్యయనం చేసి, వాటిలో ఉన్న బోధ గురించి మననం చేయాలి.

**10. ఈశ్వరప్రణిధానం–** ఈశ్వరప్రణిధానం అంటే మన జీవితంలో మనకు కలిగిన ప్రతి అనుభవాన్నీ ఈశ్వరప్రసాదంగా స్వీకరించటం. మనం పొందే ప్రతి అనుభవమూ, మనం చేసిన కర్మకు వచ్చిన ఫలం. ఈశ్వరుడు కర్మఫలదాత. మన కర్మఫలం సుఖం అవచ్చు, దుఃఖం అవచ్చు. మనకు నచ్చవచ్చు, నచ్చకపోవచ్చు కాని అది మన చేతిలో లేదు. ప్రతి కర్మఫలం వెనుక, కర్మసిద్ధాంతం ఉంది; కర్మసిద్ధాంతం వెనుక కర్మఫలదాత అయిన ఈశ్వరుడు ఉన్నాడు. ఈశ్వరుడు కనపడడు. కర్మసిద్ధాంతం కనపడదు; కాని దాని సూత్రంద్వారా ఫలం మన చేతికి వచ్చేసరికి, అది అనుభవంలోకి వస్తుంది.

అందువల్ల ఏదొచ్చినా మన మంచికే అనుకుని, స్వీకరించాలి. అప్పుడు మనస్సులో ప్రతికూల ఆలోచనలు కాని, ఉద్రేకాలు కాని ఏర్పడవు. ఇలా ఈశ్వరప్రసాదబుద్ధితో స్వీకరించటాన్ని ఈశ్వరప్రణిధానం లేదా శరణాగతి అంటారు. అలా స్వీకరించలేకపోతే మనస్సులో అనారోగ్యకరమైన ఆలోచనలు చోటు చేసుకుంటాయి. వాటివల్ల మనలో కోపం, చిరాకు, ద్వేషం, నిరాశా నిస్పృహలు లాంటి భావాలు పెరుగుతాయి.

సాధకులందరూ ఈ పది యమనియమాలనూ తప్పకుండా పాటించాలి. ఇందులో మనం కాదనగలిగిందేమీ లేదు. ఈ యమనియమాలను పాటించకపోతే, వేదాంతం నేర్చుకుని కూడా లాభం లేదు.

**ఈ పది నియమాలు పాటించటం ఎలా?** ఈ క్రింది పద్ధతిని ఉపయోగించవచ్చు. ఒక సంవత్సరానికి ఏర్పాటు చేయబడింది ఇది. మొదటి సూత్రంతో మొదలుపెట్టి నెలకొక సూత్రం తీసుకుని దానిమీద దృష్టి పెట్టాలి. అదే వరుసలో ఒక్కొక్క నెల ఒక్కొక్కటి పాటిస్తూ రావాలి. ప్రతి ఒక్కటీ ముఖ్యమైనదే. ప్రతిదాన్నీ జాగ్రత్తగా అమలులో పెట్టాలి. అలా ఈ యమనియమాలను సాధన చేయటానికి ఈ క్రింద ఇచ్చిన ఐదు సూత్రాల పద్ధతిని పాటించవచ్చు. అవి సంకల్పం, అవధానం, సంయమం, సింహావలోకనం, విచారణ.

**1. సంకల్పం–** సంకల్పం అంటే నిర్ణయం తీసుకోవటం. ఉన్న పది యమ నియమాల్లో నెలకొకటి చొప్పున పాటించాలని చూశారు కదా! ప్రతిరోజూ పొద్దున లేవగానే, ఆ నెలలో ఏది పాటించాలో, దాన్ని ఆ రోజు పాటిస్తానని నిర్ణయం తీసుకోవాలి. 'అహింస నెల' లో, 'ఇవాళ నేను అహింసను పాటిస్తాను. నా కుటుంబసభ్యులమీద గానీ, నా క్రింద పనిచేసే ఉద్యోగులమీద గానీ, నేను

అరవను,' అని గట్టి నిర్ణయం తీసుకోవాలి. ఒక పుస్తకం పెట్టుకుని, దానిలో రోజూ నిద్రలేవగానే ఆ రోజు మీరు పాటించేది 24 సార్లు రాయాలి. ఉదాహరణకు, 'నేను ఇవాళ అహింస పాటిస్తాను.' ఆ రాయటం ఆషామాషీగా రాయకూడదు. మనస్ఫూర్తిగా, చిత్తశుద్ధితో, అంకిత భావంతో రాయాలి.

**2. అవధానం–** అవధానం అంటే జాగ్రత్త. ఇది చాలా ముఖ్యం. ఆధ్యాత్మిక మార్గం ఎన్నుకునే వారు, నిర్లక్ష్యంగా ఉండకూడదంటుంది శాస్త్రం. చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకోకపోవటంవల్లే ఎన్నో రోడ్డు ప్రమాదాలు అవటం చూస్తూనే ఉన్నాము. జాగ్రత్త తీసుకోవటం అనేది మన చేతిలో ఉంది. అందువల్ల మనం అప్రమత్తతతో ఉండాలి. మనం పాటించబోయే యమనియమాలను మనం ఉల్లంఘించటానికి తోడ్పడే నిర్లక్ష్యాలను పారద్రోలాలి. ఈ సూత్రం ఆరోగ్యానికి కూడా వర్తిస్తుంది. ఆరోగ్యాన్ని నిలబెట్టుకోవాలంటే కొన్ని చిన్న సూత్రాలను పాటించాలి. ఆ చిన్న సూత్రాలను నిర్లక్ష్యం చేస్తే జీవితకాలం అవస్థలు పడక తప్పని పరిస్థితి ఏర్పడవచ్చు.

**3. సంయమం –** సంయమం అంటే అదుపులో పెట్టటం. అవధానం పనిచేయని చోట సంయమం రంగంలోకి దిగుతుంది. పది యమనియమాలు పాటించాలని ఉన్నా, ఆటంకాలు ఎదురవుతాయి, ముఖ్యంగా ప్రారంభదశలో. అప్పుడు మనం తప్పించుకోవాలని ప్రయత్నిస్తున్న పాత వ్యతిరేక ప్రవర్తన దూసుకువస్తుంది. ఎప్పుడైతే మనం పరుషంగా మాట్లాడుతున్నామని గ్రహిస్తామో, అప్పుడే మనన్నును మనం అదుపులో పెట్టుకోవటానికి ప్రయత్నించాలి. పరిస్థితి విషమించకముందే, సంయమనాన్ని పాటించటానికి సాధన చేయాలి.

**4. సింహావలోకనం –** సింహావలోకనం అంటే ఆత్మపరీక్ష. ప్రతిరోజూ, పడుకునే ముందు, ఆ రోజు మన ప్రవర్తనను గుర్తు తెచ్చుకుని, మనం ఎన్నుకున్న దాన్ని ఎంతవరకూ పాటించగలిగామని ఒకసారి బేరీజు వేసుకోవాలి. మనం దారితప్పిన ప్రతి తప్పుకూ, మన పుస్తకంలో, 'ఓం శ్రీ గురుభ్యోనమః,' అని 24 సార్లు రాయాలి.

ఇలా రాయటంవల్ల మూడు ప్రయోజనాలు ఉన్నాయి. ముందుగా, మన నియమాన్ని పాటించనందుకు అది ప్రాయశ్చిత్తంగా పని చేస్తుంది. రెండోది, గురుకృపను కోరుతున్నాము. గురువు అంటే భగవంతుడు కూడా వస్తాడు. ఎందుకంటే ఆదిగురువు సాక్షాత్తూ ఆ పరమాత్మే. మూడోది, గురుకృపవల్ల మనం పాటించాల్సిన నియమాన్ని పాటించటానికి వీలు లేకుండా చేసిన పరిస్థితులు లేదా సందర్భాలు అంతకంతకూ తగ్గుతూ వస్తాయి.

అంతేకాదు, మన దృక్పథంలో కూడా మార్పు వస్తుంది. ప్రస్తుతం మనం ఏదైనా నియమం పాటించకపోతే, పరిస్థితులను నిందిస్తాము. పైగా ఆ పరిస్థితుల్లో అలాగే ప్రవర్తించి తీరాలి అని సమర్థించుకుంటాము కూడా. కాని, గురుకృపవల్ల, కొన్ని రోజులు పోయాక, అంతకుముందు ఏ పరిస్థితుల్లో అయితే అబద్ధమాడి తీరాలనుకున్నామో, అప్పుడు కూడా అసత్యం చెప్పలేదు అని గ్రహిస్తాము. ఆ విధంగా గురుకృపవల్ల, మనను రెచ్చగొట్టే ఇటువంటి సందర్భాలు అంతకంతకూ తగ్గుతూ వస్తాయి. అంతేకాదు, వచ్చిన అతి కొద్ది సందర్భాలలో కూడా, మనం రెచ్చిపోయి, అంతకు ముందులా నియమాన్ని ఉల్లంఘించము కూడా.

ఈ నాలుగు పద్ధతులనూ ప్రతిరోజూ పాటించాలి.

**విచారణ–** విచారణ అంటే అధ్యయనం చేయటం. ఇది చాలా శక్తివంతమైన, అత్యంత ముఖ్యమైన కిటుకు. మనం పాటించబోయే ఒక్కొక్క నియమాన్ని లోతుగా అధ్యయనం చేయాలి. **'ఒక విలువ యొక్క విలువ'**ను గుర్తించాలి. ఏ నెల ఏ నియమాన్ని ఎన్నుకుంటే, ఆ నెలంతా ఆ నియమంమీద దృష్టిపెట్టాలి. ఉదాహరణకు 'అహింస నెల'లో అహింసమీద వీలున్నంత సమాచారం సేకరించాలి. వారానికి ఒక గంటసేపన్నా దానికి సంబంధించిన విషయాలన్నీ చదివి, దాని ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలి.

హింస మానకపోతే మోక్షం ఎందుకు పొందలేము? అసలు ఎందుకు హింసా ప్రవృత్తి చూపుతాము? హింస చూపకుండా ఉండటానికి ఏ జాగ్రత్తలు పాటించగలము? ఈ విషయాలమీద విశ్లేషణ చేస్తే మనకు ఒక విషయం తేటతెల్లమవుతుంది. హింసకు ముందు కోపం వస్తుంది. ఈ విశ్లేషణలో ఇంకా ముందుకు సాగవచ్చు. అసలు కోపం ఎందుకు వస్తుంది? కొంతమంది ప్రవర్తనవల్ల వస్తోందా? వారు మారాలని ఆశించకుండా, నేను నా కోపాన్ని తప్పించుకోవటానికి లేదా కనీసం తగ్గించుకోవటానికి నన్ను ఎలా మార్చుకోగలను?

ఇటువంటి విచారణ మనం ఒంటరిగా చేసుకోవచ్చు. లేదా ఒక సత్సంగంలో చేరి, ఆ సత్సంగ సభ్యులతో కలిసి చేయవచ్చు. అలాంటి సత్సంగంలో వారానికి ఒకసారి కలిసి, ఒకరి అనుభవాలు ఒకరు పంచుకోవచ్చు. దానివల్ల వారెలా ఈ నియమాలను పాటిస్తున్నారో తెలుసుకునే అవకాశం కలుగుతుంది. సత్సంగంలో ఇలా చర్చించటంవల్ల సభ్యులందరూ ప్రయోజనం పొందుతారు.

పైపెచ్చు అందరిలోనూ శ్రద్ధ, అంకితభావం పెరుగుతాయి. అందువల్ల సత్సంగాలకు వెళ్ళటం మంచిది.

విచారణ చేయటంవల్ల ఒక్కొక్క నియమానికీ కనబడే స్థూల అంశం, కనబడని సూక్ష్మ అంశం ఉంటాయని, ఒక్కో దానికి అనేక కోణాలు ఉంటాయనీ తెలుస్తుంది. మనం మొదటి సంవత్సరం కనబడే స్థూల అంశంమీద దృష్టి పెడితే, తర్వాత వచ్చే సంవత్సరాలలో సూక్ష్మ అంశాలను సాధన చేయవచ్చు.

పది యమనియమాలు పది నెలలకు సరిపోతే, తక్కిన రెండు నెలలు ఏం చేయాలనే ప్రశ్న ఉదయించవచ్చు. పదకొండవ నెలలో, సాధకుడు తనకున్న ఒక చెడు లక్షణాన్ని ఒదులుకోవటానికి ప్రయత్నించవచ్చు అంటే పొగ త్రాగే అలవాటును ఒదులుకోవటమో, కోపం పోగొట్టుకోవటమో చేయవచ్చు. దీనికి కూడా అదే పద్ధతి. ముందు పైకి కనబడే స్థూల అంశంతో మొదలుపెట్టి రాను రానూ సూక్ష్మమైన బలహీనతలను తగ్గించుకోవచ్చు.

పన్నెండవ నెలలో మనం ఒక మంచి అలవాటును పెంపొందించుకోవాలి. ఒకవేళ మనకు ఇతరులను విమర్శించే అలవాటు ఉంటే, దానికి భిన్నమైన మంచి అలవాటును పెంచుకోవాలి. అంటే మెచ్చుకోవాల్సిన చోట మెచ్చుకోవటం అలవరచుకోవాలి. ఎటువంటి అలవాట్లను వదులుకోవాలి లేదా ఎటువంటి అలవాట్లను పెంపొందించుకోవాలి అనే అంశంమీద ఒకవేళ ఏమైనా సందేహాలుంటే భగవద్గీతలోనే పదహారవ అధ్యాయాన్ని అధ్యయనం చేయవచ్చు. అందులో శ్రీకృష్ణ పరమాత్మ చెడు లక్షణాలను ఆసురీ సంపత్తి కింద, మంచి లక్షణాలను దైవీసంపత్తి కింద విపులంగా చర్చించాడు. వాటిని అధ్యయనం చేసి దైవీసంపత్తిని అలవరచుకుని, ఆసురీసంపత్తిని పోగొట్టుకోవచ్చు.

## స్వామీజీ సూక్తిముక్తావళి

మనం మన నోరు చేసే రెండు పనుల గురించి జాగ్రత్త వహించాలి– **తినే నోరు (జ్ఞానేంద్రియం), మాట్లాడే నోరు(కర్మేంద్రియం).**

నోటిని అదుపులో పెడితే తక్కిన నాలుగు ఇంద్రియాలు నియంత్రించ బడుతాయి. అందువల్ల **ఉపవాసం, మౌనం** ముఖ్యమైన సాధనల క్రిందకి వస్తాయి.

# 13. ఆధ్యాత్మికతకు మతం అవసరమా?

మతం అంటే ఏమిటి? ఆధ్యాత్మికత అంటే ఏమిటి? ఈ రెండింటి మధ్య ఉన్న సంబంధం ఏమిటి? ఈ రెండింటి మధ్య ఉన్న వ్యత్యాసం ఏమిటి? మతంతో సంబంధం లేకుండా ఆధ్యాత్మిక మార్గంలో వెళ్ళగలమా? ఆధ్యాత్మికత లేకుండా మతం మాత్రం పాటించగలమా? ఈ ప్రశ్నలు తరచూ వినిపిస్తున్నాయి ఈమధ్య. ఎందుకంటే చాలా మందికి మతం అన్నా, మతపరమైన జీవనం అన్నా విముఖత కలుగుతున్నది. నేను ఆధ్యాత్మికంగా ఎదుగుతాను, కాని మతం జోలికి పోను అంటున్నారు ఇప్పుడు చాలామంది. ఎందుకు ఇలా మత ద్వేషులు అవుతున్నారు? దీనికి కారణాలు అనేకం – వర్ణభేదాలు, మూఢనమ్మకాలు, పాతచింతకాయ అలవాట్లు, మూఢ సాంప్రదాయాలు.

మతం, ఆధ్యాత్మికత, మతపరమైన జీవనం, ఆధ్యాత్మ జీవనం – వీటిని ఎలా నిర్వచిస్తాము? వీటికి ఎన్నో నిర్వచనాలు ఉన్నాయి కాని, ఒకదానికీ, ఇంకోదానికీ పొంతన లేదు. అందువల్ల మనం వీటిని శాస్త్రపరంగా చూద్దాము.

మతం అంటే యోగం లేదా సంబంధం. అందువల్ల వేదాల్లోని మతపరమైన భాగం సంబంధం గురించి చెబుతుంది. వేదంలో ఈ భాగాన్ని పూర్వభాగం లేదా కర్మకాండ అంటారు. వీటిమధ్య ఉన్న సంబంధం తప్పించుకోలేనిది. మానవ జీవితాన్ని ప్రభావితం చేస్తుంది కాబట్టి శాస్త్రం వీటిగురించి మాట్లాడుతుంది. మనం పుడుతూనే సంబంధాల మధ్య పుడతాము. ఇంకా శారీరకంగా పుట్టకుండానే, అంటే తల్లిగర్భంలో ఉండగానే, మన తల్లిదండ్రులతో అనుబంధం ఏర్పడుతుంది. పుట్టాక కుటుంబసభ్యులతో, ఇరుగుపొరుగుతో, సమాజంతో, దేశంతో అనుబంధాలు పెరుగుతూ వస్తాయి. ఆ విధంగా అనుబంధాలు గర్భంలో మొదలయి, స్మశానంలో ముగుస్తాయి.

అనుబంధాలు మన జీవితాలను లోతుగా ప్రభావితం చేస్తాయి – ఇటు సానుకూలంగా, అటు ప్రతికూలంగా. మన శారీరక, మానసిక ఆరోగ్యం, జీవితంలో ముఖ్యంగా కుటుంబంలోనూ, ఉద్యోగంలోనూ రాణించటం, మన ప్రయత్నాల్లో మనం పొందే విజయం, ఐశ్వర్యం– అన్నీ సంబంధాలవల్లే ప్రభావితమవుతాయి. కొన్ని సత్సంబంధాలు భూమిని భూతలస్వర్గంగా చేస్తే, కొన్ని చెడు సంబంధాలు భూమిని నరకప్రాయంగా చేస్తాయి. అందువల్ల సంబంధాల గురించిన సరియైన అవగాహన ఉండాలి.

టూకీగా చెప్పాలంటే- మతం అంటే సంబంధం; సంబంధాలు తప్పించుకోలేనివి. పైపెచ్చు మన జీవితాలను ప్రభావితం చేస్తాయి. అందువల్ల సంబంధాలను తప్పించుకోలేము అంటే మతాన్ని కూడా తప్పించుకోలేము.

సంబంధాలను పరిచయం చేశాక, వేదాంతం ఈ సంబంధాలను విశ్లేషించి, వాటిని మూడు పెద్ద తెగల కింద విభజించింది. అవి జీవ-జీవ సంబంధం, జీవ-జగత్ సంబంధం; జీవ - ఈశ్వర సంబంధం.

**1. జీవ-జీవ సంబంధం -** తక్కిన జీవరాశులతో, ముఖ్యంగా మానవజాతితో మనకున్న అనుబంధాన్ని జీవ -జీవ సంబంధం అంటారు. ఈ సంబంధం తల్లి గర్భంలో ఉండగానే తల్లితో మొదలయి, పుట్టాక క్రమేపీ కుటుంబ సభ్యులకు, తోటి విద్యార్థులకు, సహ ఉద్యోగులకు, స్నేహితులకు, సమాజానికీ పాకుతుంది. ఈ సంబంధాలు చాలా ముఖ్యమైనవని శాస్త్రం చెబుతుంది. ఈ అనుబంధాలను పట్టించుకోకపోతే వాటి ఫలితమేమిటో మనం రోజూ వింటూనే ఉంటాము. ఉద్యోగాలు చేసే తల్లిదండ్రులు పిల్లలను పట్టించుకోలేకపోవటం,కుటుంబాలు చెదరిపోవటం, పిల్లలు తల్లిదండ్రులలో ఎవరో ఒకరితోనే ఉండాల్సిరావటం వింటుంటాము,చూస్తుంటాము. అరుదుగా, స్కూలుపిల్లవాడు, స్కూలుకు తుపాకీ తీసుకువెళ్ళి టీచర్లమీదో, తోటి విద్యార్థులమీదో కాల్పులు జరపటం చదువుతాము. ఏ అంశం తీసుకున్నా, ఆ నేరస్తుని వెనుక చెల్లాచెదురైన కుటుంబగాధ ఉంటుంది.

ఒకసారి, రెండు విద్యాసంస్థల్లో పెరుగుతున్న పిల్లలమీద ఒక పరిశోధన జరిపారు. ఒక సంస్థలో పెద్దవారికీ, పిల్లలకీ మధ్య అనుబంధాన్ని నెలకొల్పారు. దానికోసం కొందరు పెద్దలు వారికి పెంపుడు తండ్రుల్లా అభిమానం చూపారు. రెండవ దానిలో ఈ అనుబంధం లేదు కాని తక్కినవన్నీ రెండు సంస్థల్లోనూ సమానంగా ఉన్నాయి. రెండింటిలోనూ, పిల్లలకు తిండి, బట్ట, విద్యా విషయాల్లో లోటు లేదు. కొన్ని సంవత్సరాల తర్వాత, రెండు సంస్థల్లో పిల్లలను బేరీజు వేస్తే, రెండింటిలోనూ పిల్లల శారీరక ఎదుగుదల, మానసిక ఉల్లాసం విషయాల్లో **హస్తిమశకాంతం** అంత తేడా ఉంది. పెంపుడు తండ్రుల ఆదరాభిమానాలతో, అండదండలతో పెరుగుతున్న పిల్లలు, రెండో సంస్థ పిల్లలకన్నా ఎన్నో రెట్లు ఉన్నతస్థాయిలో ఉన్నారు. ఈ పరిశోధనవల్ల తేలిన విషయం అనుబంధం చాలా ముఖ్యమనీ, అది మన ఎదుగుదలను కొట్టిచ్చినట్టుగా ప్రభావితం చేస్తుందనీను.

**2. జీవ-జగత్ సంబంధం -** మనం ఈ జగత్తులో పుట్టాము. జగత్తులో పెరుగుతాము. ఈ జగత్తును మన శాస్త్రం పాంచభౌతికంగా విభజించింది. ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, పృథివి. జీవ-జగత్తు సంబంధం కూడా మన జీవితంలో ప్రధానపాత్ర వహిస్తుందని, మన శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. అందువల్ల మనం ఆ సంబంధాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. దురదృష్టవశాత్తూ, ఇప్పటికే నిర్లక్ష్యం చేసేశాము, దాని ఫలితాలు అనుభవిస్తున్నాము కూడా.

అందువల్లనే అంతర్జాతీయ సమావేశాల్లో ఈ వాతావరణ కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్ సమస్యలు ప్రధాన అంశాలుగా ఉన్నాయి. మన నీటి వనరులను మనం తెలివిగా వినియోగించుకోలేకపోయినందువల్ల, వేలాది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితి ఎందుకు వస్తున్నది? ఎందుకంటే జీవ-జగత్తు సంబంధాన్ని మానవజాతి నిర్లక్ష్యం చేయటంవల్ల అంటున్నది శాస్త్రం. ఈ సంబంధాన్ని నిర్లక్ష్యం చేసి, మనం మాత్రం హాయిగా కొనసాగాలంటే సాధ్యం కాదు.

**3. జీవ-ఈశ్వర సంబంధం-** ఈశ్వరుడు సృష్టికర్త. మనం సృష్టింపబడిన జీవులం. ఈశ్వరునికీ, మనకీ మధ్య కారణ-కార్య సంబంధం ఉంది. అన్ని సంబంధాలలోకీ ఇది అత్యంత శక్తివంతమైనదీ, శాశ్వతమైనదీ కాని దురదృష్టవశాత్తూ దీన్నే సాధారణంగా మర్చిపోతున్నాము, పైగా నిర్లక్ష్యం చేస్తున్నాము.

ప్రాపంచిక సంబంధాలు ఊహించలేనివి,అదుపులో పెట్టలేనివి, శాశ్వతంగా నిలవలేనివి, గాజులాగా పగిలిపోయేవి. స్థిరంగా, శాశ్వతంగా నిలిచే సంబంధం ఏదైనా ఉంటే, అది ఈశ్వరునితో మాత్రమే- ఒక్క ఈ జన్మలో మాత్రమే కాదు, జన్మజన్మల అనుబంధం అది. జీవ-ఈశ్వర సంబంధం ఒక జన్మనుంచి ఇంకో జన్మకు సాగుతుంది. ఈ సంబంధానికి ఆది, అంతం లేదు ఎందుకంటే జీవుడు-ఈశ్వరుడు- ఇద్దరూ అనాది, అనంతం. అన్నింటిలోకీ ఇది అత్యంత స్థిరమైన సంబంధం, పైగా పదికాలాలు నిలిచే మానసిక భద్రతను కూడా ఇస్తుంది. అందువల్ల మన మతం ఈ సంబంధాన్ని నిర్లక్ష్యం చేయవద్దని గట్టిగా చెబుతుంది. జీవ-ఈశ్వర సంబంధాన్ని అంగీకరించండి, గుర్తించండి, కాపాడుకోండి, పెంచి పోషించుకోండి.

అంటే తక్కిన రెండు సంబంధాలు- జీవ-జీవ సంబంధం, జీవ-జగత్తు సంబంధం కూడా ముఖ్యమైనవేనని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. వాటిని కూడా

భద్రంగా కాపాడుకోవాలి. పెంచి పోషించుకోవాలి. మతపరమైన జీవనంలో ఈ మూడు సంబంధాలూ చక్కగా నెలకొని ఉంటాయి.

ఈ సంబంధాలను పటిష్ఠం చేయటం ఎలా? మతం అనేక మార్గాలను సూచిస్తుంది. అది కూడా మనకు బాగా తెలిసిన సూత్రాలనుంచే! తల్లీ-పిల్లల అనుబంధం దానికి ఒక మచ్చుతునక. ఎందుకంటే అన్ని అనుబంధాల్లోకీ అది ఒక ప్రాథమిక అనుబంధం. ఈ అనుబంధం ఎలా ఏర్పడుతుంది, ఎలా గట్టిగా పెంపొందించబడుతుంది, ఎలా గట్టిపడుతుందో చూద్దాము.

ఈ అనుబంధం ఎలా మొదలవుతుంది? పాపాయి తల్లి గర్భంలో రూపుదిద్దుకుంటోందని తెలిసినప్పటినుంచే తల్లి ఆలోచనల నిండా పాపాయే ఉంటుంది. ఆవిడ **మానసకర్మ** చేస్తుంది. అంటే బంధం ముందు ఆలోచనల స్థాయిలో మొదలవుతుంది. పాపాయికి కొన్ని నెలలు నిండాయో లేదో, తల్లి పాపాయితో మాట్లాడటం మొదలుపెడుతుంది. పాపాయికోసం ఆవిడ ప్రత్యేకంగా ఒక భాషను పెంపొందించుకుని, ఆ భాషతో పాపాయితో బంధాన్ని పటిష్ఠం చేసుకుంటుంది. తల్లి వాడే ఆ పదాలు ఏ నిఘంటువులోనూ దొరకవు; అంతా అయోమయం! కాని వారిద్దరి మధ్య అద్భుతమైన సంభాషణ సాగుతుంది. దీన్ని **వాచికకర్మ** అంటారు. అది వీరి మధ్య బంధాన్ని పటిష్ఠం చేస్తుంది.

అది కాక పాపాయిని గుండెలకు హత్తుకుంటుంది. ఒళ్ళో పడుకో పెట్టుకుంటుంది. ముద్దు చేస్తుంది, కౌగలించుకుంటుంది. ముద్దు పెట్టుకుంటుంది. ఒక్కోసారి గిల్లుతుంది కూడా! దీన్ని **కాయికకర్మ** అంటారు. తల్లి స్పర్శ తల్లీ, పిల్లల మధ్య బంధాన్ని మరింత బలపరుస్తుంది.

మనుష్యులందరూ, ఆఖరికి నాస్తికులు, మతపరం కాని వారు కూడా, తక్కిన వారితో సత్సంబంధాలు నెలకొల్పాలనే చూస్తారు. మన కుటుంబ సభ్యులు, స్నేహితుల గురించి, వారి పుట్టినరోజున తలచుకుంటాము. అది **మానసకర్మ.** వారు దగ్గర లేకపోతే, ఫోను చేసి శుభాకాంక్షలు అందజేస్తాము. అది **వాచికకర్మ.** కొత్త సంవత్సరం రోజున బొకేలు, న్యూ ఇయర్ కార్డులు ఇస్తాము. అది **కాయికకర్మ.** ఆ విధంగా ఏదో ఒక సందర్భంలో ఏదో ఒక కర్మద్వారా మన బంధాలను నెలకొల్పుకుంటాము, నిలబెడతాము, గట్టిపరచుకుంటాము.

అలాగే మన మతపరమైన వేడుకలు, సాంప్రదాయాలు కూడా మానస, వాచిక, కాయిక కర్మలు తప్ప ఏమీ కావు. వాటిద్వారా మనం ఇంతకు ముందు

చూసిన మూడు రకాల సంబంధాలను గుర్తించి, పెంపొందించుకుంటాము. ఏ పండుగ రోజునన్నా గమనించండి– దాని వెనుక ఉన్న లక్ష్యం ఏదో ఒక బంధాన్ని దృఢపరచుకోవటం. రక్షాబంధం అన్నా చెల్లెళ్ళ మధ్య బంధాన్ని దృఢపరిస్తే; పొంగల్ ఆవుతో ఉన్న అనుబంధాన్ని దృఢపరుస్తుంది. కుంభమేళాలో నదిలో స్నానం చేయటంద్వారా ప్రకృతితో బంధాన్ని పెనవేసుకుంటాము. మకర సంక్రాంతికి సూర్యునితో బంధాన్ని తలచుకుంటాము. శివరాత్రి రోజు రుద్రాభిషేకం చేసి పరమేశ్వరునితో మన అనుబంధం గట్టిపరచుకుంటాము. అలా మతపరమైన వేడుకలు మన బాగోగులకోసం ఏర్పరచినవి.

అందువల్ల మనం ఈ సాంప్రదాయాలను పాటించాలి. పైగా అవి మతపరమైన జీవితప్రాముఖ్యతను చూపటమే కాక, విలువలకు కూడా విలువనిస్తాయి. నైతిక విలువలలాంటి సత్యం, అహింస, అస్తేయం, ఆర్జవం పాటిస్తేనే ఈ మూడు రకాల బంధాలు శాశ్వతంగా నిలుస్తాయి. మనం విలువలను పట్టించు కోకపోతే, అనుబంధాలు వీగిపోతాయి.

మనం ఒక విషయం ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. మనం చేసే ఈ మానసిక, వాచిక, కాయిక కర్మలు మన అంతిమలక్ష్యాలైన ఈ బంధాలను గట్టిపరచుకోవటానికి తోడ్పడే మార్గాలు. అందువల్ల శాస్త్రం ఒక హెచ్చరిక చేస్తుంది– మతపరమైన కర్మలు చేయండి, కాని అవి ఎందుకు పెట్టారో మర్చిపోకండి! అవి బంధాలను మరింత దృఢపరచటానికి పెట్టబడ్డాయి. ఇది చాలా ముఖ్యమైన అంశం. ఎందుకంటే మనం దాని ఉద్దేశ్యాన్ని పక్కనపెట్టేసి, క్రతువు చేసే పద్ధతికి అనవసరమైన ప్రాముఖ్యతనిస్తున్నాము.

ఉదాహరణకు రుద్రాభిషేకానికి ఏకాదశ ద్రవ్యాలు వాడాలంటారు. అంటే పదకొండు ద్రవ్యాలు. చాలా మంది ఎప్పుడూ ఈ ప్రశ్నను అడుగుతారు; 'పదకొండు సంఖ్యకు ఏమైనా ప్రత్యేకత ఉందా? పదకొండు ఎందుకు? పదో,పన్నెండో వాడకూడదా?' దానిమీద పెద్ద పరిశోధనలు కూడా జరుగుతున్నాయి. ఈ తతంగంలో ఈశ్వరుణ్ణి మర్చిపోతున్నాము.

మనం ఒక విషయం గట్టిగా అర్థం చేసుకుని, గ్రహించాలి. ఒక క్రతువు అలా ఎందుకు చేస్తాము అని దాని లోతుల్లోకి వెళ్ళనవసరం లేదు. అలా చేయటం వల్ల ఈశ్వరునితో బంధం పెంచుకోవటానికి ఏర్పాటు చేసిన అసలు ముఖ్యోద్దేశ్యం పక్కకు వెళ్ళిపోతుంది. పదకొండు ద్రవ్యాలమీద కాదు దృష్టి పెట్టాల్సింది.

భగవంతునిమీద. పదకొండు ద్రవ్యాలు దొరక్కపోతే, ఎన్ని దొరికితే వాటితోనే చేయవచ్చు. అయ్యో, శాస్త్రప్రకారం చేయలేకపోతున్నామే అని బాధపడనవసరం లేదు. మన మతంలో పరిస్థితికి తగ్గట్టుగా మార్చుకునే సర్దుబాటు ఉంది.

ఈ మూడు సంబంధాలనూ ఎవరూ తప్పించుకోలేరు. నాస్తికుడు మూడవ సంబంధాన్ని తప్పించుకోగలడేమోకాని, తక్కిన రెండూ కాదు. ఆ బంధాలను నిలబెట్టుకుంటే, నాస్తికుడు కూడా మతపరంగా జీవిస్తున్నట్టే.'నేను మతపరంగా ఉండి తీరాలా?' అంటే మనకు వేరే మార్గం లేదు. మానసిక, వాచిక, కాయిక కర్మలను మన శక్తికొద్దీ, మన విలువకొద్దీ చేసి తీరాలనీ, జీవ-జగత్తు- ఈశ్వరులతో బంధం పెంపొందించుకోవాలనీ, అప్పుడే మన జీవితం ఫలవంతంగా, విజయవంతంగా ఉంటుందనీ శాస్త్రం చెబుతుంది.

ఆధ్యాత్మికత అంటే ఏమిటి? ఆధ్యాత్మిక జీవనం అంటే ఏమిటి? వీటిని వేద అంతభాగంలో చర్చించింది. దీన్ని ఉత్తరభాగం లేదా జ్ఞానకాండ అంటారు. ఆధ్యాత్మిక జీవనం అంటే ఆత్మతో సంబంధం పెంచుకున్న జీవన విధానం. ఆత్మ అంటే అదే అంతిమ సత్యం. అదే జీవ జగత్తు ఈశ్వరులకు ఆధారం. అది నిర్గుణ బ్రహ్మ. అది బంధాలకు అతీతం.

వేదాంతం ఎందుకు? నిర్గుణబ్రహ్మజ్ఞానం పొందితేనే బంధాలకు అతీతంగా ఎదగగలము. ప్రపంచంనుంచి మనము ఆత్యంతిక స్వేచ్ఛను పొందలేము, సాపేక్షిక స్వేచ్ఛనే పొందగలము.

ఈశ్వరునికి కూడా సాపేక్షిక స్వేచ్ఛమాత్రమే ఉంది. ఆత్యంతిక స్వేచ్ఛలేదు. ఆత్యంతిక స్వేచ్ఛ కావాలంటే, జీవ-ఈశ్వర సంబంధానికి కూడా అతీతంగా ఎదిగి, సత్యం, జ్ఞానం, అనంతం అయిన బ్రహ్మను తెలుసుకోవాలి. ఆ బ్రహ్మ అసంగం, అద్వైతం, దేశకాల పరిచ్ఛిన్నాలకు అతీతం.

ఇప్పుడు ఒక్కముక్కలో చెప్పాలంటే- మతపరమైన జీవనంలో సంబంధాన్ని నిలుపుకోవటానికి, గట్టిపరచుకోవటానికి ప్రయత్నిస్తాము. కాని ఆధ్యాత్మిక జీవనంలో ఈ సంబంధాలకు అతీతంగా ఎదుగుతాము.

మతపరమైన జీవనం రెండు రకాలుగా జీవించవచ్చు; ప్రాపంచిక సుఖాల కోసం, ఆధ్యాత్మిక సాధనకోసం. ఆధ్యాత్మికత జోలికి పోకుండా మతం దగ్గరే ఆగిపోవచ్చు కొంతమంది. అలాంటి వారికి మతం కేవలం ప్రాపంచిక సుఖాలను మాత్రమే ఇస్తుంది. ఒకవేళ మతంద్వారా ఆధ్యాత్మికత లక్ష్యాలను పొందటానికి

ప్రయత్నిస్తే అతన్ని మతపరమైన ఆధ్యాత్మిక సాధకుడు అంటారు, అంటే అతను మతమూ, ఆధ్యాత్మికతా రెండూ పాటిస్తున్నాడు. అందువల్ల ఇప్పుడు రెండు మార్గాలు ఏమిటి? కేవలం మతాన్ని పాటించటం, లేదా మతమూ, ఆధ్యాత్మికతా రెండింటినీ పాటించటం. దీనివల్ల గ్రహించాల్సిన విషయం మతం లేకుండా ఆధ్యాత్మికతకు రాలేము. అంటే ఆధ్యాత్మికతకు మతం అవసరమే.

మనం మతపరమైన జీవనంలో ఉండి జీవ, జగత్తు, ఈశ్వరులతో ఆరోగ్యకరమైన, పటిష్ఠమైన సంబంధాలు నెలకొల్పి, ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చి అసంగ, అద్వైత, దేశకాల అతీత బ్రహ్మ గురించి తెలుసుకుందాము.

# స్వామీజీ సూక్తిముక్తావళి

ఈ నాలుగు పెద్ద అంశాల విషయంలో శ్రద్ధ వహించండి.

**అహంకారం, మమకారం, రాగం, ద్వేషం.**

వాటిని పూర్తిగా పారద్రోలలేరు, కాని జీవన్ముక్తి పొందటానికి వాటిని శక్తి విహీనం చేయటం సాధ్యం, అవసరం కూడా.

రుద్రాభిషేకానికి ఏకాదశ ద్రవ్యాలు వాడాలంటారు. అంటే పదకొండు ద్రవ్యాలు. చాలా మంది ఎప్పుడూ ఈ ప్రశ్నను అడుగుతారు; 'పదకొండు సంఖ్యకు ఏమైనా ప్రత్యేకత ఉందా? పదకొండు ఎందుకు? పదో,పన్నెండో వాడకూడదా?' దానిమీద పెద్ద పరిశోధనలు కూడా జరుగుతున్నాయి. ఈ తతంగంలో ఈశ్వరుణ్ణి మర్చిపోతున్నాము.

# 14. మతపరమైన జీవనలక్ష్యం

మన భారతీయ సంస్కృతి మతపరమైన సంస్కృతి; అందువల్లనే మన జీవన విధానంలో అనేక మతపరమైన కార్యక్రమాలు చొప్పించబడ్డాయి. ఈ కార్యక్రమాలు మన జీవితంలో అన్ని కోణాల్లోనూ మనలో ఒక భాగంగా అల్లుకుపోయాయి. వ్యక్తిస్థాయిలో పూజలు చేస్తున్నాము. కుటుంబస్థాయిలో పండుగలు చేసుకుంటాము, సామాజిక స్థాయిలో ఆలయ వేడుకల్లో పాలు పంచుకుంటాము.

ఈ వేడుకలను మన శాస్త్రాలు నిర్దేశిస్తాయి. వేదాలను ప్రాథమిక శాస్త్రాలు అంటారు. అవి శ్రౌతకర్మలను నిర్దేశిస్తాయి. వేదాలను శ్రుతి అని కూడా అంటారు. అందువల్ల శ్రుతినుంచి వచ్చిన కర్మలు శ్రౌతకర్మలు.

రెండవ స్థాయి గ్రంథాలను స్మృతిగ్రంథాలు అంటారు. వాటినుంచి వచ్చిన కర్మలను స్మార్తకర్మలు అంటారు. ఆగమశాస్త్రాలు కూడా స్మృతిగ్రంథాలే! అవి ఆగమకర్మలను నిర్దేశిస్తాయి. ఈ ఆగమకర్మలు విభిన్న దేవుళ్ళకి విభిన్నంగా ఉన్నాయి. శైవ ఆగమశాస్త్రాలు శివపూజలు, వైష్ణవ ఆగమశాస్త్రాలు విష్ణుపూజలు, శాక్త ఆగమశాస్త్రాలు శక్తిపూజలు నిర్దేశిస్తాయి.

నిజానికి మన దైనందిన జీవితంలో చేసే అనేక పనులను ఒక ప్రార్థనగా మలచింది మన శాస్త్రం. పొద్దున లేచి చేసే దంతధావనం కూడా ఒక కర్మే. దంతధావనం చేసేముందు, టూత్‌బ్రష్‌తో చెప్పాలి, 'నువ్వు శారీరక అశుద్ధాన్ని పారద్రోలుతూ, నాలోని అంతర్గత అశుద్ధాన్ని కూడా పారద్రోలు.' స్నానం ఇంకొక క్రతువు. ఒక చిన్న మంత్రం జపించటంవల్ల మనం స్నానం చేసే నీరు పవిత్రమైన గంగాజలమవుతుంది. ఆహారం తీసుకోవటం ప్రాణాగ్నిహోత్రం అవుతుంది. ఆహారాన్ని మన లోపల ఉన్న వైశ్వానర అగ్నికి ఆహుతిగా వేస్తున్నామన్న మాట. అలా మనం నిత్యం చేసే కార్యక్రమాలే భావనలో చిన్న మార్పు తెస్తే క్రతువులు అవుతాయి.

మతపరమైన కార్యక్రమాలను మూడు అంశాలుగా విభజిస్తాము. కాయిక కర్మ అంటే పూజ చేయడం; వాచిక కర్మ అంటే పారాయణం చేయటం; మానసిక కర్మ అంటే ధ్యానం చేయటం. ఈ విధమైన మతపరమైన కార్యక్రమాలు చేయటంవల్ల కలిగే లాభమేమిటి? రెండు ఉన్నాయంటున్నది శాస్త్రం.

**1. లోకజయం-** ఇహలోకాన్ని జయిస్తాము. అంటే మన కుటుంబం, ఆఫీసు, సమాజం అంతా మనకు అనుకూలంగా ఉంటుంది. దీన్ని ప్రేయస్సు అని కూడా అంటారు. ఈ ఫలం పొందటానికి శాస్త్రం అనేక రకాల కార్యకలాపాలను సూచిస్తుంది- పూజ, అభిషేకం, హోమం, ధ్యానం వగైరా.

**2. మనోజయం-** మనస్సును జయిస్తాము. బాహ్యప్రపంచాన్ని అదుపులో పెట్టాలని చూడకుండా, మన మనస్సును మనం జయిస్తామన్నమాట. అప్పుడు మనస్సు ఆరోగ్యకరంగా, బలంగా, నిశ్చలంగా ఉంటుంది. దీన్ని శ్రేయస్సు అని కూడా అంటారు.

ఈ రెండు లాభాల్లో ఏదో ఒకటి పొందుతాము. మనం ఐహిక సుఖాలను మాత్రమే కోరుకుంటే, మనము మతపరంగా జీవిస్తున్నట్టుకాని, మనము మతపరమైన వ్యావహారిక జీవులం. అదే మనం మనోజయంకోసం ప్రయత్నిస్తే, మనం మతపరమైన ఆధ్యాత్మిక జీవులం.

వ్యావహారిక జీవికి, ఆధ్యాత్మిక జీవికి మధ్యనున్న భేదం ఏమిటి? వ్యావహారిక జీవి ప్రపంచాన్ని మార్చాలనుకుంటే, ఆధ్యాత్మిక జీవి తన మనస్సును మార్చాలనుకుంటాడు. ఇక్కడ ఒక విషయం గ్రహించాలి మనం. నిజానికి ఇద్దరి లక్ష్యమూ ఒకటే- జీవిత నాణ్యతను మెరుగుపరచుకోవటం. కాకపోతే వారి దృక్కోణాలు భిన్నంగా ఉన్నాయి.

శివరాత్రి పూజలాంటి మతపరమైన కార్యక్రమాలను ప్రాపంచిక సుఖాలకు కాని, ఆధ్యాత్మిక ఎదుగుదలకి కాని చేపట్టవచ్చు. ఏది నయం? దేన్ని ఎన్నుకోవాలి మనం? తెలివైన వ్యక్తి రెండింటిని కావాలనుకుంటాడు. తనకు అనువైన ప్రపంచం, ఆరోగ్యకరమైన మనస్సు. కాని రెండూ కుదరవు. దురదృష్టవశాత్తూ మనం ఏదో ఒకటే ఎన్నుకోగలము. ఎందుకు? దీనికొక శాస్త్రనియమం ఉంది. దాని ప్రకారం ఏదైనా పూజను లోకజయానికో లేదా మనోజయానికో చేయాలి తప్ప, రెండూ పొందలేము. శ్రేయోమార్గం, ప్రేయోమార్గం రెండూ రెండు భిన్నమైన మార్గాలు.

సహజంగా ఎవరైనా మనోజయంకన్నా లోకజయం కోరుకుంటారు. మనం ప్రపంచాన్ని, మన తోటివారిని, మన కుటుంబాన్ని, ప్రభుత్వాన్ని కూడా మార్చటానికి సిద్ధం కాని, ఖచ్చితంగా మనను మనం మార్చుకోము!

**వ్యవసాయాత్మికా బుద్ధిః ఏకేహ కురునందన।**
**బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయో௨ వ్యవసాయినామ్॥ - గీత 2-41**

ఓ అర్జునా! ఈ (నిష్కామ) కర్మయోగంలో నిశ్చయాత్మక బుద్ధి ఒకటే ఉంటుంది. కాని, భోగాసక్తులైన, వివేకహీనులైన బుద్ధులు చంచలమైన కోరికల వెంట పరుగులు తీస్తాయి.

తెలివైన వ్యక్తి కర్మలను మనోజయానికి చేస్తే, బుద్ధిహీనుడు ప్రపంచాన్ని మార్చటానికి చేస్తాడు.

**యామిమాం పుష్పితాం వాచం ప్రవదంత్యవిపశ్చితః।**
**వేదవాదరతాః పార్థ నాన్యదస్తీతి వాదినః॥**
**కామాత్మానః స్వర్గపరా జన్మ కర్మఫలప్రదామ్।**
**క్రియావిశేషబహులాం భోగైశ్వర్యగతిం ప్రతి॥**
**భోగైశ్వర్యప్రసక్తానాం తయాఽపహృతచేతసామ్।**
**వ్యవసాయాత్మికా బుద్ధిః సమాధౌ న విధీయతే ॥ గీత 2-42 నుంచి 44**

ఓ అర్జునా! వివేకహీనులైన జనులు ప్రాపంచిక భోగములలోనే తలమునకలై ఉంటారు. వారు కర్మఫలాలను ప్రశంసించే వేదవాక్యాల బాహ్యార్థాలే తీసుకుంటారు. స్వర్గానికి మించినదేదీ లేదని, అదే పరమప్రాప్యమని వారు భావిస్తారు. క్షణికాలైన ప్రాపంచిక భోగైశ్వర్యాలమీద ఆసక్తితో అనేక సకామకర్మలను ప్రోత్సహిస్తూ ప్రీతిని గూర్చి ఇచ్చకపు మాటలు చెబుతారు. ఆ ఇచ్చకపు మాటల ఉచ్చులలో పడిన భోగైశ్వర్యాసక్తులైన అజ్ఞానుల బుద్ధులు భగవంతుడు లక్ష్యంగా గల సమాధిమీద స్థిరంగా ఉండవు.

చాలా మందికి ప్రాపంచిక విషయాలమీదే ఆసక్తి ఉంటుంది. వారు ఎంతసేపూ వస్తువులు పొందటానికి పూజలు చేస్తారు. ప్రపంచం మారిపోవాలి అంటారు.

**త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున।**
**నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్॥ - గీత 2-45**

ఓ అర్జునా! వేదాలు (కర్మకాండ) సమస్త భోగాల గురించి చెబుతాయి. నువ్వు ఆ భోగాలమీద, వాటి సాధనలమీద ఆసక్తిని త్యజించి, హర్షశోకాది ద్వంద్వాలకు అతీతుడవుకమ్ము! నిత్యుడైన పరమాత్మమీదే స్థితుడవుకమ్ము. నీ యోగ క్షేమాలకోసం ఆరాటపడవద్దు. అంతఃకరణాన్ని నీ వశంలో ఉంచుకో.

ఈ కర్మకాండ ఇచ్చే ఫలితాలు అనిత్యాలు. తెలివైన వ్యక్తి ఎట్టిపరిస్థితిలోనూ ప్రశాంతంగా, ఆహ్లాదంగా, దృఢనిశ్చయంతో ఉండే మనస్సును కోరుకుంటాడు.

దీన్ని మనోజయం లేదా శ్రేయస్సు అంటారు. లోకజయంకన్నా మనోజయం ఎందుకు మంచిదంటాడు కృష్ణపరమాత్మ?

**1. చాలా మందిని మార్చాలి –** ఒకవేళ ఉన్న పరిస్థితిని మనం మార్చాలి అనుకుంటే, మనం ఎన్ని అంశాలను మార్చాలి? మనుష్యులను, పరిస్థితులను, సందర్భాలను, సంఘటనలను – అలా ఎన్నింటినో మార్చాలి. అది బొత్తిగా సాధ్యం కాదు. ఎన్నడూ పూర్తి విజయం పొందలేము.

**కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన।**
**మా కర్మఫలహేతుర్భూః మా తే సంగోఽస్త్వకర్మణి॥ – గీత 2 –47**

కర్తవ్య కర్మను ఆచరించటానికే నీకు అధికారం ఉంది కాని, దానివల్ల వచ్చే ఫలంమీద లేదు. కర్మలను మానవద్దు. కర్మఫలాలు నీ చేతిలో లేవని గుర్తించు.

మనకు మనం చేసే కర్మమీద అధికారం ఉంది కాని, అది తెచ్చే ఫలం మీద లేదు. ఎందుకంటే కర్మఫలదాత ఈశ్వరుడు. కర్మఫలాలు మనం ఆశించినట్టు రావచ్చు, రాకపోవచ్చు. ఒక పూజ చేయాల్సిన పద్ధతిలో చేసినా కూడా, మనం ఆశించిన ఫలితమే వస్తుందన్న నమ్మకం లేదు. అందువల్ల మతపరమైన లౌకిక భావన ఓటమిని చవిచూడక తప్పదు. ఎందుకంటే దానికి కావాల్సిన అంశాలు అనంతం.

**2. పదికాలాలు నిలవదు–** మనం ఇప్పుడు ఉన్న పరిస్థితిని లేదా పద్ధతిని మార్చి విజయం సాధించామని ఆశిద్దాము. కాని ఈ విజయాన్ని పదికాలాలు నిలబెట్టుకోగలమా? ఆ విషయంలో అనేకమందితో, అనేక సందర్భాలలో వ్యవహరించాల్సి ఉంటుంది. అది ఆచరణలో పెట్టటానికి వీలుకాదు. మనం విజయం పొందలేము. అందువల్ల ఉన్న పరిస్థితిని మనం మార్చటంలో విజయం పొందగలిగినా, దాన్ని పదికాలాలు నిలుపుకోలేము.

**3. అభద్రతకు లోనవుతాము–** మనం ఆదర్శవంతమైన పరిస్థితులను సృష్టించి, మనకు నచ్చినట్టుగా దాన్ని పదికాలాలు నిలుపగలిగినా, మన సమస్య తీరదు. అభద్రతకు లోనవుతాము. బెంగ చోటుచేసుకుంటుంది. ఎవరి చెడుకన్ను మన మీద పడి మన వ్యవస్థను మార్చివేస్తుందేమోనని భయపడుతూ ఉంటాము. అందువల్ల అప్పుడూ బాధే!

అందువల్ల కృష్ణపరమాత్మ సమాజాన్ని మార్చటానికి ప్రయత్నించే బదులు, నీ మనస్సును జయించు అంటున్నాడు. మన మనస్సును ప్రశాంతంగా,

ఆహ్లాదకరంగా, ఆత్మస్థైర్యంతో ఉండేలా చేసుకోవాలి. మన ప్రారబ్ధకర్మవల్ల మనం ఏది అనుభవించాలని రాసిపెట్టి ఉంటే, అది జరగనీ. అది ఏదైనా ఎదుర్కొనే ధైర్యం ఉంది మనకు.

ఎప్పుడైతే మనస్సును జయిస్తామో అప్పుడే ఈ వ్యవస్థను పట్టించుకోము! పరిస్థితులు, సందర్భాలు వస్తూంటాయి, పోతుంటాయి. అవి మననేమీ చేయలేవు. దానికి విరుద్ధంగా, ఒకవేళ మన మనస్సు ఆరోగ్యకరంగా లేకపోతే, పరిస్థితులు ఎంత అద్భుతంగా ఉండనీ, మనం ఆందోళన చెందుతాము. మన మనస్సు ఎంతసేపూ భయం, ఆందోళన, బెంగల నిలయమైపోతుంది.

ముందు చెప్పినట్టుగా మతపరమైన పూజలు శ్రేయస్సో, ప్రేయస్సో ఏదో ఒకటే లాభం ఇస్తుంది కాబట్టి, మనం శ్రేయస్సును ఎన్నుకోవాలి. అంటే మనోజయం అది. ఒకసారి ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన, ఆత్మస్థైర్యంతో కూడిన మనస్సును ఏర్పరచుకున్నాక, మనం  ఈ పూజలు చేయకపోయినా ఫర్వాలేదు. ఆ స్థాయిని చేరుకునేవరకూ దేవునికి పూజలు చేస్తూ, ఆరోగ్యకరమైన మనస్సును ఇవ్వమని కోరుకుంటూ  ఉండాలి.

అటువంటి మనస్సుకు ప్రతీక సాక్షాత్తూ ఆ పరమేశ్వరుడే! ఆయన ఉన్న వ్యవస్థ ఎటువంటిది? ఆదర్శానికి ఆమడదూరంలో ఉంది. స్మశానంలో ఉంటాడు; భూతాలు,యక్షులు, గంధర్వుల మధ్య కొలువై ఉంటాడు; జంతువుల చర్మం కప్పుకుని, ఒంటినిండా బూడిద రాసుకుని, మెడలో ఆభరణాలుగా పుర్రెలు, పాములు వేసుకుంటాడు. శివుడు తనలో తను రమిస్తూ, తన డమరుకం వాయిస్తూ, దానికనుగుణంగా ఎప్పుడూ నాట్యం చేస్తూ ఉంటాడు.

ఎంత గొప్పవాడు శివుడు? దేవతలు, దానవులు పాలసముద్రాన్ని అమృతంకోసం మథిస్తున్నప్పుడు, హాలాహల విషం ముందు బయటపడింది. భయపడిపోయిన దేవతలు పరమశివుని దగ్గరకు పరుగెత్తారు. 'ఓ దేవాదిదేవా! నువ్వు మా అందరి రక్షకుడవు! మూడు లోకాల జీవనానికి ముప్పు తెచ్చే ఈ విషంనుంచి మమ్మల్ని కాపాడు,' అన్నారు. పరమశివుడు ఆ విషాన్ని తన చేతిలో తీసుకుని, అందరి జీవులమీద గుండెనిండా ప్రేమ, జాలితో తను స్వీకరించాడు. విషం ఆయన కంఠాన్ని నీలంగా మార్చింది కాని అక్కడే ఆయనకు ఆభరణంగా నిలిచిపోయింది. ఇతరులకోసం ఆయనకున్న అభిమానానికి ప్రతీకగా ఉండిపోయింది. అందువల్లనే శివుణ్ణి నీలకంఠుడు అని కూడా అంటారు.

మళ్ళీ దేవదానవులు సాగరమథనం కొనసాగించారు. ఆ మథనంలో కామధేనువు, కోరికలను తీర్చే ఆవు; చందమామ అంతటి తెల్లటిగుర్రం; ఐరావతం; తెల్లదంతం ఉన్న ఏనుగు; కౌస్తుభం, విలువైన రత్నం అలా ఎన్నో వచ్చాయి. వాటికోసం దేవతలు పోటీపడ్డారు కాని పరమేశ్వరుడు మాత్రం స్థిరంగా ఉన్నాడు.

అందువల్ల మతంయొక్క అసలు ఉద్దేశ్యం మనోజయం. మనుష్యులను మతంవైపు ఆకర్షించటంకోసం మొదట్లో లోకజయం ఆశ చూపుతుంది. మనోజయం పొందితే ఆధ్యాత్మిక విజయం సాధించినట్టు. శివరాత్రి పర్వదినాన మనం మతపరమైన పూజల్లో పాల్గొని రుద్రాభిషేకం చేద్దాము. మన పూజలు మనకు శ్రేయస్సును అంటే మనోజయాన్ని ఇచ్చి మనస్సును ప్రశాంతంగా, ఆహ్లాదకరంగా, ఆత్మస్థైర్యంతో ఉంచేటట్టు చేసేలాగా చేసుకుందాము.

## స్వామీజీ సూక్తిముక్తావళి

రైలు ప్రయాణంలో కాఫీ కొంటే దాన్ని పేపర్ కప్పులో ఇస్తారు. కాఫీ తాగాక, కప్పును నలిపి వేస్తాము. అంతమాత్రాన కప్పుమీద కృతజ్ఞత లేనట్టు కాదు. అలాగని దానిమీద మమకారమూ లేదు. అలాగే, ఈశ్వరుడు మనకు ఈ శరీరాన్ని ఇచ్చింది 'ఆత్మజ్ఞానం' పొందటానికి.

**నైబరైజేషన్–** మిమ్మల్ని మీకు నైబర్‌గా అంటే పొరుగింటివానిగా చూసుకోండి. పొరుగువానికి సమస్య వస్తే మీరు చాలా తెలివిగా మాట్లాడతారు. వారికి మంచి సలహాలు ఇస్తారు. ఎందుకంటే మీరు దాని గురించి ఆందోళన చెందరు కాబట్టి.

# 15. సంసారస్వరూపం

ఏదైనా సిద్ధాంతాన్ని, ముఖ్యంగా భారతీయ సాంప్రదాయంలో ఉన్న సిద్ధాంతాన్ని దర్శనం అంటారు. దర్శనం అంటే దృక్కోణం, బోధనాపద్ధతి, ఆలోచనా తీరు. ఏదైనా వస్తుంది. మనకు ఆరు నాస్తికదర్శనాలు, ఆరు ఆస్తికదర్శనాలు ఉన్నాయి.

ఏ దర్శనమైనా సరే అది ఆరు అంశాలను చర్చించాలి. జీవుడు, జగత్తు, ఈశ్వరుడు, బంధం, మోక్షం, మోక్ష సాధనం. వీటన్నింటి స్వరూపాన్ని చర్చించాలి. బంధం సంసారంవల్ల ఏర్పడుతుంది. సంసారంనుంచి విముక్తి పొందటమే మోక్షం. సంసారనివృత్తే మోక్షస్వరూపం. సాధన అంటే మోక్షం పొందటానికి ఏం చేయాలి?

ఇప్పుడు, ఈ ఆరు అంశాల్లో నాలుగవ అంశం అయిన సంసారస్వరూపం చూద్దాము. వివేకచూడామణిలో గురువు విజ్ఞానమయకోశం గురించి చెబుతుండగా సంసారం గురించిన చర్చ వస్తుంది. సంసారం అనాదిగా వుందా? అద్వైత సిద్ధాంతం అనాది అంటుంది. ఆరు ఆస్తికదర్శనాలు ఉన్నాయి అని చూశాము కదా. అందులో ముఖ్యమైనది అద్వైతసిద్ధాంతం. ఆరు దర్శనాలు- సాంఖ్య, యోగ, వైశేషిక, నైయాయిక, పూర్వమీమాంస, ఉత్తరమీమాంస. ఉత్తరమీమాంసనే అద్వైతవేదాంతం అనీ, సిద్ధాంతం అనీ అంటారు.

**న రూపమస్యేహ తథోపలభ్యతే।**

**నాంతో న చాదిర్న చ సంప్రతిష్ఠా।** - **గీత 15-3**

న చ ఆదిః అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే సంసారం అనాది. మామూలుగా ఆ మాట విని ముందుకు సాగుతాము. కాని వివేకచూడామణిలో విద్యార్థి ఆలోచనాపరుడుగా కనిపిస్తున్నాడు. అతను 192వ శ్లోకంలో గురువును ఒక ప్రశ్న వేస్తాడు. ఏమిటా ప్రశ్న?

ఒకవేళ, సంసారం అనాది అయితే, తర్కం ప్రకారం అది అనంతం అవాలి.

**యత్ అనాదిః తత్ అనంతః అపి**

కృష్ణపరమాత్మ ఇందాక చెప్పినదానిలో **నాంతో న చాది** అన్నాడు. అంటే అంతం లేదు. ఆది లేదు. సంసారానికి ఆది, అంతం లేకపోతే మోక్షం రాదు. మోక్షం అంటే ఏమిటి? సంసార బంధంనుండి విముక్తి.

సంసారంనుండి విముక్తి లేనప్పుడు మోక్షం అవకాశం ఏముంది? అప్పుడది అనిర్మోక్ష ప్రసంగం అవుతుంది. అంటే మోక్షానికి ఆస్కారం లేదు.

మోక్షానికి ఆస్కారం లేకపోతే ఇంక సాధనలకు చోటెక్కడ ఉంది? కర్మయోగం, ఉపాసనయోగం, జ్ఞానయోగాలు అప్రస్తుతం అవుతాయి. జ్ఞానయోగంలో చేయాల్సిన శ్రవణ, మనన, నిదిధ్యాసనలు అనవసరం అవుతాయి. అలాంటప్పుడు, అంటే మోక్షం సాధ్యం కానప్పుడు కష్టపడి, సంవత్సరాల పాటు శ్రవణం ఎందుకు చేయాలి?

అంటే వివేకచూడామణిలో వేసిన ప్రశ్న వివేకచూడామణి ఎందుకు చదవాలి అని దాని ఉనికినే ప్రశ్నిస్తున్నది.

దీనికి జవాబులు రెండు. రెండూ ఒకదానితో ఒకటి సంబంధం కలిగి ఉంటాయి. మొదటి జవాబు మాండూక్య కారికల్లో గౌడపాదాచార్యులవారు ఇచ్చిన వివరణలోంచి చూస్తాము. మాండూక్య ఉపనిషత్తే చాలా లోతైన ఉపనిషత్తు. దాని వివరణకోసం గౌడపాదులవారు రాసిన కారికలు ఇంకా గంభీరమైనవి. శంకరాచార్యులవారి గురువు గోవిందభగవత్పాదులు అయితే, గోవింద భగవత్పాదులవారి గురువు గౌడపాదాచార్యులు.

**గౌడపాదాచార్యులవారి జవాబు–**

గౌడపాదాచార్యులవారు సరాసరి జవాబు చెప్పకుండా ఎదురు ప్రశ్నిస్తున్నారు. సంసారం అనంతం అని ఎందుకు అంటున్నావు అని.

**విద్యార్థి వాదన–** అనాది బ్రహ్మ అనంతం కాబట్టి, అనాది సంసారం కూడా అనంతం అవాలి కదా!

**సంసారః అనంతః అనాదిత్వాత్ బ్రహ్మవత్।**

**గౌడపాదులవారి ప్రశ్న –** నీ ఉద్దేశ్యం ప్రకారం సంసారం అనాది, అందువల్ల అనంతం, అందువల్ల మోక్షం సాధ్యం కాదు. మరి ఈ సమస్యను నువ్వు ఎలా పరిష్కరిస్తావు?

**విద్యార్థి జవాబు–** అనాది అంటే కదా సమస్య. అనాది అయితే మోక్షం కుదరదు కాబట్టి, మనకు మోక్షం కావాలి కాబట్టి దాన్ని సాది అందాము. సాది అంటే ఆరంభం ఉన్నది (స+ఆది). ఆరంభం ఉన్నదానికి అంతం ఉంటుంది కాబట్టి, మోక్షంవల్ల దానికి అంతం కలుగుతుంది. దానివల్ల మన సాధనలకు కూడా ప్రయోజనం ఉంటుంది.

అందువల్ల సంసారం అనాది కాదు. సాది అని తీసుకుందాము అంటాడు విద్యార్థి.

**గౌడపాదుల వారి జవాబు –** నీ జవాబు ఉత్సాహకరంగానే ఉంది. కాని మనం ఇంకొంచెం లోతుగా విశ్లేషిద్దాము. ఇప్పటి నీ జవాబునే తీసుకుందాము.

సంసారానికి ఒక ఆరంభం ఉంది, దానికొక ముగింపు పలకవచ్చు అనుకుందాము.దానికి ఏప్రిల్ ఒకటవ తేదీన ముగింపు పలుకుదాం అనుకుందాము. కాని దానివల్ల ఒక సమస్య ఉంది. ఏమిటది?

సంసారం ముగిసింది అంటే, ఆ రోజు సంసారం ముగిసి, మోక్షం ఆరంభమయినట్టు. మోక్షం ఆరంభమయిందంటే, దానిక్కూడా ఒక ముగింపు ఉంటుంది కదా. సూత్రం ప్రకారం ఆరంభం ఉన్న దేనికైనా ముగింపు ఉంటుంది. స్వర్గలోకానికి వెళ్ళినా, పుణ్యం తీరగానే, అక్కడ జీవితం ముగింపుకు వచ్చేస్తుంది. మోక్షానికి కూడా ఆది, అంతం ఉంటే అది మోక్షమెలా అవుతుంది. అది కూడా ఇంకొక సంసారం అవుతుంది. అందువల్ల సంసారానికి ఆరంభం ఉంటే మోక్షం సాధ్యం కాదు. ఎందుకంటే మోక్షానికి కూడా ఆరంభం ఉంటుంది. అది మోక్షం అవదు. అందువల్ల ఈ ఆలోచన సరిపోదు.

పోనీ సంసారం అనాది అనే తీసుకుందామా, అప్పుడు కూడా మోక్షం సాధ్యం కాదు. అది ముందే చూశాము కదా. ఏదైనా అనాది అయితే దానికి అంతం లేదు. బ్రహ్మకు ఆది అంతాలు లేవు. అందువల్ల సంసారం అనాది అన్నా సమస్యే. ఆది అన్నా సమస్యే. ఎలా అన్నా మోక్షం సాధ్యం కాదు. మోక్షం సాధ్యం కాదు అంటే నేను నిత్యసంసారిని అవాలి. నేను నిత్యసంసారి అయితే, శాస్త్ర అధ్యయనం చేయటం వృథాప్రయాస.

మోక్షం సాధ్యం అయితే నేను నిత్యముక్తుణ్ణి అవాలి. నేను నిత్యముక్తుణ్ణి అయితే, సంసారం అసలు లేనే లేదు. వేదాంతం అదే చెబుతున్నది. సంసారం ఆది కాదు, అనాది కాదు, సంసారం అసలు లేనే లేదు. ఉందని మనం పొరపాటు పడుతున్నాము. ఆకాశం నీలంగా ఉందని ఎలా పొరపాటు పడుతున్నామో సంసారం ఉందని అలా పొరపాటు పడుతున్నాము.

పూర్వం పల్లెటూర్లలో ఒక ఆట ఆడేవారు. ఒక నాణాన్ని ఒక పిల్లవాడి నుదుటిమీద చాలాసేపు గట్టిగా నొక్కిపెడతారు. దాని తర్వాత అది తీసేస్తారు. చాలాసేపు నొక్కిపెట్టటంవల్ల అక్కడ కొంచెం ముద్ర ఏర్పడి, నిజంగా అక్కడ

నాణెం ఉన్న భావన కలుగుతుంది. దాని తర్వాత, తల వెనుక మూడు దెబ్బలు కొడితే ఆ నాణెం కిందపడుతుంది అంటారు. ఆ నాణాన్ని పడేయటానికి ఒక్కొక్కరూ మూడేసి దెబ్బలు కొడతారు. అక్కడ నాణెం ఉంటే కదా కిందపడటానికి! ఆ అబ్బాయి కూడా ప్రయత్నిస్తాడు. ఫలితం శూన్యం! అప్పుడు నిస్సహాయంగా అతను శరణు వేడితే, ఎవరో అద్దం తెచ్చి చూపిస్తారు. అక్కడ నాణెం లేనే లేదు. ఉనికే లేని నాణాన్ని ఎంత ప్రయత్నించినా తీయలేము.

ఇదే జరుగుతున్నది మన జీవితంలో కూడా. మాయ మన జీవితంతో ఆడుకుంటున్నది. మోక్షం రాలేదు అని మనం బాధపడుతున్నాము. వేదాంతం, మోక్షం రాదు అంటున్నది. ఎందుకంటే అక్కడ నాణెం ఉంటేనే కదా? అలాగే అక్కడ సంసారం ఉంటేనే కదా అది అనాదో కాదో చెప్పేది, దాన్నించి మోక్షాన్ని చూపించేది అంటుంది వేదాంతం. అందువల్ల సంసారం అనాదా కాదా ప్రశ్నకు జవాబు లేదు.

కాని వేదాంతం ఇలా చెప్పటంవల్ల ఒక సమస్యను ఎదుర్కొంటున్నది. వేదాంతం సంసారం లేదు అంటుంది. శిష్యుడు సంసారదుఃఖాన్ని అనుభవిస్తున్నాను అనుకుంటున్నాడు. గురువు దగ్గరకు దాని బాధ గురించి చెప్పి వాపోవటానికి వెళతాడు. వేదాంతాన్ని నమ్మి, దాని ప్రకారం బోధించే గురువు ఏమంటాడు? నువ్వు సంసారంవల్ల బాధపడుతున్నావు కాని అసలు సంసారమే లేదు, అది మిథ్య అంటాడు. అప్పుడు శిష్యుడు ఏం చేస్తాడు? గురువు మాట విని తను మారడు; దాని బదులుగా గురువును మారుస్తాడు. ఇంకో గురువు దగ్గరకు వెళతాడు.

ఇలా లేని సంసారం ఉందనుకుని ఊహించుకుని బాధపడటానికి ఫాంటమ్ లింబ్ సిండ్రోమ్ అంటారు ఇంగ్లీషులో. ఒక వ్యక్తికి ఎడమచేయి పోయిందనుకోండి. కాని అతను ఆ నిజాన్ని తొందరగా స్వీకరించలేదు. ఇంకా నా ఎడమచెయ్యి నొప్పెడుతోంది అంటాడు. అలా సంసారం మాయ. అది నిజంగా లేదు. కాని శిష్యుని అభిమానం పొందాలంటే గురువు దిగి వచ్చి సంసారం ఉందని ఒప్పుకోవాలి. గురువు దృష్టిలో సంసారమే లేదు. అందువల్ల శిష్యుడు సంసారంలోని బాధల గురించి చెపితే, ఆయనకు అది ఈ సామెతను గుర్తు చేస్తుంది. 'ఆలు లేదు, చూలు లేదు, కొడుకు పేరు సోమలింగం.'

కాని శిష్యుడిని తృప్తిపరచడానికి గురువు, సంసారం అనాది అని చెబుతాడు కాని గురువు అనాది అనే పదం ఒక అర్థంలో చెపితే, శిష్యుడు ఇంకో అర్థంలో

తీసుకుంటాడు. శిష్యుని ప్రకారం సంసారం అనాదిగా ఉంది. గురువు ఉద్దేశ్యం ప్రకారం సంసారంయొక్క ప్రారంభం గురించి మాట్లాడలేము, ఎందుకంటే అది అసలు లేనే లేదు. లేనే లేని వస్తువుకు ప్రారంభం ఎప్పుడు ఉంటుంది? అందువల్ల అది అనాది.

దానికి అంతం ఎప్పుడు? శిష్యుని ప్రశ్న. సంసారానికి ముగింపు ఎప్పుడు అంటే నిజంగా ముగింపు లేదు. అసలు లేనే లేని వస్తువుకు ముగింపు ఎలా ఉంటుంది? కాని దానికి జవాబు, జ్ఞానం పొందినప్పుడు. దీన్ని లక్ష్యార్థంగా తీసుకోవాలి. సంసారం అనేది మాయ. అది లేనే లేదు. అతను ఎప్పుడూ ముక్తపురుషుడే. అతను అంతకు ముందు, ఇప్పుడూ, తర్వాత కూడా ముక్తపురుషుడే. కాని జ్ఞానం పొందితే సంసారం ముగుస్తుంది అని గురువు ఎందుకంటాడంటే, జ్ఞానం పొందితే, తను ఇంతవరకూ సంసారం అనుకుంటున్నది నిజంగా లేనే లేదనీ, సంసారం మాయ అనీ తెలుసుకుంటాడని.

ఇందాక చూచిన నాణెం దృష్టాంతం గుర్తుకు తెచ్చుకోవాలి. ఆ కుర్రవాని తల వెనుక కొట్టటం మానాలి. నాణెం కింద పడటంవల్ల కాదు, అక్కడ అసలు నాణెం లేనే లేదు అనే జ్ఞానం రావటంవల్ల. అలాగే సంసారం విషయం కూడా. సంసారం పడిపోలేదు. నాకు అక్కడ సంసారం లేనే లేదు అనే జ్ఞానం రావటంవల్ల. బాధపడటం మానలేను (తల కొట్టటం మానలేను) అంటే సంసారం అనాది, దానికి ముగింపు ఉంది.

**మొదటి జవాబు- సంసారః అనాది,సాంతః**

**వివేకచూడామణిలోని జవాబు -**

ఈ జవాబు చూసే ముందు, శిష్యుని ప్రశ్న మళ్ళీ చూద్దాము. అనాది బ్రహ్మ అనంతం కాబట్టి, అనాది సంసారం కూడా అనంతం అవాలి కదా!

**సంసారః అనంతః అనాదిత్వాత్ బ్రహ్మవత్**

దీనివల్ల రెండు సూత్రాలు తెలుస్తున్నాయి.

1. ఆరంభం లేని దానికి అంతం లేదు- ఉదా: బ్రహ్మ అనాదిః అనంతః
2. ఆరంభం ఉన్నదానికి అంతం ఉంది- ఉదా: శరీరం సాదిః సాంతః

కాని మనకు తెలియని, ఇంకో విశిష్టసూత్రం ఉంది.

3. ఆరంభం లేనిదానికి అంతం ఉంది. ఉదా: అజ్ఞానం అనాదిః సాంతః.

ఈ మూడవ సూత్రాన్ని ఆధారం చేసుకుని, గురువు జవాబు చెబుతాడు. మూడు విషయాలు అనాది అయినా, వాటికి అంతం ఉంది.

**ఎ) అజ్ఞానం–** లౌకిక జ్ఞానంలో అయినా, ఆత్మజ్ఞానంలో అయినా మనకు కొన్ని విషయాల్లో అజ్ఞానం ఉంటుంది. ఉదాహరణకు ఫిజిక్స్ అజ్ఞానం ఉందనుకుందాము. అది ఎప్పటినుంచి ఉంది అంటే దానికి ప్రారంభం రోజు చెప్పలేము. పుట్టినరోజునుంచి ఉంది అనవచ్చు కదా అంటే పుట్టినరోజు శరీరానికే తప్ప, జ్ఞానానికి లేదు, అజ్ఞానానికి లేదు. జ్ఞానం లేదా అజ్ఞానం మనస్సుకు చెందింది. అది పూర్వజన్మనుంచీ వస్తుంది. అందువల్ల అజ్ఞానం అనాది.

పైగా నాకు 2000వ సంవత్సరంనుంచి జర్మనీ భాష తెలియదు అని చెప్పారనుకోండి, అప్పటినుంచి తెలియదు అంటే అంతకుముందు తెలుసు అని అర్థం వస్తుంది. అందువల్ల అజ్ఞానం అనాది. కాని దేనిమీద అజ్ఞానం ఉందో, అది నేర్చుకుంటే ఆ అజ్ఞానం పోతుంది. ఫిజిక్స్ నేర్చుకుంటే ఫిజిక్స్ అజ్ఞానం పోతుంది. జర్మనీ భాష నేర్చుకుంటే ఆ అజ్ఞానం పోతుంది. అందువల్ల దానికి అంతం ఉంది. అందువల్ల **అజ్ఞానం అనాదిః సాంతః.**

**బి) అంధకారం–** అంధకారం అంటే చీకటి. చీకటి గురించిన విషయంలో మనం చీకటిలో ఉన్నాము. దాని గురించి నైష్కర్మ్యసిద్ధిలో చాలా వివరంగా చర్చవస్తుంది. దీపం వెలిగిస్తే చీకటి తొలగిపోతుంది.

**అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజనశలాకయా–**

అసలు చీకటిని దీపం తొలగిస్తే, అజ్ఞానమనే చీకటిని, జ్ఞానమనే వెలుతురు తొలగిస్తుంది. అందువల్ల అంధకారం **అనాదిః సాంతః. స+ అంతః = అంతం కలిగినది**

**సి) అజ్ఞానజన్యభ్రమ–** అజ్ఞానంవల్ల ఏర్పడిన భ్రమలు, పొరపాట్లు, తప్పుడు ఊహలు అవి అన్నీ కూడా అనాదే. దీనికి గొప్ప ఉదాహరణ– రజ్జుసర్పభ్రాంతే. రజ్జుసర్పభ్రాంతి చెప్పకుండా, వేదాంతం సంపూర్ణం కాదు.

ఒక వ్యక్తి త్రాడును చూసి,పాము అది కూడా త్రాచుపాము, నామీద బుసలు కొడుతోంది అని భయపడతాడు అనుకుందాము. అప్పుడు గురువు వచ్చి, దానిమీద దీపపు కాంతి చూపి, అది పాము కాదు, తాడు అని నిరూపిస్తాడు. ఇప్పుడు ఆ పాము ఎప్పుడు పుట్టిందో చెప్పగలరా? అక్కడ నిజంగా పామే లేనప్పుడు,

దాని జాతకం ఎక్కడనుంచి చెబుతారు? కాబట్టి పాము గురించిన అతని భ్రమ అనాది.

ఇప్పుడు గురువు దీపపు కాంతిలో చూపాక, శిష్యుడికి భ్రమ తొలుగుతుంది. శిష్యుడు, గురువు కాంతి చూపగానే, పాము వెళ్ళిపోయింది అనకూడదు. నాకు అక్కడ పామే లేదని అర్థమయింది అనాలి. అంటే లక్ష్యార్థం తీసుకోవాలి. అతనికి ఉన్న భ్రమ తొలగింది. అందువల్ల **అజ్ఞానజన్య భ్రమ అనాదిః సాంతః.**

సంసారం కూడా అంతే. సంసారం ఉందనే అజ్ఞానంలో ఉన్నాం కాబట్టి, అజ్ఞానం ఎప్పటినుంచి ఉందో తెలియదు కాబట్టి, అది అనాది. పల్లెటూరి అబ్బాయి విషయంలో లేని నాణాన్ని ఊహించుకున్నాడని తెలిసినట్టుగా, లేని పాముని ఊహించుకున్నాడని తెలిసినట్టుగా, లేని సంసారాన్ని ఊహించుకున్నాడని తెలుసుకుని, ఆ భ్రమలోంచి బయటపడినప్పుడు ఆ సంసారానికి అంతం వస్తుంది. అంటే మోక్షం వస్తుంది. దీనికి సాధన–జ్ఞానం పొందటం. అంటే మోక్షం, సాధన అనవసరం కాదు.

అందువల్ల సంసారం మూడవ సూత్రంలోకి వస్తుంది.

**సంసారః అనాదిః సాంతః.**

# స్వామీజీ సూక్తిముక్తావళి

ఆరంభదశలో ఉన్న భక్తుడు– భగవంతుడు ఒక వ్యక్తి అంటాడు.
భక్తి పెరిగాక, జగత్తు అంతా ఈశ్వరమయం అంటాడు.
అత్యంత గొప్ప భక్తుడు, భగవంతుడు చైతన్యం అంటాడు.
జ్ఞాని, ఆ భగవంతుడు, ఆ చైతన్యం నేను అంటాడు.

## 16.సన్న్యాసమంటే ఏమిటి?

వ్యాసపూర్ణిమ ఆధ్యాత్మ మార్గంలో ఉన్న సాధకులందరికీ ముఖ్యమైన రోజు. ముఖ్యంగా సన్న్యాసులకు. ఈ రోజు సన్న్యాసులు మొత్తం గురుపరంపరకు, ప్రత్యేకించి వేదవ్యాసునకు పూజ చేస్తారు.

వ్యాసపూజ సన్న్యాసులకు ముఖ్యం కాబట్టి, సన్న్యాస ఆశ్రమం గురించి ఈ రోజు కొంచెం తెలుసుకుందాము. మోక్షం పొందటానికి ప్రాథమిక మార్గం ఆత్మజ్ఞానమని,వేదాంతశిష్యులకు తెలుసు. ఆత్మజ్ఞానమెంత ముఖ్యమో, సన్న్యాస ఆశ్రమం కూడా అంతే విశిష్టమైనది.

సన్న్యాసాశ్రమాన్ని కీర్తిస్తూ అనేక మంత్రాలు ఉన్నాయి.

**న కర్మణా న ప్రజయా ధనేన।**
**త్యాగేనైకే అమృతత్వమానశుః।**
**పరేణ నాకం నిహితం గుహాయామ్।**
**విభ్రాజతే యద్యతయో విశన్తి॥ - కైవల్యం 3**

కర్మవల్ల, సంతానంవల్ల, ధనంవల్ల అమృతత్వం లభించదు. త్యాగంద్వారానే లభిస్తుంది. స్వర్గానికి మిన్నగా, హృదయమనే గుహలో ప్రకాశిస్తున్న ఆ పరమాత్మను యతీశ్వరులు పొందగలరు.

**వేదాన్తవిజ్ఞాన సునిశ్చితార్థాః।**
**సన్న్యాసయోగాత్ యతయః శుద్ధసత్వాః।**
**తే బ్రహ్మలోకేషు పరాన్తకాలే।**
**పరామృతాః పరిముచ్యంతి సర్వే॥ - ముండకమ్ 3-2-6**

వేదాంతవిజ్ఞాన సూక్ష్మాలను గ్రహించి సన్న్యాసయోగంద్వారా పరిశుద్ధమైన అంతఃకరణ కలిగిన యతీశ్వరులు జీవన్ముక్తి, తర్వాత విదేహముక్తి పొందుతారు.

**అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతి యః।**
**స సన్న్యాసీ చ యోగీ చ న నిరగ్నిర్న చాక్రియః॥ - గీత 6-1**

కర్మఫలాలను ఆశించకుండా కర్తవ్యకర్మలను ఆచరించేవాడే నిజమైన సన్న్యాసి, నిజమైన యోగి. కాని కేవలం అగ్నికార్యాలను, కేవలం క్రియలను త్యజించినంత మాత్రాన సన్న్యాసి కాదు. కృష్ణపరమాత్మ సన్న్యాసంయొక్క

ప్రాముఖ్యతను వివరిస్తూ, గృహస్థులకు ధైర్యం చెబుతున్నాడు. ఏమని? ఒక వ్యక్తి బాహ్యంగా ఆశ్రమసన్న్యాసి అయినా, కాకపోయినా, అతను తప్పనిసరిగా ఆంతరసన్న్యాసి అయి తీరాలి. ఆంతర అంటే అంతర్గతంగా. అందువల్ల ఆధ్యాత్మిక సాధనలో ముందుకు వెళదామనుకున్న ప్రతి సాధకుడు ఆంతరసన్న్యాసిగా మారతానని సంకల్పం చెప్పుకోవాలి. జ్ఞానానికి సన్న్యాసం తోడయితే అది మోక్షానికి దారి తీస్తుంది.

గృహస్థుగా ఉంటూనే ఆంతరసన్న్యాసి అవాలంటే, ఏం చేయాలి? ఏవైనా పూజలు చేయాలా? సన్న్యాసం అంటే వదలివేయటం. ఆంతరసన్న్యాసంలో మూడు అంశాలు వదిలి వేయాలి. సర్వ అభిమానపరిత్యాగం, సర్వచింతా పరిత్యాగం, సర్వవిశేషప్రార్థనా పరిత్యాగం.

**1. సర్వ అభిమాన పరిత్యాగం–** అభిమానం అంటే నాది, నావారు అనే భావన. ఇవి నా వస్తువులు; వీరు నావారు. వీరిమీద నాకు అధికారం ఉంది అనుకుంటాము. శాస్త్రం మనకు ఒక ముఖ్యమైన పాఠం చెబుతుంది. భగవంతుడొక్కడే యజమాని,అధికారి. భగవంతుడే అన్నిటికీ యజమాని అయితే మనకేం ఉన్నాయి? ఏమీ లేవు! భగవంతుడు మనం తాత్కాలికంగా వాడుకోవటానికీ, ముఖ్యంగా మనం ఆధ్యాత్మికంగా ఎదగటానికీ కొన్ని వస్తువులను ఇచ్చాడు. ఆయన ఇచ్చిన వస్తువులు ఎప్పుడు కావాలంటే అప్పుడు తీసేసుకునే హక్కు ఆయనకు ఉంది. మన అనుమతిని కోరనవసరం లేదు. మనకు ముందుగా చెప్పనూ అవసరం లేదు. ఈ సూత్రం కనపడే వస్తువులైన ఆస్తిపాస్తులకూ వర్తిస్తుంది, కనపడని పేరు ప్రతిష్ఠలకూ వర్తిస్తుంది.

అందువల్ల ఈ వస్తువులకు మనం పూచీ వహించాలే తప్ప నాది అనుకోకూడదు. కాని మనమేం చేస్తున్నాము? నావి అనుకుని పొరపాటు పడి, భగవంతుని ఆస్తిని మనం ఇష్టం వచ్చినట్టు అనుభవించి, ఈ పాపానికి శిక్షగా, సంసారమనే చెరసాలలో పడి అనుభవిస్తున్నాము. అందువల్ల నావి అనే భావన త్యాగం చేసి, ఈ ఆలోచనను పెంపొందించుకుందాము. 'నా వస్తువులేవీ లేవు.నేను నష్టపోయేది ఏదీ లేదు,' ఈ నమ్మకం పెదాలపైనుంచి కాదు,హృదయం లోతుల్లోంచి రావాలి.

ఎలాగైతే ఏదీ నాది కాదు అన్నామో, అలాగే ఏదీ నా అధికారంలో లేదు అని అనుకోవాలి. ఒక పరిస్థితి కాని, ఒక సందర్భం కాని, ఒక సంఘటన కాని,

ఒక వ్యక్తికాని – ఎవరూ మన అదుపు, ఆజ్ఞల్లో లేరు. భగవంతుని చేతిలో అంతా ఉంది. జగత్తులో జరిగేవన్నీ కర్మసిద్ధాంతం ప్రకారం జరుగుతాయి. ఆ సిద్ధాంతం వెనుక మనకు తెలిసిన, మనకు తెలియని అనేక అంశాలు ఉన్నాయి.

మనకు ఫ్రీవిల్ ఉంది నిజమే, దాని ప్రకారం మనం ఒక పని చేయవచ్చు, మానవచ్చు నిజమే, కాని ఆ ఫ్రీవిల్ ఎంతవరకు పనిచేస్తుంది? మనం ఏదైనా సహకారం చేయగలము కాని, ఆ పనిని అదుపులో పెట్టలేము. ఒక అనారోగ్యం వస్తే మందు వేసుకోగలము కాని, మనం కోలుకోవటమనేది మన చేతిలో ఉందా? మందు వేసుకోవటం మన వంతు సహకారం; అది తగ్గటం, తగ్గకపోవటం భగవంతుని చేతిలో ఉంది. మనకు తగ్గించాలా, యమపురికి పంపించాలా అనేది (మన కర్మఫలాన్నిబట్టి) ఆయన చేతిలో ఉంది.

ఇలా నేను యజమాని, అధికారి అనే భావనలను పరిత్యాగం చేయటాన్ని సర్వ అభిమానపరిత్యాగం అంటారు. ఇది అత్యంత ఉన్నతమైన భక్తి భావన. దీన్నిశరణాగతి అంటారు.

**నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ॥ – గీత 12-13**

నేను,నాది అనే భావనలు లేని వ్యక్తిని మమత, అహంకారాలు లేని వ్యక్తిగా కృష్ణపరమాత్మ కీర్తిస్తున్నాడు.

**2. సర్వచింతా పరిత్యాగం–** చింత అంటే ఆందోళన లేదా బెంగ. మన మనస్సును విశ్లేషిస్తే, మనకు ఎవరిమీదైతే అభిమానం ఉంటుందో, వారి గురించే ఎక్కువగా ఆందోళన చెందుతామని తెలుస్తుంది. ఎవరిమీద అభిమానం లేదో, వారికేమైనా చలించము. అందువల్ల అభిమానం, చింత ఒకదాన్నొకటి పెంచుతాయి. రాగం ఎక్కువైతే చింత ఎక్కువవుతుంది. చింత ఎక్కువైతే, అభిమానం మరింత పెరుగుతుంది.

చింత రావటం చాలా సహజం. ఎందుకంటే ప్రతిదానికీ ఆందోళన చెందటం మనం పెంపొందించుకున్నాము. అందువల్ల దాన్ని రాకుండా ఆపలేము. కాని మనకున్న ప్రజ్ఞాపాటవాలను ఉపయోగించి, ఆ ఆందోళన పెరిగి వటవృక్షమవకుండా, దాన్ని మొగ్గలోనే త్రుంచివేయాలి. ఆంతరసన్న్యాసి సర్వ అభిమానపరిత్యాగం చేయటంద్వారా, చింతలను కూడా పరిత్యాగం చేస్తాడు.

**3. సర్వవిశేషప్రార్థనా పరిత్యాగం –** విశేషప్రార్థనలు ఎప్పుడు చేస్తాము? విశేషపరిస్థితుల్లో. ఆ విశేషపరిస్థితులు కూడా మనం అభిమానం చూపించే వస్తువులకు, మనుష్యులకు ఇబ్బంది కలిగినప్పుడు. ఎలాగైతే అభిమానం– చింత

ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉన్నాయో, అలాగే అభిమానం– విశేషప్రార్థన కూడా ఒకదాన్నొకటి పెనవేసుకుని ఉన్నాయి. ఎంత ఎక్కువ అభిమానం ఉంటే అంత ఎక్కువ ప్రార్థనచేస్తాము. ఎంత ఎక్కువ ప్రార్థన చేస్తే అంత ఎక్కువ అభిమానాన్ని పెంచుకుంటాము. అభిమానం పెరిగేకొద్దీ మనం ఆధ్యాత్మికంగా తప్పు చేస్తున్నట్టు; ఆధ్యాత్మికంగా తప్పు చేస్తున్నకొద్దీ, మరింతగా సంసారంలో కూరుకుపోతున్నట్టు అర్థం.

విశేషప్రార్థన మానటం ఎలా? విశేషప్రార్థనలు ఈ రోజు వరకే చేస్తాను అని ఒక రోజును మీరు నిర్ణయించుకోవాలి. అలా ఎప్పుడైతే ఒక ఆఖరి తేదీని నిర్ణయించారో, అప్పుడే ఆ ప్రార్థనలు చేసే సందర్భాలు, వాటి తీవ్రత క్రమేపీ తగ్గుతూ వస్తాయి. ఆ ఆఖరి తేదీ దాటాక, ఇంక ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రత్యేక పూజలు చేయనని నిర్ణయం తీసుకోవాలి.

ఆంతరసన్న్యాసం అంటే ఏమిటి? సర్వ అభిమానపరిత్యాగం. సర్వచింతా పరిత్యాగం. సర్వవిశేషప్రార్థనా పరిత్యాగం. దీన్ని తేలిగ్గా గుర్తుపెట్టుకోవటానికి క్లాస్ప్ రిజెక్షన్ వాడదాము. (దీన్ని స్వామీజీ తరచు తన బోధల్లో వాడతారు.)

సిఎల్ = క్లెయిమింగ్ ఓనర్‌షిప్ అండ్ కంట్రోలర్‌షిప్ (అభిమానం);

ఎ = యాంక్జయిటీ (చింత);

ఎస్‌పి = స్పెషల్ ప్రేయర్స్ (విశేష ప్రార్థన); వీటిని పారద్రోలుతాము. క్లాస్ప్ రిజెక్షన్ అంటే ఆంతరసన్న్యాసం. ఆధ్యాత్మసాధనమీద శ్రద్ధ ఉన్నవారు ఎవరైనా, ఏదో ఒకరోజు ఆంతరసన్న్యాసం స్వీకరించి తీరాలి. దానికి సంకల్పం చెప్పుకోవాలి. ఒక సన్న్యాసి సన్న్యాసదీక్ష తీసుకున్న రోజే ఆంతరసన్న్యాసానికి శ్రీకారం చుట్టాలి. ఒక గృహస్థుడు తనకిష్టమైన ఏ రోజైనా ఎన్నుకుని, 'ఇవాల్టినుంచి నేను క్లాస్ప్‌ని పరిత్యజిస్తున్నాను,' అని సంకల్పం చేయాలి.

ఆంతరసన్న్యాసం స్వీకరించే ఆధ్యాత్మసాధకుడు, దానికి సంబంధించిన నాలుగు ముఖ్యమైన అంశాలను గుర్తుంచుకోవాలి.

1. ఒక గృహస్థుడు ఆంతరసన్న్యాసం స్వీకరిస్తున్నందుకు అపరాధభావనతో బాధపడనవసరం లేదు. ఎందుకంటే అభిమానం,చింత, విశేషప్రార్థనలు గృహస్థుయొక్క బాధ్యతలు కావు.

2. భగవద్గీత పదహారవ అధ్యాయంలో,ఈ మూడు పరిత్యాగాలకు చెందిన అంశాలను ఆసురీసంపత్తిలో వర్ణిస్తాడు.

**కామమాశ్రిత్య దుష్పూరం దంభమానమదాన్వితాః। - గీత 16-10**

తీరని కోరికలతో నిండినవారు. బలమైన, తీరని కోరికలు ఉన్నవారు విశేషప్రార్థన చేసి తీరతారు. క్లాస్పియొక్క ఈ మూడు లక్షణాలు, వేదాంత అధ్యయనం, ఆధ్యాత్మిక ఎదుగుదలకు వేగాన్ని తగ్గిస్తాయి. ఎలా? ఆంతరసన్న్యాసం స్వీకరించకుండా కూడా, వేదాంత అధ్యయనంవల్ల లాభం పొందవచ్చు కాని, ఆ లాభం చాలా తక్కువగా ఉంటుంది. అది, కాళ్ళకు మూడు ఇనుపబంతులను కట్టుకుని నడిచినట్టు ఉంటుంది. మూడు ఎందుకు?

ఈ అంశాలు- అభిమానం, చింత, విశేషప్రార్థన- మూడు కాబట్టి. ఆ బంతులు కట్టుకున్నా, నడవగలము. కాని నడక చాలా నిదానమైపోతుంది. అదే ఆంతరసన్న్యాసం స్వీకరిస్తే త్వరగా ఆధ్యాత్మిక ఎదుగుదల వస్తుంది.

3. ఒక గృహస్థు తను క్రమం తప్పకుండా చేసే కర్మలను చేయవచ్చు. చేసి తీరాలి కూడా. ఆంతరసన్న్యాసం చేయమంటే, మనం కుటుంబపరంగా, ఉద్యోగపరంగా, సమాజపరంగా చేయాల్సిన బాధ్యతలను మానేయాలని కాదు అర్థం. కేవలం విశేషప్రార్థనలు లేదా కామ్యపూజలు మానాలి కాని నిత్యనైమిత్తిక పూజలు మానకూడదు. రోజువారీ పూజలు చేయాలి. ఇంకా మాట్లాడితే రెట్టించిన ఉత్సాహంతో చేయాలి. నిత్యనైమిత్తిక పూజలు చేసేటప్పుడు దేవుణ్ణి ఏం కోరాలి? ఇది కొంతమందికి కలిగే సందేహం. అంటే ఏదైనా కోరిక కోరాలంటేనే దేవుడికి పూజ చేయాలనే తప్పుడు అభిప్రాయంవల్ల వచ్చిన సందేహం ఇది. పూజ అంటే కోరిక అనే పొరపాటు భావన అది.

రెట్టించిన ఉత్సాహంతో ఎందుకు చేయాలి? ఈ పూజచేసేది దేవునిమీద భారం రెట్టింపుగా వేసి, ఆయన మనకు ఇచ్చిన వాటన్నింటికీ కృతజ్ఞతలు చెప్పటానికి. ప్రతి పూజనూ ఆంతరసన్న్యాసాన్ని పెంచటానికి చేయాలి. 'ఓ దేవా! నువ్వే అన్నింటికీ యజమానివి, అధికారివి. నా మమకార, అహంకారాలను పరిత్యజిస్తున్నాను.' ఈ విధంగా నమస్కారం చేయాలి. దీన్ని నిష్కామపూజ అంటారు. దీనివల్ల మనకు దానంతట అదే మానసికశక్తి వస్తుంది. దానితో, మనం అడగకుండా దేవుడు ఇచ్చిన వారిని ఎదుర్కొనే శక్తినిచ్చి అనేక లాభాలను కూడా చూపిస్తుంది.

4. సర్వ అభిమానపరిత్యాగం, సర్వచింతా పరిత్యాగం, సర్వ విశేషప్రార్థనాపరిత్యాగం మన కుటుంబసభ్యుల విషయంలో, మన శరీర, మనస్సుల విషయంలో కూడా చేయాలి. ఇది అన్నింటికన్నా అత్యంత క్లిష్టమైన భాగం ఆంతరసన్న్యాసంలో. సర్వ

అంటే అంతా అని కదా, ప్రత్యేకించి మళ్ళీ కుటుంబసభ్యులు, కార్యకరణసంఘాతం గురించి ఎందుకు చెబుతున్నారు అని అడగవచ్చు. ఇది చాలా ముఖ్యమైనదని నొక్కి చెప్పటంకోసం, ప్రత్యేకంగా చెప్పాల్సి వచ్చింది. ఈ రెండూ విడిగా చెప్పకపోతే సర్వంలో వీటిని కలిపి ఉండేవారా? ఏమో!

'ఓ దేవా! నా శరీరం, నా మనస్సులమీద నాకు అహంకార, మమకారాలు లేవు,' అని చెబుతూ ఉండాలి. పౌష్టికాహారం తీసుకుంటూ, వ్యాయామం చేస్తూ, మతపరమైన కార్యకలాపాల్లో పాల్గొంటూ మానసిక, శారీరక ఆరోగ్యాలను కాపాడుకోవాలి. అయినా, ఒక విషయం ఎప్పుడూ మన మనస్సులో స్థిరనివాసం ఏర్పరచుకోవాలి. మన ఆరోగ్యానికి మనవంతు సహకారం అందించగలమే కాని, దాన్ని మనం నియంత్రించలేము.

ఒక వయస్సు వచ్చేసరికి, ముఖ్యంగా నలభయ్యో, యాభయ్యోపడిలో పడేసరికి, మన ఆరోగ్యం గురించిన చింత చాలా సహజంగా కలుగుతుంది. శరీరం సహకరిస్తుందా? మనస్సు దృఢంగా ఉంటుందా? ఇలాంటి ఆలోచనలు భయపెడుతుంటాయి. ఆంతరసన్న్యాసి ఇలాంటి చింతలను ప్రయత్నపూర్వకంగా పారద్రోలాలి.

మనశ్శరీరాల గురించిన విశేషపూజల సంగతి ఏమిటి? మనకు ఏదైనా అనారోగ్యం చేసినప్పుడు, అది కూడా తీవ్రమైన అనారోగ్యం చేసినప్పుడు, సహజంగా ఏం చేస్తాము? ఏదైనా గుడిలో అర్చనో, విశేషపూజో చేస్తామనో, లేదా కోలుకున్నాక ఫలానా తీర్థయాత్ర చేస్తామనో మొక్కుకుంటాము. ఆ అనారోగ్యం తీవ్రత ఎంత ఎక్కువ ఉంటే, మన మొక్కుకూడా అంత పెద్దదిగా, అంత విశేషంగా ఉంటుంది.

మన విషయంలో అనుకున్నట్టే మన కుటుంబసభ్యుల విషయంలో కూడా అనుకుంటాము. వారికి ఏదైనా అనార్యోగం కలగగానే, ఇంకా ఎక్కువగా స్పందిస్తాము. అటువంటి అనారోగ్యమే మనకు వచ్చినప్పుడు మొక్కుకున్న మొక్కుల కన్నా, వారి గురించి ఇంకా విశేషపూజలు, ఇంకాపెద్ద మొక్కులు మొక్కుకుంటాము.

దేహపరంగా, మనస్సుపరంగా చేసే విశేషప్రార్థనలు, దేహం, మనస్సుల గురించిన చింతలు కలిసి దేహ, మనో అభిమానాన్ని బలపరుస్తాయి. అంతకుముందే చూసినట్టుగా అభిమానం అనేది మనం తప్పుగా అర్థం చేసుకోవటంవల్ల కలుగుతున్నది. అలా తప్పుగా అర్థం చేసుకున్నందుకు శిక్ష, ఈ సంసారమనే

జైలులో బందీలమవటమే. అది ఎన్నో సంవత్సరాలవరకే కాదు ఎన్నో జన్మలవరకూ కొనసాగవచ్చు.

ఆంతరసన్న్యాసం స్వీకరించి తీరాలా? మీకు మోక్షం మీ లక్ష్యం అయితే స్వీకరించి తీరాలి. ఆధ్యాత్మిక సాధకునికి ఎవరికైనా మోక్షం లక్ష్యంగానే ఉంటుంది. మోక్షం కావాలంటే ఆంతర సన్యాసం తప్పదు.

ఆంతరసన్న్యాసికి జనక మహారాజు గొప్ప ఉదాహరణ. జనకుడు, గృహస్థుడై ఉండి, ఆంతర సన్యాసం స్వీకరించి, రాజర్షి అయ్యాడు. ఆయన మనకు ఆదర్శంగా నిలవాలి. అందువల్ల అందరం ఆంతరసన్న్యాసం స్వీకరించటానికి సంసిద్ధులమవుదామని నిర్ణయం తీసుకుందాం. దాని తర్వాత ఆంతరసన్న్యాసం, జ్ఞానం కలిపి మనకు జీవన్ముక్తి, విదేహముక్తిని ఇస్తాయి.

# స్వామీజీ సూక్తిముక్తావళి

సర్వవ్యాపకమైన ఆకాశం నాలుగుగోడల మధ్య ఉన్న గదిలో ఉన్నట్టే, సర్వవ్యాపకమైన పరమాత్మ ప్రతి ఒక్కరి శరీరంలోనూ ఉన్నాడు. శరీరం లోపల ఉన్న పరమాత్మను జీవాత్మ అంటారు.

ఈ గదిలో ఏముంది అంటే అన్నీ చెబుతాము కాని ఆకాశం ఉంది అనము. ఎందుకంటే కదిలే దాన్నే పట్టించుకుంటాము కాని కదలని దాన్ని పట్టించుకోము.

క్లాస్ప్ రిజెక్షన్ –
సిఎల్ = క్లెయిమింగ్ ఓనర్‌షిప్ అండ్ కంట్రోలర్‌షిప్ (అభిమానం);
ఎ = యాంక్జయిటీ (చింత);
ఎస్‌పి = స్పెషల్ ప్రేయర్స్ (విశేష ప్రార్థన); వీటిని పారద్రోలుతాము.
క్లాస్ప్ రిజెక్షన్ అంటే ఆంతరసన్న్యాసం.

# 17. వేదాలసారం

**సుఖం మే సర్వదా భూయాత్ దుఃఖం మా భూత్ కదాచన**

మనుష్యులందరికీ సమానంగా రెండుకోరికలు ఉంటాయి. నేనెప్పుడూ ఆనందంగా ఉండాలి, నాకెన్నడూ దుఃఖం కలుగకూడదు. అంటే సర్వదా సుఖప్రాప్తి, సర్వదా దుఃఖనివృత్తి కోరుకుంటారు మనుష్యులు. కాని దురదృష్టకర విషయమేమిటంటే, మనుష్యులందరికీ సమానంగా ఈ రెండు కోరికలూ ఉన్నా కూడా, వాటిని ఎలా తీర్చుకోవాలో వారికి తెలియదు. అందువల్ల నిరంతరం జీవితంతో పోరాడుతూనే ఉంటారు. దానికి ఒకటే మార్గం ఉంది. అది జ్ఞానం పొందటమే! ఆ జ్ఞానం కూడా ఆత్మజ్ఞానం. అది అందచేయటానికి మనకు ప్రాథమిక గ్రంథం ఉంది. అదే వేదం. వేదంయొక్క సాధారణ అర్థం తీసుకుంటే జ్ఞానం ఇచ్చేది, ప్రత్యేక అర్థం తీసుకుంటే ఆత్మజ్ఞానం ఇచ్చేది.

ఈ ఆత్మజ్ఞానం ఏం ఫలం ఇస్తుంది? మోక్షాన్ని ఇస్తుంది. అంటే స్వేచ్ఛను ఇస్తుంది. దేన్నుంచి స్వేచ్ఛ? మనం పడే రెండు బాధలనుంచి స్వేచ్ఛ.

**సుఖప్రాప్తి, దుఃఖనివృత్తి కలుగజేస్తుంది.**

కాని వచ్చిన చిక్కేమిటంటే, శాస్త్రం మనకు మోక్షాన్ని ఇవ్వటానికి, మనకు సహాయపడటానికి సిద్ధంగా ఉన్నా కూడా, మనం అందుకోవటానికి సిద్ధంగా లేము. ఏదైనా ఇచ్చి పుచ్చుకోవాలంటే ఇవ్వటానికి ఒకరు సిద్ధంగా ఉండాలి; ఇచ్చేవారు సిద్ధంగా ఉన్నా పుచ్చుకునేవారు కూడా సిద్ధంగా ఉండాలి. ఇక్కడ వేదం సిద్ధంగా ఉంది, పుచ్చుకునేందుకు మనమే సిద్ధంగా లేము. పిల్లవాడు అన్నం తినటానికి మారాము చేస్తే తల్లి అతని వెనుక పరిగెత్తి, పాటలు పాడి, చందమామను చూపి అల్లించి బెల్లించి అన్నం పెట్టటానికి ప్రయత్నించినట్టుగా వేదం కూడా తాపత్రయపడుతుంది.

అసలు ఎందుకు ఎవరూ ఆత్మజ్ఞానానికి రావటం లేదని ముందు వేదం కారణం వెదికింది. రెండు కారణాలు కనబడ్డాయి. ఆ రెండు కారణాలనూ భర్తీ చేస్తే, మోక్షమే కాదు, ఏ విషయంలోనైనా విజయం సాధించవచ్చు. ఈ విషయం వేదం ఎంత అద్భుతంగా విశ్లేషించిందో చూడండి. ముందు లౌకికపరంగా చూద్దాము. ఏ విషయంలో అయినా కావాల్సినవి రెండు-

**1. ఇచ్ఛ-** మానససరోవరం విషయమే తీసుకోండి. చైనా ప్రభుత్వం మనం రావటానికి అనుమతినిచ్చి, వసతులను ఇచ్చినా, అక్కడికి వెళ్ళాలనే కోరిక మనకు ప్రాథమికంగా ఉండాలి. దీన్నే ఇచ్ఛ అంటారు. అలా మనకు మోక్షంమీద ఇచ్ఛలేదు. ఆకలి లేకపోతే, ఎంత బలవంతపెట్టినా చిన్నపిల్లవాడు ఎలా తినడో, అలా మనకు ఆధ్యాత్మిక ఆకలి లేదు. అంటే మోక్ష ఇచ్ఛ లేదు. అలా ఒక వస్తువుమీద ఇచ్ఛ ఏర్పడటంకోసం, ప్రకటనలు దాని గురించి పదే పదే హోరెత్తిస్తుంటాయి.

**2. యోగ్యత-** ఇచ్ఛ ఉండగానే సరిపోదు, దానికి తగ్గ యోగ్యత కూడా ఉండాలి. మానస సరోవరం వెళ్ళే విషయమే తీసుకోండి. అక్కడికి వెళ్ళే ఇచ్ఛ ఉండగానే చాలదు, దానికి యోగ్యత కావాలి. శరీరం సహకరించాలి. అలాంటి చోటికి వెళ్ళటానికి ఆరోగ్యం బాగుండాలి. తర్వాత అక్కడికి వెళ్ళాలంటే లక్షరూపాయల పైన అవుతుంది. అంత డబ్బు ఉండాలి. ఆరోగ్యం, డబ్బూ ఉన్నా పది, పదిహేను రోజులపాటు వెళ్ళగలిగే తీరిక ఉండాలి. అన్ని రోజులు సెలవు దొరకవచ్చు, దొరకకపోవచ్చు.

ఇలా ఏది సాధించాలన్నా ఇచ్ఛ, యోగ్యత రెండూ ఉండాలి. ఐఐటిలో చదవాలన్న ఇచ్ఛ ఉంది కాని, పరీక్షలో ఫెయిలయితే ఏమవుతుంది?

**ఇచ్ఛా అస్తి, యోగ్యతా నాస్తి।**

దానికి భిన్నంగా యోగ్యత ఉంది కాని, ఇచ్ఛ లేదు. అప్పుడూ లాభం లేదు. బెంగళూరులో స్వామీజీ గీతాక్లాసులు తీసుకుంటుంటే కొందరు మాకు రావాలని చాలా ఆశగా ఉంది, కాని దూరం ఎక్కువ, ట్రాఫిక్ ఎక్కువ. అందువల్ల రాలేకపోతున్నాము అని చెబుతారు. చుట్టుపక్కలే ఉన్నవారికి ఈ బాధలు లేవు కాని వారికి ఇష్టం లేదు. వారికి హాల్‌మీద ఇచ్ఛలేదు, మాల్‌మీద ఉంది అంటారు స్వామీజీ.

అలా ఏదైనా చేయాలంటే ఇచ్ఛ, యోగ్యత- రెండూ ఉండాలి. ప్రకటనలు చేసే వారికి కూడా ఈ విషయం తెలుసు. అందువల్ల వారు అది అద్భుతంగా ఉంది; ధర మీకు అందుబాటులో ఉంది అంటారు. (అందుబాటులో అంటే ఎంతో చెప్పరు; అది వేరే విషయం)

యజమానులు వారి వస్తువును ప్రకటనలు చేసినట్టుగా, వేదం కూడా ప్రకటన చేస్తుంది. వేదానికి తెలుసు, మనిషికి ఈ రెండింటిలో ఏదో ఒకటే

ఉంటుందని. అందువల్ల వేదం రెండు రకాల కర్మయోగాన్ని ప్రకటిస్తున్నది- మోక్ష ఇచ్ఛ, యోగ్యతలను పెంపొందించటానికి. ఏమిటది?

**కర్మయోగం-1 మోక్ష ఇచ్ఛాజనక కర్మయోగం.**

వేదం చెబుతుంది,సరే మీకు మోక్ష ఇచ్ఛ లేకపోతే దాని గురించి ఇప్పుడు ప్రయత్నం చేయనవసరం లేదు. నేను మీకు ఒక జీవనవిధానాన్ని సూచిస్తున్నాను. ఆ విధానం ప్రకారం మీరు జీవిస్తే మీరు సమత్వం పొందటమే కాక, జీవితంలో జరిగే అనుభవాలనుంచి పాఠాలు నేర్చుకోవచ్చు. మీకు ఏం కావాలంటే- డబ్బు, అధికారం, విజయం, అనుబంధాలు- అవి పొందటానికి, మీ ప్రయత్నం మీరు చేసుకోండి; నేను మీకు కర్మయోగం నేర్పిస్తాను. నేను మీకు వివేకం, వైరాగ్యం నేర్పిస్తాను. జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను ఎలా సమత్వంతో తీసుకోవాలో చూపిస్తాను. కొంతమంది ఏదైనా అనుభవం ఎదురైతే దూకుడుగా ఎగరటమో, నిరాశతో కృంగిపోవటమో చేస్తారు. అలా చేయకుండా కర్మఫలంమీద తమకు అధికారం లేదు అని తెలుసుకుంటారు. కర్మయోగం-1 పాటిస్తే-

**సర్వం పరవశం దుఃఖమ్।**

**సర్వమ్ ఆత్మవశం సుఖమ్॥**

ఈ అద్భుతమైన శ్లోకాన్ని నేను నేర్చుకోవటానికి సిద్ధపడితే అది ఒక జీవనసత్యాన్ని నేర్పిస్తుంది.

**సర్వం పరవశం దుఃఖం-**

**ఎ) ఊహాతీతమైనది-** దేనిమీదైనా ఆనందంకోసం ఆధారపడితే అది ఆనందాన్నివ్వకపోగా దుఃఖహేతువు అవుతుంది. నిరాశా, నిస్పృహలను కలుగచేస్తుంది. ఎందుకు? బాహ్యప్రపంచం ఊహాతీతమైనిది. ఏదీ కుదురుగా ఉండదు. ఏదీ స్థిరంగా ఉండదు. మనుష్యులు, వారి ప్రవర్తన, వాతావరణం, పరిస్థితులు- అన్నీ అనూహ్యంగా మారిపోతుంటాయి.

**బి) నా ఆధీనంలో లేదు-** పరిస్థితులు నా ఆధీనంలో ఉండవు. నాకు నా ఇష్టమైనట్లు చేసే ఫ్రీవిల్ ఉన్నా, నేనొక్కడినే ఫలితానికి బాధ్యుణ్ణి కాను.ఒక క్రికెట్ మ్యాచ్‌లో, ఒక్కరు బాగా ఆడినంత మాత్రాన చాలదు. వారు ఆ గేమ్‌ని గెలవాలంటే అనేక అంశాలు తోడవ్వాలి.

**సి) నిలబెట్టుకోలేను-** పరిస్థితులు ప్రస్తుతం నా ఆధీనంలో ఉన్నా, నాకు అనుకూలంగా ఉన్నా, ఎప్పటికీ అలాంటి అనుకూల పరిస్థితులే ఉండవు. వాటిని

నేను శాశ్వతంగా నిలబెట్టుకోలేను. ఇప్పటి అనుకూల పరిస్థితులు ప్రతికూల పరిస్థితులుగా మారవచ్చు. ఇవాళ నా కంపెనీకి బాగా ఉపయోగపడతాడని నేను తీసుకున్న ఉద్యోగి రేపు నాకు పెద్ద భారంగా తయారుకావచ్చు.

ఇలా పరిస్థితులు ఊహించలేనట్టుగా ఉండి, నా అధీనంలో లేకుండా ఉండి, నేను నిలబెట్టుకోలేని స్థితిలో ఉంటే, నేను బాహ్యప్రపంచంమీద నా శాంతి, ఆనందం, భద్రతలకోసం ఆధారపడలేను. అవి కార్డ్‌బోర్డ్ ఛెయిర్ లాంటివి. కార్డ్‌బోర్డ్ ఛెయిర్ చూడటానికి అందంగాఉన్నా, దానిమీద కూర్చోలేను. అలాగే **ప్రపంచంలో సుందరత్వం ఉంది, నానాత్వం ఉంది, వినూత్నత్వం, కాని శాశ్వతత్వం లేదు.** అందువల్ల ప్రపంచంమీద ఆధారపడలేను.

సర్వం పరవశం దుఃఖం. దీనికి ఒకటే మార్గం ఉంది. ఏమిటది? నేను నా కాళ్ళమీద నిలబడాలి. ప్రపంచంలో లేదు ఆనందం, నాలోనే ఉంది. అందువల్ల మోక్ష ఇచ్ఛ వచ్చింది.

శాంతి, ఆనందం, భద్రతలు ప్రపంచంలో లేవు నాలోనే వెతుక్కోవాలి అని తెలుసుకుంటాడు కర్మయోగి. అంటే మొదటి దశ అయిన మోక్ష ఇచ్ఛ వచ్చింది. మోక్ష ఇచ్ఛ వచ్చింది బాగానే ఉంది, కాని శాంతి, ఆనందం, భద్రతలను నాలోనే వెతుక్కోవాలంటే నేను ఎలా వాటిని పట్టుకోగలను? నాకు యోగ్యత ఉందా? ఉదాహరణకు,ఇవాళ నాకు ఐఐటిలో చేరాలని ఉంటే, రేపే వెళ్ళి చేరిపోగలనా? దానికి తగ్గ అర్హత కూడా కావాలి. ఐఐటిలో చేరాలన్న ఇచ్ఛ ఉంటే, దానికి ఎనిమిదవ తరగతినుంచే కోచింగ్ క్లాసులకి వెళుతున్నారు ఇప్పుడు. అంతేకాదు, ఆ కోచింగ్ క్లాసుల్లో చేరటానికి అర్హత పొందటానికి ఇంకో కోచింగ్ క్లాసులకు వెళుతున్నారు. అందువల్ల మోక్ష ఇచ్ఛ వచ్చిన కర్మయోగి, యోగ్యతకోసం కర్మయోగం-2కి రావాలి.

### కర్మయోగం-2, భాగం-1- పంచమహాయజ్ఞాలు

దీనికి శాస్త్రం సేవాతత్పరతతో కూడిన జీవనవిధానాన్ని సూచిస్తున్నది. ఇన్నాళ్ళూ మనం ఆస్తులు సంపాదించుకోవటం, వాటిని కూడబెట్టుకోవటం అనే పరుగుపందెంలో స్వార్థపూరిత జీవనవిధానాన్ని గడుపుతూ వచ్చాము. స్వార్థపూరిత జీవనంనుంచి నిస్వార్థ జీవనానికి; సంకుచిత భావన నుంచి, విశాలదృక్పథానికి ఎదగమంటున్నది శాస్త్రం.

పూజ్యస్వామీజీ ఎప్పుడూ చెబుతారు- ఇన్నాళ్ళూ మీరు వినియోగదారునిగా ఉన్నారు. ఇంక మీవంతు సహాయం చేయండి. ఈ మార్పు చాలా ముఖ్యమైన

మార్పు. ఇలా మారటానికి అనువుగా వేదం ఐదు స్థాయిలను విధిస్తున్నది. అవి దైవయజ్ఞం, భూతయజ్ఞం, మనుష్యయజ్ఞం, బ్రహ్మయజ్ఞం, పితృయజ్ఞం.

ఈ ఐదు యజ్ఞాలను వైదిక కర్మలలోనూ పాటించవచ్చు; మామూలు లౌకిక కర్మలలోనూ పాటించవచ్చు.

**దైవయజ్ఞం–** పంచభూతాలకు అంటే ప్రకృతికి భక్తిపూర్వకంగా సేవ చేయటం. వాటి ఆరోగ్యం మన ఆరోగ్యానికి పాటుపడుతుంది. భూతాలలో ఈశ్వరుడు ఉన్నట్టుగా భావించి, వాటిని కాపాడటం.

**భూతయజ్ఞం–** భూతయజ్ఞం అంటే పంచభూతాలు కాదు. జీవమున్న ప్రాణులు. వైదిక కర్మపరంగా చూస్తే తులసిపూజ చేయటం లేదా కాకికి అన్నం పెట్టటం.

**మనుష్య యజ్ఞం–** తోటి మానవునికి సేవ చేయటం.

**బ్రహ్మయజ్ఞం–**బ్రహ్మ అంటే ఋషి. మనకు పాఠశాలల్లో, కళాశాలల్లో గురువులు విద్యాబుద్ధులు నేర్పిస్తే, ఋషులు మనకు ఆత్మజ్ఞానాన్ని అందచేశారు. అందువల్ల మనం గురువులకు, ఆచార్యులకు, విద్యాసంస్థలకు, వేదపాఠశాలలకు తగినంత చేయూతనివ్వాలి.

**పితృయజ్ఞం–** తల్లిదండ్రులకు, పితామహులకు– భక్తితో సేవ చేయటం. వారి దయవల్లనే ఈ రోజు మనం ఇలా ఉన్నాము. వయోవృద్ధులకు గౌరవం ఇచ్చిన సమాజం పరిణతి చెందిన సమాజం అని చెప్పవచ్చు. వారికి డబ్బు ఇవ్వటమే కాదు, వారితో కొంత సమయం వెచ్చించటం, వారికి కావాల్సిన సమాచారాన్ని అందివ్వటం చేయాలి.

ఈ పంచమహాయజ్ఞాలు కలిపి కర్మయోగం–2లో మొదటి భాగం.

**కర్మయోగం–2, భాగం–2– విలువలు**

విలువలు రెండవ భాగం విలువలతో కూడిన జీవితానికి విలువ ఉంటుంది. భగవద్గీత పదహారవ అధ్యాయంలో ఈ విలువల గురించి కృష్ణపరమాత్మ వివరంగా చెబుతాడు. మన గుణాలను రెండుగా విభజించి, దైవీసంపత్తి అనీ, ఆసురీ సంపత్తి అనీ వివరిస్తాడు. మనం ఒక తోటను పెంచుతుంటే ఏం చేస్తాము? మంచి మొక్కలను తెచ్చి నాటతాము, అందులో ఉన్న కలుపు మొక్కలను ఏరివేస్తాము.

మనస్సనే తోటలో కూడా అదే చేయాలి. దైవీసంపత్తిని పెంపొందించుకోవాలి; అసురీసంపత్తిని పెకళించివేయాలి.

**కర్మయోగం-1 అంటే సమత్వం**
**కర్మయోగం-2 అంటే సత్కర్మలు + సద్గుణాలు**

ఈ రెండు రకాల కర్మయోగాలు పాటిస్తే, ఒక సాధకుడు, జ్ఞానయోగంలోకి అడుగుపెట్టటానికి యోగ్యత సంపాదించినవాడవుతాడు. జ్ఞానయోగం అంటే ఆత్మజ్ఞానం పొందటం. కర్మయోగం వేదపూర్వభాగంలోనూ, జ్ఞానయోగం వేద అంతభాగంలోనూ ఉన్నాయి.

**జ్ఞానయోగం-** జ్ఞానయోగంలోకి రాగానే వేదం, మీరు మీ గురించి అనుకుంటున్నదేదీ సరికాదు. అది తప్పుడు భావం అంటుంది. అది వినగానే నివ్వెరపోతాము. ఎందుకంటే నా గురించి నాకు బాగా తెలుసు అనుకుంటాము మనము. మనుష్యులు వచ్చిపోతుంటారు కాని నన్ను నేను ఎప్పుడూ చూస్తూనే ఉన్నాను. నా గురించి నాకు తెలియకపోతే ఎవరికి తెలుస్తుంది అనుకుంటాము? అందువల్ల నాకేమీ తెలియదని నువ్వెలా చెప్పగలవని శాస్త్రాన్ని ప్రశ్నిస్తాము.

**శాస్త్రం జవాబు-** మీ గురించి మీకు తెలిసినదంతా మీ శరీరపరంగా, మీ మనస్సు పరంగా మాత్రమే. ఎవరైనా మీ బయోడేటా ఏమిటి అంటే మీ కార్డు ఒకటి ఇస్తారు. అందులో మీ పుట్టినరోజు, వయస్సు, మీ బరువు, ఎత్తు, ఆరోగ్యవివరాలు, విద్యార్హతలు, ఉద్యోగం ఉంటాయి అంతే.

బాహ్యప్రపంచాన్ని మీరెలా బాహ్యవస్తువుగా (ఆబ్జెక్టుగా) అనుభవిస్తున్నారో, అలా మీ మనశ్శరీరాలను కూడా మీరు ఆబ్జెక్టుగా అనుభవిస్తున్నారు. అది కూడా మామూలు ఆబ్జెక్టుగా కాదు. మారుతున్న ఆబ్జెక్టుగా. ఎప్పుడన్నా ఆ విషయం ఆలోచించారా?

**శరీరపరంగా-** శరీరపరంగా అంతకుముందు ఉన్న శరీరం వేరు, ఇప్పటి శరీరం వేరు. సైన్సు కూడా అదే చెబుతుంది. మీ చిన్నప్పటి శరీరం వేరు, ఇప్పటి శరీరం వేరు. కణాలు కూడా ఎప్పటికప్పుడు మారిపోతాయి. ఇవన్నీ మారుతున్నా, నేను మారటం లేదు. శరీరంలో మార్పులు వస్తున్నాయని నేను గమనిస్తున్నాను. **మారే శరీరానికి, మారని సాక్షిని నేను.**

కళ్ళజోడులాగే శరీరం కూడా. కళ్ళజోడుని నేనుగా పొరపడలేను. అలాగే నేను శరీరం అని పొరపాటు పడకూడదు. శరీరం ఆబ్జెక్టు అనీ, దాన్ని గమనిస్తున్నాననీ, అది మారుతుందనీ, నాకు జాగ్రదావస్థలో మాత్రమే తెలుస్తుంది.

స్వప్నావస్థలో జాగ్రదావస్థలోవేవీ వాడలేను. ఇక్కడి కళ్ళజోడు, కట్టుడు పళ్ళు, చెవిటి మిషన్ ఏవీ అందులోకి తీసుకువెళ్ళలేను.

నేను శరీరం అని ఎలా పొరపాటు పడ్డారు? నేను మారే శరీరం వెనుకనున్న మారని సాక్షిని అని మీరు చెప్పగలగాలి అంటుంది వేదాంతం. అందువల్ల మీరు చెప్పే బయోడేటా మీది కాదు. మీ విజిటింగ్ కార్డుని పారేయండి (వ్యావహారికంగా కాదు).

**మనస్సుపరంగా–** మనస్సు కూడా మీరు కాదు. మనస్సులో కలిగే ఆలోచనలు మీరని ఎలా అనుకుంటున్నారు? ప్రపంచంతో వ్యవహారం నడపటానికి మీరు వాడే పరికరం మనస్సు. జ్ఞానం పొందకముందు, మీ మనస్సు అజ్ఞానంలో ఉందని మీకు తెలుసు. జ్ఞానం పొందాక, మీ మనస్సులో జ్ఞానం ఉందనీ మీకు తెలుసు. అందువల్ల ఈ మార్గంలో మీరు ఇంకొంచెం ముందుకు వెళ్ళి విచారణ చేయండి అంటున్నది వేదం.

వేదం బలవంతంగా ఏదీ రుద్దదు. అది కేవలం నమ్మమని చెప్పదు. మీరే విశ్లేషించుకోండి అంటుంది. జాగ్రద్, స్వప్న, సుషుప్తి– మూడు అవస్థల్లోనూ మీరు మారకుండా ఉన్నారు. శరీరం స్వప్నావస్థలోనూ, సుషుప్తి అవస్థలోనూ ఉండదు. మనస్సు సుషుప్తి అవస్థలో ఉండదు.

**ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనస్సును నేను సాక్షీభూతంగా చూస్తున్నాను.**

సుషుప్తిలో జ్ఞానం లేదు, భయం లేదు. నామీద కోబ్రా కదిలినా నాకు భయం లేదు. మేలుకుని ఉంటే బొద్దింకను చూస్తేనే భయం.

అందువల్ల మీ గురించి మీరు అనుకుంటున్నది నిజం కాదని వేదం సవాలు చేస్తుంది. ముందు నమ్మలేము. తర్వాత ఈ సత్యాన్ని నమ్మాక, కుతూహలం పెరుగుతుంది. అయితే నేనేమిటి? నారదుల వారికి తెలియని విద్య అంటూ లేదు. ఆయనకు వేదాలు, ఇతిహాసాలు, వ్యాకరణం, భూతవిద్య, ధనుర్విద్య, జ్యోతిష్యం, సర్వవిద్య– అలా ఎన్నో తెలుసు. కాని ఆత్మ గురించి తెలియదు.

**తరతి శోకమాత్మవిత్ - ఛాందోగ్యం 7-1-3**

ఆత్మవిద్య తెలుసుకున్న వ్యక్తి శోకాన్ని దాటుతాడని విన్నాడు. ఆ విద్య నేర్పమని, సనత్కుమారుని కోరాడు. ఆత్మవిద్య మీ అంతట మీరు పొందలేరు అంటున్నది శాస్త్రం.

**అనుభవిస్తున్న నువ్వే ఎన్నటికీ అది**
**అనుభవించబడుతున్న వస్తువు కాదు ఎన్నటికీ**

చూసే మీరు అన్నింటినీ చూడగలరు, మిమ్మల్ని మీరు తప్ప. చూసే కళ్ళు తమను తాము చూసుకోలేనట్టుగా, మీ సెల్‌ఫోన్‌లో మీకు మీరు ఫోన్ చేసుకోలేనట్టుగా, చైతన్యమైన మీరు మిమ్మల్ని మీరు చూసుకోలేరు.

చూసే వ్యక్తి చూడబడే వ్యక్తి అయినప్పుడు, ఆ చూసే వ్యక్తిని ఎవరు చూస్తారు?

**విజ్ఞాతారమరే కేన విజానీయాత్ - బృహదారణ్యకం 2-4-14**

నేను చైతన్యజీవిని అని నాకు తెలుసు కాని నేనెవరో నాకు తెలియదు. **ఆత్మవిద్య-** శాంతి, ఆనందం, భద్రతలు నానుంచే వస్తాయి అంటుంది. వేదాంత సారాన్ని 5 గుళికల రూపంలో చూడవచ్చు.

1. నేను సర్వవ్యాపకమైన చైతన్యాన్ని.
2. శాంతి, ఆనందం, భద్రతలు పొందే మార్గాన్ని నేనే.
3. కేవలం నా ఉనికివల్లే నా భౌతిక శరీరానికి జీవం ఏర్పడి, ఈ జగత్తులో వ్యవహారం నడపగలుగుతున్నది.
4. ఈ జగత్తులో ఏం జరిగినా అది నాకు అంటదు.
5. నా అసలు స్వరూపాన్ని నేను మర్చిపోయి, నా జీవితాన్ని భారంగా చేసుకుంటున్నాను. జ్ఞానయోగమనే విలువిద్యని సరిగ్గా సాధన చేసి, జీవితాన్ని ఒక ఆటగా మలచుకుంటాను.

**వేదం విధించిన జీవన విధానం టూకీగా**

కర్మయోగం-1 పాటించి- మోక్షేచ్ఛ పెంపొందించుకోండి

కర్మయోగం-2 పాటించి- మోక్షయోగ్యత పెంపొందించుకోండి

జ్ఞానయోగం- వేదాంత సారమనే గుళికలను వేసుకుని, జీవితాన్ని ఆటగా మలచుకోండి. ఏదైనా సమస్య వస్తే దాన్ని సాహసోపేతమైన ఆటగా భావించండి.

ఇదే భగవద్గీత ఐదవ అధ్యాయం సారాంశం కూడా.

# 18. వేదప్రామాణ్యత

మన సాంప్రదాయంలో జ్ఞానానికి చాలా ప్రాముఖ్యతనిస్తాము. అది లౌకిక జ్ఞానమైనా సరే, ఆధ్యాత్మిక జ్ఞానమైనా సరే! జ్ఞానాన్ని సాక్షాత్తూ సరస్వతీదేవిగా కొలుస్తాము. జ్ఞానానికి ఎందుకింత ప్రాముఖ్యతనిస్తామంటే, మన జీవిత విధానం, మనం చేసే పనులు అన్నీ జ్ఞానంమీదే ఆధారపడి ఉన్నాయి. మనం చేసే పనులను విశ్లేషిస్తే, వాటిల్లో మూడు దశలు ఉన్నట్టుగా గ్రహిస్తాము.

**1. జ్ఞానం, 2. ఇచ్ఛ, 3. క్రియ.**

ఈ మూడూ ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉంటాయి. ఒక విషయం మీద మనకు కోరిక లేకపోతే, దాని గురించిన క్రియ చేయము. అలాగే ఒక విషయం గురించి మనకు ఏమీ తెలియకపోతే, దానిమీద కోరిక పుట్టదు. అంటే జ్ఞానం, ఇచ్ఛ, క్రియ– ఈ మూడు మన జీవితంలో పడుగూ, పేకలా అల్లుకుపోయాయి. అందువల్లనే ఈ మూడూ అంశాలను మూడు శక్తులుగా పూజిస్తాము. **జ్ఞానశక్తి, ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి.**

మనం చేసే ప్రతి పనిలోనూ జ్ఞానం అంతగా పెనవేసుకుపోయింది కాబట్టే జ్ఞానానికి అంత పెద్దపీట వేశాము. దానికి అంత ప్రాముఖ్యతనిచ్చాము.

**మనకు ఒక విషయంలో జ్ఞానం కావాలంటే దాన్ని పొందటమెలా?**

ఈ ప్రశ్న మనలో ఉదయిస్తుంది. ఎందుకంటే జ్ఞానం దానంతట అది వచ్చేయదు. మనం అజ్ఞానంతో పుట్టాము. కాలక్రమేణా జ్ఞానాన్ని పొందగలము.

జ్ఞానం దేనితో పొందుతామో దాన్ని **ప్రమాణం** అంటారు.

అందువల్ల ఒక విషయంలో జ్ఞానం పొందామంటే, ప్రమాణం వాడినట్టు అర్థం. జ్ఞానానికి పెద్దపీట వేశాము కాబట్టి, ప్రమాణానికి కూడా పెద్దపీట వేయాలి. ఎందుకంటే ప్రమాణం అనే మూలం నుంచే జ్ఞానం వస్తుంది కాబట్టి. ఆ విధంగా ప్రమాణానికి బాగా ప్రాముఖ్యతనిచ్చింది మన సాంప్రదాయం. ఎప్పుడైతే ప్రమాణంయొక్క ప్రాధాన్యతను కూడా అంగీకరించామో, అప్పుడే జ్ఞానసాధన నాలుగు దశలుగా అవుతుంది. **ప్రమాణం, జ్ఞానం, ఇచ్ఛ, క్రియ.** అంటే ప్రమాణం జ్ఞానాన్ని కలుగచేస్తుంది; జ్ఞానం ఇచ్ఛను పుట్టిస్తుంది; ఇచ్ఛ క్రియకు దారితీస్తుంది. మనం చేసే క్రియ లేదా కర్మ మన భవిష్యత్తును నిర్దేశిస్తుంది. ఆ భవిష్యత్తు తక్షణ

భవిష్యత్తు కావచ్చు; సుదూర భవిష్యత్తు కావచ్చు; ఇంకా మాట్లాడితే వచ్చే జన్మలోనిది కూడా కావచ్చు.

మన సాంప్రదాయం ప్రమాణానికి ఇంత పెద్దపీట వేసినా, దురదృష్టవశాత్తూ నేడు ప్రమాణంయొక్క ప్రాముఖ్యతను మర్చిపోయినట్టుగా కనిపిస్తున్నది. దాని విలువ తెలియటం లేదు మనకు. ప్రాచీనకాలంలో, ప్రమాణాన్ని విశ్లేషిస్తూ అనేక గ్రంథాలను రచించారు. ప్రమాణస్వరూపం ఏమిటి, అది ఏ రంగంలో పనిచేస్తుంది, ఆ ప్రమాణంద్వారా పొందిన జ్ఞానంయొక్క ప్రాముఖ్యం ఏమిటి అనే విషయాలను చర్చించేవారు అందులో.

సాంప్రదాయపరంగా చూస్తే, ప్రమాణాలను ముఖ్యంగా రెండు తెగల కింద విభజించారు.

**1. ఉపజీవ్య ప్రమాణం** – జ్ఞానం పొందటానికి ప్రత్యక్షమార్గం.

**2. ఉపజీవి ప్రమాణం** – జ్ఞానం పొందటానికి పరోక్షమార్గం.

మన ఇంద్రియాలు ఉపజీవ్య ప్రమాణంలోకి వస్తాయి. వాటిని ప్రత్యక్ష ప్రమాణాలని అంటారు. ఇంద్రియాలను జ్ఞానం పొందటానికి ప్రాథమిక మార్గాలని కూడా అంటారు ఎందుకంటే ఏ ఇంద్రియానికున్న శక్తి దానిదే; ఒక ఇంద్రియం పరిధిలోకి ఇంకో ఇంద్రియం చొరబడలేదు. ఒక ఇంద్రియంవల్ల పొందిన జ్ఞానాన్ని, ఇంకే పద్ధతిద్వారా, ఆఖరికి ఇంకో ఇంద్రియంద్వారా, కూడా పొందలేము. కళ్ళు నామరూపాలను చూస్తాయి. వస్తువుల రంగులను చూస్తాయి. ఈ జ్ఞానాన్ని చెవులో, ముక్కో ఉపయోగించి పొందలేము. చెవులద్వారా శబ్దాన్ని, ముక్కుద్వారా వాసనను పసిగట్టగలము. ఒక్కొక్క ప్రాథమిక ప్రమాణానికీ దాని ప్రత్యేక రంగం ఉంటుంది. అది ఇచ్చే జ్ఞానం దానికే చెందుతుంది. వేరే ప్రమాణంతో నిరూపించలేము. కన్ను చూసిన రంగును చెవి అవుననలేదు, కాదనలేదు కూడా. ఆ విధంగా ప్రాథమిక ప్రమాణంద్వారా పొందిన జ్ఞానం విలక్షణమైనది, స్వతంత్రమైనది, తిరుగులేనిది. అందువల్ల అదే అంతిమన్యాయం. అందువల్ల దీన్ని **ప్రబలజ్ఞానం** అంటే బలమైన జ్ఞానం అంటాము. ఇటువంటి జ్ఞానాన్ని వేరే దానితో ప్రశ్నించకుండా, పోల్చకుండా సత్యంగా స్వీకరిస్తాము.

అదే పరోక్షప్రమాణం విషయానికి వచ్చేసరికి, అది ప్రత్యక్షప్రమాణంమీద ఆధారపడుతుంది. పరోక్షపదంలోనే ఉంది జవాబు. ఇందులో జ్ఞానం ప్రత్యక్షంగా పొందము. అనుమానప్రమాణం పరోక్షప్రమాణం. అంటే ఇది తర్కప్రధానం. దీనికి

మామూలుగా శాస్త్రం ఇచ్చే ఉదాహరణ అగ్ని, పొగ. కొండ వెనుక పొగను చూసి అక్కడ అగ్ని ఉందని ఊహిస్తాము. నిజంగా మనం అగ్నిని చూడలేదు, కాని పొగనుబట్టి అగ్ని ఉందనుకుంటాము. అయినా దీన్ని కూడా జ్ఞానమనే అంటారు.

అనుమానప్రమాణం ప్రత్యక్షప్రమాణం కాదు కాబట్టి, దీన్ని మనం నిజమో కాదో చూడవచ్చు. ఎక్కడ పొగ కనిపిస్తోందో, అక్కడికి వెళ్ళి చూడవచ్చు. అక్కడ మనం అనుకున్నట్టుగా అగ్ని ఉండక పోవచ్చు కూడా! అంటే ప్రత్యక్షప్రమాణంతో నిరూపించటానికి ప్రయత్నిస్తే, అనుమానప్రమాణం నిజం కాకపోవచ్చు, నిజమవచ్చు కూడా. అందువల్ల పరోక్షప్రమాణం అస్వతంత్రమైనది, ప్రశ్నించతగినది, అంతిమన్యాయం కానిది. అందువల్ల ఈ జ్ఞానాన్ని దుర్బలజ్ఞానం అంటే బలహీనమైన జ్ఞానం అంటారు.

జ్ఞానం పొందటానికి ప్రయత్నించే ముందు, మనం ఆ ప్రమాణాన్ని విశ్లేషించుకోవాలి. అది ప్రత్యక్షప్రమాణమా? ప్రబలజ్ఞానాన్ని ఇస్తుందా, దుర్బలజ్ఞానాన్ని ఇస్తుందా? అది జ్ఞానం, ఇచ్ఛ, క్రియల గురించిన మన మార్గాన్ని నిర్దేశిస్తుంది. మన సాంప్రదాయం ఈ ప్రమాణాల ప్రామాణ్యత్వం గురించి లోతుగా విశ్లేషిస్తుంది. ఇది మన ప్రత్యేకత, ప్రపంచంలో వేరే ఎక్కడా ఈ ప్రామాణ్యత్వాన్ని చూడము.

ఒక పుస్తకం ప్రత్యక్షప్రమాణమా, పరోక్షప్రమాణమా? ఉదాహరణకు మానససరోవరం గురించిన పుస్తకం తీసుకోండి. ఆ పుస్తకం చదివితే మానససరోవరం గురించిన మొత్తం జ్ఞానం కలుగుతుంది. ఆ చుట్టుప్రక్కల ఉన్న ప్రాంతాలు, వాతావరణం, అక్కడికి వెళ్ళటానికి పడే అవస్థలు వగైరా. కాని ఈ జ్ఞానం పరోక్షజ్ఞానమే అవుతుంది. ఎందుకంటే మనం ప్రత్యక్షంగా మానససరోవరం వెళ్ళి తెలుసుకుంటే అది ప్రత్యక్షజ్ఞానం అవుతుంది. ఈ రచయిత చెప్పింది మనకు అనుభవంలోకి రావచ్చు, రాకపోవచ్చు. అందువల్ల ఒక పుస్తకం దుర్బలజ్ఞానాన్ని మాత్రమే ఇస్తుంది. కాకపోతే, రచయిత మేరకు తీసుకుంటే, అతనికి అది ప్రబలజ్ఞానం, అతనికి అది ప్రత్యక్ష ప్రమాణంద్వారా కలిగింది.

ఇప్పుడు మన వేదాల విషయానికి వస్తే, వేదం ప్రత్యక్షప్రమాణమా, పరోక్షప్రమాణమా? ఉపజీవ్యప్రమాణమా, ఉపజీవిప్రమాణమా? ఈ విషయంలో స్పష్టమైన అవగాహన ఉండాలి. కాని ఇక్కడే అనేక దర్శనాలు ఉన్నాయి. అంటే వేదం గురించిన ఒకొక్క విశ్లేషణను ఒకొక్క దర్శనం అంటారు. అలా మనకు

పన్నెండు దర్శనాలు ఉన్నాయి. అందులో ఆరు నాస్తికదర్శనాలు, ఆరు ఆస్తికదర్శనాలు ఉన్నాయి. నాస్తికులు అంటే మనకు తెలిసిన అర్థం కాదు, అంటే దేవుణ్ణి నమ్మని వారు కాదు. **నాస్తికులు** అంటే వేదాన్ని ప్రమాణంగా స్వీకరించనివారు. వారు– **నాలుగు రకాల బౌద్ధులు, జైనులు, చార్వాకులు.**

**ఆస్తికులు** అంటే వేదాన్ని ప్రమాణంగా స్వీకరించేవారు. వారు **సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషిక, పూర్వమీమాంస, ఉత్తర మీమాంసకులు.** మళ్ళీ ఈ ఆరుగురిలో నలుగురు అంటే సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషికులు వేదాన్ని ఉపజీవి ప్రమాణంగా స్వీకరిస్తారు. అంటే దాన్ని పరోక్షప్రమాణం అంటారు. పరోక్షప్రమాణం అనేసరికి, అది మానససరోవరంలాంటి పుస్తకం లాగా దుర్బల జ్ఞానాన్ని ఇచ్చేది అవుతుంది.

పూర్వమీమాంసకులు, ఉత్తరమీమాంసకులు వేదాన్ని **ఉపజీవ్యప్రమాణంగా** స్వీకరిస్తారు. అంటే ప్రత్యక్షప్రమాణాలైన ఇంద్రియాలకున్న శక్తితో పోలుస్తారు. ఆ విధంగా చూస్తే వేదం ఆరవ ప్రత్యక్షప్రమాణం కిందకి వస్తుంది.

వేదాన్ని రెండు ముఖ్య భాగాలుగా విడదీయవచ్చు. కర్మకాండ, జ్ఞానకాండ. కర్మకాండలో అనేక యజ్ఞయాగాదులు చెప్పబడ్డాయి. అవి లౌకిక సుఖాలకు మార్గాలు. జ్ఞానకాండలో జీవుని గురించీ, ఈశ్వరుని గురించీ, జీవ–ఈశ్వర ఐక్యం గురించీ చెప్పబడింది. మనం వేదాన్ని చదివే తీరు, మనం వేదాన్ని ఏ ప్రమాణంగా స్వీకరిస్తున్నాము అన్నదానిమీద ఆధారపడి ఉంటుంది.

చాలామంది వేదాన్ని ఉపజీవి ప్రమాణంగా స్వీకరిస్తారు. వారి దృష్టిలో వేదంద్వారా పొందిన జ్ఞానం అంతిమ జ్ఞానం కాదు; దాన్ని వేరే ప్రమాణంతో నిరూపించుకోవాలి. అటువంటి వారు కర్మకాండలో చెప్పిన అనేక కర్మలను వైజ్ఞానిక శాస్త్రపరంగా నిరూపించటానికి ప్రయత్నిస్తారు. అదే జ్ఞానకాండలో చెప్పిన జ్ఞానాన్ని సిద్ధులు పొందటంద్వారా నిరూపించుకోవాలని చూస్తారు. అంటే వారు ఆత్మసాక్షాత్కారంకోసం ఎదురు చూస్తారు.

ఇప్పుడు, మనం వేదాన్ని ఏ ప్రమాణంగా చూడాలి? మనం వేదాన్ని ఉపజీవి ప్రమాణంగా చూస్తే పెద్ద పొరపాటు చేస్తున్నామని మన ఆచార్యులందరూ ముక్తకంఠంతో అంటున్నారు. వేదప్రమాణస్వరూపం– ఉపజీవ్యప్రమాణం. మన ఆచార్యులు ఒకటే నొక్కివక్కాణిస్తున్నారు. **వేదాన్ని ఉపజీవ్యప్రమాణంగా**

**స్వీకరించండి** లేదా మీరు కూడా నాస్తికులుగా మారిపోయి, వేదాన్ని నమ్మకండి. అంతేకాని దాన్ని ఉపజీవి ప్రమాణం మాత్రం చేయకండి.

వేదాన్ని ఉపజీవ్య ప్రమాణంగా స్వీకరిస్తేనే, అందులో చెప్పిన యజ్ఞాలను విజ్ఞాన శాస్త్రపరంగా ప్రశ్నించకుండా, వాటిమీద శ్రద్ధతో చేస్తాము. విజ్ఞాన శాస్త్రం కొన్ని అంశాలనే నిరూపించగలదు. ఉదాహరణకు ఉపవాసం ఉండటం ఆరోగ్యానికి మంచిది. హోమం చేస్తే వాతావరణం పరిశుద్ధం అవుతుందనే విషయాలను నిరూపిస్తుందేమో కాని, మనం యజ్ఞాలు చేసే ఉద్దేశ్యం అది కాదు కదా! యజ్ఞాలు చేస్తే మీకు సానుకూల ఫలితాలు వస్తాయి, పుణ్యం వస్తుంది అని చెబుతుంది కాబట్టి చేస్తాము. అలాగే జ్ఞానకాండలో ఆత్మ గురించి చెప్పింది స్వీకరించాలి కాని, ఆత్మసాక్షాత్కారంకోసం ఎదురుచూడకూడదు. ఎప్పుడో ఒక జ్యోతిలాగా ఆత్మ ప్రత్యక్షమవుతుంది, అప్పుడే ఈ జ్ఞానం సరియైంది అనుకోకూడదు.

కర్మకాండ ఇహలోక, పరలోక సుఖాలను ఇస్తే, జ్ఞానకాండ మోక్షాన్నిచ్చే జ్ఞానాన్ని ఇస్తుంది. వేదాన్ని ఉపజీవ్య ప్రమాణంగా స్వీకరించాను, జ్ఞానం పొందాను కాని ఇంకా మోక్షం రాలేదు అనుకుంటే, అది వేదం తప్పుకాదు. మనలోనే ఉంది ఆ తప్పు. వేదాధ్యయనం చేయటానికి, మనం అధికారి అవాలంటే, మనం సాధనచతుష్టయసంపన్నులమై ఉండాలి. అంటే మనకు వివేకం, వైరాగ్యం, ముముక్షుత్వం, శమాదిషట్కసంపత్తులు ఉండాలి. మనకు మోక్షం రాలేదు అనుకుంటే బహుశా మనలో ఈ లక్షణాలు తక్కువయి ఉంటాయి. అందువల్ల ఒక పక్క వేదాధ్యయనం చేస్తూనే, ఈ నాలుగు లక్షణాలనూ సమకూర్చుకోవటానికి శ్రద్ధ చూపాలి.

అందువల్ల వేదం ఉపజీవ్యప్రమాణం అనే విషయాన్ని మర్చిపోవద్దు. ఈ గురుపూర్ణిమ రోజు మనం మన ఆచార్యుల కృపకోసం ప్రార్థిద్దాము. ఆదిగురువైన దక్షిణామూర్తినుంచి, మన ప్రత్యక్షగురువువరకూ అందరినీ మన ఆరోగ్యంకోసం, మన ఆధ్యాత్మిక ఎదుగుదలకోసం ప్రార్థిద్దాము.

## స్వామీజీ సూక్తిముక్తావళి

**రాగం** అంటే, నా దగ్గర ఉన్న వస్తువులమీద మమకారం. **కామం** అంటే నా దగ్గర లేని, నేను కావాలని కోరుకుంటున్న వస్తువులమీద కోరిక.

## 19. శాస్త్రం వైజ్ఞానికపరమైనదా?

మన సాంప్రదాయం వైదిక సాంప్రదాయం. వైదిక సాంప్రదాయం మనకు ప్రత్యేకించి మతపరమైన జీవన విధానాన్ని నియమించింది. లౌకిక లక్ష్యాలను వేదం గుర్తిస్తుంది. వాటి అవసరం కూడా ఒప్పుకుంటుంది కాని ఇవి ముఖ్య లక్ష్యాలు కాదు, సహకారీ లక్ష్యాలు మాత్రమే అంటుంది. వేదం ప్రకారం మతపరమైన జీవనవిధానమే ప్రాథమిక లక్ష్యం.

మతపరమైన జీవనవిధానం అంటే ఏమిటి? భగవంతుని చుట్టూ అల్లుకున్న జీవన విధానం! మన జీవితంలో ప్రతిరోజూ, ప్రతినిముషమూ, ప్రతిచర్యా ఏదో విధంగా దేవునితో అనుసంధానం చెంది ఉంటుంది. మనం ఒక కొత్త జీవిగా తల్లి గర్భంలో రూపుదిద్దుకుంటున్నప్పుడే ఈ అనుసంధానం మొదలవుతుంది. వేదమంత్రాలు పఠిస్తారు; యజ్ఞయాగాదులు నిర్వహిస్తారు. అంటే మనం ఈ భూమ్మీదకు రాకముందే మనను భగవంతునితో అనుసంధానం చేస్తారు పెద్దలు.

మనం ఈ భూమ్మీదకు వచ్చిన వెంటనే, మళ్ళీ వేదమంత్రాలు చదువుతారు, యజ్ఞయాగాదులు చేస్తారు. బాలసారె (ఇప్పుడు బారసాలగా మారింది) రోజున తండ్రి, మన చెవిలో 'ఓం' అని ఉచ్చరిస్తాడు. మనం ఎదుగుతున్న ప్రతి దశలోనూ వైదిక మంత్రాలు చదువుతూ, దాన్నొక యజ్ఞంలా చేస్తారు. అన్నప్రాసన అంటారు, అక్షరాభ్యాసం అంటారు, ఉపనయనం అంటారు, వివాహం అంటారు. అంత్యకాలం సమీపించి, ఒక వ్యక్తి మరణిస్తున్నప్పుడు కూడా ఒక యజ్ఞంలా చేస్తారు. మరణించే వ్యక్తి ఇంద్రియాలు పటిష్ఠంగా ఉండవు కాబట్టి, కుటుంబ సభ్యులు అతని కుడిచెవిలో దైవనామం పఠిస్తారు. ఆ విధంగా మన జీవితం తల్లి గర్భంలో రూపుదిద్దుకున్నప్పటినుంచీ, అంత్యేష్టి కర్మలు చేసేదాకా, అడుగు అడుగునా, దైవకార్యాలు చేస్తూనే ఉంటాము. అణువణువునా దైవభక్తి వెల్లివిరుస్తుంది.

అసలు కొత్తరోజు శుభారంభమే దైవప్రార్థనతో మొదలవుతుంది. నిజానికి మనం బ్రహ్మీముహూర్తంలో లేవాలి. బ్రహ్మీముహూర్తం అంటే సూర్యోదయానికి ఒకటిన్నర గంటల ముందు, అంటే 4.30కి. దీన్ని బ్రహ్మీముహూర్తం అని ఎందుకంటారంటే, బ్రహ్మకు భగవానుడు ఈ సమయంలో వేదాలను బోధించాడుట. అందువల్ల ఈ సమయంలో మనం కూడా వైదిక కార్యక్రమాలను చేయాలి. మనం నలుగురికి నమస్కారాలు చేసి రోజుని ప్రారంభించాలి. గురువు, దైవం,తల్లి, తండ్రి.

పొద్దున్నే దంతధావనం చేసేటప్పుడు టూత్‌బ్రష్షుకు ప్రార్థన చేయాలి. 'ఓ వనస్పతీ, నేను నిన్ను వాడుతున్నాను. నీద్వారా ఆ భగవంతుడు నన్ను దీవించు గాక!' వనస్పతి అంటే ఒక చెట్టుయొక్క పుల్ల. పూర్వం వేపపుల్లతో దంతధావనం చేసేవారు. ఇవాళ శాస్త్రజ్ఞులుకూడా, ఒక వ్యక్తి దంతాలు పటిష్ఠంగా ఉంటే, అతని సంపూర్ణ ఆరోగ్యం బాగున్నట్టు చెప్పవచ్చు, అంటున్నారు!

ఆ విధంగా ఒక కొత్త రోజు భగవంతునితో, ప్రార్థనలతో, మంత్రాలతో మొదలవుతుంది. ఆ ప్రార్థన అలా రోజంతా కొనసాగుతూనే ఉంటుంది. స్నానం చేసేముందు, భోజనం చేసే ముందు ప్రార్థనలు ఉన్నాయి. అలా రోజంతా భగవంతుని తలచుకున్నాక, పడుకునేముందు ఆఖరిగా ప్రార్థన చేసి పడుకోవాలి! ఆ విధంగా మతపరమైన జీవన విధానం రోజంతా, కాదు, జీవితమంతా కొనసాగుతుంది. లౌకిక లక్ష్యాల సాధన వెనుక ఈ దైవప్రధానమైన జీవనయానంయొక్క నేపథ్యం ఉంటూనే ఉంటుంది.

ఇటీవలకాలం వరకూ, ఇటువంటి మతపరమైన జీవనవిధానాన్ని అందరూ అంగీకరించారు. వేదాలను, యజ్ఞయాగాదులను, మతపరమైన కార్యకలాపాలను ఎదురు ప్రశ్నించకుండా స్వీకరించి పాటించారు. కాని ఇప్పుడు పరిస్థితి మారింది! తార్కిక బుద్ధి పెరిగింది! మనుష్యులు మతపరమైన కార్యకలాపాలకు తార్కికమైన, శాస్త్రపరమైన సమాధానాలు కోరుతున్నారు! వారు ఎంత స్థాయికి వెళ్ళిపోయారంటే, ఆఖరికి దేవుని ఉనికినే శంకించటం ప్రారంభించారు!

ఎప్పుడైతే మతపరంగా చేసే ప్రతి ఒక్క పూజనూ లేదా క్రతువునూ ప్రశ్నించటం ప్రారంభించారో, ఎప్పుడైతే వారికి వాటికి శాస్త్రీయపరమైన, తార్కికమైన జవాబులు దొరకలేదో, అప్పుడే ఇటువంటి పూజలను, క్రతువులనూ గుడ్డినమ్మకంగా కొట్టిపారేయటం మొదలుపెట్టారు. ఇది జనాల్లో ఎంత ప్రబలంగా పాకిపోయిందంటే, వేదపండితులు, మతగురువులు మతపరమైన కార్యకలాపాలకు వైజ్ఞానిక వివరణలు ఇవ్వటం ప్రారంభించారు.

ఉదాహరణకు శివరాత్రి రోజు రుద్రాభిషేకానికి పదకొండు ద్రవ్యాలనే ఎందుకు వాడతాము; పదో, పన్నెండో వాడవచ్చు కదా! ఇదీ ప్రశ్న! దీనికి తగ్గట్టుగా, ఎవరో ఒక మతగురువు దీనికి వివరణ ఇస్తాడు.

మతం, వేదం, క్రతువులు, భగవంతుని విషయాలలో మనం వైజ్ఞానిక, శాస్త్రపరమైన సంజాయిషీలు ఇవ్వటమే మనం చేసే అత్యంత పెద్ద ప్రాథమిక

పొరపాటు అని అర్థం చేసుకుని, గ్రహించాలి. ఎందుకు ఇది అత్యంత పెద్ద తప్పు? శాస్త్రమే చెబుతున్నది అలాగని. శాస్త్రం చెప్పిన విషయాలకు శాస్త్రపరమైన వివరణ ఇవ్వకూడదని మనం వైజ్ఞానికశాస్త్రంలో తెలుసుకోవాలి.

శాస్త్రం ఒక విషయాన్ని పరిచయం చేసినప్పుడు, చేస్తూనే ఒక ప్రాథమిక వ్యాఖ్యానం చేస్తుంది. కాకపోతే దాన్ని సాధారణంగా గమనించరు. లేదా పట్టించుకోరు. శాస్త్రమే చెబుతుంది మతంలో చెప్పిన ఎన్నో అంశాలు వైజ్ఞానిక శాస్త్రం ఇచ్చే వివరణకు కాని, విశ్లేషణకు కాని అతీతమైనవని. అందువల్ల, శాస్త్రం చెప్పినది ఏదైనా వైజ్ఞానిక శాస్త్రపరిధిలోకి రానప్పుడు, దాన్ని వైజ్ఞానికశాస్త్రం ఎలా చెప్పగలదు, నిజం కాదని ఎలా ఖండించగలదు? అసలు అలా వైజ్ఞానికశాస్త్రపరంగా ఆలోచించే వైఖరే తప్పు. ముందుగా శాస్త్రం చెప్పిన అంశాలు విజ్ఞానశాస్త్ర పరిధిలోకి రానేరావని మనం ఖచ్చితంగా అర్థం చేసుకోవాలి.

శాస్త్రం చెప్పినదాన్ని మనం ఎందుకు స్వీకరించాలి? విజ్ఞానశాస్త్రానికి అతీతంగా ఇంకొకటి ఉందని ఎందుకు నమ్మాలి?ఈ ప్రశ్నలు ఉదయించవచ్చు మనలో. గతంలో, వైజ్ఞానికశాస్త్రజ్ఞులు వైజ్ఞానికశాస్త్ర పరంగా దేన్నైనా, ఎటువంటి దాన్నయినా నిరూపించవచ్చు అనుకునేవారు! కాని నేడు, వైజ్ఞానిక పరిశోధనలకు అందని రంగాలు కొన్ని ఉన్నాయని నెమ్మదిగా తెలుసుకుంటున్నారు. ఈ విషయం, ముందు ముందు ఇంకా నమ్మకంగా తెలుస్తుంది.

మనం గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఏ అంశమైతే విజ్ఞానశాస్త్రానికి అందదని శాస్త్రం తేల్చి చెప్పిందో, ఆ అంశంలోనే విజ్ఞానశాస్త్రజ్ఞులు కూడా ఇది తమ పరిధిలోకి రాదని తేల్చి చెప్పేశారు! దానికి మంచి ఉదాహరణ జగత్‌సృష్టి. సృష్టి ఎలా ప్రారంభమయింది? దీనికి విజ్ఞానశాస్త్రం జవాబు చెప్పలేకపోవటమే కాదు, అసలు విజ్ఞానశాస్త్రం దీనికి ఎన్నడూ జవాబు చెప్పలేదని కూడా చెప్పేశారు విజ్ఞానశాస్త్రజ్ఞులు. గొప్ప గొప్ప శాస్త్రజ్ఞులు అయిన న్యూటన్, మాక్‌సప్లేన్, ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్ (ఇతను నాస్తికుడు) ఒకటే విషయం చెప్పారు. ఏమని? కొన్ని విషయాలు మతపరంగానే చెప్పాలి కాని, అవి సైన్సుకు అందవని!

సైన్సుకు అందనివి, సైన్సు నిరూపించలేనివి, సైన్సు విశ్లేషించలేనివి మనం అసలు ఎందుకు స్వీకరించాలి? సైన్సు శాస్త్రాన్ని నిరూపించలేకపోయినా, మనం వాటిని స్వీకరిస్తే అది గుడ్డినమ్మకం కాదా? అలా గుడ్డినమ్మకంతో పోతే మనం సైన్సుని నమ్మని, హేతువాదాన్ని స్వీకరించని వారము కామా? ఇది కొంతమంది ఆక్షేపణ.

సరే, శాస్త్రాన్ని అంగీకరించటం ఒక నమ్మకంగానే తీసుకుందాం కాసేపు. ఆమాటకొస్తే సైన్సు, నమ్మకం కూడా పరస్పర విరుద్ధమైనవేమీ కావు! చాలామంది వైజ్ఞానిక శాస్త్రజ్ఞులకు కూడా కొన్ని నమ్మకాలు ఉంటాయి. అలా ఉన్నందుకు వారేమీ తప్పుగా అనుకోరు. అందువల్ల మతం విషయం వచ్చేసరికి, మనం వైజ్ఞానిక శాస్త్రపరమైన విశ్లేషణల జోలికి పోకుండా, శాస్త్రం చెప్పిన దాన్నిబట్టి పోవాలి. అందులో తప్పేమీ లేదు! శాస్త్రంమీద నమ్మకం స్థాయినుంచి, శాస్త్రాన్ని జ్ఞానం ఇచ్చే ఒక ప్రమాణంగా స్వీకరించే స్థాయికి ఎదగాలి.

విజ్ఞానశాస్త్రానికి అతీతంగా ఉన్నదాన్ని మనం ఎలా స్వీకరించగలము? మళ్ళీ ఇంకో శంక. ఈ ఉదాహరణను చూడండి. మనకు ఐదు జ్ఞానేంద్రియాలు ఉన్నాయి. అవి కళ్ళు, చెవులు, ముక్కు, నోరు, చర్మం. వాటిద్వారా మనం చూస్తాము. వింటాము, వాసన చూస్తాము, రుచిని ఆస్వాదిస్తాము. స్పర్శను తెలుసుకుంటాము. అవునా? కాని ఏ జ్ఞానేంద్రియం పని ఆ జ్ఞానేంద్రియమే చేయగలదు.దాని పరిధి పరిమితమైనది. అది దాటి బయటకు రాలేదు. చెవులు రంగు, రూపులను చూడలేవు. ముక్కు మనం వినే శబ్దాలను అవునని కాని, కాదని కాని చెప్పలేదు. అంటే మనం కంటితో ఒక గులాబీ పువ్వును చూస్తే, చెవి అది గులాబీ పువ్వేనని నొక్కి చెప్పలేదు. అది గులాబీ పువ్వు కాదనీ గట్టిగా ఖండించలేదు.

ఇప్పుడు ఒక గుడ్డివాని విషయం తీసుకుందాము. అతను జీవితమంతా తక్కిన నాలుగు ఇంద్రియాలతోనే జీవిస్తున్నాడు. దేన్నైనా నిరూపించాలన్నా, ఖండించాలన్నా కూడా అతను ఆ నాలుగింటినీ వాడగలడు. ఒకవేళ అతనికి నీలం రంగు చూపించి, ఇదుగో ఇది నీలం రంగు అని చెప్పామనుకోండి. అతను, 'నేను నా (నాలుగు) ఇంద్రియాలతో తేల్చుకుని కాని ఒప్పుకోలేను. వాటికి అందని దాన్ని నమ్మకం అంటాను కాని నిజం అనను. నా (నాలుగు) ఇంద్రియాలు నిజమని ఒప్పుకున్న దాన్నే నేను స్వీకరిస్తాను,' అన్నాడనుకోండి, దాన్ని మనం స్వీకరించగలమా? మనకు స్పష్టంగా తెలుసు నీలం రంగు కన్నుతోనే నిరూపించాలి లేదా ఖండించాలి కాని, దాన్ని వేరే ప్రమాణంతో అవుననలేము, కాదనలేము! ఎందుకు? మనం ఐదు జ్ఞానేంద్రియాలతో జీవిస్తున్నాము కాబట్టి కన్ను అనేది ఒకటి ఉందని, దాని పరిధి ఒకటి ఉందని మనకు తెలుసు.

అలా, వైజ్ఞానికశాస్త్రం కూడా కేవలం ప్రత్యక్షప్రమాణంమీద ఆధారపడి ఉంది. మనకు ఆ ప్రత్యక్షప్రమాణాలు మాత్రమే కాక, ఆరవ ప్రమాణం ఇంకొకటి

ఉంది. అదే శాస్త్రప్రమాణం. శాస్త్రాన్ని ఆరవప్రమాణంగా తీసుకోవచ్చు. ఎందుకంటే పంచజ్ఞానేంద్రియాలు నిరూపించలేని, పంచజ్ఞానేంద్రియాలమీద ఆధారపడ్డ విజ్ఞానశాస్త్రం నిరూపించలేని, అంశాలను ఆరవప్రమాణమైన శాస్త్రం నిరూపించగలదు.

పంచజ్ఞానేంద్రియాలను ఉపయోగిస్తే, లౌకికజ్ఞానం మాత్రమే పొంద గలము. లౌకిక చక్షువులను ఉపయోగిస్తే మామూలు జగత్తు తెలుస్తుంది. శాస్త్రచక్షువులను ఉపయోగిస్తే పూర్తిగా సరికొత్త అంశాలను వివరిస్తుంది. అందువల్ల శాస్త్రం చెప్పేదేమీ కేవలం నమ్మకంమీద ఆధారపడింది కాదు. **నిజాలు! అక్షరసత్యాలు!** శాస్త్రం చెప్పిన అంశాలను తిరుగులేని జ్ఞానంగా స్వీకరిస్తాము. దాన్ని జ్ఞానేంద్రియాలు కాని, జ్ఞానేంద్రియాలమీద ఆధారపడి ఏర్పడిన సైన్సుకాని నిరూపించనవసరం లేదు. శాస్త్రం విజ్ఞానశాస్త్రం కాదు. దాన్ని విజ్ఞానశాస్త్రం ఏర్పరచలేదు. విజ్ఞానశాస్త్రం నిరూపించలేదు. అందువల్ల శాస్త్రం చెప్పిన నిజాన్ని మనం ఉన్నదున్నట్టుగా స్వీకరిస్తాము తప్ప, సైన్సు పరంగా నిరూపించటానికో, ఖండించటానికో ప్రయత్నించము. శాస్త్రాన్ని తర్కంతో నిరూపించ లేము, ఖండించ లేము. శాస్త్రం తర్కానికి అతీతమైనది. అంటే శాస్త్రం విజ్ఞానశాస్త్రానికి పోలినది కాదు, విజ్ఞానశాస్త్రానికి భిన్నమైనది కాదు, విజ్ఞానశాస్త్రానికి అతీతమైనది!

శాస్త్రం దేనిగురించి చెబుతుంది? శాస్త్రం భగవంతుని గురించి చెబుతుంది! శాస్త్రం, భగవంతుడు వైజ్ఞానికశాస్త్రానికి అతీతుడు అంటుంది! అందువల్ల సైన్సు భగవంతుణ్ణి నిరూపించలేదు. ఖండించలేదు. భగవంతుణ్ణి శాస్త్రంద్వారానే తెలుసుకోవాలి!

భగవంతుణ్ణి ఎలా నిర్వచిస్తుంది శాస్త్రం? భగవంతుడు జగత్కారణం అంటుంది! ఈ జగత్తుకు నిమిత్త, ఉపాదానకారణం అంటుంది. జగత్తు అంతా ఒక నియమం ప్రకారం, లయబద్ధంగా ఉంది అంటే దానికి భగవంతుని తెలివితేటలే కారణం. వైజ్ఞానికశాస్త్రజ్ఞులు సృష్టి అంతా ఇంత క్రమబద్ధంగా, ఒక పద్ధతి ప్రకారం ఉందంటే అది అనుకోకుండా ఏర్పడింది కాదు, దాని వెనుక ఒక కనపడని, అదృశ్యశక్తి ఉందని ఒప్పుకుంటారు!

సైన్సుకందని ఇంకో అంతుపట్టని సమస్య జననమరణాలు! పుట్టుక ఎలా సంభవిస్తుంది? మరణం ఎలా వస్తుంది? వీటికి జవాబులు లేవు. చావు, పుట్టుకలను

జయించలేదు సైన్సు. కాని మనం శాస్త్రాన్ని అధ్యయనంచేస్తే ఈ జననమరణాల గురించి తెలుసుకుని, ఈ జనన, మరణ వృత్తంనుంచి తప్పించుకోవచ్చు.

మతపరమైన జీవన విధానం మనకు ఎలా తోడ్పడుతుంది? శివరాత్రి రోజు రుద్రాభిషేకం చేస్తే కలిగే లాభమేమిటి ప్రశ్నలకు విజ్ఞానశాస్త్రపరంగా జవాబులు లేవు. రుద్రాభిషేక ఫలితాన్ని సైన్సుప్రకారం నిరూపించలేము. శాస్త్రం రుద్రాభిషేకాన్ని నియమించింది. మనం చేద్దామని నిర్ణయించుకున్నాము. దానికి ఫలితం తప్పకుండా ఉంటుంది! అందువల్ల రుద్రాభిషేకం చేస్తే (ఆ మాటకొస్తే ఏ అభిషేకం చేసినా) దానికి విలువైన వస్తువులను వృథా చేస్తున్నాము అనుకోకూడదు. ఈ అభిషేకానికి ద్రవ్యాలు ఎంతన్నా వాడనీ, అవేమీ వృథా కానేకావు. అవి పనిచేస్తాయి! పని చేస్తాయి! పనిచేస్తాయి! అంతే. లౌకిక వ్యవహారాలకు మనకు సైన్సు కావాలి. కాని మతం, దేవుళ్ళ విషయానికొచ్చేసరికి, శాస్త్రంవైపు మొగ్గుచూపాలి!

ఈ శివరాత్రి మహాపర్వదినాన, రుద్రాభిషేకం చేద్దాము. ఆ పరమేశ్వరుని కృపాకటాక్షాలను పొందుదాము. ప్రాపంచిక విజయానికీ, ఆధ్యాత్మిక ఎదుగుదలకూ దీవిస్తాడు ఆ పరమేశ్వరుడు.

## స్వామీజీ సూక్తిముక్తావళి

మన ప్రారబ్ధకర్మ మనకు ఈ ప్రపంచంలో సుఖదుఃఖాలను మూడు పరికరాలద్వారా ఇస్తుంది.

అవి– పరిస్థితులు, వస్తువులు, మనుష్యులు.

ఈ మూడు మన పుణ్యపాపాలనుబట్టి మనకు సుఖాన్నో దుఃఖాన్నో ఇస్తాయి.

# 20.సత్సంగం

మనిషిగా పుట్టినందుకు మన జీవితలక్ష్యం ఏమిటి? అది తెలుసుకోవాలంటే, సృష్టిలో అన్నింటినీ గమనిస్తే, ఒక అంశం అన్నింటిలోనూ సమానంగా సాగుతుంది. చెట్లు పెరుగుతూ వస్తాయి. ఆ పెరిగే కాలంలో తాము మాత్రం పెరగకుండా, మానవాళికి పండ్లు, కూరగాయలను సమృద్ధిగా అందిస్తాయి. అంటే పరోపకారం కోసమే ఉన్నాయి అవి. అలాగే జంతువులు కూడా తాము పెరుగుతూ, వాటికి చేతనైన సహాయం మనకు చేసి, వాటి కాలం తీరాక తనువును చాలిస్తాయి. మనం కూడా వాటిలాగే శారీరకంగా ఎదుగుతాము. మనం కూడా జీవించి ఉన్నన్నాళ్ళూ మనం చేయగలిగిన సహాయం ఇతరులకు చేస్తూ, సమయం ఆసన్నమయినప్పుడు ఈ భూమిని తర్వాత వచ్చే తరంకోసం వదిలి వెళ్ళిపోతాము.

కాని, చెట్లు, జంతువులతో పోలిస్తే మన ఎదుగుదలలో ఒక ప్రత్యేకత ఉంది. వాటివి కేవలం భౌతికమైన ఎదుగుదల. మన విషయం అలాకాదు. మనం బుద్ధిపరంగా కూడా ఎదుగుతాము. శారీరక ఎదుగుదలకోసం మనం ఎక్కువ కష్టపడనవసరం లేదు. ఆ మాటకొస్తే పూజ్య స్వామీజీ సరదాగా అంటుంటారు, మనం బ్రతికి ఉంటే చాలు, మనకు ఇష్టం ఉన్నా లేకపోయినా పెరుగుతాము, ఒక్కోసారి అవసరమైన దానికన్నా ఎక్కువగా. అందువల్ల శారీరక ఎదుగుదలకి జీవించి ఉండి, జీవించటానికి అవసరమైన మేరకు తింటూ, అనారోగ్య సమస్యలను రానివ్వకుండా చూసుకుంటే చాలు. మన ప్రమేయం లేకుండానే ఎదిగిపోతాము.

కాని మనిషి బుద్ధి జీవి. శారీరక ఎదుగుదల దగ్గరే ఆగిపోకూడదు. మనం అంతరంగంలో – భావపరంగా, బుద్ధిపరంగా, ఆధ్యాత్మికపరంగా ఎదగాలి. వీటన్నింటినీ కలిపి **అంతర్గత ఎదుగుదల** అంటారు. ఈ అంతర్గత ఎదుగుదల ఎంత మేరకు ఉండాలి? ఎంతమేరకన్నా ఉండవచ్చు. విశ్వమంతా నాది అనే భావన కలిగేవరకూ ఎదగవచ్చు.

**మయ్యేవ సకలం జాతం । మయి సర్వం ప్రతిష్ఠితమ్ ।**
**మయి సర్వం లయం యాతి । తద్బ్రహ్మాద్వయమస్మ్యహమ్॥ – కైవల్యమ్**

నేను సర్వవ్యాపకమైన బ్రహ్మను. అలా అంతర్గతంగా ఎదుగుతున్నప్పుడు ప్రపంచానికి మనవంతు సహాయం చేయాలి.

**ఛాయామ్ అన్యస్య కుర్వంతి।**
**ఫలాన్యపి పరార్థాయ।**
**వృక్షాః సత్పురుషా ఇవ॥**

చెట్లు అవి ఎండలో నిలుచుని తక్కినవారికి నీడనిస్తాయి. ఫలాలను కూడా ఇతరులకోసం పండిస్తాయి.అంతర్గత ఎదుగుదల ఉండాలి బాగానే ఉంది. కాని అది సాధించటం ఎలా? ఇది మన ప్రశ్న. బాహ్య ఎదుగుదలకి పౌష్టికాహారం తినాలి, అది తెలుసు. అంతర్గతంగా ఎదగాలంటే ఏం చేయాలి? మనం ఆ విషయంలో, ప్రయత్నపూర్వకంగా కృషి చేయాలి. కాని ఈ సందర్భంలో మనం ఆ అంశాన్ని చెప్పడం లేదు.

అంతర్గత ఎదుగుదలకు మన కృషికి తోడు, మన చుట్టూ ఉన్నవారి ప్రమేయం కూడా ఉంటుంది. ఒక చెట్టు బాగా పెరగాలంటే దానికి విత్తనం పాతటం, నీరు పోయటం, చెదపురుగులు పట్టకుండా మందులు జల్లటంలాంటి పనులు చేయటమే కాకుండా, దానికి తగ్గ వాతావరణం కూడా ఉండాలి. అది చాలా ముఖ్యం. ఏర్కాడ్‌లాంటి కొండ ప్రాంతంలో పెరిగే మొక్కలను తెచ్చి చెన్నైలాంటి ప్రాంతంలో వేస్తే, అవి బ్రతకవు. చచ్చిపోతాయి.

అలాగే మనం అంతర్గతంగా ఎదగాలంటే మనకు సత్సంగం ఉండాలి. మనం ఎవరితో కలిసి ఉంటున్నామనేది చాలా ముఖ్యం. బృహదారణ్యకోపనిషత్తులో తల్లి, తండ్రి, గురువు – ఈ ముగ్గురూ ఉండి, వీరి మాటలను వినే అతను చెప్పే మాటకు విలువ ఉంటుంది అని వస్తుంది. మనకు ముగ్గురితో సత్సంబంధం ఉండాలి. **తల్లి, తండ్రి, గురువు.** వీరు చిన్నప్పటినుంచి మనను తీర్చిదిద్దుతారు. గురువు దగ్గర విద్యను ముగించాక బయట ప్రపంచంలోకి అడుగుపెడతాము.

ఆ బయట ప్రపంచంలో ఎవరితో కలిసి మెలిసి ఉంటామో, అది మన జీవితాన్ని నిర్దేశిస్తుంది. భర్తృహరి నీతిశతకంలో నీరుని ఉదాహరణగా తీసుకుని సత్సంగం ప్రభావం ఎలా ఉంటుందో వివరిస్తారు.

1. వేడి వస్తువుమీద నీరు జల్లితే ఆ నీరు వెంటనే మాయమవుతుంది. ఉదాహరణకు దోశె వేసేముందు పెనం కాలిందా అని చూడటానికి నీళ్ళు జల్లుతారు కదా! ఆ నీరు వెంటనే ఆవిరయిపోతుంది. దీన్ని **అధమసంగం** అంటారు.

2. తామరాకుమీద నీటిబొట్టు నాశనమవదు. మెరుస్తుంది కూడా. కానీ కొంతసేపే. దీన్ని **మధ్యమసంగం** అంటారు.

3. స్వాతి నక్షత్రం రోజున వర్షపు చినుకు ఆల్చిప్పలో పడితే అది ముత్యంగా మారుతుంది. అది శాశ్వతంగా ఉంటుంది. దీన్ని **ఉత్తమసంగం** అంటారు.

మూడు సందర్భాలలోను నీరు ఒకటే. అధమసంగంలో నీరు నాశనమైపోయింది. మధ్యమసంగంలో కొంతసేపు మెరిసి మాయమయ్యింది. ఉ త్తమసంగంలో నీరు కూడా ఉత్తమంగా అంటే ముత్యంగా మలచబడింది. ఇదే సూత్రం మనిషికి కూడా వర్తిస్తుంది. సత్సంగానికి ఉన్న విలువ అది. గొప్పవారితో సత్సంగం ఉంటే, మన ప్రమేయం లేకుండానే మనం కూడా మారతాం.

**సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వమ్।**
**నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః॥ - భజగోవిందమ్**

**సత్సంగత్వే నిస్సంగత్వం**–మనం ఉన్నతమైన వ్యక్తులతో సత్సంగం చేస్తే, మనం ఎక్కువ కష్టపడకుండానే, చెడు విషయాలకు దూరమవుతాము. వాటితో నిస్సంగత్వం ఏర్పడుతుందన్నమాట. ఒక కోతి మన వస్తువు ఏదైనా తీసుకున్నదనుకోండి. దాన్ని వదలమంటే అది వదలదు. దానికి ఇంకోటేదైనా ఇస్తే, చేతిలో ఉన్నది వదిలేసి, దీన్ని తీసుకుంటుంది. అలాగే చెడు విషయాలమీద ఆసక్తిని తేలిగ్గా వదులుకోలేము. కాని వేరే మంచి విషయాలమీద మొగ్గు చూపితే, చెడు విషయాలు వాటంతట అవే మనకు దూరమవుతాయి.

**నిస్సంగత్వే నిర్మోహత్వమ్**– వాటికి దూరమయ్యేసరికి వాటిమీద మోహం కూడా పోతుంది. సిగరెట్టు తాగకుండా ఉండలేని ఒక వ్యక్తి ఉన్నాడనుకోండి. అతను ఒక సత్సంగంతో కలిసి ఎక్కడికో వారం రోజుల పాటు వెళ్ళాడు. అక్కడ సిగరెట్టు ముట్టించుకునే ఆస్కారం లేదు. వారం రోజులూ దాని జోలికి పోకుండా ఉన్నాడు. అప్పుడు తను సిగరెట్టులో ఆనందం ఉందనుకున్నాడు. కాని అది లేకపోయినా ఆనందంగా ఉన్నాడని గ్రహించటంతో దానిమీద ఉన్న మోహం పోతుంది అతనికి. అంటే ఆనందం బాహ్యవస్తువులో ఉందనుకుని, వాటి వెంట వెంపర్లాడే వ్యామోహం పోతుంది.

**నిర్మోహత్వే నిశ్చలతత్త్వమ్**– ఎప్పుడైతే మోహం పోతుందో అప్పుడే మనసు ప్రశాంతంగా అవుతుంది. మోహం ఉన్నన్నాళ్ళూ ఆ వస్తువు పొందకపోతే ఆరాటం, అసహనం కలుగుతుంది. మోహమే లేనప్పుడు, మోహం కలిగించే అసహనానికి చోటేది? చలితం అంటే కలత చెందటం. నిశ్చలతం అంటే ప్రశాంతంగా ఉండటం.

**నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః –** మనస్సు ప్రశాంతంగా ఉంటే ఇక్కడే, ఇప్పుడే మోక్షం కలుగుతుంది. సంసారం అంటే శాంతి, భద్రత, ఆనందం బాహ్యవస్తువుల్లో ఉన్నాయనుకుని వాటి వెంట పరుగులు తీయటం. జీవన్ముక్తి అంటే వాటి వెంట పరుగులు తీయటం ఆపి నేనే ఆనందస్వరూపుణ్ణి అని తెలుసుకోవటం.

ఈ సత్సంగం మూడు స్థాయిల్లో జరుగుతుంది.

**1. ధార్మిక పురుషునితో సంగత్వం –** సత్ పురుషుడంటే ధార్మిక పురుషుడు. విలువలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒదులుకోనివాడు. ఇప్పటి పిల్లలు రెండు రకాల ధర్మాల మధ్య నలిగిపోతున్నారు. తండ్రి **సత్యం వద** అని నేర్పిస్తాడు. సత్యమే పలుకు అని చెబుతాడు. కాని తనకు ఫోన్ వస్తే తను ఇంట్లో లేనని చెప్పమంటాడు. అంటే సత్యం వధ చేయాలని అనుకుంటాడు. ఆ విధంగా రెండు రకాల జీవనాలు గడపాలనుకుంటాడు పిల్లవాడు. 1. విలువల గురించి మాట్లాడాలి. 2. కాని ఆ విలువలను పాటించనవసరం లేదు. అందువల్ల ఎట్టి పరిస్థితుల్లోనూ విలువలను ఒదులుకోని వ్యక్తితో సావాసం చేయాలి. **ఒక విలువకు విలువ – విలువకు విలువనిచ్చినప్పుడే వస్తుంది.**

సత్సంగం చేస్తే మనకు తెలియకుండానే ఎలా మంచివిలువలు నేర్చుకుంటామో చూపటానికి స్వామీజీ ఆయన అనుభవంలోంచి ఒక ఉదాహరణనిచ్చారు. ఆయన పూజ్యస్వామీజీ నేతృత్వంలో మూడేళ్ళ కోర్సు బొంబాయిలో అభ్యసించారు. వారి విద్యావిధానంలో భాగంగా శ్రమదానం కూడా ఉండేది. ఎండిపోయిన ఆకులను ప్రోగేసి, వాటిని తగులబెట్టేవారు. అలా ఒక రోజు వారు వాటిని గుట్టగా ఒక పెద్దచెట్టు కింద పోసి తగులబెడుతుంటే పూజ్య స్వామీజీ (దయానంద సరస్వతీ స్వామీజీ) వచ్చి చెట్టు కింద ఎలా కాలుస్తారు అన్నారు. అప్పుడు వారికి వృక్షాల్లో కూడా జీవముందని అర్థమైంది. అహింస మనుష్యులకే కాదు, వృక్షాలకు కూడా చూపాలని నేర్చుకున్నారు. ఇది ఎలా నేర్చుకున్నారు? పూజ్యస్వామీజీతో కలిసి ఉండి, ఆయన మామూలుగా మాట్లాడిన మాటల్లోంచి నేర్చుకున్నారు. క్లాసురూములో చెప్పిన పాఠం కాదది. కాని అది వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది.

**2. జ్ఞానీపురుషునితో సంగత్వం–** జ్ఞానీపురుషునితో సత్సంగం అంటే రెట్టింపు లాభం ఉంటుంది. ఒకటి విలువలను పెంపొందించుకుంటాము. ప్రతి ధార్మిక వ్యక్తీ జ్ఞాని కాకపోవచ్చు కాని ప్రతి జ్ఞానీ ధార్మిక పురుషుడు అవుతాడు. రెండోది

జ్ఞానం పొందే అవకాశం కలుగుతుంది. విలువలు నేర్చుకోవటానికి జ్ఞానితో కలిసి ఉంటే చాలు. కాని జ్ఞానం విషయంలో అలా కాదు. కలిసి ఉంటే సరిపోదు. జ్ఞానం పొందాలంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయాలి. గురువుకు శుశ్రూషలు, పాదపూజలు చేస్తే చాలదు, కొన్ని సంవత్సరాల పాటు విద్యనభ్యసించాలి. అది దీర్ఘకాల ప్రణాళిక. పూర్వం అందువల్లనే గురుకుల వాసం ఉండేది. గురువుతో కలసి జీవించటం ఉభయతారకం. గురువు ప్రవర్తనను దగ్గరగా గమనిస్తూ తనకు తెలియకుండానే గురువు మంచి గుణాలను అనుకరిస్తాడు శిష్యుడు. రెండో లాభం గురువు దగ్గర విద్యనభ్యసిస్తాడు. పూజ్యస్వామీజీ దగ్గర అన్ని రకాల మనస్తత్వాలున్న శిష్యులు ఉండేవారు. అటువంటి వారందరినీ ఒక్కత్రాటిమీద ఎలా నడిపిస్తారో వీరు గమనించేవారు.

ఎప్పుడైతే ఒక వ్యక్తి ధార్మిక పురుష సంగత్వం, జ్ఞానీపురుష సంగత్వంలో కొన్నాళ్ళు గడుపుతాడో అప్పుడే అతనికి మూడవ సంగత్వం దానంతట అదే ఏర్పడుతుంది. అది బ్రహ్మతో సంగత్వం.

**3. బ్రహ్మతో సంగత్వం–** ఉన్నదొకటే బ్రహ్మ. ఆ బ్రహ్మవు నువ్వే అని జ్ఞానీ పురుషునిద్వారా నేర్చుకుంటాడు. సత్ అంటే బ్రహ్మ. సత్సంగం అంటే బ్రహ్మతో ఉండటం.

**సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్ – ఛాందోగ్యమ్**

బ్రహ్మతో సంగత్వం ఎలా కుదురుతుంది? బ్రహ్మతో సంగత్వం శారీరకంగా ఉండదు. బ్రహ్మ ఒక వ్యక్తి అయితే, గురువు వచ్చి అదిగో అక్కడ ఉన్నాడు అని చెపితే వెళ్ళి కాసేపు సంగత్వం చేసి రావచ్చు. కాని బ్రహ్మ ఎవరు? వ్యక్తి కాదు. దేవుడు కాదు, నేనే.నా స్వరూపమే బ్రహ్మస్వరూపం. నేను బ్రహ్మకు ఎన్నడూ భిన్నంగా లేను. ఒకవేళ నేను భిన్నంగా ఉన్నాను అనుకుంటే, దానికి నా అజ్ఞానమే కారణం. ఎప్పుడైతే ఆత్మ జ్ఞానం లేదా బ్రహ్మజ్ఞానం పొందుతానో అప్పుడే నాకు **బ్రహ్మప్రాప్తి, బ్రహ్మ సంగప్రాప్తి, బ్రహ్మ ఐక్యప్రాప్తి** కలుగుతుంది. ఇది మొదటి రెండు సత్సంగాల ఫలితం. మొదటి రెండు స్థాయిలూ దాటందే, మూడవస్థాయికి రాలేము.

ధార్మిక పురుషునితో నేను సత్సంగం పెట్టుకోవటానికి సిద్ధమే కాని అలాంటి పురుషులు ఎక్కడా కనపడటం లేదు. నేనొక్కడినే మంచివాడిగా అనిపిస్తున్నాను నాకు! ఈ ప్రశ్న మీలో ఉదయిస్తే దానికి వేరే మార్గం ఉంది.

మనకు సత్పురుషుల జీవితచరిత్రలు ఉన్నాయి. వారి చరిత్ర, వారి ఆలోచనలు మనకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి. వాటినుంచి ప్రేరణ పొందవచ్చు మనం.

అయినా మన సందేహం తీరదు. సరే ధార్మిక పురుషుణ్ణి పుస్తకంలో వెతుక్కోవచ్చు కాని జ్ఞానితో సత్సంగం చేయాలంటే పుస్తకాలు చాలవు కదా! జ్ఞానం స్వయంగా శ్రవణ, మనన, నిదిధ్యాసనలద్వారా పొందాలంటారు కదా, మరి దాని మాటేమిటి అనుకుంటాము.

**తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్।**
**దదామి బుద్ధియోగం తం యేన మాముపయాంతి తే॥**
**తేషామేవానుకంపార్థమ్ అహమజ్ఞానజం తమః।**
**నాశయామ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా॥** గీత **10- 10,11**

మీరు మొదటి స్థాయి విషయంలో ప్రయత్నం చేస్తే నేను మీకు రెండవ స్థాయిని ఏర్పరుస్తాను అంటాడు భగవానుడు. ప్రతి ఒక్క సాధనశిబిరమూ సత్సంగమే. గురువు దొరికితే గురువుద్వారా నాకు బ్రహ్మ సత్సంగం దొరుకుతుంది. తద్వారా జీవన్ముక్తి, మోక్షప్రాప్తి కలుగుతాయి.

మామూలుగా పిక్నిక్కులకు వెళుతుంటారు అందరూ. అక్కడ అందరి రుచులూ, ఆలోచనలు, సరదాలు ఒక్కలాగా ఉండవు. అందువల్ల అందరితో కలవటం కష్టంగా ఉంటుంది. కాని సాధన శిబిరాల్లో అలా కాదు. అందరి ఆలోచనలు, దృక్కోణాలు ఒక్కలాగే ఉంటాయి. ప్రతి ఒక్క విద్యార్థి కూడా ఒక సత్పురుషుడే! మనం విద్య నేర్చుకునేందుకు నాలుగు అంశాలు తోడ్పడుతాయి. **గురువు బోధ, మన కృషి, తోటి విద్యార్థులు, కాలం-** అందువల్ల తోటి విద్యార్థులతో సత్సంగం చేస్తే ఎన్నో విషయాలు తెలుస్తాయి.

# స్వామీజీ సూక్తిముక్తావళి

ఒక ఆలయప్రాకారంలోకి ఎటువైపునుంచి అయినా- తూర్పు, పడమర, దక్షిణ, ఉత్తర ద్వారాలలో అడుగుపెట్టవచ్చు. కాని గర్భగుడిలోకి అడుగుపెట్టటానికి మాత్రం ఒకటే ద్వారం ఉంది. అలాగే మోక్షం విషయంలో కూడా అనేక మార్గాలు లేవు. ఒకటే మార్గం ఉంది. **అది జ్ఞానయజ్ఞం. ఏదో ఒక రోజు అందరూ దీనిలోకి రాకతప్పదు.**

# 21.గురువుయొక్క విశిష్టత

'ఈ **ఆత్మజ్ఞాన శిబిరంలో** నేను కూడా పాలుపంచుకోవటం నాకు ఆనందంగా ఉంది. ఇది మంచి సిద్ధాంతం. ఇటువంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు స్వామి సదానందగారిని, ఆయన సంస్థయైన సమ్యక్‌సాగర్‌ని అభినందిస్తున్నాను. మనకు సంగీతం, నృత్యం, ఆఖరికి ఆహారానికి కూడా కార్యక్రమాలు ఉన్నప్పుడు ఆత్మజ్ఞానశిబిరం ఎందుకు ఉండకూడదు?' ఒక ఆత్మజ్ఞానశిబిరంలో అన్నారు స్వామి పరమార్థానందజీ.

ఆత్మజ్ఞానం గురించి మన శాస్త్రం చాలా విపులంగా చర్చిస్తుంది. మన సనాతన ధర్మమైన హిందూమతానికి ప్రాథమిక శాస్త్రం వేదాలు. తక్కిన గ్రంథాలను స్మృతులని, పురాణాలనీ అంటారు. అవి ఈ ప్రాథమిక శాస్త్రం గురించిన వివరణలు, విశ్లేషణలు.

వేదాల్లో రెండు భాగాలు ఉన్నాయి. అవి వేదపూర్వభాగం, వేద అంతభాగం. వేదపూర్వభాగాన్ని కర్మకాండ అని కూడా అంటారు. అందులో అనేక యజ్ఞయాగాదులు వస్తాయి. వాటిని ఆచరించటంవల్ల మనిషి ధర్మార్థకామాలను పొందగలడు. ఒక ఆధ్యాత్మిక సాధకుడు తన ఆధ్యాత్మిక ప్రయాణాన్ని వేదపూర్వ భాగంతో ఆరంభిస్తాడు.అందువల్ల దీనిని ఆధ్యాత్మిక మార్గంలో తొలిమెట్టుగా అభివర్ణించవచ్చు. వేదపూర్వభాగం వేద అంతభాగంమీద కుతూహలం రేకెత్తించి, ఆధ్యాత్మిక సాధనను పటిష్ఠం చేస్తుంది.

వేద అంతభాగం లేదా వేదాంతం సాధకునికి ఆత్మజ్ఞానం బోధిస్తుంది. ఈ వేద అంతభాగాన్ని ఉపనిషత్తు అని కూడా అంటారు. ఈ అద్భుతమైన పేరులోనే గొప్ప సందేశం ఉంది. ఉపనిషత్తులో మూడు భాగాలు ఉన్నాయి. **ఉప, ని, షద్.** ఉప అంటే అత్యంత సమీపమైనది. మనకు అత్యంత సమీపమైనది ఆత్మ. అంటే మనమే– నాకు, ఆత్మకు మధ్య దూరం అసలు బొత్తిగా లేదు. ని అంటే నిశ్చయజ్ఞానం లేదా స్పష్టమైన జ్ఞానం. అందువల్ల ఉపని అంటే నిశ్చయ ఆత్మజ్ఞానం. సద్ అంటే నాశనం చేసేది. దేన్ని నాశనం చేస్తుంది? అజ్ఞానాన్ని, తద్వారా ఏర్పడిన సంసారాన్ని. సంసారం అంటే మనం అనుభవించే సమస్యలు. అలా **ఉపనిషత్తు అంటే ఆత్మ గురించిన నిశ్చయజ్ఞానం కలుగచేసేది;** తద్వారా ఆత్మ అజ్ఞానాన్ని, సంసారాన్ని నాశనం చేసేది అని అర్థం.

వేదాల్లో అనేక ఉపనిషత్తులు ఉన్నాయి. అన్నీ ఆత్మజ్ఞానాన్ని బోధిస్తాయి. వాటిల్లో అత్యంత ప్రముఖమైనది సామవేదానికి చెందిన ఛాందోగ్యోపనిషత్తు. ఈ ఉపనిషత్తులోని ఏడవ అధ్యాయంలో నారదులవారు తనకు బోధ చేయమని అడగటానికి సనత్కుమారుని దగ్గరకు వెళతారు. సనత్కుమారుడు నారదులవారికి ఏం వచ్చో అది చెప్పమన్నారు. నారదులవారికి ఎంతో జ్ఞానం ఉంది. ఎన్నో విద్యలు తెలుసు– వేదాలు, వ్యాకరణం, గణితశాస్త్రం, తర్కం, యుద్ధశాస్త్రం, నక్షత్రశాస్త్రం, సర్పశాస్త్రం ఇలా ఎన్నో తెలుసు. ఇన్ని విద్యలు నేర్చినా అతనికి శోకం పోలేదు.

**తరతి శోకమాత్మవిత్ - ఛాందోగ్యమ్ 7-1-3**

ఆత్మవిద్య పొందినవాడు శోకంయొక్క ఆవలి తీరానికి చేరుతాడని విన్నాననీ, తనను కూడా శోకంనుంచి తప్పించమనీ కోరతాడు. దీనిద్వారా మనకు శాస్త్రం చెప్పకనే చెబుతున్నది. ఏమని? మానసిక అశాంతిని పోగొట్టుకోవటానికి ఆత్మవిద్య ఒకటే మార్గమని. వేరే మార్గాలు ఉన్నట్టు కనబడినా అవి తాత్కాలికం మాత్రమే. అవి బాధని తగ్గిస్తాయేమో కాని, పూర్తిగా తొలగించలేవు.

ఆత్మజ్ఞానం అంటే ఏమిటి? ఏ విద్య అయినా నేర్చుకునే ముందు, ఆ విద్య గురించిన స్పష్టమైన అవగాహన ఉండాలి. మనకు అక్షరాలా ఏం కావాలో మనకు తెలియాలి. అంటే జ్ఞానం గురించిన జ్ఞానం కొంత ఉండాలి.

జ్ఞానం గురించి అర్థం చేసుకోవటానికి జ్ఞానం గురించిన నాలుగు అంశాలను తెలుసుకోవాలి.

**1.జ్ఞానంయొక్క స్థానం–** జ్ఞానం ఎక్కడ కలుగుతుంది? జ్ఞానం బుద్ధిలో కలుగుతుంది. దీన్ని మామూలుగా మనస్సు అని కూడా అంటారు. జ్ఞానం స్థూలశరీరంలో లేదా ఆత్మలో కలుగదు.

**2. జ్ఞానంయొక్క స్వరూపం–** జ్ఞానం వృత్తిరూపంలో కలుగుతుంది. వృత్తి అంటే ఆలోచనలు. ఆ ఆలోచనలవల్ల బుద్ధి మార్పు చెంది, జ్ఞానాన్ని పొందుతుంది.

**3. జ్ఞానంయొక్క వస్తువు–** మనం దేని గురించి జ్ఞానం పొందాలనుకుంటున్నామో, దాన్ని జ్ఞానంయొక్క వస్తువు అంటారు. దాన్ని ప్రమేయం అంటారు. అది అణువు గురించి కావచ్చు, దేవుడి గురించి కావచ్చు.

**4. జ్ఞానంయొక్క పరికరం–** ఏ వస్తువుద్వారా జ్ఞానం పొందుతామో, దాన్ని పరికరం లేదా ప్రమాణం అంటారు. మన పంచజ్ఞానేంద్రియాలైన– కన్ను, ముక్కు,

చెవి, నోరు,చర్మం ప్రమాణాలు. వైజ్ఞానిక శాస్త్రజ్ఞులు ఈ జ్ఞానేంద్రియాలను ఉపయోగించి వారికి కావాల్సిన సమాచారాన్ని సేకరిస్తారు.

ఈ నాలుగు అంశాల్లో మొదటి రెండూ అన్ని రకాల జ్ఞానానికీ సమానమే. అవి స్థానం, స్వరూపం. అది ఏ జ్ఞానమన్నా అవనీ, అది బుద్ధిలో కలుగుతుంది. ఆలోచనల రూపంలో కలుగుతుంది. మారేదల్లా ప్రమేయం, ప్రమాణాలు. మనం ఏ ప్రమాణం వాడాలనేది మనం జ్ఞానం పొందాలనుకునే వస్తువుమీద ఆధారపడుతుంది. ఉదాహరణకు శబ్దం వినాలంటే చెవులను, రూపం తెలుసుకోవాలంటే కన్నును ఉపయోగించాలి.

ఇప్పుడు ఆత్మజ్ఞాన విషయాన్ని పరిశీలిద్దాం. ముందే చెప్పినట్టుగా మొదటి రెండు అంశాలు దీనికి కూడా వర్తిస్తాయి. అవి స్థానం, స్వరూపం. తక్కిన అంశాల్లో జ్ఞానం లాగే, ఆత్మజ్ఞానం కూడా బుద్ధిలోనే కలగాలి. అందువల్లనే బుద్ధిని సంసిద్ధపరచాలని మన శాస్త్రం చెబుతూ ఉంటుంది.

**మనసైవేదమాప్తవ్యం నేహ నానాస్తి కిఞ్చన॥ - కఠ 2-1-11**

అలాగే ఆత్మజ్ఞానం వృత్తిరూపంలోనే కలగాలి. ఆలోచనలను లేకుండా చేయటం జ్ఞానం కాదు. సరియైన ఆలోచన ఉండటమే జ్ఞానం.

ఆత్మజ్ఞానంయొక్క వస్తువు ఏమిటి? ఇక్కడే దీని విశిష్టత చూస్తాము. విజ్ఞానశాస్త్రంలో బాహ్యప్రపంచం గురించి నేర్చుకుంటాము. వేదాంతం దీన్ని **అపరావిద్య** అంటుంది. అదే ఆత్మజ్ఞానం విషయానికి వచ్చేసరికి, ఆత్మజ్ఞానం యొక్క వస్తువు (ఆబ్జెక్టు) సబ్జెక్టు అయిన 'నేనే'. దీన్ని **పరావిద్య** అంటారు.

ఇప్పుడు సబ్జెక్టు అయిన నా గురించిన జ్ఞానం పొందటానికి నాకు పనికివచ్చే ప్రమాణం ఏమిటి? ఇక్కడే పెద్ద సమస్య ఎదురవుతుంది. మనకున్న జ్ఞానేంద్రియాలన్నీ బాహ్యముఖంగా అమర్చబడ్డాయి. అందుకని అవి బాహ్యప్రపంచాన్నే చూస్తాయి.

**పరాంచి ఖాని వ్యతృణత్స్వయంభూః।**
**తస్మాత్పరాఙ్ పశ్యతి నాన్తరాత్మన్ ॥- కఠ 2-1-1**

అలా జ్ఞానేంద్రియాల తయారీలోనే లోపం ఉంది. అవి బాహ్యప్రపంచాన్ని చూడటానికే అమర్చబడ్డాయి. అవి అంతర్ముఖం అవటానికి తోడ్పడవు. ఆత్మజ్ఞానం పొందటానికి ప్రత్యక్షప్రమాణాలుగా పరిగణింపబడే జ్ఞానేంద్రియాలు తోడ్పడకపోతే, విజ్ఞానశాస్త్రం కూడా సహాయపడలేదు. ఎందుకు?

అది కూడా ప్రత్యక్షప్రమాణంమీద కానీ, లేదా ప్రత్యక్షప్రమాణంద్వారా సేకరించిన సమాచారాన్ని తర్కంద్వారా కానీ నిరూపిస్తుంది.

ఇప్పుడు మనకు ప్రత్యక్షప్రమాణం, తర్కం జ్ఞానాన్ని ఇవ్వలేకపోతే, మరి ఆత్మజ్ఞానం ఎలా పొందుతాము? ప్రపంచాన్నంతా తేరిపార చూసే మన అందమైన కళ్ళు తమను తాము చూసుకోలేవు. కాకపోతే, అద్దం ఉపయోగించటంద్వారా వాటిని చూడగలము. కాని అది ప్రతిబింబమే. అలాగే మనను మనం అంతర్ముఖులమయి చూసుకోవటానికి, మనకు బాహ్యంగా ఒక ప్రమాణం కావాలి. ఆ ప్రమాణమే శాస్త్రప్రమాణం. శాస్త్రం నేర్చుకుంటే, ఆత్మజ్ఞానం పొందుతాము. ఆ విధంగా శాస్త్రం అంటే ఆత్మజ్ఞానం అనవచ్చు.

ఆధ్యాత్మిక గ్రంథానికీ, వైజ్ఞానిక పుస్తకానికీ మధ్య చాలా ముఖ్యమైన భేదమే ఉంది. ఉదాహరణకు భౌతిక శాస్త్రాన్ని (ఫిజిక్స్‌ను) తీసుకోండి. ఆ పుస్తకంలో ఉన్న పదాలు పరిశీలనద్వారా, ప్రయోగాలద్వారా సేకరించిన జ్ఞానాన్ని అందిస్తాయి. ఆ పదాలే జ్ఞానం కాదు; ఆ పదాలు జ్ఞానం గురించి చెబుతాయి. అందువల్ల లౌకికజ్ఞానానికి చెందిన పుస్తకాలను జ్ఞానాన్ని మోసుకువచ్చే పుస్తకాలు అంటాము. ఒకవేళ ప్రపంచంలో ఉన్న ఫిజిక్స్ పుస్తకాలన్నీ కూడా సర్వనాశనమైపోయినా, కలిగే భారీ నష్టమేమీ ఉండదు. ఎందుకంటే ఆ శాస్త్రజ్ఞులు మళ్ళీ ప్రయోగాలు చేయగలరు. మళ్ళీ ఒక న్యూటనో, ఒక ఐన్‌స్టీనో పుట్టుకువచ్చి, జ్ఞానాన్ని మళ్ళీ అందచేయగలరు.

కాని మన వేదాల విషయంలో అలా కాదు. వేదాల్లో ఉన్న పదాలే జ్ఞానం. వైజ్ఞానిక శాస్త్రంలో లాగ ఎక్కడ్నుంచో సేకరించిన జ్ఞానాన్నివ్వవు. అవే జ్ఞానానికి మూలం. వేదం లేదా ఉపనిషత్తులే మనకు ప్రమాణాలు కాబట్టి, అవి చెప్పే మాటలే జ్ఞానం. దాన్ని వేరే మూలంనుంచి పొందలేము.

కాని వచ్చిన చిక్కేమిటంటే, ఉపనిషత్తులు చెప్పే అంశాన్ని మనం తేలిగ్గా అర్థం చేసుకోలేము. ఉపనిషత్తులను తెరవటానికి కాని, వాటి సారాంశాన్ని అర్థం చేసుకోవటానికి కాని మన దగ్గర తాళం చెవి లేదు. ఆ తాళం చెవి ఒక్క జ్ఞానులూ, ఆచార్యుల దగ్గర మాత్రమే ఉంది. వారు మనకు ఆత్మజ్ఞానమనే అద్దాన్ని చూపించి, మన గురించిన జ్ఞానం పొందేలా చేయగలరు.

ఈ ఆచార్యులు లేదా గురువులు, వారెలా ఆత్మజ్ఞానాన్ని పొందారు? వారి గురువునుంచి. వారి గురువు ఎలా ఆత్మజ్ఞానాన్ని పొందారు? వారి గురువునుంచి.

అలా వెనక్కి వెళుతూ రావాలి. దీన్ని గురుశిష్యపరంపర అంటారు. గురువు ఏం చేస్తాడు? ఒక క్రమపద్ధతిలో, శాస్త్రం చేసిన బోధను శిష్యునికి అందచేస్తాడు. అందువల్లనే ప్రతి ఒక్క ఉపనిషత్తు కూడా గురుశిష్యుల సంవాదానికి ప్రాముఖ్యతనిస్తుంది. ఎప్పుడూ శిష్యుడు గురువుని సమీపించి, తనకు కావాల్సిన విషయం గురించి ప్రశ్న వేస్తే, దానికి జవాబుగా గురువు బోధ చేస్తాడు. నారదుల వారు సనత్కుమారుని సమీపించి బోధ చేయమని అడగటం చూశాము.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా। - గీత 4 - 34**

గురువు సమీపానికి వెళ్ళి, వారిని ప్రశ్నలడిగి, వారికి సేవలు చేసి జ్ఞానాన్ని పొందు అంటాడు కృష్ణపరమాత్మ. భగవద్గీత కూడా గురుశిష్యుల సంవాదం రూపంలోనే బోధింపబడింది. కృష్ణార్జునుల సంవాదం అంటారు దీన్ని.

ఆ విధంగా ఆత్మ జ్ఞానం పొందాలంటే సంసిద్ధమైన బుద్ధి ఉండాలి. శాస్త్రం ఉండాలి. గురువు ఉండాలి. ఈ మూడింటి మేలుకలయిక ఉంటే ఆత్మజ్ఞానం తేలిగ్గా కలుగుతుంది. గురుశాస్త్ర ఉపదేశంద్వారా సంసిద్ధమైన బుద్ధిలో ఆత్మజ్ఞానం కలుగుతుంది.

# స్వామీజీ సూక్తిముక్తావళి

గురువు శిష్యునితో అంతా మిథ్య అని చెప్పాడు. ఒక వీధికుక్క వారిని తరుముకువస్తుంటే ఇద్దరూ పరుగులు పెట్టారు. కుక్క మిథ్య అయినప్పుడు వారెందుకు పరుగులు పెట్టినట్టని అడిగాడు శిష్యుడు. 'మనం పరుగెత్తటం కూడా మిథ్యే. మన మిథ్యా శరీరాన్ని, మిథ్యా కుక్కనుంచి రక్షించుకోవటానికి పరుగులు పెడుతున్నాము,' అన్నాడు గురువు.

# 22. ఆత్మజ్ఞానం ఎందుకు పొందాలి?

**పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో**
**నిర్వేదమాయాన్నాస్త్యకృతః కృతేన**
**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్**
**సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్ - ముండకమ్ 1-2-12**

ముండకోపనిషత్తులోని ఈ మంత్రం మూడు విషయాలను సూచిస్తుంది. అవి- తెలివిగా ఎలా జీవించాలి. ఆత్మజ్ఞానం ఎందుకు పొందాలి, ఆత్మజ్ఞానం పొందటానికి గురువు దగ్గరకు ఎందుకు వెళ్ళాలి? వాటిని వివరంగా చూద్దాము.

**1. తెలివిగా ఎలా జీవించాలి?-** జీవితంలో ఎదురయ్యే అనుభవాలను తెలివిగా పరీక్షించుకోవటమే తెలివిగా జీవించటం.

**పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణః -**
**బ్రాహ్మణః కర్మచితాన్ లోకాన్ పరీక్ష్యేత్॥**

పై వాక్యాన్ని ఇలా అన్వయించుకోవాలి.

**బ్రాహ్మణః -** బ్రాహ్మణః పదానికి అనేక అర్థాలు ఉన్నాయి. వేదం చెప్పిన ప్రకారం జీవనం నడిపేవాడు అని ఒక అర్థం. వేదాన్ని నమ్ముతాడు కాబట్టి, అతన్ని వైదికుడు అని అంటారు. మనం స్టేషన్లలో **'మే ఐ హెల్ప్ యు'** కౌంటర్లు చూస్తాము.

అలాగే వేదం కూడా **మే ఐ హెల్ప్ యూ** అనే బోర్డు పట్టుకుని ఉంటుంది. అంటే తనంతట తను వచ్చి తన భావాలను మనమీద రుద్దదు. కాని మనం అవస్థపడుతుంటే, సహాయం చేయటానికి సిద్ధంగా ఉన్నాను అంటుంది. అది కూడా పైసా ఖర్చు లేకుండా. అందువల్ల వేదం సహాయం తీసుకున్న వ్యక్తిని వైదికుడు లేదా బ్రాహ్మణుడు అంటారు.

మనకు లౌకిక విద్యకు ఐదు ప్రమాణాలు ఉన్నాయి. వాటివల్ల ఆత్మజ్ఞానం పొందలేము. వేదాలు ఆరవప్రమాణం కిందకు వస్తాయి. మనం వేదప్రమాణాన్ని వాడటానికి సిద్ధంగా ఉన్నాము. 'ఓ వేదమా, నేనేం చేయాలి?' అని అడిగాము. వేదం ఏమంటుంది?

**కర్మచితాన్ లోకాన్ పరీక్ష్యేత్ -** లోకాన్ని పరీక్షించు. లోకంలోని కొన్ని సత్యాలు తెలియాలంటే లోకాన్ని పరీక్షించాలి. పరీక్ష చేయందే విషయం తెలియదు. దేన్ని పరీక్షించాలి? లోకాన్ - లోకం అంటే మామూలు అర్థం ప్రపంచం. లోకంలో

మనుష్యులు, వస్తువులు, పరిస్థితులు ఉంటాయి. కాబట్టి వీటన్నింటివల్ల కలిగిన అనుభవాల కింద తీసుకోవచ్చు.

**లోక్యతే అనుభూయతే ఇతి లోకః॥**

ప్రతి ఒక్క అనుభవం కూడా, సరిగ్గా గమనిస్తే మనం నేర్చుకోవటానికి, ఎదగటానికీ తోడ్పడుతుంది. దీన్ని కర్మయోగం కింద కృష్ణపరమాత్మ వివరంగా గీతలో వివరిస్తాడు. కర్మయోగం అంటే నేర్చుకోవటం.

శాస్త్రం ప్రకారం మనం మూడు పాత్రలను ధరిస్తాము. **కర్తా, భోక్తా, జ్ఞాతా.** కర్తా అంటే కర్మ చేసేవాడు, భోక్తా అంటే అనుభవించేవాడు, జ్ఞాతా అంటే నేర్చుకునేవాడు. మనం ఎక్కువగా కర్తగానో, భోక్తగానో ప్రవర్తిస్తుంటాము. ఏదైనా చేస్తూనో, ఏదైనా అనుభవిస్తూనో ఉంటాము తప్ప ఏదైనా నేర్చుకోవటానికి ప్రయత్నించము.

**2. ఆత్మజ్ఞానం ఎందుకు పొందాలి?** మనకు గనుక నేర్చుకునే మనస్సు ఉంటే, ప్రతి ఒక్క అనుభవమూ, ముఖ్యంగా బాధాకరమైన అనుభవం, మనకు జీవితంలో విలువైన పాఠాలను బోధించగలదు. ఎదురు దెబ్బలు పెద్ద గుణపాఠాలు. కాకపోతే ఆ పాఠాలు పైకి తెలిసేలా ఉండవు. అంతర్లీనంగా ఉంటాయి. మనకు తెలుసుకునే తపన ఉంటేనే వాటిని వెలికి తీసి అర్థం చేసుకోగలము. భోక్తా, జ్ఞాతా అవటానికి ఇష్టపడము సాధారణంగా. అందువల్ల ఎదురుదెబ్బలు తింటే అవస్థపడతాము. అందువల్ల భోక్తగాకన్నా జ్ఞాతగా ఉండమని, పాఠాలు నేర్చుకోమనీ చెబుతున్నది శాస్త్రం. మనం మనిషిగా పుట్టినందుకు నేర్చుకోవాలి, నేర్చుకుని పైకి ఎదగాలి. బ్రాహ్మణుడు అంటే వేదాన్ని పాటించేవాడు అని చూశాము.

బ్రాహ్మణునికి ఇంకో అర్థం కూడా ఉంది. సత్వగుణప్రధానుణ్ణి కూడా బ్రాహ్మణుడని అంటారు. ఒక సిస్టమ్‌లో త్రీ ఇన్ వన్ ఉంటుంది. సిడి ప్లేయర్, రికార్డుప్లేయర్, రేడియో. ఏది కావాలో అది సెలక్ట్ చేసుకోవటానికి సెలెక్టర్ నాబ్ ఉంటుంది. అలాగే మన సిస్టమ్‌లో కూడా త్రీ ఇన్ వన్ ఉంది. కర్తా, భోక్తా, జ్ఞాతా– శాస్త్రం ఎప్పుడూ జ్ఞాతగానే ఉండమంటుంది. అలా ఉండాలంటే సత్వగుణం ఉండాలి.

లోకాలు అంటే అనుభవాలు. వేదం ఇంకో పదం కలిపింది దానికి. కర్మచితాన్. చాలా ముఖ్యమైన పదం.

**చి-** అంటే పొందటం. **చితః** అంటే పొందిన; దేనిద్వారా పొందిన? **కర్మ-** గత కర్మలవల్ల; ఏం పొందాము? **లోకాన్-** అనుభవాలు. ఇవన్నీ కలిపితే- నేను ఇప్పుడు పొందిన అనుభవాలు నేనే గతంలో చేసుకున్న కర్మల ఫలం తప్ప వేరే ఏమీ కాదు. ఈ అనుభవాలను నాకు జగత్తు ఇవ్వటం లేదు. మనుష్యులు ఇవ్వటం లేదు. ఆఖరికి ఆ దేవుడు కూడా ఇవ్వటం లేదు. ఒకవేళ దేవుడు ఇస్తున్నాడనుకుంటే, దేవుడు పక్షపాతవైఖరి చూపినట్టు అవుతుంది. అవి అక్షరాలా నేను చేసుకున్న కర్మ ఫలాలు.

**చేసుకున్నవారికి చేసుకున్నంత మహాదేవా**

నా కష్టసుఖాలకు నేనే కారణం. గ్రహాలుకాదు. మనుష్యులూ కాదు. నేను కోరి తెచ్చుకున్నాను. ఇది అక్షరాలా కర్మసిద్ధాంతం ప్రకారం జరుగుతున్నది. ఈ విషయం నేను అర్థం చేసుకుంటే ఎవరినీ నిందించను, దేనికీ బాధపడను. ఇది తెలియకపోతే, ఒక చిన్న కష్టం రాగానే **నాకే ఎందుకు వచ్చింది** అని వాపోతాను. దేవుడు నాకు అన్యాయం చేశాడని ఆయనను నిందించటానికి కూడా వెనుకాడను. దానివల్ల మనస్సు ప్రశాంతంగా ఉండదు. ప్రశాంతంగా లేని మనస్సులో ఏమీ నేర్చుకోలేను. అందువల్ల నాకే ఎందుకు అని బాధపడకుండా వచ్చిన దాన్ని ఈశ్వరప్రసాదంగా స్వీకరించటం నేర్చుకోవాలి.

**సమత్వం యోగ ఉచ్యతే॥ గీత 2-48**

ఇది కర్మయోగం. ముండక మంత్రంలోని మొదటి భాగం అయింది. **నిర్వేదమాయాత్-** కర్మయోగంతో కూడిన జీవితం నేను నడిపితే ఏమవుతుంది? నిర్వేదం కలుగుతుంది. నిర్వేదం పదాన్ని యథాతథంగా కృష్ణపరమాత్మ తన గీతలో ఉపయోగించాడు.

**యదా తే మోహకలిలం బుద్ధిర్వ్యతితరిష్యతి।**
**తదా గంతాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ॥ - గీత 2-52**

మోహకలిలం అంటే బుద్ధిలో ఉన్న తప్పుడు అవగాహన. ఏమిటా తప్పుడు అవగాహన? ప్రపంచం నాకు భద్రతను ఇస్తుందనే భావన. మనం పుదుతూనే అభద్రతకు లోనవుతాము. అందువల్లనే చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు తల్లి కొంగుచాటున దాక్కుంటాము. పెద్దవారమవుతున్నకొద్దీ అదే భద్రతను అనుబంధాలలో, పరిస్థితులలో, ఐశ్వర్యంలో, హోదాలో వెతుక్కుంటాము. కాని వేదం ఇది మనం చేసే ప్రాథమిక తప్పు అంటున్నది.

**అకృతః నాస్తి** – కృతః అంటే కర్మజన్యః కర్మ అంటే దానికొక ఆరంభం ఉంటుంది. ఆరంభం ఉన్న దేనికైనా అంతం ఉంటుంది. అందువల్ల కృతః అనిత్యః అవుతుంది. అకృతః అంటే దానికి వ్యతిరేకం. అందువల్ల అకృతః నిత్యపదార్థం అవుతుంది. అకృతఃనాస్తి అంటున్నది మంత్రం. అంటే అటువంటి నిత్యపదార్థం 14 లోకాల్లో వెతికిచూసినా ఎక్కడా లేదంటున్నది. ఎందుకంటే కఠోపనిషత్తులో యమధర్మరాజు నా వలను పద్నాలుగు లోకాల్లో వేశాను అంటాడు. అందువల్ల ఏదీ శాశ్వతం కాదు.

శాశ్వతం కాకపోతే ఏం? శాశ్వతం కానిది ఏదైనా ఎప్పుడో అప్పుడు వెళ్ళిపోతుంది. మనం కొనే మందులమీద ఎక్స్‌పైరీ డేట్ ఉంటుంది. కాని మన ఎక్స్‌పైరీ డేట్ మనకు తెలియదు. మనం ఎప్పుడు పోతామో తెలియదు. నేనే శాశ్వతం కానప్పుడు, వస్తువు కూడా కాదు. అలా ఒక వస్తువు శాశ్వతం కానప్పుడు, అది నాకు భద్రతనెలా ఇవ్వగలదు?

**భజ గోవిందం భజ గోవిందం గోవిందం భజ మూఢమతే॥**

గోవిందుణ్ణి భజించు అన్నారు శంకరులవారు. ఎందువల్లనంటే బాహ్యవస్తువుల్లో భద్రత లేదు. ఎప్పుడైతే భద్రత లేదో, అప్పుడే శాంతి లేదు. శాంతి అంటే **'రెండు యుద్ధాల మధ్యనున్న సమయం,'** అన్నారెవరో! శాంతి లేకపోతే ఆనందం కూడా లేదు.

**కృతేన (కిం ప్రయోజనం?)** కిం ప్రయోజనం మనం కలుపుకోవాలి. అనిత్యఫలకేన కిం ప్రయోజనం? అందువల్ల బ్రాహ్మణుడు కర్మ చేయటంవల్ల తనకు కావాల్సింది పొందలేనని, లోకాన్ని పరీక్ష చేసి, తెలుసుకుంటాడు. తనకు కావాల్సినవి ఏమిటి? శాంతి, భద్రత, ఆనందం. ఈ విశ్లేషణ చేయగలగటమే వివేకం చూపించటం. ఈ వివేకం కలిగితే, మోహం తొలగిపోతుంది. లౌకిక విషయాలమీద మన భ్రమ ఎంత ఎక్కువగా ఉంటే, మన వ్యామోహం కూడా అంత ఎక్కువగా ఉంటుంది. ఎప్పుడైతే అది తప్పు అని గ్రహిస్తామో, అప్పుడే మన వ్యామోహం కూడా తగ్గుతుంది.

**నిర్వేదమాయాత్**– నిర్వేదం అంటే వైరాగ్యం. ఇక్కడ ఒక విషయం జాగ్రత్తగా గమనించాలి. లౌకిక విషయాల్లో శాంతి, భద్రత, ఆనందం లేవని తెలుసుకుంటే, నాకు నిర్వేదం కలుగుతుంది అన్నాము. నిర్వేదం అంటే ద్వేషం కాదు. రాగం ఎంత తప్పో ద్వేషం కూడా అంతే తప్పు. రాగద్వేషాలను తగ్గించుకోవాలి. బట్టల షాపుకెళ్ళి చెప్పులు అడగలేము కదా అలాగే అశాశ్వతమైన ప్రపంచంలో శాశ్వతత్వం

లేదని తెలుసుకుంటే, మనకు వైరాగ్యం కలుగుతుంది. అంటే రాగద్వేషాలు తొలగుతాయి. దీన్నే సాధనచతుష్టయసంపత్తి అంటారు. దీన్నే పూజ్యస్వామీజీ **ఎమోషనల్ మెచ్యూరిటీ** (భావపరిపక్వత) అంటారు. బుద్ధి ఉపయోగించి తెలివిగా జీవిస్తే, మనస్సులో భావపరిపక్వత పెరుగుతుంది. (ఇదంతా పూజ్యస్వామీజీ చెప్పిందే అంటారు పరమార్థానంద స్వామీజీ. అలా ఆయన గురువు గురించి చెప్పకుండా ఉండలేరు. దీనిద్వారా గురువుమీద ఆయనకున్న ఎనలేని శ్రద్ధ తెలుస్తుంది.)

**3 గురువుదగ్గరకు ఏందుకు వెళ్ళాలి? – స గురుమేవాభిగచ్ఛేత్ –** మూడవ భాగంలోకి అడుగుపెడుతున్నాము. శాంతి, భద్రత, ఆనందాలు అశాశ్వతమైన ప్రపంచంలో లేకపోతే, అవి ఎక్కడ దొరకుతాయి? అశాశ్వతమైన ప్రపంచంలో దొరకవు అంటే అర్థమేమిటి? శాశ్వతమైన చోట దొరకుతాయి అని. కాని అలాంటి శాశ్వతమైన చోటు ఉందా? అతను ఏ వేదమైతే నేర్చుకుంటున్నాడో ఆ వేదమే నిత్యవస్తువు ఉంది అంటున్నది.

అతను వేదం నేర్చుకుంటున్నాడని ఎలా తెలుసు? బ్రాహ్మణపదం వేసింది ముందు. బ్రాహ్మణుడు అంటే వైదికుడు, వేదాలను నేర్చుకునేవాడు అని చూశాము. నిత్యవస్తువు ఉందంటే ధైర్యం వస్తుంది. ఒక రోగంతో డాక్టరు దగ్గరకి భయం భయంగా వెళతాము. అతను రోగనిర్ధారణ చేసి ఇది ప్రమాదమైనది కాదు, ఫలానా రోగం అని చెప్పగానే ధైర్యం వస్తుంది. మందు కూడా వేసుకోకుండానే వస్తుంది ఆ ధైర్యం. ఇప్పుడలాంటి ధైర్యం ఇస్తున్నది వేదం. నిత్యవస్తువు ఉంది అంది. బాగానే ఉంది. కాని ఆ నిత్యవస్తువు ఏమిటి, ఎంత దూరంలో ఉంది?

**తత్త్వమసి**

ఆ నిత్యవస్తువువు నువ్వే అంది. ఒక పిడుగులాంటి వార్త వేసింది. మీరు ఎదురుచూస్తున్న ఎవరినైనా చూడగలరు కాని, మీకోసం మీరు ఎదురుచూడలేరు. మీకోసం ఎదుటివారు ఆగగలరు కాని మీకోసం మీరు ఆగలేరు కదా!

**వెతుకుతున్న నువ్వే, వెతకబడే ఆనందం**

ఈ వార్త వినగానే ఆశ్చర్యంగా ఉంటుంది. వినటానికి బాగానే ఉన్నా నమ్మలేము. అలాగని నమ్మకుండానూ ఉండలేము. మన అనుభవమేమో మనం అనిత్యం అని చెబుతున్నది. వేదమేమో, మనం నిత్యం అని చెబుతున్నది. వేదం అంటే గౌరవం ఉంది. వేదం మాటను కొట్టిపారేయలేము, అలాగని మన

అనుభవాన్నీ తీసిపారేయలేము. అందువల్ల పెద్ద సంశయం– నేను నిత్యమా, అనిత్యమా? ఆత్మ విషయంలో సంశయం.

ఎప్పుడు సందేహం ఉంటే, అప్పుడు ఆ విషయాన్ని లోతుగా విశ్లేషించాలి. దాని గురించిన విచారణ చేయాలి. ఆత్మ విచారణ చేయాలి. ఎక్కడనుంచి ఎక్కడికి వచ్చామో చూడండి. నేను నిత్యం అని తెలుసుకుంటే నాకెప్పటికీ భద్రత ఉంటుంది. డబ్బులో భద్రత ఉంటే, ఐశ్వర్యవంతులందరూ శాంతి, భద్రతలతో తులతూగాలి కదా! అలా లేదే? అందువల్ల భద్రత నిత్యవస్తువులోనే ఉందని అర్థమయింది. ఆ నిత్యవస్తువును నేనే అంటున్నది శాస్త్రం.

నా గురించి నేను ఎలా తెలుసుకోవాలి? కఠోపనిషత్తులో చెప్పినట్టుగా, నా ఇంద్రియాలన్నీ బాహ్యాముఖంగా అమర్చబడ్డాయి. కళ్ళు బాహ్యంగా చూడగలవుకాని నన్ను చూడలేవు. నా కళ్ళతో నేను ప్రపంచాన్ని చూస్తాను. కాని ఆ కళ్ళు నన్ను చూడలేవు. అందువల్ల ఆత్మ ప్రత్యక్షప్రమాణాలకు అందదు.

నా మొహాన్ని చూడటానికి నేను ఎలాగైతే అద్దాన్ని వాడతానో, అలా నా గురించి నేను తెలుసుకోవటానికి గురుశాస్త్రదర్పణం వాడతాను.

**తత్విజ్ఞానార్థమ్** – ఆ జ్ఞానం పొందటానికి; అంటే ఆత్మజ్ఞానం పొందటానికి;

**స గురుమేవాభిగచ్ఛేత్–** గురువు దగ్గరకి వెళ్ళాలి. వేరే మార్గం లేదని గట్టిగా చెబుతున్నారు శంకరులవారు. శాస్త్రాన్ని స్వంతంగా అధ్యయనం చేయకూడదు. గురువు దగ్గరకు ఎలా వెళ్ళాలి?

**సమిత్పాణిః** – సమిధలు తీసుకుని వెళ్ళాలి. సమిధలు అంటే ఎండుపుల్లలు. యజ్ఞంలో ఆహుతిగా వేయగానే భగ్గుమంటుంది అది. శిష్యుడు అది తీసుకువెళ్ళటంలో ఉద్దేశ్యం, నేనుకూడా జ్ఞానాగ్నిని అందుకోవటానికి సిద్ధంగా ఉన్నాను, అంటే నా మనస్సు సిద్ధంగా ఉంది అని చెప్పటం అన్నమాట.

**శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్** – బ్రహ్మజ్ఞానం పొంది తన ఆత్మస్వరూపంలో నెలకొని ఉన్న గురువును బ్రహ్మనిష్ఠ అంటారు. నిత్య ఆత్మస్వరూపనిష్ఠః. మనమే గడ్డిపోచలా కొట్టుకుపోతున్నప్పుడు, మనకు ఆధారంగా ఇంకో గడ్డిపోచను పట్టుకోలేము కదా! బ్రహ్మనిష్ఠలో ఉన్న గురువే మనను తరింపజేయగలడు. శ్రోత్రియం – శ్రుతి చెప్పిన బోధను, శ్రుతి చెప్పినట్టుగా గురుశిష్యపరంపరగా అందజేయగలిగిన గురువు. అటువంటి గురువును మీరు విద్యను బోధించమని కోరితే, తక్కిన పని అంతా ఆయనే చూసుకుంటాడు.

ఈ మంత్రం సారాంశం ఒక్కముక్కలో చెప్పాలంటే, ఈ లోకంలో జరిగే అనుభవాలను పరిశీలించి, అశాశ్వతమైన ప్రపంచం శాశ్వతమైన ఆనందాన్ని ఇవ్వలేదని గ్రహించాలి. తర్వాత శాశ్వతమైన ఆనందం నాలోనే ఉంది. నానుంచే నేను పొందాలి. దానికి నేను ఆత్మజ్ఞానం పొందాలి అని అర్థం చేసుకోవాలి. అప్పుడు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు దగ్గరకు సమిధలు తీసుకుని, ఆత్మజ్ఞానం పొందటానికి వెళ్ళాలి.

## స్వామీజీ సూక్తిముక్తావళి

జ్ఞానం పొందాక, ఈ ప్రపంచం కాని, మీ అనుభవాలు కాని ఏమీ మారవు. అవి అంతకుముందు ఎలా ఉన్నాయో అలాగే ఉంటాయి. కాని వాటిని చూసే మీ దృక్కోణంలో మార్పు వస్తుంది. అదెలాగంటే మీ ఇల్లు మీరు అమ్మేశాక కూడా, అదే ఇంట్లో మీరు అద్దెకుంటున్నట్టన్నమాట. ఇప్పుడు అదే ఆస్తిని మీరు 'అద్దెకున్నవ్యక్తి' దృక్కోణంలో చూస్తారు. మీ స్వంతం అనుకోరు.

శాంతి, భద్రత, ఆనందాలు అశాశ్వతమైన ప్రపంచంలో లేకపోతే, అవి ఎక్కడ దొరకుతాయి? అశాశ్వతమైన ప్రపంచంలో దొరకవు అంటే అర్థమేమిటి? శాశ్వతమైన చోట దొరకుతాయి అని. కాని అలాంటి శాశ్వతమైన చోటు ఉందా? అతను ఏ వేదమైతే నేర్చుకుంటున్నాడో ఆ వేదమే నిత్యవస్తువు ఉంది అంటున్నది.

# 23. ఆత్మజ్ఞానం బుద్ధిలో కలుగుతుందా?

గురుపూర్ణిమ రోజు గురువుకు ప్రాముఖ్యతనిస్తాము. ఆరోజు మొత్తం గురుపరంపరకు ప్రార్థన చేస్తాము. నా గురువుకు గురువు, ఆ గురువుకు గురువు అలా వెనక్కి వెళితే ఆదిగురువుకు వెళతాము. ఆయనే నారాయణుడు. నారాయణుడికి గురువు ఉండడు.

**నారాయణం పద్మభువం వసిష్ఠం, శక్తిం చ తత్పుత్ర పరాశరం చ।**
**వ్యాసం శుకం గౌడపదం మహాన్తం, గోవిన్దయోగీంద్రమథాస్య శిష్యమ్ ॥**
**శ్రీ శఙ్కరాచార్యమథాస్య పద్మపాదం చ, హస్తామలకం చ శిష్యమ్ ।**
**తం తోటకం వార్తికకారమన్యాన్ అస్మద్గురూన్ సన్తత మానతోస్మి ॥**

ఇది విష్ణుమూర్తిపరంగా చెపితే! అదే శివునిపరంగా చెబితే–

**సదాశివసమారంభాం శంకరాచార్యమధ్యమామ్।**
**అస్మదాచార్యపర్యంతాం వందే గురుపరంపరామ్॥**

రెండింటిలోనూ ఆదిగురువుతో మొదలుపెట్టి అస్మద్గురుం – నా గురువువరకూ నమస్కారాలు అంటాము. గురువును ఎన్నో కోణాల్లో కొలుస్తాము. భక్తి, ముక్తి ప్రదాత అంటాము.

ఇక్కడ తక్కిన అంశాలను కొలవకుండా, జ్ఞానదాతగా కొలుస్తాము. గురువుకు ఒక అర్థం **ఆత్మజ్ఞానాన్ని ఇచ్చే గురువు** అని.

గురుగీతలో కూడా ఈ అర్థం వస్తుంది. గు అంటే అంధకారం; రు అంటే తొలగించేవాడు. రు అంటే వాచ్యార్థం దీపం. ఇప్పుడు గురువు పదాన్ని కలిపితే అంధకారాన్ని తొలగించే దీపజ్యోతి. అంధకారం రెండు రకాలు– బాహ్య అంధకారం, ఆంతర అంధకారం. బాహ్య అంధకారాన్ని దీపం వెలిగిస్తే తొలగించవచ్చు. కాని ఆంతర అంధకారాన్ని దీపాలతో తొలగించలేము.

వంద సూర్యులు బాహ్యంగా ఉదయించి, ప్రకాశించినా; వంద చంద్రులు బాహ్యంగా ఉదయించి ప్రకాశించినా, వారు ఆంతర అంధకారాన్ని తొలగించలేరు. జ్ఞానం ఒక్కటే అజ్ఞానమనే ఈ చీకటిని తొలగించగలదు.

**తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్।**
**దదామి బుద్ధియోగం తం యేన మాముపయాంతి తే॥**

**తేషామేవానుకంపార్థమ్ అహమజ్ఞానజం తమః।**
**నాశయామ్యాత్మ భావస్థో జ్ఞానదీపేన భాస్వతా॥ - గీత 10-10,11**

నిరంతరం నాయందే లగ్నమై భక్తిశ్రద్ధలతో నన్ను భజించువారికి నేను బుద్ధియోగాన్ని ప్రసాదిస్తాను. వారి అంతఃకరణములలో ఉన్న నేను, వారిని అనుగ్రహించటానికి తత్త్వజ్ఞానరూపదీపాన్ని వెలిగించి, వారి అజ్ఞానాంధకారాన్ని పారద్రోలుతాను.

ఈ రోజు కృష్ణపరమాత్మను పూజిస్తారు. కంసుని హతమార్చినందుకు కాదు, ఆదిగురువుగా ప్రార్థిస్తారు. గురుపూర్ణిమ విశిష్టతను అర్థం చేసుకోవాలంటే ముందు అసలు జ్ఞానం అంటే ఏమిటో తెలుసుకోవాలి.

ఏ జ్ఞానాన్నైనా కూడా బుద్ధితోనే పొందుతాము. అదే సూత్రాన్ని ఇంకా పొడిగిస్తే, ఆత్మజ్ఞానాన్ని కూడా బుద్ధితోనే పొందుతాము. లౌకిక జ్ఞానం ఎలా బుద్ధిని ఉపయోగించి అర్థం చేసుకుంటామో, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని కూడా అలా బుద్ధిని ఉపయోగించే అర్థం చేసుకోవాలి. ఏ జ్ఞానం కూడా స్థూలశరీరంలోనో, ఆత్మలోనో కలగదు. ఆత్మ అప్రమాత, అందువల్ల ఆత్మ పొందలేదు. శరీరం జడం, అందువల్ల శరీరం పొందలేదు. పారిశేషన్యాయంద్వారా (రెండూ తీసివేయగా మిగిలింది తీసుకోవాలి) బుద్ధిద్వారానే జ్ఞానం పొందగలము.

ఎప్పుడైతే జ్ఞానం పొందటానికి బుద్ధికావాలి అని తెలుసుకుంటామో, అప్పుడే దానికి తర్కం కూడా జోడించాలి. ఎందుకంటే బుద్ధికి ఒకటే భాష తెలుసు. అది తర్కం. ఆత్మజ్ఞానానికి కూడా బుద్ధి+ తర్కం కావాలి.

కాని ఇక్కడ మనకు ఒక సందేహం కలుగుతుంది. ఎందుకంటే శాస్త్రం, ఆత్మజ్ఞానం ఈ రెండింటికీ అంటే బుద్ధికీ, తర్కానికీ అందదని చెబుతుంది.

**న తత్ర చక్షుర్గచ్ఛతి న వాగ్గచ్ఛతి నో మనః। కేన 1-3**
**యన్మనసా న మనుతే। కేన 1-6**

దీనిద్వారా మనస్సు తెలుసుకోలేదని తెలుస్తున్నది. ఇప్పుడు తర్కానికి-

**నైషా తర్కేణ మతిరాపనేయా॥ కఠ 1- 2 -9**

తర్కం కూడా తెలుసుకోలేదు అని శాస్త్రం చెబుతున్నది. అలాంటప్పుడు ఆత్మజ్ఞానానికి కూడా బుద్ధి+తర్కం కావాలని ఎలా చెప్పగలదు? శంకరాచార్యులవారు బుద్ధి+తర్కం కావాలని తార్కికంగా నిరూపిస్తారు. బ్రహ్మసూత్రాల్లో జన్మాధికరణం అనే అధికరణంలో ఈ విషయం చూస్తాము.

**శంకరాచార్యులవారి జవాబు**

**ఎ) బుద్ధి గురించి –** బుద్ధి, తర్కం రెండు రకాలు ఉన్నాయి.

1. ఈ రెండూ ప్రత్యక్షప్రమాణంమీద ఆధారపడి ఉన్నాయి.
2. ఈ రెండూ శాస్త్రంమీద ఆధారపడి ఉన్నాయి.

అందువల్ల జ్ఞానం బుద్ధికి అందదు దానికి అతీతంగా ఉంది అని వస్తే, అది శాస్త్రంమీద ఆధారపడని బుద్ధి, ప్రత్యక్షప్రమాణంమీద ఆధారపడిన బుద్ధి అని అర్థం చేసుకోవాలి. ఈ విషయాన్నే భగవద్గీత భాష్యంలో కూడా రెండవ అధ్యాయంలో చెబుతారు. ఆత్మజ్ఞానం పొందేది బుద్ధివల్లనే. మామూలు బుద్ధి కాదు, శాస్త్ర ఆచార్య ఉపదేశంతో సంస్కరించబడ్డ బుద్ధి.

శాస్త్ర ఆచార్య ఉపదేశ సంస్కృతం మనః ఆత్మజ్ఞానే కరణం

ఈ విషయం ఉపనిషత్తు కూడా వేరే సందర్భాలలో చెబుతుంది.

**మనసైవేదమాప్తవ్యమ్।** **కఠ 2-1-11**

**దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా ।**

**సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః॥** **కఠ 1-3-12**

సూక్ష్మబుద్ధి అంటే ఇంతకు ముందు చూసినట్టుగా శాస్త్ర ఆచార్య ఉపదేశంవల్ల సంస్కరించబడ్డ బుద్ధి.

**బి) తర్కం గురించి–** తర్కం కూడా ఆత్మజ్ఞానం పొందటానికి కావాలని చెబుతారు శంకరులవారు. ఉపనిషత్తే ఆత్మజ్ఞానం పొందటానికి శ్రవణం, మననం, నిదిధ్యాసనంచేయాలి అని చెబుతుంది. మననంలో నిశ్చయజ్ఞానం కలుగుతుంది. నిశ్చయజ్ఞానం కలగాలంటే తర్కం ఉపయోగించాలి. అలాగే పండితుడు, మేధావి పదాలను వాడుతుంది శాస్త్రం. మేధావి అంటే తన బుద్ధి కుశలతను ఉపయోగించి, తార్కికంగా ఆలోచించేవాడు. అతన్ని తర్కకుశలత ఉన్నవాడు అంటారు. కాని కేవలం తర్కం గురించి కాదు ఇక్కడ చెప్పేది, కేవలం తర్కం ఉపయోగిస్తే దాన్ని దుష్తర్కం అంటారు. మరి ఎటువంటి తర్కం ఉపయోగించాలి? **శ్రుతిసమ్మత తర్కం** ఉపయోగించాలి. ఎవరైనా గురువు, శాస్త్రాన్ని పట్టించుకోకు, శాస్త్రాన్ని వదిలెయి అని చెపితే అతను సాంప్రదాయ గురువు కాదు. అందువల్ల మనకు ఆత్మజ్ఞానం పొందాలంటే బుద్ధి+ తర్కం కావాలి. అవి శాస్త్రంమీద, గురువు శాస్త్రాన్ని ఆధారం చేసుకుని చేసిన బోధమీద ఆధారపడి ఉండాలి.

అందువల్ల **జ్ఞానం = శాస్త్రవిచారణ** అంటారు. శాస్త్రవిచారణలో రెండు పదాలు ఉన్నాయి కాని, మూడు అంశాలు ఉన్నాయి. 1. శాస్త్రం, విచారణ. విచారణ అంటే తార్కిక విశ్లేషణ. తర్కం వచ్చింది అంటే బుద్ధి వచ్చిందా లేదా? తార్కిక విశ్లేషణ జ్ఞానాన్ని పెంపొందించేది ఎందులో? బుద్ధిలో! అందువల్ల విచారణ అనే పదంలో బుద్ధి, న్యాయం(తర్కం) రెండూ ఉన్నాయి. అందువల్ల శాస్త్రవిచారణ అంటే **శాస్త్రం+ బుద్ధి+ న్యాయం.** బుద్ధిలో కలిగే జ్ఞానం.

ఆత్మజ్ఞానం పొందటానికి మీరు బుద్ధి, తర్కం వాడటానికి సిద్ధంగా ఉన్నారు. ఇవి వాడొద్దనిచెప్పే గురువును పట్టించుకోకుండా ఉండటానికి కూడా సిద్ధంగా ఉన్నారు. కాని శాస్త్రం చెప్పేది, మీ అంతట మీకు అర్థం కాదు. శాస్త్రం తెలుసుకోవటానికి సాంప్రదాయ 'కీ' (తాళం చెవి) ఉండాలి. అది లేకపోతే మీకు అర్థం కాదు. అర్థం కాకపోయినా ఫర్వాలేదు, తప్పుగా అర్థం చేసుకుంటే ప్రమాదం.

ఈ సందర్భంలో స్వామీజీ తనకు కలిగిన ఒక అనుభవాన్ని ఉటంకిస్తున్నారు. ఒకసారి స్వామీజీ ఎవరింటికో వెళ్ళారుట. వారు ఆయన వచ్చేముందు టీవీ పెట్టారుట. స్వామీ వివేకానందమీద ఏదో కార్యక్రమం వస్తున్నదట. అది బాగుంది, ముందే పెట్టాల్సిందనుకుని, ఏమిటా కార్యక్రమం,రోజూ వస్తుందా, వారానికి ఒకసారి వస్తుందా తెలుసుకుందామనుకుని ఆ రోజు పేపరు చూశారుట. ఆ కార్యక్రమం పేరు **ది సుప్రీమ్ స్వాన్** అని ఉందిట. అది చూస్తే ఎవరికైనా రామకృష్ణపరమహంస గుర్తుకొస్తారా? కొంచెం సేపు ఆలోచించాక అర్థమైందిట పరమ అంటే సుప్రీమ్ అనీ, హంస అంటే స్వాన్ అనీ, అందువల్ల పరమహంస అంటే ది సుప్రీం స్వాన్ అని పెట్టారనీను.

హంస పదాన్ని అక్షరాలా తీసుకున్నారు ఇంగ్లీషులో కాని హంసపదానికి భిన్న అర్థాలు ఉన్నాయి. ఎ) అజ్ఞానం నాశయితి ఇతి హంసః - అజ్ఞానాన్ని నాశనం చేసేది. బి) క్షీరనీర వివేకం చూపేది- పాలు, నీళ్ళ ఎలా విడదీయగలదో, అలా ఒక జ్ఞాని ఆత్మానాత్మ వివేకం చూపగలడు. సి) ఏకాకీ గచ్ఛత ఇతి హంసః- ఒంటరిగా తిరిగేది అనే అర్థం. సన్యాసి ఒంటరిగా సంచరిస్తాడు. ఈ అర్థాలు ఏ నిఘంటువులోనూ రావు.

అందువల్ల శాస్త్రాన్ని ఎవరూ స్వయంగా చదవకూడదు. దానికి కీ ఏమిటి? మీమాంస, సాంప్రదాయం. సంప్రదాయ విత్ ఉండాలి. ఎవరు? గురువు. గురువు శాస్త్రం తెలిసినవాడై ఉండాలి.

అందువల్ల శాస్త్రవిచారణ అంటే శాస్త్రం+బుద్ధి+తర్కం (న్యాయం) మూడూ కలిసి ఉండాలి. ఇవి కాక, సంప్రదాయ విత్ గురువు ఉండాలి.

**గురుసహాయేన శాస్త్రవిచారః జ్ఞానం జనయతి**

శాస్త్రం, గురువు ఇద్దరూ ముఖ్యం కాబట్టి ఒకరు లేకుండా ఒకరు ఉంటే శాస్త్రవిచారణ పూర్తికాదు. గురువు శాస్త్రంనుంచి చెబుతాడు కాబట్టి గురువుమీద ఇంకా శ్రద్ధ పెట్టాలి. గురువు శాస్త్రం ఎక్కడ నేర్చుకున్నాడు? తన గురువునుంచి. ఆ గురువు ఎక్కడనుంచి? తన గురువునుంచి. అలా సాంప్రదాయ 'కీ' అంటే ఆదిగురువునుంచీ, నా గురువుదాకా. శాస్త్రం గురుపరంపరగా వచ్చింది. అందువల్లనే బృహదారణ్యకంలో వంశబ్రాహ్మణమని ఒక బ్రాహ్మణం ఉంది. అది గురుపరంపర పట్టికను ఇస్తుంది. ఆ గురువులందరికీ మనం వందనాలు చేయాలి.

వారిలో ఇద్దరు గురువులు ముఖ్యం –

**శంకరం శంకరాచార్యం కేశవం బాదరాయణమ్।**
**సూత్రభాష్యకృతౌ వన్దే భగవన్తౌ పునః పునః॥**

ప్రస్థానత్రయానికి భాష్యాన్ని రచించిన సాక్షాత్ శంకరులైన శంకరాచార్యులకు, బ్రహ్మసూత్రాలను రచించిన సాక్షాత్ విష్ణువైన వ్యాసమహర్షికి పదే పదే నమస్కారాలు.

వ్యాసాచార్యులు సూక్ష్మరూపంలో అంటే బ్రహ్మసూత్రాల రూపంలో మొత్తం వేదాంతాన్ని అందించారు. శంకరాచార్యులు బృహద్రూపంలో వేదాంతాన్ని చాలా వివరంగా తన భాష్యాలద్వారా అందించారు. ఒకరు చిన్న కీని ఇస్తే, ఇంకొకరు చాలా పెద్ద కీని ఇచ్చారు. ఆ కీని ఉపయోగించే పెట్టె ఏది? ఉపనిషత్తు. ఏముందా పెట్టెలో? ఆత్మజ్ఞానం ఉంది.

రెండు కీలు ఎందుకు? ఏ జ్ఞానమైనా మీకు బాగా అర్థమైతే దాన్ని రెండు ముక్కల్లో చెప్పమన్నా చెప్పగలగాలి, విపులంగా చెప్పమన్నా చెప్పగలగాలి. అందువల్లనే మన లౌకిక విద్యలో ఒకటే అధ్యాయంనుంచి ఒక్క మార్కు ప్రశ్నలు, 6 మార్కుల ప్రశ్నలు, 20 మార్కుల ఒక పెద్ద ప్రశ్న ఉంటుంది. ఏది అడిగినా, ఎలా అడిగినా చెప్పగలగాలి. ఇంగ్లీషులో ప్రెసీరైటింగ్ అని ఉంటుంది. ఇచ్చిన వ్యాసాన్ని దానిలో మూడవవంతు తగ్గించిరాయాలి. అదీ స్వంత మాటలలో.

బ్రహ్మజ్ఞానాన్ని రెండు వాక్యాల్లో చెప్పమంటే ఎలా చెబుతాము?

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా।**
**జీవో బ్రహ్మైవ నాపరః॥**

సగం శ్లోకంలో కూడా బ్రహ్మజ్ఞానాన్ని కుదిస్తారు. వ్యాసాచార్యులవారు అందరికన్నా ముఖ్య గురువులు కాబట్టి గురుపూర్ణిమను వ్యాసపూర్ణిమ అని కూడా అంటారు. మామూలుగా ఇది సన్న్యాసులు చేస్తారు. వారు చాతుర్మాస్య వ్రతం చేసేటప్పుడు, ఒకచోట ఉండి, శాస్త్రబోధ చేస్తారు. అది చేసేముందు గురు పరంపరకు నమస్కారం చేస్తారు. ఇది సన్న్యాసులకే కాక, ఆత్మజ్ఞానం పొందే వారికీ, పొందాలన్న తపన ఉన్నవారికీ కూడా ముఖ్యమైన రోజు. మన గురువులందరినీ తలచుకుని, వారికి నమస్కారాలు తెలియజేసుకుందాము!

## స్వామీజీ సూక్తిముక్తావళి

పారమార్థిక దృష్ట్యా నేను నిర్గుణబ్రహ్మను.
వ్యావహారిక దృష్ట్యా నేను సగుణబ్రహ్మను.
ఇవి రెండు దృష్టికోణాలు కాని రెండు బ్రహ్మలు కావు.
బంగారం, ఆభరణం రెండు వస్తువులు కావు.
ఒకే వస్తువును చూసే రెండు కోణాలు.

శాస్త్రాన్ని ఎవరూ స్వయంగా చదవకూడదు. దానికి కీ ఏమిటి? మీమాంస, సాంప్రదాయం. సంప్రదాయ విత్ ఉండాలి. ఎవరు? గురువు. గురువు శాస్త్రం తెలిసినవాడై ఉండాలి.

# 24. అద్వైతం, ద్వైతం, విశిష్టాద్వైతం

వ్యాసాచార్యులవారు మనం జ్ఞానమార్గంలోకి వచ్చి, మోక్షం పొందటానికి చాలా కీలకమైన పాత్ర వహించారు. మనకు జ్ఞానయోగం కలిగించే గ్రంథాలను ప్రస్థాన త్రయం అంటారు. అవి **శ్రుతి, భగవద్గీత, బ్రహ్మసూత్రాలు.**

**1. శ్రుతి–** అంటే వేదాలు. వేదంలో వేద పూర్వభాగం, వేద అంతర్భాగమైన ఉపనిషత్తులు కూడా వస్తాయి. వేదాలు అపౌరుషేయం అంటే సాక్షాత్తూ ఆ పరమాత్మనుంచే వచ్చాయి. కాని వాటికి ఒకరూపునిచ్చి వాటిలో ఉన్న మంత్రాల పరంగా, వాటిని నాలుగు వేదాలుగా కూర్చారు వ్యాసాచార్యులవారు. అందువల్లనే ఆయనకు వేదవ్యాసుడు అనే పేరు వచ్చింది. వేదాలను కూర్చి, విభజించిన వ్యక్తి అని అర్థం. వేద వ్యాసుని అసలు పేరు కృష్ణ. అందువల్ల ఏ కృష్ణో తెలుసుకోవటానికి కృష్ణపరమాత్మను వాసుదేవకృష్ణ అనీ, వేదవ్యాసుని కృష్ణద్వైపాయనుడనీ అంటారు. ఆయన నాలుగు వేదాలను నలుగురు శిష్యులకు బోధించి, వాటిని తర్వాత వచ్చే శిష్యులకు అందేలా చేశారు.

**2. భగవద్గీత–** దీన్ని స్మృతిప్రస్థానం అంటారు. వేదాలనుంచి వచ్చిన గ్రంథాలను స్మృతిగ్రంథాలు అంటారు. మనకు ఎన్నో స్మృతిగ్రంథాలు ఉన్నాయి. కాని, ప్రస్థానత్రయంలో స్మృతిగ్రంథం కింద భగవద్గీత ఒక్కటే చేర్చబడింది. భగవద్గీత మహాభారతంలోనిది, దాన్ని వేదవ్యాసులే రచించారు. ఆ విధంగా భగవద్గీత చెప్పింది వాసుదేవ కృష్ణుడు అయితే, మనకు అందించింది కృష్ణద్వైపాయనుడు.

**3. బ్రహ్మసూత్రాలు–** దీన్ని న్యాయప్రస్థానం అంటారు. వేదాల్లో చేసిన బోధను తర్కానికి జోడించి, నిశ్చయజ్ఞానం కలిగేలా చేసింది కూడా వేదవ్యాసులే. అందువల్ల వీటిని బాదరాయణ సూత్రాణి అని కూడా అంటారు.

అలా మనకు జ్ఞానమార్గానికి బాట వేసిన వేదవ్యాసుడు ఎంతో పూజనీయుడు. అందువల్ల ఆయనను మానవమాత్రునిగా చూడరు. ఆయనను త్రిమూర్తిగా కొలుస్తారు. దీనిమీద ఒక శ్లోకం ఉంది. దాని సారాంశం – ఆయనకు బ్రహ్మలాగా నాలుగు తలలు లేవు కాని ఆయన బ్రహ్మ; విష్ణుమూర్తిలాగా నాలుగు చేతులు లేవు కాని ఆయన విష్ణువు; పరమేశ్వరునిలాగా మూడు నేత్రాలు లేవు కాని ఆయన పరమేశ్వరుడు. అందువల్ల వేదాంతమార్గంలోకి వచ్చినవారందరూ వ్యాసపూర్ణిమ రోజు, వ్యాసపూజ చేయాలి.

వేదాంతబోధను, వేదాంతదర్శనం అంటారు. దీన్ని సాంకేతికంగా చూస్తే ఫిలాసఫీ అనము. ఎందుకంటే, ఒక ప్రమాణమైన గ్రంథం లేకుండా, కేవలం తర్కంమీద ఆధారపడి చేసిన బోధను ఫిలాసఫీ అంటారు. మన బోధలో కూడా తర్కం ఉంటుంది కాని, దీన్ని శ్రుతిసమ్మత తర్కం అంటారు. అంటే ఆ తర్కం, శ్రుతిని ఆధారంగా చేసుకుని చేసేది. మనకు ఆరు నాస్తికదర్శనాలు ఉన్నాయి. నాస్తికులు అంటే దేవుణ్ణి నమ్మరని కాదు, వారు వేదాన్ని నమ్మరు. ఆ దర్శనాలు– నాలుగురకాల బౌద్ధదర్శనాలు, జైనదర్శనం, చార్వాక దర్శనం. వీరి దర్శనాలను ఫిలాసఫీ అనవచ్చు. ఎందుకంటే వారికి ఒక ప్రమాణగ్రంథం లేదు.

ఇవి కాక మనకు ఆరు ఆస్తికదర్శనాలు ఉన్నాయి– అవి సాంఖ్య, యోగ, నైయ్యాయిక, వైశేషిక, పూర్వమీమాంస, ఉత్తరమీమాంస. ఉత్తరమీమాంస అంటే వేద అంతభాగాన్ని ఆధారం చేసుకుని చేసే బోధ. దీన్ని అద్వైతదర్శనం అనికూడా అంటారు. మనది అద్వైతవేదాంతం. వ్యాసాచార్యులవారు తన బ్రహ్మసూత్రాల్లో పై పదకొండు దర్శనాలను ఖండిస్తూ వేదాంత సిద్ధాంతాన్ని నిలబెట్టారు. అందువల్ల వ్యాసాచార్యుల బ్రహ్మసూత్రాలకు భాష్యం వ్రాసిన శంకరులవారిని కూడా సిద్ధాంతి అంటారు.

బ్రహ్మసూత్రాల్లో రెండవ అధ్యాయంలో,రెండవ పాదంలో విస్తారంగా ఒక్కొక్క దర్శనాన్నీ తీసుకుని, దాన్ని ఖండిస్తూ వచ్చారు. వాటిని ఖండించే తతంగంలో భాగంగా, తార్కికంగా రెండు విషయాలు నిరూపించారు.

1. నిర్గుణబ్రహ్మజ్ఞానం పొందటానికి, తద్వారా మోక్షం పొందటానికీ తర్కం తోడ్పడలేదు.

2. మొదటి సూత్రమే ఇంకొంచెం విపులంగా వస్తుంది. తర్కం దేనిమీద ఆధారపడు తుంది? ప్రత్యక్షప్రమాణంమీద. ప్రత్యక్షప్రమాణం మన ఇంద్రియాలు. అవి సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి, తర్కం ఒక విషయాన్నే నిరూపిస్తుంది. మన ఇంద్రియాల శక్తిని దృష్టదర్శనం అంటారు. ఎందుకంటే ఇంద్రియాల పరిధి పరిమితమైంది. అవి చెప్పేది సంపూర్ణంగా ఉండదు. అందువల్ల అది లాభం లేదు.

ముందే చూసినట్టుగా ఆరు నాస్తిక దర్శనాలు అసలు వేదాన్ని నమ్మవు కాబట్టి వారి దర్శనాలు ఈ సూత్రాలవల్ల నిలబడలేవు. ఆరు ఆస్తిక దర్శనాల్లో మన వేదాంతం తప్ప, తక్కిన ఐదూ తర్కప్రధానమైనవి. అంటే వారు వేదాన్ని నమ్ముతారు

కాని వేదానికీ, తర్కానికీ మధ్య భేదం వచ్చినప్పుడు వారు తర్కానికే ప్రాధాన్యత నిస్తారు. అందువల్ల అవి కూడా నాస్తికదర్శనాలలాగే చేస్తాయి.

మనం కూడా వేదాన్నీ, తర్కాన్నీ నమ్ముతాము కాని వారికీ, మన అద్వైత సిద్ధాంతానికీ మధ్య భేదం ఏమిటంటే వేదానికీ, తర్కానికీ మధ్య భేదం వచ్చినప్పుడు మనం వేదానికే ప్రాధాన్యతనిస్తాము. మనది తర్కప్రధానం కాదు. మనది వేదప్రధానం. అందువల్ల దానిలో పురుషబుద్ధి దోషాలు లేవు. మనం తర్కం వాడినా శ్రుతిసమ్మత తర్కం వాడుతాము.

అందువల్ల మోక్షం పొందాలనుకునే ముముక్షువు ఎవరైనా అద్వైతవేదాంత దర్శనం తీసుకోవాలి తప్ప, తక్కిన పదకొండు దర్శనాలనూ పట్టించుకోకూడదు. వేదాంతదర్శనంలో ప్రస్థానత్రయం నేర్చుకోవాలని చూశాము. అవి భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు. ఉపనిషత్తులు కనీసం ఆరు నేర్చుకోవాలి; బ్రహ్మసూత్రాలు కనీసం మొదటి నాలుగు సూత్రాలు నేర్చుకోవాలి. **చతుస్సూత్రీ** అంటారు.

ఈ సందర్భంలో వ్యాసాచార్యులవారే చెప్పిన మాటలను గుర్తు తెచ్చుకోవాలి. ఆయన శాస్త్రాన్ని స్వయంగా నేర్చుకోకూడదు, ఒక గురువుద్వారా నేర్చుకోవాలి అంటారు. ఆ గురువు కూడా స్వయంభూ గురువుగా అవకూడదు. అంటే తను స్వయంగా గురువు అయిపోకూడదు. అతను గురుశిష్య పరంపరలో ఉన్నవాడై ఉండాలి. తను ఒకప్పుడు శిష్యుడు అయితేనే గురువు కాగలడు.

శాస్త్రం నేర్చుకోవాలనే తపన ఉన్నా కూడా, సాధకుడు ఒక పెద్ద సమస్యను ఎదుర్కొంటాడు. అదేమిటో ఇప్పుడు చూద్దాము. ఒక సాధకుడు, వేదాలు అపౌరుషేయాలని,సాక్షాత్తూ ఆ పరమాత్మే ఇచ్చాడనీ, తక్కిన పదకొండు దర్శనాలనీ కాదనుకుని ఇక్కడికి వస్తాడు. తక్కిన వారిని కాదన్నా, వేదాంత దర్శనంలోనే భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఒక్కొక్క ఆచార్యుడూ ఒక్కొక్కలా చెబుతారు. అందువల్ల ఎవరితోనైనా నేను వేదాంతం నేర్చుకుంటున్నాను అని చెపితే ఏ వేదాంతం అని ఎదురు ప్రశ్నిస్తారు వారు.

మనకు వేదాంతంలోనే మూడు దర్శనాలు ఉన్నాయి– అద్వైతం, ద్వైతం, విశిష్టాద్వైతం. ముగ్గురూ ఆదిగురువు సాక్షాత్తూ పరమాత్ముడే అంటారు. నారాయణ సమారంభాం అంటారు ముగ్గురు. ఏది సరియైనది? అద్వైత సిద్ధాంతాలకు ద్వైతం, విశిష్టాద్వైతం పూర్వపక్షం కిందకి వస్తుంది. వారిద్దరికీ అద్వైతం పూర్వపక్షం కిందకి వస్తుంది.

వీరిలో ఎవరినీ తక్కువ చేయలేము. ముగ్గురూ మీమాంసలో, జ్ఞానంలో దిట్టలు. ముగ్గురినీ అవతారాలుగా కూడా కొలుస్తారు. రామానుజాచార్యులవారు విశిష్టాద్వైతపరంగా, మధ్వాచార్యులవారు ద్వైతపరంగా, ప్రస్థానత్రయానికి భాష్యాలు రాసి, వాటిని వారి పద్ధతిలో ఖండించారు. ఇప్పటికీ ఈ మూడింటి మధ్య సమభావం లేదు. ఎవరు వారిలో ఎవరు గొప్పో నిర్ణయిస్తారు? ఎవరికి వారే, వారిదే గొప్పదని, వారికి ఆ విషయంలో దైవకృప ఉందనీ చెబుతారు. మూడు పుస్తకాలను నీళ్ళలో వేస్తే తక్కిన రెండూ మునిగిపోయాయనీ, విశిష్టాద్వైతం పుస్తకం పైకి తేలిందనీ, భగవంతుడు ఆ విధంగా కృప చూపించాడనీ అంటారు వారు. అలా వేరే వారికి వేరే కథలు ఉంటాయి.

శంకరాచార్యులవారు ఎనిమిదవ శతాబ్దానికీ, రామానుజాచార్యులవారు పదకొండవ శతాబ్దానికీ, మధ్వాచార్యులవారు పదమూడవ శతాబ్దానికీ చెందినవారు. అయినా ఈ మూడు వాదనల మధ్య సమన్వయం కుదరటం లేదు. ఎవరికి వారే, వారిదే సత్యమంటున్నారు. భగవంతుడు దిగివచ్చి ఏది సత్యమో చెప్పడు. మనమే తేల్చుకోవాలి. మనకు ఈ విషయంలో చింత లేకపోతే సమస్య లేదు. కిమోథెరపీ ఇవ్వాలా, ఆపరేషన్ చేయాలా అనే వాదన ఎప్పుడు వస్తుంది? ఒక వ్యక్తికి క్యాన్సర్ వ్యాధి ఉంటే. క్యాన్సర్ వ్యాధి లేకపోతే ఈ చర్చకి చోటే లేదు.

అలా నాకు ఈ మూడింటిలో ఏది ఉన్నతమైనదో తేల్చుకోవాలని లేకపోతే సమస్యలేదు. తేల్చుకోవాలని ఉంటే మాత్రం నేనే తేల్చుకోవాలి. ఇక్కడ తేల్చుకోవాల్సింది మూడు సత్యవస్తువుల మధ్య కాదు. మూడూ, మూడు భిన్నమార్గాల్లో ప్రయాణిస్తున్నాయి. అందువల్ల మూడూ పాటిస్తాను అనలేరు. పోనీ ఒకసారి ఇది, ఒకసారి అది పాటిద్దామా  అంటే, అదీ కుదరదు. ఏదో ఒక దాన్ని మనం నమ్మాలి.

ఇవి మూడూ మూడు భిన్నమార్గాలు కాబట్టి కిచిడీ చేయటం కుదరదు. అంటే మూడింటినీ కలపటం కుదరదు. వాటిని కలుపుతాను అంటే- **అంజనం అంటే ఏమిటో నాకు తెలియదా, అది పసుపులా తెల్లగా ఉంటుంది అని చెప్పినట్టు ఉంటుంది.** అందువల్ల ఏదో ఒకటి ఎన్నుకోవాలి. మనకు ధర్మ, అర్థ, కామ పురుషార్థాలే చాలు అనుకుంటే కర్మయోగం, ఉపాసనాయోగాలను పాటిస్తూ ఉండిపోవచ్చు. మోక్షం కావాలనుకుంటే మాత్రం ఏదో ఒకటి నిశ్చయించుకోవాలి. అది నిశ్చయించుకోవాలంటే ముందు ఈ మూడింటి గురించీ తెలుసుకోవాలి.

ఈ మూడూ ఆరు అంశాలను చర్చించాలి. అవి **జీవుడు, ఈశ్వరుడు, జగత్తు, బంధం, మోక్షం, సాధన.** ఎవరికి వారు వీటన్నింటి స్వరూపం గురించీ చర్చించాలి. అన్ని మతాలూ ఒకటే లక్ష్యానికి చేరుస్తాయి అని చెప్పటం అసంబద్ధంగా ఉంటుంది, ఎందుకంటే వాటి లక్ష్యాలు వేర్వేరు అంటారు పూజ్యస్వామీజీ. అలాగే ఈ మూడూ కూడా! వీటి లక్ష్యాలు వేరు. లక్ష్యాలు వేరైతే సాధన కూడా వేరే ఉంటుంది. ఈ మూడు, ఆ ఆరు అంశాల స్వరూపాలనూ ఎలా చిత్రిస్తాయో చూద్దాము.

**1. జీవుడు –** ద్వైతం, విశిష్టాద్వైతం జీవుడు అణురూపజీవుడు అంటాయి. అంటే జీవుడు అణువు అంత చిన్నవాడు. కాని అద్వైతం జీవుడు సర్వగతం, విభువు అంటుంది.

**2. ఈశ్వరుడు –** తక్కిన రెండూ ఈశ్వరుడు సగుణబ్రహ్మ అంటాయి. అద్వైతం నిర్గుణబ్రహ్మ అంటుంది. తక్కిన రెండూ సగుణబ్రహ్మ దగ్గర ఆగిపోతాయి. వాటికి నిర్గుణబ్రహ్మ లేనే లేదు.

**3. జగత్తు –** ద్వైతంలో జగత్తు ఈశ్వరునికి భిన్నంగా ఉంది; విశిష్టాద్వైతంలో జగత్తు ఈశ్వరునిలో ఒక భాగం; అద్వైతంలో జగత్తు లేనే లేదు, అది మిథ్య. ఉంటేనే కదా భిన్నంగా ఉందనో, భాగమనో చెప్పేది.

పై మూడు స్వరూపాలూ భిన్నంగా ఉన్నాయి. ఎలా కలుపుతాము మూడింటినీ?

**4. బంధం –** తక్కిన రెండింటికీ నేను స్వతంత్రజీవిని అని పొరపాటు పడటమే బంధం. అద్వైతంలో నేను అస్వతంత్రజీవిని అని పొరపాటు పడటమే బంధం.

**5. మోక్షం –** తక్కిన రెండింటికీ మోక్షం అంటే ఏమిటి? నేను పొరపాటు పడ్డట్టుగా నేను స్వతంత్రజీవిని కాను అని అర్థం చేసుకుని, దేవునిమీద శాశ్వతంగా ఆధారపడటం. ద్వైతంలో దాసోహం అంటే, విశిష్టాద్వైతంలో దేవుడికి ఒక అంగంగా అధారపడటం. అందువల్ల రెండింటిలోనూ స్వతంత్రంనుంచి ఆధారపడటం వైపుకు ప్రయాణం చేయటం. దీన్ని **కైంకర్యమోక్షం** అంటారు. దాసునిగానో, అంగరూపంలోనో నిత్యం దేవునికి సేవ చేయటం.

అద్వైతంలో నేను పొరపాటు పడ్డట్టుగా నేను అస్వతంత్రుణ్ణిని కాను, నేను స్వతంత్రుణ్ణి, నేనే ఆ బ్రహ్మను అని తెలుసుకోవటం. అస్వతంత్రంనుంచి

స్వతంత్రం వైపుకు ప్రయాణం చేయటం అద్వైతం. **దాసోహంనుంచి సోహంకు రావటం.**

నేను ఆ బ్రహ్మను. నామీదే జీవుడు, ఈశ్వరుడు, జగత్తు ఆధారపడ్డాయి. నేను నిర్గుణబ్రహ్మను అని అర్థం చేసుకోవటం. ఇది అద్వైతవేదాంత బోధ.

తమాషా ఏమిటంటే ఈ మూడూ ఒకే ప్రస్థానత్రయంనుంచి వాటి వాటి వాదనలను తీసుకున్నాయి. మూడింటి గురువులూ వ్యాసాచార్యులవారికి పూజలు చేస్తారు. తక్కిన ఇద్దరూ ఓ వ్యాసాచార్యా! నువ్వు నన్ను భగవంతునికి దాసునిగా పూజ చేయమని నేర్పించావు అంటారు. ఇప్పుడు నేను రెండు కాదని, ఒకటి స్వీకరించాలి. ఒకటి స్వీకరించినంత మాత్రాన,రామానుజాచార్యులు, మధ్వాచార్యులు తప్పని చెప్పకూడదు. వారి జ్ఞానాన్ని, వారి భక్తిని గౌరవించాలి. వారు తప్పని చెప్పటం గర్వం చూపినట్టు అవుతుంది. నా బుద్ధికి చెప్పుకుంటే చాలు– నాకు ఇది నచ్చింది. ఇది నేను పాటిస్తున్నాను అని.

స్వామీజీ ఈ సందర్భంలో చెబుతున్నారు, మీరు ఎందుకో నా శిష్యులు అయ్యారు. నేను శంకరాచార్యులవారి పరంపర చెప్పిన సిద్ధాంతం నేను బాగా నమ్మాను. **అహం బ్రహ్మ అస్మి** సిద్ధాంతం సత్యం అని నమ్మాను.

కాని ఎవరైనా స్వామీజీ దగ్గరకు వచ్చి, స్వామీజీ నేను జగత్తు మిథ్య అనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నాను. అన్నింటికన్నా అది నమ్మటానికి చాలా కష్టంగా ఉంది. అందువల్ల నాకు విశిష్టాద్వైతం నచ్చింది. నేను అది పాటిస్తాను అంటే మీకు కోపం వస్తుందా, నన్ను ఇంక మీ శిష్యుడు కాదు పొమ్మంటారా అని అడిగితే స్వామీజీ ఏమంటారు?

స్వామీజీ, తనకే కాదు, ఏ అద్వైతగురువుకు కూడా కోపం రాదు అంటారు. ఏ అద్వైతగురువు కూడా తక్కిన రెండింటినీ అద్వైతసిద్ధాంతానికి భిన్నంగా ఉన్నాయని చెప్పడు. అలా వాటిని కాదనకపోగా, అవి అద్వైతాన్ని పెంపొందిస్తున్నాయి అంటారు. తక్కిన రెండూ అంతిమలక్ష్యాలు కావు, అవి అద్వైతమనే అంతిమలక్ష్యానికి రావటానికి మార్గాలు.

**6.సాధన –** సాధకులు మూడు స్థాయిల్లో ఉంటారు. మంద అధికారి, మధ్యమ అధికారి, ఉత్తమ అధికారి. మంద అధికారి మంచి విద్యార్థి. క్లాసులకు వస్తాడు. మధ్యమ అధికారి మంద అధికారికన్నా నయం, ఉత్తమ అధికారి అందరిలోకి శ్రేష్ఠుడు. మంద అధికారి మధ్యమ అధికారి అవటానికి ద్వైతం తోడ్పడుతుంది.

మధ్యమ అధికారి ఉత్తమ అధికారి అవటానికి విశిష్టాద్వైతం తోడ్పడుతుంది. ఉత్తమ అధికారి ఏ విధమైన సందేహం లేకుండా అద్వైతాన్ని స్వీకరిస్తాడు.

తక్కిన రెండూ సగుణం బ్రహ్మ గురించి చెబుతాయి. వాటిని కాదనకుండా, వాటినుంచి నిర్గుణం బ్రహ్మకు రావాలి. వాటిని నిర్గుణబ్రహ్మ అనే లక్ష్యానికి చేర్చే మార్గాలుగా తీసుకోవాలి. అందువల్ల వాటిని పూర్తిగా కాదనకూడదు. అలాగని వాటి దగ్గరే ఆగిపోకూడదు. అందువల్ల అద్వైతానికి వచ్చి నిర్గుణబ్రహ్మని అర్థం చేసుకోవాలి.

తక్కిన రెండూ అద్వైతాన్ని స్వీకరించవు. ఎందుకంటే, నిర్గుణం బ్రహ్మ లేనే లేడంటాయి. అందువల్ల వాటికి వాటి మార్గాలే లక్ష్యాలు. వాటికి వేరే లక్ష్యం లేదు. అద్వైతగురువు సరే బాగుంది, కావాలంటే వాటికి వెళ్ళు, నువ్వే కొన్నాళ్ళ తర్వాత అద్వైతవేదాంతానికి వస్తావు అంటాడు. ఒకవేళ ఈ జన్మలో రాకపోయినా, విశిష్టాద్వైతుల నమ్మకం ప్రకారం అతను వైకుంఠానికి వెళతాడు. ఇక్కడ మేము నీకు నచ్చచెప్పలేకపోయాము, అక్కడ నీకు విష్ణుమూర్తి నచ్చచెబుతాడులే అని కూడా చెబుతాడు గురువు.

అందువల్ల మనం అద్వైతవేదాంతాన్ని పాటించి, మోక్షాన్ని పొందుదాము.

## స్వామీజీ సూక్తిముక్తావళి

మొత్తం వేదాంతం ఒక జిగ్‌సా పజిల్‌లాంటిది. ఒక్కొక్క ముక్క ఒక్కొక్క అంశాన్ని వివరిస్తుంది. శిష్యుడు ఈ ముక్కలన్నీ సరిగ్గా పేరిస్తే అతనికి జవాబు దొరుకుతుంది. ఆ జవాబే **అహం బ్రహ్మ అస్మి.**

# 25. సచ్చిదానంద ఆత్మ

**స యో హ వై తత్పరమం బ్రహ్మ వేద**

**బ్రహ్మైవ భవతి నాస్య అబ్రహ్మవిత్కులే భవతి**

**తరతి శోకం తరతి పాప్మానం**

**గుహాగ్రన్థిభ్యో విముక్తోఽమృతో భవతి - ముండకమ్ 3-2-9**

ఈ మంత్రంలో ఒక వంతు బ్రహ్మజ్ఞానం గురించి చెబితే, తక్కిన మూడు వంతులు బ్రహ్మజ్ఞాన ఫలం గురించి చెబుతుంది.

**సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ - తైత్తిరీయమ్**

బ్రహ్మ నిర్వచనం సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ అని వస్తుంది. దీన్నే సత్ చిత్ ఆనందంద్వారా వివరిస్తారు. శుద్ధచైతన్యం– చిత్; శుద్ధ సత్యం– సత్; అనంతం – ఆనందం (పూర్ణత్వం)

**చిత్** – ఈ వివరణ మొదటిసారి వినేవారికి కొంచెం కష్టంగా ఉండవచ్చు. అందువల్ల ఉపనిషత్తే ఒక ఉదాహరణనిస్తుంది.

**హిరణ్మయే పరే కోశే విరజం బ్రహ్మ నిష్కలమ్।**

**తచ్ఛుభ్రం జ్యోతిషాం జ్యోతిః తద్యదాత్మ విదోవిదుః॥ ముండకమ్**

చైతన్యాన్ని జ్యోతులకు జ్యోతి అంది ఉపనిషత్తు. కాంతికి, చైతన్యానికి చాలా దగ్గర పోలికలు ఉన్నాయి. అందులో కొన్ని సమానధర్మాలను చూద్దాము.

**1.నిత్య ప్రకాశకం** – కాంతి అన్ని వస్తువులమీదా పడి, వాటిని ప్రకాశింప జేస్తుంది. కాంతి కూడా తెలుస్తున్నది. నేను ఒక వస్తువును చూస్తున్నప్పుడల్లా నాకు రెండు విషయలూ తెలుస్తున్నాయి.

**వస్తువు+కాంతి**

అంటే పుస్తకాన్ని చూస్తే పుస్తకం+ కాంతి; మైకును చూస్తే మైకు+ కాంతి. అలా ఏ వస్తువుమీద పడితే ఆ వస్తువు+కాంతి నాకు తెలుస్తున్నాయి.

కాంతి ఎప్పటికీ తెలుస్తున్న వస్తువు.

కాంతివల్లనే తక్కిన వస్తువులన్నింటినీ తెలుసుకోగలుగుతున్నాను.

కాని వచ్చిన చిక్కేమిటంటే అన్ని వస్తువులమీదా కాంతి పడి వాటిని ప్రకాశింపచేస్తున్నా, కాంతిని నేను గమనించటం లేదు. అన్నింటిలో సమానంగా ఉన్న వస్తువును నేను పట్టించుకోవటం లేదు.

ఈ గదిలో ఏముంది అంటే పుస్తకం, కుర్చీ, బల్ల అంటూ అనేక వస్తువుల చిట్టా చదువుతాను కాని కాంతి ఉంది అని చెప్పను.

ఇదే సూత్రం చైతన్యానికి వర్తిస్తుంది.

చైతన్యం ఎప్పటికీ తెలుస్తున్న వస్తువు.

చైతన్యంవల్లనే తక్కిన వస్తువులన్నింటినీ తెలుసుకోగలుగుతున్నాను.

కాని వచ్చిన చిక్కేమిటంటే చైతన్యంవల్లే నేను అన్నింటినీ తెలుసుకోగలుగుతున్నా, నేను చైతన్యతత్త్వాన్ని అని గ్రహించటం లేదు.

నేను చైతన్యంతో ఏం చూస్తున్నానో మారుతుంది.

అంటే ఆ మారని చైతన్యంవల్ల నేను మారుతున్న అనుభవాలను పొందుతున్నాను. కాకపోతే నాకు తెలియటం లేదు, కాంతి తెలియనట్టే.

అందువల్ల మొదటి సారూప్యం– నిత్యప్రకాశము.

**2. స్వతంత్రం** – కాంతి ఒక వస్తువుమీద పడి దాన్ని ప్రకాశింపచేస్తుంది అని చూశాము. ఉదాహరణకు కాంతి–చెయ్యి తీసుకుందాము. కాంతి చేతిలో భాగం కాని, ఒక లక్షణం కాని, దాన్నించి ఉత్పత్తి చెందింది కాని కాదు.

ఎ) కాంతి చేతిలో ఒక భాగమైతే– చేయి ఎటు వెళితే అటు వెళ్ళాలి.

బి) కాంతి చేతియొక్క లక్షణమైతే– చేతికి సహజమైన కాంతి ఉండాలి.

సి) కాంతి చేతినుంచి ఉత్పత్తి చెందితే– అది పరతంత్రంగా ఉండాలి.

కాని కాంతి చేతిలో ఒక భాగం కాదు. దాని లక్షణం కాదు, దాన్నించి ఉత్పత్తి చెందనూ లేదు. కాని కాంతివల్లనే వస్తువు ప్రకాశిస్తున్నది. అందువల్ల కాంతి చేతిమీద పడినా, అది స్వతంత్రం.

అదే చైతన్యం విషయానికి కూడా వర్తిస్తుంది.

చైతన్యం శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని కాదు; దాన్నించి ఉత్పత్తి చెందనూ లేదు. దాన్నించి ఉత్పత్తి చెందితే శరీరం పడిపోతే, చైతన్యం కూడా పడిపోవాలి.

అందువల్ల చైతన్యం స్వతంత్రమైనది.

**3.సర్వగతం** – కాంతి ఏదో ఒక వస్తువుమీదనే పడదు. మైకుమీద పడుతుంది; గడియారంమీద పడుతుంది; పుస్తకంమీద పడుతుంది కాని వాటి సరిహద్దులకే పరిమితమవదు. ఆ వస్తువుల మధ్య ఉన్న ఖాళీ ప్రదేశంలో కూడా ఉంటుంది.

అలాగే చైతన్యం కూడా నా శరీరం అంతటా ఉండటమే కాదు, నా శరీరం బయట కూడా ఉంది. నాలోనూ, ఏనుగు శరీరంలోను, దోమ శరీరంలోనూ అన్నింటిలోనూ ఉంటుంది. అంతటా ఉంటుంది. సరిహద్దులకే పరిమితమవలేదు. అందువల్ల కాంతి సర్వవ్యాపకం అయినట్టే చైతన్యం కూడా సర్వవ్యాపకం అంటే సర్వగతం.

**4 నిత్యం –** కాంతి చేతిమీద పడి దాన్ని ప్రకాశింపచేస్తుంది అని చూశాము కదా. కాని చేతిని తీసినంత మాత్రాన కాంతి పోదు. చెయ్యి ఉన్నా లేకపోయినా కాంతి ఉంటుంది. చెయ్యి లేదంటాము కాని కాంతి లేదనకూడదు. అలాగే ఒక హాలులో ఒక వ్యక్తి వస్తే అతనితో కాంతి వచ్చినట్టు ఉంటుంది,అతను వెళితే వెళ్ళినట్టు ఉంటుంది. కాని కాంతి మాయమవదు. అది నిత్యం (ట్యూబ్‌లైటు కాంతిని తీసుకోకూడదు. అది ఆపేస్తే కాంతి పోయిందిగా అనకూడదు)

**న జాయతే మ్రియతే వా కదాచిత్।**
**నాయం భూత్వాభవితా వా న భూయః॥**
**అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో।**
**న హన్యతే హన్యమానే శరీరే॥ – గీత 2-20**

ఆత్మకు చావు, పుట్టుకలు లేవు. శరీరం పడిపోయినా, ఇది పడిపోదు. ఇది శాశ్వతం. అందువల్ల ఆత్మ నిత్యం.

ఆ విధంగా ఆత్మ నిత్యప్రకాశం, స్వతంత్రం, సర్వగతం, నిత్యం.

ఆత్మ నిత్యప్రకాశం, శాశ్వతం అంటే చాలదు. నేనెవరు? నేను ఆత్మనా, శరీరాన్నా? నేను చైతన్యం నాలో ఉన్న శరీరాన్నా, నేను శరీరం నాకు ఉన్న చైతన్యాన్నా? ఆత్మ అన్నా, చైతన్యం అన్నా ఒకటే.

ఇంతవరకూ మనకు తెలిసింది, మనం అనుకుంటున్నది – నేను శరీరాన్ని. ఇప్పుడు మన దృక్పథాన్ని మార్చుకోవాలి. నేను శరీరాన్ని కాను. శరీరం నాకు ఆగంతుకంగా వచ్చింది. నేను ఆత్మను అని అర్థం చేసుకోవాలి. **'నేను ఆధ్యాత్మిక అనుభవంకోసం ఎదురుచూసే మానవ మాత్రుడను కాను; నేను ఆగంతుక మానవ అనుభవాలను పొందుతున్న ఆధ్యాత్మిక తత్త్వాన్ని,'** అన్నారెవరో! నేను సర్వవ్యాపకమైన,శాశ్వతమైన, ఆత్మను. ఈ శరీరమనే మాధ్యమంద్వారా వ్యవహారం నడుపుతున్నాను. జాగ్రదావస్థలో ఈ శరీరాన్ని ఉపయోగిస్తాను. స్వప్నావస్థలో ఇంకో స్వప్నశరీరం ఉపయోగిస్తాను; సుషుప్తిలో ఈ రెండు శరీరాలూ పడుకుంటాయి

కాని చైతన్యమైన నేను ఉంటాను. ఉండనిది వ్యవహారం మాత్రమే. ఎందుకంటే వ్యవహారం చేయాలంటే మాధ్యమం కావాలి.

వ్యవహారం ముగిస్తే నేను ముగిసినట్టు కాదు– వ్యవహారం ఉన్నా లేకపోయినా, శరీరం ఉన్నా లేకపోయినా నేను ఉంటూనే ఉంటాను. నేను ప్రళయంలో కూడా ఉంటాను. నేను నిత్యాన్ని. నేను సద్రూపంగా, చిద్రూపంగా ఎప్పుడూ ఉంటాను. సత్,చిత్ ఆనందం పదాలను అర్థం చేసుకుంటేనే వేదాంతాన్ని అర్థం చేసుకున్నట్టు అనుకోవచ్చు. ఒక్కొక్కపదం అంత లోతైనది.

**సత్–** సత్‌ను అర్థం చేసుకునే ముందు, ఒక ముఖ్యమైన సూత్రాన్ని అర్థం చేసుకోవాలి.

ఏదైనా వస్తువుకు ఉనికి ఉండాలంటే, అది తెలుసుకోబడే వస్తువై ఉండాలి.

అంటే నేను ఒక వస్తువు ఉంది అని ఎప్పుడు చెప్పగలను? దాని గురించిన జ్ఞానం నాకు ఉంటేనే! నిజానికి రెండూ పరస్పర సంబంధం గలవి.

ఉనికి ఉన్న వస్తువు గురించే నేను తెలుసుకుంటాను!

నాకు ఒక వస్తువు గురించి తెలుసు అంటే దానికి ఉనికి ఉన్నట్టే.

అందువల్ల చైతన్యం అన్ని వస్తువులకు ఉనికిని ఇస్తుంది.

ఇక్కడ గడియారం ఉంది– అని నేను చెపితే, నాకు గడియారం గురించిన జ్ఞానం ఉంది. అంటే గడియారం ఉనికి గురించి నేను చెప్పగలుగుతున్నాను. ఆ విధంగా నేను – సత్‌ను, చిత్‌ను.

**చిద్రూపః అహమస్మి,సద్రూపః అహమస్మి**

**ఆనందం–** ఆనందాన్ని భూమ అనే పదంతో నిర్వచిస్తుంది ఛాందోగ్యోపనిషత్తు. ఇది చాలా ముఖ్యమైన నిర్వచనం.

**యో వై భూమా తత్సుఖం నాల్పే సుఖమస్తి – ఛాందోగ్యమ్– 7–23–1**

పరిమితి లేని, పరిపూర్ణమైన ఆనందమే భూమ. అల్పే సుఖంనాస్తి– అల్పమైన వస్తువుల్లో అంటే పరిమితి ఉన్న వస్తువుల్లో సుఖం లేదు.

ఇది వింటే మనకొక సందేహం కలుగుతుంది. వస్తువుల్లో సుఖం లేదు అని ఎలా అంటారు? నాకు ఒక వస్తువు కొంటే ఆనందం వస్తుంది. ఒక వస్తువు తింటే ఆనందం వస్తుంది కదా!

కాని శాస్త్రం అది నిజం కాదు అని అంటుంది. ఉదాహరణకు సంగీతం విషయమే తీసుకోండి. సంగీతంలో కనుక ఆనందం ఉంటే, ఎవరు ఏ సంగీతం

విన్నా ఆనందించాలి కదా! కాని యువతకు ఇష్టమైన పాశ్చాత్యసంగీతం వృద్ధులకు ఇష్టం ఉండదు. వృద్ధులకు ఇష్టమైన శాస్త్రీయసంగీతం యువతకు ఇష్టం ఉండదు. నిప్పు విషయం అలా కాదు. నిప్పులో చేయి పెడితే ఎవరికైనా, ఎప్పుడైనా, ఏ దేశంలోనైనా చేయి కాలకమానదు. అంటే ఆ వేడితత్త్వం అగ్నిలో స్వతహాగా ఉంది. కాని ఆనందం ఆ వస్తువులో స్వతహాగా లేదు.

అయినా మనకు ఒక వస్తువువల్ల ఎందుకు ఆనందం వస్తోంది? దానికి కారణం ఉంది. నేను కావాలనుకున్న వస్తువు పొందేసరికి, నా మనస్సు ప్రశాంతంగా అవుతుంది. ఆ ప్రశాంత మనస్సులో నా స్వరూప ఆనందం, ప్రతిబింబించబడి, మనస్సులో ప్రకటితమవుతుంది.

దీనికి ఎప్పుడూ ఇచ్చే ఉదాహరణ **కుక్క-ఎముక.** ఒక కుక్క ఎండిన ఎముకను కొరికి తింటుంటే, రక్తం కారుతుంది. దానికి ఎముక తినకముందు రక్తం కారలేదు. అందువల్ల అది ఏమనుకుంటుంది? ఆ రక్తం ఆ ఎముకలో ఉంది, దాన్నించి వచ్చింది అనుకుంటుంది. కాని నిజమేమిటో మనకు తెలుసు. వేదాంతం ఈ ప్రపంచం ఆ ఎముకలాంటిది అంటుంది. ప్రపంచంవల్ల ఒక్క బొట్టు ఆనందం కూడా అనుభవించలేము. అదంతా నా ఆనందమే! ఇంగ్లీషు ఎంజాయ్ పదం తీసుకుంటే ఎన్ (తమిళంలో నా)- జాయ్ (ఆనందం), నా ఆనందం.

**విషయానందే బ్రహ్మానందః। - పూజ్యస్వామీజీ**

ఏ వస్తువు తిని, అనుభవించి ఆనందం పొందినా, అది బ్రహ్మానందం నుండి వచ్చిన ఆనందమే. ఐస్‌క్రీమ్ తిని ఆనందం పొందినా, క్లాసు విని ఆనందం పొందినా ఏ ఆనందం పొందినా, అది ప్రతిబింబ ఆనందం మాత్రమే. జ్ఞానికీ, అజ్ఞానికీ మధ్య భేదం ఇందులో ఉంది. అజ్ఞాని ఒక వస్తువువల్ల ఆనందం పొందాననుకుని దాన్ని **విషయానందం** అంటాడు. కాని జ్ఞాని అది కూడా **ఆత్మానందమే** అంటాడు. సంగీతం వింటూ ఆనందం పొందుతారు ఇద్దరూ. అజ్ఞాని సంగీతం ఆగిపోగానే, ఆనందం పోయింది అనుకుంటాడు. జ్ఞాని సంగీతం ఆగిపోయినా ఆనందం పోయింది అనడు. ఆనందం ప్రకటితమవటానికి అవసరమైన మాధ్యమం లేదు అంతే అంటాడు.

ఆనందం లేదు అంటే ఆనందం ప్రకటితమవలేదు అని అర్థం. ఆనందం ఒకసారి ప్రకటితమవుతుంది. ఒకసారి ప్రకటితమవదు.

కుక్కలో రక్తం ఉంది. ఎముక తినకముందు ప్రకటితమవలేదు. తిన్నాక ప్రకటితమయింది.

ఆ విధంగా మనం సత్,చిత్,ఆనంద స్వరూపులం అంటున్నది శాస్త్రం. ఈ సత్‌చిత్ ఆనందం శరీరంద్వారా ప్రకటితమవుతుంది. శాస్త్రం బ్రహ్మను వివరించేటప్పుడు సచ్చిదానంద బ్రహ్మ అంటుంది. నా అనుభవంద్వారా నేను సచ్చిదానందం అని తెలిసింది.

**అహమస్మి సదా భామి కదాచిన్నాహమప్రియః।**
**బ్రహ్మైవాహమతః సిద్ధం సచ్చిదానంద లక్షణమ్॥అద్వైతమకరందమ్- 2**

అందువల్ల నేను ఏమిటి? నేను బ్రహ్మను.

**లక్షణ ఐక్యాత్ వస్తు ఐక్యమ్ - అహం బ్రహ్మ అస్మి**

**పరమం బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి-** బ్రహ్మజ్ఞానం ఎవరు పొందుతారో, వారు బ్రహ్మ అవుతారు అంటున్నది ఉపనిషత్తు. ఎందుకంటే బ్రహ్మలక్షణం, నా లక్షణం ఒకటే అని చూశాము. ఈ జ్ఞానఫలం ఏమిటి?

**భిద్యతే హృదయగ్రన్థిః ఛిద్యన్తే సర్వసంశయాః।**
**క్షీయన్తే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే॥ - ముండకమ్ 2-2-8**

బ్రహ్మజ్ఞానం పొందటంవల్ల అతను అజ్ఞానంతో వేసుకున్న ముడులన్నీ విడివడతాయి; అన్ని సంశయాలూ తీరుతాయి; పుణ్యపాపాలన్నీ తొలగిపోతాయి. దీన్నే మోక్షం అంటారు. మోక్షాన్ని పొందుతాడు.

**బ్రహ్మజ్ఞానేన మోక్ష ఫలమ్**

## స్వామీజీ సూక్తిముక్తావళి

ఉపనిషత్ అద్దంలాంటిది. అద్దం కొనేటప్పుడు మాత్రమే మీరు అద్దం ఎలా ఉందో చూస్తారు. కాని, దాన్ని కొని ఇంటికి తెచ్చాక, అద్దంలోకి చూసినప్పుడు మిమ్మల్నే చూసుకుంటారు.

# 26. సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ

శంకరభగవత్పాదులు, **సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ** అనే ఈ వాక్యంమీద భాష్యం రాశారు. దీన్ని **బ్రహ్మ లక్షణ వాక్యభాష్యం** అంటారు. ఆ భాష్యాన్ని ఇప్పుడు చూద్దాము.

ఈ భాష్యాన్ని మనం అర్థం చేసుకోవటానికి వీలుగా ఐదు భాగాలుగా విభజించవచ్చు. అవి– ఉపక్రమం, సత్యపదవిచారణ, జ్ఞానపదవిచారణ, అనంతపద విచారణ, ఉపసంహారం. జ్ఞానం పదాన్ని శంకరాచార్యులవారు రెండు చోట్ల విశ్లేషించారు. సత్యపదం తర్వాత; మళ్లీ ఉపసంహారం తర్వాత. మన వీలుకోసం రెండూ కలిపి సత్యపదం తర్వాతనే చూద్దాము. ఈ నేపథ్యంతో ఈ భాష్యాన్ని చూద్దాము.

**1. ఉపక్రమం –** సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ అనే వాక్యంలో బ్రహ్మపదాన్ని విశేష్యం (నౌన్) అనీ, తక్కిన మూడు పదాలనూ విశేషణాలు (ఎడ్జెక్టివ్స్) అనీ అంటారు.

విశేషణాలు రెండు రకాలు ఉంటాయి. అవి వ్యాకర్తక విశేషణాలు; లక్షణ విశేషణాలు.

**ఎ) వ్యాకర్తక విశేషణాలు–** కొన్ని విశేషణాలు విశేష్యాన్ని పరిమితం చేస్తాయి ఉదా: ఆ బీరువాలోనుంచి నీలం పుస్తకం తీసుకురా. ఆ బీరువా నిండా పుస్తకాలు ఉన్నాయి. నీలం పుస్తకం తీసుకురా అని ప్రత్యేకించి చెప్పటంవల్ల, తక్కిన పుస్తకాలు కాదు అని చెప్పకనే చెప్పినట్టు అవుతుంది.

**బి) లక్షణ విశేషణాలు –** కొన్ని విశేషణాలు విశేష్యాన్ని నిర్వచిస్తాయి. ఉదా: ఆకాశంలో అతి ప్రకాశవంతంగా ఉన్నది చందమామ.

కొందరు వ్యక్తులు రాత్రి ఆరుబయటకు వచ్చారనీ, వారిలో ఒకరికి చంద్రుడంటే ఎవరో తెలియదనీ ఊహించుకుందాము. అప్పుడు అందులో ఒక వ్యక్తి అన్నిటికన్నా ప్రకాశవంతంగా మెరుస్తున్నది చందమామ అని చెబుతాడు. ఇక్కడ చంద్రుని నిర్వచనం ఇస్తున్నాడు.

ఈ రెండు విశేషణాల మధ్యా కొన్ని వ్యత్యాసాలు ఉన్నాయి. అవి–

1. వ్యాకర్తక విశేషణంలో విశేష్యం తెలుసు. పుస్తకం అంటే ఏమిటో తెలుసు. కాని రెండవ దానిలో చంద్రుడు ఎవరో తెలియదు.

2. వ్యాకర్తక విశేషణంలో విశేష్యం ఒక జాతికి చెందింది. పుస్తకం అనేది పుస్తకాల జాతికి చెందింది. అందులో ఈ నీలం పుస్తకం ఒకటి. కాని రెండవ దానిలో జాతి లేదు. అనేక చందమామలు లేరు. ఉన్నదొకటే చందమామ.

3. వ్యాకర్తక విశేషణంలో నీలం పుస్తకం పదం ఆ ఒక్క పుస్తకాన్ని తక్కిన పుస్తకాలకు భిన్నంగా చూపిస్తుంది. అంటే స్వజాతీయ భేదం ఉంది. కాని రెండవ దానిలో ఉన్నదొకటే చందమామ, స్వజాతి లేదు అన్నప్పుడు స్వజాతీయభేదం చూపటానికి ఆస్కారం లేదు.

ఇప్పుడు ఈ రెండు విశేషణాలలో సత్యం, జ్ఞానం అనంతం బ్రహ్మ వాక్యంలో విశేషణాలు ఏవి? వ్యాకర్తక విశేషణం అందామా? మనకు బ్రహ్మ తెలియదు. ఉన్నదొకటే బ్రహ్మ కాబట్టి స్వజాతి లేదు; స్వజాతి లేదు కాబట్టి స్వజాతీయభేదం, తద్వారా పరిమితి చూపించటం లేదు. ఇంక మిగిలింది ఒకటే. లక్షణవిశేషణం. అందువల్ల సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ వాక్యంలో వాడిన విశేషణాలను లక్షణ విశేషణాలు అంటారు.

**2.సత్యపద విచారణ–** శంకరాచార్యులు దీని అసలు అర్థాన్ని మూడు దశల్లో చెప్పుకుంటూ వస్తారు.

**ఎ) సత్యం–** అవ్యవభిచార స్వరూపం, నిర్వికారం.

**బి) నిర్వికారం** కాబట్టి ఉపాదానకారణం. ఉపాదానకారణానికి మార్పు ఉండదు. కుండ, మట్టి ఉదాహరణ తీసుకుంటే కుండ కార్యం, మట్టి కారణం అంటే ఉపాదాన కారణం. కుండ అనే కార్యం ఒకరోజు ఏర్పడుతుంది. తర్వాతెప్పుడో పగిలిపోతుంది. అంటే దానికి చావు, పుట్టుకలు ఉన్నాయి. దాని ఉపాదానకారణమైన మట్టి కుండముందూ ఉంది, కుండలోనూ ఉంది. కుండ మరణించాకా ఉంది. అంటే మూడు కాలాల్లోనూ ఉంది.

**సి) ఉపాదాన కారణం** ఆత్యంతిక ఉపాదానకారణం. అంటే కేవల సద్రూపం. ఇందాకటి ఉదాహరణలో, కుండ లేకపోయినా, మట్టి మూడు కాలాల్లోనూ ఉంటుందని చూశాము. ఈ సత్యం కుండ-మట్టికే పరిమితం. కుండకి మట్టి కారణం కాని, అది జగత్తుకు మూలకారణం కాదు. అందువల్ల దీన్ని ఆపేక్షిక సత్యం అంటారు.

ఉపాదాన కారణాలు రెండు రకాలు– ఆపేక్షిక సత్యం, ఆద్యంతిక సత్యం. కుండకు మట్టి; ఆభరణాలకు బంగారం ఆపేక్షిక సత్యాలు. కాని అవి జగత్తుకు

మూలం కాదు అని చూశాము. అలా మూలకారణాన్ని శోధించుకుంటూ వెళితే మిగిలేది సత్ మాత్రమే.

**సదేవ సోమ్యేదమగ్రే ఆసీదేకమేవాద్వితీయమ్ - ఛాందోగ్యమ్ 6-2-1**

జగత్తుకు ముందూ, జగత్తు ఉన్నప్పుడూ, జగత్తు ప్రళయంలో లయమయ్యాక కూడా ఉన్నది సత్ మాత్రమే. దీన్ని **శుద్ధ సత్** అంటారు.

అలా సత్యం అంటే నిర్వికారం, అందువల్ల ఉపాదాన కారణం, అందులోనూ ఆద్యంతిక ఉపాదాన కారణం, అంటే శుద్ధ సత్. సత్యం అంటే శుద్ధ సత్ అనే అర్థం వాచ్యార్థం కాదు, లక్ష్యార్థం. వేదాంతానికి రాకముందు సత్ అంటే ఉనికి ఉన్న ఏ వస్తువైనా అని అనుకుంటాము. వేదాంతానికి వచ్చాక ఉనికి ఉన్న వస్తువులో వస్తువును తీసేసి ఉనికిని మాత్రమే చూడాలని నేర్చుకుంటాము.

| | | | |
|---|---|---|---|
| బల్ల | = | ఉనికి | + నామరూపాలు |
| పుస్తకం | = | ఉనికి | + నామరూపాలు |
| మనిషి | = | ఉనికి | + నామరూపాలు |

బల్ల, పుస్తకం, మనిషి పదాల్లో వాటికున్న నామరూపాలను తీసేస్తే అన్నింటిలోనూ సమానంగా మిగిలిందేమిటి? ఉనికి. నామరూప అంశం తీసేస్తే కేవలం సత్ అంశమే మిగులుతుంది. దీన్ని **భాగత్యాగ లక్షణం** అంటారు.

**3. జ్ఞానశబ్ద విచారణ-** శంకరాచార్యులవారు సత్యం పదానికీ, జ్ఞానం పదానికీ మధ్య ఒక అద్భుతమైన సంబంధాన్ని సూచిస్తున్నారు. సత్యం అంటే మూల ఉపాదాన కారణం అని చూశాము కదా! ఉపాదాన కారణం అంటే పదార్థం (మాటర్). వస్తువు అచేతనం, జడపదార్థం. అందువల్ల బ్రహ్మను ఉపాదానకారణం అంటే జడం అనుకునే ప్రమాదం ఉంది. ఆ ప్రమాదాన్ని తప్పించటానికే బ్రహ్మ చైతన్యం అని నిరూపించాలి.

జ్ఞానం అంటే సంస్కృతంలో అనేక అర్థాలు ఉన్నాయి. ఒక అర్థం **జ్ఞానం = జ్ఞాతా** అని వస్తుంది. జానాతి ఇతి జ్ఞానమ్. వేద పూర్వభాగాన్ని ఆధారంగా చేసుకుని, వాదించేవారిని పూర్వపక్షి అంటారు. పూర్వపక్షం గురించి చెప్పేవారు. వేద అంతభాగాన్ని ఆధారంగా చేసుకుని చెప్పేవారిని సిద్ధాంతి అంటారు. శంకరాచార్యులవారు సిద్ధాంతి. ఇటువంటి తక్కిన దార్శనికులతో వాదించి, గెలిచి అద్వైతవేదాంతాన్ని నిలబెట్టారు శంకరభగవత్పాదులు.

ఆ వాదనలు ఎలా ఉంటాయో, ఇక్కడ కొంచెం ఉదాహరణకు చూస్తాము.

**పూర్వపక్షి వాదన–** జ్ఞానం అంటే జ్ఞానకర్త అని అర్థం.

**సోఽకామయత బహుస్యాం ప్రజాయేయేతి – తైత్తిరీయమ్**

సృష్టించాక తనే జీవిలో ప్రవేశించాడు. బ్రహ్మ= జీవుడు= జ్ఞానకర్త. అందువల్ల బ్రహ్మ జ్ఞానకర్త. జ్ఞానం అంటే జ్ఞానకర్త అని అంటాడు.

**శంకరాచార్యులవారి జవాబు–** శంకరులవారు దీన్ని ఖండిస్తారు.

ఎ) జ్ఞానకర్త సవికారం అయి ఉండాలి. ఏదైనా కర్మ చేయాలంటే, దానికి వికారాలు ఉంటాయి. కాని ఇంతకుముందే సత్యం నిర్వచనం చూసినప్పుడు సత్యం = నిర్వికారం అని చూశాము. ఇప్పుడు జ్ఞానాన్ని జ్ఞానకర్త అంటే ఆ పదాన్ని ఖండించినట్టు అవుతుంది.

**సత్యపదం నిర్వికారత్వంవల్ల బ్రహ్మ జ్ఞానకర్త కాదు**

బి) జ్ఞానకర్తకు పరిమితి ఉంటుంది. కర్త అంటే, కర్తను వెన్నంటే కర్మ+కరణం ఉంటాయి. కర్త, ఒక కరణం(పరికరం)ద్వారా ఒక కర్మ చేస్తాడు. బ్రహ్మ కర్త అయితే కర్మ, కరణం వేరవుతాయి. అప్పుడు బ్రహ్మ పరిచ్ఛిన్నం అవుతాడు. కాని తర్వాత వచ్చే పదం అనంతం, అర్థం అపరిచ్ఛిన్నం.

**అనంతపదం అపరిచ్ఛిన్నత్వంవల్ల బ్రహ్మ జ్ఞానకర్త కాదు**

ఈ విషయం నిరూపించాక, శంకరులవారు కొంచెం పక్కకు వెళ్ళి, ఈ భావనను నిరూపించే ఛాందోగ్యోపనిషత్తు వాక్యాన్ని ఉటంకిస్తారు.

**యత్ర నాన్యత్పశ్యతి నాన్యచ్ఛృణోతి, నాన్యద్విజానాతి స భూమా**
**ఛాందోగ్యమ్ -7-24-1**

దీని అర్థం ప్రమాతా, ప్రమాణం, ప్రమేయం విభజన ఉండదు.

అన్యత్ అంటే ప్రమేయం (ఆబ్జెక్ట్) విజానాతి (తెలుసుకోవటం) ప్రమాతా చెప్పలేదు, మనం కలుపుకోవాలి.

**యత్ర జ్ఞాతా జ్ఞేయం న జానాతి తత్ బ్రహ్మ**

బ్రహ్మ త్రిపుటి విలక్షణం. అంతేకాని జ్ఞానకర్త కాదు అంటాడు.

ఈ వాక్యాన్ని ఆధారంగా తీసుకుని పూర్వపక్షి మళ్ళీ వాదిస్తాడు. అందువల్ల ఛాందోగ్యోపనిషత్తు లోనే ఇంకా కొనసాగుతాము.

**పూర్వపక్షివాదన –** న విజానాతిని మాత్రం తీసుకుని బ్రహ్మ కర్త కాదు అంటున్నారు. కాని అదే వాక్యంలో ఇంకో పదం ఉంది. అది అన్యత్. అన్యత్

అంటే ప్రమేయం (ఆబ్జెక్ట్) అని చూశాము. పూర్వపక్షి ఏమంటాడు? బ్రహ్మ అన్యత్ విజానాతి మాట తీసుకుని, బ్రహ్మకు అన్యజ్ఞానవిషయాలు తెలియవు నిజమే కాని తన గురించి తనకు తెలుసు అంటాడు. అందువల్ల జ్ఞానకర్తృ నిషేధం లేదు. స్వజ్ఞానకకర్తృబ్రహ్మ.

**శంకరాచార్యులవారి జవాబు –** దీన్ని కూడా ఖండిస్తారు శంకరులవారు.

**ఎ) వాక్యభేద దోషః–** ఏక వాక్యస్య ఏకం తత్సర్వం

ఒక వాక్యంలో రెండు అర్థాలు తీసుకోలేము. సందర్భం ఏమిటి? బ్రహ్మ నిర్వచనం (ఛాందోగ్యంలో భూమ అని వస్తుంది). అందువల్ల భూమాలక్షణం, పూర్వపక్షి చెప్పిన వాదనవల్ల ఈ వాక్యంలో రెండు అర్థాలు వస్తున్నాయి.

1) బ్రహ్మ లక్షణం (నిర్వచనం) వస్తుంది.

2) అదనపు సమాచారం– బ్రహ్మ స్వజ్ఞానకర్త అని వస్తున్నది. ఇదెలా ఉంది అంటే ఎవరైనా రాముడు ఎవరు అని అడిగితే, రాముడు గుడికి వెళుతున్నాడు అని చెప్పినట్టు ఉంది. రాముడెవరు అంటే దశరథుని పుత్రుడు అని చెబుతాము కాని, ఈ అదనపు సమాచారం ఇవ్వము.

**బి) తర్కవిరోధం –** ఒకవేళ బ్రహ్మ తన గురించి తాను తెలుసుకున్నాడు అంటే అది తర్క విరోధం అవుతుంది. బ్రహ్మ జ్ఞాతా అయితే జ్ఞేయం అవలేదు. కర్త, కర్మను గురించి తెలుసుకుంటాడు. కాని తనను గురించి తను తెలుసుకోలేడు. ఒక మైక్రోస్కోప్‌లోంచి చూస్తే, చూసే కళ్ళను చూడలేము. అలాగే సబ్జెక్టు, ఆబ్జెక్టు ఒకటి కాదు. దీన్ని కర్తృకర్మ విరోధ దోషం అంటారు.

**పూర్వపక్షి వాదన–** బ్రహ్మ తనను తాను తెలుసుకోలేడు అంటే బ్రహ్మలో ఒక భాగం కర్త, ఇంకొక భాగం కర్మ అనవచ్చు కదా అంటాడు.

నా చేతిని నేను చూస్తున్నాను.

చూసే కన్ను కర్త, చూడబడే చెయ్యి కర్మ. రెండూ నాకు చెందినవే.

**శంకరాచార్యులవారి జవాబు–** బ్రహ్మను భాగాలుగా చేయలేము. ఎందుకంటే బ్రహ్మ నిరవయవం. బ్రహ్మకు భాగాలు లేవు. అందువల్ల ఛాందోగ్యోపనిషత్తు నిర్వచనం ప్రకారం కూడా బ్రహ్మ త్రిపుటికి అతీతం. ప్రమాతృ, ప్రమేయ, ప్రమాణ భేదాలు లేవు.

**జ్ఞానం రెండవ అర్థం –** జ్ఞానానికి రెండు అర్థాలున్నాయనీ, పూర్వపక్షి జ్ఞానకర్త అర్థం తీసుకున్నాడనీ చూశాము. ఇప్పుడు శంకరులవారు అసలు అర్థం చెబుతున్నారు. **జ్ఞానం అంటే జ్ఞానక్రియ.**

**పూర్వపక్షి వాదన–** దీన్ని పూర్వపక్షి ఖండిస్తాడు. జ్ఞానం క్రియ అయితే రెండు దోషాలు వస్తాయి.

ఎ) జ్ఞానం క్రియ అయితే అది కర్త, కరణాలమీద ఆధారపడాలి. అప్పుడు జ్ఞానక్రియ పరతంత్రం అవుతుంది. మాట్లాడేవ్యక్తి లేకుండా మాటలు రావు. రాసే వ్యక్తి లేకుండా రాత రాదు. ఆ రూపంగా బ్రహ్మ కూడా పరతంత్రం అవుతాడు.

బి) క్రియ అంటేనే అది మారుతుంది. దానికి ఆది, అంతాలు ఉంటాయి. సవికారం అవుతుంది. ఆ రూపంగా బ్రహ్మకు కూడా సవికారత్వం వస్తుంది.

**శంకరాచార్యులవారి జవాబు–** నీ వాదన సబబే. క్రియ అంటే అది పరతంత్రం అవుతుంది. సవికారత్వం అవుతుంది. కాని జ్ఞానానికి, వేదాంతంలో రెండు అర్థాలు ఉన్నాయి.

**ఎ) వృత్తి జ్ఞానం–** ఇది వాచ్యార్థం. ఇది మనస్సుకు చెందింది. ఇది క్రియ చేస్తుంది. కాబట్టి సవికారం, మనస్సుమీద ఆధారపడుతుంది కాబట్టి పరతంత్రం.

**బి) స్వరూప జ్ఞానం–** ఇది లక్ష్యార్థం. దీనిలో క్రియ లేదు కాబట్టి నిర్వికారం; ఆత్మకు చెందింది కాబట్టి స్వతంత్రం.

వృత్తి జ్ఞానం చిదాభాసద్వారా చిత్ స్వరూపజ్ఞానం ఇస్తుంది. అందువల్ల జ్ఞానం అంటే స్వరూపజ్ఞానం. మన స్వరూపం శుద్ధచైతన్యం. చిదాభాస కాదు. ఉదాహరణకు అద్దంలో మన ప్రతిబింబం చూస్తాము. మొహంమీద ఏదో అంటుకుంది. మన మొహాన్ని తుడుస్తామా, ప్రతిబింబాన్ని తుడుస్తామా? మొహాన్ని తుడుస్తాము. అలాగే మనస్సులో చిదాభాస ప్రతిబింబిస్తుంది. కాని బ్రహ్మ అసలు స్వరూపం శుద్ధచైతన్యం.

**4. అనంత పద విచారణ–** ఈ పదానికి ఎక్కువగా వివరణ ఇవ్వలేదు శంకరులవారు. అనంతం అంటే అంతం లేనిది అన్నారు.

**5. ఉపసంహారం–** సత్యం, జ్ఞానం పదాలు సృష్టిలో అన్నింటినీ కొట్టివేస్తాయి. అప్పుడు శూన్యం మాత్రమే మిగులుతుంది. మీరు చెప్పేది ఎలా ఉందంటే

**గొడ్రాలి కొడుకు వెళుతున్నాడు**
**అతను మృగతృష్ణలో స్నానం చేశాడు**
**ఆకాశ పుష్పాలను పెట్టుకున్నాడు**
**కుందేటి కొమ్మును ధరించాడు** అని చెప్పినట్టు ఉంది అంటాడు పూర్వపక్షి.

**శంకరాచార్యులవారి జవాబు–** సత్యం, జ్ఞానం పదాలు తక్కిన వాటిని కొట్టివేస్తాయి కాని సానుకూలంగా భావరూప పదార్థాన్ని సూచిస్తాయి. ఏమిటది? **సత్,చిత్ ఆత్మ.** శుద్ధసత్, శుద్ధచిత్, అనంతం. దేన్నీ సానుకూలంగా చూపించదు కాని అనంతం కానిది అని కొట్టివేస్తుంది. అనంతం పదం ఎందుకు చెప్పారు అంటే అనంతం పక్కన లేకపోతే సత్యం, జ్ఞానం పదాలకు వాచ్యార్థమే వచ్చేది కాని, శుధ్ధసత్, శుధ్ధచిత్ అర్థాలు వచ్చేవి కావు. అనంతంవల్ల వాటికి లక్ష్యార్థం వచ్చింది.

**అందువల్ల సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ అంటే**
**శుధ్ధసత్, శుధ్ధచిత్, అంతం లేని బ్రహ్మ**

## స్వామీజీ సూక్తిముక్తావళి

శ్రోత్రస్య శ్రోత్రమ్ - కేన

1. ఆత్మ వేరు, చెవి వేరు.
2. ఆత్మ చెవి అంతటా వ్యాపించి ఉంది.
3. ఆత్మ ఉండటం వల్లే చెవిని చెవి అనగలుగుతున్నాము. అంటే చెవితో వినగలుగుతున్నాము.కాని ఆ చెవివల్ల ఆత్మను తెలుసుకోలేము.

కళ్ళు ప్రపంచాన్నంతా చూడగలవు కాని తమను తాము చూసుకోలేవు. మీ వేలు మొనతో మీరు అన్నింటినీ ముట్టుకోగలరు కాని ఆ వేలు మొనను ముట్టుకోలేరు. మీరు ఈ సెల్‌ఫోన్‌తో అందరికీ ఫోన్ చేయగలరు. కాని మీకు మీరు చేసుకోలేరు. మీరు ప్రమాత, ఎన్నటికీ ప్రమేయం కారు.

# 27. మహావాక్యవిచారణ

పంచదశిలో మహావాక్యవివేక ప్రకరణం ఉంది. అందులో మహావాక్య నిర్వచనం వస్తుంది. మహావాక్యం అంటే ఏమిటి?

**జీవాత్మ పరమాత్మ ఐక్యబోధక వేద వాక్యం**

జీవాత్మ, పరమాత్మల ఐక్యం గురించి చెప్పే వేదవాక్యాన్ని మహావాక్యం అంటారు. ఐక్యం అనేటప్పుడు స్వరూప ఐక్యం అనాలి. ఇది చాలా ముఖ్యం. ఎందుకంటే జీవాత్మ, పరమాత్మల వాచ్యార్థం తీసుకుంటే చాలా బేధాలు ఉన్నాయి.

పూజ్యస్వామీజీ, సమీకరణం (ఈక్వేషన్) లక్షణాలను అద్భుతంగా విశ్లేషిస్తారని స్వామీజీ చెబుతారు. ఈక్వేషన్‌కి అటూ, ఇటూ ఉన్నవి పూర్తిగా భిన్నంగా ఉంటే ఈక్వేషన్ కుదరదు.

8=9 అనలేము.

ఈక్వేషన్‌కు అటూ ఇటూ ఉన్నవి స్పష్టంగా, సమానంగా ఉంటే, ఈక్వేషన్ అవసరం లేదు.

8=8 అని మనం ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.

మరి ఈక్వేషన్ ఎప్పుడు కుదురుతుంది? రెండు వైపులా చూడటానికి భిన్నంగా ఉన్నా, స్వరూపరీత్యా ఒకటే అయి ఉన్నప్పుడు కుదురుతుంది.

5+3=9-1

రెండు వైపులా చూస్తే, అవి చూడటానికి భిన్నంగా ఉన్నాయి. రెండు వైపులా ఉన్న అంకెలు వేరు; రెండు వైపులా ఉన్న గుర్తులు వేరు (+,-). కళ్ళు వాటి మధ్య ఉన్న భిన్నత్వాన్ని తెలియజేస్తాయి. కాని బుద్ధి అర్థం చేసుకుంటుంది.

5+3 = 8; 9-1 = 8.

అందువల్ల రెండింటినుంచి వచ్చే అంకె ఒకటే, అది అక్కడ ఇవ్వకపోయినా, అని అర్థం చేసుకుంటుంది.

ఇప్పుడు జీవాత్మ, పరమాత్మల విషయానికి వస్తే రెండూ స్పష్టంగా ఒకటే అని తెలిస్తే కర్మయోగం, ఉపాసనాయోగం, జ్ఞానయోగాలు అవసరం లేదు. జ్ఞానయోగంలో కష్టపడి శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేయనవసరం లేదు. అలాగే జీవాత్మ, పరమాత్మలు ఒకదానికొకటి పూర్తి భిన్నంగా ఉంటేనూ మహావాక్యం కుదరదు. ఎప్పుడు కుదురుతుంది? రెండూ చూడటానికి భిన్నంగా ఉన్నా,

స్వరూపరీత్యా ఒకటే అయి ఉన్నప్పుడు కుదురుతుంది. ఆ స్వరూపాన్ని వివరించటానికి కష్టపడాలి. అలా నిరూపించేది మహావాక్యం. దాన్ని ఇలా అంటారని చూశాము.

**జీవాత్మ పరమాత్మ ఐక్యబోధక వేదవాక్యం**

ఇలా కూడా అనవచ్చు – **జీవాత్మ పరమాత్మ అభేదబోధక వేదవాక్యం**

వేదపూర్వభాగం, వేద అంతభాగాల్లో కూడా, ఇది తాత్పర్యం. తక్కిన వాక్యాలన్నీ దానికి సంసిద్ధం చేసే వాక్యాలు. మహావాక్యమే అంతిమలక్ష్యం.దీని సారాంశం, ఇది మోక్షాన్నిచ్చే జ్ఞానం. ఈ ఐక్యజ్ఞానమే వేదంయొక్క తాత్పర్యం.

ఐక్యజ్ఞానమే వేదంయొక్క తాత్పర్యం అని ఎలా చెప్పగలము? అన్ని ఉపనిషత్తులూ ఐక్యం గురించే చెబుతున్నాయని నిరూపించటంద్వారా. దానికి అవి వాడే పద్ధతులు భిన్నంగా ఉండవచ్చు. పంచకోశం, అవస్థాత్రయం, సృష్టిప్రకరణం– అలా ఏదైనా తీసుకుని నిరూపించవచ్చు. కాని 12 మంత్రాలే ఉన్న అతి చిన్నదైన మాండూక్యోపనిషత్తునుంచి ఐదువందల పైనే మంత్రాలు ఉన్న ఛాందోగ్యోపనిషత్తు వరకూ, అన్నింటిలోనూ బోధ ఒకటే – ఇది నిరూపించటానికి మన సాంప్రదాయం నాలుగు వేదాలనుంచి నాలుగు మహావాక్యాలను ఉదాహరణకు తీసుకుంది.

| **వేదం** | **ఉపనిషత్తు** | **మహావాక్యం** |
|---|---|---|
| ఋగ్వేదం | ఐతరేయోపనిషత్తు | ప్రజ్ఞానం బ్రహ్మ |
| యజుర్వేదం | బృహదారణ్యకం | అహం బ్రహ్మ అస్మి |
| సామవేదం | ఛాందోగ్యోపనిషత్తు | తత్త్వమసి |
| అథర్వణ వేదం | మాండూక్యోపనిషత్తు | అయమాత్మా బ్రహ్మ |

ఈ నాలుగు మహావాక్యాల గురించి వినగానే, నాలుగే మహావాక్యాలు ఉన్నాయి అనుకోకూడదు. ఎన్నో మహావాక్యాలు ఉన్నాయి. అందువల్ల ఉదాహరణకు అనే పదం వాడాము నాలుగు ముందు.

**స యశ్చాయం పురుషే యశ్చాసావాదిత్యే స ఏకః – తైత్తిరీయమ్**

పంచదశిలో మహావాక్య వివేకప్రకరణంలో పైన చెప్పిన వరుసక్రమంలో మహావాక్యాలను తీసుకుని, ఒక్కొక్కదాన్ని రెండేసి శ్లోకాలలో, వెరసి 8 శ్లోకాలలో వివరిస్తారు విద్యారణ్యులవారు. ఆ నాలుగు మహావాక్యాల అర్థాలని విశ్లేషిస్తే ఈ సందేశం అర్థమవుతుంది.

| జీవాత్మ -వ్యష్టి | పరమాత్మ – సమష్టి |
|---|---|
| 1. స్థూలశరీరం | స్థూలప్రపంచం |
| 2. సూక్ష్మశరీరం | సూక్ష్మప్రపంచం |
| 3. కారణశరీరం | కారణప్రపంచం |
| 4. చిదాభాస | చిదాభాస |
| 5. చిత్ | చిత్ |

స్థూల,సూక్ష్మ, కారణశరీరాలు ప్రతిబింబ మాధ్యమాలు. అవి ప్రతిబింబింప చేసిన ప్రతిబింబ చైతన్యం – చిదాభాస, బింబచైతన్యం – చిత్. ఇది వ్యష్టిపరంగా. స్థూల,సూక్ష్మ, కారణప్రపంచాలు ప్రతిబింబమాధ్యమాలు. అవి ప్రతిబింబింపచేసిన ప్రతిబింబచైతన్యం చిదాభాస. బింబ చైతన్యం చిత్. ఇప్పుడు ఈ రెండింటినీ పోల్చి ఎక్కడ పోలిక ఉందో, ఎక్కడ భేదం ఉందో చూసి, ఐక్యాన్ని చక్కగా, లక్షణంగా ఒప్పుకోవాలి.

వ్యష్టికి అల్పవ్యాపిత్వం కాబట్టి వ్యష్టి మూడు శరీరాలు చిన్నవి.సమష్టి మూడు ప్రపంచాలూ చాలా పెద్దవి. అందువల్ల మూడు శరీరాల్లోనూ ఐక్యం కుదరదు. భేదమే ఉంది. వ్యష్టి కారణశరీరాన్ని అవిద్య అంటే సమష్టి కారణప్రపంచాన్ని మాయ అంటారు. అవిద్య వ్యష్టియొక్క సంచిత కర్మవల్ల వ్యష్టి తక్కిన శరీరాలను సృష్టి చేస్తే, మాయ సమష్టి సంచిత కర్మలవల్ల జగత్తును సృష్టి చేస్తుంది.

ప్రతిబింబాన్ని ప్రతిబింబింపచేసే శరీరాల్లో, అంటే ప్రతిబింబమాధ్యమంలో భేదం ఉన్నప్పుడు, అవి ప్రతిబింబింపచేసే ప్రతిబింబాల్లో కూడా భేదం ఉంటుంది. చిన్న మాధ్యమం చిన్న ప్రతిబింబాన్ని చూపిస్తే, పెద్ద మాధ్యమం పెద్ద ప్రతిబింబాన్ని చూపిస్తుంది. జీరోవాల్ట్ బల్బ్‌కూ, హండ్రెడ్ వాల్ట్ బల్బ్‌కూ మధ్య ఉన్నంత తేడా ఉంటుంది ఈ రెండింటికీ మధ్య.

ఉన్న ఐదు అంశాల్లో నాలుగు అంశాలు భిన్నంగా ఉన్నాయి. అయినా ఐక్యం ఉంది అంటే అదృష్టం బాగుండి ఐదవ అంశంవల్ల అది సాధ్యం. కాని దురదృష్టం ఏమిటంటే మనం అది గమనించము. ఎంతసేపూ నాలుగు బేధాలనే చూస్తాము. చిత్‌ను వ్యష్టిలో సాక్షి అని, సమష్టిలో ఈశ్వరసాక్షి అని అంటాము. కాని రెండూ ఒకటే. చిత్ గుణాలు ఏమిటి? వ్యష్టిలో చిన్న చిత్, సమష్టిలో పెద్ద చిత్ ఉన్నాయి అనకూడదు. చిత్ లేదా చైతన్యం (ఒరిజినల్ కాన్షస్‌నెస్)

సర్వవ్యాపకం. దానికి భాగాలు లేవు. అందువల్ల చైతన్యాన్ని ఆకాశంతో పోలుస్తారు. **చైతన్యం అఖండం, నిరవయం, నిష్కలం.** జీవాత్మ పరమాత్మల్లో ఉన్న చైతన్యం ఒకటే అవటంవల్ల జీవాత్మ, పరమాత్మల ఐక్యం చెప్పటం జరుగుతుంది.

ఇక్కడ ఒక ప్రశ్న ఉదయిస్తుంది. ఉన్న ఐదు అంశాల్లో నాలుగు అంశాలు భేదాన్ని సూచిస్తే ఒక్క అంశమే అభేదాన్ని సూచిస్తున్నది. ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థుల మధ్య పోటీ ఉన్నప్పుడు, నాలుగు ఓట్లు వచ్చినతను గెలిచినట్లా, ఒక్క ఓటు వచ్చినతను గెలిచినట్లా? నాలుగు ఓట్లు వచ్చిన వ్యక్తే! అలాంటప్పుడు వేదం అభేదాన్ని ఎలా తాత్పర్యంగా చెప్పగలదు? దాసోహం ఉండాలి. కాని సోహం కాదు. ద్వైతం ఉండాలి కాని అద్వైతం కాదు అని అడుగుతారు.

శంకరాచార్యులవారు ఈ ప్రశ్నకు జవాబుతో సిద్ధంగానే ఉన్నారు. నాలుగు అంశాలు భిన్నంగా ఉన్నాయని నేను చూడలేదనుకున్నారా అని ఎదురు ప్రశ్నిస్తారు. శంకరులవారి జవాబు చూసే ముందు, మనం మూడురకాల సత్యాన్ని ఒకసారి గుర్తుతెచ్చుకోవాలి. ఈ మూడు సత్యాలను గుర్తుంచుకోకపోతే, అద్వైతం పనిచేయదు. ఏమిటవి?

1. ప్రాతిభాసిక సత్యం– స్వప్నప్రపంచం
2. వ్యావహారిక సత్యం– జాగ్రద్ ప్రపంచం
3. పారమార్థిక సత్యం– త్రికాలేపి తిష్ఠతి

మూడుకాలాల్లోనూ ఉంటుంది పారమార్థిక సత్యం.

**బ్రహ్మ సత్యం జగన్మిథ్యా**
**జీవో బ్రహ్మైవ నాపరః**

జగత్తును వ్యావహారిక సత్యం అంటారని చూశాము.వ్యావహారిక సత్యం మూడు కాలాల్లోనూ ఉండదు. ఒక కాలంలో వచ్చి ఇంకో కాలంలో వెళ్ళిపోతుంది. పైగా దానికి విడిగా ఉనికి లేదు. మట్టి లేకుండా కుండకు విడిగా ఉనికి లేదు. అది నామరూపాత్మకం మాత్రమే. అందువల్ల దాన్ని మిథ్య అంటారు. అలాగే కారణం లేకుండా జగత్తుకు విడిగా ఉనికి లేదు. అది కేవలం నామరూపాత్మక జగత్తు. అందువల్ల దాన్ని మిథ్య అంటారు. మిథ్యను పట్టించుకోనవసరం లేదు.

నాలుగు అంశాలు కలిగియున్నా కూడా ఆ నాలుగు అంశాలూ, వ్యావహారిక స్థాయికి చెందినవి; అందువల్ల మిథ్య. అందువల్ల అవి ఎన్ని అంశాలు కలిసినా లాభం లేదు. ఉదాహరణకు ఎక్జిబిషన్‌లలో అద్దాల గది అని ఒక గది

పెడతారు. అందులో అద్దాలు ప్రత్యేకంగా ఉంటాయి. వాటివల్ల మనం ఒకదాంట్లో మరుగుజ్జుగా, ఇంకో దాంట్లో చాలా పెద్దగా, మరో దాంట్లో బక్కపీచుగా, మరో దాంట్లో రుబ్బురోలులా, అలా అనేక ఆకారాల్లో, రూపాల్లో కనిపిస్తాము. అందులోకి సరదాగా వెళ్ళి నవ్వుకుని బయటకు వస్తాము కాని నేను మారిపోయానని బాధపడుతూ కూర్చోము. వ్యవహారంకోసం ఈ నాలుగు అంశాలనూ తీసుకుంటాము కాని, అవి మిథ్య అని మర్చిపోకూడదు.

అందువల్ల మనం అభేదంమీద దృష్టిపెట్టాలి. దీన్ని భాగత్యాగలక్షణం అంటారు. కొన్ని అంశాలను పక్కన పెట్టి అవసరమైనదే తీసుకోవటం. వేదాంత బోధను జీర్ణించుకోవటానికి మూడు దశల్లో నేర్చుకోవాలి. శ్రవణం, మననం, నిదిధ్యాసనం.

**శ్రవణం–** వేదాంతాన్ని ఒక్కొక్కరు ఒక్కొక్కలా విశ్లేషించారు. కొందరు మహావాక్యం ముఖ్యం అంటారు. మరికొందరు కాదు అంటారు. ఎవరిది స్వీకరించాలి? బుద్ధిభేదం కలుగుతుంది. అలాగే దాసోహం అంటే మోక్షం వస్తుందని ఒకరు, కాదు సోహం అంటే మోక్షం వస్తుందని ఇంకొకరు అంటారు. అందువల్ల మీరు స్వంతంగా చదివితే అయోమయంలో పడతారు. గురువు దగ్గర శ్రవణం చేయాలి.

శ్రవణంలో రెండు దశలు ఉన్నాయి. ఒకటి ప్రాథమిక శ్రవణం. ఇందులో ఒక్క గురువు బోధను మాత్రమే వింటారు. కొంతమంది దీనితోనే తృప్తిపడతారు. రెండవ దశ శ్రవణంలో అనేక మంది బోధలు విని చివరగా ఒకటి సరియైన బోధ అని నిర్ణయించుకుంటారు. బ్రహ్మసూత్రాల్లో అలా అన్ని దర్శనాలను విశ్లేషించి అద్వైతసిద్ధాంతమే సత్యమని నిరూపిస్తారు.

ఉదాహరణకు ఛాందోగ్యోపనిషత్తులో తత్త్వమసి శ్వేతకేతో అనే వాక్యం తొమ్మిది సార్లు వస్తుంది. దాని ముందు వాక్యాలు చూస్తే ఇలా వస్తుంది.

**ఐతదాత్మ్యమిదగ్ం సర్వం తత్సత్యగ్ం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో॥**

**– ఛాందోగ్యమ్ 6-8-7**

నువ్వు ఆ పరమాత్మవని అసలు అర్థం. అది నిరూపించటానికి గురువు ఒక్కొక్క దృష్టాంతం చెప్పి, తొమ్మిదిసార్లు చెబుతాడు. కాని పూర్వపక్షి (వేదపూర్వభాగాన్ని నమ్మే వ్యక్తి) స ఆత్మా తత్త్వమసి వాక్యం చూస్తే అర్థం వేరే వస్తుంది అంటాడు. దాని సంధి విడదీస్తే ఆత్మ+ అతత్త్వమసి అని వస్తుంది. అంటే నువ్వు ఎప్పటికీ పరమాత్మవు కాదు. ఈ విషయమే తొమ్మిదిసార్లు నొక్కివక్కాణించాడు

గురువు అంటాడు అతను. కాని ఇది నిజం కాదని వ్యాకరణపరంగా, తక్కిన వాదనలద్వారా నిరూపిస్తాడు సిద్ధాంతి. శ్రవణం అంటే జ్ఞానం పొందటం.

**మననం-** మననంలో తార్కికంగా వచ్చే సందేహాలు తీరుతాయి.బుద్ధి పనే అది. అది ఎప్పుడూ తార్కికంగా ఆలోచిస్తుంది. నా బుద్ధి కొన్ని ప్రశ్నలు అడిగితే, తక్కిన వారి బుద్ధి కొన్ని అడుగుతుంది. అందువల్ల నా బుద్ధికి వచ్చే సందేహాలు తీరాలి. నా బుద్ధి నూరుశాతం సోహం సత్యవాదాన్ని నమ్మాలి. అద్వైతాన్ని తార్కికంగా నిరూపించము.

**నైషా తర్కేణ మతిరాపనేయా కఠ 1-2-9**

తర్కం అద్వైతాన్ని తప్పని నిరూపించలేదు. అద్వైతంలో తార్కికంగా లొసుగులు లేవు. కాని బ్రహ్మసూత్రాల్లో తర్కపాదం అని ఉంది. అందులో ఈ వాదోపవాదాలు వచ్చి, సోహం సత్యమని నిరూపణ అవుతుంది. ఒక్కముక్కలో చెప్పాలంటే మననం అంటే నిశ్చయజ్ఞానం.

**నిదిధ్యాసనం-** నిదిధ్యాసనంలో రెండు రకాలు ఉన్నాయి. **బ్రహ్మ అభ్యాసరూప నిదిధ్యాసనం, సమాధి అభ్యాసరూప నిదిధ్యాసనం.**

బ్రహ్మ అభ్యాసరూపనిదిధ్యాసనం అంటే నా ఉన్నత స్థితిలో నిలబడటం, వ్యవహారం జరిపేటప్పుడు కూడా ఈ శరీరత్రయాలు నేను వేసుకునే వేషం లాంటిది. నేను ఎలా నా శరీరానికి కోటు, షర్టు, బనియన్ వేసుకుంటానో అలా ఈ శరీరత్రయాలు నా వేషాలు.

బ్రహ్మ అభ్యాసరూపనిదిధ్యాసనంతో పాటు **సమాధి అభ్యాసరూప నిదిధ్యాసనం** కూడా చేయాలి. ప్రాపంచిక వ్యవహారాలను తగ్గించుకుని అంటే నేను చేసే పాత్ర పోషణను తగ్గించుకుని కాసేపు గ్రీన్‌రూమ్‌కి వెళ్ళి నా ఉన్నతస్థితిలో నేను నిలబడాలి. దానికి త్రిపుటినుంచి ద్విపుటికి మారాలి.

త్రిపుటి అంటే శరీరత్రయం+చిదాభాస కోణంలోంచి చూస్తే నేను జీవుణ్ణి. నేను కర్తను, భోక్తను. నాకు మహాసంచితకర్మలు ఉన్నాయి, నేను అనుభవిస్తున్న ప్రారబ్ధకర్మలు ఉన్నాయి. నేను జీవుడిగా పుణ్యపాపాలను అనుభవిస్తూనే ఉంటాను. జగత్తు నాకు నిరంతరం సమస్యలను ఇస్తూనే ఉంటుంది. నాకు మంచి కూడా జరుగుతుంది కాని సమస్యలే ఎక్కువ. అవి కూడా ముందు చెప్పిరావు. వాటిని అదుపులో పెట్టే శక్తి నాకు లేదు. జీవుడిగా నేను బాధకు లోనవుతూనే ఉంటాను.

నా కుటుంబం పెరుగుతున్న కొద్దీ, యస్ యమ్ యస్‌లు వస్తూనే ఉంటాయి. నాకు యస్ యమ్ యస్ రాగానే నేను యస్ వో యస్ (సేవ్ అవర్ సోల్స్)తో దేవుని దగ్గరకు పరుగుపెడతాను.

ఈ యస్ఓయస్‌లు అనంతంగా సాగిపోతూనే ఉంటాయి; ఎందుకంటే కర్మలు అమితంగా చేస్తూనే ఉంటాము. అవి కాక మన సంచితకర్మలు కూడా అనంతంగా ఉంటాయి. ఈ సమస్యల్లో భగవంతుడు కొన్ని పరిష్కరిస్తాడు, కొన్ని పరిష్కరించలేడు. మనకు సమస్య పరిష్కారం కాకపోతే, ఆయనను కూడా నిందించటానికి వెనుకాడము. నీకింత పూజలు చేస్తున్నానే నీకు కనికరం లేదా అని తిడతాము. అదంతా కర్మసిద్ధాంతం తెలియకపోవటంవల్ల. అన్నిటికన్నా శక్తివంతమైనది మనం చేసుకున్న కర్మ. జీవ, జగత్తు, ఈశ్వరుడు కాదు. అందువల్ల ఈశ్వరుడు నేను కర్మఫలదాతను మాత్రమే అంటాడు. అన్నింటికీ పరిహారం లేదు అంటాడు.

అందువల్ల త్రిపుటిలో ఉన్నంతకాలం మోక్షం పొందటమనేది జరిగే పని కాదు. భగవంతుడి దగ్గరకు వెళ్ళి నాకు శాశ్వతమైన మోక్షం కావాలి అని అడగాలి. దానికి పరమాత్మ ఒకటే మార్గం ఉంది అని చెబుతాడు. అది కర్మ కాదు, ఉపాసన కాదు, జ్ఞానం మాత్రమే.

**నాన్యః పంథా అయనాయ విద్యతే - పురుషసూక్తమ్**

త్రిపుటినుంచి ద్విపుటికి రావాలి. అందులో త్రిపుటిలో ఉండే మూడు ఉండవు. త్రిపుటిలో జీవ, జగత్తు, ఈశ్వరుడు అనే మూడు ఉంటాయి. ద్విపుటికి వస్తే రెండే ఉంటాయి. అవి సత్యం, మిథ్యలు లేదా ఆత్మ, అనాత్మ. ఇదే అద్వైతం. అద్వైతం అంటే ఉన్నదొకటే అని అర్థం. మరి ఆత్మ అనాత్మలో రెండు ఉన్నాయి కదా, ఒకటే అని ఎలా చెబుతారు? అనాత్మను మిథ్య అంటారనీ, మిథ్యకు విడిగా ఉనికి లేదనీ చూశాము. విడిగా ఉనికి లేనిది ఉన్నా లేనట్టే అని అర్థం.

సర్వవ్యాపకమైన చైతన్యమైన నేను సత్యం- ఎన్ని చైతన్యాలు ఉన్నాయి? ఉన్నదొకటే చైతన్యం. ఆ చైతన్యం నేనే. మిథ్యాజగత్తులో జరిగేవేవీ నన్ను బాధించవు.

**అచ్ఛేద్యోఽయమదాహ్యోఽయమ్ అక్లేద్యోఽశోష్య ఏవ చ।**
**నిత్యః సర్వగతః స్థాణుః అచలోఽయం సనాతనః॥ గీత 2-24**

ఈ ఆత్మ ఛేదించటానికి, దహించటానికి, తడపటానికి, శోషింపచేయటానికి సాధ్యం కానిది. ఇది నిత్యం, సర్వవ్యాపి, అచలం, స్థిరం, శాశ్వతం.

వేదాంతసారంలోని నాలుగవ అంశం గుర్తుపెట్టుకోవాలి.

4. ఈ మిథ్యాప్రపంచంలోకాని, ఈ మిథ్యాశరీరంలో కాని జరిగే ఏ సంఘటన కూడా నన్ను ఏమీ చేయలేదు.

ఈ మిథ్యా ప్రపంచంలో ఏం జరిగినా అది కర్మవల్ల జరుగుతుంది. కర్మ మిథ్యా కర్మనా, సత్యం కర్మనా? సత్యం కర్మ అనకూడదు. మిథ్యా ప్రపంచంలో కర్మ కూడా మిథ్యా కర్మనే. వేదాంతసారంలో 5వ అంశానికి రావాలి.

5. నేను బ్రహ్మను, ఈ మిథ్యాజగత్తు నన్ను ఏమీ చేయలేదు. ఈ విషయం మర్చిపోయి నేను నా జీవితాన్ని కష్టపెట్టుకుంటున్నాను. ఈ విషయాన్ని సమాధి అభ్యాసరూపనిదిధ్యాసనంద్వారా గుర్తుపెట్టుకోవటంవల్ల నా జీవితాన్ని వరంగా మలచుకుంటాను.

ఇలా మార్పు తెచ్చుకోవటాన్ని నిదిధ్యాసనం అంటారు. సోహం అనే మహావాక్య సందేశాన్ని శ్రవణ, మనన, నిదిధ్యాసనలద్వారా జీర్ణించుకోవటాన్ని జ్ఞాననిష్ఠ అంటారు. దీనికే అనేక పేర్లు ఉన్నాయి. బ్రహ్మనిష్ఠ, ఆత్మనిష్ఠ, బ్రాహ్మీస్థితి, జీవన్ముక్తి, స్థితప్రజ్ఞత.

## స్వామీజీ సూక్తిముక్తావళి

అద్వైతజ్ఞానం -
ద్వైత అనుభవాన్ని పారద్రోల లేదు;
ద్వైత అనుభవాన్ని పారద్రోలదు.
ద్వైత అనుభవాన్ని పారద్రోలనవసరం లేదు కూడా.

జ్ఞానయోగానికి రానిదే కర్మయోగం అసంపూర్ణం.
కర్మయోగం లేనిదే జ్ఞానయోగం అసంభవం.

# 28. జీవ-ఈశ్వర ఐక్యవిచారణ-1

జీవ ఈశ్వరుల సంబంధం గురించి చాలా వాదోపవాదాలు ఉన్నాయి. ద్వైతం, విశిష్టాద్వైతం, అద్వైతం- మూడు దర్శనాల అభిప్రాయాలను, వారి మధ్య ఉన్న వాదోపవాదాలను వ్యాసాచార్యులవారు బ్రహ్మసూత్రాల్లో రెండవ అధ్యాయంలో విపులంగా చర్చించి, అద్వైతసిద్ధాంతాన్ని స్థిరపరుస్తారు.

తమాషా ఏమిటంటే ద్వైతవాదులు, విశిష్టాద్వైతవాదులు, అద్వైతసిద్ధాంతులు అందరికీ ఆధారం ఒకటే. అది ప్రస్థానత్రయం. ప్రస్థానత్రయం అంటే **భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు** అని చూశాము. వాటిని ఆధారంగా చేసుకుని భిన్న అభిప్రాయాలు చెబుతున్నారు. ఎందుకీ భిన్నత్వం వచ్చింది? ఎందుకంటే వేదాంతం స్పష్టంగా చెప్పినట్టు కనబడదు. తనను తానే ఖండించుకున్నట్టుగా కనిపిస్తుంది కొన్నిచోట్ల. ఈ భిన్నవిషయాలను విశ్లేషించి, సత్యం ఏమిటో తెలుసుకోవాలి. అది బ్రహ్మసూత్రాల్లో వ్యాసాచార్యులవారు చేస్తున్నారు.

వేదాంతం చెప్పిన పరస్పరవిరుద్ధమైన అంశాలు ఏమిటి? కొన్ని మంత్రాల్లో వేదాంతం జీవాత్మ వేరు, పరమాత్మ వేరు అంటుంది. దీన్ని **భేదశ్రుతి** అంటారు. శ్రుతి అంటే శ్రుతివాక్యాలు. భేదాన్ని బోధించే శ్రుతివాక్యాలు. భేదం ఎవరెవరి మధ్య? జీవాత్మ, పరమాత్మల మధ్య. అంటే భేదశ్రుతిని పూర్తిగా చెపితే ఇలా వస్తుంది.

**జీవాత్మ పరమాత్మ భేదబోధక శ్రుతివాక్యాని**

ఈ భేదాన్ని బోధించేవి చాలా ఉన్నాయి. వాటిల్లో ముఖ్యమైనది-

**ద్వా సుపర్ణా సయుజా సఖాయా - ముండకమ్ 3-1-1**

ఒకే చెట్టుమీద రెండు పక్షులు ఉన్నాయి. ఆ పక్షులు జీవాత్మ, పరమాత్మ.

భేదశ్రుతివాక్యాలు ఎన్ని ఉన్నాయో, అభేద శ్రుతి వాక్యాలు కూడా అంతకంతా ఉన్నాయి. అభేదశ్రుతిని ఇందాకటిలాగా విడదీస్తే ఇలా వస్తుంది-

**జీవాత్మ పరమాత్మ అభేదబోధక శ్రుతివాక్యాని**

రెండు వాక్యాలు సమానంగా ఉన్నాయని చూశాము కదా. రెండూ శ్రుతి నుంచే వచ్చాయి కూడా. అలాంటప్పుడు ఈ సమస్యను ఎలా పరిష్కరించాలి? వ్యాసాచార్యులవారు ఒక అధికరణంలో పరిష్కరించారు కాని ఆయన చెప్పిన పరిష్కారం ఎవరికి వారే మాదే అవునన్నారు వ్యాసాచార్యులవారు అనేలాగా

ఉంది. అద్వైత సిద్ధాంతం అదే సత్యమన్నారు అంటే విశిష్టాద్వైతులు మమ్మల్నే సత్యమన్నారు ఆయన అంటారు. అలా భేదవాక్యాలు, అభేదవాక్యాలు తికమకలో పడేసినట్టుగా కనిపిస్తాయి. కాని వాటిని రెండురకాలుగా పరిష్కరిస్తాము. వ్యాసాచార్యులవారు తర్కంద్వారా పరిష్కరిస్తే, ఉపభాష్యకారులు మీమాంసద్వారా పరిష్కరిస్తారు.

ఇక్కడ మనం వ్యాసాచార్యులవారు తర్కంద్వారా పరిష్కరించిన తీరును చూద్దాము. పరిష్కారం చూసే ముందు, విశిష్టాద్వైతులకు, అద్వైతులకు మధ్య ఉన్న భేదాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి.

**విశిష్టాద్వైతం–** విశిష్టాద్వైతవాదులు భేదశ్రుతి వేదాంతంలోనిదే, అభేదశ్రుతి కూడా వేదాంతంలోనిదే కాబట్టి రెండింటినీ స్వీకరించాలి అంటారు. ఒకటి స్వీకరించి, ఇంకోదాన్ని కాదంటే అది **అర్థ అండన్యాయం** అవుతుంది అంటారు వారు. అర్థ అండన్యాయం అంటే ఒక గుడ్డులో సగం గుడ్డును పొదగవచ్చు, సగం గుడ్డును ఆమ్లెట్ వేసుకు తినవచ్చు అన్నట్టు ఉంటుంది. అలా చేయలేము కాబట్టి, వేదాంతంలో వచ్చిన ద్వైతభావనను చూపే వాక్యాలను, అద్వైతభావనను చూపే వాక్యాలనూ కాదనలేము. అందువల్ల రెండింటినీ సమన్వయపరచే పరిష్కారం ఏదైనా ఉంటే దాన్ని చూడాలి.

అలా సమన్వయపరచే పరిష్కారం ఒకటి ఉంది. దాన్ని స్వీకరించండి అంటున్నారు వారు. ఏమిటది?

**అంశ అంశి సంబంధం**

అంశి అంటే మొత్తం, అంశ అంటే ఒక భాగం. పరమాత్మ అనే మొత్తంలో, జీవాత్మ ఒక భాగం. ఇది అద్భుతమైన సమన్వయంగా భావిస్తారు వారు. ఎలా? వారి వాదన ఇలా సాగుతుంది.

ఒక మొత్తంలోని ఒక భాగం ఏది కూడా మొత్తానికి పూర్తిగా భిన్నంగా ఉండదు. అలాగని పూర్తిగా దానిలాగానూ ఉండదు. ఉదాహరణకు నా చెయ్యి నా శరీరంలో ఒక భాగం. అది శరీరానికి భిన్నంగానూ లేదు. శరీర లక్షణాలూ లేవు. నా చెయ్యి శరీరానికి విడిగా లేదు కాబట్టి భిన్నంగా లేదు; అలాగని నా శరీరం బరువు చూడాలంటే నా చెయ్యి బరువు ఒక్కటి చూస్తేచాలదు కదా! పూర్తి శరీరాన్ని చూడాలి. అలాగే తమిళనాడులో పుట్టిన వ్యక్తిని తమిళనాడులో పుట్టాడు అనవచ్చు; భారతదేశంలో పుట్టాడు అనవచ్చు.

ఇలా అంశ, అంశి సంబంధం తార్కికంగా ఉండటమే కాకుండా, వేదాంతమే చెప్పింది. దాన్ని **అంశశ్రుతిః** అంటారు. దీన్ని కూడా ఇందాకటి వాక్యాలలాగా వివరిస్తే ఇలా అంటారు – **జీవాత్మన పరమాత్మ అంశత్వ బోధక శ్రుతి వాక్యాని**

ఈ విషయం బృహదారణ్యకంలో అంతర్యామి బ్రాహ్మణంలో వస్తుంది.

ఆ విధంగా జీవాత్మను పరమాత్మలో ఒక అంశంగా నిరూపించవచ్చు. అంటే జీవాత్మ పరమాత్మ అంటే జీవాత్మ విడిగానూ ఉంది, పరమాత్మలో భాగంగా, పరమాత్మగానూ ఉంది.

**అద్వైతం–** ఇక్కడ ఒక విషయాన్ని జాగ్రత్తగా గమనించాలి మనం. మనం విశిష్టాద్వైతం తప్పని వాదించటం లేదు. మనం మన ప్రయాణం అక్కడితో ఆపకూడదు. ఇంకొక అడుగు ముందుకు వేయాలి అంటున్నాము. ఇంతవరకూ చూసిన మూడు అడుగులు– భేదశ్రుతి, అభేదశ్రుతి, అంశశ్రుతి. వీటికి నాలుగవ అడుగు కలిపితే వేదాంత అధ్యయనం పూర్తి అవుతుంది. దాన్ని **నిరంశశ్రుతి** అంటారు. **నిరంశశ్రుతి** అంటే వేదాంతంలో పరమాత్మను నిరంశంగా బోధించే శ్రుతివాక్యాలు. బ్రహ్మ నిరవయం, నిష్కలం, నిరంశం.

**హిరణ్మయే పరే కోశే విరజం బ్రహ్మ నిష్కలమ్॥ – ముండకమ్ 2–2–9**

పరమాత్మకు వస్తుకాల దేశపరిమితులు లేవు. బ్రహ్మకు ఆకాశంలాగా భాగాలు లేవు అని చెబుతుంది శ్రుతి అనేకచోట్ల.

ఇప్పుడు నిరంశశ్రుతి గురించి చెపితే అంశశ్రుతి, నిరంశశ్రుతి పరస్పర విరోధాలు అవుతాయి. మళ్ళీ ఈ రెండింటినీ ఎలా పరిష్కరిస్తాము? ఈ విరోధం విశిష్టాద్వైతులు ఎదుర్కోరు. మనకే వస్తుంది. ఎందుకంటే ఈ నాలుగవ వాదన అద్వైతంలోనే వస్తుంది. విశిష్టాద్వైతంలో లేదు. ఇప్పుడు ఈ రెండింటినీ ఎలా పరిష్కరించాలి? దీనికి మార్గం ఒకటే. నిరంశశ్రుతి పారమార్థిక సత్యాన్ని సూచిస్తే, అంశశ్రుతి వ్యవహారిక దృష్టిలో చెప్పబడింది.

దీన్ని వివరంగా చూసే ముందు ఈ సత్యాల గురించి ఒకసారి గుర్తు తెచ్చుకుందాము. మూడురకాల సత్యాలు ఉన్నాయి.

1. ప్రాతిభాసిక సత్యం – స్వప్నప్రపంచం. స్వప్నం ఉన్నంతసేపే ఉంటుంది.
2. వ్యావహారిక సత్యం – జాగ్రద్ ప్రపంచం. ఇది ఒకప్పుడు వచ్చి, తర్వాత పోతుంది.
3. పారమార్థిక సత్యం – ఇది మూడు కాలాల్లోనూ ఉంటుంది. అదే అద్వైతం.

జీవాత్మ పరమాత్మలో అంశం అని మనం కూడా విశిష్టాద్వైతులతో పాటు ఒప్పుకుంటాము.కాని వారికి, మనకు వ్యత్యాసం ఎక్కడంటే వారు అక్కడితో ఆగిపోతారు. మనం ఒక అడుగు ముందుకు వెళ్ళి, ఒకమాట అదనంగా వేస్తాము.

**జీవాత్మ పరమాత్మలో అంశం, కాని వ్యావహారిక దృష్ట్యా!**

కాని పారమార్థిక స్థాయికి వెళ్ళేసరికి అంశ, అంశి భేదాలు ఉండవు. జీవాత్మ, పరమాత్మల మధ్య భేదం లేదు. జీవాత్మ,పరమాత్మ ఐక్యాన్ని చూపిస్తుంది అది. అందువల్ల అద్వైతసిద్ధాంతం విశిష్టాద్వైతాన్ని ఒప్పుకుంటూనే, కాని వ్యావహారిక దృష్ట్యా అని ఒక మాట కలుపుతుంది.

**పూర్వపక్షి వాదన–** దీనికి పూర్వపక్షి వాదన లేవదీయవచ్చు. పూర్వపక్షి అంటే వేద పూర్వభాగాన్ని ఆధారంగా చేసుకుని వాదించే వ్యక్తి.జీవాత్మ పరమాత్మలో అంశం, కాని వ్యావహారిక దృష్ట్యా అని మీరు కలిపారు. వ్యాసాచార్యులవారు ఎక్కడా చెప్పలేదు. మీకెలా తెలుసు?

**సిద్ధాంతి జవాబు–** వ్యాసాచార్యులు ఇక్కడ ప్రత్యేకించి చెప్పకపోవచ్చు. కాని ఆయన ఇప్పుడు వ్యావహారిక దృష్టి గురించే మాట్లాడుతున్నారు. ఈ అధికరణంలో వస్తున్న ఆలోచనా ప్రవాహాన్ని గమనిస్తే అర్థమవుతుంది ఈ విషయం. ఇప్పుడు (బ్రహ్మసూత్రాల్లో) ఆయన చర్చిస్తున్న అంశం వ్యావహారిక దృష్టి. ఈ అధికరణం 17వ అధికరణం– 14వ అధికరణంనుంచి ఇప్పటిదాకా అదే అంశం గురించిన చర్చ కొనసాగుతున్నది.

14వ అధికరణంలో జీవాత్మను కర్తగా నిరూపించారు. కర్త అంటే అది వ్యావహారిక దృష్టిలోనే సాధ్యం.పారమార్థిక స్థాయిలో కర్త, కర్మ, భేదాలు లేవు. 15వ అధికరణంలో కర్త, కరణం వాడుతున్నాడు అంటారు. 16వ అధికరణంలో పరమాత్మ అనుగ్రహం కావాలి కర్తకు అంటున్నారు. అదే ఆలోచనాపరంపర 17 అధికరణంలో కూడా కొనసాగుతున్నది. **నేను కర్తగా, కరణం వాడే జీవాత్మగా, పరమాత్మ అనుగ్రహం కోరే జీవాత్మగా, పరమాత్మలో ఒక అంశాన్ని మాత్రమే.** నేను పరమాత్మనని అనలేను.

విశిష్టాద్వైతాన్ని మనం ఆ విధంగా శరీరం, మనస్సుల గురించి చెప్పేటప్పుడు అంశం అని ఒప్పుకుంటాము. కాకపోతే వ్యావహారిక దృష్ట్యా అని కలపటం మర్చిపోము. **పారమార్థిక స్థాయిలో జీవ, ఈశ్వర భేదం లేదు. అదే అద్వైతసిద్ధాంతం.**

# 29. జీవ-ఈశ్వర ఐక్యవిచారణ-2

జీవ-ఈశ్వర సంబంధ విచారణ బ్రహ్మసూత్రాల్లో చాలా వివరంగా సాగుతుంది. రెండవ అధ్యాయంలో 6వ అధికరణంలో ఈ విచారణ కొనసాగుతుంది. ఇక్కడ భేదాభేదవాది వాదన చూస్తాము. దీన్ని భట్టభాస్కరుడు చేస్తాడు. ఈ భట్టభాస్కరుడు శంకరాచార్యుల కాలానికో, అంతకు ముందు కాలానికో చెందినవాడు. విశిష్టాద్వైతం శంకరులవారి కాలం తర్వాత వచ్చింది. ఈ విశిష్టాద్వైతం ఈ భేదాభేద వాదనను మెరుగుపరచినట్టుగా ఉంటుంది. చాలా భావాలు రెండింటిలోనూ సరిపోతాయి.

**జీవ-ఈశ్వరులు భిన్నమా, ఏకమా?**

**పూర్వపక్షి-** జీవ-ఈశ్వరులు భిన్నంగా ఉన్నారు అంటాడు. అతను అద్వైతులనే ప్రశ్నిస్తాడు. మీరే జీవాత్మ, పరమాత్మ గురించి తెలుసుకోవాలి అంటారు అంటే ఏమిటి అర్థం? వారిరువురికీ మధ్య భేదం ఉందని మీరు ఒప్పుకున్నట్టేగా అంటాడు.

**సిద్ధాంతి-** మరి, శ్రుతిలో ఎన్నో మహావాక్యాలు ఉన్నాయి. మహావాక్యం అంటే జీవాత్మ పరమాత్మ ఐక్యాన్ని చూపించే వాక్యాలు. **ఉదా॥ తత్త్వమసి**

దీనికేం జవాబు చెబుతారు అని సిద్ధాంతి అడిగితే, ఈ సందర్భంలో భేదాభేద వాది రంగంలోకి దిగుతాడు.

**భేదాభేదవాది-** భేద వాక్యాలూ శ్రుతి వాక్యాలే, అభేదవాక్యాలూ శ్రుతివాక్యాలే. శ్రుతి మీద గౌరవం ఉంటే రెండు వాక్యాలనూ సమానంగా స్వీకరించాలి. రెండూ ప్రమాణ వాక్యాలే అంటాడు ఇతను. మరి పరస్పరవిరుద్ధభావాలను ఎలా సమర్థిస్తాము అంటే - అంశ, అంశి సంబంధం అంగీకరించటంద్వారా అంటాడు.

**ప్రకాశ ఆశ్రయత్వాత్-** కాంతి, దీపం తీసుకుంటే రెండూ పూర్తిగా భిన్నంగా లేవు. పూర్తిగా ఒకటే కాదు.

అభేదవాక్యాలను శాస్త్రం చెబుతున్నది- శాస్త్ర ప్రమాణం

భేదవాక్యాలను కూడా శాస్త్రం చెబుతున్నది. శాస్త్ర ప్రమాణం+ ప్రత్యక్ష ప్రమాణం.

జీవాత్మ వేరు, పరమాత్మ వేరు అని శాస్త్రం చెప్పటమే కాదు, నా అనుభవం కూడా చెబుతున్నది.నేను అల్పజ్ఞుడను. అల్పశక్తివంతుడను, నేను జీవిని. అదే పరమాత్మ విషయం తీసుకుంటే ఆయన సర్వజ్ఞుడు, సర్వశక్తివంతుడు, సృష్టికర్త.

**సిద్ధాంతి జవాబు-** దీనికి జవాబు వ్యాసాచార్యులు వివరంగా ఇవ్వరు. అంతకు ముందు చెప్పిన సూత్రాల జవాబే దీనికీ వర్తిస్తుందని ఒక్క ముక్కలో తేల్చేశారు. దానికి శంకరాచార్యులవారు వివరణనిచ్చారు. (స్వామీజీ ఇంకా వివరంగా చెప్పారు) ఈ వాదోపవాదాలు సరదాగా కూడా ఉంటాయి.

సిద్ధాంతి జవాబు చూసే ముందు భేదాభేద వాది వాదనను మళ్ళీ ఒకసారి చూద్దాము.

భేదం -సత్యం -శాస్త్రం + ప్రత్యక్ష ప్రమాణం ద్వారా;
అభేదం - సత్యం-శాస్త్రప్రమాణం ద్వారా;
ప్రమాణ సిద్ధం ఏదైనా అది సత్యం.

| | | | |
|---|---|---|---|
| అందువల్ల | 1. జీవాత్మ | -సత్యం | - ప్రమాణ సిద్ధం |
| | 2. పరమాత్మ | -సత్యం | - ప్రమాణ సిద్ధం |
| | 3. భేదం | -సత్యం | - ప్రమాణ సిద్ధం |
| | 4. అభేదం | -సత్యం | - ప్రమాణ సిద్ధం |

ఇప్పుడు నాలుగు అంశాలు ఉన్నాయి. దీనికి సిద్ధాంతి జవాబు చూద్దాము.

**ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే**
**ముండకమ్ 3-1-1**

**సమానే వృక్షే పురుషో నిమగ్నోఽనీశయా శోచతి ముహ్యమానః**
**ముండకమ్ 3-1-2**

ముండకోపనిషత్తులో మొదట చెప్పిన మంత్రం జీవాత్మ-పరమాత్మల భేదం చూపటానికి చాలా ముఖ్యమైన మంత్రం. ఒకే చెట్టుమీద రెండు పక్షులు ఉన్నట్టుగా ఒకే శరీరంలో జీవాత్మ-పరమాత్మ అని రెండు ఉన్నాయి. తర్వాత వచ్చే మంత్రంలో, పరమాత్మకు భిన్నంగా ఉన్న ఈ జీవాత్మ శోకిస్తున్నది.
శోచతి అంటే దుఃఖిస్తున్నది - దీన్నిబట్టి జీవాత్మకు దుఃఖం ఉంది.

ఇప్పుడు దుఃఖం ప్రమాణసిద్ధమా కాదా? రెండు ప్రమాణాల సిద్ధం.

భేదం ఎలాగైతే శాస్త్రం+ ప్రత్యక్ష ప్రమాణ సిద్ధం అన్నామో అలాగే దుఃఖం కూడా శాస్త్రం+ ప్రత్యక్ష ప్రమాణసిద్ధం. మనిషికి దుఃఖం ఉందని నాస్తికుడు కూడా ఒప్పుకుంటాడు. ఇప్పుడు పైన చెప్పిన నాలుగు సత్యాల్లో దుఃఖం కూడా కలుపుకోవాలి. జీవాత్మ, పరమాత్మ, భేదం, అభేదం ఎలా సత్యాలో దుఃఖం కూడా అలాగే సత్యం. ఎందుకు?

భేదాభేదవాది వాదనద్వారా ఏదైతే ప్రమాణ సిద్ధమో అది సత్యం. దుఃఖం లేదా సంసారం కూడా ప్రమాణ సిద్ధం కాబట్టి అది కూడా సత్యం. ఇప్పుడు మనకు ఐదు సత్యాలు అయ్యాయి. **దుఃఖం/సంసారం– సత్యం– ప్రమాణసిద్ధం.** ప్రమాణ సిద్ధం అంటే ప్రమాణం ద్వారా చూపబడినది.

ఇప్పుడు అసలు సమస్య వస్తుంది. మీరు న్యాయం మాట్లాడాలి అంటారుకదా. అంటే ఈ ఐదింటినీ సమానంగా చూస్తే ఐదూ సత్యం అవుతాయి.

సత్యం అయినది నిత్యమా? అనిత్యమా? సత్యం అంటే త్రికాలేపి తిష్ఠతి అంటే మూడు కాలాల్లోనూ ఉండేది. **యత్ సత్యం తత్ నిత్యం** అంటే ఒక సమస్య వస్తుంది. ఏమిటది? ఐదూ సత్యం అయితే, మోక్షం సమయంలో కూడా ఐదూ ఉంటాయి. కాని మోక్షం నిర్వచనం ఏమిటి? **దుఃఖనివృత్తి.** కాని మోక్షంలో దుఃఖనివృత్తి అవటానికి వీలు లేదు. ఎందుకు? దుఃఖం గురించి ప్రమాణం చెప్పింది. ప్రమాణం చెప్పింది కాబట్టి అది సత్యం, సత్యం అయినది నిత్యం అవుతుంది. నిత్యం అయినది మోక్షంలో పోదు. దుఃఖం పోకపోతే అది మోక్షం కాదు. అప్పుడు అది **అనిర్మోక్ష ప్రసంగం** అవుతుంది.

ఇప్పుడు రెండో కోణంలోంచి చూద్దాము. **యత్ సత్యం తత్ అనిత్యమ్.** అంటే ఇంకా పెద్ద సమస్య వస్తుంది. ఏమిటది? మోక్షం సమయంలో ఐదూ మాయమయిపోతాయి. జీవాత్మ, పరమాత్మ, భేదం, అభేదం, దుఃఖం. అప్పుడు ఏం ఉంటుంది అంటే శూన్యమే మిగులుతుంది. కాబట్టి ఇదీ సరిపోదు.

అందువల్ల మధ్యేమార్గం తీసుకోవాలి. ఏమిటది? ఐదూ సత్యాలే అయినా, **దుఃఖం మాత్రం అనిత్యం, తక్కిన నాలుగూ నిత్యం.** ఎందుకు? పరమాత్మ మోక్షంలో మాయమవకూడదు. అన్నీ నిత్యాలే అంటే పరమాత్మను, దుఃఖాన్ని సమానంగా చూసినట్టు అవుతుంది. అలా చూస్తే దుఃఖం కూడా పరమాత్మలాగా శాశ్వతం అవుతుంది. అందువల్ల దుఃఖం అనిత్యం అనక తప్పదు.

సత్యం నిత్యం అవాలి అని చూశాము కదా. అందువల్ల ఇక్కడ రెండురకాల సత్యం గురించి మాట్లాడక తప్పదు. పారమార్థిక సత్యం– సత్యం+ నిత్యం. త్రికాలేపి తిష్ఠతి. మోక్షంలో కూడా ఉంటుంది; దుఃఖం సత్యమే అయినా, మోక్షకాలంలో ఉండదు కాబట్టి దాన్ని అనిత్యసత్యం అంటారు. అంటే సత్యం + అనిత్యం. దీన్నే ఇంకో మాటలో చెప్పాలంటే వ్యావహారిక సత్యం అంటారు. ఇదీ అద్వైత సిద్ధాంతివాదన

**భేదాభేదవాది వాదన –** సరే నేను దుఃఖం వ్యావహారిక సత్యం అని ఒప్పుకోవటానికి సిద్ధమే. కాని మీతో వచ్చిన చిక్కేమిటంటే కొంచెం చోటిస్తే చాలు, మొత్తం అంతా దురాక్రమణ చేసేస్తారు. అందువల్ల నెమ్మదిగా వ్యావహారిక సత్యాన్ని మిథ్య అంటారు. అది చెప్పటానికి రజ్జు-సర్పభ్రాంతి (తాడు-పాము భ్రమ) వాడతారు. మిథ్యాపదం నన్ను ఖంగారుపెట్టేస్తుంది. మీకెందుకంత మోజు మిథ్యాపదంమీద అంటాడు.

**సిద్ధాంతి జవాబు –** సరే నేను మిథ్యాపదం వాడను, మీకోసం రజ్జుసర్పభ్రాంతి పదం కూడా వాడను. నేను శాస్త్రం చెప్పిన ఒక ప్రత్యేకమైన సూత్రాన్ని చెప్పాలనుకుంటున్నాను. ఏమిటది?దుఃఖం ప్రమాణసిద్ధం, అందువల్ల సత్యం. కాని దాన్ని నిత్యం కాదని చెబుతున్నాము. దుఃఖం సత్యం అయితే దాన్ని నిత్యంకాదని ఎలా త్రోసిపుచ్చగలము అనే ప్రశ్న సహజంగా ఉదయిస్తుంది.

అప్పుడు దుఃఖం రెండవ స్థాయి సత్యానికి, అంటే వ్యావహారిక సత్యానికి చెందినదని ఒప్పుకోకతప్పదు.

సాధారణంగా ఒక దాన్ని పారద్రోలాలంటే ఒక కర్మ చేయాలి. శరీరం మురికిగా ఉంటే, స్నానం చేయాలి. అంటే కర్మమీద ఆధారపడి ఉంది. ఇప్పుడు దుఃఖాన్ని కూడా కర్మద్వారానే పారద్రోలుతామా? నాకు దుఃఖం ఉంది. స్నానం చేస్తే పోతుందా, గడ్డం గీసుకుంటే పోతుందా; శాస్త్రం దీనికి ఒక విశిష్టమార్గం ఉంది అంటున్నది. ఏమిటది? దుఃఖం కర్మ చేయటంవల్ల పోదు; జ్ఞానం పొందితేనే పోతుంది.

అందువల్ల దుఃఖం గురించి రెండు విషయాలు తేటతెల్లమవుతున్నాయి. **దుఃఖం వ్యావహారిక సత్యానికి చెందినదనీ, దుఃఖం జ్ఞానం పొందితేనే పోతుందనీను.** ఇది సూచించటానికి నేను మిథ్యాపదం వాడాను అంటున్నాడు సిద్ధాంతి. మిథ్య అంటే రెండవ స్థాయికి చెందిన సత్యం. జ్ఞానం పొందితే మిథ్య పారద్రోలబడుతుంది. దానివల్ల వ్యావహారిక సత్యం అంటే మిథ్య. మీ ఇష్టం, కావాలంటే ఇంకో పదం వాడుకోండి, మిథ్య కాకపోతే **ఢ్యామి** అనండి. కాని మిథ్య అంటే జ్ఞానంవల్ల పారద్రోలగలిగే రెండవ స్థాయి సత్యం. శాస్త్రం స్పష్టంగా చెబుతున్నది జ్ఞానంవల్ల దుఃఖం పోతుంది అని, మోక్షంలో దుఃఖం ఉండదని.

**గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః॥** **గీత** 2-11

ఇది వివరించడానికి రజ్జు -సర్పభ్రాంతి చక్కటి ఉదాహరణ. అది కాదు అంటే మీరు వేరే ఏదైనా ఇవ్వండి కాని అది జ్ఞానంవల్ల పారద్రోలగలిగే రెండవ స్థాయి సత్యం అయి ఉండాలి.

**భేదాభేదవాది వాదన–** సరే దుఃఖం మిథ్య. దాన్ని జ్ఞానంవల్ల పోగొట్టవచ్చు అని ఒప్పుకుంటాను; కాని భేదం లేదా ద్వైతం కూడా మిథ్య అని ఎందుకు అంటారు? అప్పుడు జగత్తు కూడా మిథ్య కిందకి వస్తుంది కదా! జగత్తును మిథ్య అనటం ఎందుకు?

**సిద్ధాంతి జవాబు–** ఎక్కడ భేదం ఉంటే అక్కడ దుఃఖం ఉంటుంది. అది సూత్రం.భేదంవల్ల దుఃఖం లేదని చెప్పలేము. ఎందుకంటే శ్రుతి, యుక్తి, అనుభవాలద్వారా అది నిరూపించబడింది.

**ద్వితీయాద్వై భయం భవతి– బృహదారణ్యకమ్– శ్రుతి ప్రమాణం.**

భేదం ఉందంటే దానికొక పుట్టుక,చావు ఉంటుంది. అది శాశ్వతం కాదు. శాశ్వతం కాని వస్తువు దుఃఖం హేతువు. **ఇది తర్కప్రమాణం.**

**అనుభవప్రమాణం** కూడా అదే నిరూపిస్తుంది. జాగ్రదావస్తలో భేదం అనుభవిస్తాము. అది దుఃఖంతో నిండి ఉంది. స్వప్నావస్థలో కూడా భేదం అనుభవిస్తాము. అదీ దుఃఖంతో నిండి ఉంది. కాని సుషుప్తిలో భేదం లేదు. అందులో ఆనందమే ఉంది.

అందువల్ల భేదం ఉన్న జగత్తు దుఃఖహేతువు. దుఃఖం జ్ఞానంవల్ల పారద్రోలగలగబడే రెండవ స్థాయి సత్యం కాబట్టి; భేదం కూడా జ్ఞానంవల్ల పారద్రోలగలగబడే రెండవ స్థాయి సత్యం అవాలి.

అందువల్ల రెండు రకాల ప్రమాణాలు ఉన్నాయి. అవి సత్యం, మిథ్య. ఇంతవరకూ మనం చూసిన ఐదు అంశాల్లో–

**జీవాత్మ, పరమాత్మ, అభేదం – ప్రమాణ సిద్ధ సత్యవస్తువులు**
**భేదం, దుఃఖం – ప్రమాణ సిద్ధ మిథ్యావస్తువులు**
**భేదం, ఆనందం ఒకచోట కలిసి ఉండవు. అందువల్ల**
**జీవాత్మ, పరమాత్మల మధ్య భేదం– వ్యావహారిక సత్యానికి చెందితే,**
**జీవాత్మ, పరమాత్మల మధ్య అభేదం– పారమార్థిక సత్యానికి చెందుతుంది.**

## స్వామీజీ సూక్తిముక్తావళి

మనస్సుద్వారా బ్రహ్మను తెలుసుకోలేము. ఎందుకంటే అన్నింటినీ మనస్సు చూస్తే మనస్సును బ్రహ్మ చూస్తుంది.

# 30. జ్ఞానం- అనుభవం

గురుపూర్ణిమ ఒక మంగళకరమైన రోజు. ఆధ్యాత్మ సాధకులకు, ముఖ్యంగా జ్ఞానమార్గంలో ఉన్నవారికి ఇది మరీ ప్రత్యేకమైన రోజు. ఎందుకంటే గురువుకూ జ్ఞానానికీ అవినాభావ సంబంధం ఉంది. గురువు అంటేనే జ్ఞానమనే వెలుగును ప్రసాదించి,అజ్ఞానమనే చీకటిని తొలగించువాడు అని అర్థం. జ్ఞానమార్గంలో ఉన్న వారికి మరీ ప్రత్యేకమైన రోజు. ఎందుకంటే, గురుపూర్ణిమ రోజు మొత్తం గురుపరంపరను పూజిస్తాము. శాస్త్రాలను అందుకున్న ఋషులనుంచి, వాటిని తరువాత తరాలకు పరంపరగా అందించిన గురువులందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటాము.

అందువల్ల, వేదాంత విద్యార్థులందరూ గురుపరంపరకు నమస్కరిస్తూ, వారి కృపాకటాక్షాలను కోరుకుంటారు. గురువు కృపాకటాక్షాలను కోరే ఈ శిష్యుల్లో రెండురకాలు ఉంటారు. ఒక రకం శిష్యులు దీవెనలు కోరుతూ, బ్రహ్మజ్ఞానం పొందేలా ఆశీర్వదించమని వేడుకుంటారు.

రెండో రకం శిష్యులు ఉంటారు. వారు స్వామీజీ దగ్గరకు వెళ్ళి, 'స్వామీజీ! నేను ఎన్నో సంవత్సరాలుగా వేదాంతం నేర్చుకుంటున్నాను. మీ దయవల్ల నాకు బాగానే అర్థమయింది. శాస్త్రం గురించిన ఒక సమగ్రమైన జ్ఞానం కూడా కలిగింది,' అని చెప్పి అక్కడితో ఆగకుండా, 'కాని, స్వామీజీ నాకు ఇంతవరకూ ఏర్పడినది పుస్తకపరిజ్ఞానమే. నాకు దానితో సరిపెట్టుకోవటం ఇష్టం లేదు. అందువల్ల నాకు బ్రహ్మ అనుభవం కలిగేలాగా ప్రత్యేకంగా దీవించండి స్వామీ,' అంటారు.

బ్రహ్మ అనుభవానికి స్వామీజీ రెండు విధాలుగా దీవించాలనివారు కోరుకుంటారు. ఒకటి బ్రహ్మ అనుభవం పొందటానికి ప్రత్యేక దీవెనలు ఇవ్వమంటారు; రెండోది బ్రహ్మ అనుభవం పొందటానికి కొన్ని సాధనలు చెప్పమంటారు. అలా కొందరు వారికి బ్రహ్మజ్ఞానమే ఉంది కాని బ్రహ్మ అనుభవం పొందాలనీ, దానికి కొన్ని సాధనలు కావాలనీ అనుకుంటారు.

ఇటువంటి దీవెన ఏ గురువునుంచైనా సరే కావాలనుకునే విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి. ఈ ప్రసంగం బ్రహ్మ అనుభవం పొందాలని కోరుకునే వారి గురించి ప్రత్యేకంగా ఇవ్వబడింది.

వారు ముందస్తుగా అర్థం చేసుకోవాల్సిన విషయం ఒకటి ఉంది. ఎప్పుడైతే వారు తమకు శాస్త్రం చదవటంవల్ల బ్రహ్మజ్ఞానం కలిగింది, కాని నాకు బ్రహ్మ అనుభవం పొందాలని ఉంది అన్నారో, అప్పుడే వారు శాస్త్రాన్ని సరిగ్గా అధ్యయనం చేయనట్లు లెక్క. వారనుకుంటున్నట్టుగా వారికి పుస్తకపరిజ్ఞానం లేదు. బ్రహ్మజ్ఞానం అసలే లేదు. ఎందుకు?

శాస్త్రం బ్రహ్మను ఏమని వర్ణిస్తుంది? మనం నిరంతరం అనుభవించే చైతన్యతత్త్వమే బ్రహ్మ అంటుంది. బ్రహ్మ నిర్వచనమే అది.

**యత్సాక్షాదపరోక్షాద్బ్రహ్మ, య ఆత్మా సర్వాన్తరః – బృహదారణ్యకమ్**

బ్రహ్మ అంటే జాగ్రత్, స్వప్న,సుషుప్తి అవస్థలన్నింటిలోనూ ప్రకాశించే చైతన్యం. మనం శాస్త్రానికి రాకముందునుంచే అది స్వయంప్రకాశకచైతన్యం. అందువల్ల అదృష్టమో దురదృష్టమో కానీ, బ్రహ్మ అనుభవంకోసం ప్రయత్నించనవసరం లేదు. ఏదైనా ఒక అనుభవంకోసం మనం ప్రయత్నించనవసరం లేదు అంటే, దేనికోసమైనా మనకు ప్రత్యేకమైన దీవెనలు అవసరం లేదు అంటే, అది ఒక్క బ్రహ్మ అనుభవమే. ఎందుకంటే మనం అనునిత్యం అనుభవిస్తున్న చైతన్యమే బ్రహ్మ.

**ప్రతిబోధ విదితం మతమ్ – కేన**

నిజానికి నిత్యబ్రహ్మ అనుభవంవల్లనే తక్కిన అనుభవాలను పొందగలుగుతున్నాము. ప్రతి అనుభవం బ్రహ్మ అనుభవంవల్లనే కలుగుతున్నది.అంటే మన ప్రయత్నం లేకుండా అందరం బ్రహ్మ అనుభవం పొందుతున్నాము. మనకు కావాల్సింది బ్రహ్మజ్ఞానం. అది శాస్త్రంద్వారా పొందుతాము.

అందువల్ల మనకు బ్రహ్మ అనుభవం ముందే ఉంది, మనకు లేనిది బ్రహ్మజ్ఞానం. మామూలుగా లౌకికజ్ఞానం విషయంలో ముందు జ్ఞానం పొందుతాము. తర్వాత అనుభవం పొందుతాము. ఉదాహరణకు అమర్‌నాథ్ గురించి ముందు వార్తాపత్రికలో చదువుతాము. అంటే అమర్‌నాథ్ గురించిన జ్ఞానం ముందు పొందుతాము. అలాగే ముందు గంగోత్రి గురించిన జ్ఞానం, తర్వాత గంగోత్రి గురించిన అనుభవం. అన్నింటిలోనూ అంతే.

అందువల్ల, మన బుద్ధిని ఉపయోగించకుండా ఇదే సూత్రాన్ని – అంటే జ్ఞానం ముందు, అనుభవం తర్వాత– బ్రహ్మజ్ఞానవిషయంలో కూడా యాంత్రికంగా అమలుపరుస్తాము. కాని బ్రహ్మజ్ఞానం విశిష్టమైనది. ఇందులో ఒక ప్రత్యేకత

ఉంది. ఏమిటా ప్రత్యేకత? బ్రహ్మ అనుభవం మనందరికీ అన్ని వేళలా ఉంది. మనకు లేనిది బ్రహ్మజ్ఞానం.

ఇటువంటి ప్రత్యేకమైన పరిస్థితి వేరే ఏదైనా సందర్భంలో ఉందా? అంటే ముందు అనుభవం కలిగి, తర్వాత జ్ఞానం కలిగే సందర్భం! ఎందుకు లేవూ? బోలెడు ఉన్నాయి. దయానంద స్వామీజీ సాధారణంగా తనకు స్వయంగా జరిగిన అనుభవాన్నే ఇలాంటి సందర్భాలలో ఉటంకిస్తారు.

ఒకసారి పూజ్యస్వామీజీ ఢిల్లీవరకూ విమానంలో వస్తున్నారుట, అక్కడనుంచి ఋషికేష్‌కు వెళ్ళాలి. స్వామీజీ పక్కన కూర్చున్న తోటి ప్రయాణీకుడు, స్వామీజీతో కబుర్లు చెప్పాడుట. అతను ఒక భక్తుడు. సంభాషణ మధ్యలో, 'స్వామీజీ మీరెక్కడికి వెళుతున్నారు, మీ ఊరేది?' స్వామీజీ,'నేను ఋషీకేష్‌కు వెళుతున్నాను, అదే నా ఊరు,' అన్నారు.

వెంటనే ఈ ప్రయాణీకుడు, 'నేను కూడా ఋషీకేష్‌కే వెళుతున్నాను. అక్కడ ఒక స్వామిని కలవాలి. మీరు ఆయన ఎక్కడ ఉంటారో చెప్పగలరా?' అన్నాడు. అప్పుడు స్వామీజీ ఆ స్వామీజీ పేరు, చిరునామా చెబితే తెలుసో లేదో చెబుతానన్నారు. అతను ఒక కార్డు తీసి చూపిస్తే దానిమీద ఉన్న వివరణ ఇది- స్వామి దయానంద సరస్వతి, పురానీ ఝుడీ, ఋషీకేష్.అప్పుడు స్వామీజీ అన్నారు- 'ఏ స్వామీజీనైతే నువ్వు ప్రత్యక్షంగా కలవాలనుకున్నావో, ఎవరి దర్శన అనుభవం అయితే నువ్వు పొందాలని తహతహలాడుతున్నావో, ఆ స్వామీజీ ఇదుగో నీ కళ్ళముందే ఉన్నారు.'

పూజ్యస్వామీజీ ఎంతో హాస్యంగా చెబుతారు- ఆ ప్రయాణీకుడు ఎంత భారీకాయంతో ఉన్నాడంటే అతని సగం శరీరం స్వామీజీమీదే ఉందిట. అందువల్ల ఏ స్వామీజీనైతే నువ్వు అనుక్షణం చూస్తున్నావో, ఏ స్వామీజీనైతే పక్కన కూర్చున్నంతసేపూ సన్నిహితంగా తాకుతున్నావో, ఇంకా మాట్లాడితే నీ భారీకాయంతో వత్తుతున్నావో, ఆ స్వామియే నీకు కావాల్సిన స్వామీజీ.

స్వామీజీ చిరునామా చూపించేవరకూ, స్వామీజీ ఈ మాటలు పలికేవరకూ, అతనికి స్వామీజీ అనుభవం ఉంది. కాని స్వామీజీ ఈ మాటలు చెప్పకముందు, స్వామీజీ గురించిన జ్ఞానం లేదు. అంటే తను చూస్తున్న వ్యక్తే, తను తెలుసుకోవాలనుకున్న వ్యక్తి అని తెలియలేదు. ఈ సంఘటనను కొంచెం విశ్లేషించి చూద్దాము. దీనివల్ల అనేక ముఖ్యవిషయాలు తెలుస్తాయి.

అనుభవం ముందు, జ్ఞానం తర్వాత – స్వామీజీ అనుభవం ముందు కలిగాక, స్వామీజీ జ్ఞానం తరువాత కలిగింది. జ్ఞానం కలిగేదాకా, స్వామీజీని చూసే అనుభవంకోసం తహతహలాడాడు. చూసే అనుభవం అవుతూనే ఉన్నా, ఆ అనుభవంకోసం ఎదురు చూశాడు ఆ ప్రయాణీకుడు. ఎప్పుడైతే ఆయనే దయానంద స్వామీజీ అని విన్నాడో, స్వామీజీని చూడడంకోసం ఉన్న కోరిక మటుమాయమయ్యింది. అతని కోరిక ఎలా మటుమాయమయ్యింది? జ్ఞానం పొందటంవల్ల. జాగ్రత్తగా చూడండి. స్వామీజీ మాటలు అనుభవాన్ని ఇవ్వలేదు నిజమే, కాని స్వామీజీ మాటలు అనుభవం ముందే ఉంది అనే జ్ఞానాన్ని ఇచ్చాయి. అందువల్ల అతను మళ్ళీ అనుభవంకోసం ప్రత్యేకంగా కోరనవసరం లేదు.

ఒకవేళ ఆ ప్రయాణీకుడు, ఇలా అన్నాడనుకోండి, 'స్వామీజీ మీ మాటలు నేను విన్నాను. నేను స్వామీ దయానంద అని మీరు చెప్పిన మీ మాటలు విన్నాను. నాకు విషయం స్పష్టంగా అర్థమయింది. ఇప్పుడు నాకు మీనుంచి ప్రత్యేకంగా దీవెనలు కావాలి. దేనికంటారా? మీరు స్వామి దయానంద అని నాకు అర్థమయింది. కాని నాకు స్వామీజీని ప్రత్యక్షంగా దర్శించటానికి కొన్ని సాధనలు చెప్పండి.' దీని అర్థం ఏమిటి?

అతను స్వామీజీ మాటలను సరిగ్గా విననట్టు లెక్క. అంటే ఏదో యథాలాపంగా విన్నాడన్నమాట. మనం ఎదుటివారి మాటలు విన్నామనుకుంటాము. కాని, సరిగ్గా వినము. విన్నది గ్రహించము. దీనికి నిదర్శనం ఏమిటి? ఇదుగో, పైన ఊహించిన జవాబే! ఒకవేళ ఆ వ్యక్తి నిజంగానే స్వామీజీతో అలా అంటే స్వామీజీ ఏమనాలి?

'నువ్వు చెయ్యాల్సిన సాధన జరుగబోయే అనుభవంకోసం కాదు. నువ్వు చెయ్యాల్సిన సాధన శ్రద్ధగా వినటంకోసం చేయాలి. నేను మళ్ళీ మళ్ళీ చెబుతాను, నువ్వు శ్రద్ధగా విను.' అతను శ్రద్ధగా విన్నట్టు ఎప్పుడు తెలుస్తుంది? స్వామీజీ అనుభవంకోసం ఎదురుచూడనప్పుడు. అంతవరకూ స్వామీజీ సమక్షాన్ని అనుభవిస్తూనే ఉన్నాడు; సమాధానం చెప్పినప్పుడూ సమక్షాన్ని అనుభవిస్తున్నాడు; ఢిల్లీ చేరేంతవరకూ కూడా స్వామీజీ సమక్షాన్ని అనుభవిస్తూనే ఉంటాడు. అందువల్ల కొన్ని సందర్భాలలో అనుభవం ముందు, తర్వాత జ్ఞానం కలుగుతాయి.

నిజానికి ఎవరైనా మిమ్మల్ని ఎదుటివారికి పరిచయం చేసినప్పుడు, పరిచయవాక్యాలు వాడినప్పుడు, మీరు ఒక విషయం గుర్తుంచుకోవాలి.

ఆ పరిచయాత్మక వాక్యాలు జ్ఞానాన్ని కలుగచేస్తాయి. ఆ జ్ఞానం తప్పనిసరిగా అనుభవం తర్వాతే వస్తుంది.

మీరొక సెమినార్‌కు వెళ్ళారనుకోండి. వక్తలను పరిచయం చేస్తూ, ఎవరో స్వాగతవచనాలు పలుకుతారు. అప్పటికే ఆ వక్తలు స్టేజీమీద కూర్చుంటారు. మీరు వారిని చూశారు. మళ్ళీ అంతకుముందులాగానే, వారి అనుభవం ముందు పొందుతారు, తర్వాత వారి గురించిన జ్ఞానం పొందుతారు. ఇదే పరిస్థితి ఒక పెళ్ళిలో కూడా అవుతుంది. 'ఈయన రామస్వామి, ఫలానాకంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్,' అని ఎవరో, ఎవరినో మీకు పరిచయం చేస్తారు. మీరు 'హలో, బాగున్నారా?' అని అడిగి, షేక్‌హ్యాండ్ ఇచ్చి, మీకు పరిచయం చేసిన వ్యక్తితో, 'ఒకే, నాకు రామస్వామి ఎవరో తెలిసింది, దయచేసి, అతన్ని ఎప్పుడు కలుసుకోగలనో చెబుతారా,' అని అడుగుతారా? ఒకవేళ అడిగితే, దానికి ఒకటే అర్థం – మీరు ఎదుటివ్యక్తి చెప్పిన మాటలను సరిగ్గా అర్థం చేసుకోలేదు.

పదాల్లో రెండు రకాలు ఉంటాయి. పరిచయాత్మక పదాలు, వర్ణనాత్మక పదాలు. **వర్ణనాత్మక పదాలు** జ్ఞానాన్ని కలుగచేస్తాయి, దాని తర్వాత దాని అనుభవంకోసం మీరు ప్రయత్నించాలి. కాని **పరిచయాత్మక పదాల** విషయం అలా కాదు. అవి మీ కళ్ళముందే ఉన్న, మీకు అనుభవంలోకి వస్తున్న వ్యక్తిని పరిచయం చేస్తాయి అవి. అందువల్ల ఈ సూత్రాన్ని బాగా గుర్తుపెట్టుకోండి. ఎక్కడెక్కడైతే పరిచయాత్మక పదాలు వస్తాయో అక్కడ అనుభవం ముందు కలిగి, తర్వాత జ్ఞానం ఏర్పడుతుంది.

బ్రహ్మ విషయం కూడా అంతే. బ్రహ్మ అనుభవం మీకు ఉంటూనే ఉంది. స్వామీజీ సమక్షాన్ని ఆ తోటి ప్రయాణీకుడు అనుభవించిన దానికన్నా సన్నిహితంగా, సెమినార్లో చూసిన వక్తలకన్నా సన్నిహితంగా! బ్రహ్మ అనుభవం నిత్యం ఉంటుంది. అందువల్ల శాస్త్రంలో బ్రహ్మను సత్యసిద్ధం బ్రహ్మ అంటారు.

శాస్త్రం చదివితే, నాకు బ్రహ్మజ్ఞానం కలుగుతుంది. నాకు కలిగిన జ్ఞానం ఏమిటి? నాకు బ్రహ్మ తెలుసు. ఆ బ్రహ్మ అనుభవం నాకు అంతకుముందు ఉంది, ఇప్పుడూ ఉంది. ఎప్పటికీ ఉంటుంది అని తెలుసు. అటువంటి జ్ఞానం కనుక కలిగితే, నేను బ్రహ్మ అనుభవంకోసం ఎప్పుడూ గురుకృప కోరను.

ఒకవేళ ఏ విద్యార్థి అయినా స్వామీజీని బ్రహ్మ అనుభవం పొందాలని దీవించండి అంటే స్వామీజీ అతనికి ఎన్నటికీ సాధన ఇవ్వరు. 'దయచేసి, శాస్త్రాన్ని

అధ్యయనం చెయ్యి,' అంటారు. ఎన్నాళ్ళు అధ్యయనం చేయాలి? **బ్రహ్మా అనుభవంకోసం నేను ప్రయత్నించనవసరం లేదు అనే జ్ఞానం అతనికి కలిగేదాకా.** **బ్రహ్మజ్ఞాన నిర్వచనం–** బ్రహ్మజ్ఞానమంటే, బ్రహ్మ అనుభవంకోసం కలిగే కోరికను పారద్రోలే జ్ఞానం. ఆ అనుభవంకోసం వెంపర్లాట ఉన్నన్నాళ్ళు, శాస్త్రాన్ని యాంత్రికంగా అధ్యయనం చేసినట్లు, దానిమీద శ్రద్ధ పెట్టనట్టు అర్థం. అందువల్ల అధ్యయనం ఆపకూడదు. చేస్తూనే ఉండాలి.

ఇప్పుడు ఇంకో ప్రశ్న ఉదయిస్తుంది– సరే, నాకు శాస్త్రం బాగా అర్థమయింది. బ్రహ్మజ్ఞానం పొందాను, బ్రహ్మ అనుభవంకోసం ప్రయత్నించ నవసరం లేదు, బ్రహ్మ అనుభవం నిరంతరం అవుతూనే ఉంది అని కూడా అర్థమయింది. బ్రహ్మ అనుభవ ఇచ్ఛా నివర్తకం జ్ఞానం. ఈ విషయం తెలిసింది. ఇప్పుడేం చేయాలి?

అందువల్ల బ్రహ్మజ్ఞానం పొందాము. బ్రహ్మ అనుభవం కోరము. కాని దాని తర్వాత ఏం చేయాలి? దీనికి జవాబు అవును. అనుభవంకోసం ప్రయత్నించాలి. ఒకపక్క అనుభవంకోసం ప్రయత్నించకూడదు అంటూనే మళ్ళీ అనుభవం అంటారేమిటి స్వామీజీ అనవచ్చు మీరు. ఈ అనుభవం వేరు.

ఇది ఖచ్చితంగా బ్రహ్మానుభవం కాదు. దీన్ని **బ్రహ్మజ్ఞానఫలానుభవం** అంటారు. ఇది మనస్సులో పొందే అనుభవం. దీన్ని శాంతి, తృప్తి, అభయం, క్షమ అంటుంది శాస్త్రం. ఇవన్నీ అనుభవాలే. శాంతి, తృప్తి, భద్రత, ఓర్పు, జాలి, దయ, ప్రేమ, దానగుణంలాంటి లక్షణాలన్నీ గీతలో స్థితప్రజ్ఞత, పరాభక్తి, గుణాతీతుడు గురించిన వర్ణనలు వచ్చిన చోటల్లా వస్తాయి. బ్రహ్మజ్ఞానఫలం అందరూ పొందగలరు.

బ్రహ్మజ్ఞానాన్ని బ్రహ్మజ్ఞానఫల అనుభవంగా మార్చుకోవాలి. ఈ ఫల అనుభవం ముందే లేదు. దీనికోసం ప్రయత్నం చేయాలి. దీనికోసం కృషి చేయాలి. అంటే ముందు బ్రహ్మజ్ఞానంకోసం కృషి చేయాలి, తర్వాత బ్రహ్మ అనుభవంకోసం కాదు కానీ బ్రహ్మజ్ఞానఫల అనుభవంకోసం కృషి చేయాలి.

ఇప్పుడు ప్రశ్న– ఎటువంటి ప్రయత్నం చేయాలి? మామూలుగా బ్రహ్మజ్ఞానం పొందితే దానంతట అదే ఫలాన్ని తెచ్చిపెడుతుందని చెబుతారు. నిజానికి కారణం ఉంటే, దానికి కార్యాన్ని ఉత్పత్తిచేసే శక్తి ఉంటుంది. బ్రహ్మజ్ఞానం బుద్ధిలో పొందుతాము. దానికి తృప్తి, శాంతివంటి వాటిని బ్రహ్మజ్ఞాన ఫలంగా

రూపొందే సామర్థ్యం ఉంది. కాని అలా ఫలంగా మారగలిగే సామర్థ్యం ఉన్నా, ఈ మార్పు జరుగకుండా కొన్ని ఆటంకాలు కలుగుతున్నాయి మనలో.

ఏమిటామార్పు? – బ్రహ్మజ్ఞానం, బ్రహ్మజ్ఞానఫలంగా మార్పు చెందటం. బ్రహ్మజ్ఞానం బుద్ధికి చెందినదైతే బ్రహ్మజ్ఞానఫలం మనస్సుకు చెందింది. అంటే విజ్ఞానమయ కోశంనుండి మనోమయకోశానికి దిగాలి. కాని ఈ మార్పు జరగటానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. అందువల్ల మనం ప్రయత్నించాల్సింది మార్పుకోసం కాదు, బ్రహ్మజ్ఞానం బ్రహ్మజ్ఞానఫలంగా మారకుండా అడ్డుపడే ఆటంకాలను తొలగించటంకోసం. దీనికి ఒక ఉదాహరణ చూద్దాము.

మీ ఇంట్లో కింద సంపులో నీళ్ళు ఉన్నాయి. మీరు మోటారు వేసి పైన ట్యాంకుకి ఎక్కించారు ఆ నీటిని. ఇప్పుడు పైన ట్యాంకులో కూడా నీళ్ళు ఉన్నాయి. కాని మీ ఇంట్లో నీళ్ళు రావటం లేదు. అప్పుడేం చేస్తారు మీరు? కుళాయిలను తెరుస్తారు. కళాయిలను తెరిస్తే నీరు వస్తుంది. ఇప్పుడు ఈ ప్రశ్నకు జవాబు చెప్పండి. మీరు కుళాయిని తిప్పటంవల్ల నీటిని క్రిందకి తెచ్చారా? ఇక్కడొక సూక్ష్మభేదం ఉంది. సరిగ్గా గుర్తించండి దానిని–

నిజం చెప్పాలంటే, నీరును క్రిందకి తేవటానికి మీరేం ప్రయత్నం చేయనవసరం లేదు. భూమ్యాకర్షణ శక్తివల్ల నీరు కిందకే ప్రవహిస్తుంది. మరయితే, కుళాయి తిప్పటం ఎందుకు? కుళాయి తిప్పటంవల్ల సహజంగా జరిగేదాన్ని జరగకుండా అడ్డుపడిన కుళాయి అడ్డు తొలగించారు. అంతే!

ఆ విధంగా మీరు రెండు ప్రయత్నాలు చేశారు. మొదటి కృషి– నీటిని పైకి పంపు చేశారు. రెండవ కృషి– నీటిని కిందకి తేవటం కాదు, కిందకి ప్రవహించకుండా, అడ్డుపడుతున్న కుళాయి అడ్డు తొలగించారు. అలాగే జ్ఞానం విషయంలో కూడా రెండు ప్రయత్నాలు చేయాలి. మొదటి కృషి శాస్త్రాన్ని ఒక క్రమపద్ధతిలో కొన్ని సంవత్సరాల పాటు సరిగ్గా అధ్యయనం చేసి, బ్రహ్మజ్ఞానం అనే నీటిని, మెదడు అనే ట్యాంకులోకి ఎక్కించుకోవాలి. భూమ్యాకర్షణ శక్తికి భిన్నంగా నీటిని పైకి లేపారు. జ్ఞానాన్ని పైకి ఎక్కించారు.

ఇప్పుడు రెండవ కృషి– నీటి విషయంలో పైన ట్యాంకులోంచి మీ కుళాయి తిప్పి, తద్వారా ఆటంకాన్ని తొలగించి, నీటిని నింపుకున్నారు. అలా ఇప్పుడు బుద్ధిలో ఏర్పడిన బ్రహ్మజ్ఞానాన్ని క్రిందకి మనస్సులోకి దింపాలి, బ్రహ్మజ్ఞానఫల అనుభవం రూపంలో. అవే శాంతి, తృప్తి, తుష్టి, అభయం. అక్కడ కుళాయి తిప్పారు. ఇక్కడే కుళాయి తిప్పాలి?

ఇప్పుడు, స్వామీజీ శిష్యులుగా మనం బ్రహ్మజ్ఞానం పొందాము, మెదడనే ట్యాంకులోకి భద్రంగా ఎక్కించాము, అనుభవం కావాలని కోరే పొరపాటు చేయము కాని ఇప్పుడు బ్రహ్మజ్ఞానఫల అనుభవం ఎలా పొందాలి? ఏ కుళాయి తిప్పాలో, శాస్త్రంలో ఆచార్యులే చెప్పారు– దాన్ని తేలిగ్గా మూడు అంశాలున్న శిక్షణగా చెప్పవచ్చు.

**1. జ్ఞానానికి–ఫలానికి ఉన్న సంబంధం చూడండి –** కుళాయి తిప్పటం అనే ఆటంకం తొలగించే పనిలో మొట్టమొదటి శిక్షణ జ్ఞానానికీ– ఫలానికీ మధ్యనున్న సహజమైన సంబంధాన్ని చూడటం. ఇది మెదడుకు మేత అవుతుంది కాని, ఇది చాలా ముఖ్యం. జ్ఞానం–తృప్తి, జ్ఞానం –పూర్ణత, జ్ఞానం–అభయం, జ్ఞానం–క్షమ అంటే జ్ఞానానికీ– జ్ఞానఫలానికీ మధ్య ఉన్న సంబంధం చూడాలి. ఇది ఒక అంశం.

**2. జ్ఞానఫల అనుభవాన్ని అనుకరించండి –** జ్ఞానఫల అనుభవం అక్షరాలా కలుగకపోయినా, ఉన్నట్టుగా ప్రయత్నపూర్వకంగా చేయండి. అది నటించటమే అయినా,అబద్ధం ఆడినట్టుగా అనిపించినా సరే, జ్ఞానఫల అనుభవాన్ని పొందినట్టుగా మాటలతో, చేతలతో నటించండి– ఇది అక్షరాలా ఫిజియోథెరపీలాగా పనిచేస్తుంది.

ఫిజియోథెరపీ అంటే ఏమిటి? మీరు ఈ కాలితో చాలా పనులనే చేశారు కాని ఇప్పుడది ఆరోగ్యం కోల్పోయింది. పటుత్వం తగ్గింది. ఆ కాలును ఎలా నయం చేస్తారు? ఆ కాలితో కొన్ని ఎక్సర్‌సైజులు చేస్తారు. ఆ కాలు ఆరోగ్యంగా ఉన్నప్పుడు ఎలా కదిల్చారో, అలా ఫిజియోథెరపీద్వారా ప్రయత్నపూర్వకంగా కదుపుతారు. ఎన్నాళ్ళు? ఆ కాలు మళ్ళీ కోలుకునే వరకు.

అదే సూత్రం ఇక్కడ కూడా. మీరు నిజంగా తృప్తిగా లేకపోయినా, క్షమాగుణం లేకపోయినా, జ్ఞానపలం పొందినట్టుగా నటించండి. పూజ్యస్వామీజీ **ఫేక్ ఇట్ అండ్ మేక్ ఇట్** అంటారు. అంటే అనుకరించు, సాధించు. ఇదే మన సాంప్రదాయంలో పాటిస్తాము.

మనకు ఎవరిమీదైనా గౌరవప్రపత్తులు ఉన్నప్పుడు ఏం చేస్తాము? వారికి సాష్టాంగ నమస్కారం చేస్తాము. మనం చేయటమే కాదు, మన పిల్లలను కూడా చేయమంటాము. వారికి భక్తి అంటే ఏమిటో తెలియదు. కాని మనమాట కాదనలేక చేస్తారు. తరువాత ఎప్పుడో దాని విలువ తెలిసి, భక్తిగా నమస్కారం చేస్తారు. మీరు చేసే ప్రతి పనిలోనూ జ్ఞానఫల అనుభవాన్ని అనుకరించండి. ఇది రెండవ అంశం.

**3. జ్ఞానులతో సత్సంగాన్ని పెంచుకోండి-** బ్రహ్మజ్ఞాన ఫలాన్ని సమృద్ధిగా అనుభవిస్తున్న జ్ఞానులతో కలిసి మెలసి తిరగండి. ఇది వ్యాధి కాకపోయినా, అంటువ్యాధిలాగా వారినుంచి మనకు అబ్బుతుంది. అందువల్ల సత్సంగం, అంటే జ్ఞానితో సత్సంగం పెంచుకోవాలి. ఇది మూడవ అంశం.

కుళాయి తిప్పటం అంటే ఇక్కడ మూడు పనులు చేయాలి మీరు. ఏమిటవి? జ్ఞానానికీ- జ్ఞానఫలానికీ ఉన్న సంబంధాన్ని గ్రహించటం, జ్ఞానఫల అనుభవాన్ని అనుకరించడం, జ్ఞానితో సత్సంగాన్ని పెంచుకోవటం. ఈ మూడు పనులు చేస్తే ఏం పొందుతారు?

**జ్ఞానం పొందుతారా? ఇది బ్రహ్మజ్ఞానం పొందటానికి చేసేది కాదు.**
**బ్రహ్మ అనుభవం పొందుతారా? బ్రహ్మ అనుభవం పొందేది కాదు.**
మరి ఏం పొందుతారు? **బ్రహ్మజ్ఞానఫల అనుభవం పొందుతారు.**

ఆటంకాలు తొలగించటం నిదానంగా సాగుతుంది కాబట్టి, బ్రహ్మజ్ఞాన ఫల అనుభవం కూడా నిదానంగా కలుగుతుంది. అది ఒక క్షణంలో మెరుపులా మెరవదు. అది ఎప్పుడో ఒక శుభముహూర్తాన, ఒక మెరుపులా మీ ముందు ప్రత్యక్షమవదు. బ్రహ్మజ్ఞానఫల అనుభవం నెమ్మదిగా కలుగుతూ వస్తుంది. అది ఆటంకాలు ఎంత త్వరగా తొలగితే, అంత వేగంగా కలుగుతుంది.

ఇప్పుడు మీరు మూడు పదాలను స్పష్టంగా అర్థం చేసుకోవాలి. బ్రహ్మజ్ఞానం, బ్రహ్మ అనుభవం, బ్రహ్మజ్ఞానఫల అనుభవం. ఈ మూడింటిలోనూ, అదృష్టవశాత్తూ, మీరు మధ్యదైన బ్రహ్మ అనుభవంకోసం ప్రయత్నించనవసరం లేదు.

**యత్సాక్షాదపరోక్షాద్బ్రహ్మ, య ఆత్మా సర్వాన్తరః - బృహదారణ్యకమ్**
**ప్రతి బోధ విదితం మతమ్ - కేన**

ఈ బ్రహ్మ అనుభవం సిద్ధవస్తువు. ఎన్నటికీ సాధ్యవస్తువు కాదు. అందువల్ల దానికోసం ప్రయత్నించనవసరం లేదు. తక్కిన రెండూ సాధ్యాలు, వాటికోసం ప్రయత్నించాలి. ముందు బ్రహ్మజ్ఞానంకోసం కృషి చేయాలి. దానికోసం శాస్త్రాన్ని శ్రద్ధగా అధ్యయనం చేయాలి. తర్వాత, రెండవది అంటే బ్రహ్మ జ్ఞానఫల అనుభవంకోసం సాధన చేయాలి. దానికిచేయాల్సిన మూడు సాధనలు ఇప్పుడే చూశాము. ఈ మూడు సాధనలనూ కలిపి నిదిధ్యాసనం అంటారు. అంటే జ్ఞానంకోసం శ్రవణం, మననం, జ్ఞానఫల అనుభవంకోసం నిదిధ్యాసనం చేయాలి.

ఇంకో చివరి ప్రశ్న! నేను మొదటి దానికోసం సాధన చేయాలో, రెండవ దానికోసం సాధన చేయాలో నాకెలా తెలుస్తుంది? మొదటి దానినుంచి రెండవ దానికోసం ఎప్పుడు మారాలి? ఒకటి శ్రవణం, ఇంకోటి నిదిధ్యాసనం అని చూశాము కదా! మీకు శ్రవణం ముగిసిందని తెలియటానికి ఒక పరీక్ష ఉంది. ఎప్పుడైతే మీరు బ్రహ్మ అనుభవం పొందనవసరం లేదు అని దృఢంగా నమ్ముతారో, అప్పటినుంచి శ్రవణం చేయాలా వద్దా అనేది మీ ఇష్టం. శ్రవణం చేయకూడదు అనము కాని, ఎప్పుడైతే బ్రహ్మజ్ఞానం దృఢంగా కలిగిందో, దాన్ని జ్ఞాననిష్ఠగా మలచుకోవాలి. బ్రహ్మ అనుభవం నిత్యసిద్ధం, సాధ్యం కాదు అనే జ్ఞానం కలగాలి.

రెండవ సాధన ఏమిటి? బ్రహ్మ అనుభవం మాత్రం ససేమిరా కాదు. నాకు బ్రహ్మ అనుభవం కలిగేలా నన్ను దీవించండి అని ఏ విద్యార్థీ స్వామీజీని కోరకూడదనీ, ఒకవేళ పొరపాటుగా కోరటమంటూ జరిగితే– మళ్ళీ ఒకసారి శాస్త్రాన్ని నిశ్చయజ్ఞానం కలిగేలా అధ్యయనం చేయమనీ సలహా ఇస్తారు. ఎప్పటిదాకా అంటే బ్రహ్మ అనుభవం కోరనంతదాకా!

దాని తర్వాత బ్రహ్మజ్ఞానఫల అనుభవంకోసం సాధన చేయాలి. దీన్ని నిదిధ్యాసనం అంటారని చూశాము కదా! ఇది జీవితాంతం చేయాలి. దీనికి కాలపరిమితి లేదు. శాంతి, భద్రత, క్షమాగుణాల లోతులు కొలిచేదాకా చేయాలి. ఈ భావనలు మీలో వేళ్ళూనుకుపోయేటంతగా చేయాలి. దానికి కాలపరిమితి లేదు. ఒక ప్రత్యేకమైన సమయంలో చేయాలని కూడా లేదు. ఇది ఆనందాన్ని కలుగచేసే విషయం.

అందువల్ల ఈ గురుపూర్ణిమ విశేష రోజున, గురు పరంపర అంతటికీ ప్రార్థన చేసి, బ్రహ్మజ్ఞానమో, బ్రహ్మజ్ఞాన ఫల అనుభవమో కోరాలి. రెండింటికీ సాధన కావాలి. ఎందుకంటే రెండూ సాధ్యాలు. అందువల్ల రెండింటికీ ఈశ్వర–గురు అనుగ్రహం కావాలి.

**ఓమ్ సహ నావవతు, సహ నౌ భునక్తు సహ వీర్యం కరవావహై**
**శాంతిపాఠం**

**సహ నావవతు** అంటే ఆ భగవంతుడు మమ్మల్ని రక్షించుగాక

**సహ నౌ భునక్తు** అన్నా కూడా ఆ భగవంతుడు మమ్మల్ని రక్షించు గాక అనే వస్తుంది.

రెండుసార్లు ఒకే మాటను ఎందుకు చెప్పారంటే వాటి మధ్య ఉన్న సూక్ష్మభేదాన్ని శంకరులవారు వివరిస్తున్నారు. భగవంతుడు మాకు బ్రహ్మజ్ఞానం ఇచ్చి రక్షించుగాక, భగవంతుడు మాకు బ్రహ్మజ్ఞానఫలం ప్రసాదించి రక్షించు గాక అని అర్థం.ఎంత చక్కటి ప్రార్థనో చూశారా? అందువల్ల మీ స్థాయికి తగ్గట్టుగా బ్రహ్మజ్ఞానమో, బ్రహ్మజ్ఞానఫల అనుభవమో కోరుకోండి జ్ఞానం ఇంకా పూర్తిగా కలుగలేదు అనిపిస్తే బ్రహ్మ అనుభవం కోరుకోని స్థాయికి చేరేవరకూ శ్రవణ, మననాలు చేస్తూనే ఉండండి.

ఒకవేళ దేంట్లోనైనా అనుభవం కోరనవసరం లేదు అంటే అది బ్రహ్మ అనుభవం విషయంలోనే అనే విషయం మీకు నిశ్చయంగా తెలిసిందంటే, బ్రహ్మజ్ఞాన ఫల అనుభవంకోసం ప్రయత్నించండి. ఈ రోజు గురుపరంపరను ధ్యానించటంద్వారా ఈ రెండూ కోరుతాము.

**సదాశివసమారంభాం శంకరాచార్యమధ్యమామ్।**
**అస్మదాచార్యపర్యంతాం వందే గురుపరంపరామ్॥**

**అస్మదాచార్య పర్యంతామ్-** సాక్షాత్తూ ఆ సదాశివునినుంచి, నా ప్రత్యక్ష గురువువరకూ అందరికీ నమస్కారం. అందరికీ నమస్కారం పెట్టినా, సాధారణంగా ముగ్గురు గురువులకు ప్రాముఖ్యత నిస్తాము. ఒకటి సాక్షాత్తూ ఆ సదాశివుడు. ఆయన నుంచే, అపౌరుషేయంగా మనకు వేదాలు వచ్చాయి. ఆయనను దక్షిణామూర్తిగా కొలుస్తాము. రెండవ గురువుగా, వ్యాసాచార్యులవారిని కొలుస్తాము. ఆయన మొత్తం వేదాలను క్రోడీకరించి మనకు సరియైన పద్ధతిలో బోధ జరిగేటట్టు చూశారు. ఏమిటా సరియైన పద్ధతి? బ్రహ్మ అనుభవంకోసం శిష్యుడు అడగనంత వివరంగా బోధించటం. ఇటువంటి పద్ధతిని సమ్యక్ సాంప్రదాయం లేదా సత్ సాంప్రదాయం అంటారు. అటువంటి సాంప్రదాయాన్ని నెలకొల్పిన వ్యాసాచార్యులకు నమస్కారాలు.

తర్వాత శంకరాచార్యులకు వందనాలు. వ్యాసాచార్యులు బోధించిన సాంప్రదాయాన్ని తన భాష్యాలద్వారా మనకు విస్తారంగా, విశ్లేషణలనిచ్చిన శంకరాచార్యులకు నా ప్రత్యేక వందనాలు. ఇప్పుడే శాంతిపాఠాన్ని శంకరులవారు ఎలా విశ్లేషించారో చూశాము. ఆ విధంగా ఇవాళ మనం ప్రత్యేకంగా దక్షిణామూర్తిని, వ్యాసాచార్యులవారిని, శంకరాచార్యులవారిని, తక్కిన అందరు గురువులను బ్రహ్మజ్ఞానంకోసం బ్రహ్మజ్ఞానఫల అనుభవకోసం ప్రార్థిద్దాము.

# 31. జ్ఞానం-ప్రవర్తన

మనం పొందిన జ్ఞానం మనకు ప్రయోజనకరంగా ఉండాలంటే మనం ముందుగా ఒక ప్రాథమిక సూత్రాన్ని గుర్తుపెట్టుకోవాలి.

జ్ఞానంద్వారా మనం ప్రపంచాన్ని మార్చటానికి ప్రయత్నించకూడదు. లౌకిక శాస్త్రం ఆ ప్రయత్నం చేస్తుంది కాని, ఆధ్యాత్మిక జ్ఞానం చేయదు. మనం ఎవరినీ మార్చలేము. పూజ్యస్వామీజీ అనేక శిక్షణా శిబిరాలను నిర్వహించారు. అందరినీ మార్చగలననే దృఢనమ్మకంతో అవి నిర్వహించాను కాని ఇరవయి సంవత్సరాలు గడిచాక ఒక బాధాకరమైన సత్యాన్ని గ్రహించానన్నారు. అదేమిటంటే మనం ఎవరినీ మార్చలేమని.

ఆధ్యాత్మ జ్ఞానంయొక్క ప్రాథమిక ఉద్దేశం- **మనను మాత్రమే మార్చగలం; మనను మనం మాత్రమే మార్చగలం.** సరిగ్గా గమనిస్తే ఇందులో రెండు అంశాలు ఉన్నాయి. వీటిని వేరేవిధంగా చెపితే, 1. మనను మాత్రమే మార్చగలం, ఇతరులను మార్చలేము; 2. మనను మనం మాత్రమే మార్చగలం- ఇతరులు మనను మార్చలేరు.

మనను మార్చుకోవటం ఎందుకు? ఈ ప్రపంచాన్ని ఎదుర్కోవటానికి. మారుతున్న మనుష్యులను భరించాలి. అసలు ఎన్నటికీ మారని మనుష్యులనూ భరించాలి. ఈ రెండింటినీ భరించటానికి మనం మారాలి.

ఇతరులను మార్చకూడదు అంటే అది స్వార్థం కాదా? ఎవరెలా పోతే నాకేమిటి అనే స్వార్థం కనిపించదా? లేదా ఇతరులు తప్పు చేస్తున్నా పట్టించుకోకపోతే అది మన బాధ్యతారాహిత్యాన్ని చూపించదా? ఇతరులను మార్చలేము అని పూర్తి వ్యతిరేకభావనతో చెప్పటం లేదు, కాని వారిని మనకు అనుగుణంగా మార్చేయగలము అని అత్యంత సానుకూల ఆలోచనతో ఉండకూడదనే ఉద్దేశ్యంతో చెప్పటం జరిగింది. ఇతరులను మార్చలేము కాని, వారు మారటానికి తోడ్పడగలము.

వారిని మార్చటానికి తోడ్పడటానికి కూడా మూడు పరిస్థితులు అనుకూలించాలి. అవి-

1. ఎదుటి వ్యక్తి మారటానికి నిశ్చయించుకోవాలి.
2. అతను మారటానికి నిశ్చయించుకున్నా, మననుంచి సహాయం కోరటానికి సిద్ధంగా ఉండాలి.

3. అతను మారటానికి నిశ్చయించుకుని, మనను సలహా అడిగినా, మనకు మంచి సలహా ఇవ్వగలిగే సామర్థ్యం ఉండాలి.

ఈ నియమాలు సరిపోతే, వారు మారటానికి తోడ్పడవచ్చు. కాని ప్రపంచాన్ని పరీక్షిస్తే, అది ఈ నియమాలకు పూర్తి భిన్నంగా ఉంది.

1. ఎవరూ మారటానికి నిశ్చయించుకోరు. ఎందుకంటే వారు బ్రహ్మాండంగా ఉన్నారు, వారిలో ఏ తప్పూ లేదనుకుంటారు. పైపెచ్చు ఎదురు మనకు సలహా ఇవ్వటానికి సిద్ధంగా ఉంటారు.

2. ఒకవేళ మారటానికి నిశ్చయించుకున్నా మనను సలహా అడగరు.

3. ఒకవేళ మారటానికి నిశ్చయించుకుని మనను సలహా అడిగినా, మనకు చెప్పే సామర్థ్యం ఉండాలి.

అందువల్ల ఇతరులకు సహాయం చేయాలని ప్రయత్నించటంలో అర్థం లేదు. వారికి మనం చేయగలిగిన గొప్ప సహాయం ఒకటి ఉంది. అది వారి విషయాల్లో మనం తలదూర్చకుండా ఉండటమే. ఆఖరికి దేవుడు కూడా మనను మార్చలేడు, మనం ఆయన సహాయం కోరకపోతే. అందువల్లనే రాముడు రావణాసురుని మార్చలేదు. కృష్ణుడు కంసుణ్ణి మార్చలేదు.

1. మనం మన పురుషార్థబుద్ధితో అంటే ఫ్రీవిల్ ఉపయోగించి, మనం మారాలని నిశ్చయించుకోవాలి ముందు.

2. మారాలని నిశ్చయించుకున్నాక, దైవసహాయం, దైవానుగ్రహం కోరాలి.

3. దేవుడు మనను మార్చటానికి సమర్థుడు. ఆయనంతట ఆయనే మనను మారుస్తాడు, లేదా మనను మార్చే సామర్థ్యం ఉన్నవారిని పంపిస్తాడు.

అలా నిశ్చయించుకుని, దైవానుగ్రహంవల్ల మారితే మన ప్రవర్తన అనూహ్యంగా మారుతుంది. శాస్త్ర అధ్యయనం చేస్తే మనలో అద్భుతమైన మార్పు వస్తుంది. అది రాత్రికి రాత్రి రాదు. కాలక్రమేణా వస్తుంది. సీతాకోకచిలుక అంత అందమైన ఆకారం పొందే ముందు మూడు దశలు దాటి వచ్చింది. ఆ మొదటి మూడులో ఏవీ అందమైన దశలు కావు. అసలు ఆ దశల్లో ఏ దశలో చూసినా, తర్వాత అది అంత అందంగా, అంత అద్భుతంగా మారుతుందని కలలో కూడా ఊహించము.

మనం కూడా మూడు ఆశ్రమధర్మాలు దాటి సన్న్యాసాశ్రమానికి వస్తాము. మనం కూడా చివరి దశలో ఆత్మజ్ఞానులమవుతాము. కాని సీతాకోకచిలుకకూ,

మనకూ చిన్నతేడా ఉంది. అది ఆ చివరి దశకు చేరుకోవటానికి దాని ప్రయత్నమేమీ చేయనవసరం లేదు. ప్రకృతి సృష్టిలోనే ఆ దశలు ఉన్నాయి. కాని మనం జీవితంలో సీతాకోకచిలుక అంత అందంగా, అంత అద్భుతంగా మారాలంటే మన పురుషప్రయత్నం చేయాలి. పురుషప్రయత్నం ఒకటే చాలదు, దేవుని కృప కూడా ఉండాలి.

మనం జ్ఞానం పొందితే చాలు, మారనవసరం లేదు అనుకుంటే మనం కేవలం సమాచారం పొందినవారమవుతాము. కాని దానివల్ల మనలో ఏమీ మార్పురాదు. ముందే చూసినట్టుగా మనను మనం మాత్రమే మార్చుకోగలము. ఎవరూ మార్చలేరు– శాస్త్రం, గురువు, భగవంతుడు కూడా మార్చలేడు.

**ఉద్ధరేదాత్మనాత్మానం – గీత – 6–5**

ఎందుకు ఎవరూ మారటానికి త్వరగా ఇష్టపడరు? ఎందుకంటే మార్పు బాధాకరమైన విషయం. ఇప్పుడున్న పరిస్థితిలో హాయిగా సాగిపోతున్నది; ఇప్పుడు మన స్వభావానికి తగ్గట్టుగా ఉన్నాము. దాన్నుంచి మారాలంటే, మన అహంకారాన్ని పూర్తిగానో, కొంచెంగానో చంపుకోవాల్సి ఉంటుంది. మార్పు చెందటం అనేది ఒక విధమైన మరణంతో సమానం. ఉపనిషత్తుల్లో **మరణం ఒక విధమైన మార్పు** అని చూస్తాము. ఇప్పుడు ఈ ఈక్వేషన్‌ను అటునుంచి చూస్తే అంతేగా! **మార్పు ఒక విధమైన మరణం!**

తల్లి గర్భంలోనుంచి బయటకు రావటం ఒక మార్పు గర్భస్థ శిశువుకు. దానికి సిద్ధంగా ఉండదు ఆ శిశువు. అందుకే బయట ప్రపంచంలోకి వచ్చేటప్పుడు తప్పనిసరిగా ఏడుస్తూ వస్తుంది. తల్లి గర్భంలోకన్నా హాయిగానే ఉంటుంది జీవితం, అయినా ఏదో తెలీని భయం. అలాగే ఒక దశనుంచి ఇంకో దశకు మారేటప్పుడు ఏదో తెలియని జంకు. మనం మారటానికి సిద్ధపడితే తప్ప, మారలేము.

అందువల్ల ఈ నూతనసంవత్సరంలో 'నేను మారాలి!' అని నిర్ణయం తీసుకుందాము. ఎదుటివారు మారకపోయినా, నేను మాత్రం మారతాను అనుకోవాలి. ఈ సందర్భంలో స్వామీజీ తన అనుభవంలోంచి ఒక ఉదాహరణనిస్తున్నారు. ప్రార్థనలో ఓమ్ అనేటప్పుడు కొంతమంది గొంతు, తక్కినవారితో కలవదు. వారు అది గ్రహించుకోకుండా, వారికి ఇష్టమైనట్టు అనేస్తారు. అది చిరాకు తెప్పిస్తుంది. దాన్ని చిరాకుపడకుండా, నవ్వుతూ స్వీకరించటానికి స్వామీజీకి మూడు సంవత్సరాలు పట్టింది. కాని తను ఈ చిరాకును సంవత్సరంలో

ఒకసారి, రెండు గంటలు భరించాలి అంతే. కాని, తన శిష్యులు తమ కుటుంబసభ్యులతో కొన్ని విషయాలను ఇష్టం లేకపోయినా, జీవితాంతం నవ్వుతూ భరించాలి అంటారు.

మనం మారాలి అనే విషయం శాస్త్రం పదే పదే నొక్కివక్కాణిస్తుంది. విచారం మారిన కొద్దీ ఆచారం మారాలి అంటుంది. విచారం అంటే జ్ఞానం. ఆచారం అంటే మడి, ఆచారం కాదు. మన వాక్కు, మనం చేసే కర్మలు. జ్ఞానం పొందుతున్న కొద్దీ, మన ఆలోచనల్లో మార్పు వస్తుంది. ఆ అంతర్గత మార్పు బాహ్యంగా కూడా రావాలి. అంటే మన వాక్కు, కర్మలలో ఆ మార్పు కనపడాలి.

శాస్త్రం ఈ విషయాన్ని నొక్కి చెప్పే కొన్ని శ్లోకాల సారాంశం చూద్దాము.

1. ఎదుటివారికి సలహాలు ఇచ్చేటప్పుడు మీరు మహాత్ములలాగా ఉంటారు. అదే మీరు స్వయంగా మారాల్సి వచ్చేసరికి, ఈ విషయాన్ని విస్మరిస్తారు. మీకు ఈ బలహీనత ఉంది కాబట్టి మీరు జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా వ్యవహారం నడిపేటప్పుడు.

2. మీరు శ్రౌతకర్మలు చేయకపోయినా ఫర్వాలేదు, స్మార్తకర్మలు చేయకపోయినా ఫర్వాలేదు (ఈ మాటలను అక్షరాలా తీసుకుని చేసే కర్మలను చేయటం మానకండి). కాని ఆచారాన్ని మాత్రం మానవద్దు అంటుంది శాస్త్రం. ఆచారం అంటే ఇందాక చూశాము. వాక్కు, కర్మలలో మార్పు.

**యోగస్య ప్రథమం ద్వారం వాజ్ నిరోధః॥ - వివేకచూడామణి**

ఏ శాస్త్రం చూసినా ముందు వాక్కుని అదుపులో పెట్టుకోవాలి అంటుంది. ముందు ఎక్కువగా మాట్లాడటం తగ్గిస్తే పనికిరాని మాటలు వాటంతట అవే తగ్గిపోతాయి. మీరేం నేర్చుకుంటే దాన్ని ఆచరణలో పెట్టాలి. మీ జ్ఞానం ఒకటీ, మీ ప్రవర్తన మరొకటీగా ఉండకూడదు.

3. ఇంత తెలిసినా మీరు ఆచరణలో పెట్టటానికి సిద్ధపడకపోతే ఈ శ్లోకం మిమ్మల్ని హెచ్చరిస్తున్నది. తిన్న ఆహారం ఒకవేళ జీర్ణం అవకపోతే, అది విషంగా మారి,మిమ్మల్ని ఇబ్బంది పెడుతుంది. శాస్త్రం విషయం కూడా అంతే. నేర్చుకున్న శాస్త్రాన్ని ఒంటబట్టించుకోకపోతే, దాన్ని ఆచరణలో పెట్టకపోతే, అదికూడా విషంగా మారుతుంది. అంటే అది మేలు చేయకపోగా, చెడు చేస్తుంది. ఎలా? మీలో గర్వాన్ని పెంచుతుంది. నాకు గీత వచ్చు, బృహదారణ్యకోపనిషత్తు మొత్తం వచ్చు అనే గర్వం రావచ్చు.

చిన్మయానందస్వామి అంటారు, 'నువ్వు పది ఉపనిషత్తులను అధ్యయనం చేశావు బాగానే ఉంది, కాని వాటిలో నీకు ఎన్ని ఒంటపట్టాయి?' అన్ని గర్వాలకన్నా విద్యాగర్వం చాలా చెడ్డ గర్వం. ఎందుకంటే తక్కిన గర్వాలను విద్యవల్ల తొలగించవచ్చు. విద్యే గర్వాన్నిస్తే, ఎవరూ బాగుపరచలేరు అతన్ని.

4. ఈ శ్లోకం ఇంకొక హెచ్చరిక చేస్తున్నది. ఇందాక చెప్పినట్టు ఎన్ని నేర్చుకున్నా, వాటిని ఆచరణలో పెట్టటానికి సిద్ధంగా లేకపోతే, అంత చదువూ బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది. అతనికి వేదాలు, వేదాంగాలు, మీమాంస, వ్యాకరణం ఎన్నైనా తెలియనీ, అవి అతనికి సమస్యనే కొనితెస్తాయి. ఎలా? అతను వాటిని ఆచరణలో పెట్టకపోతే అతనికి ఏదైనా విపత్కర పరిస్థితి ఏర్పడినప్పుడు, అతన్ని వదిలి వెళ్ళిపోతాయి. అంటే ఆ జ్ఞానం నిష్ప్రయోజనం అవుతుంది. అందువల్ల నేర్చుకున్న జ్ఞానంయొక్క జ్ఞాననిష్ఠలో ఉండాలి. ఇది చెప్పటానికి పక్షి వృత్తాంతం కూడా ఇస్తున్నది ఈ శ్లోకం. రెక్కలురాగానే గూడు విడిచి పిల్లలు ఎగిరివెళ్ళిపోయినట్టుగా, ఆచరణలో పెట్టని వ్యక్తియొక్క జ్ఞానం కూడా అతని మనస్సనే గూడులో నిలవదు, దాన్ని వదిలి వెళ్ళిపోతుంది.

5. ఇప్పుడు పరిహాస శ్లోకాలు. పాండిత్యం ఉంది, ఆచారాన్ని పాటించకపోతే అది వ్యర్థం అని చెప్పటానికి ఒక పరిహాస ఉదాహరణను తీసుకుంది ఈ శ్లోకం. అది కుక్కతోకలాంటిదిట. అంటే కుక్కతోక వంకర ఉదాహరణ కాదు ఇక్కడ. కుక్క తోక పైకి లేచి ఉంటుంది. అది వెనుకభాగాన్ని కప్పదు. తక్కిన జంతువులకు వెనుకభాగం తోకతో కప్పబడుతుంది కాని కుక్కకు అలాకాదు. ఈ ఉదాహరణ చూడటానికి కొంచెం ఎబ్బెట్టుగా ఉన్నా అది నిజం. అంతేకాదుట. కొన్ని జంతువులు వాటి తోకతో వాటిమీద వాలే ఈగలను, దోమలను పారద్రోలుతాయి. కాని కుక్క అది కూడా చేయలేదు. అంటే దానికి తోక ఉండీ లాభం లేదు. ఒక పండితునికి వేద వేదాంగాల జ్ఞానం ఉండీ, ఆచారాన్ని పాటించకపోతే ఉండీ లాభం లేదు.

ఎటువంటి మార్పు పొందాలి? ఇది చాలా పెద్ద అంశం.

**కైర్లింగైః త్రీన్ గుణానేతాన్ అతీతో భవతి ప్రభో**
**కిమాచారః కథం చైతాన్ త్రీన్ గుణానతివర్తతే - గీత 14-21**

అర్జునుడు అడుగుతాడు, 'ఓ ప్రభూ! ఈ మూడు గుణాలకు అతీతుడైన వాని లక్షణాలేవి? అతని లోకవ్యవహారం ఎలా ఉంటుంది? మనిషి త్రిగుణాతీతుడవటానికి ఉపాయమేమిటి?'

6. ఇది వివరించే శ్లోకం ఇది. యుద్ధం గెలిచినంత మాత్రాన శూరుడు అయిపోడు. వేదాధ్యయనం చేసినంత మాత్రాన పండితుడు అయిపోడు. వాక్ పటుత్వం ఉన్నంత మాత్రాన వక్త అయిపోడు; ధారాళంగా దానం చేసినంత మాత్రాన దాత అయిపోడు. మరి ఎప్పుడవుతాడు?

ఇంద్రియాలను జయించిన వాడే శూరుడు. ధర్మాన్ని ఆచరించినవాడే పండితుడు; ఇతరులకు హితంగా, ప్రియంగా, ప్రయోజనకరంగా మాటలాడినవాడే వక్త. ఎదుటివారికి గౌరవం ఇచ్చి వారిని మర్యాదగా చూసినవాడే దాత.

అందువల్ల ఈ కొత్త సంవత్సరంలో మీరు మారటానికి ప్రయత్నించండి అనను అంటున్నారు స్వామీజీ. అంతకుముందు ఎవరైనా శిష్యుడు, ఆయనతో ఇంకొక శిష్యుని గురించి ఫిర్యాదు చేస్తే స్వామీజీ చాలా బాధపడేవారుట. ఎందుకంటే తను ఆ విద్యార్థిని మార్చలేకపోయానని బాధపడేవారు. కాని ఇప్పుడు అటువంటి బాధ లేదు. ఎందుకంటే ఎవరూ ఎవరినీ మార్చలేరని గ్రహించారు. ఆయన మార్చాలని ఆశిస్తే నిరాశానిస్పృహలకు లోనవుతారు. అందువల్ల మొదట్లో చెప్పిన వాక్యాలు రెండు గుర్తుంచుకోండి.

**మనను మాత్రమే మార్చగలం**
**మనను మనం మాత్రమే మార్చగలం**

# స్వామీజీ సూక్తిముక్తావళి

జగత్తుపరంగా మనస్సు సబ్జెక్టు, జగత్తు ఆబ్జెక్టు.
మనస్సుపరంగా బ్రహ్మ సబ్జెక్టు, మనస్సు ఆబ్జెక్టు.
అందువల్ల ఆలోచనలు ఉన్న ఆలోచనలు లేని మనస్సును సాక్షీభూతంగా చూస్తుంది బ్రహ్మ (ఆత్మ).

# 32. ఆత్మజ్ఞానం- భావోద్రేకాలు

ఆత్మజ్ఞానం కోరే సాధకుని ప్రయాణం మూడు స్థాయిలలో సాగుతుంది.

**1. జ్ఞానయోగ్యతాప్రాప్తి-** జ్ఞానం పొందటానికి కావాల్సిన అర్హతలను పొందుతాడు. ఆత్మజ్ఞానం పొందాలనే జ్ఞానం పొందుతాడు; ఆత్మజ్ఞానం పొందటానికి తీవ్రముముక్షుత్వం కలిగి ఉంటాడు. అది పొందటానికి తగిన అర్హతను సంపాదించుకుంటాడు. అంటే సాధనచతుష్టయసంపన్నుడై ఉంటాడు. జ్ఞానం పొందాలనే జ్ఞానం, తపన, అర్హత- ఈ మూడింటినీ కలిపి జ్ఞానయోగ్యతాప్రాప్తి అంటారు.

ఈ యోగ్యత పొందటానికి రెండు సాధనాలు ఉన్నాయి. అవి

**ఎ) కర్మయోగసాధన-** అనేక యజ్ఞయాగాదులు చేయటం+ విలువలను పాటించటం.

**బి) ఉపాసనాయోగసాధన-** సగుణ ఇష్టదేవతమీద ధ్యానం చేయటం. ఇవన్నీ పాటిస్తే జ్ఞానయోగ్యతాప్రాప్తి కలుగుతుంది.

**2. జ్ఞానప్రాప్తి-** ఇది రెండవ దశ. జీవాత్మ పరమాత్మ ఐక్యజ్ఞానం పొందటాన్ని జ్ఞానప్రాప్తి అంటారు.

ఈ జ్ఞానప్రాప్తి పొందటానికి కూడా రెండు సాధనలు చేయాలి. అవి.

**ఎ) శ్రవణం-** శ్రవణం అంటే ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాల పాటు, ఒక యోగ్యుడైన గురువువద్ద శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి. ఈ నిర్వచనంలో ప్రతిపదమూ ముఖ్యమే. ఒక క్రమపద్ధతిలో అంటే ముందు గీత, తర్వాత ఉపనిషత్తులు (దానికి కూడా వరుసక్రమం ఉంటుంది). తర్వాత బ్రహ్మసూత్రాలు నేర్చుకోవాలి. అవి కూడా గురువుద్వారా నేర్చుకోవాలి.

**బి) మననం-** మననంలో నిశ్చయజ్ఞానం లేదా సంశయరహితజ్ఞానం కలుగుతుంది. సంశయసహిత జ్ఞానం అజ్ఞానంలోకే వస్తుంది. ఈ నిశ్చయజ్ఞానం పొందటానికి ప్రత్యేకంగా కొన్ని గ్రంథాలు ఉన్నాయి. వాటిని మనన గ్రంథాలు అంటారు. బ్రహ్మసూత్రాల్లో, రెండవ అధ్యాయం, ముఖ్యంగా రెండవ పాదం జ్ఞానాన్ని నిశ్చయజ్ఞానంగా మారుస్తుంది.

**3. జ్ఞాననిష్ఠాప్రాప్తిః -** జ్ఞానప్రాప్తి కలిగితే చాలదు, జ్ఞాననిష్ఠాప్రాప్తి కలగాలి. నేర్చుకున్న జ్ఞానానికి, మీ ప్రవర్తనకు మధ్య వ్యత్యాసం ఉండకూడదు. అంటే

జ్ఞానం మీలో జీర్ణించుకుపోవాలి. అది మీరు ఆచరణలో పెట్టటానికి ప్రత్యేక శ్రమ చూపకుండా, అది మీ అలవాటుగా అయి, మీలో మార్పు తేవాలి. సంసారి మీరు కాస్తా అసంసారి మీరు అవాలి. దీనికి కూడా రెండు సాధనలు ఉన్నాయి.

**ఎ) నిదిధ్యాసనం-** నేర్చుకున్న జ్ఞానంమీదే మనసును నిలిపి ఉంచటం. ఇది అనేక విధాలుగా చేయవచ్చు. శాస్త్రాన్ని అధ్యయనం చేయటం; పదే పదే ఉపనిషత్తులను వినటం (అవి తెలిసినా కూడా); నేర్చుకున్న అంశాలను వ్రాయటం; తక్కిన విద్యార్థులతో మీ జ్ఞానాన్ని పంచుకోవటం; మీరే బోధ చేయటం (ఎదుటి వ్యక్తికి ఆత్మజ్ఞానంమీద శ్రద్ధ కలిగి, మీకు చెప్పాలన్న సరదా ఉంటే); చివరగా ధ్యానం చేయటం.

కాని ఇక్కడ ఒక విషయం గ్రహించాలి. మామూలుగా మీరు చేసే ధ్యానం వేరు, వేదాంత ధ్యానం వేరు. దీన్నే నిదిధ్యాసనం అని కూడా అంటారు. దీనికి గీత ఆరవ అధ్యాయంలో చెప్పిన అంశాలు పాటించకపోయినా ఫర్వాలేదు. నిటారుగా కూర్చోవటం, ఒక సుఖాసనంమీద కూర్చోవటం లాంటివి. ఇది మీరు ఏ సముద్రపుటొడ్డునో నడుస్తూ కూడా చేయవచ్చు. మనస్సు ప్రధానం. మనస్సును బోధమీద నిలపాలి.

**బి) జ్ఞాననిష్ఠలో ఉన్న వ్యక్తి జీవనవిధానాన్ని అనుకరించటం-** జ్ఞాని నడవడిక ఎలా ఉంటుందో గీతలో వివరంగా వస్తుంది. మీలో ఇంకా జ్ఞాననిష్ఠ కలగకపోయినా, జ్ఞాని ఎలా ప్రవర్తిస్తాడో, అలా ఉండటానికి ప్రయత్నించండి. పూజ్య స్వామీజీ చెబుతారు, **'ఫేక్ ఇట్ అండ్ మేక్ ఇట్.'**

ముందు బలవంతంగా ఏదైనా చేస్తే, రాను రాను అది అలవాటైపోతుంది. అందువల్ల ఇదీ సాధకుని ప్రయాణం- జ్ఞానయోగ్యతాప్రాప్తి, జ్ఞానప్రాప్తి, జ్ఞాననిష్ఠాప్రాప్తి.

ఈ ప్రయాణంలో నేను ఏ దశలో ఉన్నాను? జ్ఞానప్రాప్తిలోనా, జ్ఞాననిష్ఠాప్రాప్తిలోనా? ఎలా తెలుస్తుంది నాకు? గీత, తక్కిన గ్రంథాలు జ్ఞానిలో కలిగే మార్పు, అతని భావోద్రేకంలో కలిగే మార్పులను వివరిస్తాయి.

**వీతరాగభయక్రోధాః మన్మయా మాముపాశ్రితాః।**
**బహవో జ్ఞానతపసా పూతా మద్భావమాగతాః॥** **గీత 4 -10**

రాగం, భయం, క్రోధంనుంచి విడివడతారు. అంటే జీవన్ముక్తులు అవుతారు. రాగద్వేషాలనుంచి జీవన్ముక్తులు అవుతారు అనే ఈ వాక్యాన్ని మనం కొంచెం

లోతుగా పరిశీలించాలి. మనం వేదాంతం ఆషామాషీగా నేర్చుకుంటుంటే మనం మారామో లేదో ప్రశ్న ఉదయించదు. కాని ఈ జ్ఞానాన్ని నేను ఎంతవరకు జీర్ణించుకున్నాను, ఎంత వరకూ పాటిస్తున్నాను అనే ఆత్మవిమర్శ చేసుకోవటం మొదలుపెడితే మాత్రం కొంచెం చలిస్తాము.

మనకు ఏదైనా బాధాకరమైన విషయం జరిగి, మనం చలించకపోతే మురిసిపోతాము. తక్కినవారు కోపంగా అరిచారు, కాని నేను చలించలేదు. నేను చలించలేదు కాబట్టి నేను మారానని సంతోషంగా ఉంది అని కూడా అనుకుంటాము. కొంతమంది వెళ్ళి స్వామీజీతో ఈ సంతోషాన్ని పంచుకుంటారు కూడా. ఆయన దగ్గరకు వెళ్ళి, 'స్వామీజీ, నేను మారిపోయాను. నేను బాధపడలేదు. అందువల్ల జీవన్ముక్తుణ్ణి అయ్యాను,' అని మురిసిపోతూ చెబుతారు.

కాని రెండోవారమే మళ్ళీ వెళ్ళి చాలా బాధపడతారు. ఇంకో సంఘటన జరిగితే వారికి చాలా కోపం వచ్చిందనో, దుఃఖం వచ్చిందనో చెబుతారు. ఇక్కడ వస్తుంది అసలు చిక్కంతా! వారిమీద వారికి సందేహం వస్తుంది, 'నేను జీవన్ముక్తుణ్ణి అనుకుని మురిసిపోయాను, కాని వారం తిరక్కుండా నేను కూడా అందరిలాగా అరిచాను. ఇది తప్పు కదా!' అనుకుంటారు.

ఇటువంటి వారికి రెండు రూపాల సమస్య. మొదటి సమస్య అయ్యో అలా ప్రవర్తించానే అనేది. రెండవ సమస్య నేను వేదాంత విద్యార్థిని అయి కూడా అలా చేసానే అనేది. ఇది ఇంకా పెద్ద సమస్య. **తను చూపిన ప్రతి చర్యకు, ప్రతి చర్య ఇది.** ఇలా ప్రతిచర్య గురించి బాధపడటం ఇంకో రకమైన సంసారం. ఇది ప్రత్యేకమైన బాధ.

తక్కినవారికి ఒకటే సంసారం ఉంటుంది. ఏదో జరుగుతుంది.వారు దానికి ఏదో విధంగా స్పందిస్తారు. కాని వేదాంత విద్యార్థులైనవారికి రెండు సమస్యలు– ఏదో జరుగుతుంది. దానికి మనస్సులో ఏదో విధంగా వారు కూడా స్పందిస్తారు. కాని అక్కడితో సమస్య ఆగదు. ఇంకా దారుణం ఏమిటంటే అయ్యో నేను అలా స్పందించానే అని దానిమీద వారు తీవ్రంగా స్పందిస్తారు.

మీరు జీవన్ముక్తులవాలనుకుంటే, ఈ రెండవ స్పందనను అదుపులో పెట్టటం నేర్చుకోవాలి. దానికి ఇంకొక నిదిధ్యాసనం చేయాలి. ఈ రెండవ స్పందనను ఎలా అదుపులో పెట్టాలి?

ఈ విషయంమీద వివరంగా చూద్దాము ఇప్పుడు. ఆరు అంశాలు ఉన్నాయి ఇందులో.

1. మనస్సు అనేది ఎన్నటికీ భావోద్రేకాలకు అతీతంగా ఉండదు.

జ్ఞానికి కూడా మూడు గుణాలూ- సత్వ, రజో, తమోగుణాలు- మారుతూ ఉంటాయి. వాటిని తగ్గించుకోగలడు తప్ప, పూర్తిగా వాటిని పారద్రోలలేడు.

2. ఎవరికైనా సరే, మీతో సహా, రాగద్వేషాలను తగ్గించుకోవటం, రాత్రికి రాత్రి జరిగిపోదు. అది నిదానంగా కాలక్రమేణా తగ్గుతూ వస్తుంది. మీలో ఎంత మేరకు తగ్గిందని చూసుకోవటానికి ఒక **ఎఫ్ ఐ ఆర్** టెస్ట్ ఉంది.

| | | |
|---|---|---|
| **ఎఫ్** | **- ఫ్రీక్వెన్సీ** | - ఎంత తరచు కోపం వస్తుంది? |
| **ఐ** | **- ఇంటెన్సిటీ** | - ఎంత తీవ్రంగా ఉంది? |
| **ఆర్** | **- రికవరీ** | - ఎంతసేపటికి ఆ కోపం తగ్గుతోంది? |

ఎంత తీవ్రంగా ఉందో ఎలా తెలుస్తుంది అంటే మీ మనస్సులో ఆ కోపం రావటమేకాక మీరు మాటలతో, చేతలతో కూడా చూపిస్తే కోపం చాలా ఎక్కువగా వచ్చినట్టు. మనస్సులోనూ, మాటలతోనూ చూపిస్తే కొంచెం తక్కువ ఉన్నట్టు. మనస్సులోనే నలిగిపోయి, మాటలద్వారా బయటకు మీ కోపం దూసుకురాకపోతే, మీ కోపం చాలా తక్కువ ఉన్నట్టు. అంటే మీ మాటమీద మీకు అధికారం ఉన్నట్టు.

ఎంతసేపటికి ఆ కోపం తగ్గుతోంది? మొదట్లో త్వరగా తగ్గదు. జ్ఞాననిష్ఠలో పెరుగుతున్న కొద్దీ, త్వరగా తగ్గుతుంది. ఇది ఇలాగే ఉంటుందని చెప్పలేము. ఇది మనిషి, మనిషికీ మారుతుంది; మీలోనే ఒక్కొక్క సంఘటనకీ ఉద్రేకం, తీవ్రత ఒక్కొక్కలాగా ఉంటుంది.

3. కోపం తగ్గటం ఒక సరళరేఖలా సరాసరి సాగిపోదు. అందులో హెచ్చుతగ్గులు ఉంటాయి. తీవ్రతలో తేడాలుంటాయి. అన్ని పరిస్థితుల్లో ఒక్కలాగా ఉండదు.

4. భావోద్రేకాలు ఎందుకు కలుగుతాయి అని అడిగితే దానికి అనేక కారణాలు ఉంటాయి. చాలా కారణాలు మీకు తెలియవు. అంటే మీకు తెలియకుండా జరుగుతాయి కొన్ని సంఘటనలు. మనస్సును అర్థం చేసుకోవటం కష్టం. అది అవిద్యా వాసనలతో కూడి, ఎన్నో జన్మలనుంచి వస్తున్నది. అందువల్ల కారణాలు తెలియవు. ఒకవేళ తెలిసినా, వాటిని అదుపులో పెట్టలేరు. ఆత్మజ్ఞానం పొందినా ఉద్రేకాలను అదుపులో పెట్టలేరు ఒక్కోసారి.

**ఎండావానా కుక్కా నక్కా పెళ్ళి అంటారు.** అంటే ఒక పక్క ఎండ ఫెళ్ళున కాస్తున్నా, ఇంకో పక్కనుంచి వాన కురుస్తుంది. అలాగే ఒక పక్కనుంచి

నువ్వు పరిపూర్ణుడివి, నువ్వు ఆనందస్వరూపుడివి అని బుద్ధి చెబుతున్నా, ఇంకోపక్కనుంచి మనస్సుకు ఏదో కష్టం కలిగి, కంటినీరు మీకు తెలియకుండానే కారుతుంది. మనస్సు మిథ్య, అది వ్యావహారిక సత్యం; నేను సత్యం, నేను పారమార్థిక సత్యం అని– అన్నీ తెలుసు కాని మనస్సు మాట వినదు.

5. మనస్సు మాట వినదు అని దాని గురించి బాధపడుతూ కూర్చోకూడదు. ఈ భావోద్రేకాలను తగ్గించుకోవటం, మనస్సును సంస్కరించుకోవటం చేయాలి. నిజమే కాని అది ఆత్మజ్ఞానంయొక్క ప్రాథమిక లక్ష్యం కాదు. అది సహకారి లక్ష్యం మాత్రమే. ఈ విషయం గుర్తుంచుకోవాలి.

6. ఈ విషయం చాలా ముఖ్యమైన విషయం. మనస్సును సంస్కరించు కోవటం ముఖ్య లక్ష్యం కాకపోతే ఏమిటి మీ ప్రాథమిక లక్ష్యం? మనస్సును సంస్కరించుకోవటం కాదు, నేను మనస్సును కాను అని మీకు మీరు అర్థం చేసుకోవటం. అందువల్ల మీరు మనస్సు ఆడించినట్టుగా ఆడుతున్నారని బాధపడకూడదు. ఆందోళన, ఒత్తిడి లేకుండా, మనస్సుతో మమేకంగా చెందకుండా, మనస్సును మార్చండి, ఆ మార్చటాన్ని ఆనందించండి. ఇదెలా సాధ్యం?

**మనోబుద్ధి అహంకార చిత్తాని నాహం ...**

నేను మనస్సు, బుద్ధి, అహంకారం, చిత్తం కాదు.

**న మే ద్వేషరాగౌ న మే లోభమోహౌ ...**

నాకు రాగద్వేషాలు లేవు. నేను బ్రహ్మను. మొట్టమొదటగా మనస్సు గురించి వస్తుంది. ఎందుకంటే మనస్సు చేసే గారడీ ఇంతా అంతా కాదు. కాని నేను బ్రహ్మను, నేను మనస్సును కాను, మనస్సు నన్ను ఆడించలేదు అని అర్థం చేసుకుంటే మనస్సును జయించగలరు. అందువల్ల జ్ఞానమార్గంలోకి వచ్చిన మీరు రెండురకాల నిదిధ్యాసనలు చేయాలి. ఒకటి జగత్తు మిథ్య అనేది జీర్ణించుకోవాలి. రెండోది– నేను మనస్సు కాదు అనేది జీర్ణించుకోవాలి. నేను జ్ఞానమార్గంలోకి వచ్చికూడా కోపం తెచ్చుకుంటున్నాను అని బాధ పడకూడదు. అప్పుడే ఆధ్యాత్మిక ప్రయాణం సాఫీగా సాగుతుంది. లేకపోతే ఆత్మ న్యూనతా భావన ఏర్పడుతుంది.

'నేను పూర్ణ ఆత్మను; మనస్సు మారినా మారకపోయినా కూడా!' ఈ ప్రయత్నం మీ జీవితాంతం చేస్తూనే ఉండాలి. మీ ప్రయత్నాన్ని మీ మనస్సు కృంగదీయకుండా ఉండటానికి మీకు ఈశ్వరకృప, శాస్త్రం దీవెన, మీ ప్రయత్నం, గురువు ఆశీస్సులు కావాలి. ఈ గురుపూర్ణిమ రోజు వీరందరికీ ప్రార్థన చేస్తున్నారు.

## 33. జ్ఞానికి ప్రారబ్ధకర్మ ఉంటుందా?

వివేకచూడామణిలో శంకరాచార్యులవారు జ్ఞానఫలాన్ని చర్చిస్తూ, జ్ఞాని పొందిన జ్ఞానం అతని కర్మలను ఎలా మారుస్తాయో విశ్లేషిస్తారు. ప్రతి మనిషికీ మూడు కర్మలు ఉంటాయని, అవి సంచితకర్మలు, ప్రారబ్ధకర్మలు, ఆగామికర్మలు అని మనకు తెలుసు.

**సంచితకర్మలు–** జ్ఞానికి జ్ఞానాగ్నిలో సంచితకర్మలు దగ్ధమయిపోతాయి. అందువల్ల అతనికి పునర్జన్మ ఉండదు. సంచితకర్మలు మనకు కనబడవు. సంచితకర్మలు కనపడనప్పుడు, ఆ కనపడని కర్మలు దగ్ధమవటం కూడా కనపడదు కదా! ఇలా జరుగుతుందని చెప్పేది శాస్త్రప్రమాణం మాత్రమే. వేరే ఏ పద్ధతిద్వారా నిరూపించలేము. పైపెచ్చు వైదికుడు వేరే ఏ ప్రమాణాన్నీ కోరడు కూడా! అతను వేదాన్ని ప్రమాణంగా స్వీకరిస్తాడు కాబట్టే వైదికుడు అని పిలవబడుతాడు.

**ఆగామికర్మలు –** ఆగామికర్మలు అంటవు జ్ఞానికి. అతనికి కలిగిన జ్ఞానం అతన్ని ఆగామి పుణ్యపాప కర్మలనుంచి రక్షిస్తుంది. రెయిన్‌కోటు వేసుకున్న వ్యక్తిని వాన తడపలేనట్టుగా, జ్ఞానిని ఆగామి కర్మలు ఏమీ చేయలేవు. సంచిత కర్మలలాగా ఇవి కూడా తెలియవు. అందువల్ల కర్మఫలాలూ కనబడవు.

**ప్రారబ్ధకర్మలు –** సంచితకర్మలు దగ్ధమైపోతాయి. ఆగామికర్మలు అంటవు; ప్రారబ్ధకర్మ ఏమవుతుంది? ఇక్కడ ఒక విషయం బాగా అర్థం చేసుకోవాలి.

**ఎ.అనుభవాలు మారవు –** జ్ఞాని ప్రారబ్ధకర్మలను అంతకుముందులాగే అనుభవిస్తాడు. ప్రపంచం అజ్ఞానికి ఎలా కనపడుతుందో జ్ఞానికీ అలాగే కనపడుతుంది. ఈ విషయం స్పష్టంగా తెలుసుకోవాలి. జ్ఞానికి కూడా ఎరుపు రంగు ఎర్రగానే కనపడుతుంది. ఆహారం ఆహారంగానే కనపడుతుంది; ఆహారం తినే కంచంగానూ, తినే కంచం ఆహారంగానూ కనపడదు. ఇంద్రియాలు బాహ్యప్రపంచం గురించి అంతకుముందు ఎలా చెప్పాయో ఇప్పుడూ అలాగే చెబుతాయి. శరీరం అంతకుముందు ఎలా ఉందో ఇప్పుడూ అలాగే ఉంటుంది. ఆరోగ్యం, అనారోగ్యం, ఆకలి ఇలాంటి అనుభవాలేవీ మారవు. మనస్సు కూడా అలాగే ఉంటుంది. ఏమీ మారవు. అంటే అనుభవాలు మారవు.

**బి. ఆంతర్గత మార్పు –** అనుభవాలు మారకపోతే ఏది మారుతుంది? ప్రారబ్ధంమీద అతనికి ఉన్న దృక్కోణం మారుతుంది. అతను అంతర్గతంగా మారుతాడు కాబట్టి అతని ఆలోచనా తీరు మారుతుంది. అతను మారినట్టు అజ్ఞానికి చెప్పడు. ఎందుకంటే అజ్ఞానికి అర్థం కాదు. ఒకవేళ చెప్పుకున్నా తక్కిన జ్ఞానులకు చెబుతాడు. అతనిలో వచ్చిన మార్పులు ఎవరికీ చెప్పడని శంకరాచార్యులు చెబుతూ, అవేమిటో ఆయన మనకు చెబుతున్నారు.

**1)ప్రారబ్ధం మిథ్య అనుకుంటాడు–** జ్ఞాని తన గురించి తాను ఆలోచిస్తున్నప్పుడు, తనకు ప్రారబ్ధకర్మ ఉందని అనుకోడు. ఎందుకు? అతని దృష్టిలో నేను అంటే  వేరు కదా! అతను నేను అంటే జీవి కాదు, ఆత్మ. అజ్ఞానులతో తను కూడా ప్రారబ్ధకర్మ అనుభవిస్తున్నట్టే మాట్లాడుతాడు. అది ముగియగానే తాను మరణిస్తానని అంటాడు. కాని జ్ఞాని ఆంతర్గతంగా మారతాడు కాబట్టి, అతను నిజానికి మరణం గురించి కూడా మాట్లాడడు.

**న జాయతే మ్రియతే వా కదాచిత్।**
**నాయం భూత్వా భవితా వా న భూయః।**
**అజో నిత్యః శాశ్వతో౽యం పురాణో।**
**న హన్యతే హన్యమనే శరీరే।। – గీత 2-20**

జ్ఞాని శాశ్వతో౽యం అని తెలుసుకుంటాడు. అంటే  నేను శాశ్వతం అంటాడు. ఒకవేళ తనకు నిద్రపట్టకపోతే నాకే ఎందుకు నిద్ర పట్టలేదు అని బాధపడడు.

**అసంగోహం అసంగోహం పునః పునః**

అందువల్ల జ్ఞానికి అనుభవాల్లో మార్పు ఉండదు కాని, అతని ఆలోచనాతీరులో మార్పు వస్తుంది. జ్ఞానికి, అజ్ఞానికి ఇద్దరికీ ఒకటే అనుభవం జరుగుతుంది. ఆ అనుభవం సత్యమా, మిథ్యా అని అడిగితే అనుభవం సత్యమూ కాదు, మిథ్యాకాదు. అజ్ఞాని ఉద్దేశ్యంలో ప్రారబ్ధకర్మ సత్యం కాని జ్ఞానికి మాత్రం అది మిథ్య. దానికి విడిగా ఉనికి లేదు. జ్ఞాని దృష్టిలో కుండకు విడిగా ఉనికి లేదు. అతను కుండను చూడడు. కుండకు కారణం అయిన మట్టిని చూస్తాడు. అలాగే అతను ప్రారబ్ధాన్ని కూడా విడిగా చూడడు. దాన్ని మిథ్యగా చూస్తాడు.

**2) సత్యభావన –** తను సత్యం అని తెలుసు కుంటాడు– మొదటి మార్పు ప్రారబ్ధం సత్యం కాదు. మిథ్య అని అర్థం చేసుకుంటాడు. రెండవ మార్పు

ఆ మిథ్య తనకు చెందదని, తను సత్యం అనీ అర్థం చేసుకుంటాడు. తను సత్యం, తక్కినదంతా మిథ్య అని గ్రహించినా, అతని అనుభవాల్లో మార్పు ఉండదు. నిండుపున్నమి చంద్రుడు, పండువెన్నెలను కురిపిస్తుంటే, ఆ కాంతి చంద్రుడిది కాదు, సూర్యుడిది అని తెలిసినా, అందరిలాగే తను కూడా పుచ్చపువ్వులా కాస్తున్న వెన్నెలను ఆస్వాదిస్తాడు.

జ్ఞాని తన కుటుంబసభ్యులను అజ్ఞాని పరిచయం చేసినట్టే పరిచయం చేస్తాడు. అందరిలాగే ప్రసంగంనుంచి బయటకు వచ్చాక చెప్పులు వేసుకుంటాడు. అంతా ఒకటే కదా అని వేరే ఎవరివో వేసుకెళ్ళడు. అంతర్గతంగా అతను అసంగుడు, కాని బాహ్యంగా వ్యవహారాలు నడుపుతాడు. కాని అందరిలాగే అహంకార, మమకారాలు ఉండవు.

ఒక ఆస్తికి ట్రస్టీ ఎలా బాధ్యతగా ఆ ట్రస్టు వ్యవహారాలు నడుపుతాడో, అలా జ్ఞాని తనకున్నవన్నీ భగవంతునికి చెందిన ట్రస్టు అని, దానికి తాను ట్రస్టీని మాత్రమే అని అనుకుంటాడు. జాగ్రద్ పురుషునికి స్వప్నప్రపంచం మిథ్య అని తెలుసు. స్వప్నపురుషునికి స్వప్నంలో ఉండగా స్వప్నం, స్వప్నం అని తెలియదు. అతను స్వప్నంనుంచి లేచాక తను స్వప్నంలో ఒక జీవి కాదు. తనే స్వప్నానికి సృష్టికర్త అని తెలుసుకుంటాడు. అలాగే జ్ఞానికి ఈ జాగ్రత్ ప్రపంచం కూడా రెండో స్వప్నంలాంటిది. ఎప్పుడైతే అతను పారమార్థిక స్థాయికి ఎదుగుతాడో, అప్పుడు ఈ వ్యావహారిక ప్రపంచం అతనికి మిథ్యాప్రపంచం అవుతుంది. స్వప్నంనుంచి లేస్తే స్వప్నం కరిగిపోతుంది, కాని జాగ్రద్ ప్రపంచంనుంచి ఉన్నతస్థాయికి లేచినా, జాగ్రద్ ప్రపంచం కరిగిపోదు. అది అలాగే ఉంటుంది.

కాని జ్ఞాని ఈ మిథ్యాప్రపంచంలో ఏమీ కావాలని కోరుకోడు. దానికి రెండు కారణాలు. ఎ) మిథ్యాపదార్థం అతనికి పూర్ణత్వం ఇవ్వలేదు. ఎందుకు? దొంగనోటు వెయ్యి రూపాయలదైనా అతనికి పనికిరాదు. బి) అతనికి పూర్ణత్వం అవసరం లేదు కూడా! ఎందుకు? అతనే పూర్ణుడు.

**ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ ।**
**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే॥ - గీత 2-55**

జ్ఞానికి మనసులోని కోరికలన్నీ తొలగిపోయి, ఆత్మద్వారా ఆత్మయందు సంతుష్టుడవుతాడు.కాని మీరు చూసినట్టుగా ప్రపంచంలో వ్యవహారం నడిపినప్పుడు, తన పాత్రపోషణ చక్కగా నిర్వర్తిస్తాడు. తన కొడుకు బొమ్మను పోగొట్టుకుని

ఏడుస్తుంటే, అతని దుఃఖంలో పాలు పంచుకుని, అతనితో బజారుకు వెళ్ళి కొత్త బొమ్మ కొనిపెడతాడు. అలా తన బాధ్యతలను నిర్వర్తిస్తాడు.

జ్ఞాని ఎలా ప్రవర్తిస్తాడో తెలుసుకోవాలంటే, మనం జ్ఞానులమవ్వాలి.

ఎవరైనా నాకింకా కోరికలు ఉన్నాయి, నేను అపూర్ణుడను అని అంటే, ఆ వ్యక్తి తన ఉన్నతస్థాయికి ఎదగలేదని అర్థం. వేదం ఎన్నడూ మీ ఇంట్లో ఉన్న మనుష్యులందరికీ తలొక ఇల్లు కొనమనలేదు. కొంతమంది మనిషికో ఇల్లు కొన్నా తృప్తిపడక మనవళ్ళకు కూడా కొనాలనుకుంటారు. వారికి కూడా కొన్నాక అయినా ఆగుతారా? అందరికీ తలొక కారు కొనాలనుకుంటారు. అటువంటి వారికి వివేకచూడామణి నేర్చుకుని జ్ఞానం పొందే తీరికా లేదు, కోరికా లేదు.

మనం ఆధ్యాత్మికంగా ఎదగాలంటే పోర్టు రిడక్షన్ చేయాలి.

**పి = పోసెషన్స్, ఓ = అబ్లిగేషన్స్**

**ఆర్ = రిలేషన్‌షిప్స్, టి = ట్రాన్సాక్షన్స్.**

ఆస్తులెన్ని ఉన్నా ఇంకా ఇంకా కావాలనుకోవటం తగ్గించుకోవాలి. రెండవది మొహమాటాలు పెంచుకుంటూ పోకూడదు. వ్యవహారాలు కూడా తగ్గించుకోవాలి. కొంతమంది ఊర్లో ఉన్న వ్యవహారాలన్నీ వారినెత్తిన వేసుకుంటారు. అది తగ్గాలి. లేకపోతే రెండవ స్వప్నంలోనే ఉండిపోతారు.

జ్ఞానిస్థాయికి ఎదగాలి. జ్ఞాని వ్యవహారం నడుపుతూనే ప్రారబ్ధం నాస్తి, జగత్తు నాస్తి, ద్వైతం నాస్తి అంటాడు. ఒక కుండను చేతిలో పట్టుకుని, దానిలోనుంచి నీళ్ళు తాగుతూ, కుండ నాస్తి అంటాడు. ఒకపక్క దాన్ని పట్టుకుని, దాన్ని అనుభవిస్తూ లేదని ఎలా అంటావు అంటారు ఎవరన్నా?

జ్ఞాని నా చేతిలో ఉన్నది కుండ కాదు. మట్టి అంటాడు. కుండ వ్యవహారం జరపటానికి ఇచ్చిన నామరూపాలు, నిజానికి అది మట్టే. అందువల్ల కుండ నాస్తి.

నామరూపాలు ఉన్నాయా, అవి కూడా లేవా? నామరూపాలు కూడా లేవు. అదెలా? నామరూపాలు మట్టివి కాదు, కుండవి. కుండే లేదంటుంటే, ఇంక కుండకు చెందిన నామరూపాలు ఎలా ఉంటాయి? అవి కూడా నాస్తి. అతని దృష్టిలో తన ముందు ఉన్నది జగత్తు కాదు. సర్వం బ్రహ్మమయం. బ్రహ్మే తూర్పున, పడమరన, ఉత్తరంలో, దక్షిణంలో, పైనా, కింద అంతటా ఉన్నాడు. బ్రహ్మ సర్వాత్మభావన ఈ గీతాశ్లోకంలో వస్తుంది –

**బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్**
**బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మసమాధినా - గీత 4-24**

జ్ఞాని తన మూడవ నేత్రం అయిన జ్ఞాననేత్రంతో చూస్తాడు. స్వామీజీ ఆజ్ఞాచక్రం, కుండలినీలాంటి వాటి జోలికి పోవటానికి ఇష్టపడరు.

ఈ సందర్భంలో తన గురువైన పూజ్యస్వామీజీని మెచ్చుకుంటున్నారు. (పూజ్యస్వామీజీని మెచ్చుకోకుండా, ఆయన చెప్పిన మాటలు చెప్పకుండా మన స్వామీజీ ఏదీ చెప్పరు. పూజ్యస్వామీజీ అంటే స్వామి దయానంద సరస్వతీజీ. ఆయనమీద స్వామి పరమార్థానందజీకి అంత గౌరవం). పూజ్యస్వామీజీ చాలా మంచి గురువు. ఆయన మిస్టిసిజమ్ జోలికి పోకుండా బోధ చేస్తారు. పరమార్థానంద స్వామీజీ కూడా ఆయన అడుగుజాడల్లోనే నడుస్తానని చెప్పుకున్నారు.

అలా జ్ఞాననేత్రంతో జ్ఞానం పొందిన జ్ఞాని మనస్సులో ఆ జ్ఞానం తంబురా శ్రుతిలా ఇరవయి నాలుగుగంటలూ ఉంటూనే ఉంటుంది. తింటున్నా, తాగుతున్నా, ఏ పని చేస్తున్నా అతను బ్రహ్మను తప్ప ఏదీ చూడడు. దీన్నే జ్ఞాననిష్ఠ అంటారు. అతను పారమార్థిక సత్యం స్థాయికి ఎదుగుతాడు కాబట్టి ఈ జాగ్రద్ ప్రపంచం కూడా అతనికి స్వప్నప్రపంచంలాంటిదే. ఇది రెండవ స్వప్నం. ఇది మిథ్య.

కాని అతను ఒక విషయం మర్చిపోడు. స్వప్నప్రపంచంలో ఉన్నప్పుడు స్వప్నం నిజం అనుకుంటాడు. స్వప్నంలో కాలికి దెబ్బతగిలితే స్వప్నంలో మందు వేసుకోవాలి. అలాగే జాగ్రద్ ప్రపంచంలో వ్యవహారం నడుపుతున్నప్పుడు, కోబ్రామీదికి వస్తే కోబ్రా కూడా బ్రహ్మే అనడు. అందరిలాగా తను కూడా తింటాడు, తను కూడా విసర్జనక్రియ చేస్తాడు.

**కాని ఆత్మ దృష్ట్యా సర్వం మిథ్య అనే జ్ఞానం తంబురా శ్రుతిలాగా వెంట ఉంటూనే ఉంటుంది.**

# స్వామీజీ సూక్తిముక్తావళి

గురువు పాదాలకు ఎందుకు వందనం చేస్తారు? గురువు పాదాలు ఆయన ఎన్నుకున్న మార్గానికి సంకేతాలు. ఆ మార్గాన్ని వైదికమార్గంగా వేదాలు నిర్దేశించాయి. గురువు రెండు పాదాలు రెండు విద్యలకు ప్రతీకలు. అవి-
**పరావిద్య, అపరావిద్య.**

# 34. భగవంతునికీ జ్ఞానికీ ఉన్న అనుసంధానం

గురుపూర్ణిమ చాలా మంగళకరమైన రోజు! ముఖ్యంగా ఆధ్యాత్మిక సాధన చేసేవారికీ, ప్రత్యేకించి సన్న్యాసులకూ. ఈ గురుపూర్ణిమ రోజు, సాధకులు అందరూ మొత్తం గురుపరంపరమీద గౌరవం చూపిస్తారు. ఆదిగురువైన భగవంతుడితో ప్రారంభమై, మనకు ప్రత్యక్షగురువువరకూ వస్తుంది ఈ గురుపరంపర. మనకు ఆధ్యాత్మిక రంగంలో ఏ కొద్దిగానైనా అర్థమైందీ అంటే, ఆ గురువులవల్లనే. అందువల్ల మనం వారికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. గౌరవం, కృతజ్ఞతలు రెండూ చూపాలి. అంటే గౌరవంతో కూడిన కృతజ్ఞతా భావనలు వెల్లివిరియాలి ఈ రోజు.

కొందరు సన్న్యాసుల విషయంలో, ఈ గురుపూర్ణిమ రోజు వారు చేసే చాతుర్మాసవ్రతానికి శ్రీకారం చుట్టేరోజు. చాతుర్మాసవ్రతం అంటే, నాలుగు నెలలు ఒకచోట ఉండి, వారి ఆచార్యులందరికీ ప్రత్యేక పూజలు చేస్తారు. తన చుట్టూ చేరిన శిష్యులకు శాస్త్రాన్ని బోధిస్తారు. ఆ సాంప్రదాయాన్ని ఉల్లంఘించకుండా, మనం కూడా శాస్త్ర అధ్యయనం చేద్దాము.

ఇవాళ భగవంతునికీ జ్ఞానికీ ఉన్న అనుసంధానం గురించి చూద్దాము. ఇదొక ప్రత్యేకమైన అనుసంధానం. ప్రత్యేకమైన అనుసంధానం ఎందుకు అయిందంటే, అది చూడటానికి పరస్పరవిరుద్ధంగా ఉన్న అనుబంధంలా అనిపిస్తుంది. అందువల్ల ఇది ప్రత్యేకమైనది. అది నిజంగా పరస్పరవిరుద్ధమైనది కాదు. అలా పరస్పరవిరుద్ధంగా కనిపిస్తుందంతే. దాన్ని సరిగ్గా విశ్లేషిస్తే అలా ఎందుకు ఉందో అర్థమవుతుంది.

కృష్ణపరమాత్మే ఈ విశిష్టమైన అనుబంధం గురించి వివరిస్తాడు భగవద్గీత ఏడవ అధ్యాయంలో.

**చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోఽర్జున।**
**ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ॥** **గీత 7 -16**
**తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే।** **గీత 7 -17**

విశిష్యతే అంటే అత్యుత్తముడు. ఎవరు ఎవరికన్నా అత్యుత్తముడు? జ్ఞానీ భక్తుడు తక్కిన ముగ్గురు భక్తులకన్నా ఉన్నతుడు. ఎవరు వారు? ఆర్తభక్తుడు, అర్థార్థీభక్తుడు. జిజ్ఞాసభక్తుడు. ఆర్తభక్తుడంటే ఏదైనా కష్టంలో కూరుకు పోయినప్పుడు తనను రక్షించమని ప్రార్థించేవాడు; అర్థార్థీభక్తుడిది ఫక్తు వ్యాపారశైలి. అతను

చేపట్టే కొత్తపనిలో విజయం చేకూర్చమని కోరుకుంటాడు; జిజ్ఞాసభక్తుడు జ్ఞానంకోసం, ముఖ్యంగా ఆధ్యాత్మికజ్ఞానంకోసం ప్రార్థిస్తాడు. జ్ఞానీభక్తుడు జ్ఞానం పొందేశాడు. ఈ జ్ఞానిని కృష్ణపరమాత్మ అత్యుత్తముడు అంటాడు. అందరు భక్తులూ భగవంతునికి ఇష్టులే, కానీ జ్ఞానికి అత్యుత్తమ పదం వేశాడు. ఈ జ్ఞానిని ఇంకా వివరంగా 12వ అధ్యాయంలో వివరిస్తూ, పదే పదే ఇలా అంటాడు.

**సంతుష్టస్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః।**
**మయ్యర్పితమనోబుద్ధిః యో మద్భక్తస్స మే ప్రియః॥ - గీత 12-14**

ఇలా చూస్తే జ్ఞాని ఒక భక్తుడు. భగవంతునిమీద అతనికి భక్తి ఉంది. భగవంతుడు అటువంటి జ్ఞాని నన్ను ప్రేమిస్తాడు, నేను అతనిని ప్రేమిస్తాను అంటున్నాడు. అలాంటప్పుడు వారిద్దరి మధ్య ఉన్న సంబంధం ఎటువంటిది? భగవంతుడు-భక్తుడు మధ్య ఉండే సంబంధం; ప్రేమించేవాడు-ప్రేమించబడేవాడుల మధ్య ఉన్న సంబంధం. దీన్నిబట్టి చూస్తే జ్ఞానికీ, భగవంతునికీ మధ్య భేదం ఉన్నట్టేగా! జ్ఞాని భగవంతుణ్ణి ప్రేమిస్తాడు. భగవంతుడు జ్ఞానిని ప్రేమిస్తాడు. అంటే స్పష్టంగా వీరిద్దరి మధ్య భేదం ఉన్నట్టు తెలుస్తుంది. కొలిచే జ్ఞాని, కొలవబడే భగవంతుడు. ఇష్టపడే భగవంతుడు- ఇష్టపడబడే జ్ఞాని. దీన్ని **భేదసంబంధం** అంటారు. ఎందుకంటే భగవంతునికీ, జ్ఞానికీ మధ్య భేదం ఉన్నట్టు స్పష్టంగా తెలుస్తున్నది కాబట్టి.

అదే కృష్ణపరమాత్మ, అదే భగవద్గీతలో, అదే అధ్యాయంలో ఇంకో విధంగా అంటున్నాడు. ఏమని?

**ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్ గీత 7-18**

ఓ అర్జునా! ఈ చతుర్విధ భక్తులందరూ గొప్పవారే. జ్ఞాని వీరికన్నా అత్యుత్తముడు. నీకొక రహస్యం తెలుసా? జ్ఞానియైన వాడు నా స్వరూపమే. అంటే జ్ఞాని నేనే!

జ్ఞాని నేనే అంటే ఏమిటి అర్థం? ఇద్దరూ ఒకటే! ఇద్దరూ ఒకటే అయితే వారి మధ్య భేదం లేదు, ద్వైతం లేదు. ఒకరు ప్రేమించేవారు, ఇంకొకరు ప్రేమించబడేవారు కాదు. అందువల్ల దీన్ని **అభేద సంబంధం** అంటారు. సంబంధం లేని సంబంధం. భగవంతుడే భక్తుడు, భక్తుడే భగవంతుడు. కాబట్టి, వారి మధ్య భేదం లేదు. అందువల్ల ఇది అభేదసంబంధం.

భగవంతునికి, భక్తునికి మధ్య రెండు రకాల సంబంధాలను చూశాము. భేదసంబంధం, అభేదసంబంధం. కాని ఇవి రెండూ పరస్పర విరుద్ధమైనవి.

అయితే భగవంతుడూ, భక్తుడూ ఒకటవాలి. లేకపోతే ఇద్దరూ భిన్నమవ్వాలి. అందువల్ల భేదసంబంధం ఉన్నచోట, అభేదసంబంధం ఉండే ఆస్కారం లేదు. అలాగే అభేదసంబంధం ఉన్నచోట, భేదసంబంధానికి తావులేదు.

**యో మద్భక్తస్స మే ప్రియః - భేద సంబంధం**

**జ్ఞానీ త్వాత్మైవ - అభేద సంబంధం**

కృష్ణపరమాత్మ అలా ఎందుకన్నాడో ప్రత్యక్షంగా చెప్పడు. కాని వేదాంతంలో ఇలా భిన్నంగా కనపడే వాటి మధ్య ఒక ఉదాహరణద్వారా ఐక్యం చూపుతాము. ఏమిటది? అల–సముద్రం ఉదాహరణ.

సముద్రంలో ఒక చిన్న అలను, సముద్రాన్ని చూపి, అలకూ, సముద్రానికీ మధ్య భేదం ఉందా అంటే మీరేమంటారు? 'ఖచ్చితంగా ఉంది,' అంటారు. ఎందుకు? అల ఒక చిన్న అల; సముద్రం మహాసముద్రం. చిన్న అలకూ, పెద్ద సముద్రానికీ సారూప్యమా! అసంభవం అంటారు. పైగా అల ఒక్క క్షణంలో మాయమవుతుంది. సముద్రం శాశ్వతం. అల కార్యం; సముద్రం కారణం. ఆ విధంగా తరంగానికీ, సముద్రానికీ మధ్య అనేక భేదాలు ఉన్నాయి. అందువల్ల అది భేద సంబంధం.

కాని కొంచెం లోతుగా విశ్లేషిస్తే, ఏం తెలుస్తుంది? అల అంటే ఏమిటి? నీరు! నీటికి ఒక నామరూపం. నీరు ఒక రూపం దాల్చేసరికి దానికి అల అనే నామం వచ్చింది. అందువల్ల నామరూప దృష్ట్యా చూస్తే అది ఒక చిన్న అల. కాని అసలు వస్తువు చూస్తే అది నీరు! అలాగే సముద్రం ఏమిటి? అనేక అలల సముదాయం, లేదా అలల సమష్టిరూపం. అందులో ఉన్నదేమిటి? నీరు! చిన్న అలలో ఉన్నదీ నీరే, మహాసముద్రంలో ఉన్నదీ నీరే! అందువల్ల అలనూ–సముద్రాన్నీ స్వరూపపరంగా చూస్తే రెండూ ఒకటే. అంటే అభేద సంబంధం.

**నామరూపదృష్ట్యా భేదః**

**స్వరూపదృష్ట్యా అభేదః**

అంటే నామరూపాలుగా చూస్తే భేదం ఉంది కాని వాటి అసలు స్వరూపం చూస్తే భేదం లేదు. అందువల్ల భేదం ఎక్కడుంది?చూసే కోణంలో ఉంది. చెన్నైలోని మైలాపూర్ దగ్గరా, దూరమా అని అడిగితే వారు టీనగర్‌లో ఉంటే దగ్గరంటారు. అన్నానగర్‌లో ఉంటే దూరమంటారు. కంచిలో ఉంటే ఇంకా దూరమంటారు.

ప్రదేశం ఒక్కటే! చూసే దృక్కోణం వేరు. అందువల్ల చూసే దృక్కోణాలు వేరయితే, భిన్నలక్షణాలు తార్కికంగా సాధ్యం.

ఇప్పుడు ఈ సూత్రాన్ని జీవ ఈశ్వరులకు వర్తింపజేస్తే, భేదమూ సాధ్యమే! అభేదమూ సాధ్యమే! ఎలా? నామరూప దృష్ట్యా భేద సంబంధం, స్వరూప దృష్ట్యా అభేద సంబంధం. జ్ఞాని అంటే తన అసలు స్వరూపం తెలుసుకున్నవాడు. అజ్ఞానికి స్వరూపం తెలియదు. అందువల్ల అజ్ఞాని నామరూపదృష్టితోనే చూస్తాడు. అజ్ఞానీ భక్తుడిది నామరూప దృష్టి. అందువల్ల అతనికీ– భగవంతునికీ భేదసంబంధం ఉంది. జ్ఞానీభక్తుడు విశిష్ట భక్తుడు. అతనికి నామరూప దృష్ట్యా భేదసంబంధం ఉందనీ తెలుసు, స్వరూపదృష్ట్యా అభేద సంబంధం ఉందనీ తెలుసు. అల, సముద్రం నీటి దృష్ట్యా ఎలా ఒకటే అవుతాయో, అలా ఆత్మదృష్ట్యా తనూ, పరమాత్మ ఒకటే అని తెలుసుకుంటాడు.

**అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః - గీత 10-20**

అర్జునా! నేను వచ్చిపోయే నామరూపాలున్న కృష్ణుణ్ణి కాను. నిజానికి నేను ఆత్మను. నాకు కృష్ణ నామరూపమే కాదు; అన్ని నామరూపాల వెనుక ఉన్న ఆత్మస్వరూపాన్ని నేనే.

అందువల్ల, జ్ఞానికీ, భగవంతునికీ మధ్య ఉన్నది నిజానికి అభేదసంబంధం. అజ్ఞాని ఒకటే సంబంధం చూస్తే జ్ఞాని రెండు సంబంధాలు చూస్తాడు. జ్ఞానిది భేదసంబంధమూ కాదు, అభేదసంబంధమూ కాదు. ఇలా చూడగలిగే జ్ఞానులు అతి తక్కువమంది ఉంటారు. ఇది జ్ఞానికి మాత్రమే ఉన్న ప్రత్యేకత. అతను కావాలంటే భేదసంబంధం చూడగలడూ, ఒద్దనుకుంటే అభేదసంబంధం చూడగలడు. జ్ఞానం పొందిన అల కావాలనుకుంటే నేను అలనే అనుకోగలదు; ఒద్దనుకుంటే నేను నీరును అనుకోగలదు. ఏది నిజం? రెండూ నిజమే! జ్ఞానికి కూడా ఈ సదుపాయం ఉంది.

వ్యావహారిక ప్రపంచంలో జ్ఞాని భేదం చూస్తాడా, అభేదం చూస్తాడా? జాగ్రత్తగా చూడండి! వ్యవహారం నడిపేటప్పుడు, భేదమే చూడాలి. ఒక గిన్నెలో ప్రసాదాన్నిస్తే, గిన్నెకీ ప్రసాదానికీ మధ్య భేదాన్ని చూస్తామా లేదా? అలాగే వ్యవహారంలో భేదాన్ని చూడాలి. దేనికైనా అప్లికేషన్ ఫార్మ్ నింపుతున్నప్పుడు 'నీ పేరు' దగ్గర 'ఆత్మ' అనీ; 'చిరునామా' దగ్గర 'సర్వవ్యాపకం' అనీ; 'పుట్టినరోజు' దగ్గర 'పుట్టుక లేదు' అని రాస్తారా? అలా ఒకవేళ రాస్తే అది వెర్రితనం అవుతుంది.

మనం వ్యవహారపరంగా ఆలోచించాలి. నామరూపదృష్ట్యా ఆలోచించాలి. మనని ఒక చిన్న జీవిగానే చూడాలి. ఎవరికిచ్చే మర్యాద, గౌరవం వారికివ్వాలి.

తల్లిని తల్లిగా; చెల్లిని చెల్లిగా; భార్యని భార్యగా; గురువును గురువుగా చూడాలి.

అందువల్ల, జ్ఞాని జ్ఞానం పొందినా కూడా వ్యావహారిక ప్రపంచంలో భేదదృష్టితోనే ఉంటాడు. భగవంతుని విషయంలో కూడా అంతే. తాను భక్తుడిగా భగవంతుని కొలుస్తాడు. కాకపోతే తక్కిన భక్తుల్లా కొలవడు. అంటే ఆర్తభక్తుడు, అర్థార్థీభక్తుడు, జిజ్ఞాసభక్తుల్లా ప్రవర్తించడు. వీరికి భిన్నంగా, విశిష్టంగా కొలుస్తాడు. ఎందుకు కొలుస్తాడు?

గుర్తుంచుకోండి, జ్ఞాని ఆత్మజ్ఞాన ఫలాన్ని అనుభవిస్తాడు. ఆత్మజ్ఞాన ఫలాన్ని అనేక విధాలుగా శాస్త్రం అభివర్ణిస్తుంది. అందులో పూర్ణత్వం ఒకటి. అజ్ఞానికి మామూలుగా తను పరిచ్ఛిన్నుడనని, అశాశ్వతుడనని, ఎందుకూ పనికిరానివాడిననే ఆత్మన్యూనతా భావన ఉంటుంది. దాన్ని మరికాస్త పెంచి పోషిస్తారు చుట్టూ ఉన్న కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు. జ్ఞానం ముందుగా ఈ నామరూపాలు కలుగచేసే పరిచ్ఛిన్నభావాన్ని పారద్రోలి, నేను ఆత్మను, నేను పూర్ణుడను అనే విషయం అర్థమయ్యేటట్టు చేస్తుంది.

ఈ పూర్ణత్వభావన జ్ఞానం పొందిన మరుక్షణం కలుగుతుంది. అంటే ఇక్కడే ఇప్పుడే అతనికి ఆనందం కలుగుతుంది. దీన్ని **జీవన్ముక్తి** అంటారు. జ్ఞాని తను ఆనందస్వరూపుడనని తెలుసుకుంటాడు. అందువల్ల అతను ఏమీ కోరడు. సంసారంనుంచి విముక్తి పొందుతాడు. అందువల్లనే అతను ఆర్తభక్తుడు, అర్థార్థీభక్తుడు, జిజ్ఞాసభక్తులకన్నా భిన్నంగా ఉంటాడు అన్నాము. అంతకు ముందు అతను కూడా సంసారిగా ఉండేవాడు. అతను కూడా భయం, ఆందోళన, చింత, ఒత్తిడిని ఎదుర్కొన్నాడు.

ఆర్తభక్తుడు భక్తికూడా అనుభవించలేడు. ఎందుకు? అతనిది కష్టకాలంలో బయటకి వచ్చే భక్తి. యస్ఓయస్ భక్తి అంటారు. సేవ్ అవర్ సోల్స్ అన్నమాట. 'ఓ దేవా! నేను చాలా క్లిష్టపరిస్థితులలో కూరుకుపోయి ఉన్నాను. ఎలాగైనా నన్ను కడతేర్చు,' అంటారు. అతను ఎప్పుడూ టెన్షన్‌లో ఉంటాడు.

అర్థార్థీభక్తుడూ అంతే. అతనిది బిజినెస్ డీల్. నాకు ఈ లాభం వస్తే, నీకింత ఇస్తానంటాడు. అది వచ్చేదాకా టెన్షనే! ఆఖరికి జిజ్ఞాసభక్తునికి కూడా

టెన్షనే! ఈ జన్మలోనే మోక్షం దొరుకుతుందో లేదో అనే టెన్షన్ అతనిది. అందువల్ల ముగ్గురిదీ ఆందోళనతో కూడిన భక్తి. జ్ఞానీభక్తుడికి ఇంక ఆందోళన ఉండదు. పైపెచ్చు అతని భక్తి కృతజ్ఞతా పూర్వకమైన భక్తి. తనను తక్కిన భక్తులతోనూ, తను అంతకుముందు ఉన్న పరిస్థితితోనూ బేరీజు వేసుకుని నిశ్చింతగా ఉంటాడు. 'ఓ భగవాన్! నేను సంసారసాగరంనుంచి బయట పడ్డాను. ఒకప్పుడు భక్తి కూడా ఆందోళనతో కూడినదై ఉండేది. ఇప్పుడు నాకే బెంగలూ లేవు.' అలా కృతజ్ఞతా పూర్వక ప్రార్థన చేస్తాడు.

అతని కృతజ్ఞత ఎవరికి చూపాలి? అతను జ్ఞానం ఎలా పొందాడు? గురువువల్ల! అందువల్ల ముందుగా గురువుకు కృతజ్ఞత చూపాలి. గురువు ఎలా చెప్పాడు? శాస్త్రంద్వారా! శాస్త్రం లేనిదే గురువే లేడు. గురువు లేనిదే శాస్త్రమూ లేదు. **గురువు తలమీద ఉన్న మీట నొక్కితే శాస్త్రం వస్తుంది.** కేవలం శాస్త్రం నేర్చుకుంటే నిశ్చయజ్ఞానం కలుగదు. గురువు శాస్త్రం లేకుండా బోధ చేయడు. అందువల్ల గురువుకు నా ధన్యవాదాలు. శాస్త్రానికీ నా ధన్యవాదాలు.

ఇలా ధన్యవాదాలు చెప్పేటప్పుడు అది భేదసంబంధమా, అభేద సంబంధమా? ధన్యవాదాలు చెప్పాలంటే భేదసంబంధమే ఉండాలి. గురువుకు సాష్టాంగనమస్కారం చేసి, కృతజ్ఞతలు చెపితే, గురువేమంటాడు? 'నాకు చెప్పకు. ఆ ఘనత మా గురువుది,' అంటాడు. ఆయన గురువు, తన గురువుది అంటాడు. అలా, చివరికి ఆదిగురువుకు వెళతాయి కృతజ్ఞతలు.

**సదాశివ సమారంభాం శంకరాచార్య మధ్యమామ్।**
**అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరామ్॥**

సదాశివుడు గురుపరంపరనే కాదు, శాస్త్రాన్ని కూడా ఇచ్చాడు. సాధకునిగా, జ్ఞానం పొందటానికి నమస్కారం చేస్తే, జ్ఞానం పొందాక, పూర్ణత్వభావన కలిగినందుకు కృతజ్ఞతతో మళ్ళీ నమస్కారం చేస్తాడు. పూర్ణత్వస్థితిని ఆనందిస్తున్నప్పుడల్లా కృతజ్ఞతాభావన వెల్లివిరుస్తుంది.

ఒక ఆధ్యాత్మిక సాధకుడు తన జీవితాంతం మూడింటిని ఆరాధిస్తూనే ఉండాలి. అవి శాస్త్రం, గురువు, ఆదిగురువైన ఈశ్వరుడు. జ్ఞానం పొందక ముందూ, జ్ఞానం పొందాక కూడా చేస్తూనే ఉండాలి. గురుపూర్ణిమ రోజు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చూపుతాడు. మొత్తం గురుపరంపరకీ, ఆదిగురువుకూ!

కృతజ్ఞతలు చూపేటప్పుడు భేదభావనతో పూజ చేసినా, పూజ ముగిస్తూనే భేదసంబంధంనుంచి అభేదసంబంధంలోకి మారవచ్చు.

అల విషయం తీసుకోండి. ఒక అల సముద్రానికి 'షోడశోపచార పూజ' చేస్తున్నదనుకుందాము. ఎందుకు? ఆత్మ జ్ఞానం పొందటానికి తోడ్పడినందుకు కృతజ్ఞతాపూర్వకంగా. 'నేను పడి లేచే కెరటాన్ని కాను. శాశ్వతమైన నీరును!' 'నేను నీరును' అనేటప్పుడు, ఆ మహిమను ఎలా అనుభవిస్తుంది? 'ఉన్నదంతా ఒకటే నీరు; అది నేనే! నేను ఇక్కడ ఉన్నాను, అక్కడ ఉన్నాను. అంతటా ఉన్నాను. అలను నేనే, సముద్రాన్ని నేనే. నురగను కూడా నేనే. నామరూపాలు నన్ను పరిమితం చేయలేవు. నామరూపాలన్నీ నానుంచి పుట్టి, నావల్ల ఉండి, నాలోనే లయమవు తాయి.' ఈ విధంగా జ్ఞాని కూడా చెబుతాడు.

**మయ్యేవ సకలం జాతం మయి సర్వం ప్రతిష్ఠితమ్।**
**మయి సర్వం లయం యాతి।  – కైవల్యమ్**

జ్ఞాని కృతజ్ఞత చూపేటప్పుడు భేదసంబంధాన్ని చూపితే, పూర్ణత్వం అనుభవించటానికి అభేదసంబంధం చూపుతాడు. రెండూ అతనికి ఆనందాన్ని కలుగచేస్తాయి. పూర్ణత్వం భేదసంబంధంలో రాదు. భేదం ఉంటే పరిచ్ఛిన్నం అవుతుంది. పరిచ్ఛిన్నం ఉంటే పూర్ణత్వం ఉండదు. అందువల్ల కృతజ్ఞత చూపటానికి అభేదం చూపించినా, దాని తర్వాత అభేదసంబంధంలో నిలిచి, 'అహమేవ ఇదగ్ం సర్వం' అనాలి.

**ఓమ్ అహం వృక్షస్య రేరివా। కీర్తిః పృష్ఠం గిరేరివ।**
**ఊర్ధ్వపవిత్రో వాజినీవ స్వమృతమస్మి। ద్రవిణగ్ం సవర్చసమ్।**
**సుమేధా అమృతోక్షితః। ఇతి త్రిశఙ్కో ర్వేదానువచనమ్॥ – తైత్తిరీయమ్**

త్రిశంకు ఋషి, భేదసంబంధం చూపించి, కృతజ్ఞతను ప్రదర్శించాక, అభేద సంబంధం చూపిస్తాడు. 'నేనే సత్యాన్ని. నేను భక్తుని వెనుక, భగవంతుని వెనుక ఉన్నాను. నాకే అన్ని నామరూపాలు ఉన్నాయి. జగత్తులోని విభూతులన్నీ నావే!

అలా, జ్ఞానికీ, భగవంతునికీ మధ్యనున్న సంబంధం ఏమిటి? భేద సంబంధం, అభేదసంబంధం.రెండింటిలో ఏది బాగుంటుంది? రెండూ అద్భుతమైనవే. ఒక దానివల్ల ఇంకొక దానికి విలువ వస్తుంది. 'అభేదసంబంధంవల్ల నేను పూర్ణత్వాన్ని అనుభవిస్తున్నాను. పూర్ణత్వాన్ని అనుభవించటంవల్లనే నాకు కృతజ్ఞతాభావన

కలిగింది. నాకు కృతజ్ఞతాభావన కలగటంవల్లనే నమస్కారం చేయాలని అనుకుంటున్నాను. నమస్కారం చేయటానికి నేను భేదసంబంధాన్ని చూపుతాను,' అంటాడు జ్ఞాని.

రెండూ అద్భుతమైన సంబంధాలు. అద్వైతజ్ఞానులందరూ అటు జ్ఞానులు, ఇటు భక్తులు. 'మనిషిగా నేను భక్తుణ్ణి; ఆత్మగా నేను జ్ఞానిని,' అంటారు జ్ఞానులు.

అందువల్ల గురుపూర్ణిమ రోజు, నేను గురువుకు నమస్కారం చేయాలా వద్దా అనే శంక అనవసరం. అహం బ్రహ్మ అస్మిలాంటి మహావాక్యాలు విని, నేను, బ్రహ్మ ఒకటే అని అర్థం చేసుకున్నాక, నేనెలా భగవంతునికి నమస్కారం చేస్తాను అని సందేహం పెట్టుకోకండి.

**భేదభావన చూపి నమస్కారం చేయండి**
**అభేద భావన పెంచుకుని పూర్ణత్వం అనుభవించండి**

# స్వామీజీ సూక్తిముక్తావళి

ఆరురకాల **ప్రమాణాలలో,** శబ్దప్రమాణం (వేదాంతశాస్త్రం) మాత్రమే ఆత్మజ్ఞానాన్ని ఇవ్వగలదు.
తక్కిన అన్ని ప్రమాణాలూ కళ్ళజోడులాంటివి అవి బాహ్యప్రపంచాన్ని చూపిస్తాయి.
శబ్దప్రమాణం అద్దంలాంటిది.
కళ్లజోడు, అద్దం రెండూ గాజు వస్తువులే.
కాని వాటిలో ఎంత తేడా ఉంది! ఒకటి నేను బాహ్యంగా చూడటానికి తోడ్పడితే, ఇంకొకటి నన్ను నేను చూసుకోవటానికి తోడ్పడుతుంది.

# 35. కోరిక అసలు చెడ్డదా?

జీవరాసులన్నింటిలోకీ, మానవజాతి గొప్పదని శాస్త్రం కీర్తిస్తుంది. ఎందుకంటే మనిషికి మాత్రమే **ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి** ఉంటాయి. ఇచ్ఛాశక్తి అంటే కోరుకునే శక్తి; జ్ఞానశక్తి అంటే జ్ఞానం పొందే శక్తి; క్రియాశక్తి అంటే కర్మను చేసే శక్తి.

జ్ఞానశక్తివల్ల అనేక విద్యాసంస్థలు, పరిశోధనా కేంద్రాలు వెలిశాయి. జ్ఞానం అంతకంతకూ అభివృద్ధి చెందుతూనే ఉంది. క్రియాశక్తివల్ల ఈ భూమ్మీద మన జీవన విధానం అంతకంతకూ మార్పులు చెందుతున్నది. ఎటియమ్ వాడకంనుంచి ఇంటర్నెట్లలో సమాచారం సేకరించటం వరకూ జరుగుతున్నాయి. అందువల్ల జ్ఞానశక్తి ఒక్కటే ఉంటే చాలదు. దాన్ని క్రియాశక్తిగా అమలులో పెట్టగలగాలి.

వీటితో సమానంగా ముఖ్యమైన శక్తి ఇచ్ఛాశక్తి. జ్ఞానశక్తికి, క్రియాశక్తికి వెనుక ఉండి వాటిని ముందుకు నడిపించేది ఇచ్ఛాశక్తి. మనకు బుద్ధి పదునుగా ఉండి కూడా, నేర్చుకోవాలనే కోరిక లేకపోతే ఏమిటి లాభం? అలాగే మనకు క్రియను చేసే బలమూ, శక్తి ఉన్నాయి. కాని ఏదైనా చేయాలనే ఇచ్ఛ లేకపోతే ఏం చేస్తాము? అందువల్ల ఇచ్ఛాశక్తి ఉంటేనే తెలుసుకునే శక్తి, చేసే శక్తి అర్థవంతమవుతాయి. మన సాంప్రదాయంలో ఈ మూడు శక్తులనూ గౌరవిస్తాము. నిజానికి వీటిని భగవంతుడు కురిపించిన దీవెనగా భావిస్తాము.

**ఇచ్ఛాశక్తి జ్ఞానశక్తి క్రియాశక్తి స్వరూపిణీ – లలితాసహస్రనామమ్**

లలితాదేవిని ఈ మూడు శక్తుల స్వరూపంగా కీర్తిస్తాము.

ఇక్కడే ఒక సమస్య ఎదురవుతున్నది మనకు. ఒక పక్క కోరికను ఒక శక్తిగా కీర్తిస్తూనే, మన శాస్త్రం కోరికను లేదా కామాన్ని తీవ్రంగా ఖండిస్తుంది. దాన్ని మన అంతర్గత శత్రువుగా తీవ్రంగా విమర్శిస్తుంది.

**కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః ।**
**మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్ ॥ గీత 3-37**

రజోగుణంనుంచి ఉత్పన్నమయ్యేదే కామం. ఇది క్రోధరూపం దాలుస్తుంది. అంతులేని పాపకర్మాచరణాలకు ఇదే ప్రేరకం. అందువల్ల దీన్ని పరమశత్రువుగా తెలుసుకో అని కృష్ణపరమాత్మ చెబుతున్నాడు.

**ఛిద్యన్తే సర్వసంశయాః... ముండకమ్ 2-2-8**

ఎప్పుడైతే జ్ఞానికి కోరికలన్నీ నాశనమవుతాయో, అప్పుడే అతను ఇక్కడే ఇప్పుడే జీవన్ముక్తుడవుతాడు.

**ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్**
**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే - గీత 2 - 55**

ఓ అర్జునా! మనస్సులో ఉన్న కోరికలన్నీ పూర్తిగా తొలగిపోయి, ఆత్మద్వారా ఆత్మయందు సంతుష్టుడైన వానిని, స్థితప్రజ్ఞుడని అంటారు. వీటన్నింటికీ తోడు, కోరిక అన్ని అనర్థాలకు మూలకారణం అనే నానుడి కూడా ఉంది.

శాస్త్రం మనను అయోమయంలో పడవేస్తున్నదా?ఇంతకీ కోరిక ఉండటం శాపమా, వరమా? ప్రతి నూతన సంవత్సరంలోనూ మనం కొన్ని నిర్ణయాలు తీసుకుంటున్నామంటే వాటికి కారణమేమిటి? మన కోరికలే! ఇప్పుడేం చేయాలి? కోరికను వరంగా తీసుకుని కొత్త నిర్ణయాలు తీసుకోవాలా, కోరికను శాపంగా భావించి నిర్ణయాలు తీసుకోవటం మానేయాలా? శాస్త్రం దీనికి ఏమని జవాబు చెబుతుంది?

శాస్త్రానికి కోరికను కొట్టిపారవేసే అవకాశం లేదు. శాస్త్రం ఉన్నదే, మన కోరికలు తీర్చుకోవటంకోసం. మన శాస్త్రం మనకు నాలుగు పురుషార్థాలను అంటే నాలుగు జీవనలక్ష్యాలను నియంత్రించింది. అవి ధర్మం, అర్థం, కామం, మోక్షం. కామం అంటే కోరిక. లక్ష్యాలు నెరవేర్చుకోవటానికి ముందు మనకు వాటిమీద కోరిక ఉండాలి.

ఇక్కడ ఒక సందేహం కలుగవచ్చు. కోరికను కూడా ఒక లక్ష్యం అన్నారు కదా! అంటే తక్కిన లక్ష్యాలమీద కోరిక ఉండాల్సినట్టుగానే, కోరికమీద కూడా కోరిక ఉండాలా? కోరికను ఒక పురుషార్థంగా పేర్కొన్నప్పుడు, దాన్ని కోరుకున్న లక్ష్యంగా తీసుకోవాలి అంటే వృత్తిలో విజయం పొందటం, ఏదైనా పోటీలో గెలవటంలాంటివి. వేదపూర్వభాగంలో చాలా విస్తారంగా అనేక హోమాలు, యజ్ఞాలు చెప్పబడ్డాయి. అవి మనకు ఉండే అనేక కోరికలను తీర్చటానికి తోడ్పడుతాయి. పుత్రులు కావాలనుకున్నా, పశుసంపద కావాలనుకున్నా- ఆస్తి కావాలనుకున్నా వాటికి తగ్గ యజ్ఞాలు ఉంటాయి.

**సోఽకామయత బహుస్యాం ప్రజాయేయేతి - తైత్తిరీయమ్**

భగవంతుడు సంకల్పించాడు. నేను అనేకంగా అవుదును గాక. దీనిబట్టి భగవంతునికి కూడా కోరిక ఉందని తెలుస్తున్నది. భగవంతుడు సంకల్పించి,

జగత్తును సృష్టించాడు. భగవంతుని అవతారాలు ఆయన కోరికకు ప్రతిరూపాలు. కోరికను తప్పుగా కొట్టివేయాల్సివస్తే శాస్త్రానికి ఉనికే ఉండదు. మనం చేసే అన్ని ప్రయత్నాలకు, పనులకు, విజయాలకు మూలకారణం, ఆధారం, శుభారంభం కోరికే! కోరిక ప్రతి ఒక్కరికీ తప్పని అంశం.

ఆ విధంగా కోరిక కోరే శక్తి మనకు ఇచ్ఛాశక్తి రూపంలో ఒక వరం.

దానివల్లనే జ్ఞానశక్తి, క్రియాశక్తిని వినియోగించి జీవితంలో ఉన్నతి సాధించగలుగుతున్నాము. అందువల్ల కోరిక అనర్థమూ కాదు, శాపమూ కాదు. కోరిక ఒక వరం.

కోరిక ఒక వరం అయితే, శాస్త్రం ఎందుకు కోరికను విమర్శిస్తున్నది? ఇంతకుముందు శాస్త్రంలోంచి ఉటంకించినట్టుగా మోక్షం అంటే కోరికలను త్యజించాలని ఎందుకు అన్నది? శాస్త్రం కోరికను విమర్శిస్తే, అది అసాధారణమైన, మితిమీరిన కోరికను విమర్శిస్తున్నట్టుగా అర్థం చేసుకోవాలి. అసాధారణమైన కోరిక ఏదో అర్థం చేసుకునే ముందు, అసాధారణం అంటే ఏమిటో అర్థం చేసుకోవాలి ముందు.

దానికి ఈ ఉదాహరణను చూద్దాము. మీ స్నేహితుడు, 'నాకు చక్కెర సమస్య ఉంది,' అంటే, మన శరీరంలో ఉన్న చక్కెర అతనికి సమస్య అయిందనా అర్థం? చక్కెర ఆరోగ్యకరమైన జీవితానికి చాలా అవసరం. కాని దాన్ని తీసుకునే విషయంలో వైద్యులు దానికి ఒక పరిమితిని విధించారు. ఆ పరిమితిని అధిగమిస్తేనో, ఉల్లంఘిస్తేనో అతనికి చక్కెర వ్యాధి వస్తుంది. అందువల్ల సమస్య చక్కెరలో లేదు. మితిమీరిన చక్కెరలో ఉంది. అలాగే కొంతమందికి కొలెస్ట్రాల్ సమస్య ఉందని వింటాము. ఇదే జవాబు దానికి కూడా. కొలెస్ట్రాల్ మంచి ఆరోగ్యానికి ఉండాలి. కాని మితిమీరిన కొలెస్ట్రాల్ ఉంటే అది అనారోగ్యానికి దారితీస్తుంది. అందువల్ల శాస్త్రం కోరికను విమర్శిస్తే అది మితిమీరిన కోరికను అని అర్థం చేసుకోవాలి.

ఇప్పుడు, మితిమీరిన కోరిక అంటే ఏమిటి? హద్దులను దాటి, నియమాలను ఉల్లంఘించిన కోరిక.పరిమితమైన హద్దుల్లో ఉండి, నియమాలకు లోబడిన కోరిక, మామూలు లేదా ఆరోగ్యకరమైన కోరిక. ఎలాగైతే చక్కెరకూ, కొలెస్ట్రాల్‌కూ కొన్ని నియమాలు నియంత్రించబడ్డాయో, అలాగే సహజమైన, ఆరోగ్యకరమైన కోరికలకు కూడా కొన్ని నియమాలు నియంత్రించబడ్డాయి. అవి మూడు–

1. సరియైన కోరిక– సరియైన కోరికను కృష్ణపరమాత్మ ధార్మికమైన కోరికగా అభివర్ణిస్తాడు.

**ధర్మావిరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ** **గీత 7-11**

సమస్త ప్రాణులలోనూ, ధర్మానికి విరుద్ధం కాని కామాన్ని నేనే. నైతిక విలువలను, ధర్మాన్ని, న్యాయాన్ని, శాస్త్రాన్ని అధిగమించని ఏ కోరికైనా కూడా అది సరియైన కోరిక. నిజానికి, ధార్మికమైన కోరిక తన విభూతియే అంటున్నాడు కృష్ణపరమాత్మ.

మనలో అధార్మిక కోరికలు రేగినప్పుడు, మనం బాధపడనవసరం లేదు. ఎందుకంటే వాటి రాకమీద మనకేం అధికారం లేదు. కాని అవి మనలో స్థిర నివాసం ఏర్పరచుకోకుండా చేయటంలో అధికారం ఉంది. అందువల్ల మన మనస్సులో ఒక అధార్మిక కోరిక తొంగిచూసినప్పుడు, దాన్ని మొగ్గలోనే త్రుంచి వేయాలి. కోరిక అనేది మన గుమ్మంలోకి చెప్పాపెట్టకుండా వచ్చిన అతిథిలాంటిది. ఆ అతిథి మనకు ఇష్టమైన వ్యక్తి కావచ్చు, ఇష్టం లేని వ్యక్తి కావచ్చు. మన ఇంటి తలుపు ఎవరు తడుతున్నారనే విషయంలో మనమేమీ చేయలేము. కాని వచ్చిన వ్యక్తి మనకు నచ్చని పక్షంలో అతన్ని తలచుకుంటే చిటికెలో సాగనంపగలము. నచ్చితే అతనితో సరదాగా ముచ్చట్లు చెప్పగలము. కోరిక విషయంలో కూడా అంతే!

అధార్మిక కోరికలను పోషిస్తే తప్పేముంది అనుకోవచ్చు, పైపెచ్చు అది ఎవరికీ తెలియదు కదా అని సమర్థించుకోవచ్చు కూడా! కాని మన అంతరాత్మ అని ఒకటి ఉంది. దానికి తెలుసు. మన హృదయాంతరాలలో ఉన్న ఆ అంతరాత్మ అలాంటి చెడు ప్రవర్తనను అంగీకరించదు. అందువల్ల అది మనను మనం ద్వేషించేలాగా చేస్తుంది. మనమీద మనకే గౌరవం పోతుంది. అప్పుడు జీవితం ప్రశాంతంగా ఉండదు.

**2. సమతుల్యమైన కోరిక–** మన కోరికల్లో సమతుల్యత ఉండాలి. ఈ సమతుల్యత రెండు అంశాల్లో ఉండాలి. మొదటి అంశం సంపాదనకూ, దానానికీ మధ్య సమతుల్యత ఉండాలి. చాలా సంపాదించాలి, ఎంతో పోగేసుకోవాలి అనే కోరిక అందరికీ ఉంటుంది. కాని ఎంతమందికి ఆ సంపాదించినది ఎదుటివారికి ఇవ్వాలి, వారితో పంచుకోవాలని ఉంటుంది? సంపాదించాలనే కోరిక, పంచిపెట్టాలనే కోరికతో సరితూగాలి. సంపాదించాలనే కోరిక సహజంగానే ఉంటుంది. పంచిపెట్టాలనే కోరికే అలవాటు చేసుకోవాలి.

ఏం పంచిపెట్టాలి? సమయం, శక్తి, ప్రయత్నం, జ్ఞానం, డబ్బు పంచిపెట్టాలి. ఈ జగత్తంతా ఒకదానితో ఒకటి పెనవేసుకున్న ఆధార-ఆధేయ సంబంధం ఉన్నదంటుంది శాస్త్రం. ఈ జగత్తులో ఉన్న వనరులను వాడుకుని మన కోరికలను, అవసరాలను, ఇష్టాలను తీర్చుకుంటాము. శాస్త్రం ఆ వనరులను మనం తిరిగి ఇవ్వాలంటున్నది. ఆ వనరులను శాస్త్రం ఐదు భాగాలుగా విభజించింది.

**ఎ. ప్రకృతి–** ప్రకృతి పంచభూతాలతో చేయబడింది. ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథ్వి, ఇవే మనకు శక్తినిచ్చి, మన జీవితానికి తోడ్పడతాయి. భగవంతుణ్ణి పంచభూతాలుగా చూస్తాము మన సాంప్రదాయంలో. కాని మనమేం చేశాము? ప్రకృతికి చెట్లు నాటేరూపంలో తిరిగి ఇవ్వకుండా, ఎదురు గాలిని, భూమిని, నేలను అన్నింటినీ కాలుష్యం చేశాము. మనం ప్రకృతికి భిన్నంగా వెళుతూ వాతావరణ కాలుష్యం చేస్తున్నాము. అది ఆపి, ప్రకృతిని సంరక్షించుకోవాలి.

**బి. జీవరాశి–** జీవరాశిలో వృక్షసంపద, పశుసంపద రెండూ వస్తాయి. వాటి బాగోగులు చూడాలి.

**సి. సమాజం–** సమాజానికి శ్రేయస్కరమైన పథకాలను చేపట్టటం ద్వారా, బడుగుజాతి వర్గాలకు చేయూతనివ్వాలి.

**డి. విద్యాసంస్థలు–** శాస్త్రం విద్యకు, విద్యను నేర్పే గురువులకు గొప్ప ప్రాధాన్యతను ఇస్తుంది. విద్యాసంస్థలు విద్యార్థులను బాధ్యతాయుతమైన యువకులుగా తీర్చిదిద్దుతాయి. వారికి సహజమైన కోరికలు, మితిమీరిన కోరికలకు మధ్య ఉన్న భేదం; ఆరోగ్యకరమైన, అనారోగ్యకరమైన కోరికలకు మధ్య ఉన్న భేదం తెలియజేస్తాయి. అన్నింటినీ మించి మితిమీరిన కోరికల జోలికి పోకుండా ఉండగలిగే ఆత్మస్థైర్యం కలుగచేస్తాయి.

**ఇ. కుటుంబం–** మన కుటుంబం మన మానసిక ప్రశాంతతకు ఆయువుపట్టు అంటుంది మన శాస్త్రం. మన కుటుంబం ఆప్యాయతతో అందచేసే అండదండలే మన మానసిక ఆరోగ్యానికి ఆధారం. ఇది ముఖ్యంగా బాలలకు, వృద్ధులకూ వర్తిస్తుంది. కుటుంబం పంచిపెట్టే ఆప్యాయతానురాగాలు విద్యాసంస్థలు అందించలేవు.

ఈ ఐదు అంశాలూ– ప్రకృతి, జీవరాశి, సమాజం, విద్యాసంస్థలు, కుటుంబం– కలిపి పంచమహాయజ్ఞాలు అంటాం. శాస్త్రం వీటిని వరుసగా

దేవయజ్ఞం, భూతయజ్ఞం, మనుష్యయజ్ఞం, బ్రహ్మయజ్ఞం, పితృయజ్ఞం అంటుంది. ఈ పంచమహాయజ్ఞాలను చేయటం మొదటి సమతుల్యత.

రెండవ సమతుల్యత ప్రాపంచిక లక్ష్యాలను, ఆధ్యాత్మిక లక్ష్యాలను సమానంగా చేయటం. మన శాస్త్రం ప్రకారం, ఈ జగత్తంతా ప్రకృతి, పురుషుల మేలుకలయిక. డబ్బు, ఆనందం, సుఖాల వెంట పరుగులు తీస్తూ, ప్రాపంచిక సుఖాలే ముఖ్యమను కుంటే వ్యక్తికి అంతర్గతంగా ఒక విధమైన శూన్యత ఏర్పడుతుంది. అసంపూర్ణుడనే వెలితి, ఏదో లేదనే లోటు అతని మనస్సంతా ఆక్రమిస్తుంది. అందువల్ల రోజులో కనీసం ఒక గంటసేపు ఆధ్యాత్మిక చింతనతో జీవితం గడపాలి.

ఇంకోవైపు చూస్తే ఆధ్యాత్మిక చింతనలోనే సదా మునిగితేలే వ్యక్తి ప్రాథమిక సుఖాలను కూడా నిర్లక్ష్యం చేస్తాడు. ప్రాపంచిక సుఖాలకు లొంగకూడదనుకుని పౌష్టికాహారం తీసుకోడు, ఉండటానికి అనువైన ప్రదేశం కోరుకోడు. దాని ఫలితంగా లేనిపోని, అనవసరమైన కష్టాలు ఎదుర్కొంటాడు. దానివల్ల మొదటికే మోసం వస్తుంది. అంటే తన ఆధ్యాత్మిక ప్రయాణం సుఖంగా సాగదు. అందువల్ల మనం ప్రాపంచిక, ఆధ్యాత్మిక లక్ష్యాలు రెండింటినీ సమతుల్యం చేసుకోవాలి.

**3. శుద్ధమైన కోరిక–** మన శాస్త్రం, కోరికతో పాటు కొన్ని హానికరమైన విషయాలు పుట్టుకొస్తాయి అంటుంది. ఆ విషపూరితమైన బై ప్రోడక్టులు– **క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు.** అంటే కోపం, అత్యాశ, భ్రమ, గర్వం, ఈర్ష్య. తన వ్యాపారంలో విజయం సాధించిన ఒక వ్యాపారవేత్త, ఇంకా ఉన్నతస్థాయికి ఎదగాలనే కోరికతో, తన పోటీదారులందరినీ మట్టుపెట్టాలనుకుంటాడు. ఇలాంటి అనైతిక కోరికలకు చోటు ఇవ్వకూడదు.

ఆ విధంగా మనం ఎబిసిడి సూత్రం పాటించాలి. ఎప్రాప్రియేట్, బ్యాలెన్స్‌డ్, క్లీన్ డిజైర్స్, అంటే సరియైన, సమతుల్యమైన, శుద్ధమైన కోరికలు ఉండాలి. ఇటువంటి కోరికలు ఎన్నైనా ఉండవచ్చు. మనం తప్పుచేసినట్టుగా బాధపడనక్కరలేదు సరికదా గర్వంగా, గొప్పగా భావించవచ్చు. పంచదశిలో స్వామి విద్యారణ్యులవారు, మనకు కోటి కోరికలు కూడా ఉండవచ్చు అంటారు.

**అప్రవేశ్య చిదాత్మానం పృథక్పశ్యన్నహం కృతిమ్।**
**ఇచ్ఛం స్తు కోటివస్తూని న బాధో గ్రంథి భేదతః॥ – పంచదశి 6–262**

చిదాత్మను అహంకారంనుంచి వేరుపరచి తెలిసికొనిన తర్వాత కోటి వస్తువులమీద కోరికలున్నా బాధ లేదు, అజ్ఞానగ్రంథి ఛేదింపబడింది కనుక.

**అందువల్ల అనేక ఆరోగ్యకరమైన కోరికలు ఉండు గాక!**

# 36. ఆందోళనే అన్నింటికీ అంతరాయం

జీవితంలో అందరికీ సమస్యలు ఉంటాయి. నాకు సమస్య లేదు అని చెప్పే మనిషి ఎక్కడో నూటికో కోటికో ఒక్కరుంటారు. ఆ సమస్యకు కారణం– ఆరోగ్యం, ఉద్యోగం, కుటుంబసభ్యులతో అనుబంధం – ఏదైనా కావచ్చు. కొన్ని సమస్యలు వెంటనే వీగిపోతే, కొన్ని సమస్యలు ఎక్కువ కాలం పరిష్కారం దొరకకుండా సతాయిస్తాయి. ఒక సమస్యను మాత్రం సర్వజనీన సమస్య కింద జమకట్టవచ్చు. అంటే అది అందరినీ సమానంగా బాధిస్తుంది. అది బెంగ. మనకు సమస్యలు ఉండటమే ఒక సమస్య అనుకుంటే, మనం ఉన్న సమస్య గురించి బెంగపడటంద్వారా గోరింతలు కొండంతలు చేసుకుంటున్నాము. ఆ విధంగా సమస్య చిన్నదైనా, మన బెంగ అన్నిటికన్నా పెద్దదవుతుంది.

బెంగపడటం ఒక నిరంతర సమస్య. ఎందుకంటే సమస్యలు క్రమం తప్పకుండా, ఒకదాని తర్వాత ఒకటి, ఒక ప్రవాహంలా వస్తూనే ఉంటాయి. ఒకవేళ మన జీవితం ఏ ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగినా కూడా మనకు సమస్యే. ఇదెలా సాధ్యం అనుకుంటాము. లేకపోతే ఈ మంచికాలం అయిపోతుందా అని భయపడతాము. ఇదే మనం బెంగ పడటానికి కారణం అవుతుంది. ఆ మాటకొస్తే బెంగపడటానికి మనకు కారణమే అఖ్ఖరలేదు. మనకు బెంగ పడాల్సిన సమస్య ఏమీ లేకపోతే, బెంగపడటానికి సమస్య ఏమీ లేదే అని బెంగను కోరి తెచ్చుకుంటాము. ఆ విధంగా ఆందోళన **సర్వజనీనం, నిరంతరం.**

ఆందోళన చెందితే, అదే ఒక పెద్ద సమస్య అయి కూర్చుని, తక్కిన సమస్యలను తీర్చుకోనివ్వకుండా అడ్డుపడుతుంది. ఆందోళన చెందటం మన మొట్టమొదటి శత్రువు. అందువల్ల ముందు మనం ఈ శత్రువును పారద్రోలితేనే, తక్కిన సమస్యలవైపు దృష్టి సారించగలము. ముందు ఆందోళన చెందటం ఎంత ప్రమాదకరమో అర్థం చేసుకోవాలి. అది మన ఆరోగ్యానికే చాలా హానికరం. అలా నిరంతరం కలత చెందుతూ ఉంటే, శారీరక, మానసిక రుగ్మతలకు దారితీసే ప్రమాదం ఉంది.

ఆందోళన స్వభావం, తీరుతెన్నులు ఏమిటి? ఆందోళన నాలుగు దశల్లో ఏర్పడుతుంది.

**1. అధీనం–** ఆందోళనకు ఒక విషయం కావాలి. కుటుంబం, ఆర్థిక సమస్య, స్నేహితులు– ఏదైనా కావచ్చు. ఆ విషయాన్ని గురించిన ఆందోళన దానికిష్టమైనప్పుడు మన మనస్సును ఆక్రమిస్తుంది. నిజానికి ఆ సమస్య గురించి ఎప్పుడు ఆలోచించాలో మనం నిర్ణయించుకోవాలి కాని సమస్య దాని వీలునిబట్టి మన మనసులో దురాక్రమణ చేసేస్తుంది.

ఎప్పుడైతే సమస్య దాని ఇష్టం వచ్చినట్టు వచ్చి మనలో రాజ్యమేలుతున్నదో, అప్పుడే మనం ఓడిపోయినట్టు అర్థం. అది కూడా అలా ఇలా కాదు, చిత్తుగా ఓడిపోయినట్టు. మన ప్రమేయం లేకుండా అది మన మనస్సులో దూరిందంటే, మన మనస్సుకు యజమాని ఎవరు? సమస్యా, మనమా? శాస్త్రాలేమో మనస్సును అంతఃకరణం అంటాయి. అంతఃకరణం అంటే మన లోపల ఉన్న పరికరం. మన ఇష్టారాజ్యంగా మనం మన మనస్సును ఉపయోగించాలి. అలా చేయలేకపోయామంటే, మన మనస్సు మన అధీనం తప్పిందన్నమాట! దీని పర్యవసానం **స్వేచ్ఛను కోల్పోవటం.**

**2. బలిచేయటం–** ఒకసారి ఒక సమస్య మన మనస్సులో దూరిందంటే, ఎంతసేపు మన మనస్సులో తిష్ఠ వేసుకుకూర్చోవాలో కూడా అదే నిర్ణయిస్తుందన్నమాట. ఆ సమస్య పెద్దగా అయి, మన మనస్సును పిండేసి మనను అనారోగ్యకరమైన భావోద్రేకాలకు గురిచేస్తుంది. భయం, ద్వేషం, మనమీద మనకు జాలి, నిరాశానిస్పృహలు, కోపంలాంటి అనేక భావోద్రేకాలకు గురిచేసి, వాటికి మనను బలిచేస్తుంది. ముందుగా మన మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. తర్వాత శారీరక ఆరోగ్యంమీద కూడా దాని ప్రభావం చూపుతుంది. అందువల్ల ఈ బలి చేయటం పర్యవసానం **ఆరోగ్యం కోల్పోవటం.**

**3. గడ్డకట్టుకుపోవటం–** ఎప్పుడైతే ఆందోళన, అనారోగ్యకరమైన భావోద్రేకాలు మనస్సును ఆక్రమిస్తాయో, అప్పుడే మన ప్రజ్ఞాపాటవాలు, సమస్యను పరిష్కరించగలిగే మన తెలివితేటలు గడ్డకట్టుకుపోతాయి. ప్రతికూల భావోద్రేకాలు రాజ్యమేలుతున్నప్పుడు బుద్ధి బుద్ధిగా పనిచేయలేదు. వేదాంతంలో కూడా మనం దిట్టలం అవచ్చు కాని, ఆ జ్ఞానం అప్పుడు అందుబాటులోకి రాదు. బుద్ధి సక్రమంగా పనిచేయదు కాబట్టి, సమస్యకు సరియైన పరిష్కారాలను సరిగ్గా ఆలోచించలేము. అందువల్ల ఈ గడ్డ కట్టుకుపోవటం పర్యవసానం **పరిష్కారం పోగొట్టుకోవటం.**

**4. నిర్వీర్యం చేయటం-** మన బుద్ధి ఎప్పుడో మన మాటలను వినటం, మానేయటంవల్ల, మనను పట్టి పీడిస్తున్న సమస్యకు పరిష్కారం ఆలోచించలేకపోవటమే కాదు, మనస్సుమీద, బుద్ధిమీద అధికారం చూపటానికి, ప్రయత్నపూర్వకంగా ఆలోచన చేయటానికి అవసరమైన సృజనాత్మకమైన పని ఏమీ చేయలేక పోతున్నాము. దాని పర్యవసానం ఏమిటి? జీవితం చాలా యాంత్రికంగా మారిపోతుంది. మతిమరపు ఏర్పడుతుంది. మనం జీవిస్తున్నామని పేరే కాని, మనం స్పృహలో ఉండము. ఏం జరుగుతున్నదో తెలియదు. అసలే గతం అయిపోయింది, భవిష్యత్తులో ఏమవుతుందో తెలియదు. వర్తమానమే ముఖ్యం. వర్తమానాన్ని ప్రెజెంట్ అంటారు ఇంగ్లీషులో. అంటే వర్తమానం మనకు దేవుడు ఇచ్చిన కానుక. కాని **ఆందోళన అందించిన అంతరాయం**వల్ల వర్తమానాన్ని కానుకగా ఆస్వాదించలేము. జీవితం స్తంభించిపోతుంది. మరీ ఆందోళన చెందేవారు, జీవితాన్నే కోల్పోవచ్చు కూడా. అందువల్ల ఈ నిర్వీర్యం చేయటం పర్యవసానం **జీవితాన్నే కోల్పోవటం.**

దురదృష్టవశాత్తూ, మనం ఈ ఆందోళనను సీరియస్‌గా తీసుకోము. పైపెచ్చు, ఆందోళన మన జీవితంలో ఒక భాగం అనుకుంటాము. ఇంకా మాట్లాడితే ఆందోళన చెందటం మన ధర్మం కూడా అనుకుంటాము. ఎందుకు? ఆందోళన చెందటం అంటే ఒక వ్యక్తి గురించి అక్కర లేదా ప్రేమ చూపటం అని పొరపాటు పడతాం. మన పిల్లల భవిష్యత్తు గురించి బెంగపడితే, మన బాధ్యత చక్కగా నిర్వర్తించినట్టు అని అపోహ పడతాము. కాని ఒక సంస్కృత శ్లోకం రెండు అగ్నులను పోలుస్తుంది. చితి(శవాన్ని కాల్చే అగ్ని), చింత (ఆందోళన అనే అగ్ని). ఈ రెండింటిలో ఏది శక్తివంతమైనది అని ప్రశ్న అడిగితే, చింతే ఎక్కువ అని చెబుతుంది. ఎందుకు? చితిమంటలు శవాన్ని కాలిస్తే, చింతాగ్ని బ్రతికున్న శరీరాన్నే కాలుస్తుంది కాబట్టి.

అంటే సమస్య గురించి ఆందోళన చెందవద్దు అని అంటే, మనం దానివల్ల అవస్థపడాలని అర్థమా అని అడగవచ్చు మీరు. శాస్త్రం మీరేమీ అవస్థపడనవసరం లేదు అంటున్నది. సమస్యమీద కృషి చేయాలి కాని సమస్య గురించి ఆందోళన చెందకూడదు అంటున్నది. ఆందోళన చెందటాన్ని విమర్శిస్తున్నది కాని సమస్యను పరిష్కరించటాన్ని కాదు. నిజానికి బాధ్యత ఉన్న ప్రతివ్యక్తీ సమస్యమీద కృషి చేయాలి.

సమస్య గురించి ఆందోళన చెందటానికీ, సమస్యమీద కృషి చేయటానికీ మధ్య ఉన్న భేదమేమిటి? సమస్యమీద కృషి చేయటమంటే ఏమిటో సరిగ్గా అర్థం చేసుకుంటే, మీకే తెలుస్తుంది మీరు ఆందోళన చెందుతున్నారో, కృషి చేస్తున్నారో? కృషి చేయటానికి కూడా నాలుగు దశలు ఉన్నాయి. అవి–

**1. నిర్ణయం–** ఒక సమస్య గురించి ఎప్పుడు ఆలోచించాలో మనం నిర్ణయించుకోవాలి. ఆందోళన చెందటంలో అది నిర్ణయిస్తుంది. ఎప్పుడు, ఎంతసేపు ఆలోచించాలో మనం తేల్చుకోవాలి కాని మన అనుమతి లేకుండా సమస్య మన మనసులోకి దూసుకువచ్చేయకూడదు. **'అనుమతి లేనిదే ప్రవేశం లేదు,'** బోర్డు పెడతాము మనము.

**2. స్పష్టత–** ఒక సమస్యను క్రోడీకరించి, దాన్ని కొన్ని ముఖ్యమైన అంశాలుగా, స్ఫటికమంత స్పష్టంగా విభజించుకుంటాము. ఆ ప్రయాణం భావోద్రేకాలకు గురి చేసే అదుపులేని ప్రయాణం కాదు. మన తార్కిక బుద్ధి మన అదుపులో ఉంటుంది.

**3. అన్వేషణ–** సమస్యకు విభిన్నపరిష్కారాలు ఆలోచిస్తాము. అంతకు ముందు ఆలోచన సమస్యా ప్రధానంగా ఉంటే, ఇప్పటి ఆలోచన పరిష్కారప్రధానంగా ఉంటుంది. మన ఆలోచనా తీరును గమనిస్తే మనం చింత చేస్తున్నామో, కృషి చేస్తున్నామో మనకే తెలుస్తుంది. మనకు సమస్య విషయంలో నిర్ణయం, స్పష్టత లేకపోతే మనం చింత చేస్తున్నట్టు లెక్క. సమస్య మనతో ఆడుకుంటున్నది.

**4. ఆచరణ–** ఎప్పుడైతే సమస్యకు విభిన్న పరిష్కారాలను ఆలోచిస్తామో అప్పుడే దానికి అనేక పరిష్కారాలు తడుతాయి. వాటిల్లోంచి ఒక మార్గాన్ని ఎన్నుకుని, దాన్ని ఆచరణలో పెట్టాలి. మూడు వంతులు ఆ పరిష్కారమార్గం మంచిదే అయి, మన సమస్య తీరుతుంది.

ఒక్కోసారి, మనం ఎన్నుకున్న పరిష్కారం సరిగ్గా పనిచేయకపోవచ్చు. అలాంటప్పుడు, నిరాశపడకుండా మళ్ళీ ప్రయత్నించాలి. మళ్ళీ ఈ నాలుగు దశలనూ ప్రయత్నించాలి. సమస్య పరిష్కారం అయ్యేంతవరకూ అంతర్గతశక్తిని, ప్రశాంతతనూ చేకూర్చుకోవాలి. అప్పుడే దాన్ని పరిష్కరించగలము.

ఒక్కోసారి ఆ సమస్య పరిష్కారం లేనిది అవచ్చు. తీవ్రమైన అనారోగ్యం అయి, దీనికి మందు లేదు, భరించాల్సిందే అనే పరిస్థితి రావచ్చు. ఇది ఒక నిస్సహాయస్థితి. ఇటువంటి పరిస్థితిలో, మనస్సును దృఢపరచుకోవాలి. దీనికి

పరిష్కారం లేదని అర్థం చేసుకోవాలి. మన బుద్ధిని ఉపయోగించి, ప్రార్థనద్వారా, సమస్యకు అతీతంగా ఎదగాలి. ఎంత ఎత్తుకు ఎదగాలంటే సమస్య చాలా చిన్నదిగా కనపడాలి. అప్పుడు, మనం వేరే సృజనాత్మక పనులు చేపట్టవచ్చు. అదెలా చేయగలమని నిర్వీర్యం చెందకండి. గొప్పవారి జీవితాలు మనకు ఆదర్శప్రాయాలు. ఎంతోమంది వికలాంగులు ఎన్నో విజయాలు సాధించారు. వారు మననుంచి జాలిని ఆశించరు, వారికి అవసరం లేదు కూడా. వారు నిరంతరంగా విజయాలు సాధిస్తూనే ఉంటారు.

అందువల్ల, మన సమస్యకు పరిష్కారం లేకపోయినా కూడా, మనం ఆనందకరమైన, తృప్తికరమైన, సృజనాత్మకమైన జీవితాన్ని జీవించగలము. ఈ నూతన సంవత్సర తొలిరోజున, మన సమస్యల గురించి కృంగి కృశించిపోకుండా ఉండేలా చేయమని ఆ భగవంతుని కృపాకటాక్షాలకోసం వేడుకుందాము.

**ఓ దేవా పరిష్కరించగలిగిన సమస్యలను పరిష్కరించుకోగలిగే శక్తిని, తెలివిని ప్రసాదించు.**

**పరిష్కరించుకోలేని సమస్యలను నవ్వుతూ స్వీకరించి దానికి అతీతంగా ఎదిగే శక్తిని ప్రసాదించు.**

# స్వామీజీ సూక్తిముక్తావళి

ఈ జన్మ మీకు నాలుగు అవకాశాలను ఇచ్చింది. 1. మీరు మనిషిగా పుట్టారు. 84 లక్షల జీవరాసుల్లో ఒకరుగా; 2. మీరు వైదిక సంస్కృతిలో, మోక్షాన్ని నమ్మే సంస్కృతిలో పుట్టారు; 3. మీకు మోక్షం పొందాలనే తపన ఉంది; 4. మీకు అదృష్టం కొద్దీ వేదాంతవిచారణ జరపటానికి మీకొక ఆచార్యుడు ప్రత్యక్షంగా దొరికారు. అందువల్ల, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోండి.

## 37. భయాన్ని ఎదుర్కోవటమెలా?

మనిషిగా మనం మనకున్న ఆరు బలహీనతలను తొలగించుకోవాలి. అవి– **నిద్ర, బద్ధకం, ఆలస్యం, కాలయాపన, భయం, క్రోధం–** మొదటి నాలుగూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. విజయం సాధించాలంటే ఈ ఆరు మానుకోవాలి.

**నిద్ర–** అసలు నిద్రపోకూడదనదు శాస్త్రం. అసలు నిద్రపోకపోతే ఆరోగ్యసమస్యలు వస్తాయి కూడా. అందువల్ల ఎక్కువ నిద్రపోకూడదు, కొన్ని సమయాలలో నిద్రపోకూడదు.

కొన్ని లక్షణాలను వర్ణిస్తూ అవి పాటించే అతని ఇంటిలో లక్ష్మీదేవి ఉండదని ఒక సుభాషితంలో వస్తుంది. అశుభ్రమైన దుస్తులు వేసుకునేవ్యక్తి, పొద్దున్న,రాత్రి, ఏదైనా తిన్న ప్రతిసారీ దంతధావనం చేయని వ్యక్తి, అతిగా తినే వ్యక్తి, నిష్ఠూరంగా మాట్లాడేవ్యక్తి, సూర్యోదయం తర్వాత, సూర్యాస్తమయ సమయంలోనూ నిద్రపోయే వ్యక్తి ఉన్న చోట, అది విష్ణుభగవానుడే అయినా సరే, అక్కడ లక్ష్మీదేవి ఉండదు.

ఇందులో మనకు కావాల్సింది సూర్యోదయం తర్వాత, సూర్యాస్తమయం సమయంలోనూ  నిద్రపోకూడదు.

**బద్ధకం, ఆలస్యం, కాలయాపన –** ఇవి చేసే వారు ఏ పనీ సరిగా చేయరు. వారికి తమోగుణం ఎక్కువగా ఉంటుంది. అది తగ్గించుకోవటానికి వారు యోగాసనాలు వేయాలి. ప్రాణాయామం చేయాలి. శారీరక, మానసిక ఆరోగ్యాలు కాపాడుకోవాలి. బద్ధకం ఉంటే చేయాల్సిన పనులను వెనక్కి నెట్టేస్తూ ఉంటారు.

**క్రోధం–** క్రోధం ఉంటే అది మూడు సుగుణాలను నాశనం చేస్తుంది. అవి సమత్వం, సూక్ష్మత్వం, సావధానత్వం.

**భయం–** భయం ఉంటే, మన లక్ష్యాలను సాధించకుండా అడ్డుపడుతుంది. ఏదైనా ఆటంకం ఏర్పడుతుందేమో, విజయం సాధించలేమేమోననే భయంతోనే సగం మంది ఏమీ ప్రయత్నించరు. ఒకవేళ పొరపాటున ప్రయత్నించటానికి సాహసించినా మధ్యలో ఏదో కారణం వెతుక్కుని ఆపేస్తారు. ఒకవేళ బదరీనాథ్‌కి వెళదామనుకున్నా, ఎవరైనా అయ్యో బదరీనాథ్‌కి వెళుతున్నారా అని గట్టిగా అడిగితే చాలు, భయపడిపోయి మానేస్తారు. మొదలుపెట్టనే పెట్టనివాడు, ఓడిపోయే ప్రసక్తి ఎక్కడ ఉంది?

ఎవరో గొప్పగా చెప్పాడుట, 'నా జీవితంలో నేను ఎన్నడూ ఓటమి పొందలేదు.' 'నువ్వు ఏం సాధించావయ్యా?' అంటే ఏమీ లేదు. ఏదైనా ప్రయత్నిస్తేనే కదా! అందువల్ల భయం చాలా పెద్ద సమస్య. శాస్త్రం భయం, భయనివృత్తి గురించి అనేకచోట్ల ప్రస్తావిస్తుంది. మోక్షాన్ని ఆత్యంతిక భయనివృత్తిగా నిర్వచిస్తుంది. సైకాలజిస్టులు కూడా భయాన్ని ఎలా పారద్రోలాలో అనేకరకాలుగా చెబుతారు. కాని మనం ఇప్పుడు శాస్త్రం ఏం చెబుతుందో చూద్దాము.

జాగ్రత్తగా పరిశీలించి చూస్తే భయం ఏ ఒక్కరికో లేదు. అది అందరికీ ఉంది. మనుష్యులకీ, జంతువులకీ కూడా. ఇది ఒక స్వతసిద్ధమైన, సహజమైన భావన. దీన్ని దేవుడే మనలో అమర్చాడు. దేవుడే స్వయంగా అమర్చాడు అంటే దాన్ని మనం విమర్శించటమో , తిట్టటమో చేయకూడదు. దానికి ఏదో కారణం ఉండి ఉంటుంది. మనం ఆ కారణాన్ని శోధించాలి.

భయం మనకు ఒక హెచ్చరికలా పనిచేస్తుంది. అనుకోని క్లిష్టపరిస్థితి ఎదురైనప్పుడు అది మనను ముందే హెచ్చరిస్తుంది. శరీరంలో ఏదైనా అనారోగ్యం కలిగితే, శరీరం సూచనలిస్తుంది కూడా. శరీరం ఇచ్చిన సూచనలను తీసుకుని, మనం డాక్టరు దగ్గరకి వెళతాము. అలాగే భయం మనం ఎదుర్కోబోయే విపత్కర పరిస్థితులను ముందే సూచిస్తుంది. అంతేకాదు, భయం వచ్చినప్పుడు, మన శరీరంలో అనేక రసాయనిక చర్యలు జరుగుతాయి. దానివల్ల ఎదుర్కోవటమో, పారిపోవటమో చేస్తాము. ఒక్కోసారి అధికమైన బలం వస్తుంది. మన శక్తిని మించి పరుగుపెడతాము. అందువల్ల భయం కలిగితే, మనం దాని గురించి బాధపడనవసరం లేదు. అది ఒక వరం.

భయం ఒక వరం అయితే ఎందుకు దాన్ని సమస్యగా చిత్రిస్తున్నారు? భయం ఒక దూతగా వస్తే వరం, కాని ఈ దూత ఇంట్లో అతిథిగా ఉండిపోతేనో, ఇంట్లో ఒక సభ్యుడిగా ఉండిపోతేనో వస్తుంది పెద్ద చిక్కు. మనకు కొరియర్ తీసుకువచ్చిన వ్యక్తి ఇచ్చి వెళ్ళిపోవాలి కాని, అతిథిగా కొన్ని రోజులు ఉంటాను, ఇంట్లో వ్యక్తిగా ఇక్కడే తిష్ఠ వేస్తాను అంటే ఒప్పుకుంటామా? కాని భయానికి మాత్రం చక్కగా అతిథిగా, ఆ పై ఇంట్లో వ్యక్తిగా మర్యాదలు చేస్తున్నాము.

మనస్సులో తిష్ఠవేసిన భయాన్ని ఎలా పారద్రోలాలి? దీనికి శాస్త్రం నాలుగు మార్గాలు చెబుతున్నది. నాలుగూ ఒకచోట చెప్పలేదు. అక్కడక్కడా, భిన్న సందర్భాలలో చెప్పినవి ఏరుకోవాలి.

**1. యోగ అభ్యాసం –** చిత్తవృత్తి నిరోధం– అనారోగ్యకరమైన ఆలోచనలను ఏరిపారేయగలిగే సామర్థ్యం. దీని వెనుకనున్న సూత్రం– భయం నా ప్రమేయం లేకుండా రాగలదు కాని, నా ప్రోత్సాహం లేకుండా అది నాలో తిష్ఠవేసుకు కూర్చోలేదు. భయం ఎందుకు వస్తుంది అంటే స్వతసిద్ధంగా వస్తుందని చూశాము కదా! మన వాసనలవల్ల కూడా వస్తుంది. రావటం దాని ఇష్టం కాని, ఉండటం దాని ఇష్టం కాదు. దాన్ని ఉంచటమో, వెళ్ళగొట్టటమో మన ఇష్టంమీద ఆధారపడి ఉంది.

ఏ ఆలోచనా తీరు కూడా, దానంతట అది కొనసాగదు. మనం పదేపదే దాని గురించి ఆలోచిస్తే, అది ఉండిపోతుంది. అందువల్ల మనకు సందేశం అందించాక దాని పని అయిపోయింది. అది మన సమస్యను పరిష్కరించలేదు సరికదా, మన శారీరక, మానసిక ఆరోగ్యాలు రెండింటికీ ప్రమాదకరం కూడా! ఇంక నువ్వు వెళ్ళు అని చెప్పగలగటానికి సాధన అవసరం. భయపడుతూ కూర్చుని వృథా చేసే సమయాన్ని, శక్తిని మంచి భవిష్యత్తుకోసం ఉపయోగిస్తే బాగుపడతాము.

ఆ విధంగా భయానికి చేసే సహాయ నిరాకరణ ఉద్యమాన్ని యోగ అభ్యాసం అంటారు. దీన్ని పతంజలి యోగసూత్రాల్లో చూస్తాము.

**2. భక్తి అభ్యాసం –** మనలో ఆత్మస్థైర్యం ఎంత తక్కువ ఉంటే, భయం అంత ఎక్కువ ఉంటుంది. భయం ఎంత ఎక్కువ ఉంటే, ఊహాగానం అంత ఎక్కువ వెర్రితలలు వేస్తుంది. ఊహాగానం ఎంత ఎక్కువ వెర్రితలలు వేస్తే అంత ఆత్మస్థైర్యం తగ్గుతుంది. అందువల్ల ఇదంతా ఒక భయంకరమైన వృత్తం. ఆత్మస్థైర్యాన్ని పూర్తిగా నొక్కిపట్టేసి, భయం అతిగా రాజ్యమేలుతుంది.

అందువల్ల భయాన్ని అణగదొక్కాలంటే, అది అణగదొక్కిన మన ఆత్మస్థైర్యాన్ని మళ్ళీ పుంజుకోవాలి. నాకు కావాల్సినంత వనరులు ఉన్నాయి, నేను ఈ పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కొంటాను అనుకోవాలి. అలా అనుకోవటానికి ధైర్యవంతులైన వారి జీవిత చరిత్రలు చదవాలి. సత్సంగాలు చేయాలి. వీటన్నింటి కన్నా ముఖ్యమైనది ఈశ్వర భక్తి.

ప్రాథమికంగా మనమంతా ఈశ్వరునికి చెందినవారము. ఈశ్వరుడు జగత్కారణం, మనం కార్యం. అల కార్యం. సముద్రం కారణం అయినట్టన్నమాట. ఒక చిన్న అల వెనుక బలమైన సముద్రం ఉన్నట్టుగా, ఒక చిన్న జీవి వెనుక సర్వశక్తివంతుడైన ఈశ్వరుడు ఉన్నాడు. భగవాన్ అంటే ఆరు శక్తులు ఉన్న దేవుడు

అని అర్థం. ఆ ఆరుశక్తుల్లో ఒకటి ధైర్యం. ఆ సర్వశక్తివంతుడినుంచి నేను ధైర్యాన్ని పుంజుకుని,నా పరిస్థితిని ఎదుర్కొంటాను. దానికి ఆంజనేయస్వామే ఉదాహరణ.

హనుమంతునికి అంత పెద్ద సముద్రం కూడా చిన్న తటాకం అయిపోయింది; ఎందుకు? ఆయనకున్న రామభక్తినుంచి పొందిన ఆత్మస్థైర్యంవల్ల. రాక్షసులు కూడా చిన్న దోమల్లా అనిపించారుట. నేను కూడా అలా రామునినుంచి శక్తి పొందుతాను.

ఆ విధంగా దేవునిమీద భక్తితో ఆత్మస్థైర్యం పొంది, భయాన్ని పారద్రోలాలి. దీన్ని భక్తి అభ్యాసం అంటారు.

**3. వైరాగ్య అభ్యాసం–** ఇది శాస్త్రంలోని బోధను ఆధారం చేసుకుని చెప్పినది. వేదం ఈ విశ్వంలో ఈశ్వరుని చూస్తుంది. అంటే ఈశ్వర విశ్వరూపదర్శనం చేస్తుంది. అన్ని జీవరాసులూ దేవునిలోనే ఉన్నాయి. దీనివల్ల తెలుసుకోవాల్సిన ముఖ్యసందేశం – దేవుడే అన్నింటికీ అధికారి. ఏదీ మనది కాదు, **దేనిమీదా మనకు అధికారం లేదు**. మనకున్నవన్నీ దేవుడు మనకు తాత్కాలికంగా ఇచ్చాడు, ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు వెనక్కి తీసేసుకునే హక్కు ఆయనకు ఉంది. ఈ విషయ అజ్ఞానంవల్ల మమకారం ఏర్పడుతుంది. మమకారంవల్ల భయం కలుగుతుంది.

భగవంతుని ఆస్తిలో మనం అడుగుపెడితే, మనను శిక్షిస్తాడు. నా ఇల్లు, నా భార్య, నా వస్తువులు అన్నప్పుడల్లా అది ఒక పెద్ద నేరం అవుతుంది. దానికి శిక్ష – భయం, ఆందోళన, బెంగ అనే దెబ్బలు. అందువల్ల దీనికి పరిష్కారం భయహేతువును పారద్రోలటమే.

'నా కుటుంబసభ్యులు నీ వారు,' అని వారిని భగవంతునికి అర్పించాలి. కుటుంబంద్వారా భగవంతునికి మనం సేవ చేస్తున్నాము, అంతేకాని వారిమీద అభిమానం పెంచుకోవటానికి కాదు. అలా బంధాలు పెంచుకోమనేటట్టయితే, సన్న్యాసాశ్రమాన్ని చెప్పేదే కాదు శాస్త్రం. బంధాలు తగ్గించుకుని, అందరికీ మనం సేవ చేయాలి. భగవంతుని ఆస్తిగా వారిని చూడాలి. అప్పుడు వారి గురించిన భయం మనకుండదు. వారు ఆయన ఆస్తి, ఆయనే కాపాడుకోవాలి తన ఆస్తిని.

మన వారిని భగవంతుని ఆస్తిగా చూడటమే వైరాగ్య అభ్యాసం.

**4. జ్ఞాన అభ్యాసం–** పై మూడు మార్గాలు ఆపేక్షిక భయనివృత్తిమార్గాలు. అవి భయాన్ని తగ్గిస్తాయి కాని పూర్తిగా పారద్రోలవు. ఆత్యంతిక భయ నివృత్తి కలగాలంటే

వేదాంతబోధకు రావాలి. అంతకుముందు సూత్రంనుంచి వచ్చిందే ఇది. అంతకు ముందు నీ వారిని, నీ ఆస్తిని అన్నింటినీ భగవంతునికి అర్పించమన్నది శాస్త్రం. ఇప్పుడు నీ మనస్సును కూడా అర్పించమంటున్నది శాస్త్రం.

నువ్వు నీ మనస్సుకు కూడా యజమాని కాదు. భగవంతుడే యజమాని.

మనస్సుమీద నాకు అధికారం లేదు. అది నా పూర్వజన్మ కర్మలమీద, వాసనలమీద ఆధారపడి ఉంది. మనస్సు అనాత్మ. నేను ఆత్మను. మనస్సే నేను కానప్పుడు, మనస్సులో ఏర్పడిన భయం నన్నేం చేస్తుంది అని అర్థం చేసుకోవాలి.

నేను మనస్సు కాకపోతే, నేనెవరు? **నేను సచ్చిదానంద ఆత్మ స్వరూపాన్ని.** భయానికీ, నాకు ఎటువంటి సంబంధం లేదు. నేను మనస్సు కాదు, నేను ఆత్మను అని అర్థం చేసుకోవటం జ్ఞాన అభ్యాసం.

**మొదటి మూడూ భయాన్ని తగ్గిస్తే, నాలుగవది భయాన్ని పూర్తిగా పారద్రోలుతుంది.**

## స్వామీజీ సూక్తిముక్తావళి

తైత్తిరీయోపనిషత్తులో, బ్రహ్మానంద వల్లీలో వచ్చే శాంతిపాఠంలో, ముందు గురుశిష్యరక్షణ కోరతారు. తర్వాత గురుశిష్యుల మధ్య అనుబంధంకోసం కూడా ప్రార్థన చేస్తారు. గురువుకు శిష్యునిమీద అభిమానం, శిష్యునికి గురువుమీద శ్రద్ధ ఉంటే వారి మధ్య జరిగే బోధ చక్కగా సాగుతుంది.

# 38. దుఃఖాన్ని అధిగమించటమెలా?

ఒక సంస్కృత శ్లోకం సారాంశం, 'నేను ఎప్పుడూ ఆనందాన్ని అనుభవించుదును గాక, నేను ఎన్నడూ దుఃఖాన్ని అనుభవించకుందుగాక!' ఆనందం కోరటం, దుఃఖాన్ని వద్దనుకోవటం అనే ఈ రెండు కోరికలూ ప్రాథమిక కోరికలు, సర్వజనీన కోరికలు. మనుష్యులందరూ సహజంగా కోరుకునే కోరికలు.

ఈ కోరికలను తీర్చుకోవటమెలా? ఆ శ్లోకమే దీనికి జవాబుకూడా చెబుతున్నది. జ్ఞానంద్వారా తీర్చుకోగలరని. ఈ జవాబు మనకు ఆశ్చర్యాన్ని కలుగచేయవచ్చు. ఎందుకంటే ఆనందం పొందటానికీ, దుఃఖాన్ని తప్పించుకోవటానికి మార్గం జ్ఞానం అని మనం ఆలోచించము కాబట్టి. పైపెచ్చు మన ఆశ్చర్యాన్ని ఇంకా పెంచటానికి ఈ రెండు కోరికలను జ్ఞానంవల్ల మాత్రమే తీర్చుకోగలము అంటుంది శ్లోకం.

ఏ జ్ఞానం పొందితే మనం ఎల్లవేళలా ఆనందంగా ఉండగలము? మొదట అసలు ఆనందం అంటే ఏమిటో, దుఃఖం అంటే ఏమిటో స్పష్టంగా అర్థం చేసుకోవాలి. మనం అనుభవించటానికి ఇష్టపడే లేదా ప్రేమించే ఏ అనుభవాన్నైనా పొందటాన్ని ఆనందంగా నిర్వచించవచ్చు. ఇంకోవిధంగా చెప్పాలంటే **మనం కావాలని కోరుకునే అనుభవం ఆనందం.** దుఃఖం అంటే మనం అనుభవించటానికి ఇష్టపడని అనుభవాన్ని పొందటం. ఇంకో విధంగా చెప్పాలంటే **మనం ఇష్టపడని అనుభవం దుఃఖం.**

దీన్నిబట్టి మనకి అర్థమయింది ఏమిటి? మనకు హాయినిచ్చే అనుభవాలు మనం కోరుకునే అనుభవాలు అని. ఎందుకంటే వాటిని మనం పొందాలనుకుంటాము కాబట్టి, అలాంటివి ఆనందం ఇస్తాయి కాబట్టి. అలాగే మనను కష్టపెట్టే అనుభవాలు లేదా అవస్థపెట్టే అనుభవాలు వద్దనుకునే అనుభవాలని, అందువల్ల వాటిని తప్పించుకోవాలని చూస్తామని, అలాంటివి దుఃఖాన్ని ఇస్తాయని అనుకుంటాము. కాని ఒక నిముషం ఆగి, ఈ నిర్వచనాన్ని ఒకసారి విశ్లేషిద్దాము. మనను కష్టపెట్టే అనుభవమేదైనా పొందుదామనుకుంటామా? కొంచెం లోతుగా విశ్లేషిస్తే, లెక్కలేనన్ని ఉదాహరణలు దొరుకుతాయి. ఎంతోమంది ఎన్నో కష్టమైన పనులను ఇష్టపడి చేస్తారనీ, అవి వారికి ఆనందాన్నిస్తాయనీ తెలుస్తుంది.

ఉదాహరణకు పర్వతారోహణ చేసేవారిని చూడండి! దానికన్నా కష్టమైన పని ఇంకోటుందా? చలి ఆగటానికి ఎన్నో ఉన్నిదుస్తులు వేసుకోవాలి, బరువైన ఆక్సిజన్ సిలిండర్ మోయాలి, ఇంకా అవసరమైన వస్తువులు ఉన్న ఇంకో బరువైన బ్యాగ్ మోయాలి, శరీరాన్ని గడ్డకట్టించే మంచులో రోజుల తరబడీ భారంగా అడుగులు వేయాలి, క్యానుల్లో ఉన్న ఆహారాన్నే తినాలి. ఇంత అవస్థపడటం అవసరమా? ఏ పర్వతారోహకుడినైనా అడగండి ఈ ప్రశ్న. అతను ఇంతకు మించిన ఆనందం ప్రపంచంలో ఏదీ లేదంటాడు.

పైగా ఈ కొండలెక్కేవారికి చిన్న చిన్న కొండలెక్కితే ఎక్కినట్టు కాదు. అన్నిటికన్నా ఎత్తైన కొండను ఎక్కాలి. పర్వతారోహణ చేసే సరదా ఉన్న ప్రతి ఒక్క వ్యక్తి లక్ష్యమూ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాలని! ఎందుకంటే అది అత్యంత ఎత్తైన శిఖరం. వారికి ఎత్తైన కొండ ఉంటే చాలదు, దాన్ని అధిరోహించటం ఎంత కష్టమైన పని అయితే అంత ఆనందం. అందువల్ల పర్వతాలను ఎక్కేవారు అతి కష్టమైన కొండలను ఎన్నుకుంటారు.

పర్వతాలను ఎక్కడమంటే ఎంతో కష్టమైన పని. మరెంతో ఒత్తిడికి గురి చేసే పని. అన్నింటినీ మించి జీవితానికే పెద్ద ముప్పు వాటిల్లవచ్చు. మనిషి చేసే పొరపాటు అంటే ఒక చిన్న తప్పటడుగు వేస్తే చాలు లేదా ప్రకృతిమాత ఎక్కిళ్ళు అంటే పెద్ద మంచుగడ్డ ఈ సాహసవీరునిమీద పడితే చాలు, అతని జీవితం మొగ్గలోనే చిదిమిపోతుంది. ఇన్ని కష్టనష్టాలకోర్చి, ఎన్నో ఎదురీతలు ఈది, ఎన్నో సాహసాలు చేస్తూ, ఈ పర్వతారోహణను మనసారా ఆనందిస్తారు. అది వారు కావాలని కోరి తెచ్చుకున్న అనుభవం. అందువల్ల వారికి అది ఆనందాన్నే ఇస్తుంది.

మాతృత్వం, ఒక పెద్ద శాపం కొంతమందికి. గర్భస్థ శిశువును మోస్తున్న తొమ్మిది నెలలు ఎన్నో రకాల అవస్థలను ఎదుర్కొంటారు తల్లులు; పురుటినొప్పులు అనుభవించి, కొత్త జీవిని భూమ్మీదకి తెచ్చే ప్రయత్నంలో చచ్చి బ్రతుకుతారు ఆ స్త్రీమూర్తులు. ఇంత కష్టపడి కన్న పిల్లలను పెంచటం ఇంకా పెద్ద బ్రహ్మ ప్రళయమైన పని. ఇంత ప్రయాసతో కూడిన పని అయినా కూడా స్త్రీలు మాతృత్వాన్ని ఒక తీయని వరంగా భావిస్తారు. అందువల్ల పెళ్ళికోసం, పిల్లలను కనటంకోసం ఉవ్విళ్ళూరుతుంటారు. అలాగే పురుషులు కూడా! పెళ్ళి చేసుకోవాలని, పిల్లలకు తండ్రులవ్వాలని ఎన్నో కలలు కంటారు. అందువల్ల ప్రయాసతో కూడిన అనుభవం అయినా సరే, మనం కోరుకున్న అనుభవం ఆనందం తెగలోకే వస్తుంది.

ఇదే విషయం, దుఃఖానికి అన్వయించవచ్చు. ఒక అనుభవం హాయినిచ్చేదైనా, ప్రయాసపెట్టేదైనా మనకు అనుభవించటానికి ఇష్టం లేనిది దుఃఖం తెగలోకి వస్తుంది. మనకు హాయినిచ్చే అనుభవాన్ని వద్దనుకునే పరిస్థితి ఉంటుందా? ఉంటుంది. ఈ ఉదాహరణ చూడండి. ఒక వ్యక్తి అనుకోకుండా కష్టాల్లో కూరుకుపోయి తనకున్నవన్నీ అమ్ముకోవాల్సి వచ్చింది. కారు, ఇల్లుతో సహా! అతని మామగారు కోటీశ్వరుడు. అతను అవన్నీ వెనక్కి తెచ్చిస్తానన్నాడు. ఇతను ససేమిరా అన్నాడు. కాని భార్య, మామగారు రకరకాలుగా అతనికి నచ్చచెప్పారు. చివరికి అతను లొంగక తప్పలేదు. అతని ఆస్తి మొత్తం తిరిగివచ్చింది. ఇల్లు, అతను మోజుపడి కొనుక్కున్న కారుతో సహా! తనకు ఆనందాన్ని కలుగచేసే వస్తువులన్నీ తిరిగివచ్చాయి కదా, ఆనందంలో మునిగి తేలాలి కదా! కాని అతను దుఃఖంతోనే కృంగిపోయాడు. ఎందుకు? వాటిని చూసినప్పుడల్లా వాటిని తెచ్చిన మామగారి ఔదార్యం, తన నిస్సహాయతే అతని కళ్ళముందు నాట్యంచేస్తున్నాయి. వాటిని అతను స్వీకరించలేకపోతున్నాడు.

అందువల్ల మనం జీవితంలో కోరుకున్న అనుభవాలు పొందటానికి, అవి హాయినిచ్చేవైనా, ప్రయాసపెట్టేవైనా సరే-నిరంతరం కృషి చేస్తూనే ఉంటాము. అలాగే హాయినివ్వనీ, ప్రయాసపెట్టనీ అవి వద్దనుకున్న అనుభవాలయితే, వాటిని పారద్రోలటానికి కూడా నిరంతరం కృషి చేస్తూనే ఉంటాము. దానికోసం మనం మన ప్రయత్నాలన్నీ ధారపోస్తూనే ఉంటాము. అవి చాలవనట్టు హస్తసాముద్రికం, న్యూమరాలజీ, వాస్తు వగైరాల వెంట పరుగులు తీస్తూనే ఉంటాము. కాని, దారుణంగా ఓడిపోతాము. మనం ఎంత గొప్ప ప్రయత్నాలు చేసినా అనుకున్నామని జరగవు అన్నీ, అనుకోలేదని ఆగవు కొన్ని.

ఇలా మానవప్రయత్నంలో మనం చిత్తుగా ఓడిపోయి, చేతులెత్తేసినప్పుడు శాస్త్రం మనను కాపాడటానికి ముందుకు వస్తుంది. ముందుగా పరిస్థితిని బేరీజు వేయమంటుంది. ముందుగా మన అనుభవాలు మన చెప్పుచేతల్లో లేవని మనం గుర్తించాలి. ఎందుకు? మనం బొత్తిగా అదుపులో పెట్టలేని, లేదా పూర్తిగా అదుపులో పెట్టలేని అనేక అంశాలమీద ఆ పరిస్థితులు ఆధారపడి ఉంటాయి.

అసలు శాస్త్రం మనను ఒక ప్రశ్న వేస్తుంది. మనం ఎదుర్కొనే అనుభవాలను కావాల్సిన అనుభవాలు లేదా అక్కరలేని అనుభవాలు అని వాటిని విభజించింది ఎవరు? ఆ విభజన అనుభవంతో పాటు వస్తుందా, మనం ఏర్పరుస్తున్నామా?

నిజం చెప్పాలంటే అనుభవం ఒక్కటే వస్తుంది. దాన్ని కోరుకున్నదీ, కోరుకోనిదీ అనే తోకలు మనం తగిలిస్తున్నాం. అది పూర్తిగా మన సృష్టి. అందువల్ల అది మన చేతిలో ఉంది.

అందువల్ల శాస్త్రం ఒక్కటే చెబుతుంది. మీరు ఎదుర్కొనే పరిస్థితి మీ చేతిలో లేకపోవచ్చు. కాని మీ చేతిలో ఉన్న అంశాన్ని మీరు అదుపులో పెట్టవచ్చు కదా! ఏమిటది? **కోరుకున్నది, కోరుకోనిది** అనే ప్రత్యేక బిరుదులు.

కోరుకున్నది, కోరుకోనిది అనే ప్రత్యేక బిరుదులకు అతీతంగా ఎలా ఎదగగలము? ఈ అంశం చాలా ముఖ్యమైన అంశం. ఎందుకంటే ఈ బిరుదులే నిర్ణయిస్తాయి మన ఆనందాన్ని కాని, దుఃఖాన్ని కాని. మళ్ళీ శాస్త్రమే మనకు తోడ్పడుతుంది. మనం ఈ జగత్తును సునిశితంగా పరిశీలిస్తే, ఒక అంశం గమనించి తీరుతాము. ఏమిటది? ఈ జగత్తంతా ఒక క్రమపద్ధతిలో, ఒక లయబద్ధంగా సాగుతున్నది. అంతా ప్రకృతి సూత్రాలననుసరించి బ్రహ్మాండంగా జరుగుతున్నది. ఆఖరికి ఒక ఉల్క ఎప్పుడు రాలిపడాలో కూడా ఒక నియంత్రణ ఉంటుంది. ఈ విశ్వంలో, అతి చిన్న సూక్ష్మక్రిమినుంచి అతి పెద్ద సూర్యునివరకూ అన్నింటికీ, ఈ జగత్తును ఒక అద్భుతసృష్టిగా నిరూపించటానికి, వాటి పాత్రపోషణ ఉంటుంది.

అసలు మనకు తెలిసిన, మన అనుభవంలోకి వచ్చే ఒక శిశువు జననం విషయమే తీసుకోండి. ఆ శిశువు తల్లి గర్భంలో ఉండగా, సరిగ్గా దానికెంత ఆహారం కావాలో, అంత ఆహారం తల్లినుంచి ఒక అందమైన పద్ధతిద్వారా, సహజంగా ఏర్పరచిన మార్గంద్వారా వెళుతుంది. దాన్ని బొడ్డు తాడు అంటారు. ఆ పాపాయికి, బాహ్యప్రపంచంలోకి అడుగుపెట్టగానే ఆ బొడ్డుతాడును కోసేస్తారు. పాపాయికి మనం తినే ఆహారం తిని జీర్ణించుకునే శక్తి ఉండదు. చాలా సుకుమారంగా ఉంటుంది. అప్పుడు తల్లిలో పాలు ఊరుతాయి. అది కూడా సరియైన సమయంలో. సరియైన ఉష్ణంతో ఉండటమే కాక, ఆ పాలలో శిశువుకు కావాల్సిన పోషణనిచ్చేవి, రోగ నిరోధక శక్తినిచ్చే విరుద్ధకణాలు కూడా ఉంటాయి. మానవ ప్రమేయం లేకుండా సహజంగా జరిగే జీవరసాయన అద్భుతం!

ఎప్పుడైతే ఈ సత్యాన్ని మనం గుర్తిస్తామో, ఎప్పుడైతే ఈ విశ్వాన్ని సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు అయిన పరమాత్మ నియంత్రించటంవల్ల అంతా క్రమబద్ధంగా, పొందికగా జరుగుతున్నదని గ్రహిస్తామో, అప్పుడే ఈ అవగాహనను మరి కొంచెం ముందుకు తీసుకువెళ్ళాలి. మనుష్యులందరికీ ఎల్లవేళలా జరిగే అన్ని అనుభవాలూ

ఈ విశ్వంలో ఒక భాగంగా పెనవేసుకుపోయాయి. దానికి మినహాయింపు ఉండే ఆస్కారమే లేదు.

జోరుగా వానకురిసి తగ్గాక, మనం రోడ్డుమీద నడుస్తుంటే, మన పక్కనుంచి దూసుకువెళుతున్న కారు, ఆ పక్కనే నిలిచి ఉన్న మురికి నీటిని మనమీదకి చిందించి మన బట్టలను తడిపి, మురికిగా చేయవచ్చు. ఏ అనుభవం కూడా, ఆఖరికి దారేపోయే కారు మనమీద మురికినీటిని చిందించటం అనే చిరాకు పుట్టించే అనుభవం కూడా, అనవసరంగా జరిగింది కాదు. అది అమోఘంగా సృష్టించబడిన ఈ విశ్వంలో అల్లబడిన ఒక అంతర్గత భాగం.

ఈ ప్రపంచంలో జరిగే ప్రతి ఒక్క అనుభవం కూడా ఒక నియంత్రణ ప్రకారం సాగుతున్నది. అందువల్ల ఏ అనుభవమైనా మనం అనవసరంగానో, కోరుకోనిదిగానో భావిస్తే, భావపరంగా మనం పరిపక్వత చెందలేదనీ, బుద్ధిపరంగా పొగరుగా ఉన్నామనీ అర్థం. ఒక అనుభవంయొక్క ప్రామాణ్యాన్ని కానీ, అవసరాన్ని కానీ మన కున్న అతి చిన్నబుద్ధితో సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు అయిన సాక్షాత్తూ పరమాత్మనే ప్రశ్నిస్తున్నాము.

విశ్వం అంతటా ఒక నియంత్రణ, ఒక క్రమబద్ధత ఉందన్న జ్ఞానంలో మనం నెలకొని ఉంటే, మనం ఒక మాట ఇవ్వాలి. 'ఏ అనుభవాన్ని కూడా నేను అనవసరమైన అనుభవంగా ఎన్నడూ పేర్కొనను. ప్రతి ఒక్క అనుభవాన్నీ కావాల్సిన అనుభవంగా పేర్కొంటాను. ఆ పరమాత్మ తల్లి పాలను శిశువుకు సరియైన సమయంలో ఎలా అమరుస్తాడో, అలా ఆ అనుభవాన్ని భగవంతుడు నాకోసం ప్రత్యేకంగా తీర్చిదిద్దాడని భావిస్తాను.'

మనం అనుభవించే ప్రతి ఒక్క అనుభవం కూడా కావాల్సిన అనుభవమే. జగత్కారణం అయిన పరమాత్మ మనకోసం ఆ అనుభవాన్ని ప్రత్యేకించి సృష్టించాడు. అది మన ఆధ్యాత్మిక పోషణకు, ఎదుగుదలకు అవసరం.

చిన్న పాపాయి పుట్టినప్పుడు, తండ్రి ఆ పాపాయిని తల్లి దగ్గరకు తీసుకువెళ్ళి, పాలిమ్మని వేడుకోవాలట.తల్లిపాలిస్తుండగా, తండ్రి ఈ క్రింది ప్రార్థన చేయాలట. 'ఓ దేవా! నువ్వు జగన్మాతవు. సరస్వతివి. మా శిశువుయొక్క ఆధ్యాత్మిక వ్యక్తిత్వాన్ని పాలనే అనుభవంతో పెంచి, పోషించు. మా పాపాయి తనకు కలిగే ప్రతి ఒక్క అనుభవాన్ని కావాల్సిన అనుభవంగా పరిగణించటం నేర్చుకోనీ; ఏ అనుభవాన్నీ కోరుకోని అనుభవంగా భావించకుండా ఉండనీ. (బృహదారణ్యకం) ఆ శిశువు

పెరిగి పెద్దవుతున్న కొద్దీ తనకు కలిగే ప్రతి ఒక్క అనుభవం కూడా తనకోసం సరస్వతీమాత ప్రత్యేకించి తీర్చిదిద్దిన అనుభవంగా (కోరుకున్న అనుభవంగా) భావించేలా తన బుద్ధికి పదును పెట్టుకోవాలి.

సంధ్యావందనంలో ప్రార్థన ఈ విధంగా ఉంటుంది: ఓ దేవీ! నువ్వు జగన్మాతవు.ఎలాగైతే నా తల్లి నాకు సరియైన సమయంలో,సరియైన ఆహారం ఇచ్చి నాకు పోషణనిచ్చిందో, అలాగే నువ్వు కూడా అనుభవాల ఆహారంతో నాకు పోషణనివ్వాలి.

ఈ అవగాహనతో, మనం అవస్థలను కలిగించే సన్నివేశాలను కోరుకోని అనుభవాలుగా బిరుదులివ్వము సరికదా, వాటిని మన ఆధ్యాత్మిక సాధనగా భావిస్తాము.

**ఇంద్రియార్థేషు వైరాగ్యమ్ అనహంకార ఏవ చ।**
**జన్మమృత్యుజరావ్యాధిదుఃఖదోషానుదర్శనమ్॥ -గీత 13-8**

జన్మ మృత్యు జరా వ్యాధులవల్ల కలిగే దుఃఖదోషాలను తప్పించుకోలేము. బృహదారణ్యకంలో ఒక ఖండం మొత్తం, రోగాలను, మరణాన్ని తపస్సుగా లేదా సాధనగా చూడమని చెబుతుంది.

**ఏతద్వై పరమం తపో యం ప్రేత్యమగ్నావభ్యాదధతి। -బృహ 5-11-1**

మృతదేహాన్ని అగ్నిలో అర్పించటం నిశ్చయంగా గొప్ప తపస్సు.

కోరుకున్న అనుభవం పొందుతున్నప్పుడు మన మనస్థితి ఎలా ఉంటుంది? ఆనందంగానే ఉంటుంది.

ఏకాదశి రోజు ఉపవాసం ఉండటం, శివరాత్రి రోజు రాత్రంతా జాగరణ చేయటం మనం కోరుకునే అనుభవాలు. అవి ఇష్టంగా చేస్తాము. కాని కొన్ని సందర్భాలలో మనకు ఆహారం దొరకకపోవచ్చు. (మనం ప్రయాణిస్తున్న రైలు బండి వరదల్లో ఎక్కడో పట్టాలమీద ఆగిపోవచ్చు) లేదా ఒక రాత్రంతా నిద్రపట్టకపోవచ్చు (రణగొణధ్వని చేస్తున్న పొరుగింటి వానివల్ల). ఇలాంటి పరిస్థితుల్లో ఎలా ప్రవర్తిస్తాము? మనం ఆధ్యాత్మికంగా ఎదగకపోతే, ఈ అనుభవాలను కోరుకోని అనుభవాలుగా ముద్రవేసి, వాటి ఫలితంగా చాలా బాధపడతాము. పైన చెప్పిన రెండు సందర్భాలలోనూ అనుభవం ఒకటే. కాకపోతే ఒకచోట మనం కోరుకున్నాము, ఇంకోచోట మనం కోరుకోలేదు. కోరుకున్నదానికేమో ఉపవాసం, జాగరణ అని పేర్లు పెట్టుకుని ఆనందించాము. కోరుకోనిచోట ఆకలికి

అలమటించిపోయాము, నిద్రకు కరువు వాచి పోయాము. దాని ఫలితంగా దుఃఖంలో మునిగిపోయాము. ఒకచోట ఆనందం; ఇంకోచోట దుఃఖం. ఎందుకు? ఆ తేడా పూర్తిగా మనం చూసే దృక్కోణంలోనే ఉంది.

మనం ఆధ్యాత్మిక మార్గంలో వెళ్ళేవారమయితే, మనం ఆధ్యాత్మిక పోషణకు విలువనిస్తే, మనకు జరిగే ప్రతి అనుభవాన్ని కోరుకున్న అనుభవంగానే పరిగణిస్తాము. దాని ఫలితం? నిరంతరం కోరుకున్న అనుభవాలనే పొందుతూ ఉంటాము. అందువల్ల నిరంతరం ఆనందంగానే ఉంటాము. మన నిఘంటువులో 'కోరుకోని అనుభవం,' అనే పదానికి చోటే లేదు. మనం ఎన్నడూ కోరుకోని అనుభవాన్ని పొందము అంటే అర్థం ఏమిటి? మనం ఎన్నడూ దుఃఖం పొందము. మనకు ఏమీ బాధలు ఉండవు. దేన్నీ ఎదుర్కోము. ఎప్పుడూ ఆనందంగా ఉండాలి, ఎన్నడూ దుఃఖాన్ని అనుభవించకూడదు అనుకుంటే, మన దృక్పథంలో జ్ఞానంతో కూడిన ఈ మార్పు ఒక్కటే మార్గం అంటున్నది మన శాస్త్రం.

ప్రతి ఒక్క అనుభవం కూడా కోరుకున్నదే. కోరుకోని అనుభవం అంటూ లేనే లేదు. ఈ జ్ఞానం పొందితే అది మన జీవితాన్ని ఆనందమయం చేయటమే కాక, భగవంతుని గురించిన మన దృక్పథాన్ని కూడా మారుస్తుంది. అలా మారకపోతే మనకు ఏ చిన్న బాధాకర సంఘటన జరిగినా కూడా మనం వెంటనే దేవుణ్ణి ప్రశ్నించటమో లేదా నిందించటమో చేస్తాము. ఇంకా కోపం ఎక్కువైతే దేవుణ్ణి శపిస్తాము కూడా. అదే మన దృక్కోణాన్ని మార్చుకుంటే, దేవునికి కృతజ్ఞతలు చూపించుకుంటాము. ఎందుకు? మనకు అనువైన అనుభవాలను ఇవ్వటంద్వారా దేవుడు మనకు పోషణనిస్తున్నాడని గ్రహిస్తాము.

అందువల్ల ఈ నూతన సంవత్సరం రోజున మనం ఈ విధంగా ప్రార్థిద్దాము. **'ఓ దేవా, నీకు నా కృతజ్ఞతలు. ఏ అనుభవమైనా కానీ, అది నేను కోరుకున్నదిగా భావించి, దానికి నేను స్వాగత వచనాలు పలుకుతాను.'** మన జీవితం ఆనందమయంగా సాగాలంటే, దీనితో పాటు ఆధ్యాత్మిక ఎదుగుదల కావాలంటే మనం ఈ జ్ఞానాన్ని పొందాలి.

# 39. ఆనందాన్ని ఏది ఇస్తుంది?

**జీవిత లక్ష్యం ఏమిటి?** మనుష్యులందరికీ, ఎటువంటి మినహాయింపు లేకుండా, ఒకటే ప్రాథమిక లక్ష్యం ఉంటుంది. దాన్ని ఆనందం అంటారు. కాని వచ్చిన చిక్కేమిటంటే, మనకు నిజంగా ఆనందాన్ని ఏది ఇస్తుందో తెలియదు. కొన్ని వస్తువులు ఆనందాన్ని ఇస్తాయని మనం భావిస్తాము కాని, నిజంగా, మన అనుభవాలను విశ్లేషించి చూస్తే, అది నిజం కాదని తేలుతుంది. సాధారణంగా అందరూ పడే పొరపాటు, ధనకనకవస్తువాహనాలు ఉంటే ఆనందం కలుగుతుందనుకోవటం.

కాని **'ధనం కారణం, ఆనందం కార్యం'** అనే వాక్యాన్ని విశ్లేషిస్తే, అది తార్కికంగా కుదరదని తెలుస్తుంది. ఎందుకంటే రెండు వస్తువుల మధ్య కార్యకారణ సంబంధం ఉంటే అది రెండు నిబంధనలకు సరిపోవాలి. అవి **అన్వయం, వ్యతిరేకం.** అన్వయం అంటే కారణం ఉంటే, కార్యం జరిగి తీరాలి. వ్యతిరేకం అంటే కారణం లేకపోతే కార్యం జరుగకూడదు.

ఒక విత్తనాన్ని కారణం అనుకుంటే, దాన్నుంచి వచ్చే చెట్టును కార్యం అనుకోవచ్చు. అందువల్ల విత్తనం ఉంటే, చెట్టు వస్తుంది. విత్తనం లేకపోతే చెట్టు రాదు. ఈ అన్వయవ్యతిరేక పద్ధతిద్వారా మనకు దేనివల్ల ఎలర్జీ వస్తుందో తెలుసుకోవచ్చు. ఒక కూర తింటే ఎలర్జీ వస్తోందని అనుకుంటే, ఆ కూర తినటం మానితే ఎలర్జీ రాకపోతే, ఆ కూర కారణం, ఎలర్జీ కార్యం అవుతుంది. ఇప్పుడు ఈ సూత్రాన్ని ధనం/ఆస్తులకు ఆనందానికీ వర్తింపజేస్తే, వీటి మధ్య కార్యకారణ సంబంధం లేదని తెలుస్తుంది. ఎందుకంటే ఇక్కడ అన్వయవ్యతిరేక సూత్రం వర్తించటం లేదు.

**మన చుట్టూ ఉన్నవారిని చూస్తే ఏం తెలుస్తుంది?** చాలా మందికి డబ్బు, ఆస్తిపాస్తులు ఉన్నాయి కాని ఆనందం లేదు. డబ్బు, ఆస్తులు సుఖాన్ని ఇస్తాయి కాని ఆనందాన్నివ్వవు. సుఖం శారీరక లక్షణం. ఆనందం మానసిక లక్షణం. సుఖం ఉంటే ఆనందం కలుగుతుందనుకోవటం పొరపాటు. అదే నిజమైతే, కొన్ని వందల సంవత్సరాల క్రితం అంటే వైజ్ఞానిక శాస్త్రం అంతగా అభివృద్ధి చెందక ముందు, మన తాతముత్తాతల జీవితం అవస్థగా ఉండి ఉండాలి. నేడు ఇన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉండటంవల్ల మనుష్యులు ఆనందంలో

తేలియాడాలి. కాని అలా లేదే? చాలామంది సుఖంగా బాధపడుతున్నారు. వారు చల్లగా ఏసి గదుల్లో కూర్చుని మరీ, బెంగపడుతున్నారు. మరికొందరు డబ్బు లేకపోయినా, ఆస్తి లేకపోయినా చాలా ఆనందంగా ఉంటున్నారు. డబ్బు, వస్తువులు ఏమీ లేకుండా ఎంతో ఆనందంగా ఉన్న జ్ఞానులగురించి శాస్త్రంలో చూస్తాము. దీన్నిబట్టి ఏం తెలుస్తోంది? డబ్బు, వస్తువులు ఆనందానికి కారణం కావు.

మరి అయితే **ఆనందానికి కారణం ఏమిటి?** దీనికి జవాబు మనిషి ఇంకా కనుక్కోలేకపోతున్నాడు. నిజానికి అదే మన సమస్య. మనం ఆనందాన్ని వెతుక్కునే ప్రయత్నంలో అనేక ప్రయోగాలు చేస్తూ పోతాము. ఉద్యోగం పొందుతాం, ఇల్లు మారుతాం, ఊరు మారుతాం. ఎందుకు? కొత్తచోటు ఆనందాన్ని ఇస్తుందేమోననే గట్టి ఆశతో వెళతాము. మనకు ఆనందహేతువు ఏదో తెలియటం లేదు కాబట్టి, శాస్త్రంలో వెతుక్కుంటే మంచిది. శాస్త్రం ఒక్కటే మన ఆనందానికి కారణాన్ని ఎత్తి చూపించగలదు.

**శాస్త్రం ఏం చెబుతుంది?** ఆనందానికి ఒక్కటే కారణం ఉంది అంటున్నది శాస్త్రం. ఏమిటది? అది **పుణ్యం.** పుణ్యం, ఆనందాల మధ్య మాత్రమే కార్యకారణ సంబంధం ఉంది. పుణ్యం ఒక్కటే ఆనందానికి కారణం. పుణ్యం చేసుకోకపోతే, డబ్బు ఉన్నా ఆనందం లేకపోగా, డబ్బు ఉండటం దుఃఖహేతువు అవుతుంది. దానికి బదులుగా, పుణ్యం ఉంటే, డబ్బు లేకపోయినా, సంతోషం కలుగుతుంది. అందువల్ల ఆనందాన్ని పెంపొందించుకోవాలంటే, ముందు ఆనందానికి కారణాన్ని, అంటే **పుణ్యాన్ని** పెంపొందించుకోవాలి.

**పుణ్యాన్ని పెంపొందించటం ఎలా?** పుణ్యాన్ని ఒక ప్రత్యేకమైన పద్ధతిలోనే పెంపొందించగలము. అది ఎలాగో, అది కూడా శాస్త్రంద్వారానే తెలుసుకోగలము. ధర్మపరమైన జీవన విధానంద్వారానే పుణ్యాన్ని పెంపొందించగలమని శాస్త్రం చెపుతున్నది. ధర్మపరమైన జీవనం పుణ్యాన్నిస్తే, పుణ్యం ఆనందాన్నిస్తుంది, సౌఖ్యాలు ఉన్నా లేకపోయినా కూడా. అంటే సౌఖ్యాలు ఉన్నా లేకపోయినా, ఆనందంగా ఉంటాము.

**ధర్మపరమైన జీవితం అంటే ఏమిటి?** అది చాలా పెద్ద అంశం. ధర్మశాస్త్రం మొత్తం దాని గురించి వివరంగా చెబుతుంది. వేదాలు కూడా చర్చిస్తాయి ఈ అంశాన్ని. ధర్మశాస్త్రాన్ని రెండు ముక్కల్లో చెప్పాలంటే, ఉన్నతమైన చర్యలు, ఉన్నతమైన విలువలు.

**ఉన్నతమైన చర్యలు ఏవి?** ఈ అంశం చాలా వివరంగా చర్చించబడింది శాస్త్రంలో. వ్యాసాచార్యులవారు ఉన్నతమైన చర్యల సారాంశాన్ని అర్థశ్లోకంలో ఇచ్చేశారు. ఇతరులకు ప్రయోజనకరంగా ఉండే చర్యలు (మనకు ప్రయోజనకరంగా ఉన్నా లేకపోయినా) ఉన్నత చర్యలు అంటారు. ఇతరులకు ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని, హాని కలుగచేసే చర్యలు **పాపం** తెగకిందకు వస్తాయి. అందువల్ల ధర్మపరమైన జీవితం గడపటమంటే ఇతరులకు ప్రయోజనకరమైన చర్యలు చేయటం, ఇతరులకు హానికరమైన చర్యలను చేయకపోవటం.

**ఉన్నతమైన విలువలు ఏవి?** ఈ అంశం విపులంగా భగవద్గీతలో, పురాణాల్లో, వేదాల్లో చర్చించబడింది.

**త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః।**
**కామః క్రోధస్తథా లోభః తస్మాదేతత్త్రయం త్యజేత్॥ గీత 16-21**

దుఃఖాన్ని పారద్రోలి, ఆనందాన్ని అనుభవించాలంటే, మనలో ఉన్న మూడు సహజప్రవృత్తులను పారద్రోలాలి అని చెబుతున్నాడు శ్రీకృష్ణపరమాత్మ. ఈ మూడు గుణాలు మన అందరిలో సహజంగా ఉన్న బలహీనతలు. మనం కొత్తగా ఏర్పరచుకున్న ప్రత్యేకమైన బలహీనతలు కావు.

అందువల్ల ఈ మూడింటినీ మనం అదుపులో పెట్టుకోగలిగితే, మన జీవితం విలువలతో కూడినదై ఉంటుంది. ఏమిటా మూడు బలహీనతలు? **కామ, క్రోధ, లోభాలు.** అంటే కోరిక, కోపం, అత్యాశ.

**కామాన్ని నియంత్రించటం ఎలా?** మన కోరికలన్నింటి విషయాల్లో మూడు నిబంధనలు పాటించగలిగితే, కామాన్ని నియంత్రించవచ్చు. ఏమిటా మూడు నిబంధనలు? ముందుగా, మన కోరికలు, చట్టబద్ధంగా, నైతికంగా, సవ్యంగా ఉండాలి. అవి అనైతికంగా, చట్టవ్యతిరేకంగా ఉండకూడదు. పిల్లలు బాగా చదవాలని, జీవితంలో పైకి రావాలని ఏ తల్లిదండ్రులకైనా కోరిక ఉంటుంది. అటువంటి కోరిక ఉండటం తప్పు కాదు, చట్టవ్యతిరేకమూ కాదు.

రెండవ నిబంధన, కోరికలు తక్కువగా ఉండాలి. అంతులేని కోరికలు ఉంటే, జీవితకాలమంతా వాటిని తీర్చుకోవటంలోనే సరిపోతుంది. దైవ చింతనకు కాని, శాస్త్ర అధ్యయనానికి కాని తీరికే ఉండదు. ఆధ్యాత్మిక జీవనం వైపు మొగ్గు చూపలేము. అందుకని, ఆధ్యాత్మిక జీవనాన్ని గడపటానికి సమయం దొరికేందుకు వీలుగా కోరికలను తగ్గించుకోవాలి.

మూడవ నిబంధన, మన కోరికలు మనను కట్టిపడేసేవిగా ఉండకూడదు. అంటే మనను కట్టిపడేసే కోరికలైతే అవి తీరకపోతే, మనం బాధపడతాము. అవే బంధించని కోరికలైతే , అవి తీరినా, తీరకపోయినా బాధపడము. దీన్ని కామంనుంచి విషాన్ని తీయటం అంటారు. **కామాన్ని నియంత్రించటం సంతోషంద్వారా చేయవచ్చు.**

**క్రోధాన్ని నియంత్రించటం ఎలా?** కోపం రెండు రకాల సమస్యలను సృష్టిస్తుంది. ముందుగా, అది ఉధృతంగా వ్యక్తమవుతుంది. అది ఎదుటివారిని బాధిస్తుంది. అది హింసకు దారితీస్తుంది. శాస్త్రం ప్రకారం, హింస అనేది మహాపాపం. రెండోరకం సమస్య, కోపాన్ని ప్రకటించకుండా, దిగమ్రింగుకుంటే, అది కూడా ప్రమాదకరమే. ఎందుకంటే అది లోపల అణగద్రొక్కబడుతుంది. అలా లోపలే అణగద్రొక్కబడిన కోపం మానసిక, శారీరక రుగ్మతలకు దారితీస్తుంది.

కోపాన్ని ప్రకటిస్తే, బాధిస్తుంది; ప్రకటించకపోతే, ఇంకా బాధిస్తుంది. ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా ఉంది పరిస్థితి. అప్పుడేం చేయాలి? తీవ్రరూపం దాల్చని కోపాన్ని ప్రకటించగలిగేటట్టు మనను మనం తీర్చిదిద్దుకోవాలి. ఇతరులను బాధించకుండా, కోపాన్ని ప్రదర్శించటమెలాగో నేర్చుకోవాలి. మరీ తప్పని పరిస్థితుల్లో ఇతరులను బాధపెట్టక తప్పదేమో కాని, ఆ పరిస్థితి రాకుండా చూసుకోవాలి.

అందువల్ల క్రోధాన్ని నియంత్రించటమంటే, తీవ్రరూపం దాల్చని కోపప్రకటన. ఒక ఉత్తరం రాసి, తర్వాత దాన్ని చించిపారేయవచ్చు. లేదా సముద్రపుటొడ్డుకి వెళ్ళి, గట్టిగా అరవవచ్చు. ఇవన్నీ తీవ్రరూపం దాల్చని కోపప్రకటనలు, అవి బ్రహ్మాండంగా పనిచేస్తాయి. ఒక రాజకీయ పార్టీ ఇంకొక రాజకీయ నాయకునిమీద కోపం కొద్దీ అతని దిష్టిబొమ్మను తగులబెట్టిందని అప్పుడప్పుడూ వార్తాపత్రికల్లో చూస్తాము. అది కూడా తీవ్రరూపం దాల్చని కోపమే. **క్రోధాన్ని నియంత్రించటం క్షమద్వారా చేయవచ్చు.**

**లోభాన్ని నియంత్రించటమెలా?** లోభం అంటే నాది అనే భావన. నాది అనుకునేసరికి పీనాసితనం, డబ్బు ఖర్చుపెట్టకపోవటం, అల్పబుద్ధి వగైరా గుణాలు తోడవుతాయి. లోభాన్ని నియంత్రించటం అంటే మనకున్న వాటిని ఇతరులతో పంచుకోవటం నేర్చుకోవటం– అది సమయం కావచ్చు, జ్ఞానం కావచ్చు, డబ్బు కావచ్చు. వాటిని అవసరమున్న వారికి పంచాలి. మనది అనుకుంటున్నదేదీ మనది

కాదు. ఆఖరికి మన శరీరం కూడా మనది కాదు. అన్నీ ఆ పరమాత్మ మనకు తాత్కాలికంగా, కొంతకాలం వాడుకోమని ఇచ్చిన కానుకలే. ఆ పరమాత్మకు ఎప్పుడు బుద్ధిపుడితే, అప్పుడే మనకు ఇచ్చినదేదైనా వెనక్కి తిరిగి తీసుకోగలడు. మనం వీటికి ధర్మకర్తలు అనుకోవటం పెంపొందించుకోవాలి. మనవి అనుకునే వస్తువులకు మనం ధర్మకర్తలం మాత్రమే. **లోభాన్ని నియంత్రించటం దానగుణం ద్వారా చేయవచ్చు.**

**అందువల్ల మనం ఏం చేయాలి?** కామ, క్రోధ, లోభాలను నియంత్రించ గలగాలి. మన చర్యలన్నీ ఉన్నతంగా ఉండాలి. కామ, క్రోధ, లోభాలను అదుపులో పెట్టుకుని (దైవీసంపత్తిని పెంచుకుని) ఉన్నత చర్యలను చేస్తే, ధర్మపరమైన జీవనం అవుతుంది. ధర్మపరమైన జీవనం పుణ్యాన్నిస్తుంది. **పుణ్యం తిరిగి ఆనందాన్ని కలుగచేస్తుంది.**

## స్వామీజీ సూక్తిముక్తావళి

వయస్సు పెరిగేకొద్దీ కొన్ని సహజంగా మాయమవుతాయి. మన జుట్టు, దంతాలు వగైరా. కాని అజ్ఞానం ఒక్కటే దానంతట అది పోదు. జ్ఞానం పొందితేనే అజ్ఞానం మటుమాయమవుతుంది.

పంచె కట్టుకున్న ఒక వ్యక్తి కారులో వెళుతున్న వ్యక్తిని సాగనంపటానికి వచ్చాడు. వెళుతున్న కారులో అతని పంచె చిక్కుకుపోయింది. వెంట పరుగెత్తి అందుకోలేకపోతున్నాడు. అయితే ఏం చేయాలి? పంచెను వదిలివేయటమే! అలాగే మనస్సుపెట్టే చికాకుల వెంట పరిగెత్తి వాటిని అందుకోలేము. దానికి మార్గం– మనస్సును వదిలివేయటమే! అంటే నేను మనస్సు కాదు, నేను సాక్షిచైతన్యం అని తెలుసుకోవటమే!

# 40. దోషపరిహారాష్టకమ్

## శ్రీ శ్రీధర వేంకటేశాచార్యుల రచన

**అన్యస్య దోషగణనాకుతుకం మమైతత్।**
**ఆవిష్కరోతి నియతం మయి దోషవత్త్వమ్।**
**దోషః పునర్మయి న చేదఖిలే సతీశే।**
**దోషగ్రహః కథముదేతు మమేశ తస్మిన్॥ ॥1॥**

**హే ఈశా –** ఓ దేవా

**అన్యస్య దోషగణనాకుతుకమ్ –** ఇతరుల దోషాలు లెక్కపెట్టే ఆనందం నాలో ఉంది.

**ఆవిష్కరోతి నియతమ్ –** అలా తప్పులెన్నితే అది నాలో ఉన్న ఒక విషయాన్ని వెల్లడి చేస్తుంది. ఏమిటది?

**మయి దోషవత్త్వమ్ –** నా దోషాన్ని ఎత్తి చూపుతుంది. ఎలా?

**త్రిభువనవపుశం విష్ణుమీశం నమామి**

భగవానుడు అంతటా ఉన్నాడని మన మతం నేర్పిస్తుంది. ఆ ఈశ్వరుడు ఎలా ఉంటాడు? నిర్దోష ఈశ్వరునిగా.

కాని నేనేం చేస్తున్నాను?

**నిర్దోష ఈశ్వర దోష దర్శనరూప అధ్యాసః ఏవ మమ దోషః**

నా దోషం ఏమిటంటే నిర్దోష ఈశ్వరునిలో దోషం చూస్తున్నాను.

**ఈశః అఖిలే సత్ –** అంతటా ఈశ్వరుడే ఉన్నాడు.

**దోషగ్రహః కథమ్ ఉదేతు మమ ఈశ తస్మిన్ –** అంతటా ఈశ్వరుడే ఉండగా, నేను దోషాన్ని చూస్తున్నానంటే– తప్పు ఎక్కడ ఉన్నది?

**దోషః మయి ఏవ–** నాలోనే ఉంది. నాలో దోషం లేకపోతే నేను ఈశ్వరునిలో దోషం చూడలేను.

ఈ విధంగా మొదటి శ్లోకాన్ని మతపరంగా వివరించాడు రచయిత.

**ఏషా వ్యథేతర కృతేతి మమేశ తస్మిన్।**
**కోపో యది స్వ పర కామముఖప్రసూతా।**
**సేయం వ్యథేతి మయి మే న కథన్ను కోపః।**
**స్వస్య వ్యథా స్వదురితప్రభవా హి సర్వా॥ ॥2॥**

**ఏషా వృథా ఇతర కృతా –** నాకు ఎదుటివారు సమస్యలను సృష్టిస్తున్నారు అంటాను నేను.

**ఇతి మమ ఈశ తస్మిన్ కోపః –** ఈ విధంగా ఈశ్వరునితో చెబుతున్నాడు.

పైన మతపరంగా చెపితే ఇక్కడ తర్కం ఉపయోగిస్తున్నాడు. ఏమిటది? నాకు ఎవరు సమస్యలు సృష్టిస్తే, వారిమీద నాకు కోపం వస్తుంది. నాలో అనేక లోపాలు ఉన్నాయి. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు ఉన్నాయి. అలాగే రాగద్వేషాలు ఉన్నాయి. వీటన్నింటినీ నా మనస్సు సృష్టించి నాకు సమస్యలను సృష్టిస్తోంది. బాధలను కలుగచేస్తోంది. కాని ఎప్పుడైనా ఓ మనసా ఎందుకు నాకు రాగద్వేషాలను కలుగచేస్తున్నావు అని నిలదీశామా? స్వదోషాలు ఏమిటి?

**పరకామముఖప్రసూతా–** పరుల విషయంలో కామక్రోధాది దోషాలు చూస్తే,

**సేయం న కథం న కోపః –** నా లోపాలమీద నాకెందుకు కోపం రావటం లేదు. ఎందుకంటే–

**స్వస్య వృథా స్వదురిత ప్రభవా –** ఎందుకంటే నేను అనుభవిస్తున్నవి నేను కోరి తెచ్చుకున్నవే – ఇప్పుడో, గతంలోనో. అదంతా నా ప్రారబ్ధకర్మ. అందువల్ల నేను నామీదే కోపం చూపాలి కాని ఇతరులమీద కాదు.

**కామభృత్యఖిలదోషనిధేర్మమైష।**
**మయ్యాహ దోషమితి కో ను దురాగ్రహోఽస్మిన్।**
**హేయత్వమాలపతి యోఽయమలం న కేన।**
**వార్యోఽథ సత్త్వవతి సోఽయమసత్క్రమాహ॥ ॥ 3॥**

నేను ఇతరుల దోషాలు ఎత్తి చూపితే వారు నా దోషాలు ఎత్తి చూపుతారు. ఈ శ్లోకం ఇతరులని సమర్థిస్తుంది. వారు ఎందుకు నా దోషాలు ఎత్తి చూపుతున్నారు? నాలో దోషాల నిధి ఉంది.

**కామభృత్యఖిలదోషనిధేర్మమైష –** కామ క్రోధాది సర్వదోషాలు నాలో చాలా ఉన్నాయి. నిధిలో ఐశ్వర్యం ఉంటే, నాలో ఈ దోషాలనే ఐశ్వర్యం ఉంది. నా దగ్గరగా నిలబడి ఉన్న ఒకతను నన్ను చూపిస్తూ విమర్శిస్తున్నాడు. ఏమని?

**మయి దోషమ్ ఆహ–** నేను దోషభూయిష్టంగా ఉన్నాను.

**దురాగ్రహః అస్మిన్ కో ను–** నా కెందుకు అతనిమీద కోపం? అతను నిజమే చెబుతున్నాడు.

**హేయత్వమాలపతి –** నా దగ్గరకి వెళ్ళవద్దని ప్రచారం చేస్తున్నాడు.

**కేన వార్యః** – అలా చెబుతుంటే, అతన్ని ఎలా ఆపగలను? నా నిధులు అతన్ని అలా పలికిస్తున్నాయి.

**సత్త్వవతి సోఽ యమసత్కి మాహ** – నాలో లేని దాని గురించి అతను చెప్పలేదు. అందువల్ల అతనిమీద ఎలా కోపం తెచ్చుకోగలను? అతను నన్ను అంటున్నాడని నేను కూడా అతన్ని విమర్శించకూడదు.

**యః సంశ్రితః స్వహిత ధీర్వ్యసనాతురః తత్,**
**దోషస్య తం ప్రతి వచోఽస్తు తదన్యదోషమ్।**
**యద్వచ్మి తన్మమ న కిం క్షతయే స్వదోష।**
**చిన్తైవ మే తదపనోదఫలోచితాతః॥ ॥ 4 ॥**

ఈ శ్లోకంలో ఎదుటివారిని విమర్శించే హక్కు ఈ మూడు నిబంధనల్లో ఏదైనా ఉంటేనే ఉంటుందని చూపుతున్నాడు. ఏమిటవి?

నిబంధన 1 – **యః సంశ్రితః** – నా దగ్గరకి నా సలహా కోరుతూ, శిష్యునిగానో, పుత్రునిగానో, నిస్సహాయునిగానో వస్తేనో,

నిబంధన 2 – **స్వహిత ధీః** – 'నాలో లోపాలున్నాయి. నన్ను దిద్దండి,' అని అతనే స్వయంగా కోరితేనో

నిబంధన 3 – **వ్యసనాతురః** – ఏదైనా దోషంవల్ల అతను అవస్థ పడుతుంటేనో నేను సలహా ఇవ్వగలను. అతను కోరాడు కాబట్టి, నాకు అనుమతినిచ్చాడు కాబట్టి. అది కూడా ఒంటరిగా ఉన్నప్పుడు ఇవ్వాలి.

**తత్ దోషస్య తం ప్రతి వచః** – అతని అనుమతితో అతని లోపాన్ని ఎత్తి చూపవచ్చు. కాని అలాంటి అవకాశం ఎవరు ఇస్తారు? ఎవరూ ఇవ్వరు.

**తదన్య దోషం యత్ వచ్మి** – నేను ఒకరి దోషం గురించి ఇంకో వ్యక్తితో చెపితే,

**తత్ మమ న కిం క్షతయే**– అది నాకు నష్టం కలుగచేయదా?

అందువల్ల నాకు ఒకటే మార్గం ఉంది.

**స్వదోష చిన్తైవ మే**– నా దోషాల గురించి ఆలోచించాలి.

నూతన సంవత్సరంలో మొట్టమొదటగా చేయాల్సిన పని ఇదే!

అలాగని దోషాలన్నింటినీ చూసుకుని ఆత్మన్యూనతా భావంతోనో, అవమానంతోనో, దిగులుతోనో క్రుంగిపోవద్దని హెచ్చరిస్తున్నాడు రచయిత.

**తత్ అపనోద ఫల ఉచిత అతః** – నాకీ దోషం ఉంది, దాన్ని ఎలా పోగొట్టుకోవాలి అని మార్గాలు వెతుక్కోవాలి. అంటే అంతర్మథనం చేసుకోవాలి.

**దోషం పరస్య నను గృహ్ణాతి మయ్యనేన।**
**స్వాత్మైష ఏవ పరగాత్రసమాహృతేన।**
**దుర్వస్తునేవ మలినీక్రియతే తదన్య।**
**దోష గ్రహాదహహ కిం న నివర్తితవ్యమ్॥ ॥ 5 ॥**

ఇలా తప్పులెన్నుతూ పోతే నా మనస్సెలా ఉంటుంది? నా చేత్తో చెత్తను ముట్టుకుంటే చేయి ఎలా చెత్తగా అవుతుందో, అలా నా మనస్సులో చెత్తను చూస్తే నా మనస్సు కూడా చెత్తగా అవుతుంది.

**పరస్య దోషం గృహ్ణాతి మయి–** ఎదుటి వారి దోషాలను నేను ఎప్పుడూ ఎత్తి చూపుతుంటే–

**ఏష స్వాత్మా మలినీక్రియతే –** నా మనస్సే మలినంగా అవుతుంది. ఎలా?

**పరగాత్రసమాహృతేన దుర్వస్తునేవ –** అది నా చేత్తో మురికి వస్తువును పట్టుకున్నట్టు అవుతుంది. అంటువ్యాధి లాగా అతని దోషాలు నాకు కూడా అంటుకుంటాయి. అందువల్ల–

**తదన్యదోష గ్రహాత్–** ఇతరుల దోషాల గురించి నేను మాట్లాడకుండా ఉండలేనా?

**నిర్దోషభావమితరస్య సదోషభావం।**
**స్వస్యాపి సంవిదధతీ పరదోషధీర్మే।**
**ఆస్తామియం తదితరా తు పరార్తిమాత్ర।**
**హేతుర్వ్యనక్తు న కథం మమ తుచ్ఛభావమ్॥ ॥6॥**

ఎవ్వరికీ నీలో దోషాలు ఉన్నాయి అని చెప్పించుకోవటం ఇష్టం ఉండదు. అందువల్లనే రచయిత తెలివిగా తన దోషాలనే ఎత్తి చూపుకుంటున్నాడు. ఓ దేవా, నా మనస్సు అశుద్ధంగా ఉంది అంటున్నాడు.

**ఇతరస్య సదోషభావమ్ –** ఇతరులలో దోషం చూస్తున్నాను.

**స్వస్య నిర్దోషభావమ్ –** నాలో దోషం లేదంటున్నాను.

**పరదోష ధీః మే–** నాకు అలా దోషభూయిష్టమైన ప్రవర్తన ఉంది.

నేను ఇతరుల దోషాలను ఎత్తి చూపితే, నేను ఉన్నతుణ్ణి అనుకుంటున్నాను. కాని అది నన్ను కిందకి దిగజారుస్తుంది.

**మమ తుచ్ఛభావం వ్యనక్తు–** అది నా తుచ్ఛభావాన్ని ఎత్తి చూపుతుంది.

**పద్మాదిసౌరభ ఇవ భ్రమరస్య హర్షమ్।**
**హిత్వాన్యదీయసుగుణే పునరన్యదోషే।**
**హర్షో దురర్థ ఇవ గేహకిటేః కిమాస్తే।**
**హా మే కదేశ కృపయా విగలేత్స ఏషః॥ ॥7॥**

చాలా అద్భుతమైన పోలికలు. ఎదుటివారిలో మంచి గుణాలు చూస్తే ఎలా ఉంటుంది? చెడు లక్షణాలు చూస్తే ఎలా ఉంటుంది?

**భ్రమరస్య హర్షమ్–** పూలనుంచి తేనెటీగ తేనెను సేకరించినట్టుగా

**అన్యదీయ సుగుణే –** ఎదుటివారిలోంచి సగుణాలనే సేకరించాలి.

**గేహకిటేః ఇవ –** రచయిత నిష్కర్షగా విమర్శిస్తున్నాడు. ఎదుటివారిలో దోషాలెన్నితే బురదలో దొర్లే మగపందిలాంటి వాణ్ణి నేను.

**దురర్థ అన్య దోషే హర్షమ్–** ఇతరుల దోషాలను ఎత్తి చూపటం తప్పు.

**హా మే కద ఈశ –** ఓ దేవా! ఈ నూతన సంవత్సరంలో నేను దోషాలు ఎన్నకుండు గాక!

**కృపయా విగలేత్స ఏషః –** నీ కృపవల్ల ఇతరులను విమర్శించే ఈ లక్షణాన్ని నేను పరిత్యజింతును గాక!

**దోషే స్వభాజి మతికౌశలమన్యభాజి।**
**మౌఢ్యం గణేఽన్యజుషి హర్షభరః స్వభాజి।**
**అస్త ప్రసక్తిరఖిలేషు దయాత్యుదార।**
**వృత్త్యోర్జితో మమ కదాఽస్తు హరానురాగః॥ ॥8॥**

మనం పెంపొందించుకోవాల్సిన గుణాలను నొక్కివక్కాణిస్తున్నాడు రచయిత. అవి మనం ఈ నూతన సంవత్సరంలో పెంపొందించుకుంటే బాగుంటుంది. ఆరు గుణాలు చెబుతున్నాడు.

**1. స్వభాజి దోషే మతి కౌశలమ్ –** నా తప్పులను వెతికి పట్టుకునే బుద్ధి కుశలత ఉండుగాక.

**2. అన్యభాజి దోషే మౌఢ్యమ్–** ఇతరుల దోషాల విషయంలో మందబుద్ధి కలిగేలా చేయి.

**3. అన్యజుషి గణే హర్షభరః –** ఇతరుల గుణాలను కీర్తించేలా.

**4. స్వభాజి అస్త ప్రసక్తిః –** నా గుణాల గురించి గొప్పలు చెప్పుకోకుండా చేయి

**5. అఖిలేషు దయాత్యుదార –** తక్కిన వారి దోషాల గురించి చెప్పకుండా ఉండే ఉదారబుద్ధినియ్యి.

**6. హర అనురాగః –** ఓ హరీ! హరా! నీమీద ప్రేమ ఉండేలా చేయి.
**మమ కదా అస్తు** హే ఈశ్వర – ఎప్పుడు నాకు ఈ సుగుణాలు వస్తాయి?
ఈ క్షణంనుంచే నాకీ గుణాలను ప్రసాదిస్తే నేను చాలా ఆనందిస్తాను.

దీనిద్వారా స్వామీజీ నూతన సంవత్సర సందేశం చెప్పారు.

# స్వామీజీ సూక్తిముక్తావళి

నాకు నచ్చిన వస్తువు, వెళ్ళిపోయినా, వెళ్ళిపోబోతున్నా, వెళ్ళిపోతుందనుకున్నా నాకు బాధ కలుగుతుంది. నాకు నచ్చని వస్తువు వచ్చినా, రాబోతున్నా, వస్తుందనుకున్నా నాకు బాధ కలుగుతుంది. రాగవిషయం వెళుతూ బాధపడితే, ద్వేషవిషయం వస్తూ బాధ పెడుతుంది.

బ్రహ్మజ్ఞానంవల్ల కొత్త అనుభవం కలుగదు. ఉన్న అనుభవం మారదు. నిజానికి మనం పొందే ప్రతి అనుభవమూ బ్రహ్మ అనుభవంవల్లనే కలుగుతుంది. బ్రహ్మజ్ఞానం అంటే ఏమిటి? బ్రహ్మజ్ఞానం అంటే అర్థం చేసుకోవటంలో కలిగే మార్పు. మారుతున్న ప్రతి అనుభవం వెనకా మారని చైతన్యం ఉంది. మన దృష్టిని మారే అనుభవంనుంచి మారని చైతన్యం వైపు మరల్చాలి.

మిమ్మల్ని మీరు ఎన్నడూ కించపరచుకోవద్దు. 'నేనెలా తట్టుకోగలను? నేనెలా తట్టుకోగలను?' అనవద్దు. మీమీద మీరు శ్రద్ధ పెంచుకోండి. అది మీలో, అనంతమైన వనరులతో, శక్తిరూపంలో కొలువై ఉన్న భగవంతునిమీద మీ శ్రద్ధమీద ఆధారపడి ఉంటుంది. భగవంతుడు సర్వశక్తివంతుడు. ఆయన ఎంతన్నా శక్తినివ్వగలడు. ఆ శక్తికి పరిమితులు ఉండవు.

# 41. అర్థవంతమైన జీవనానికి మూడు బంగరుసూత్రాలు

సూర్యుడు క్రమం తప్పకుండా ఉదయిస్తున్నాడు, అస్తమిస్తున్నాడు. ఒక్కొక్కరోజు ఉదయించినకొద్దీ రోజులు గడిచిపోతున్నాయి అని వస్తుంది వైరాగ్యషట్కంలో. రోజులు ఎంత క్రమపద్ధతిలో, ఎంత త్వరగా గడిచిపోతున్నాయంటే, మనం ఆ విషయం గమనించటం లేదు. రోజులు గడిచినకొద్దీ మనకు వయస్సు పెరుగుతుంది, ఆయుష్షు తగ్గుతుంది. కాని మన పరుగుపందెంలో ఈ విషయం గమనించే తీరిక లేకుండా ఉన్నాము. నూతన సంవత్సరం వచ్చిందంటే ఏమిటి? ఇంకో కొత్త సంవత్సరం వచ్చింది, ఒక పాత సంవత్సరం జరిగిపోయింది. యమధర్మరాజుకు మరో అడుగు దగ్గరకి వేస్తున్నాము. మన పేరు ఇవాళ మరణించిన వారి జాబితాలో లేకపోవచ్చు కాని, ఆ రోజెంతో దూరంలో లేదు. మనం ఇప్పటికే క్యూలో నిలుచుని ఉన్నాము.

ఈ దుఃఖాన్ని తప్పించుకోవాలంటే, ఒకటే మార్గం ఉందంటున్నాడు భర్తృహరి- మంచిపనులను ఎప్పుడో చేద్దామని కాలయాపన చేయకండి. వేదాంతశాస్త్రం ఎప్పుడో రిటైరయ్యాక, అన్నిపనులూ పూర్తి చేసుకున్నాక, చేయవచ్చులే అనే భ్రమలో ఉంటాము మనం. కాని అప్పుడు మన శరీరం, ఇంద్రియాలు సహకరించవు అంటున్నాడు భర్తృహరి. కళ్ళు కనబడవు, చెవులు వినిపించవు.

తెలివైన వ్యక్తి, ముందుచూపు ఉన్న వ్యక్తి, పరిణతి చెందిన వ్యక్తి ఇంద్రియాలు చక్కగా పనిచేస్తుండగానే, వృద్ధాప్యంమీద పడకముందే, ఆరోగ్యకరమైన, ఐశ్వర్యవంతమైన, ఫలవంతమైన జీవితం గడపటానికి కావాల్సిన ఏర్పాట్లు చేసుకుంటాడు. **దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి** అన్నారు పెద్దలు. అలాగే, ఆరోగ్యం బాగుండగానే, యవ్వనంలో ఉండగానే మన జీవితం అర్థవంతమయ్యేటట్టు చూసుకోవాలి.

ఒకపక్క ఇల్లు కాలుతుంటే, అప్పుడు బావి తవ్వాలనుకోవడం తెలివితక్కువ పని. అంతే తెలివితక్కువ పని, అవసాన దశలో మంచిపనులు చేయాలనుకోవటం. ఇప్పుడే, ఇక్కడే మొదలుపెట్టాలి. మంచిపనులు చేయటానికి ఏదైనా మంచిరోజు

కావాలనుకుంటే, నూతన సంవత్సర తొలిరోజు చాలా శుభప్రదమైనది. ఇంతకన్నా మంచిరోజు ఏం ఉంటుంది?

మన జీవితాన్ని అర్థవంతం చేయటానికి ఏం చేయాలి? శాస్త్రం మూడు విషయాలు నొక్కివక్కాణిస్తుంది– యజ్ఞం, దానం, తపస్సు. భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ వీటి గురించి ప్రత్యేకంగా చెబుతాడు.

**యజ్ఞం–** యజ్ఞం అంటే దైవపూజ. మనమందరం నిత్యపూజలు చేస్తాము, ఆలయాలకు వెళతాము. అభిషేకాలు చేయిస్తాము. శ్రీకృష్ణ పరమాత్మ అంతకన్నా ఉన్నతమైన, సంస్కరించబడిన పూజ గురించి చెబుతున్నాడు. జీవితాన్నే ప్రార్థనగా మలచుకోవటం, 'నీ జీవితాన్ని, నీ జీవితవిధానాన్ని పరమాత్మకు అర్పించు.' స్వామీ చిన్మయానంద అద్భుతంగా చెప్పేవారు– 'మనకున్న ఈ జీవితం ఆ పరమాత్మ ఇచ్చిన ఒక అద్భుతం. ఈ జీవితాన్ని కానుకగా మనం పరమాత్మకు తిరిగి అర్పించాలి.' ఈ జీవితం పరమాత్మ ఇచ్చిన కానుక అయితే, ఎటువంటి జీవితం అయి ఉండాలి యిది? నిస్సందేహంగా అత్యంత గొప్పది అవాలి. అటువంటి కానుకను మనం ఎలా తిరిగి ఇవ్వాలి? ఆనందంగా, చిరునవ్వుతో అర్పించాలి. జీవితాన్ని అద్భుతంగా గడపాలి. ఆ విధంగా రెండు నియమాలను పాటించాలి. మనం తిరిగి ఇచ్చే కానుక అద్భుతంగా ఉండాలి; ఆ కానుకను ఉల్లాసంగా, ఉత్సాహంగా అర్పించాలి.

మన జీవితం అద్భుతంగా గడవాలి. అంటే ఏమిటి దీని అర్థం? అంటే ధనం, పేరు ప్రఖ్యాతులు, విజయం సాధించటం కాదు. అద్భుతం అంటే అత్యంత హృదయపూర్వకంగా గడిపిన జీవితం. మనకు ఎంతో ప్రీతికరమైన దాన్ని చేయగలగాలి; మనం చేసి తీరాల్సిన దాన్ని ఎంతో ప్రీతికరమైన దానిగా భావించగలగాలి; ఇలా గనుక మనం చేయగలిగితే, మనం చేసే పనులకు మన మనస్సు తోడవుతుంది. అప్పుడు ఆ పనులను మనస్ఫూర్తిగా చేయగలుగుతాము. ఇదే మనం పరమాత్మకు తిరిగి ఇవ్వగలిగిన గొప్ప కానుక.

ముఖ్యంగా ఆనందంతో చిందులు వేయాలి. ఎటుచూసినా కష్టాలు కనపడుతుంటే, ఆనందంతో ఎలా చిందులు వేయాలి అనవచ్చు మీరు. కాని ఒక్కసారి ఆలోచించండి, మీరు చిరాగ్గా ఉన్నా, ఉత్సాహంగా ఉన్నా పరిస్థితిలో ఏమీ మార్పు ఉండదు. అలాంటప్పుడు ఉత్సాహంగా ఉండవచ్చు కదా! ఒక గ్లాసులో సగం వరకూ నీళ్ళు ఉంటే, గ్లాసు సగం నిండి ఉంది అనవచ్చు, లేదా

సగం ఖాళీగా ఉంది అనవచ్చు. అలాంటప్పుడు గ్లాసు సగం నిండి ఉంది అని ఎందుకు అనకూడదు? సానుకూల పద్ధతిని ఎందుకు పాటించకూడదు? మనకు చేయటానికి ఇష్టమైన దాన్ని ఆనందించటం; మనం చేసితీరాల్సిన దాన్ని మనకు ఇష్టమైన దానిగా భావించి, ఆనందించగలగటం మనం పరమాత్మకు అర్పించగలిగిన గొప్ప యజ్ఞం.

**దానం–** దానం అంటే మీకు తెలుసు. ఎదుటివారికి కానుకగా ఇచ్చేది. కాని ఈ దానంలో ఒక అత్యంత ముఖ్యమైన కానుక ఒకటి ఉంది. అది ప్రేమ కానుక. ఇది అత్యంత ముఖ్యమైనదని ఎందుకన్నామంటే, ఇది అందరూ కోరుకునేది. ధనవంతులు, బీదవారు; విజేతలూ, విఫలులూ; అందరూ, అన్ని సందర్భాలలో, ఎల్లవేళలా కోరుకునే ఏకైక వస్తువు ప్రేమ. మిగతా కానుకలు ఇవ్వకపోయినా ఫర్వాలేదు, ప్రేమకానుక ఒక్కటీ ఇస్తే చాలు. అందుకే ప్రేమ అంత గొప్పది. ప్రేమ లేనిచోట, ఎన్ని కానుకలు ఇచ్చినా వాటికి విలువ ఉండదు. ప్రేమతో ఇచ్చిన కానుకలు అర్థవంతంగానూ, గొప్పగానూ ఉంటాయి. ఇచ్చిన వ్యక్తి కూడా దైవసమానుడు అవుతాడు.

ఆధ్యాత్మిక ఎదుగుదలకు కారణం, ఫలితం కూడా ప్రేమే. 'నేను నా కుటుంబాన్ని, పిల్లలను ప్రేమిస్తున్నాను,' అనవచ్చు మీరు. ప్రేమ ఒక అంతర్గత భావన, ఉద్దేశం. ప్రేమ అదృశ్యం, అగోచరం. అది మనస్సుకు సంబంధించినది. **అందువల్ల ప్రేమ కానుక ఇవ్వమని చెపితే, దాని అర్థం ప్రకటించిన ప్రేమ, బయటకు వెలువడిన ప్రేమ.** భావాలు కానుక అవ్వలేవు. ప్రేమను ప్రకటించటం అంటే ఏమిటి? ప్రేమను ప్రకటించే గొప్ప మార్గం, ఎదుటివారికి మీ సమయాన్ని కేటాయించటం, వారిమీద శ్రద్ధ చూపటం, వారి జీవితాన్ని పంచుకోవటం, ఇంకా మాట్లాడితే వారి భావాలను పంచుకోవటం.

కాకపోతే, ఇలా సమయాన్ని కేటాయించుకుంటూ పోతే, మీకు బొత్తిగా సమయం ఉండదు; అది సాధ్యం కాదు కూడా. అందువల్ల ఇలా ప్రేమను ప్రకటించటానికి అనువైన, అద్భుతమైన ప్రదేశం మీ కుటుంబమే. మీ కుటుంబ సభ్యులతో ప్రతి ఒక్కరితో మనసారా గడపటం, వారి భావాలను శ్రద్ధగా పంచుకోవటం చేయాలి. వారి కష్టసుఖాలను పంచుకోవాలి కాని వారు చేసింది తప్పో ఒప్పో ఆలోచించకూడదు. వారికి మీరు సలహా ఇవ్వనవసరం లేదు. చర్చించనవసరం లేదు. కేవలం వినేందుకు ఒక మనిషి ఉన్నాడనే నమ్మకం వారికి

మీ మాటలద్వారా అందించగలిగితే చాలు. అది వారికి కొండంత ధైర్యాన్ని ఇస్తుంది. మీ మధ్య అనుబంధం కూడా పటిష్ఠమవుతుంది.

కనీసం రోజుకు ఒకసారైనా మీ కుటుంబసభ్యులతో గడపాలి మీరు. ప్రేమను ప్రకటించే అద్భుతమైన మార్గం ఇదే. అంతేకాదు ఇది మీ అంతర్గత ఎదుగుదలకు కూడా తోడ్పడుతుంది. ఈ విధంగా మీరు ఎదగలేకపోతే, మీరు చేసే దానం అంతా యాంత్రికంగా మారుతుంది. శాస్త్రాన్ని అధ్యయనం చేసినా వ్యర్థమే అవుతుంది. మీ సమయాన్ని ఇతరులకు కేటాయించటమే ఆధ్యాత్మిక ఎదుగుదలకు గొప్ప మార్గాల్లో ఒకటి.

నేటి కుటుంబవ్యవస్థలో సమస్యలను ఎదుర్కొంటున్న వారి ఫిర్యాదు ఇదే– తన కుటుంబ సభ్యులు తనతో సరిగ్గా మాట్లాడటం లేదు. అందుకే ఐశ్వర్యంతో తులతూగుతున్నా కూడా, మానసికంగా చెదరిపోతున్నారు ఎందరో. వారికి కావాల్సింది ఆప్యాయంగా నాలుగు మాటలు, ఒక ప్రేమపూరిత పలకరింపు. 'ఎలా ఉన్నావు?' 'ఇవాళ ఎలా గడిచింది?' అనే ప్రశ్నలు అడగటానికి కేవలం కొన్ని నిముషాలు పడుతుంది. అంతే. కాని ఆ కొన్ని నిముషాల కాలమే కుటుంబ వాతావరణాన్ని ఎంత అద్భుతంగా మారుస్తుందంటే, తక్కిన అన్ని లొసుగులూ క్షణాల్లో మటుమాయమవుతాయి. అందులో నేటి వ్యవస్థలో ఒంటరి కాపురాలు ఎక్కువవుతున్న నేపథ్యంలో భార్యాభర్తలు ఒకరికొకరు చేదోడువాదోడుగా లేకపోతే, ఆ కుటుంబాలు దెబ్బతింటాయి. అందుకని మీ కుటుంబసభ్యులకు నిఖార్సైన సమయాన్ని కేటాయించటం, వారి భావాలను పంచుకోవటమే, మీరు చేయగలిగిన గొప్ప దానం.

**తపస్సు–** తపస్సు అంటే నిగ్రహం. మనం పాటించాల్సిన నిగ్రహాలు ఎన్నో ఉన్నాయి. ఉదాహరణకు ఏకాదశి రోజున ఉపవాసం ఉండటం. అన్నింటిలోకి అతి ముఖ్యమైన తపస్సు **వాచిక తపస్సు.** వాక్కును నియంత్రించగలగటం. భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ వాచిక తపస్సును నిర్వచిస్తాడు. మన వాక్కు నాలుగు లక్షణాలు కలిగి ఉండాలి – అనుద్వేగకరం, సత్యం, ప్రియం, హితం

**అనుద్వేగకరం–** మన మాటలు ఇతరులకు ఉద్రేకం కలిగించకూడదు.

**సత్యం–** సత్యమే పలకాలి.

**ప్రియం–** సత్యం చెప్పాలి కాని, అది అప్రియంగా ఉండకూడదు. ఎదుటివారిని నొప్పించకుండా మర్యాదగా చెప్పాలి.

**హితం-** మనం చెప్పే విషయం మనకూ, ఎదుటివారికీ కూడా ప్రయోజనకరంగా ఉండాలి.

వాచిక తపస్సు అంటే మనం ఏదైనా మాట్లాడేటప్పుడు, ఆచితూచి మాట్లాడాలి. ఆ పదాలను బయటకు వదిలేటప్పుడు, లోపల ఒకసారి సమీక్షించు కోవాలి. ఈ మాట మాట్లాడవచ్చా లేదా అని బేరీజు వేసుకుని, అప్పుడు మాట్లాడాలి.

**ఆ విధంగా యజ్ఞం, దానం, తపస్సు అనే మూడు బంగరు సూత్రాలను పాటించటం ద్వారా మీ జీవితాన్ని మీరు అర్థవంతంగా చేసుకోగలరు.**

## స్వామీజీ సూక్తిముక్తావళి

**శిష్యుడు-** ఆత్మ ఒక్కటే సత్యం, తక్కినవన్నీ - గురుశిష్యులతో సహా-మిథ్య అయితే, మిథ్యద్వారా సత్యాన్ని ఎలా తెలుసుకోగలము?

**గురువు-** ఆవు అడుగుజాడలు ఆవుకు చెందవు; కాని ఆవు యజమాని ఆవును (సత్యం), ఆవు అడుగుజాడల (మిథ్య)ద్వారా వెతికి పట్టుకుంటాడు.

బ్రహ్మ, మాయల మధ్య ఫ్యాషన్‌షో పెడితే మాయే గెలుస్తుంది. ఎందుకంటే మాయలో (జగత్తులో) సౌందర్యం ఉంది, భిన్నత్వం ఉంది. నానారూపత్వం ఉంది. కాని స్థిరత్వం లేదు. మాయ కార్డ్‌బోర్డు కుర్చీలాంటిది. అది అన్ని విధాల బాగుంటుంది కాని కూర్చోవటానికి పనికిరాదు. మాయ కూడా అలాంటిదే. అన్ని విధాలా బాగుంటుంది కాని, దానిమీద ఆధారపడటానికి పనికిరాదు.

'ఈ జగత్తు ఎన్నడూ నాకు సమస్యలను సృష్టించదు. నేను ఎటువంటి అనుభవాన్ని ఎదుర్కొంటున్నా అది నేను చేసుకున్న కర్మకు వచ్చిన కర్మఫలం. దానికి ప్రపంచం ఒక మాధ్యమం మాత్రమే,' అని అర్థం చేసుకోవాలి.

**ప్రపంచం నాకు అనుభవాన్ని ఇవ్వదు**
**నా కర్మ నాకు అనుభవాన్ని ఇస్తుంది**

# 42. తితిక్షకు ఆరు బంగరుసూత్రాలు

నూతన సంవత్సరంలో తితిక్ష గురించి చూద్దాము. తితిక్ష చాలా ముఖ్యమైన విలువ. అందరూ పాటించాల్సిన విలువ. కాని దురదృష్టవశాత్తూ దీన్ని ఎవరూ సరిగ్గా అర్థం చేసుకోవటం లేదు సరికదా, తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. తత్త్వబోధ అద్వైతవేదాంతంలో ప్రాథమిక గ్రంథం. అందులో ఈ తితిక్ష అనే పదాన్ని చూస్తాము. భగవద్గీతలో క్షమ అనే పదం వస్తుంది. పదం ఏదైనా అన్ని శాస్త్రాలూ క్షమాగుణంయొక్క ప్రాముఖ్యత నొక్కివక్కాణిస్తాయి. క్షమ లేదా తితిక్ష ఒక్క విలువే అయినా, దానిలో అనేక అంశాలు, అనేక అర్థాలు ఉన్నాయి. అది సందర్భాన్నిబట్టి, మనం చూసే దృక్కోణాన్నిబట్టి మారుతూ వస్తుంది. అందువల్ల ఈ నూతన సంవత్సరానికి పుష్పగుచ్ఛంగా ఈ తితిక్ష గురించిన ఆరు బంగరు సూత్రాలను కానుకగా ఇద్దాము. ఈ ఆరూ మన శాస్త్రాల్లో చెప్పినవే.

భగవద్గీత, రెండవ అధ్యాయంలో తితిక్షయొక్క అవసరం నొక్కివక్కాణిస్తాడు కృష్ణపరమాత్మ. దాన్ని ఎందుకు తప్పించుకోలేమో కారణం కూడా చెబుతాడు కృష్ణపరమాత్మ.

**మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణసుఖదుఃఖదాః।**
**ఆగమాపాయినోఽనిత్యాః తాంస్తితిక్షస్వ భారత॥** గీత 2-14

అర్జునా- జీవితంలో అనుభవాలు ద్వంద్వాలుగా వస్తాయి. శీతలం-ఉష్ణం, సుఖం-దుఃఖం; లాభం-నష్టం; మానం-అవమానం; సంయోగం-వియోగం.

అందువల్ల జీవితం గరుకురోడ్లమీద ప్రయాణంలాగా , ఒడిదుడుకులతో సాగుతుంది. మనకు డబ్బు ఉన్నా, లేకపోయినా నిరంతరం జీవితంలో ఒకదాన్ని వెన్నంటి ఇంకోటిగా వచ్చే సుఖదుఃఖాలను ఎదుర్కోకతప్పదు. పైగా అవి ఎదురుచూడని రీతిలో వస్తాయి.

గతుకుల బాటలో కారు సాఫీగా సాగటానికి, కారుకి షాక్ అబ్జార్బర్స్ ఉంటాయి. అలా మన జీవితంలో మనని ఎత్తి, కుదిపే ఒడిదుడుకులను తట్టుకోవటానికి, కిందపడిపోకుండా ముందుకు సాగటానికి మనకు కూడా షాక్ అబ్జార్బర్స్ ఉండాలి. ఈ షాక్ అబ్జార్బర్ - మానసిక బలాన్నిచ్చేది- తితిక్ష అనే విలువ. తితిక్ష ఒక్కటే మనను దృఢంగా చేయగలదు. జీవితం ఎదురుదెబ్బలు తినిపిస్తే, ఎదురు నిలిచిన వాడే తట్టుకోగలడు.

ఒక సంస్కృత శ్లోకంలో రబ్బరు బంతిలా ఉండండి, మట్టిబెడ్డలాగా ఉండవద్దు అని వస్తుంది. రబ్బరు బంతిని కిందకి విసిరితే పైకి లేస్తుంది. తడి మట్టిబెడ్డను కిందికి విసిరితే అది కిందనే ఉండిపోతుంది. ఈ గట్టితనమే, తితిక్ష. ఒడిదుడుకులు అందరికీ వస్తాయి. అవి ఎవరూ తప్పించుకోలేరు. రాముడికి కూడా తప్పలేదు. పట్టాభిషేకం చేస్తామన్నారు, మళ్ళీ వెంటనే అడవులకు వెళ్ళమన్నారు.

**యం హి న వ్యథయంత్యేతే పురుషం పురుషర్షభ।**
**సమదుఃఖసుఖం ధీరం సోఽమృతత్వాయ కల్పతే॥ గీత 2-15**

**తితిక్షకు ఆరు బంగరుసూత్రాలు**

**1. శక్తివిహీనం చేయటం-** ఇది ఆచరణలో పెట్టటం, కొంచెం కష్టమయినా, చాలా ముఖ్యమైనా సూత్రం. అంతేకాదు, మనం పాటిస్తే చాలా శక్తివంతమైన సూత్రం కూడా. భగవంతుడు, ఈ ప్రపంచాన్ని ద్వంద్వప్రవృత్తులలో సృష్టించాడని చూశాము. భగవంతుడు అలా సృష్టించక తప్పదు. ఎందుకంటే కర్మసిద్ధాంతం ప్రకారం, పుణ్యపాపాల నియమం ప్రకారం, జగత్తులో కష్టం-సుఖం, దుఃఖం-ఆనందం ఉండి తీరాలి. దీన్ని ఈశ్వరసృష్టి లేదా భగవంతుని సృష్టి అంటారు. కాని సమస్య అక్కడ లేదు. ఎక్కడ ఉంది అంటే మనం కూడా ఒక ద్వంద్వ ప్రవృత్తిని సృష్టించాము, మన మనస్సుకు తగ్గట్టుగా. దీన్ని జీవసృష్టి అంటారు.

మనం రెండు స్టిక్కర్లను తయారుచేసుకున్నాము. ప్రియం, అప్రియం- కొన్ని అనుభవాలకు ప్రియం అనీ, కొన్ని అనుభవాలకు అప్రియం అనీ లేబుల్స్ అంటించుకుంటాము. సృష్టిని అలా ప్రియం, అప్రియంగా విభజించుకోవటంవల్ల అత్యంత పెద్ద సమస్యను కొని తెచ్చుకుంటున్నాము. ఎప్పుడైతే మనం అప్రియం లేబుల్ అంటించామో, మనం జగత్తుకు మనల్ని బాధించే శక్తిని ఇచ్చినట్టు. ఎందుకంటే అప్రియంగా వచ్చేది ఏదైనా బాధిస్తుంది కదా!

అందువల్ల, ఎన్నడూ ఒక పరిస్థితిని మీ పరంగా కొలవవద్దు. ఏదొచ్చినా స్వీకరించటం నేర్చుకోండి. ముఖ్యంగా అప్రియం అనవద్దు. అలా అనేసరికి జగత్తుకు ఎదురు మీరే శక్తినిచ్చినట్టూ, మీ శక్తిని తగ్గించుకున్నట్టూ అవుతుంది.

**సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ।**
**తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాపమవాప్స్యసి॥ గీత 2-38**

ద్వంద్వవిషయాలు నిరంతరంగా రానీయండి. వాటికి మీరు ప్రియం,

అప్రియం అంటూ బిరుదులు ఇవ్వకండి. రెండింటినీ సమానంగా చూడండి. ఈశ్వరసృష్టిలో ద్వంద్వాలను మీరేమీ చేయలేరు. కాని మీ సృష్టిని మీరు తొలగించవచ్చు.

'ఓ దేవా! నాకు ఒకటే శక్తి ఉంది. నేను నా కర్మఫలంగా ఏది అనుభవించాలని రాసిపెట్టి ఉంటే, అది రానీ. నేను దాన్ని స్వీకరించటానికి సిద్ధంగా ఉన్నాను. దానికి బిరుదులివ్వను,' అని ప్రార్థించాలి.

ఇప్పుడంతా స్టిక్కర్లయుగం. మీకంతగా స్టిక్కరు ఇచ్చితీరాలని ఉంటే, ఒకటే స్టిక్కరు పెట్టుకోండి! ఏమిటో అర్థమైందనుకుంటా! ప్రియం. ఎందుకంటే కర్మఫలదాత అయిన భగవంతుడు, మన పాపపుణ్యాలకు అనుగుణంగా ఇస్తున్న ఫలం అది.

**ఆగతే స్వాగతం కుర్యాత్, గచ్ఛన్తం న నివారయేత్॥**

ఏది వచ్చినా స్వాగతం చెప్పండి. దయానంద స్వామీజీ కళ్యాణ మండపంలో స్వాగతం పలికే వారిలాగా చేయమంటారు. పెళ్ళిళ్ళలో గుమ్మం ముందు కొందరు నిలుచుని ఉంటారు. ఎవరొచ్చినా చిరునవ్వులు చిందిస్తూ స్వాగతం–సుస్వాగతం చెబుతారు.

అలా ఏ అనుభవం వచ్చినా చిరునవ్వుతో స్వాగతం చెప్పండి. అదే ఒక పెద్ద తపస్సు. ఆగతే స్వాగతం కుర్యాత్. ఇది– మొదటి సూత్రం.

**2. శక్తివంతులను చేసుకోవటం –** మిమల్ని మీరే శక్తివంతులను చేసుకోవాలి. మొదట, అప్రియం స్టిక్కరు తీసేసి, జగత్తు మిమ్మల్ని బాధపెట్టకుండా, దాన్ని శక్తివిహీనం చేయండి. ఇప్పుడు మిమ్మల్ని శక్తివంతులను చేసుకోండి.

ఏదైనా పెద్ద కష్టం వచ్చి మీదపడగానే, 'భగవంతుడు అలా ఎందుకు చేశాడు?' అంటారు. అంతవరకూ భగవంతుణ్ణి తలచుకోను కూడా తలచుకోరు; కాని కష్టం వస్తే మాత్రం, 'సర్వశక్తివంతుడు, సర్వజ్ఞుడు, దయాహృదయుడు అయిన భగవంతుడు అది ఎందుకు సృష్టించాడు?' అంటారు. భగవంతుడు అది సృష్టించి తీరాలి. ఎందుకంటే సృష్టి భగవానుని ఇష్టాయిష్టాలమీద ఆధారపడి లేదు. కర్మసిద్ధాంతం ప్రకారం ఆయన కర్మఫలాలను ఇవ్వాలి. పుణ్యం, పాపం రెండూ ఉండబట్టి, సృష్టి కష్టసుఖాల కలయికగా ఉండక తప్పదు.

కాని, భగవంతుడు ద్వంద్వప్రవృత్తి ఉన్న జగత్తును సృష్టించినా– ఆయన, మనమీద జాలికొద్దీ, మనలో సమృద్ధిగా వనరులను కూడా సృష్టించాడు.

ఆ వనరులను ఉపయోగించుకుని, మనం దృఢంగా అవటానికి ఏర్పాటు చేశాడు. క్లిష్టపరిస్థితులను భరించి, ఎదుర్కొని, ముందుకు ధైర్యంగా సాగే గట్టి శక్తి ఉంది మనలో. ద్వంద్వాలు ఉన్నాయి నిజమే కాని వాటిని ఎదుర్కొనే శక్తి కూడా ఉంది. అవి ఎక్కడో వేరే గ్రహంలో లేవు. వేరే దేశంలో లేవు. వరల్డ్‌బ్యాంకులో లేవు. ఆ వనరులు మనలోనే, మన లోపలే ఉన్నాయి.

నిజానికి, భగవంతుడు ఆ వనరులను సృష్టించలేదు, **సాక్షాత్తూ ఆయనే ఈ అన్ని వనరులతో సహా మనలో ఉన్నాడు.** మనం వాటిని తట్టి లేపాలి అంతే. ఆయన ఇదుగో తీసుకోమని ఇస్తాడు. కాకపోతే మనం తట్టాలి. సౌరశక్తిని ఎలా ఒక పద్ధతిలో స్వీకరించాలో, అలాగే మన అంతర్గత శక్తిని కూడా తట్టిలేపి, మనను మనం దృఢం చేసుకోవాలి. అప్పుడు ఏం జరగాలని రాసి పెట్టి ఉంటే, మన కర్మ ప్రకారం, అది జరిగినా మనం దాన్ని తట్టుకుని, ఎదుర్కొని, ముందుకు సాగగలము.

**ఉద్ధరేదాత్మనాऽత్మానం నాऽత్మానమవసాదయేత్।**
**ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః॥ గీత 6-5**

మిమ్మల్ని మీరు ఎన్నడూ కించపరచుకోవద్దు. 'నేనెలా తట్టుకోగలను? నేనెలా తట్టుకోగలను?' అనవద్దు. మీమీద మీరు శ్రద్ధ పెంచుకోండి. అది మీలో, అనంతమైన వనరులతో, శక్తిరూపంలో కొలువై ఉన్న భగవంతునిమీద మీ శ్రద్ధమీద ఆధారపడి ఉంటుంది. భగవంతుడు సర్వశక్తివంతుడు. ఆయన ఎంతన్నా శక్తినివ్వగలడు. ఆ శక్తికి పరిమితులు ఉండవు.

**ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేऽర్జున తిష్ఠతి।**
**భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా॥**
**తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత।**
**తత్ప్రసాదాత్ పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్॥**
**గీత 18-61,62**

అర్జునా, అన్ని వనరులకు అధిష్ఠానదేవత బాహ్యంగా ఎక్కడో లేదు. అనంతమైన వనరులతో సహా, నీలోనే ఉన్నాడు. నువ్వు నిరంతరం ఆయనమీద ఆధారపడవచ్చు.

అందువల్ల బాహ్యవస్తువులమీద, మనుష్యులమీద ఆధారపడటం మానేసి, మీ శక్తిమీదే మీరు ఆధారపడండి. బ్యాంకుమీద ఆధారపడితే, అదే నీటిలో మునిగిపోవచ్చు. బంధువులమీద ఆధారపడితే, వారు ఎక్కడెక్కడో ఉన్నారు.

మీరెక్కడో తుఫానులో ఇరుక్కుపోయారు. ఫోను కూడా పనిచేయదు. స్వామీజీ శిష్యులెందరికో అలాంటి సందర్భాలు ఎదురైనా స్వామీజీకి ఒక మంచి వార్త చెప్పేవారుట.'స్వామీజీ, మీ బోధ మాకు చాలా సహాయపడింది.' వారు ఇరుక్కుపోయినా, హెలికాప్టర్‌ద్వారా ఆహారం దొరికింది. 'మేము తట్టుకుని, ఎదుర్కొని, ధైర్యంగా ముందుకు సాగాము!' అని వెనక్కు వచ్చి స్వామీజీకి ఎందరో చెప్పారు. అందువల్ల బాహ్యవనరుల దారులన్నీ మూసుకుపోయినా, ఒక ద్వారం ఎప్పుడూ తెరిచే ఉంటుంది. దీనినే ఆత్మస్థైర్యం పెంపొందించుకోవటం అంటారు.

సౌరశక్తిని పట్టుకున్నట్టుగా మీ అంతర్గతశక్తిని పట్టుకోవాలన్నాము కదా! దానికి ఒకటే మార్గం ఉంది. అది భక్తి. మీ సెల్‌ఫోన్‌ను రీఛార్జీ చేసినట్టుగా, మీ మనస్సును అనంతమైన వనరులయిన భగవంతునికి కనెక్ట్ చేసి, రీఛార్జీ చేసుకోండి. మిమ్మల్ని మీరు శక్తివంతులను చేసుకోండి. ఇది రెండవ సూత్రం. మిమ్మల్ని మీరు శక్తివంతులను చేసుకోండి! జగత్తును శక్తివిహీనం చేయండి. దీన్ని తిరగేసి చేయకండి! నిజానికి మీరు ఇప్పుడు చేస్తున్నది అదే. జగత్తును శక్తివంతం చేసి, మిమ్మల్ని మీరు శక్తివిహీనం చేసుకుంటున్నారు. ఇప్పుడు దాన్ని తిరగరాయండి.

**3. గోరింతలు కొండంతలు చేయకపోవటం–** మీకు అప్రియమైన పరిస్థితి ఎదురైతే, దానికి 'అప్రియం' ట్యాగ్ పెడతారు. ట్యాగ్ పెట్టి ఊరుకోరు. గోరంతలు కొండంతలుగా చేస్తారు. అంటే ఉన్న సమస్య ఇంత అయితే, దాని గురించి పదే పదే ఆలోచించి, దాన్ని భూతద్దంలోంచి చూసి, దాన్ని మీరే పెంచి పోషిస్తారు. ఒక సత్సంగానికి వెళ్ళినా, ఒక మంచి ప్రసంగానికి వెళ్ళినా, దానిమీద ధ్యాస పెట్టకుండా మీ మనస్సును తొలుస్తున్న విషయంమీదే ఆలోచిస్తారు. ఎప్పుడైతే దాని గురించి ఆలోచించటం మొదలుపెట్టారో, అది వటవృక్షమై కూర్చుంటుంది. మీ మనస్సుకు అంత సృజనాత్మక శక్తి ఉంది. అది లేనిపోని సమస్యలన్నింటినీ ఊహించుకుంటుంది, వాటికి జరిగే ఆస్కారం లేకపోయినా సరే. భగవంతునికన్నా ఎక్కువ సృజనాత్మకతను చూపిస్తుంది. ఈ సమస్యలను పెద్దవిగా ఊహించుకునే సరికి అవి మీకు శారీరకంగా, మానసికంగా, బుద్ధిపరంగా, ఆధ్యాత్మికంగా అన్నిరకాలుగా హాని చేస్తాయి. అసలే పరిస్థితి క్లిష్టంగా ఉంది. దానికి తోడు మీరు అన్నిరకాల బలహీనమైన, హానికరమైన ఆలోచనలవల్ల దాన్ని మరింత కష్టతరంగా చేస్తున్నారు!

మీరు అనుభవించే ప్రాథమిక భావావేశాలు– **ఆందోళన, బెంగ, భయం–** ఈ మూడూ వచ్చాయంటే మీలో తితిక్ష లేనట్టే. వాటిని తప్పించుకోవాలి. ఎలా?

ఒకటే మార్గం ఉంది. మీకు అప్రియమైన సమస్య గురించి ఆలోచించటానికి నిరాకరించండి. దానిమీద ఆలోచించి, దాన్ని పెంచి పెద్దది చేయకండి. కనీసం పరిష్కారం గురించి ఆలోచిస్తేనన్నా బయటపడటానికి మార్గం దొరుకుతుంది. కాని మీరేం చేస్తున్నారు? సమస్య గురించి ఆలోచించి, సమస్యను రెట్టింపు చేస్తున్నారు.

మీరు పరిష్కారం గురించి ఆలోచించరు సరికదా, ఎవరైనా పరిష్కారం చూపించబోయినా, వారిని మాట్లాడనివ్వరు. ఎదురు మీరే సమస్య గురించే పదే పదే చెబుతారు! ఈ ఆందోళన, బెంగ, భయం పోవాలంటే ఒక్కటే మార్గం. మొదటి రెండు సూత్రాలమీద దృష్టి పెట్టండి. మొదటిది అప్రియమైన అనుభవమంటూ ఏమీ లేదు. ఏదైనా రావాలని రాసిపెట్టి ఉంటే, రాకమానదు. రెండవది ఇంకా ముఖ్యం. దాన్ని ఎదుర్కొనే శక్తి మీలోనే ఉంది. అంతేకాని పరిస్థితిని పెంచి పోషించకండి. ఇది మూడవ సూత్రం.

ఇటువంటి పరిస్థితుల్లో ఆందోళన, బెంగ, భయమే కాదు, ఇంకో సమస్య కూడా తోడవుతుంది. మీరు అప్రియం లేబుల్ తీయకపోతే, అటువంటి సందర్భం వచ్చినప్పుడు, మీ చుట్టూ ఉన్నవారిలో ఎవరినో బలిపశువును చేస్తారు. పొరపాటు చేయటం మానవసహజం, దాన్ని క్షమించటం దైవగుణం– ఇది అసలు సామెత. ఎవరో దీన్ని మార్చి చాలా చక్కగా చెప్పారు. 'పొరపాటు చేయటం మానవ సహజం. దానికి ఎదుటివారిని నిందించటం మరింత మానవ సహజం.'

ఎప్పుడైతే దానికి ఒకరు కారణం అనుకుంటారో, అప్పుడే ఆ వ్యక్తిమీద కోపం, ద్వేషం, పగ, విపరీతంగా పెరిగిపోయి, బదులు తీర్చుకోవాలనిపిస్తుంది. అన్నీ ప్రమాదకరమైన భావాలు. ద్వేషం అన్నింటికన్నా దారుణమైన, అత్యంత ప్రమాదకరమైన భావన; ఎందుకంటే అది ద్వేషించబడ్డ వ్యక్తికన్నా, ద్వేషించే వ్యక్తినే ఎక్కువగా బాధిస్తుంది. అందువల్ల సమస్యను గోరంతలు కొండంతలు చేసి చూడగానే ద్వేషం, ప్రతీకారం చోటు చేసుకుంటాయి. అవి వస్తున్నాయని తెలియగానే, వెనువెంటనే, వాటిని ఆపాలి. లేకపోతే, సమస్య తీవ్రమవుతుంది.

నిజానికి, ఆధ్యాత్మిక జీవనానికి కృష్ణభగవానుడు ఇచ్చిన మొట్టమొదటి సందేశం ఇది. ఎన్నడూ, ఎట్టిపరిస్థితుల్లోనూ ఎవరినీ ద్వేషించవద్దు. ప్రపంచం భగవానునియొక్క పవిత్రమైన వ్యక్తరూపం. ప్రపంచం, ప్రపంచంలోని ఏ వస్తువు కూడా ద్వేషించదగ్గది కాదు. ఈ దృక్పథం పెంచుకోవటం ఎలా? చాలా కష్టం.

'స్వామీజీ, అక్కడ కూర్చుని చెప్పటం తేలికే. మా ఇంటికి వచ్చి చూడండి. లేదా, మా ఆఫీసుకు వచ్చి చూడండి, మీకే పరిస్థితి అర్థమవుతుంది. మీకేం మీరు సన్న్యాసి, మీరు చెప్పేసి వెళ్ళిపోతారు!' అనవచ్చు ఎవరైనా! ఎందుకంటే స్వామీజీ చెప్పే ఇలాంటి మాటలు వింటే భరించలేకపోవచ్చు.

ద్వేషాన్ని పారద్రోలటానికి, శాస్త్రం ఒక ప్రత్యేకమైన పద్ధతిని ఇస్తుంది. ఇది జీర్ణించుకోవటం కొంచెం కష్టమే. అందువల్ల శాస్త్రాన్ని ఎక్కువగా అధ్యయనం చేయాలి. కాని శాస్త్రం చెప్పే ఈ సందేశం బాగా తోడ్పడుతుంది. ఏమిటా సందేశం? 'ఈ జగత్తు ఎన్నడూ నాకు సమస్యలను సృష్టించదు. నేను ఏ అనుభవాన్ని ఎదుర్కొంటున్నా అది నేను చేసుకున్న కర్మకు వచ్చిన కర్మఫలం. దానికి ప్రపంచం ఒక మాధ్యమం మాత్రమే,' అని అర్థం చేసుకోవాలి.

**ప్రపంచం నాకు అనుభవాన్ని ఇవ్వదు**
**నా కర్మ నాకు అనుభవాన్ని ఇస్తుంది**

అందువల్ల ప్రపంచాన్ని నిందించటమంటే, వార్త మోసుకువచ్చిన వార్తాహరుణ్ణి కాల్చినట్టు ఉంటుంది. ఒక అందమైన శ్లోకం ఉంది.

ఏది, ఎక్కడ, ఎప్పుడు, ఎంత, ఏ విధంగా చేస్తే; ఆ కర్మలన్నీ నాకు అది అక్కడ, అప్పుడు, అంత, ఆవిధంగా తిరిగి వస్తాయి

అవన్నీ కర్మలు; అవన్నీ నాకు కర్మఫలం రూపంలో తిరిగివస్తాయి. ఎందుకు? కర్మ సిద్ధాంతంవల్ల. ఎవరు ఇస్తారు కర్మఫలం? భగవంతుడు! కంటికి కనబడని భగవంతుడు, ఎదురుగా కారణంగా కనబడే వ్యక్తి కాదు.

ఈ విషయం లోతుగా ఆలోచించినకొద్దీ, ఎవరినీ ద్వేషించలేరు. దీని అర్థం అవసరమైన పని చేయవద్దని కాదు. ఖచ్చితంగా చేయవచ్చు కాని దానికి ద్వేషం, పగ అనే రెండింటి పూత లేకుండా చేయవచ్చు. ఏ పని చేసినా, ఏ పనీ చేయకపోవటం కూడా ఒక విధమైన పనే, ద్వేషం, పగ మీ దరిదాపుల్లోకి రానివ్వద్దు. అవి ఒకవేళ వస్తే ఏం చేయాలి? ఇదంతా నా కర్మఫలంవల్లే అని తెలుసుకోవాలి. ఒకవేళ కోపం వస్తే ఏం చేయాలి? మొదటి రెండు సూత్రాలకు వెళ్ళాలి. దేన్నీ అప్రియంగా భావించవద్దు. ఏ అనుభవాన్నైనా దాని గురించి చింతించకుండా అనుభవించండి.

కొంతమంది ఎప్పుడూ చిటపటలాడుతూనే ఉంటారు. మీరలా ఉండకండి. మీకు అప్రియమైన విషయాల గురించి ఎక్కువగా ఆలోచించకండి. భూతద్దంలోంచి

చూడకండి. ఇది మూడవ సూత్రం. ఈ మూడు సూత్రాలను భోక్తగా మీరు పాటించాలి. భోక్త అంటే అనుభవించే జీవి.

ఇటువంటి పరిస్థితులు ఎదురవగానే, మీరు వెంటనే ఏదైనా చేయాలనుకుంటారు. ఏదైనా చేయాలనుకుంటే భోక్త కాస్తా కర్త అవుతాడు. కర్త అంటే పనిని చేసేవాడు. పై మూడు సూత్రాలూ భోక్తకు వర్తిస్తే, ఇప్పుడు చెప్పబోయే మూడు సూత్రాలూ, కర్తకు వర్తిస్తాయి. రెండూ తితిక్షకు సంబంధించినవే.

**4. ఆత్మనిగ్రహం చూపటం –** కృష్ణపరమాత్మ చెప్పే మొట్టమొదటి సూత్రం కర్తకు ఆత్మనిగ్రహం ఉండాలి. అంటే ఉద్రేకంగా ఏదీ చేయకూడదు. ఆలోచించకుండా మాట తూలకూడదు. ఆలోచించకుండా, ఉద్రేకంలో ఏ పనీ చేయకూడదు. అలా చేస్తే మీరు చేసే పనిమీద మీకు అధికారం ఉండదు. ఆ పనిలో నాణ్యత ఉండదు. అలా దూకుడుగా చేయటంవల్ల కలిగే తక్షణ ఫలితాలు కాని, తర్వాత వచ్చే ఫలితాలు కాని ఆలోచించరు; అది మిమ్మల్ని, మీ కుటుంబాన్ని, మీ తోటి ఉద్యోగులను ఎంత బాధపెడుతుందో చూడరు. అసలు ఇంత వివరంగా ఆలోచించే తీరికే ఉండదు. ఏదో జరిగింది.దానిమీద ఉద్రేకంగా, కోపంగా చర్య తీసుకోవాలి. అంతే! అటువంటి దుందుడుకు స్వభావం చాలా ప్రమాదకరం. అది దుడుకు స్వభావం ఉన్న వ్యక్తినే ఎక్కువ బాధిస్తుంది.

భోక్త అంటే అనుభవించే జీవి, ఏం చేయాలో ఎన్నడూ తను నిర్ణయించకూడదు. ఎందుకంటే భోక్త కోపంలో ఉన్నాడు. ఉద్రేకంలో ఉన్నాడు. జీవితంలో ఎత్తుపల్లాలు వచ్చినప్పుడు అతను ఒత్తిడికి లోనవుతాడు. అటువంటి పరిస్థితిలో అతను కర్తను పనిచేయమంటే, అది కుళాయి నీళ్ళు డైరెక్ట్‌గా తాగినట్లవుతుంది. మనం దానికి ఒక ఫిల్టర్ పెట్టుకుని, ఫిల్టర్ అయిన నీళ్ళను తాగుతాము. భోక్తకు ఫిల్టర్ ఎవరు? మంతా. ఆలోచించే వాడు. అతను పరిస్థితులను బేరీజు వేసి, మంచిచెడులు గమనించి, సలహా ఇస్తాడు. అందువల్ల భోక్తా, మంతాకు చెప్పాలి. మంతా ధర్మాధర్మాలు ఆలోచించి, కర్తచేత పని చేయిస్తాడు.

కాబట్టి కుళాయి నీళ్ళు, ఫిల్టర్ నీరులాగా భోక్తా, మంతా, కర్తా వరుసక్రమంలో చేయాలి దేన్నైనా. మంతాని పక్కన పెట్టేస్తే, అది చాలా ప్రమాదకరం. అలా ఆవేశపూరితమైన మాటలవల్ల, చేతలవల్ల ఎన్నో కుటుంబాలు చెల్లాచెదురవటం చూస్తూనే ఉన్నాము. అందువల్ల ఆత్మనిగ్రహం పాటించాలి. ఇది నాలుగవ సూత్రం.

**5. న్యాయంగా ఆలోచించటం–** ఎన్నడూ ఒక వ్యక్తిని మనం ఆవేశంలో ఉన్నప్పుడు అంచనా వేయకూడదు. మనం కష్టమైన పరిస్థితుల్లో అవస్థపడుతున్నప్పుడు, తొందరపడతాము. పరిస్థితిని సరిగ్గా అర్థం చేసుకోకుండా, ఆవేశంగా ఎదుటివారిని నిందిస్తాము. మన దగ్గర దాని గురించిన పూర్తి సమాచారం ఉండదు. వారు సంజాయిషీ ఇచ్చుకోవటానికి ప్రయత్నిస్తే మనం పట్టించుకోము. అసలు ఆ అవకాశమే ఇవ్వము. ఎంతసేపూ మనవైపునుంచే ఆలోచిస్తాము. మనవైపు నుండే నిర్ణయం తీసుకుంటాము. సరియైన విచారణ కూడా చేయకుండా– ఒకవ్యక్తిని నిందించి, అతనికి ఎంత శిక్ష విధించాలో కూడా మనమే నిర్ణయిం చేస్తాము. ఇది చాలా హానికరమైన పక్షపాత వైఖరి. పక్షపాతం అంటే పూర్తి సమాచారం లేకుండా ఏర్పరచుకున్న ప్రతికూలాభిప్రాయం.

మన నిర్ణయాలన్నీ మన పక్షపాత వైఖరివల్ల తీసుకున్నవే అవుతాయి. అతను చెప్పబోతుంటే, 'వినటం వృథా' అని కొట్టిపారేస్తాము. ఇలా పక్షపాతవైఖరితో ఏదైనా చేస్తే అది అధర్మం క్రిందకి వస్తుంది. దానివల్ల మరింత పాపం మూటగట్టుకుంటాము. ఒక పనిని సరిచేయబోయి, ఎదురు పాపాన్ని పెంచుకుంటున్నాము.

ఎవరైనా మనమీద అలా ఆవేశంగా నింద వేస్తే, మనమేమంటాము? నింద దాకా ఎందుకు? ఎవరైనా మనతో సంప్రదించకుండా ఒక నిర్ణయం తీసుకుంటే ఏమంటాం? 'నాకు వీలు ఉందో లేదో, నన్ను సంప్రదించనే లేదు. వాళ్ళే నిర్ణయం తీసేసుకున్నారు,' అంటాము. అలాంటప్పుడు మన ఆవేశపూరిత చర్యకు ఎవరో అనాలోచితంగా ఎందుకు బలి అవ్వాలి? ఒక కుటుంబ పెద్దగా ఒక నిర్ణయం తీసుకునే ముందు, తక్కిన కుటుంబ సభ్యులకు అది వీలా లేదా అడగ కుండా నిర్ణయం తీసుకుంటే అది నిరంకుశత్వం కిందకి వస్తుంది. అదంతా పాపం. అందువల్ల మనం పక్షపాత వైఖరితో నిర్ణయాలు తీసుకోకూడదు.

**ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున।**
**సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమోమతః॥ గీత 6-32**

ఎదుటివారికి కష్టం కలిగించే పని చేసేముందు, ఒక్కసారి వారి స్థానంలో మీరుండి ఆలోచించండి. వారిపరంగా ఆలోచిస్తే, వారి భావనలకు కూడా ప్రాధాన్యం ఇచ్చినవారవుతారు. అందువల్ల న్యాయంగా ఆలోచించండి. మీకు పూర్తిగా విషయం

తెలియకుండా, మిడిమిడి జ్ఞానంతో స్వంతనిర్ణయాలు తీసుకోకండి. ఇది ఐదవ సూత్రం.

**6. దూకుడుగా చేసే పనులను ఆలస్యం చేయటం–** ఇది చాలా ముఖ్యమైన సూత్రం. ఏమిటది? మనకు అప్రియమైన పనులు జరిగినప్పుడు, ముఖ్యంగా మనం దానికి ఆ లేబుల్ ఇచ్చినప్పుడు, మనం అవస్థపడుతున్నాము కాబట్టి, వెంటనే దానికి తగ్గట్టుగా ఏదైనా చేసేయాలని ఆవేశంలో చిందులు తొక్కుతామని చూశాము కదా. అప్పుడు మనకు రెండు అవకాశాలు ఉంటాయి.

ఒకటి దూకుడుగా దూసుకుపోవటం. ఆ ఆవేశం ఎలా ఉంటుందంటే 'తలనొప్పిగా ఉంది అంటే తల కోసేసెయ్,' అనే సామెతని నిరూపిస్తాము. రెండవ అవకాశం శాంతియుతమైన చర్యలు. కాని మనం ఆవేశంలో ఉంటే మనకు ఏది నచ్చుతుందో తెలుసుకదా! బాధలో ఉన్నప్పుడు చాలా ఉదారంగా, ఇస్తాము. మన దగ్గర ఏది ఉంటే అది ఇవ్వాలనుకుంటాము! ఆ సూత్రం ప్రకారం, మనం బాధ పడుతున్నాము కాబట్టి, ఇతరులను బాధపెడదామనుకుంటాము. అందువల్ల దూకుడు పనులే మనకు నచ్చుతాయి. అంతేకాదు, అవి ఫలాలను వెంటనే తెస్తాయి.

అందువల్ల శాస్త్రం ఏం చెపుతుందంటే, మీ కళ్ళ ముందు ఉద్రేకమైన కర్మలు, శాంతియుతమైన కర్మలు కదలాడుతుంటే తితిక్ష చూపండి అంటే, ఉద్రేకమైన కర్మలను ఎప్పుడూ ఆలస్యం చేయండి. ముందు శాంతియుతమైన పరిష్కారం ఆలోచించండి. ఎందుకంటే, ఉద్రేకమైన పనులు వెంటనే ఫలితం చూపించినా అవి బాగా శక్తివంతమైన మందులలాంటివి. రోగం తగ్గటం మాట దేవుడెరుగు, వాటివల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. పైగా మనం ఆవేశం చూపితే, ఎదుటివారు కూడా ఆవేశంగా చేస్తారు. అలా అలా పరిస్థితి చేజారిపోతుంది. **అహింసా పరమో ధర్మః–** అహింస అన్నిటికన్నా ముఖ్యమైన విలువ. సామరస్యంగా చేసే మార్గాలన్నీ మూసుకుపోయాక, అప్పుడు దండోపాయం. మొదటే కాదు. అందువల్ల హింసాకరమైన పనులను వెంటనే చేయవద్దు. దుర్భాషలాడటం కూడా హింస కిందకే వస్తుంది.

శక్తివిహీనం చేయటం; శక్తివంతులను చేసుకోవటం; గోరంతలు, కొండంతలు చేయకపోవటం; ఆత్మనిగ్రహం చూపటం; న్యాయంగా ఆలోచించటం, దూకుడుగా చేసే పనులను ఆలస్యం చేయటం – ఇవీ తితిక్ష లక్షణాలు.

ఒక వ్యక్తి దేవునికి ప్రార్థన చేస్తూ, 'ఓ దేవా! నాకు ఓర్పునివ్వు ఈ క్షణమే!' అంటాడు. ఈ క్షణమే మాట పలకటం కూడా పళ్ళునూరుతూ. అంటే అది అనటంలోనే అతనికి ఓర్పు లేదు. మీరు అలా కాకుండా ఈ ఆరు బంగరు సూత్రాలను ఈ నూతన సంవత్సరంలో పాటిస్తే, మీకు తట్టుకుని, ఎదురునిలిచి, ముందుకు సాగే శక్తి వస్తుంది. అందువల్ల **'ఓ భగవాన్, నాకు తితిక్షనివ్వు,'** అని ప్రార్థించండి.

# స్వామీజీ సూక్తిముక్తావళి

నేను మనస్సుకు పక్కనే ఉన్నా కూడా, మనస్సు నన్ను కలుషితం చేయలేదు. అది తెర, తెరమీద ఆడే సినిమాలాంటిది. తెరమీద సినిమా ఆడినా, సినిమా తెరను ఏమీ చేయలేదు. నేను మనస్సును వాడతాను కాని, నేను మనస్సు కాదు.

ఆత్మ నిర్గుణం అని చెపితే, నిర్గుణం అనేది ఆత్మమీద ఆరోపించిన ఇంకొక లక్షణం కాదు; అది అక్షరాలా ఆత్మస్వరూపం. ఆత్మకు నిర్గుణం లేదు.

ఆత్మే నిర్గుణం. కాని నిర్గుణత్వం స్వయంగా తెలియదు. అలా తెలిసేటట్టుంటే దానిమీద సగుణ ఆరోపణలు జరిగి ఉండేవి కావు.

1. కుండ కార్యం
2. కుండకు మట్టికారణం
3. మట్టిలేకుండా కుండకు విడిగా ఉనికి లేదు. అందువల్ల కుండను కార్యంగా కొట్టివేస్తాము.
4. కార్యం లేకపోతే, మట్టికి కారణత్వం లేదు (కారణం లేదు అనకూడదు) బ్రహ్మ కార్యకారణ విలక్షణం.

   **దీన్ని అధ్యారోప అపవాదం అంటారు.**

# 43. ఆరోగ్యకరమైన అలవాట్లకు ఏడు బంగారుసూత్రాలు

ఇవాళ శివరాత్రి మహాపర్వదినం. శివుణ్ణి అనేక అంశాల గురించి ప్రార్థిస్తాము. అందులో ఒక అంశం సదాశివునిగా లేదా దక్షిణామూర్తిగా కొలుస్తాము. ఎందుకంటే ఆయనే మొత్తం వేదసంప్రదాయాన్ని మనకు అందించారు.

**శివం శివతరం శాంతం శివాత్మానామ్ శివోత్తమమ్।**
**శివ మార్గో ప్రణీతారం ప్రణతోస్మి సదాశివమ్॥**

శివమార్గం అంటే మంగళకరమైన మార్గం. అది సాధకునికి నాలుగు పురుషార్థాలను ఇస్తుంది. శివమార్గం అంటే వైదిక శాస్త్రంద్వారా ఇవ్వబడిన వైదికమార్గం. శివుడు ప్రణీత. ప్రణీత అంటే వైదిక మార్గంలోకి పరిచయం చేసినతను. ఈ ఆదిగురువైన దక్షిణామూర్తిని మనం సదాశివుడు అంటాము. అందువల్లనే

**సదాశివసమారంభాం శంకరాచార్యమధ్యమామ్।**
**అస్మదాచార్యపర్యంతాం వందే గురుపరంపరామ్॥**

ఆ విధంగా సదాశివుడు లేదా దక్షిణామూర్తి వైదికమార్గాన్ని ప్రారంభించాడు. ఉపనయనం సమయంలో అబ్బాయిని వైదిక సాంప్రదాయంలో ప్రవేశపెడతారు. అలాగే అమ్మాయిని వివాహసమయంలో ప్రవేశపెడతారు. ఆ విధంగా అమ్మాయి, అబ్బాయిలను వైదిక మార్గంలో ప్రవేశపెట్టినప్పుడు వారు వేదం నిర్దేశించిన జీవనవిధానాన్ని పాటిస్తామని పతిజ్ఞ చేస్తారు. ఉపనయనంలో యజ్ఞోపవీతం ధరింపజేసేటప్పుడు అబ్బాయిచేత ఈ మంత్రం చెప్పిస్తారు.

**శ్రౌతస్మార్త విహిత సదాచార నిత్యకర్మ అనుష్ఠాన యోగ్యతాసిద్ధ్యర్థమ్।**
**బ్రహ్మ తేజో అభివృద్ధ్యర్థం యజ్ఞోపవీత ధారణం కరిష్యే॥**

వైదిక సాంప్రదాయం నిర్దేశించిన నాలుగు పురుషార్థాలకోసం పాటుపడతాను అని ప్రతిజ్ఞ చేస్తాడు. అక్కడినుంచి లౌకిక, మతఃపరమైన, ఆధ్యాత్మిక లక్ష్యాల్లో దేనికోసం ప్రయత్నించినా, వైదిక బోధనే ఆధారంగా తీసుకుంటారు. వైదికులను, హిందువులు అంటారు. హిందువులకు వేదాలు ఒక సనాతనధర్మాన్ని విధిస్తాయి. అది ప్రతిహిందువూ పాటించాలి.

అందువల్ల హిందువును సనాతనుడు, లేదా వైదికుడు అంటారు. వారు ఏ వర్ణాశ్రమధర్మానికి చెందినవారైనా వేదంలో చెప్పబడిన ప్రాథమికసూత్రాలను పాటించి తీరాలి.

ప్రాథమిక సూత్రాన్ని సదాచారం అంటారు. ఆచారం అంటే మన నడవడిక లేదా ప్రవర్తన ఎలా ఉండాలో సూచించేది. సదాచారం అంటే మనం పాటించాల్సిన ఆరోగ్యకరమైన అలవాట్లు. ముందే సూచించినట్టుగా మన లక్ష్యం ఏదైనా సదాచారం పాటించి తీరాలి.

**సర్వాగమానామాచారః ప్రథమం పరికల్పతే।**

**ఆచారప్రభవో ధర్మో ధర్మస్య ప్రభురచ్యుతః॥ – విష్ణుసహస్రనామమ్ 137**

**సర్వాగమానామ్–** అన్ని ఆగమశాస్త్రాలు, అది ఏ సాంప్రదాయానికి చెందినవైనా, అవి కొన్ని ప్రాథమిక సూత్రాలతో, ఆరోగ్యసూత్రాలతో ప్రారంభమవుతాయి. దాన్ని సదాచారం అంటారు. ఆచారాన్ని పాటించటంవల్లనే ధార్మిక జీవనాన్ని గడుపగలము. తక్కిన కార్యకలాపాలైన పూజలు, ప్రార్థనలకు ఈ ప్రాథమిక సూత్రాలను లేదా ఆరోగ్యసూత్రాలను పాటిస్తేనే, విలువ ఉంటుంది.

సదాచారం అనగానే కొంతమందికి కొన్ని సాంప్రదాయ కుటుంబాల్లో పాటించే మడి గుర్తుకు వస్తుంది. ఆచారం అనగానే, పాతచింతకాయ పద్ధతులు, ఆచరణలు గుర్తుకువచ్చి నేటి మారుతున్న పరిస్థితుల్లో అవి కుదరవు అని కొట్టిపారేస్తారు. మా పిల్లలు వాటిని పాటించరని అంటారు. కొన్ని సాంప్రదాయాలు ఇప్పుడు పాటించినా, పాటించకపోయినా, కొన్ని ముఖ్యమైన అలవాట్లు అన్ని కాలాలకూ అనువైనవిగా ఉంటాయి. మనం కూడా, ఆచారాల గురించి మాట్లాడటం లేదు ఇప్పుడు.

పూర్వపు సాంప్రదాయాలన్నీ ఇప్పుడు పాటించలేము. ఉదాహరణకు, ఒక ఇంట్లో పూజగదినుంచి బాత్రూమ్ 80 అడుగుల దూరంలో ఉండాలంటారు. ఇప్పటి ఫ్లాట్ సిస్టమ్‌లో ఫ్లాట్ మొత్తం 40/40 ఉంటుంది. ఆ సాంప్రదాయాన్ని ఇప్పటికీ పాటించాలంటే, మీరు పొరుగింటి బాత్రూమ్‌ను అతను మీ బాత్రూమ్‌ను వాడాల్సి ఉంటుంది. అలా మరికొన్ని ఉన్నాయి. రోజుకి ఎన్నిసార్లు కాళ్ళు కడుక్కోవాలి, ఎన్నిసార్లు నోరు శుభ్రం చేసుకోవాలి వగైరా. కొన్ని పాటించగలము, కొన్ని పాటించలేము. ముఖ్యంగా ఇప్పుడు మడి, ఆచారాల గురించి అస్సలే పట్టించుకోవటం లేదు. పదిహేడవ శతాబ్దానికైనా, ముప్పయివ శతాబ్దానికైనా

పనికివచ్చే కొన్ని ముఖ్యమైనవి ఉన్నాయి. వాటిని శాస్త్రాలలో చెబుతూ వస్తారు. కాని మనం సాధారణంగా వాటిని పట్టించుకోము. వాటిలో మనకు చాలా మటుకు తెలుసు, కాని వాటికి ప్రాముఖ్యతనివ్వము.

ఇప్పుడు వాటిలో సదాచారం కింద వచ్చే **ఆరోగ్యకరమైన అలవాట్లకు ఏడు బంగరు సూత్రాలు** చూద్దాము.

**1. క్రమశిక్షణ–** క్రమశిక్షణకు అనేక అర్థాలు ఉన్నాయి. కాని ఈ సందర్భంలో, ఒక ప్రత్యేకమైన అర్థాన్ని తీసుకుందాము. అది, మీరు చేసే పనులన్నింటికీ సరియైన ప్రణాళిక వేసే అలవాటును పెంపొందించుకోవాలి. ఆలోచనారహితంగా ఏ పనినీ చేపట్టకూడదు అంటుంది శాస్త్రం. పెద్దవీ – చిన్నవీ; లౌకిక–ఆధ్యాత్మిక; మతఃపరమైన– ఆధ్యాత్మికమైన ధర్మాల్లో ఏది చేపట్టినా వాటిముందు ప్రణాళిక ఉండాలి. కొంత ఏర్పాటు ఉండాలి. దాని తర్వాతే ఏదైనా చేయాలి.

ఆలోచనారహితమైన కర్మ ఏది చేసినా ఫలితాలు దారుణంగా ఉంటాయి; అవి చేసిన అతనే కాక, ఆ పనికి సంబంధించిన వారందరూ కూడా అవస్థపడతారు. అందువల్ల, ఆలోచనారహితమైన కర్మ మీకూ, తక్కినవారికీ కూడా ఒక రకమైన హింస కిందకు వస్తుంది. అందువల్ల పనికి ముందు ప్రణాళిక వేయటం పెంపొందించుకోండి.

ఒక వ్యక్తి నిండు సభలో ఒక ప్రముఖుని గురించి చదవాల్సింది పోయి, ఇంకొక ప్రముఖుని గురించిన సమాచారం చదివాడు. దానివల్ల ఆయన అభాసుపాలవటమే కాక, అనేకమంది ముందు అవమానం పొందారు. అందువల్ల ముందే జాగ్రత్త పడకపోతే అలాంటి పెద్ద పొరపాట్లు జరిగే ప్రమాదం ఉంది. ఒక్కోసారి రిహార్సలు కూడా చేసుకోవాల్సి వస్తుంది. ఈ ముఖ్యమైన సూత్రం కృష్ణపరమాత్మ చెబుతాడు.

ఆలోచనారహితమైన కర్మలన్నీ తామసకర్మ క్రిందకు వస్తాయని, సరియైన ప్రణాళికతో చేసిన కర్మలు సాత్వికకర్మల క్రింద వస్తాయని చెబుతాడు. తామసకర్మ దురాచారమయితే, సాత్వికకర్మ సదాచారమవుతుంది. ఒకపని చేసేముందు, ఏయే విషయాల గురించి ప్రణాళిక వేసుకోవాలో కృష్ణపరమాత్మ చెబుతాడు.

**అనుబంధం క్షయం హింసామ్ అనవేక్ష్య చ పౌరుషమ్**
**మోహాదారభ్యతే కర్మ యత్తత్ తామసముచ్యతే – గీత 18–25**

**ఎ) అనుబంధం–** ఏ పని చేసినా దానివల్ల కలిగే సానుకూల ఫలితాలు

**బి) హింస–** మనను కాని, ఇతరులను కాని ముఖ్యంగా కుటుంబసభ్యులను ఇబ్బంది పెట్టే ప్రతికూలఫలితాలు.

**సి) క్షయం–** ఖర్చు. అది సమయం, శక్తి, డబ్బు మూడింటికీ వర్తిస్తుంది.

**డి) పౌరుషమ్–** మనకున్న వనరులు – శారీరక, మానసిక దారుఢ్యం, సమయం, ఆర్థికస్థోమత కూడా. మనకున్న వనరులను వినియోగించటంవల్ల కలిగే లాభనష్టాలను బేరీజు వేసుకోవాలి. ఏదైనా పనిని చేపట్టే ముందు అన్నీ ఆలోచించాలి.

ఒకవేళ రేపు ఎక్కడికైనా ఫంక్షనుకు వెళ్ళాలనుకుంటే, దాని గురించి ఇవాళే ప్రణాళిక వేసుకోవాలి. అది ఎంత దూరంలో ఉంది, ఆఫీసు టైమా, ఏవైనా ఊరేగింపులు ఉన్నాయా ఆ దోవలో, అది వన్‌వే ట్రాఫిక్ మార్గంలో ఉందా లాంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. అంతేకాని మనకు ఇష్టం వచ్చినట్టు చేయకూడదు.

అందువల్ల మొదటి సదాచారం ప్రణాళిక వేసుకోవటం, సంసిద్ధంగా ఉండటం, అవసరమైతే రిహార్సలు వేసుకోవటం.

**2.కార్యాచరణ–** కేవలం ప్రణాళిక వేసుకుని, సిద్ధంగా ఉంటే చాలదు దాన్ని ఆచరణలోపెట్టాలి. ప్రణాళిక అవసరమే కాని, దాన్ని వెన్నంటి శ్రమ లేకపోతే ఫలితం శూన్యం. మీరొక టైమ్‌టేబుల్ వేసుకుని లాభమేమిటి, దాన్ని ఆచరణలో పెట్టకపోతే?

**ఉద్యమే న హి సిధ్యంతి కార్యాణి న మనోరథైః।**
**న హి సుప్తస్య సింహస్య ప్రవిశంతి ముఖే మృగాః॥**

కేవలం ప్రణాళికలు వేసుకుంటేనో, కాగితంమీద రాసుకుంటేనో, మీ ప్రయత్నాలు ఎన్నడూ ఫలించవు. వాటి వెన్నంటే శ్రమ ఉండాలి. పడుకున్న సింహం నోటిలోకి మృగం దానంతట అదే వెళ్ళిపడదు.

సింహం ఒక లేడిని పట్టుకోవాలంటే, అది ఎక్కడుందో వెతికి పట్టుకుని, దాన్ని వేటాడాలి. దాన్ని చంపేవరకూ సింహం గట్టి ప్రయత్నం చేయాలి. ఆటంకాలు ఎన్నో ఎదురవుతాయి, కాని విజయం సాధించేవరకూ, శ్రమ, పట్టుదల వీడకూడదు.

**ధృత్యా యయా ధారయతే మనఃప్రాణేంద్రియక్రియాః।**
**యోగేనావ్యభిచారణ్యా ధృతిః సా పార్థ సాత్త్వికీ॥ గీత 18–33**

అన్ని రకాల విజయాలూ– లౌకికమైనా, ఆధ్యాత్మికమైనా– చలింపని ధారణాశక్తితోనే పొందగలరు. విజయం సాధించేదాకా వదలని గట్టి పట్టుదల ఉండాలి. ఆటంకాలు వస్తూనే ఉంటాయి. వాటిని ఆత్మస్థైర్యంతో ఎదుర్కోవాలి.

మీరు శ్రమను నమ్ముకుంటే ఎటువంటి ఆటంకాలు ఎదురైనా కృంగిపోరు. మీరేం చేద్దామనుకున్నా వెనక్కిలాగే వారే ఎక్కువమంది ఉంటారు. ప్రోత్సహించే వారు అరుదు. అందువల్ల వెనక్కి లాగే వారిని పట్టించుకోవద్దు. ఆటంకాలు ఎదురైనా, ధైర్యంగా ముందుకు సాగిపొండి. విజయం పొందేదాకా, మధ్యలో ఆగకూడదు.

పట్టుదలతో కృషి చేయాలనే ఈ సూత్రానికి ప్రతీకలుగా మన పురాణాల్లో రెండు కథలు ఉన్నాయి. ఒకటి సముద్రమథనం. సముద్రాన్ని మధిస్తుంటే అనేక వస్తువులు బయటపడ్డాయి. కాని దేవాసురులు పట్టు సడలకుండా అమృతం వచ్చేదాకా సముద్రాన్ని మధించారు.

రెండవ ఉదాహరణ భగీరథుని ప్రయత్నం. భగీరథుడు తన పితామహులను రక్షించటంకోసం గంగను కిందకు తీసుకురావాలనుకున్నాడు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా కష్టపడి విజయాన్ని సాధించాడు. అందువల్ల రెండవ సదాచారం కష్టపడి పనిచేయటం. పని పూర్తి చేయటమొక్కటే కాదు, దాన్ని పరిపూర్ణంగా చేయాలి. పని పరిపూర్ణంగా ఉండాలి. ఒకవేళ అలా రాకపోయినా మన ప్రయత్నం పరిపూర్ణత్వంకోసం సాగాలి. అది చిన్న పని అవనీ, పెద్ద పని అవనీ!

స్వామి చిన్మయానంద, పరిపూర్ణత్వం సాధించాలనుకోవటం ఒక ఆధ్యాత్మిక లక్షణం అంటారు. ఆఖరికి ఒక కవరుమీద ఒక స్టాంపు అంటిస్తున్నా, దాన్ని నిర్లక్ష్యం చేయవద్దంటారు ఆయన. అది గొప్ప పనేం కాదు. కానీ స్టాంపు అంటించటం, చిరునామా వ్రాయటం అనే చిన్నపనులను కూడా పరిపూర్ణంగా చేయాలి. గొప్ప వ్యక్తులు అంటే అసాధారణ పనులు చేసేవారు కాదు; **గొప్ప వ్యక్తులు అంటే సాధారణమైన పనిని అసాధారణంగా చేసేవారు.** అందువల్ల ఏ పని చేసినా పరిపూర్ణంగా చేయండి.

అందువల్ల రెండవ సదాచారం ఒక పనిని పూర్తి చేయటం అది కూడా పరిపూర్ణంగా చేయటం.

**3. కళాత్మక ఔన్నత్యం–** మన సాంప్రదాయం ఎప్పుడూ కళాత్మక ఔన్నత్యానికి విలువనిస్తుంది. ఒక పనిని చేస్తే, దాన్ని కళాత్మకంగా, అందంగా చేయాలి. ఎందుకో

తెలీదు, కాలక్రమేణా ఈ కళాహృదయం మాయమయిపోయింది. మనం ఉన్న ఇళ్ళు, మన పరిసరాలు చూస్తే ఆ విషయం తేటతెల్లమవుతుంది.

కళాత్మక ఔన్నత్యంలో మూడు అంశాలు ఉన్నాయి. అవి–

**ఎ) శౌచం–** మనం ఉన్న ప్రతి చోటు, వాడే ప్రతివస్తువు శుభ్రంగా ఉండాలి. అది ఆఫీసు అవనీ, ఇల్లు అవనీ అది ఇంత కూడా మట్టి లేకుండా మెరిసిపోవాలి. ఇంట్లో ముందు గది మాత్రమే కాదు, అన్ని గదులూ, ఆఖరికి బాత్రూమ్ కూడా అద్దంలా మెరిసిపోవాలి. వస్తువు, ప్రదేశమే కాదు మన శరీరం, మన దుస్తులు కూడా పరిశుభ్రంగా ఉండాలి. కృష్ణపరమాత్మ శౌచం పదం పదే పదే వాడతాడు. ఆలయాల్లో కూడా ఈ పరిశుభ్రత ఉండాలి.

**బి) పద్ధతి–** మన ఇంట్లో కాని, ఆఫీసులో కానీ ఆ మాటకొస్తే ఎక్కడైనా కానీ ఒక పద్ధతి పాటించాలి. పద్ధతి అంటే ఏమిటి? మనం వాడే ప్రతి ఒక్క వస్తువుకూ ఒక స్థానం ప్రత్యేకించి ఏర్పాటు చేయాలి. మనం వాడని కలాన్ని పెట్టటానికి ఒక స్థానం నిర్దేశించాలి. అలా చిన్నదవనీ, పెద్దదవనీ, ప్రతి వస్తువుకీ ఒక స్థానం కేటాయించాలి. కేటాయించిన స్థానంలోనే ఆ వస్తువుని పెట్టాలి.

**సి) అలంకారప్రియత్వం–** మన శాస్త్రం నిర్దేశించిన సదాచారంలో ఇదొక ముఖ్య సాధన. అంతేకాదు, ఆ వస్తువు ఆకర్షణీయంగా కూడా ఉండాలి. అందువల్ల అలంకారం, మన హిందూ జీవన విధానంలో ఒక అంతర్గత భాగమై ఉంది. అలంకారం అంటే కొట్టొచ్చినట్టు కనిపించే వెర్రి మేకప్ కాదు. అలంకారం అంటే దాన్ని చూస్తే ముచ్చట వేయాలి. మన పల్లెటూర్లలో స్త్రీలు పొద్దున్నే వాకిలి ఊడ్చి, రంగవల్లుల దిద్ది, వాటిమీద దీపాలు పెడతారు. వంటింట్లో కూడా ముగ్గులు వేస్తారు. రంగవల్లులువల్ల అందం వస్తుంది. ఇల్లు కళాత్మకంగా విరాజిల్లుతుంది. ఇంటికి, పూజగదికి కూడా అలాగే అలంకారాలు చేస్తారు. స్నానం చేశాక వస్త్రాలంకరణ చేసుకుని చందనం, కుంకుమలు దిద్దుకుని, మాలలు అలంకరించుకుని అందంగా తయారవుతారు. అందువల్ల కళాత్మక ఔన్నత్యం అంటే శౌచం, పద్ధతి, అలంకార ప్రియత్వం మూడూ వస్తాయి.

మన సాంప్రదాయంలో శౌచం, పద్ధతి, అలంకారం లక్ష్మీదేవిని ఆహ్వానించటానికి చిహ్నాలుగా వాడతారు. కళాత్మక ఔన్నత్యం లక్ష్మీదేవికి ప్రతీక. ఎక్కడ ఈ మూడూ పాటిస్తారో, అక్కడే లక్ష్మీదేవి ఉంటుంది. ఈ మూడూ ఉండని చోట లక్ష్మీదేవి వెళ్ళిపోయి,జ్యేష్ఠాదేవి వస్తుంది.

ఎవరైతే ఏదైనా తిన్నాక నోరు కడుక్కోరో, ఎవరైతే సూర్యోదయంకన్నా ముందే లేచి తననూ, ఇంటినీ శుభ్రపరచుకోరో, ఎక్కడైతే శౌచం, పద్ధతి, అలంకారాలు లేవో అక్కడ లక్ష్మీదేవి నిలవదు. దానికి వ్యతిరేకంగా ఎక్కడైతే ఇవన్నీ ఉన్నాయో, అక్కడికి లక్ష్మీదేవి పరుగుపరుగున వస్తుంది. నిజానికి ఒక హాస్యంతో కూడిన శ్లోకం ఉంది.

**కిం వాససా ఇత్యత్ర విచారణీయమ్।**
**వాసః ప్రధానం ఖలు యోగ్యతాయై।**
**పీతాంబరం వీక్ష్య దదౌ స్వకన్యామ్।**
**చర్మాంబరం వీక్ష్య విషం సముద్రః॥**

సముద్రమథనం అయ్యాక, సముద్రరాజు రెండింటిని పట్టుకుని పైకి వచ్చాడు. లక్ష్మీదేవిని, హాలాహల విషాన్ని, ఈ రెండింటినీ ఎవరికన్నా కానుకగా ఇవ్వాలనుకున్నాడు. లక్ష్మీదేవిని అలంకార ప్రియుడైన విష్ణుమూర్తికి కానుకగా ఇచ్చాడు. విష్ణుమూర్తి పీతాంబరం ధరించి, కౌస్తుభరత్నాలు, తక్కిన ఆభరణాలతో మెరిసిపోతున్నాడు. అందువల్ల విష్ణుమూర్తికి ఇచ్చాడు. పరమేశ్వరుడు జంతుచర్మం ధరించి, శరీరమంతా విభూతి ధరించి జటాఝూటంతో ఉన్నాడు. అందువల్ల ఆయనకు విషం ఇచ్చాడు. అందువల్ల మనం కూడా చక్కగా అలంకరించుకోవాలి. శుభ్రంగా ఉండాలి, ఇంటిని కళాత్మకంగా తీర్చిదిద్దాలి. అప్పుడు లక్ష్మీదేవి వస్తుంది.

కాని దురదృష్టవశాత్తూ మనం ఈ మూడూ పాటించము. పాటిస్తే మన భారతీయ వీధులు ఎందుకింత అపరిశుద్ధంగా ఉంటాయి? అంతేకాదు, దురదృష్టవశాత్తూ, మనం ఈ అశౌచాన్ని మనం ఎక్కడికి వెళ్ళినా తీసుకువెళతాము. అందువల్ల మనకు చెడ్డపేరు వచ్చింది. ప్రపంచదేశాలలో భారతీయులు శుభ్రంగా ఉండరు, పరిసరాలను చెత్తగా ఉంచుతారు అంటారు. మనం వారు మనమీద చేసే ఎగతాళికి గురి అవుతున్నాము.

ఇది నిజమో కాదో తెలియదు కాని ఏదైనా దేశంలో భారతీయులు ఎక్కడ ఉన్నారంటే ఇట్టే పట్టేయవచ్చుట. ఎక్కడైతే పరిసరాలు చెత్తగా, అశుద్ధంగా ఉన్నాయో అక్కడ భారతీయులు ఉన్నారని అర్థంట. ఇంతకన్నా అవమానం వేరే ఉందా? ఎందుకో మనం ఈ శుభ్రత, పద్ధతి, అలంకారాలు మర్చిపోయాము.

ఇంట్లో కూడా కేవలం ముందుగదే పరిశుభ్రంగా ఉంచటానికి ప్రయత్నిస్తాము. స్వామీ చిన్మయానంద తన ఆశ్రమంలో బ్రహ్మచారులు విద్య

నేర్చుకుంటున్నప్పుడు, క్రమం తప్పకుండా వారిగదులను పరిశీలిస్తుండే వారు. గురుకులవాసంలో ఉన్న విద్యార్థులకు ముందుగా చెప్పకుండా హఠాత్తుగా వెళ్ళి వారి గదిని బాత్రూమ్‌తో సహా, నీటుగా ఉంచారా లేదా అని పరీక్షిస్తుండేవారు.

తప్పనిసరిగా,ఇప్పటి బాత్రూమ్‌లలో విరిగిన బకెట్లు, మగ్గులు ఉంటాయి. అలా కాకుండా, మనం నిజంగా హిందువులమయితే మన ఇల్లు, మన దేశం మొత్తం సువాసనలు వెదజల్లాలి. అలా ఉండకపోతే, లక్ష్మీదేవి ఆ ఇంట్లో ఉండదని తెలుసు. మనం మతానికే ప్రాముఖ్యతనిస్తాము. లక్ష్మీదేవికి పూజ చేస్తాము కానీ ఈ దయనీయ పరిస్థితిలో మాత్రం మార్పులేదు. ఆఖరికి గుడిలో కూడా అంతే! ప్రసాదాలు తిని, ఆ దొన్నెలు ఎక్కడ పడితే అక్కడ పారేస్తాము. గోడలు, స్తంభాలను కూడా వదలము! కళాత్మక ఔన్నత్యం మనం పాటించి తీరాల్సిన సదాచారాల్లో ఒకటి.

ఇప్పటివరకూ చూసిన మూడు సదాచారాలు– క్రమశిక్షణ, కష్టపడి పనిచేయటం, కళాత్మక ఔన్నత్యం– ఈ మూడూ వ్యక్తిపరంగా పాటించాల్సినవి. ఇప్పుడు సమష్టిపరంగా పాటించాల్సిన మూడు ఆరోగ్యకరమైన అలవాట్లను చూద్దాము. మనం కేవలం వ్యక్తులమే కాదు, కొన్ని భిన్న గ్రూపులకు చెందినవారము. కుటుంబం ఒక గ్రూపు. మనం పనిచేసే సంస్థ ఒక గ్రూపు. మొత్తం సమాజం ఒక గ్రూపు.

అందువల్ల మన కుటుంబం, సాంఘిక జీవనం గురించి కూడా మూడు ఆరోగ్యకరమైన అలవాట్లు సూచించబడ్డాయి.

**4. నిజాయితీ–** మనుష్యులుగా మనకు ఫ్రీవిల్ ఉంది. దాన్ని మనం సరిగ్గా వినియోగించుకుంటామా లేదా అనేది మన చేతిలో ఉంది. స్వార్థపూరిత మనస్సుతో ఫ్రీవిల్‌ను చెడు విషయాలకు ఉపయోగించి తద్వారా మనను మనం బాధపెట్టుకోవటమే కాక, ఇతరులను కూడా బాధిస్తాము. మన స్వార్థాన్ని జయించటానికి ఏదో ఒక పద్ధతి ఉండాలి. దీన్ని బయటనుంచి ఎవరూ అరికట్టలేరు. మనమీద కాపలాగా ఇంకోరు ఉంటే, వారిమీద కాపలాగా మరొకరు ఉండాలి. వారిమీద ఇంకొకరు ఉంటే, వారిమీద కాపలాగా మరొకరు ఉండాలి. వారిమీద ఇంకొకరు. అలా గొలుసుకట్టుగా సాగిపోతుంది. ఎవరూ నిజాయితీగా లేరనుకోండి, చట్టమూ, పోలీసులూ, నాయకులూ కూడా నిజాయితీగా ఉండలేరు.

మరి ఈ ఫ్రీవిల్‌వల్ల మనలో నాట్యం చేసే స్వార్థాన్ని జయించటమెలా? భగవంతుడే దానికొక అంతర్గత పరిష్కారాన్ని ఏర్పరచాడు. దాన్నే అంతరాత్మ లేదా

**మనస్సాక్షి** అంటారు. ఈ మనస్సాక్షి ప్రకృతిసూత్రాల ప్రకారం పనిచేస్తుంది. అందువల్ల మనం ఒక నియమాన్ని ఉల్లంఘించినప్పుడల్లా మన అంతరాత్మ ఆ విషయం మనకు తెలియజేస్తుంది.

ఏది మంచి పని? దానికొక సర్వజనీన సూత్రం ఉంది. **ఇతరులు నాకేమి చేయకూడదనుకుంటానో, దాన్ని నేను ఇతరులకు చేయకూడదు.** చాలా తేలికైన, చిన్న సూత్రం ఇది. ఈ సూత్రం మన మనస్సాక్షికి తెలుసు. అందువల్ల మనం ఈ సూత్రాన్ని అధిగమించినప్పుడల్లా అది మనను ముల్లులా పొడుస్తుంది. దీన్నే **అపరాధభావన** అంటారు.

భగవంతుడు అలా మనకు ఒక మనస్సాక్షిని ఇచ్చాడు. ఆ అంతరాత్మ మనను అపరాధభావన అనే ముల్లుతో పొడుస్తుంది. మనలో ఒక అపరాధభావన కలిగిందంటే, అది మనకు ఒక సందేశాన్ని అందిస్తున్నది. ఏమిటా సందేశం? మన స్వార్థంవల్ల మనం ఒక విలువను నిర్లక్ష్యం చేస్తున్నాము. ఎప్పుడైతే మన అంతరాత్మ మనను పొడుస్తున్నదో, వెంటనే మనను మనం అదుపులో పెట్టుకుని, మన ప్రవర్తనను మార్చుకోవాలి.

దీన్ని **అంతర్గత స్వీయ నియంత్రణ** అంటారు. మన అంతరాత్మకు మనమే జవాబు చెప్పుకోవాలి. అది మన తప్పును ఎత్తిచూపగానే ఆ పనిని ఆపాలి. మన సహజప్రవృత్తి ప్రకారం పోకుండా, శాస్త్రం నిర్దేశించిన విలువలకు విలువనివ్వాలి. ఇదే పదికాలాలు నిలుస్తుంది. బాహ్యంగా అదుపులో పెట్టాలని చూస్తే అది జరగని పని– అంతరాత్మకు బదులు చెప్పుకోవటమే మార్గం.

కాని అంతరాత్మ నోరు మూయించి కాదని ముందుకు కొనసాగితే, కొన్నాళ్ళయ్యాక అంతరాత్మ మూగపోతుంది. అది మన తప్పును ఎత్తిచూపటం మానేస్తుంది. ఎప్పుడైతే అంతరాత్మకు విలువనివ్వమో, అప్పట్నుంచీ మనం మనుష్యులం కామని చెప్పవచ్చు. మానవత్వం నశించిపోయాక, మన జీవితం వృథా అయిపోతుంది.

**బుద్ధినాశాత్ ప్రణశ్యతి–** అందువల్ల అంతరాత్మ గట్టిగా, స్పష్టంగా మీకు మీ తప్పులు ఎత్తి చూపనీయండి. అంతరాత్మ 'కుదరదు' అనగానే ఆగిపోవటానికి ప్రయత్నించండి. ఇదే నిజాయితీ అంటే. నిజాయితీ నాలుగవ సదాచారం.

**5. వినయం–** వినయం ఒక అతి ముఖ్యమైన సదాచారం. వినయంలో మళ్ళీ రెండు రకాల వినయం గురించి చెబుతుంది శాస్త్రం.

**ఎ) పెద్దవారిని అనుసరించటం –** సదాచారానికి ప్రతీకగా నిలిచిన పెద్దవారి మాటకు విలువనిచ్చి, వారు చెప్పినట్టు చేయాలి. కాకపోతే ఇక్కడొక చిన్న విషయం గుర్తించాలి. పెద్దవారు సదాచారసంపన్నులై ఉండాలి. అప్పుడే వారు ఎవరినైనా అదుపులో పెట్టగలరు. వారు సదాచారాన్ని పాటించకుండా, మాట వినమంటే అది జరిగే పనికాదు.

శాస్త్రం పెద్దవారు సదాచారాన్ని పాటించాలనీ, పిన్నలు వారిని అనుసరించాలనీ చెబుతుంది. అప్పుడు మన సమాజం ఆదర్శవంతంగా ఉంటుంది.

**అభివాదనశీలస్య నిత్యం వృద్ధోప సేవినః**
**చత్వారి తస్య వర్ధన్తే ఆయుర్విద్యా యశోబలం॥ – మనుస్మృతి**

పెద్దవారు అంటే తల్లిదండ్రులు, గురువు, రాజు ఎవరైనా అవచ్చు.

యథారాజా తథాప్రజా అన్నారు. రాజెలా ఉంటే, రాజ్యం అలా ఉంటుంది.

**బి) సూత్రాలను పాటించటం–** ప్రతి ఒక్క గ్రూపుకు కొన్నిసూత్రాలు లేదా నియమాలు ఉంటాయి. ఆ నియమాలను పాటిస్తేనే ఆ గ్రూపు సమర్థవంతంగా సాగుతుంది. కుటుంబానికి, ఫ్లాట్స్‌కు, కార్పొరేట్ సంస్థకు అలా దేనికి దానికే కొన్ని నిబంధనలు ఉంటాయి. ఈ నిబంధనలను ధర్మం అంటారు. అది సామాజిక ధర్మమవనీ, మతపరమైన ధర్మమవనీ, ఒక నిబంధన విధిస్తే, దాన్ని పాటించి తీరాలంటుంది శాస్త్రం.

**6. సమాజ శ్రేయస్సు–** మనం ఒంటరిగా లేము, ఒక కుటుంబంలోనో, ఒక సమాజంలోనో సభ్యులమని గుర్తుంచుకోవాలి. అందువల్ల, ఏదైనా పని చేసే ముందు ఆ పనివల్ల ఇతరులు లాభం పొందుతారా, ఇతరులు అవస్థపడతారా అనే విషయం గమనించాలి.

భర్తృహరి మూడురకాల మనుష్యుల గురించి చెబుతారు. **ఉత్తమపురుషుడు** తన లాభం చూసుకోకుండా, ఎంతసేపూ ఇతరుల బాగోగుల గురించి చూస్తాడు. **మధ్యమపురుషుడు** ఇతరుల బాగోగులతోపాటు, తన స్వార్థం కూడా చూసుకుంటాడు. **అధమపురుషుడు**, ఇతరులు నష్టపోయినా సరే, తనే బాగుపడాలనుకుంటాడు.

అందరి హితం కోరాలి. మన లాభం వదులుకోకపోయినా, మన గురించి జాగ్రత్త తీసుకుంటూనే, ఇతరుల గురించి కూడా జాగ్రత్త తీసుకోవాలి. కారు పార్కు చేస్తున్నప్పుడు సరిగ్గా చేస్తున్నామా లేదా చూడాలి. అంటే వేరే కారుకి అడ్డంగానో, వేరే ఇంటికి అడ్డంగానో పెట్టకూడదు. దీన్ని **హితత్వం** అంటారు.

నిజాయితీ, అణకువ, సమాజశ్రేయస్సు- ఈ మూడు సమష్టిపరంగా పాటించాల్సిన నిబంధనలు.

**7. మనస్ఫూర్తిగా చేయటం-** ఇది చాలా ముఖ్యమైనది. పైన చెప్పిన ఆరు సూత్రాలను మనస్ఫూర్తిగా ఆచరణలో పెట్టాలి. ఎందుకంటే వాటిని పాటించటం అంత తేలిక కాదు. వాటిని ఆచరించకపోతే, ఏమవుతుంది? స్వామీజీ ప్రసంగం అంతా విన్నాక ఆయనమీద జాలి చూపుతారు. ఆయన చెప్పిన ఆదర్శాలు వినటానికి బాగానే ఉన్నాయి కాని అవి మన భారతదేశంలో లేదా కలియుగంలో సాధ్యం కాదని తేల్చేస్తారు.మొత్తం ప్రపంచాన్నే ఆదర్శాలు పలుకుతున్నట్టు భావిస్తే మనం ముందుకు పోలేము. వీటిని పాటించటానికి మనస్ఫూర్తిగా ప్రయత్నించాలి. మనకు మొట్టమొదట అడ్డం పడేది మన బద్ధకం. కాని బద్ధకాన్ని పక్కనపెట్టి, మన క్షేమంకోసం, సంఘశ్రేయస్సుకోసం పాటించాలి. లేకపోతే సమాజం అశుద్ధంగా తయారవుతుంది.

మన భారతదేశాన్ని, భారతీయులని అశుద్ధానికి మారుపేరుగా చెప్పటం మొదలుపెడతారు. అంతేకాకుండా, తక్కిన దేశాలవారు భారతదేశాన్ని విమర్శిస్తూ హిందూమతాన్నే నిందిస్తారు. మీ మతం మీకు నేర్పిన జీవితం ఇదేనా అని మతానికి పెద్ద మచ్చ తెచ్చిపెడతారు.

అందువల్ల మనం ఈ నియమాలను పాటించకపోతే మన దేశాన్ని, మన మతాన్ని కించపరచిన వారమవుతాము. మన తర్వాత వచ్చే తరం భారతీయులుగా పుట్టినందుకు గర్వంగా చెప్పుకునేందుకు ఏమీ ఉండదు. ముఖ్యంగా విదేశాలలో ఉన్న భవిష్యత్ తరాలు భారతదేశం గురించీ, హిందూమతం గురించీ గొప్పగా భావించలేరు. వారు గొప్పగా భావించాలంటే, ఈ తరమైన వారం మనం దానికి బాట వేయాలి.

ఈ నియమాలన్నీ ఈ ప్రసంగం విన్న వెంటనే ప్రయత్నించాలి. చివరిది మనస్ఫూర్తిగా చేయాలంటే దాని అర్థం లేనిపోని కుంటిసాకులు చెప్పటానికి ప్రయత్నించకండి, వీలున్నంత మేరకు ఆచరణలో పెట్టటానికి ప్రయత్నించండి అని. ఈ సదాచార నియమాలను స్వామీజీ నిర్దేశించలేదు. శాస్త్రం నిర్దేశించింది. ఈ ఏడూ అన్ని కాలాల్లోనూ వర్తిస్తాయి. అందువల్ల ఈ మహాపర్వదినమైన శివరాత్రి రోజు, పరమేశ్వరుని కృపకోసం ప్రార్థిద్దాము. ఈ రాత్రినుంచే ఈ ఏడు సదాచారాలనూ మన శక్తిమేరకు పాటించటానికి ప్రయత్నిద్దాము.

# 44. ప్రతి రంగంలో రాణించటమెలా?

ప్రతి మనిషికీ, మూడు విశిష్టమైన, భిన్నమైన వ్యక్తిత్వాలు ఉంటాయి. భోక్తా, కర్తా, జ్ఞాతా. అంటే అనుభవించే వ్యక్తీ, పనిచేసే వ్యక్తీ, తెలుసుకునే వ్యక్తీ.

**భోక్తా–** పుట్టినప్పటినుంచీ మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మన ఇంద్రియాలద్వారా, మనస్సుద్వారా అనుభవిస్తూనే ఉన్నాము. ఈ అనుభవించే వ్యక్తిని భోక్తా అంటారు. భోక్తగా మనం అనేక అనుభవాలను చవిచూస్తాము. అందులో కొన్ని ఆనందాన్ని కలుగచేసేవి ఉంటే, కొన్ని బాధను కలుగచేస్తాయి.

**కర్తా–** మొదట, అంటే చిన్న పాపాయిగా ఉన్నప్పుడు ప్రయత్నపూర్వకంగా ఏమీ పనులు చేయలేము కానీ కర్మేంద్రియాలు, బుద్ధి పనిచేయటం మొదలుపెట్టిన కొద్దీ, మనిషిగా మనం కొన్ని పనులను ప్రణాళికలు వేసుకుని, ప్రయత్నపూర్వకంగా చేయగలుగుతాము. ఇలా పనులు చేసే వ్యక్తిని కర్తా అంటారు.

**జ్ఞాతా–** మనందరికీ జ్ఞానం పొందే పరికరాలు ఉన్నాయి. వాటిని జ్ఞానేంద్రియాలు అంటారు. వాటిద్వారా అనేక విషయాలు నేర్చుకుంటాము. అలా నేర్చుకునే వ్యక్తిని జ్ఞాతా లేదా ప్రమాతా అంటారు. అతను జగత్తునుంచి అనేక విషయాలను నేర్చుకుంటాడు.

ఈ ముగ్గురికీ అంటే భోక్తా, కర్తా, జ్ఞాతాలకు ఉన్న రంగం చాలా విశాలమైనది. మనం జ్ఞాతలుగా ఉండాలంటే, మనం నేర్చుకునే విషయాలు అనంతంగా ఉన్నాయని, దానికి మన జీవితకాలం సరిపోదనీ తెలుసుకుంటాము. అలాగే కర్త అవాలన్నా, భోక్త అవ్వాలన్నా కూడా. జీవితంలో చేయగలిగిన పనులు ఎన్నో ఉన్నాయి, చవిచూడగలిగిన ఆనందాలు మరెన్నో ఉన్నాయి. అలా జ్ఞాతాకు తెలుసుకోవలసిన జ్ఞానం అనంతంగా ఉంది; కర్తాకు చేయాల్సిన కర్మలు అంతులేనన్ని ఉన్నాయి. భోక్తాకు అనుభవించే అనుభవాలు కోకొల్లలుగా ఉన్నాయి.

దురదృష్టవశాత్తూ జీవితకాలం అత్యల్పం. అందువల్ల మనం ఈ మూడింటిలో ఏ జీవిగా ఉండాలనుకుంటున్నామో ముందు బేరీజు వేసుకోవాలి. దేనికి ప్రాముఖ్యతనివ్వాలి, దేనికి రెండోస్థానం ఇవ్వాలి? శాస్త్రం మనకు పరిష్కారం చూపుతుంది. అది ప్రశ్నద్వారా చూపిస్తుంది. మీ ఉద్దేశ్యంలో ఏది మీకు ముఖ్యం– అనుభవం పొందటమా, కర్మలు చేయటమా, జ్ఞానం పొందటమా? ఇంకో విధంగా చెప్పాలంటే మీ జీవితం భోక్తృప్రధానంగా ఉండాలనుకుంటున్నారా? కర్తృప్రధానంగా ఉండాలనుకుంటున్నారా లేక జ్ఞాతృప్రధానంగా ఉండాలని అనుకుంటున్నారా?

మనం మన స్వభావానికే ప్రాముఖ్యతనిస్తే, సహజంగా భోక్తృప్రధానంగా ఉండాలనుకుంటాము.

మన విద్యావిధానం కూడా ఈ భోక్తృప్రధానంగా ఉండే వ్యక్తికి తోడ్పడేలా తీర్చిదిద్దబడింది. విద్య పొందేది జ్ఞానం సంపాదించటానికే అయినా, మనం పేరున్న కాలేజీలో, మంచి గ్రూప్‌లో చేరాలనుకుంటాము. ఎందుకు? అప్పుడయితే మంచి ఉద్యోగం వస్తుంది; మంచి ఉద్యోగం వస్తే మంచిజీతం వస్తుంది. మంచిజీతం వస్తే, భోక్తగా జీవితాన్ని బాగా అనుభవించవచ్చు. జీవితంలో గొప్ప విజయం సాధించిన వ్యక్తికి అన్ని హంగులూ ఉన్నట్టుగా కీర్తిస్తాము. రాజసౌధం లాంటి ఇల్లు, పడవంత కారు, వంటినిండా ఆభరణాలు, బీరువానిండా వస్త్రాలు, ఇంటినిండా నౌకర్లు వగైరా. ఆ విధంగా మన దృష్టిలో విజేయుడంటే విజేయుడైన భోక్త.

శాస్త్రం దీన్ని లౌకిక విజయం అంటుంది. లౌకిక ప్రమాణంలో ఈ విజేయుడికి ప్రాముఖ్యతనిస్తారు; కర్తా, జ్ఞాతాలను పక్కన పెడతారు. కాని శాస్త్రం ఈ విజేయునికి పెద్దపీట వేయదు. మనం మనిషిగా పుట్టినందుకు మన జీవితం కర్తృప్రధానంగానో, భోక్తృప్రధానంగానో ఉండాలి. శాస్త్రం ఎందుకు భోక్తృప్రధాన విజేయుణ్ణి కొట్టిపారేసింది? జంతువులను గమనిస్తే ఎందుకో మీకే తెలుస్తుందంటుంది శాస్త్రం.

జంతువులకు మనలాగా మూడు వ్యక్తిత్వాలు లేవు. అవి భోక్తలు మాత్రమే కాగలవు కాని కర్త, జ్ఞాతలు అవలేవు. కర్మ చేయాలంటే ప్రయత్నపూర్వకంగా పనిచేయాలి. జంతువులు కూడా పనిచేస్తాయి కాని అవి సహజగుణంవల్ల చేసే పనులు. జంతువులు బుద్ధిజీవులు కావు. అందువల్ల వాటికి ఫ్రీవిల్ లేదా పురుషబుద్ధి లేదు. అవి కేవలం అనుభవించటానికే పుట్టాయి.

మనకూ, జంతువులకూ సమానంగా ఉన్న లక్షణం ఈ భోక్తా లక్షణమే. అందువల్ల మనం కూడా భోక్తలుగా మిగిలిపోతే, వాటికీ మనకీ ఏమీ తేడా లేదు. ఈ మాట వినటానికి కఠినంగానే అనిపించినా, దాని గురించి ఒక క్షణం ఆలోచిస్తే, నిజమేనని మనం ఒప్పుకోక తప్పదు. మనం భోక్తలుగా మాత్రమే జీవిస్తే, మన జీవితం జంతువుల స్థాయికి చెందుతుంది. మీరు మనిషి స్థాయికి ఎదగాలంటే భోక్త స్థాయిని తగ్గించి, కర్తగానో, జ్ఞాతగానో ముందుకు రమ్మంటున్నది. మనం చేసే పనులు, మనం పొందే జ్ఞానమే మనను విజయంవైపుకు నడిపించి, మనను ఉన్నతులను చేస్తాయి.

**భోగైశ్వర్యప్రసక్తానాం తయాఽపహృతచేతసామ్।**
**వ్యవసాయాత్మికా బుద్ధిః సమాధౌ న విధీయతే॥ - గీత 2 - 44**

వివేకహీనులైన జనులు ప్రాపంచిక భోగములలో తలమునకలై ఉంటారు.

అటువంటి వారు ఉన్నా లేనట్టే. మనం కర్తగా, జ్ఞాతగా విజయం పొందాలని నిర్ణయించుకుంటే, మన ప్రయత్నంలో మనకు చేయూత నివ్వటానికి శాస్త్రం ఉత్సాహంగా ముందుకు వస్తుంది. కర్తగా విజయం సాధించాలంటే ఏం చేయాలో చూద్దాము.

**తస్య శ్రద్ధైవ శిరః, ఋతం దక్షిణః పక్షః, సత్యముత్తరః పక్షః,**
**యోగ ఆత్మా, మహః పుచ్ఛం ప్రతిష్ఠా ॥ - తైత్తిరీయమ్**

శ్రద్ధ అతని శిరస్సు; ఋతం కుడి భాగం; సత్యం ఎడమభాగం. యోగం ఆత్మ; మహః ప్రతిష్ఠా. ఈ మంత్రం కర్మప్రపంచంలో విజయం సాధించటానికి ఐదు సూత్రాలను వల్లిస్తున్నది.

**1. శ్రద్ధ** - శ్రద్ధ అంటే కర్తగా మనం చేయాలనుకున్న పనిమీద గౌరవంతో కూడిన అభిమానం ఉండాలి. మనం చేసే ఏ పనినీ ద్వేషించకూడదు. అలాగే మనం చేసే ఏ పనినీ అయిష్టంగా, అశ్రద్ధగా చేయకూడదు. పనులు అంటే మనం కోరి చేయాలనుకున్నవి కావచ్చు! మనం చేసి తీరాల్సిన పనులు కావచ్చు.

ముందు అశ్రద్ధగా చేయకూడదు అని చూశాం. ఇప్పుడు, మనం చేసే పనిని ప్రేమించాలి. మనం చేసే పనుల్లో మనమీద బలవంతంగా రుద్దబడిన పనులు కూడా వస్తాయి. ఎన్నో పనులు మనకు నచ్చకపోవచ్చు కాని ఇతరులు వాటిని ఇష్టంగా చేయవచ్చు. మనకు కొండలెక్కటం ఇష్టం ఉండదు. కాని కొందరికి అది జీవితాశయం; మనకు ఎవరికైనా సేవచేయటం ఇష్టముండకపోవచ్చు. కాని నర్సులు ప్రేమగా సేవ చేస్తారు. అందువల్ల మనంచేసే కర్మను మనం ప్రేమించటం నేర్చుకుంటే, ఆ కర్మే మనకు ఆనందాన్ని లేదా సంతోషాన్ని ఇస్తుంది. మనం చేసిన కర్మకు వచ్చే కర్మఫలం మనం ఆశించినట్టు వస్తుందో లేదో తెలియదు; అందువల్ల మనకు నచ్చుతుందో లేదో అసలు తెలియదు. పైగా కర్మఫలం ఈ జన్మలోనే వస్తుందో లేదో కూడా తెలియదు. కాని కర్మ చేసిన ఆనందం ఇప్పుడే, ఇక్కడే కలుగుతుంది. అందుకని కర్మ చేసి ఆనందం పొందవచ్చు.

ఇక్కడ శ్రద్ధపదం శాస్త్రం ఎందుకు వాడిందంటే, మనం చేసే ప్రతి పనినీ మనం ప్రేమించి, గౌరవించే వ్యక్తికి, అంటే ఆ భగవానునికి అర్పణ భావంతో చేయాలి.

**యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్।**
**యత్తపస్యసి కౌంతేయ తత్ కురుష్వ మదర్పణమ్॥ - గీత 9-27**

ఓ కౌంతేయా! నువ్వు చేసే కర్మను, తినే ఆహారాన్ని, హోమం చేసే ద్రవ్యాన్ని, అర్పించే దానాన్ని, ఆచరించే తపస్సును నాకే సమర్పించు. నాకే సమర్పించు అంటే ఈశ్వరార్పణభావనతో చేయమని అర్థం. ఒక వ్యక్తి మంచాన పడిన తన వృద్ధురాలైన తల్లికి సేవచేయాల్సి వచ్చింది. ఆవిడకి స్నానం చేయించాలి, బట్టలు తొడగాలి. అన్నం పెట్టాలి. అతను కొంచెం కూడా విసుక్కోకుండా ఈశ్వరార్పణభావనతో చేయసాగాడు. తల్లికి చేయించే స్నానాన్ని ఈశ్వరునికి అభిషేకంగా భావించి రుద్రం కూడా చదవసాగాడు.ఎప్పుడైతే, అందులో భగవంతుని తలుస్తాడో అప్పుడే ఆ పని కష్టమనిపించదు. నిజానికి అతను అందులో ఆనందం పొందసాగాడు.

**2. ఋతం (జ్ఞానం)**-ఋతం అంటే మనం చేయాల్సిన కర్మ గురించిన సరియైన జ్ఞానం- ఏం చేయాలి, ఎలా చేయాలి, ఎంత మేరకు చేయాలి, ఎప్పుడు చేయాలి, ఎక్కడ చేయాలి? మనం చేయాల్సిన పని గురించిన పూర్తి జ్ఞానం ఉండాలి. అరకొర జ్ఞానం సరిపోదు. అందువల్లనే ఆధ్యాత్మిక సాధకుడు శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి.

మన జీవితంలో మనం వేసే ప్రతిపాత్ర ఒక కర్మ. ఒక వ్యక్తి పెళ్ళి చేసుకుని భర్త పాత్రను పోషించాల్సి ఉంటే, తన పాత్ర గురించిన సంపూర్ణమైన అవగాహన ఉండాలి. లేకపోతే అతను బాధపడటమే కాక, భార్యను కూడా బాధించినవాడవుతాడు. అలాగే పిల్లలను కన్నాక, పిల్లలను ఎంత బాధ్యతగా పెంచాలో తెలుసుకోవాలి. లేకపోతే, వారిని గాలికొదిలేసినట్టు అయిపోతుంది. ఒక భర్త భార్యను హింసిస్తుంటే, అతని పిల్లలకు లేనిపోని చెడు ఆలోచనలు ఇచ్చినవాడు అవుతాడు. మనం నడిపే కుటుంబజీవనం, మూడు తరాలకు సంబంధించినది. దీన్ని చెక్కు చెదరకుండా చూసుకోవాలి. అందువల్ల ఋతం అంటే మనం చేసే కర్మ గురించిన పూర్తి అవగాహన.

**3. సత్యం (ఆచరణ)-** కర్మ గురించి మనం పొందిన జ్ఞానం (ఋతం) కేవలం నేర్చుకుంటే చాలదు, దాన్ని అక్షరాలా ఆచరణలో పెట్టాలి. మనకు తెలిసిన దాన్నిచేసి చూపించాలి. పెద్ద పెద్ద ఆక్సిడెంట్లు ఎందుకు జరుగుతున్నాయో గమనిస్తే, అవి సహజమైన కారణాలవల్ల జరగటం లేదనీ, ఆ వాహనాలను నడిపే వ్యక్తులు

వారు చేయాల్సిన పనులను సక్రమంగా చేయకపోవటంవల్లనే అనీ అర్థమవుతుంది. వారికి ట్రాఫిక్ నియమాలు తెలుసు. తెలియక కాదు; తెలిసి కూడా ఉల్లంఘించారు. అది ఎందువల్లనన్నా కావచ్చు. దానికి కారణం వారి అశ్రద్ధ కావచ్చు. నిర్లక్ష్యం కావచ్చు. పూర్తి బద్ధకం కూడా కావచ్చు. ఇవన్నీ చెప్పకుండా మర్యాదగా 'మానవ పొరపాటువల్ల,' అని మర్యాదగా చెబుతారు. సత్యం తెలిసినవాడు, ఆచరించేవాడు అని ఇద్దరు లేరని తెలుసుకోవాలి. తెలిసినది ఆచరణలో పెట్టాలి.

**4.యోగం (ఏకాగ్రత)–** యోగాన్ని ఏకాగ్రతగా అర్థం చేసుకోవాలి. ఎప్పుడైతే ఒక కర్త తాను చేసే పనిని ఏకాగ్రతతో చేస్తాడో, అప్పుడే ఆ కర్మ ధ్యానం కిందకి వస్తుంది.

**అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతి యః।**
**స సన్న్యాసీ చ యోగీ చ న నిరగ్నిర్న చాక్రియః॥ – గీత 6-1**

కర్మఫలాన్ని ఆశించకుండా కర్తవ్యకర్మలను ఆచరించు వాడే నిజమైన సన్న్యాసి, నిజమైన యోగి. కేవలం అగ్నిని త్యజించినంత మాత్రాన సన్న్యాసి కాదు; క్రియలు త్యజించినంత మాత్రాన యోగి కాడు. ఇది గృహస్థను కీర్తిస్తూ చెప్పిన మాట. గృహస్థ తన సంపాదనద్వారా, తన క్రియలద్వారా తక్కిన ఆశ్రమాల వారిని– అంటే బ్రహ్మచారిని, వానప్రస్థ ఆశ్రమంలో ఉన్నవారిని, సన్న్యాసిని పోషించాలి.

అందువల్ల, గృహస్థుకు ఉపాసన చేసేందుకు తీరిక ఉండకపోవచ్చు. కాని అతను తను చేసే ప్రతి పనినీ ధ్యానంగా మలుచుకోవచ్చు. అంటే తను చేస్తున్న పనిమీద పూర్తి ఏకాగ్రత చూపాలి. యోగం లేదా ఏకాగ్రత చూపటంవల్ల కలిగే అత్యున్నతమైన లాభం మనం చేసే ప్రతికర్మ కూడా ఇష్టంగా చేస్తాము. ఇందులో యాంత్రికతకు చోటు లేదు. ఇష్టంగా చేసే పనులవల్ల మన కాలం, శక్తి ఆదా అవుతాయి.

**5. మహః (విశాలత)–**మహః పదాన్ని అక్షరాలా తీసుకుంటే, దాని అర్థం, హిరణ్యగర్భ, సమష్టికర్త. వ్యష్టికర్త అయిన మనం సమష్టికర్తతో మమేకం చెందేలా చూసుకోవాలి. విశాలత అంటే మన దృక్పథాన్ని విశాలంగా చేసుకోవాలి. దాని ఫలితంగా మనం చేసే పనులు వీలున్నంత ఎక్కువమందికి ప్రయోజనాన్ని చేకూరుస్తాయి. 'ఈ పని చేయటంవల్ల నాకేమిటి లాభం?' అని ప్రశ్నించుకునే బదులు 'ఈ పనిని చేయటంవల్ల ఎంతమంది లాభం పొందుతారు?' అని ప్రశ్నించుకోవాలి. దీన్ని పరోపకారం అంటారు.

ఈ ఐదు సూత్రాలను పాటిస్తే- అంటే కర్మను ప్రేమించి- దాని గురించి నేర్చుకున్న దాన్ని ఆచరణలో పెట్టి, దానిమీద ఏకాగ్రత చూపి, మన దృక్పథంలో విశాలత చూపితే, అద్భుతంగా చేసే ఆ పనే మనకు ఆనందాన్ని కలుగచేస్తుంది. మనం భోక్తలవాలన్న కోరిక మిగలదు. ముందు కర్తగా అద్భుతంగా చేయటం నేర్చుకుంటే తర్వాత జ్ఞాతగా అద్భుతాలు సాధించగలము. అప్పుడు మనం ఆత్మజ్ఞానం పొంది తద్వారా జీవన్ముక్తులవుతాము. అందువల్ల ఈ నూతన సంవత్సర శుభారంభపు రోజున నేను కర్తగా రాణిస్తాను అని నిర్ణయం తీసుకుందాము.

# స్వామీజీ సూక్తిముక్తావళి

మనం ఇప్పుడు త్రిపుటిలో ఉన్నాము. **జీవ, జగత్, ఈశ్వర** అనే త్రిపుటి. జీవుడైన నన్ను జగత్తు బాధిస్తోంది. నేను ఈశ్వరుడికి మొరపెట్టుకుంటున్నాను. ఉపనిషత్తు మనను త్రిపుటినుంచి ద్విపుటికి, అంటే ఉన్నతస్థాయికి తీసుకు వెళుతుంది. ద్విపుటిలో ఉన్నవి రెండే- **ఆత్మ, అనాత్మ.** నేను ఆత్మను, తక్కినదంతా మిథ్య. ఇది **వేదాంతసారం.**

జ్ఞాని ముక్తపురుషుడు. అంటే మోక్షం సిద్ధవస్తువు. సాధ్యవస్తువు కాదు. మోక్షం పొందేసిన వ్యక్తి మళ్ళీ మోక్షంకోసం ఎందుకు ప్రయత్నం చేయాలి? అలాగైతే వేదాంతబోధ ఎందుకు? వేదాంతబోధ నా ఆలోచనలో మార్పు తేవటానికి. నేను పరిచ్ఛిన్నజీవిని అనే ఆలోచనను తొలగించి, నేను నిత్యముక్తుణ్ణి అని తెలుసుకునేలా చేయటానికి.

# 45. విజయ రహస్యం

మనం ఎందుకు ఆంగ్ల నూతన సంవత్సరపు వేడుకలు చేసుకోవాలి అని కొంతమందికి ఆక్షేపణగా ఉండవచ్చు. ఒక కారణం, మన జీవితం ఇంగ్లీషు క్యాలెండర్‌మీద ఆధారపడి ఉంది. అది కాక మనకు మన తెలుగు క్యాలెండర్ ప్రకారం తిథి, వార, నక్షత్రాలు, మాసాలు, ఋతువులు తెలియనే తెలియవు.

ఇంకో కారణం, స్వామీజీ ఏదైనా నూతన సంవత్సరం రోజు తన శిష్యులను దీవించాలంటే అనేక భాషలకు చెందిన వారు ఉన్నారు. అందరికీ సమానంగా వర్తించేది ఆంగ్ల నూతనసంవత్సరం. అన్నింటినీ మించి మనకు ఏదో ఒక రోజు నూతన సంవత్సరంగా కావాలి. ఎందుకంటే ఆ తారీఖుకన్నా కూడా అది తెచ్చే స్ఫూర్తి చాలా ముఖ్యం.

ఏదో ఒక రోజును నూతన సంవత్సరంగా ప్రత్యేకంగా గుర్తిస్తే, ఆ రోజున మన యాంత్రిక జీవనానికి కాసేపు విశ్రాంతినిచ్చి, ఒక్క క్షణం ఆగి, మన జీవితాన్ని పునః విమర్శ చేసుకోవటానికి అవకాశం ఉంటుంది. గతంలో ఏం సాధించాము, భవిష్యత్తులో ఏం సాధించాలనుకుంటున్నాము, తెలుసుకోవాలి మనం. అందువల్ల యాంత్రికజీవనాన్ని ఆపి, చైతన్యవంతంగా జీవితం గడపాలంటే మనకు మనం స్ఫూర్తినిచ్చుకోవాలి. దానికోసం ఏదో ఒక ముఖ్యమైన రోజు కావాలి. ఈ రోజు పూజ కూడా చేస్తాము. ఎందుకంటే మనం చేపట్టబోయే అనేక రంగాల్లో విజయం సాధించటానికి దేవుని కృప ఎంతో అవసరం. అది ప్రాపంచిక విషయమైనా సరే, విద్యారంగమైనా సరే, ఆధ్యాత్మిక రంగమైనా సరే– విజయం చేకూరటానికి దేవుని కృప ఉండి తీరాలి. కాని ఒక విషయం గుర్తుంచుకోవాలి. జీవితంలో విజయం సాధించటానికి దేవుని కృప ఒక్కటే ఉంటే చాలదు. దేవుని కృప ముఖ్యమైన అంశంగా గుర్తిస్తాము కాని మన శాస్త్రం అది ఒక్కటే చాలదంటున్నది.

దేవుని కృపతో సమానమైన అంశం ఇంకోటి ఉంది. అది నా బాధ్యత. నేను చేయాల్సిన పనిని నేను బాధ్యతతో నిర్వర్తిస్తే దానికి దేవుని కృప తోడయితే, ఖచ్చితంగా విజయం నాదే. అందువల్ల నేను చేయాల్సిన పని ఏమిటి, అది ఎలా చేయాలి అన్నది ఇప్పుడు నా ముందున్న ప్రశ్న.

మనం జీవితంలో విజయం సాధించటానికి శాస్త్రం కొన్ని ముఖ్యమైన సూత్రాలను ఇచ్చింది. ముఖ్యంగా భగవద్గీతలో కృష్ణపరమాత్మ విజయం

సాధించటానికి ఎన్నో ముఖ్యమైన సూత్రాలను ఇచ్చాడు. అందులోనుంచి కొన్ని చూద్దాము ఇప్పుడు.

**1. నా విల్ పవర్ (దృఢ నిశ్చయం)ను విడుదల చేయటం–** విల్‌పవర్‌ను విడుదల చేయాలి అని ఎందుకన్నామంటే, ప్రస్తుతం అది దేనికో బందీగా ఉంది. ఈ వాక్యం అర్థమేమిటో చూద్దాం. మన జీవితంలో, అందరిలోనూ రెండు అంశాలు ఉన్నాయి. ఒకటి అనేక పరిస్థితులను మనం అనుభవిస్తాము. ఈ అనుభవించే జీవిని భోక్తా అంటారు.

రెండవ అంశం మనం అనేక కర్మలను చేస్తాము. ఇలా కర్మ చేసే జీవిని కర్తా అంటారు. ప్రతి ఒక్క జీవి కూడా ఈ కర్తా–భోక్తల మేలుకలయిక. ఇంకా సాంకేతికపరంగా చెప్పాలంటే, జ్ఞానేంద్రియాల దృష్ట్యా అతను భోక్తా, కర్మేంద్రియాల దృష్ట్యా అతను కర్తా.

ఈ రెండూ మనలో ఒకదానితో ఒకటి ఎంతగా పెనవేసుకుపోయాయంటే, మనం ఒకదానికొకటిగా పొరబడి, తద్వారా చిక్కుల్లో పడతాము. విల్‌పవర్‌ను విడుదల చేయాలి అంటే నేను ఎప్పుడు భోక్తను, ఎప్పుడు కర్తను అనేది స్పష్టంగా తెలుసుకోవాలి.

శాస్త్రం భోక్త దగ్గరకి వచ్చేసరికి, భోక్త ఒక విషయం స్పష్టంగా అర్థం చేసుకోవాలనుకుంటుంది. ఏమిటది? భోక్తగా నీకు దేన్నీ ఎన్నుకునే అధికారం లేదు. నీకు ఎదురైన అనుభవాలను నువ్వు సణక్కుండా, ఎవరినీ నిందించకుండా చిరునవ్వుతో స్వీకరించాలి అంటుంది. అంటే నాకు భోక్తగా ఛాయిస్ లేదు. అందువల్ల నాకు వచ్చిన భోగాలన్నీ ఆముదం మొహం పెట్టకుండా చిరునవ్వుతో స్వీకరించాలి. నాకు జరిగే అనుభవాలకు ఆ పరమాత్మ కానీ, నా గ్రహాలు కానీ, నా చుట్టూ ఉన్న మనుష్యులు కాని ఎవరూ బాధ్యులు కారు. అందువల్ల నేను ఎవరినీ నిందించకూడదు, ఆఖరికి నన్ను కూడా. అన్నీ సణక్కుండా, నిందించకుండా స్వీకరించాలి.

ఎప్పుడైతే నేను భోక్తగా నాకు లభించిన వాటిని చిరునవ్వుతో స్వీకరిస్తానో, అప్పుడు నానుంచి కర్త విడివడతాడు. అది నాకు గొప్ప లాభం. ఎందుకంటే కర్తకు విల్‌పవర్ ఉంటుంది. కర్తయొక్క విల్‌పవర్‌ను భోక్త తగ్గించేస్తాడు. ఎందుకంటే భోక్తగా నేను సణుగుతూ, నిందిస్తూ, ఫిర్యాదులు చేస్తూ ఉంటే కర్తగా నేను ముందుకు సాగలేను.

అందువల్ల నేను చేయాల్సిన మొదటి పని నా బుద్ధితో నాలోని భోక్తను కర్తనుంచి విడదీసి, కర్త దృఢసంకల్పం చూపించటానికి ఆస్కారం ఇవ్వాలి. అంటే భోక్తగా ప్రతిదీ ప్రసాదంగా స్వీకరించటం, కర్తను నా ఉచ్చుల్లోంచి బయటపడేయటం.

**2. నా కృషి–** శాస్త్రం నొక్కివక్కాణించే రెండవ సూత్రం నా కృషి. ఎప్పుడైతే నా కబంధ హస్తాల్లోంచి కర్తను విడుదల చేశానో, కర్తకు పురుషబుద్ధిని (ఫ్రీవిల్) వాడే స్వేచ్ఛనిచ్చానో, అప్పుడే నా కృషి చాలా ముఖ్యం. కర్తకు విల్ పవర్ ఉండటంవల్ల తను విజయం సాధించాలనుకున్న ఏ రంగంలోనైనా ఎంత శ్రమపడటానికైనా వెనుకాడడు.

అందువల్ల రెండవ ముఖ్యమైన సూత్రం నా ప్రయత్నం. ఇది చాలా ముఖ్యం. ఎందుకంటే తరచు విధి ఆడుతున్న వింత నాటకంలో మనం కీలు బొమ్మలమనుకుంటాము. ఎప్పుడైతే విధి చేతిలో కీలుబొమ్మలమనుకుంటామో, అప్పుడు దేవుడు కూడా మనను రక్షించలేడు. దేవుడు, శాస్త్రం, గురువులు, తల్లిదండ్రులు – ఎవరూ మనని ఉద్ధరించలేరు. మనం విధికి బానిసలమవుతాము, అందువల్లనే స్వయంకృషి చేయాలని శాస్త్రం గట్టిగా చెబుతుంది.

**ఉద్ధరేదాత్మనాఽఽత్మానం నాఽఽత్మానమవసాదయేత్।**
**ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః॥** **గీత 6–5**

మనుష్యులు ఈ సంసారసాగరంనుంచి తమను తామే ఉద్ధరించుకోవాలి. తమకు తామే అధోగతి పాలు కారాదు. ఎందుకంటే, ఈ లోకంలో నిజానికి తమకు తామే మిత్రులు, తమకు తామే శత్రువులు.

అందువల్ల నా జీవితాన్ని నేనే తీర్చిదిద్దుకోవాలి. నా లక్ష్యం ధర్మార్థకామ మోక్షాల్లో ఏదైనా దానికోసం నేను తీవ్రమైన కృషి చేస్తాను.

ప్రయత్నం గురించి చెప్పేటప్పుడు అందులో రెండు అంశాలు ఉన్నాయి.

**ఎ) సరియైన మార్గంలో ప్రయత్నం చేయటం –** ప్రయత్నం చేయగానే సరిపోదు. అది సరియైన మార్గంలో చేయాలి. అది గమ్యం చేరటంలాంటిది. నేను చెన్నైనుంచి ఢిల్లీ వెళ్ళాలంటే ఉత్తరంవైపు ప్రయాణం చేయాలి. రామేశ్వరం వైపు ప్రయాణం చేస్తే లాభం లేదు. రామేశ్వరంవైపు ప్రయాణం చేయటంవల్ల ఏమవుతుంది? నేను ప్రయత్నం చేశాను, దానిలో ఏమీ లోపం లేదు. కాని లక్ష్యానికి చేరే బదులు, లక్ష్యానికి దూరంగా వెళ్ళిపోతున్నాను. అందువల్ల సరియైన మార్గం చాలా ముఖ్యం.

**బి) అవసరమైనంత మేరకు ప్రయత్నం చేయటం –** చేసే ప్రయత్నం పూర్తి ప్రయత్నంగా ఉండాలి. నేను ఢిల్లీ వెళ్ళాలంటే రామేశ్వరంవైపుకు వెళ్ళకూడదని చూశాము. నేను ఢిల్లీవైపే వెళతాను. కాని మధ్యలో నాగపూర్‌లో దిగిపోయాననుకోండి. అప్పుడు నా ప్రయత్నం వృథా. ఢిల్లీ దాకా ప్రయాణం చేసే ఓపిక, శ్రమ కావాలి. అలాగే ఒక్కో విషయంలో విజయం సాధించటానికి ఒక్కనెలో, ఒక్క సంవత్సరమో కృషి చేస్తే చాలదు. కొన్ని సంవత్సరాలు ప్రయత్నించాల్సి ఉంటుంది.

ముఖ్యంగా మోక్షసాధన విషయంలో అది జీవితకాలం పట్టవచ్చు. ఎందుకంటే మోక్షం పొందటానికి చేసే శాస్త్రశ్రవణ, మనన, నిదిధ్యాసనలు ఒక్క రోజులోనో, ఒక వారంలోనో అయిపోవు. అందువల్ల నా ప్రయత్నం సరియైన మార్గంలో, అవసరమైనంత మేరకు సాగాలి. దానికి నాకు చాలా ఓపిక కావాలి. మనకు లేనిదే అది. అన్నీ క్షణాలమీద అయిపోవాలి. విజయం క్షణాల్లో రావాలి. మనుష్యులు క్షణాల్లో మారిపోవాలి. ఎందుకంటే జీవితం ఆఘమేఘాలలా పరుగెడుతుంది.

ట్రాఫిక్ సిగ్నల్ ఎరుపు పడితే, అది పచ్చరంగు చూపించటానికి తీసుకునే ఒక్క నిముషం కూడా ఆగే ఓపిక లేదు. అందువల్లనే మనకు అన్నీ ఇన్‌స్టెంట్ వస్తువులు వచ్చేశాయి. ఇన్‌స్టెంట్ ఇడ్లీ, ఇన్‌స్టెంట్ కాఫీ, ఇన్‌స్టెంట్ రసం. ఇన్‌స్టెంట్ సాంబారు వగైరా. ఆఖరికి గీత కూడా ఇన్‌స్టెంట్‌గా కావాలి. ఏడువందల శ్లోకాలను ఒక్కరోజులో అర్థం చేసుకోవాలి! అదెలా సాధ్యం?

అందువల్ల ప్రాపంచిక విషయంలో కాని, ఆధ్యాత్మిక మార్గంలో కాని విజయం సాధించాలంటే సరియైన మార్గంలో, అవసరమైనంత మేరకు, చాలా ఓపికగా ప్రయత్నం చేయాలని గుర్తుపెట్టుకోవాలి.

**3. సహాయాన్ని అర్థించటం –** అవసరమైనప్పుడు బాహ్యంగా ఎవరినన్నా సహాయాన్ని కోరటం మూడవ సూత్రం. పూజ్య స్వామీజీ దీన్ని చక్కగా అభివర్ణిస్తారు. బుద్ధి అంటే అవసరమైనప్పుడు సహాయం కోరటం. అర్జునుడు అదే చేశాడు. తనమీద తనకు గుడ్డినమ్మకం, నేను ఎవరి సహాయాన్ని అర్థించననే పొగరు, ఎవరికీ తలవంచను అనుకోవటం వెర్రితనం. అవసరం అయినప్పుడు ఎవరి సహాయాన్ని అయినా తీసుకునే అణకువ పెంచుకుందాము. ఆ సహాయం గురువునుంచి కావచ్చు, శాస్త్రంనుంచి కావచ్చు. అన్నిటికన్నా ముఖ్యంగా సాక్షాత్తూ ఆ పరమాత్మనుంచి కావచ్చు.

అందువల్ల పరమాత్మనుంచి సహాయం కోరటం చాలా ముఖ్యమైన అంశం. దీన్నే దేవుని కృప అన్నాం అంతకుముందు. ఎందుకంటే మనం ఏ ప్రయత్నం చేసినా అది ఎప్పుడూ ప్రమాదానికి దారితీసే ప్రమాదం ఉంది. ఆఖరికి రోడ్డు దాటటం కూడా చాలా ప్రమాదకరమైన అంశం. ఆమాటకొస్తే తిండి తినటం కూడా ప్రమాదమే. ఆహారం విండ్‌పైప్‌లోకి వెళితే, ప్రాణానికే ముప్పు. అందువల్ల తినటం ముప్పు, నడవటం ముప్పు, పుట్టటమే పెద్ద ముప్పు, ఎదగటం ముప్పు, పెళ్ళి చేసుకోవటం ముప్పు, పిల్లలను కని వారిని పెంచి పెద్దచేయటం ఇంకా పెద్ద ముప్పు. అడుగడుగునా ప్రమాదాల నిలయం.

పరిచ్ఛిన్నజీవిగా నా భవిష్యత్తేమిటో, అందులో పొంచి ఉన్న ప్రమాదాలేమిటో నాకు తెలియవు. ఒకవేళ ఆ ప్రమాదాలు నాకు ముందే తెలిసినా కూడా, వాటిని అదుపులో పెట్టే శక్తి నాకు లేదు, ఎందుకంటే నా శక్తి పరిమితమైనది. అందువల్ల అల్పజ్ఞ జీవుడినైన నేను సర్వజ్ఞ ఈశ్వరుని కృప వేడుకోవాలి. అల్పశక్తివంతుడైన జీవుడినైన నేను సర్వశక్తివంతుడైన ఈశ్వరుని ప్రార్థించాలి.

మనం జీవితమనే కొండను ఎక్కటానికి మనను భగవంతుడు వెనుకనుంచి తోయాలి. ఒక రైలుబండి కొండ ఎక్కాలంటే, దానికి రెండు ఇంజన్లు ఉంటాయి. ముందు ఒకటీ, వెనుక ఒకటీ. ఒకటి ముందుకు లాగితే, ఇంకోటి వెనుకనుంచి పైకి తోస్తుంది. మన జీవితం ఎప్పుడూ కొండను ఎక్కటం లాగానే సాగుతుంది. పుట్టినప్పటినుంచి, మరణించే దాకా పైకి ఎక్కటమే. ఇప్పటి పిల్లలకు విద్యాభ్యాసం కొండ ఎక్కటమంత కష్టతరమైన పని. మన చిన్నప్పుడు మనకు అంత కష్టమనే తెలియలేదు. ఇప్పుడు వారి సిలబస్ విపరీతంగా పెరిగిపోయింది.

వారికి మంచి కాలేజీలో సీటు రావటం పెద్దకొండ ఎక్కటంలాంటిది. పెళ్ళిచేసుకోవటం, పిల్లలను కనటం, వారి పిల్లలను చదివించటం, అన్నీ పర్వతారోహణలే. అన్నింటికీ రెండు ఇంజన్లు కావాలి. స్వయంకృషి ఒక ఇంజనైతే, దేవుని కృప రెండవ ఇంజను. దేవుని కృప మనను వెనుకనుంచి తోస్తుంది. గుర్తుంచుకోండి, దేవుని కృప స్వయంకృషి బదులుగా కాదు.

మనం చేసే అతి పెద్దపొరపాటు ఇదే. దేవుని కృప ఉంటే చాలు,నేనేమి చేయనవసరం లేదు అనుకుంటాము. దేవునిమీదే పూర్తి భారం వేస్తున్నామని చెప్పి ఇంక ఏమీ పట్టించుకోము. అసలే బద్ధకస్తులమైతే ఇంక చెప్పేదేమీ లేదు. ఎలా జరగాలని రాసిపెట్టి ఉంటే అలా జరుగుతుంది.

**శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు** అని అంతా దేవునిమీదకు తోసేసి ఖాళీగా కూర్చుండిపోతాము.

మన స్వయంకృషి స్థానంలోకి దేవుని కృప రాలేదు; దేవుని కృప స్థానంలోకి స్వయంకృషి రాలేదు. అంటే ఏమిటి అర్థం? రెండూ సరిసమానంగా ముఖ్యమే.

ప్రయత్నం, దైవకృప రెండూ, రెండు చక్రాలలాంటివి ఒక బండికి. రెండూ లేనిదే బండి ముందుకు నడవదు. అందువల్ల దేవుని సహాయాన్ని అర్థించాలి. దానికోసం చేసేదే ప్రార్థన.

**4. కుటుంబ సభ్యులకు చేయూతనివ్వటం –** మనం ఒక వ్యక్తే అయినా, మనం ఒక కుటుంబంలో లేదా ఒక సమాజంలో ఒక భాగం. అందువల్ల ఈ విషయంగా ఒక ముఖ్యమైన సూత్రాన్ని గుర్తుపెట్టుకోవాలి. ఒక కుటుంబసభ్యునిగా, ఒక కర్తగా, నా కుటుంబసభ్యులు ఏం చేద్దామనుకుంటున్నారో, ఏం చేయగలరో అది వారు చేయటానికి నేను సహాయం చేయాలి. కాని మన కుటుంబజీవనం ఎదుర్కొనే పెద్ద సమస్య ఏమిటి? తక్కిన కుటుంబసభ్యులు నాకేది ఇష్టమో అది చేయాలనుకుంటాను నేను.

ఒక భర్త, తన భార్యాపిల్లలు తను ఆడించినట్లల్లా ఆడాలనుకుంటాడు. ఒక భార్య తన భర్తా, పిల్లలు తన కనుసన్నల్లో మెలగాలనుకుంటుంది. పిల్లలు తమకు తల్లిదండ్రులు పూర్తి స్వేచ్ఛనివ్వాలనుకుంటారు. ఫలితం? కుటుంబంలో అలజడి, మనస్థాపం.

మనం గుర్తుంచుకోవాల్సిన అతి ముఖ్యమైన విషయం– నా కుటుంబ సభ్యులు ఏది చేయాలనుకుంటే దానికి నేను సహకరిస్తాను. వారు చేద్దామనుకున్న పని నాకు బొత్తిగా ఇష్టం లేకపోవచ్చు. కాని నా ఇష్టానికి ప్రాముఖ్యతనిస్తే నేను భోక్తని అవుతాను కాని ఎన్నటికీ సమర్థవంతమైన కర్తను కాలేను. నా ఇష్టాయిష్టాలే నాకు ముఖ్యమనుకుంటే వారికి ఎన్నడూ చేదోడువాదోడుగా నిలవలేను. అప్పుడు నేను కర్తను కూడా కాలేను. కర్తగా నా ధర్మం, తక్కినవారి కోరికలకు విలువనివ్వటం, అది నా కోరికకు భిన్నంగా ఉన్నా సరే. ఒక్కోసారి వారు చేయాలనుకున్న పని చేయలేకపోవచ్చు. అందువల్ల నా పని వారికి చేయూతనిచ్చి, వారు కోరిన పనిని నెరవేర్చేలా చూడటం.

నాకు ఆ పని ఇష్టం లేకపోయినా చేయూత నివ్వాలా? శాస్త్రమే ఈ విషయంలో ఒక ముఖ్యమైన సూత్రాన్ని చెబుతుంది. ఆ సూత్రం ఏమిటంటే–

ఏ పనైనా చేయాలంటే, దాని వెనుక కోరిక ఉండాలి. అంటే ఒక పనిని చేసే వ్యక్తికి దానిమీద కోరిక ఉంటుంది. నా కుటుంబసభ్యులు ఏదైనా పని చేయాలనుకుంటే, దాని వెనుక కోరిక ఉండాలి. అది ఎవరి కోరిక– నాదా, వారిదా అని మీరు అడగవచ్చు. ఇక్కడే మనం పప్పులో కాలు వేస్తున్నాము. మన పిల్లలమీద మనకు సర్వహక్కులూ ఉన్నాయనుకుంటున్నాము.

కాని అది నిజం కాదు. పనికీ, కోరికకూ– ఆశ్రయం ఒకటే ఉండాలి. అంటే నేను ఒక పని చేయాలంటే, దాని వెనుక నా కోరిక ఉండాలి. అలాగే నా కుటుంబసభ్యులు ఒక పని చేయాలంటే, దాని వెనుక వారి కోరిక ఉండాలి. నేను అది గౌరవించి, వారి కోరికను తీరేలా చేయాలి.

అంటే వారి కోరిక తప్పయినా కూడా వారిని వెన్ను తట్టి ప్రోత్సహించాలా? అవసరం లేదు. వారిని సరిదిద్దాలి. కాని సరిదిద్దే మార్గం చాలా ముఖ్యం. ఎందుకంటే సరిదిద్దటంలో సరియైన మార్గం ఉంది. తప్పు మార్గం ఉంది. తప్పు మార్గం ఏది? వారి కోరికను నేను ఎందుకు తప్పంటున్నాను? ఒకవేళ అది నా కోరికకు భిన్నంగా ఉంది కాబట్టి తప్పనుకుంటే, అది తప్పు మార్గం.

అప్పుడు నాలో భోక్త బయటకి వస్తాడు. ఎప్పుడైతే నా కోరికకు ప్రాముఖ్యతనిస్తానో, అప్పుడే కర్తను పక్కకు తోసేసి భోక్త వస్తాడు. కర్త పక్కకు తొలిగేసరికి నా దృఢసంకల్పం చెదిరిపోతుంది; నా పనులు స్వార్థపూరితంగా మారుతాయి. భావోద్రేకాలు చెలరేగుతాయి. తీవ్రమైన వాగ్వివాదాలు జరుగుతాయి. మనస్తాపాలు పెరుగుతాయి. అంతా సమస్యలమయం.

అయితే సరియైన మార్గం ఏమిటి? వారి కోరికను నేను ఎందుకు తప్పంటున్నాను? ఎందుకంటే అది నా కోరికకు భిన్నంగా ఉండబట్టి కాదు, వారి కోరికే తప్పు కాబట్టి. ఈ దృక్పథంతో నేను సమస్యను చూశానంటే, దానివల్ల లాభం ఏమిటంటే, నా కోరికను పక్కన పెడతాను. వారిని సరిదిద్దటంలో నేను విజయం సాధించవచ్చు, సాధించనూ లేకపోవచ్చు. అధికశాతం సాధించలేను కూడా. కాని నేను సాధించినా, సాధించకపోయినా నేనేమీ కృంగిపోను. ఎందుకంటే నేను నా కోరికకు ప్రాముఖ్యతనివ్వలేదు.

ఇప్పటి సమాజం అధికంగా ఎదుర్కొనే సమస్య– పిల్లలు చేసుకునే ప్రేమ వివాహాలు. ఏదో ఒక కుటుంబంలో జరగటం లేదు ఇది, సమాజంలో ఎన్నో ఇళ్ళల్లో జరుగుతున్నది. ఆయా కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. ఎందుకు?

తల్లిదండ్రుల కోరిక వేరు, పిల్లల అభీష్టాలు వేరు. పైగా ఆ ప్రేమవివాహాల్లో ఎక్కువగా వేరే కులానికి చెందిన వారిని ప్రేమిస్తారు. అందువల్ల తల్లిదండ్రులను పట్టి పీడిస్తున్న పెద్ద సమస్య– అది వర్ణ సాంకర్యం. అది వర్ణసాంకర్యం కాదా అని అడుగుతున్నారు.

అందువల్ల ఈ ప్రత్యేక సమస్యను ఇక్కడ విశ్లేషిద్దాము. ముందు సమస్యను చూద్దాము. దానిమీద తీర్పు ఇచ్చేముందు కొన్ని నిజాలు మనం గ్రహించాలి. తల్లిదండ్రులు చెప్పేదేమిటి? వర్ణసాంకర్యం జరగటం లేదా అని. వర్ణం అంటే కులం. వర్ణసాంకర్యం అంటే వేరే కులానికి చెందినవారిని వివాహం చేసుకోవటం. అదీ సమస్య.

ఇప్పుడు గీతలో వచ్చే చాతుర్వర్ణం గురించి ఒకసారి చూద్దాము. వర్ణసాంకర్యం అని అంటే ఏ కోణంనుంచి అంటున్నారు? జాతిపరంగానా, కర్మపరంగానా, గుణపరంగానా? తల్లిదండ్రులు చెప్పేది జాతిపరంగా. అంటే అతను పుట్టింది ఒక కులంలో, పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నది ఇంకో కులం అమ్మాయిని. అంటే ఇది జాతిపరంగా వర్ణసాంకర్యం. మనం మన పిల్లలు జాతిపరంగా వర్ణ సాంకర్యం చేస్తున్నామని నిందిస్తున్నామే కాని, మనం ఇప్పటికే ఒక వర్ణసాంకర్యం చేశామని ఎప్పుడైనా ఆలోచించామా? ఏమిటది? కర్మపరంగా వర్ణసాంకర్యం. మనం ఇప్పటికే వర్ణాశ్రమధర్మాన్ని పట్టించుకోవటం లేదు. జాతిబ్రాహ్మణుడు, కర్మబ్రాహ్మణుడు అవటం లేదు.

ఎంతమంది బ్రాహ్మణులు వేదాలు అధ్యయనం చేశారు? ఎంతమంది రోజూ వేద పారాయణం చేస్తున్నారు? ఎంతమంది పంచమహాయజ్ఞాలు క్రమం తప్పకుండా చేస్తున్నారు? ఈ తరానికి చెందిన మనమే వర్ణధర్మాన్ని పాటించకపోతే, భావితరం వారిని మనమెలా నిందించగలము?

మనం ఒక అడుగు ముందుకు వేసి కర్మపరంగా వర్ణాన్ని భ్రష్టుపట్టిస్తే, వారు ఇంకో అడుగు ముందుకు వేసి జాతిని భ్రష్టు పట్టిస్తున్నారు. అందువల్ల మన పిల్లలను మనం తప్పు పట్టేముందు, మనదోషమేమిటో ఒకసారి మనం బేరీజు వేసుకుంటే, మన పిల్లలను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించటమో, కనీసం వారి చర్యను నిష్పక్షపాతంగా పరిశీలించటమో చేస్తాము.

అంతమాత్రాన జాతిపరంగా వర్ణసాంకర్యం పిల్లలు చేయవచ్చని స్వామీజీ అనటం లేదు. స్వామీజీ పిల్లలు చేసింది తప్పనికాని, సబబని కాని అనటం లేదు కాని ఆయన ఒకటే విషయం ఎత్తిచూపుతున్నారు. ఏమిటది? సమస్యను మనం

మన కోరిక పరంగా చూస్తున్నాము. ఇలా జరిగితే రేపు నేను సమాజంలో ఎలా తల ఎత్తుకు తిరగగలను? నలుగురూ నవ్విపోరా? తక్కిన వారికి ఎలా పెళ్ళిళ్ళు అవుతాయి? ఇలాంటి ప్రశ్నలు రేగుతాయి.

అంటే నేను పరిస్థితిని పిల్లల కోణంనుంచి చూడటం లేదు. నా వ్యక్తిగత ఇష్టాయిష్టాల పరంగా చూస్తున్నాము. ఎప్పుడైతే నా పరంగా చూస్తున్నానో, అప్పుడే నేను భోక్తను అవుతాను. నేను భోక్తగా ఆలోచిస్తే, ఎన్నటికీ కర్తను కాలేను. కర్తను కాలేకపోతే, కుటుంబంలో శాంతి ఉండదు.

నేను కర్తగా ఉండాలంటే నా వ్యక్తిగత ఇష్టాలు, నా లక్ష్యాలు పక్కన పెట్టాలి.ఒక కుటుంబసభ్యుడిగా నా ప్రథమకర్తవ్యం వారు కోరుకున్న పనిని నెరవేర్చుకోవటంలో వారికి అండగా ఉండటం. వారి కోరిక తప్పు అని నాకనిపిస్తే, వారికి నచ్చచెప్పటానికి ప్రయత్నించాలి.

నా ప్రయత్నం ఫలించకపోతే నేను భోక్తను అవాలి. కర్తగా నా ధర్మం నెరవేర్చలేకపోతే, భోక్తగా ఏం చేయాలి? మొత్తం పరిస్థితిని సణక్కుండా, ఎవరినీ నిందించకుండా స్వీకరించాలి. ఇప్పుడు నేను భోక్తగా స్వీకరిస్తే, ముందు ముందు నేను మంచి కర్తగా ఇంతకన్నా బాగా చేయగలను.

ఒక్కోసారి భార్యలు పిల్లలకూ, భర్తకూ మధ్యలో నలిగిపోతారు. పిల్లలు ఎక్కడో దూరదేశంలో ఉంటారు. వారిమీద మనసు పోయి తల్లి వారి దగ్గరకు వెళ్ళాలనుకుంటుంది. కాని భర్త ఒప్పుకోడు. అతనికి భార్య చేతివంట తప్ప బయట భోజనం పడదు. అందుకని వెళ్ళనివ్వడు. ఆవిడ కూడా ఒక మనిషే, ఆవిడకీ కోరికలు ఉంటాయని అనుకోడు. భార్య భర్తతో పోట్లాడలేక లోపల్లోపలే కుమిలిపోతుంది. అందువల్ల నాలుగవ సూత్రం పాటించాలి– నా కుటుంబసభ్యుల ఇష్టాలను నేను తీర్చాలి.

ఇంకొక సమస్య పిల్లల శక్తి సామర్థ్యాలను బేరీజు వేయకుండా, వారినుంచి చాలా ఎక్కువ ఆశిస్తాను. అన్ని సబ్జెక్టులల్లో వారు 99 శాతం మార్కులు తెచ్చుకోవాలని నా కోరిక. నా కోరిక ముఖ్యం కాదు. వారికా సామర్థ్యం ఉందో లేదో చూడటం ముఖ్యం. అది చూడకుండా పిల్లలకు ఒత్తిడి తీసుకురావటంవల్లనే వారికి శారీరక అనారోగ్యం కలగటమో, మానసిక ఆందోళన చెందటమో, ఇంటినుంచి పారిపోవటమో చేస్తున్నారు.

ఇదంతా ఎందుకు జరుగుతున్నది? వారు వారికి కావాల్సింది చేద్దామను కుంటున్నారు. నేనేం చేయాలి? నా కుటుంబసభ్యులకు చేయూతనివ్వాలి.

ఈ నాలుగు సూత్రాలనూ ఒకసారి టూకీగా చూస్తే, అవి–

1. నా విల్‌పవర్‌ను విడుదల చేయాలి. అంటే భోక్తగా ఏదొచ్చినా స్వీకరించాలి.
2. నా కృషి సరియైన మార్గంలో, అవసరమైనంత మేరకు చేయాలి.
3. నాకు అధికశక్తిని ఇవ్వటంకోసం దేవుని కృపని అర్థించాలి.
4. నా కుటుంబ సభ్యులకు నేను చేయూతనివ్వాలి. నా అభిప్రాయాలు వారిమీద రుద్దకూడదు.

ఈ నాలుగు సూత్రాలనూ పాటిస్తే నేను వ్యక్తిగా, కుటుంబ సభ్యునిగా, ఒక సంస్థలో సభ్యునిగా, ఆమాటకొస్తే ఎందులోనైనా విజయాన్ని సాధించగలను. ఈ కొత్త సంవత్సరంలో శాస్త్రం చెప్పిన ఈ నాలుగు సూత్రాలను పాటించి చూద్దాము. అవి పనిచేస్తాయో లేదోననే సందేహం మీకు వద్దు. మీరు ఇవాళ మొదలుపెట్టి చూడండి. ఇవాళ రాత్రే అది పనిచేసి తీరుతుందని స్వామీజీ హామీ ఇస్తున్నారు. ఈ నాలుగు సూత్రాలను పాటించటంలో ఓడిపోతే ఓటమి తథ్యం అని కూడా ఖచ్చితంగా చెబుతున్నారు.

## స్వామీజీ సూక్తిముక్తావళి

అహం బ్రహ్మ అస్మి అంటే ఆ నేను ఎవరు?
నేను కీళ్లనొప్పులతో బాధపడే శరీరాన్ని కాను
నేను విషయవాంఛలకు లొంగే ఇంద్రియాలను కాను
నేను రాగద్వేషాలతో భగ్గుమనే మనస్సును కాను
**నేను వీటన్నింటినీ సాక్షిగా చూసే సాక్షి చైతన్యాన్ని**

ఆత్మజ్ఞానం మూడుదశల్లో పొందుతాము
1. నా శరీరంలో ఆత్మ ఉంది
2. ఆత్మ నాలోనూ, బయటా ఉంది
3. ఆత్మలోనే అన్ని శరీరాలూ ఉన్నాయి

# 46. గీతామాహాత్మ్యమ్

గీతామాహాత్మ్యమ్‌లో 23 శ్లోకాలు ఉన్నాయి. ఇది వరాహపురాణంలో పృథివీ దేవతకు, విష్ణుమూర్తికి మధ్య జరిగిన సంవాదరూపంలో ఉంటుంది. పృథివీ దేవతను ధరా అంటారు.

ఇందులో పృథివీదేవత విష్ణుమూర్తిని అడుగుతుంది, మనుష్యులు సమస్యలను ఎలా అధిగమించగలరని. విష్ణుమూర్తి దానికి భగవద్గీత అధ్యయనం చేయటమొక్కటే మార్గమని చెబుతాడు. ఆ విధంగా ఈ శ్లోకాల్లో గీతామాహాత్మ్యమూ, దానితోపాటు ఫలశ్రుతి కూడా వస్తుంది.

**ధరోవాచ**

**భగవన్! పరమేశాన! భక్తిరవ్యభిచారిణీ! ।**
**ప్రారబ్ధం భుజ్యమానస్య కథం భవతి హే ప్రభో ॥ 1**

1. ధరోవాచ– ధర విష్ణుమూర్తిని అడుగుతున్నది; భక్తిరవ్యభిచారణీ– అవ్యభిచారిణీ భక్తి అంటే గట్టి నమ్మకం ఎలా ఏర్పరచుకోగలను, ముఖ్యంగా– ప్రారబ్ధం భుజ్యమానస్య– ప్రారబ్ధంవల్ల నేను సమస్యలను ఎదుర్కొంటుంటే.

**శ్రీ విష్ణురువాచ**

**ప్రారబ్ధం భుజ్యమానోఽపి గీతాభ్యాసరతస్సదా ।**
**స ముక్త స్స సుఖీ లోకే కర్మణా నోపలిప్యతే ॥ 2**

2. ప్రారబ్ధం భుజ్యమానః– ఎవరైతే ప్రారబ్ధకర్మవల్ల అవస్థపడుతున్నారో వారు, గీతాభ్యాసరతస్సదా– నిరంతరం గీతాధ్యయనం చేయాలి. కనీసం వారానికి ఒకసారి, స ముక్తః– అలా చేస్తే సమస్యలు తొలగి; స సుఖీలోకే– ఈ ప్రపంచంలో శాంతి పొందుతాడు; కర్మణా నోపలిప్యతే– అతను చేస్తున్న అనేక కర్మలు అప్పుడు అతనిని బాధించవు.

**మహాపాపాదిపాపాని గీతాధ్యానం కరోతి చేత్ ।**
**క్వచిత్ స్పర్శం న కుర్వన్తి నలినీదళమంభసా ॥ 3**

3. ప్రారబ్ధకర్మను తగ్గించుకునే ప్రయత్నంలో ఆ వ్యక్తి అనేక పాపకర్మలను చేయాల్సి ఉంటుంది. కలియుగంలో చాలామంది విలువలను పాటించలేకపోతున్నామనీ, అలాగని వాటిని వదులుకోలేకపోతున్నామనీ చాలా పశ్చాత్తాపపడుతుంటారు. పాపాలు చేస్తే దానికి ప్రాయశ్చిత్తం చేయాలి. ఏమిటా ప్రాయశ్చిత్తం? గీత

చదవటమే. మహాపాపాదిపాపాని– మహాపాపాలు కూడా; క్వచిత్ స్పర్శం న కుర్వన్తి– ఆ వ్యక్తిని ముట్టుకోవు కూడా; ఎప్పుడూ? గీతాధ్యానం కరోతిచేత్– ఒకవేళ అతను గీతాబోధ వింటే. నలినీదళమంభసా– తామరాకు నీటిలో ఉండి కూడా నీటివల్ల తడవనట్టుగా, అతనిని పాపం ఏమీ చేయలేదు.

**గీతాయాః పుస్తకం యత్ర యత్ర పాఠః ప్రవర్తతే ।**
**తత్ర సర్వాణి తీర్థాని ప్రయాగాదీని తత్ర వై ॥ 4**

4. గీతాయాః పుస్తకం – ఏ కుటుంబంలో అయితే గీతా పుస్తకం పెట్టుకుంటారో; యత్ర యత్ర పాఠః ప్రవర్తతే – ఏ ఇంట్లో గీతా పారాయణం చేస్తారో ఆ కుటుంబంలో; తత్ర సర్వాని తీర్థాని– అన్ని తీర్థాల జలం; తత్ర వై ప్రయాగాదీని– ప్రయాగ, గంగ, యమునలాంటి నదుల తీర్థం వచ్చినంత పుణ్యం.

**సర్వే దేవాశ్చ ఋషయో యోగినః పన్నగాశ్చ యే ।**
**గోపాలా గోపికా వాఽపి నారదోద్ధవ పార్షదైః ।**
**సహాయో జాయతే శీఘ్రం యత్ర గీతా ప్రవర్తతే ॥ 5**

5. యత్ర గీతా ప్రవర్తతే – ఏ ఇంట్లో అయితే గీతాపారాయణం జరుగుతుందో ఆ ఇంట్లో; సర్వేదేవాశ్చ ఋషయో యోగినః పన్నగాశ్చ యే– అందరు దేవతలు, ఋషులు, యోగులు, సర్పాలు (దేవతలుగానే తీసుకోవాలి) ఉంటారు. అంతేకాదు గోపాలా గోపికా వాఽపి నారదోద్ధవ పార్షదైః– గోపబాలకులు, గోపికలు, నారదుడు, ఉద్ధవుడు, దేవుని సేవకులు, అందరూ ఆ ఇంట్లో ఉంటారు. అక్కడ ఏం చేస్తారు? సహాయో జాయతే శీఘ్రం– ఎప్పుడే సమస్య వచ్చినా వారు ఆదుకోవటానికి అదృశ్యరూపంలో సిద్ధంగా ఉంటారు.

**యత్ర గీతా విచారశ్చ పఠనం పాఠనం శ్రుతమ్ ।**
**తత్రాహం నిశ్చితం పృథ్వీ నివసామి సదైవ హి ॥ 6**

6. పృథ్వీ– హే పృథివీ దేవతా; గీతా పారాయణం చేసే చోట దేవతలు, నారదుల వారు ఉన్నా ఉండకపోయినా ఫర్వాలేదు, తత్రాహం నివసామి– ఆ ఇంట్లో నేను ఉంటాను. ఎలా? నిశ్చితం– నిశ్చయంగా ఉంటాను. ఎక్కడ? యత్ర గీతా విచారశ్చ పఠనం పాఠనం శ్రుతమ్– ఎక్కడ గీతా బోధ ఉన్నా, గీతా పారాయణం ఉన్నా, చెబుతున్నా, వింటున్నా అక్కడ ఉంటాను.

**గీతాశ్రయేఽహం తిష్ఠామి గీతా మే చోత్తమం గృహమ్ ।**
**గీతాజ్ఞాన ముపాశ్రిత్య త్రీన్ లోకాన్ పాలయామ్యహమ్ ॥ 7**

గీతాశ్రయేఽహం తిష్ఠామి – విష్ణుమూర్తి చెబుతున్నాడు. నాకు కూడా గీతాజ్ఞానమే ఆశ్రయం. విష్ణుమూర్తి అంత ప్రశాంతంగా ఉన్నాడంటే, అన్ని లోకాలనూ పాలించాల్సిన భారీ సమస్య ఉన్నా అనంతశయనం చేస్తూ నిశ్చింతగా ఉన్నాడంటే దానికి కారణం ఆయన కూడా గీతాధ్యయనం చేయటంవల్లనే; గీతా మే చోత్తమం గృహమ్– గీత నా నివాసస్థానం; గీతాజ్ఞానముపాశ్రిత్య– గీతాజ్ఞానం ఆధారంగానే; త్రీన్ లోకాన్ పాలయామ్యహమ్– నేను మూడు లోకాలను పాలిస్తున్నాను.

**గీతా మే పరమా విద్యా బ్రహ్మరూపా న సంశయః ।**
**అర్ధమాత్రాక్షరా నిత్యా స్వనిర్వాచ్యపదాత్మికా ॥ 8**

8. గీతామే పరమా విద్యా– ఈ గీత నానుంచి వచ్చిన గొప్ప విద్య. బ్రహ్మరూపా న సంశయః – వేదాలతో సమానం (ఇక్కడ బ్రహ్మ అంటే వేదాలని తీసుకోవాలి) సమస్త వేదార్థసారసంగ్రహభూతం గీతా శాస్త్రం అని శంకరాచార్యులవారు తన భాష్యం ఉపోద్ఘాతంలో రాశారు. ఇక్కడ సాక్షాత్తూ భగవానుడే ఇది వేదాల సారం అని చెబుతున్నాడు. వేదం ఓంకారంయొక్క విస్తారమే కాబట్టి, భగవాన్ గీత ఓంకార స్వరూపం అంటున్నాడు. అర్ధమాత్రాక్షరా నిత్యా అంటే ఓంకారం. స్వనిర్వాచ్యపదాత్మికా– ఆ ఓంకారం అనిర్వచనీయం. ఓంకారమే ఈ గీత.

**చిదానందేన కృష్ణేన ప్రోక్తా స్వముఖతోఽర్జునమ్ ।**
**వేదత్రయీ పరానందతత్త్వార్థజ్ఞానమంజసా ॥ 9**

9. చిదానందేన కృష్ణేన– చిదానందరూపమైన కృష్ణుడు; ప్రోక్తా స్వముఖతోఽర్జునమ్– ప్రత్యక్షంగా అర్జునునికి బోధించాడు. వేదత్రయీ పరానందతత్త్వార్థ జ్ఞానమంజసా – వేదత్రయీకి రెండు అర్థాలు తీసుకోవచ్చు. గీత మూడు వేదాల సారం లేదా గీత నాలుగు వేదాల్లోని మూడు కాండల (కర్మ, ఉపాసన, జ్ఞానకాండల) సారం. **మొదటి ఆరు అధ్యాయాల్లో కర్మకాండ సారం, తర్వాత ఆరు అధ్యాయాల్లో ఉపాసనకాండ సారం, చివరి ఆరు అధ్యాయాల్లో జ్ఞానకాండ సారం** చూస్తాము; పరానంద– అది ఆనందస్వరూపం; తత్త్వార్థజ్ఞానమంజసా– అందులో బ్రహ్మజ్ఞానం ఉంది.

ఇంతవరకూ గీతామాహాత్మ్యమ్. ఇకనుంచి ఫలం.

**యోఽష్టాదశ జపేన్నిత్యం నరో నిశ్చలమానసః ।**
**జ్ఞానసిద్ధిం స లభతే తతో యాతి పరం పదమ్ ॥ 10**

10. యోష్టాదశ జపేన్నిత్యం– ఎవరు రోజూ భగవద్గీతయొక్క పద్ధెనిమిది అధ్యాయాలూ అధ్యయనం చేస్తారో; నరోనిశ్చలమానసః– సాధనసంపత్తి ఉన్న మనస్సుతో చదివితే అతనికి కలిగే ఫలం ఏమిటి? జ్ఞానసిద్ధిం స లభతే– బ్రహ్మజ్ఞానం పొందుతాడు; తతో యాతి పరం పదమ్– బ్రహ్మజ్ఞానం పొందటంవల్ల మోక్షమనే పరమపదం పొందుతాడు.

**పాఠేఽసమర్థస్సంపూర్ణే తదర్థం పాఠమాచరేత్ ।**
**తదా గోదానజం పుణ్యం లభతే నాత్ర సంశయః ॥ 11**

11. నేను పద్ధెనిమిది అధ్యాయాలు కూడా పఠించలేను అని ఎవరైనా చెపితే, అర్థమ్– సగమే చదవనీ (తొమ్మిది అధ్యాయాలు) దానికి ఫలం ఏమిటి? గోదానజం పుణ్యం– గోదానం చేస్తే ఏ పుణ్యం వస్తుందో, తొమ్మిది అధ్యాయాలు పఠిస్తే ఆ పుణ్యం వస్తుంది.

**త్రిభాగం పఠమానస్తు గంగాస్నానఫలం లభేత్ ।**
**షడంశం జపమానస్తు సోమయాగఫలం లభేత్ ॥ 12**

12. తొమ్మిది అధ్యాయాలు కూడా పఠించలేకపోతే మూడవ భాగం పఠించినా ఫలం ఉంది. గంగాస్నాన ఫలం లభేత్– గంగాస్నానం చేసిన ఫలం కలుగుతుంది. షడంశం జపమానస్తు – గీతలో ఆరవవంతు చదివినా (3 అధ్యాయాలు) సోమయాగఫలం లభేత్– సోమయాగం చేస్తే ఏ ఫలం కలుగుతుందో అది కలుగుతుంది. కలికాలం చూడండి! పారాయణం చేయాల్సింది ఎలా తగ్గించుకుంటూ వస్తున్నారో!

**ఏకాధ్యాయం తు యో నిత్యం పఠతే భక్తిసంయుతః**
**రుద్రలోకమవాప్నోతి గణో భూత్వా వసేచ్చిరమ్ ॥ 13**

13. ఏకాధ్యాయం తు యో నిత్య పఠతే– ఏదో ఒక అధ్యాయం పఠించినా సరే, భక్తిసంయుతః– భక్తిగా; రుద్రలోక మవాప్నోతి– రుద్రలోకం పొందుతాడు; గణో భూత్వా వసేచ్చిరమ్– శివగణాలలో ఒకరుగా అయి శివలోకంలో చిరకాలం ఉంటాడు.

**అధ్యాయశ్లోకపాదం వా నిత్యం యః పఠతే నరః ।**
**స యాతి నరతాం యావన్మనుకాలం వసుంధరే ॥ 14**

14. అధ్యాయశ్లోకపాదం వా – ఒక అధ్యాయం మొత్తం కూడా ఎవరైనా పఠించలేకపోతే, కనీసం ఒక అధ్యాయంలో నాలుగవ వంతు పఠించినా; స యాతి

నరతాం– అతను పొందే లాభం వచ్చే జన్మలో హీనమైన జన్మలు రాకుండా; మనిషిగా పుడతాడు. యావన్మనుకాలం వసుంధరే– ఈ మన్వంతరం అయిపోయే వరకూ, మళ్ళీ మళ్ళీ మనిషిగానే పుడతాడు. అంటే అతనికి మోక్షం పొందే అవకాశం ఉంటుంది.

**గీతాయాః శ్లోకదశకం సప్త పంచ చతుష్టయమ్ ।**
**ద్వౌత్రీనేకం తదర్ధం వా శ్లోకానాం యః పఠేన్నరః ॥ 15**

15. అధ్యాయంలో ఒక భాగం కూడా చదవలేకపోయినా, భగవంతుడు ఇంకా అవకాశం ఇస్తున్నాడు. గీతాయాః శ్లోకదశకం– కనీసం పది శ్లోకాలు చదివినా బాగుంటుంది. అదీ చదవలేకపోతే; సప్త– ఏడు, అదీ కుదరకపోతే; పంచ– ఐదు; అదీ కుదరకపోతే; చతుష్టయమ్– నాలుగు; అదీ కుదరకపోతే– త్రీ– మూడు; అదీ కుదరకపోతే; ద్వౌ–రెండు; అదీ కుదరకపోతే; ఏకం– ఒకటి; అదీ కుదరకపోతే తదర్ధం వా– సగం శ్లోకం అయినా సరే; శ్లోకానం యః పఠేన్నరః – ఎవరు చదువుతారో

**చంద్రలోకమవాప్నోతి వర్షాణామయుతం ధ్రువమ్ ।**
**గీతాపాఠసమాయుక్తో మృతో మానుషతాం వ్రజేత్ ॥ 16**

16. చంద్రలోక మవాప్నోతి– అతను చంద్రలోకం పొందుతాడు; దీన్నే పితృలోకం అని కూడా అంటారు. ఎన్నాళ్ళు ఉంటాడు పితృలోకంలో? వర్షాణామయుతం– పదివేల సంవత్సరాలు ఉంటాడు. గీతాపాఠసమాయుక్తో మృతో– ఇవేవీ కుదరకపోతే కనీసం మరణించేటప్పుడు పఠించమంటున్నాడు. గీతా పారాయణం చేస్తూ మరణిస్తే; మానుషతాం వ్రజేత్– అతను మళ్ళీ మనుష్య జన్మను పొందుతాడు. అంటే ఆత్మజ్ఞానం పొందే అవకాశం ఉంటుంది.

**గీతాభ్యాసం పునః కృత్వా లభతే ముక్తిముత్తమామ్ ।**
**గీతేత్యుచ్చారసంయుక్తో మ్రియమాణో గతిం లభేత్ ॥ 17**

17. మరణించేటప్పుడు గీతాపారాయణం చేయకపోయినా ఫర్వాలేదు; గీతేత్యుచ్చార సంయుక్తో మ్రియమాణః– అందరూ గీతా, గీతా, గీతా అంటూ ఉచ్చరించినా కూడా; గతిం లభేత్– వచ్చే జన్మలో మంచి జన్మ లభిస్తుంది.కాని ఎవరైనా తన జీవితంలో గీతకు విలువనిచ్చి; గీతాభ్యాసం పునః కృత్వా– గీతా శ్రవణ, మనన, నిదిధ్యాసనలు పదే పదే చేస్తే; లభతే ముక్తిముత్తమామ్– అతనికి ముక్తి కలుగుతుంది.

**గీతార్థ శ్రవణాసక్తో మహాపాపయుతోఽపి వా ।**
**వైకుంఠం సమవాప్నోతి విష్ణునా సహ మోదతే ॥ 18**

18. గీతార్థ శ్రవణాసక్తో మహాపాపయుతోఽపి వా– అతను మహాపాపి అయినా కూడా, గీత వినటంమీద అతనికి బాగా శ్రద్ధ ఉంటే అది ప్రాయశ్చిత్తంలా పనిచేస్తుంది. అంటే దీని ఉద్దేశం గీత జ్ఞానజలం లాంటిది. ఎవరైనా మరణిస్తే, వారిని చూసివచ్చి స్నానం చేసి, ఎలా శుద్ధి పొందుతామో, అలా ప్రపంచంలోకి వెళితే ఎన్నో పాపాలను చేస్తాము;గీత వింటే అది మానసస్నానంలాంటిది. అంతేకాదు– వైకుంఠం సమవాప్నోతి– అతను వైకుంఠలోకాన్ని పొందుతాడు. విష్ణునా సహ మోదతే– ఎప్పుడూ విష్ణుమూర్తి సమక్షంలో ఉండవచ్చు. విష్ణువు అంటే లక్ష్మీదేవి కూడా ఉంటుంది.

**గీతార్థం ధ్యాయతే నిత్యం కృత్వా కర్మాణి భూరిశః ।**
**జీవన్ముక్త స్స విజ్ఞేయో దేహాంతే పరమం పదమ్ ॥ 19**

19. కృత్వా కర్మాణి భూరిశః – బోలెడు పుణ్యకర్మలు చేశాక; నిత్యనైమిత్తక కర్మలు చేసి చిత్తశుద్ధి పొందాక; గీతార్థం ధ్యాయతే– జ్ఞానయోగానికి వస్తే అతనికి కలిగే ఫలమేమిటి? జీవన్ముక్త స్స విజ్ఞేయః – అతనికి జీవన్ముక్తి కలుగుతుంది. అంటే ఇక్కడే,ఇప్పుడే సంసార బంధంనుంచి మోక్షం కలుగుతుంది. దేహాంతే పరమం పరమ్– శరీరం పడిపోయినప్పుడు అంటే మరణానంతరం అతనికి విదేహ ముక్తి కూడా కలుగుతుంది. అంటే అతనికి పునర్జన్మ ఉండదు.

**గీతామాశ్రిత్య బహవో భూభుజో జనకాదయః ।**
**నిర్ధూతకల్మషా లోకే గీతా యాతాః పరం పదమ్ ॥ 20**

20. ఇది అరచేతిలో స్వర్గం చూపించటంలాంటి ఉత్తమాటలు కావు. ఇవి నిజంగా ఎందరికో జరిగింది. గీతామాశ్రిత్య బహవః – ఎందరో లాభం పొందారు. అదీ మామూలు మనుష్యులు కాదు; భూభుజః – రాజులు. ఎందుకు? రాజులకు ఇంకా ఎక్కువ బాధ్యతలు ఉంటాయి. రాజ్యభారం ఎక్కువగా ఉంటుంది. మన బాధలు చాలా తక్కువ. అయినా వారు ఒత్తిడికి లోనుకాకుండా వారి విధులు ప్రశాంతంగా నిర్వర్తించగలిగారంటే దానికి కారణం గీతాశాస్త్రం. దానికి ఉదాహరణ ఎవరు? జనకాదయః– జనకుడులాంటి రాజులు. నిర్ధూతకల్మషా– వారు అన్ని పాపాలనుంచి విముక్తి పొందారు; పరం పదమ్– వారంతా పరమపదం అయిన మోక్షాన్ని పొందారు.

అందువల్ల గీత కేవలం పరమపురుషార్థమైన మోక్షాన్నే కాక ధర్మ అర్థ కామ పురుషార్థాలను కూడా ఇస్తుంది. దీనితో ఫలశ్రుతి కూడా అయిపోయింది. చివరి రెండు శ్లోకాల్లో, గీతతో పాటు గీతామాహాత్మ్యమ్ కూడా పారాయణం చేయాలని భగవంతుడు చెబుతున్నాడు. గీతామాహాత్మ్యం చదవకపోతే, గీతా పారాయణం అసంపూర్తిగా ఉంటుంది.

**గీతాయాః పఠనం కృత్వా మాహాత్మ్యం నైవ యః పఠేత్ ।**
**వృథాపాఠో భవేత్ తస్య శ్రమ ఏవ హ్యుదాహృతః ॥ 21**

21. గీతాయాః పఠనం కృత్వా– హెచ్చరిస్తున్నాడు కృష్ణభగవానుడు. ఎవరైనా గీతాపఠనం చేసి, మాహాత్మ్యం నైవ యఃపఠేత్– ఒకవేళ గీతామాహాత్మ్యం చదవకపోతే ఏమవుతుందో చెబుతున్నాడు.

వృథాపాఠో భవేత్ తస్య– అతని పఠనం వృథా అవుతుంది. కేవలం గీత చదివితే లాభం ఏమిటి? శ్రమ ఏవ హ్యుదాహృతః– అతను తన శ్రమను ఖర్చు పెడతాడు తప్ప ఏమీ లాభం పొందడు.

దీని వెనుకనున్న అర్థం ఏమిటంటే, మనం గీతామాహాత్మ్యమ్ చదివితే గీతామహిమ తెలుస్తుంది. అప్పుడు మనం శ్రద్ధగా చదువుతాము. అందువల్ల గీతామాహాత్మ్యమ్ కూడా గీతాపారాయణంలో ఒక భాగంగా చేర్చబడింది.

**ఏతన్మాహాత్మ్యసంయుక్తం గీతాభ్యాసం కరోతి యః ।**
**స తత్ఫలమవాప్నోతి దుర్లభాం గతిమాప్నుయాత్ ॥ 22**

22. దానికి బదులుగా ఏతన్మాహాత్మ్యసంయుక్తం గీతాభ్యాసం కరోతి యః – ఎవరైతే గీతామాహాత్మ్యం కూడా గీతతోపాటు అభ్యాసం చేస్తారో; స తత్ఫల మవాప్నోతి దుర్లభాం గతి మాప్నుయాత్– అతను గీతా పారాయణంయొక్క లాభం పొంది, దుర్లభమైన మోక్షాన్ని పొందుతాడు.

మామూలుగా గీతామాహాత్మ్యం ముందే చదవాలి. అది చదివాక గీత చదివితే సరియైన దృక్పథం ఏర్పడుతుంది. ముందు చదివితే మంచిది. కానీ కనీసం గీత చదివాక చదివినా ఫర్వాలేదు.

**సూత ఉవాచ**

**మాహాత్మ్యమేతద్గీతాయా మయా ప్రోక్తం సనాతనమ్ ।**
**గీతాంతే చ పఠేద్యస్తు యదుక్తం తత్ఫలం లభేత్ ॥ 23**
**ఓమ్ ఇతి శ్రీ వరాహపురాణే శ్రీమద్ గీతామాహాత్మ్యం సంపూర్ణమ్॥**

(గీతా పారాయణమైన పిదప గీతామాహాత్మ్యమును పఠించవలెను)

సూత ఉవాచ– ఈ మాటను సూతుడు చెబుతున్నాడు. వరాహపురాణంలో కథలు చెప్పే ఋషి ఇతను. గీతాంతే– గీతామాహాత్మ్యం గీత చివరల్లో కూడా చదవవచ్చు. అప్పుడు కూడా ఫలం అదే వస్తుంది. కాని ముందు చదివితే మంచిది.

ఈ గీతామాహాత్మ్యం, వరాహపురాణంలో చెప్పబడింది.

# స్వామీజీ సూక్తిముక్తావళి

Vedantic Acronyms coined by Swami Paramarthanandaji

| | | |
|---|---|---|
| ABCD | - | Appropriate Balanced Clean Desires |
| CCC | - | Calmness, Cheerfulness, Confidence |
| CLASP | - | CLaim of ownership, Anxiety, Special Prayers |
| ERG | - | Earned and Ripened Grace |
| ESNS | - | Ekam, Saram, Nityam, Satyam |
| EQ | - | Emotional Quotient |
| FIR | - | Frequency, Intensity, Recovery time |
| OMACT | - | Objects of experience, Materialistic, with Attributes, Changing, Temporary |
| PORT | - | Possessions, Obligations, Relationships, Transactions. |
| SOP | - | Situations, Objects, People |
| TDS | - | Thought Displacing Skill |
| UPS | - | Uninterrupted Pleasure Supply |